# annamayya saṅkīrtanalalō navavidha bhaktimārgāla anuśīlana (1-6 samputạ̄lu)

A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of

Doctor of Philosophy

in

Telugu


**Researcher**

**HARITA BHATLAPENUMURTHY**

**16HTPH06**

**Supervisor**

**Dr. PAMMI PAVAN KUMAR**

Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad – 500046

Telangana, India


June 2019

# అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాల అనుశీలన

**(1-6 సంపుటాలు)**

(పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)


**పరిశోధకురాలు**

**హరిత భట్లపెనుమర్తి**

16HTPH06

**పర్యవేక్షకులు**

**డా. పమ్మి పవన్ కుమార్**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

**హైదరాబాద్-500046**

**తెలంగాణ**


**జూన్ 2019**

## DECLARATION

I, **Harita Bhatlapenumurthy,** hereby declare that this thesis entitled "annamayya saṅkīrtanalalō navavidha bhaktimārgāla anuśīlana"(1-6 samputạ̄lu) submitted by me under the guidance and supervision of **Dr. Pammi Pavan Kumar** is a bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Date: HARITA BHATLAPENUMURTHY
Place: Hyderabad Reg. No.16HTPH06

# CERTIFICATE

This is to certify that the thesis entitled **"annamayya saṅkīrtanalalō navavidha bhaktimārgāla anuśīlana" (1-6 samputālu)** that is submitted by **Ms. Harita Bhatlapenumurthy** bearing registration number **16HTPH06** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bona fide work carried out by her under my supervision and guidance.

This thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

The student has

**A. the following publications** before submission of the thesis for adjudication and has produced evidence for the same in the form of reprint:

(Issues discussed in the following papers have been presented elaborately in chapter-1, and chapter-4 of the thesis respectively.)

1. **"annamayya viśiṣṭādvaitaṁ: cāritraka, said'dhāntika nēpathyālu"** (Second Author) (ISSN 1930-2940, UGC 49042), Pg.No.131-142, March 2018. "Language in India (http://www.languageinindia.com/)" Edited by Dr. Thirumalai, M S.

2. "**annamayya kīrtanalalō ēkādaśa bhakti mārgālu**" (Second Author) (ISSN 1930-2940, UGC 49042), Pg.No.503-517, April 2019. "Language in India (http://www.languageinindia.com/)" Edited by Dr. Thirumalai, M S.

and

**B. presented in the following conferences:**

1. **"annamayya sanskaraṇa dr̥kpathaṁ",** December 14-15, 2018 at C.R.Reddy College, Eluru (International).
2. **"annamayya kīrtanallō dhvani viśēṣālu",** January 28-29, 2019 by Telugu Linguists' Forum-Hyderabad, in collaboration with CIIL-Mysore at Osmania University (National).

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph. D.

| Course Code | Name | Credits | Result |
|---|---|---|---|
| 1. HT801 | Research Methodology | 4.00 | PASS (A) |
| 2. HT802 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3. HT803 | Studies in Literature | 4.00 | PASS (A) |
| 4. HT804 | Studies in Specialized Area | 4.00 | PASS (A) |

Dr. PAMMI PAVAN KUMAR
**Research Supervisor**

Prof. G. ARUNAKUMARI
**Head, Department of Telugu**

Prof. S. SARATJYOTSNA RANI
**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

పరిశోధనాంశం సూచించడం మొదలుకొని, విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ, ఆలోచనాత్మకమైన చర్చలద్వారా నా జ్ఞానాన్ని పెంచుతూ, నన్ను ముందుకు నడపడంవరకు నా పరిశోధనలో నాకెంతో తోడ్పడ్డారు నా పర్యవేక్షకులు డా॥ పవన్ కుమార్‌గారు. నాకు తగినంత స్వేచ్ఛనిస్తూ, అదే సమయంలో నేను వెనకపడకుండా హెచ్చరిస్తూ వచ్చారు. క్రమశిక్షణకు, శాస్త్రీయ దృక్పథానికి మారురూపైన ఆయన పర్యవేక్షణలో పరిశోధన చేయగలగడం నాకు కలిగిన గొప్ప అవకాశంగా భావిస్తూ ఆయనకు,

నాకీ అవకాశం ఇచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి, పరిశోధన విషయమై నన్నెప్పుడూ ప్రోత్సహించడమే కాక తులనాత్మక అధ్యయనంగురించి విలువైన పాఠాలు చెప్పిన స్నేహశీలి, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య అరుణకుమారిగారికి, పరిశోధనగురించి అమూల్యమైన పాఠాలు చెప్పి, నా పరిశోధనలో సామాజిక కోణాన్ని జతపరచేలా నా దృక్పథాన్ని మార్చిన ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, పరిశోధన పద్ధతులనుగురించి విపులంగా తెలియజెప్పిన ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, తెలుగు శాఖ అధ్యాపక బృందానికి పేరుపేరునా,

తెలుగు సాహిత్యంలో నా తొలి అడుగుల్ని పర్యవేక్షించి, ఎన్నో విలువైన పాఠాలను నేర్పించి, సాహిత్యంలో నా దృక్పథాన్ని మలచి, నన్నెంతో ప్రోత్సహించి, ఇప్పటికీ ఏ సందేహమున్నా ఒక్క ఫోన్ కాల్ దూరంలో మాత్రమే ఉండే డా॥ సంగనభట్ల నరసయ్యగారికి,

విలువైన వారి సమయాన్ని కేటాయించి, ఎంతో ఆప్యాయంగా నేను అడిగిన ప్రశ్నలన్నిటికీ విపులంగా సమాధానాలిచ్చి, నా పరిశోధన వ్యాసానికి, నా ఆత్మప్రగతికికూడా తోడ్పడిన డా॥ గరికిపాటి నరసింహారావుగారికి,

నాకు తెలుగు సాహిత్యంలో అడుగుపెట్టడానికి అవకాశం కల్పించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి, దూరవిద్యలో కాంటాక్టు తరగతులద్వారా పాఠాలు చెప్పిన అధ్యాపక బృందానికి,

ఇద్దరు పిల్లలతో, ఇంటి బాధ్యతలతో సతమతమవుతూ, అటు ఇంటికి కాని, ఇటు పరిశోధనకు కాని న్యాయం చేయలేకపోతున్నానని నిరాశ, నిస్పృహలకు గురయిన సందర్భాల్లో నాకు అండగా ఉంటూ, నా చిన్నిచిన్ని విజయాలకు నాకంటే ఎక్కువగా పొంగిపోతూ, నా సామర్థ్యాన్ని నాకంటే ఎక్కువగా నమ్ముతూ, నాకు అన్ని విధాలుగా సహకరించిన నా భర్తకు,

ఎన్నో సార్లు వారికి సంబంధం లేని నా విసుగు, అసహనం, కోపం ఇత్యాదులను వారిపై ప్రదర్శించినా, బదులుగా నాకు అంతులేని అనురాగాన్ని పంచి ఇచ్చిన నా పిల్లలు సాహితి, సిద్ధార్థ్ లకు

ఇద్దరు పిల్లలతో, ఊపిరిసలపని పనిలో ఉండే భర్తతో ఉండికూడా సజావుగా నా పరిశోధన జరిగింది అంటే అందుకు కారణమైన మా అత్త, మామలకు,

నేను చేసే ప్రతి పనిలోనూ నాకు స్ఫూర్తిగా నిలిచే నా మార్గదర్శి మా నాన్నకు, నాలో సాహిత్యంపట్ల ఆసక్తిని జనింపచేసిన ప్రేమమూర్తి మా అమ్మకు,

నా అభివృద్ధిని నిరంతరం కాంక్షించే మా అన్న క్రాంతికుమార్, వదిన కోమలి లకు,

ఏ అవసరానికైనా మేమున్నామంటూ సహాయపడుతూ వచ్చిన ప్రశాంత్, శివాని లకు,

నా పరిశోధన కోసం తగినన్ని నిధులు మంజూరు చేసిన యూ.జి.సి. వారికి,

ప్రత్యక్షంగా గురువులవద్ద అభ్యసించలేకపోయిన నాకు పుస్తకాలే పరోక్ష గురువులు. అటువంటి ఎందరో వెలకట్టలేని గురువులతో ముఖాముఖికి అవకాశమిచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి, గ్రంథాలయ సిబ్బందికి,

పరిశోధన కాలంలో మామధ్య జరిగిన చర్చలలో ఎన్నో విలువైన ఆలోచనలను పంచుకున్న నా పరిశోధక మిత్రుడు చైతన్యకు,

పరిశోధనలో మాకు దిక్సూచులుగా నిలిచిన డా॥ రవిచంద్ర, డా॥ చంద్రయ్య, డా॥ మల్లేష్ గార్లకు, నా సహపరిశోధకులు రాజా, లావణ్య, రమేష్ లకు,

ఎం.ఫిల్ సమయం నుండి నాకెంతో సహాయకారిగా ఉన్న గరికిపాటి గురజాడగారికి,

పరిశోధన పత్ర సమర్పణకు నాకు అవకాశమిచ్చిన ఆయా కాలేజీల యాజమాన్యాలకు, నా పత్రాలను ప్రచురించిన పత్రికల వారికి, బయట ఊర్లలో జరిగిన సదస్సులకు వారివారి ఇళ్ళలో ఆతిథ్యం ఇచ్చిన అమృతమూర్తులకు, భావాజీ దంపతులకు,

ప్రాచీన సాహిత్యంపట్ల నా అభినివేశాన్ని మరింతగా పెంపొందించిన భారతప్రచారపరిషత్ వారికి,

ఈ ప్రయత్నంలో నాకు బాసటగా నిలిచిన హితులకు, స్నేహితులకు, సన్నిహితులకు

**కృతజ్ఞతలు**

**HARITA. B.**
**16HTPH06**

# విషయసూచిక

పుటసంఖ్య


**కృతజ్ఞతలు** i

**0. ప్రవేశిక (iv-xii)**

0.1. పరిశోధనాంశ వివరణ iv

0.2. పరిశోధనావశ్యకత v

0.3. పూర్వ పరిశోధనలు vi

0.4. ప్రధాన ఆకర గ్రంథాలు vii

0.5. పరిశోధన గ్రంథ రచన – అనుసరించిన ప్రణాళిక ix

0.6. పరిశోధన ప్రయోజనాలు xi

**1. అన్నమయ్య భక్తి తత్త్వం – విశిష్టాద్వైతం (1-73)**

1.0. అన్నమయ్య జీవితం – రచనలు – సంగ్రహ పరిచయం 1

1.1. అన్నమయ్య భక్తి – చారిత్రక నేపథ్యం 7

1.2. సైద్ధాంతిక నేపథ్యం – భక్తి ఉద్యమం 26

1.3. విశిష్టాద్వైత సిద్ధాంతాలు 63

**2. నవవిధ భక్తి మార్గాలు : పూర్వ కవుల దర్శనం (74-146)**

2.0. పరిచయం 74

2.1. శ్రవణం 77

2.2. కీర్తనం 86

2.3. స్మరణం 95

2.4. పాదసేవనం 104

2.5. అర్చనం 109

2.6. వందనం 115

2.7. దాస్యం 120

2.8. సఖ్యం 127

2.9. ఆత్మ నివేదనం 135

**3. అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తి మార్గాలు (147 – 216)**

3.0. పరిచయం 147

3.1. శ్రవణ భక్తి 148

3.2. కీర్తన భక్తి 153

3.3. స్మరణ భక్తి 169

3.4. పాదసేవన భక్తి 175

3.5. అర్చన భక్తి 178

3.6. వందన భక్తి 185

3.7. దాస్య భక్తి 189

3.8. సఖ్య భక్తి 194

3.9. ఆత్మ నివేదన భక్తి 197

**అనుబంధం–1** (నవవిధ భక్తి మార్గాలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనల పట్టికలు) 217

**అనుబంధం–2** (సమ్మిళిత భక్తి మార్గాలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనల పట్టిక) 274

## 4. అన్నమయ్య సంకీర్తనలలో ఇతర భక్తి మార్గాలు (282–339)


4.0. పరిచయం 282

4.1. ఉన్మాద భక్తి 284

4.2. పతివ్రతా భక్తి 287

4.3. విజ్ఞాన భక్తి 289

4.4. ఆనంద భక్తి 291

4.5. రాక్షస భక్తి 293

4.6. తురీయ భక్తి 294

4.7. తామస భక్తి 296

4.8. వైరాగ్య భక్తి 298

4.9. రాజస భక్తి 300

4.10. నిర్మల భక్తి 301

4.11. నిజ భక్తి 303

4.12. మధుర భక్తి 305

4.13. వాత్సల్య భక్తి 316

4.14. వైర భక్తి 322

4.15. అనన్య భక్తి 328

4.16. ఇతర భక్తి మార్గాలు 333

**అనుబంధం–3** (ఇతర భక్తి మార్గాలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనల పట్టికలు) 340

## 5. నేటి సమాజంలో అధ్యాత్మికత (369-406)


5.0 పరిచయం 369

5.1. అధ్యాత్మికత అవసరం 372

5.2. అధ్యాత్మికత అవసరం – నిదర్శనాధ్యయనం 378

5.3. హేతుబద్ధమైన అధ్యాత్మికత 393

5.4. అన్నమయ్యలో హేతుబద్ధమైన అధ్యాత్మికత 396

**ఉపసంహారం** 407

**అనుబంధం–4** (అధ్యాత్మవేత్త డా॥ గరికిపాటి నరసింహారావుగారితో ముఖాముఖి) 418

**ప్రచురించబడిన పరిశోధన పత్రాలు** 442

**జాతీయ/అంతర్జాతీయ సదస్సులలో సమర్పించబడిన పరిశోధన పత్రాల వివరాలు** 469

**ఉపయుక్తగ్రంథసూచి** 471


*****

# ప్రవేశిక

# 0. ప్రవేశిక

## 0.1. పరిశోధనాంశ వివరణ

నా పరిశోధనాంశం *అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాల అనుశీలన (1-6 సంపుటాలు).* అన్నమయ్య 32 వేల కీర్తనలలో ఇప్పటికి లభ్యమవుతున్నవి 14,892. వీటిని 29 సంపుటాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించారు. అంతటి విస్తారమైన సాహిత్యాన్ని పిహెచ్.డి. పరిధిలో పరిశీలించడం, విశ్లేషించడం పరిశోధనకు ఉన్న సమయం దృష్ట్యా అసాధ్యం కనుక మొదటి ఆరు సంపుటాలను(2777 కీర్తనలు) మాత్రం నా ఈ పరిశోధనకోసం స్వీకరించాను. మొదటి నాలుగు సంపుటాలు అధ్యాత్మ సంకీర్తనలకు సంబంధించినవి కాగా, 5,6 సంపుటాలు శృంగార సంకీర్తనలు కలిగినవి. ఈ ఆరు సంపుటాలలో అన్నమయ్య ప్రదర్శించిన నవవిధ భక్తిమార్గాలను ఈ పరిశోధన చర్చిస్తుంది.

పద్య కవిత్వం రాజ్యమేలుతున్న రోజుల్లో పద కవితను చేపట్టి దానికి పట్టం కట్టిన ఘనత తాళ్ళపాక అన్నమాచార్యునిదే. తన పదకవితలతో ఆబాలగోపాలాన్ని అలరించి జానపద సాహిత్యానికి కావ్య గౌరవం కలిగించాడు అన్నమయ్య. రాశిలో కాని వాసిలో కాని అన్నమయ్య సృష్టించిన సాహిత్యం 'నభూతో'గా కీర్తించబడింది. అన్నమయ్య సంకీర్తనలలో ప్రధానంగా కనపడే అంశం భక్తి. అన్నమయ్య తానే యశోదగా మారి బాలకృష్ణుడిని లాలించారు. తానే అలమేలుమంగగా మారి శ్రీవేంకటేశ్వరుడితో క్రీడించారు. భక్తుడిగా శరణాగతి చేశారు. వేవేల విధాల భగవంతుడిని కీర్తించారు. ఇలా భక్తి తత్త్వంలోని ఎన్నో కోణాలను ఆవిష్కరించారు అన్నమయ్య.

*శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం*

*అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్* (వీరరాఘవ. 1976:68 – [వ్యాస భాగవతం–7వ స్కంధం–5వ అధ్యాయం–23వ శ్లోకం])

అని భాగవతంలో పేర్కొనబడ్డట్టు భక్తి మార్గం తొమ్మిది విధాలుగా ఉంటుంది – శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం. దీనినే పోతన శ్రీమదాంధ్రభాగవతంలో ప్రహ్లాదుడిచేత ఈ విధంగా చెప్పించారు.

*తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా*

*ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం*

*బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స*

*జ్జనుడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:356 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–167వ పద్యం])

పోతనకు సమకాలికులైన అన్నమయ్య తన కీర్తనలలో ఈ నవవిధ భక్తిమార్గాలలో తన స్వామిని కొలుచుకున్నారు. నా పరిశోధనాంశ లక్ష్యం అన్నమయ్య సంకీర్తనలలో ఈ నవవిధ భక్తిమార్గాల స్వరూపాన్ని నిరూపించడం.

## 0.2. పరిశోధనావశ్యకత

అన్నమయ్య కీర్తనలు శతాబ్దాల తరబడి మరుగునబడి, గత శతాబ్దారంభంలోనే సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ మొదలైన పండిత విమర్శకుల కృషివల్ల వెలుగులోకి వచ్చాయి. అలా వచ్చింది మొదలు తెలుగు సాహిత్య లోకంలో అన్నమయ్య కీర్తనల మీద ఎన్నో పరిశోధనలు వచ్చాయి. కాని అన్నమయ్య కీర్తనల్లో

అనేకమైన అంశాలు ఉన్నాయి. ఒక్కొక్క పరిశోధన అన్నమయ్యలోని ఒక్కో కోణాన్ని ఆవిష్కరిస్తూ వచ్చింది. అయితే ఎంత చేసినా అన్నమయ్య సృష్టించిన అపారమైన సాహిత్యం మీద పరిశోధనలు చేయాల్సింది, ఆ సాహిత్య నిధినుండి వెలికి తీయాల్సింది ఇంకా ఎంతో ఉంది. తదనుగుణంగా అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాలకు సంబంధించి పరిశోధన చేపట్టాను. అది అన్నమయ్య భక్తి తత్త్వాన్ని తెలుసుకోవడంలో, అన్నమయ్య సాహిత్య స్వభావాన్ని విశ్లేషించడంలో ఉపకరిస్తుందని నా నమ్మకం.

## 0.3. పూర్వ పరిశోధనలు

మహాభారతం తర్వాత అత్యధికంగా పరిశోధనలు జరిగినది అన్నమయ్య సాహిత్యంపైనే అని ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి *విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన* చూస్తే స్పష్టమవుతోంది. 2013లో ప్రచురించబడ్డ ఈ పుస్తకం ప్రకారం అన్నమయ్యపై జరిగిన పరిశోధనలు 70 పైనే. అలాగే పోతన భాగవతంలోని నవవిధ భక్తిమార్గాలపై కూడా పరిశోధన జరిగింది. అయితే అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాలపై ఇంత వరకు ఎటువంటి పరిశోధన జరగలేదు (నిత్యానందరావు, వెలుదండ. 2013:113-116). నా పరిశోధనాంశానికి దగ్గరగా ఉన్న ఈ కింది పరిశోధనలను మాత్రం ఇక్కడ పేర్కొంటున్నాను.

1. మునిరత్నం, జె. 1986. *అన్నమయ్య ఆళ్వార్ల తులనాత్మక పరిశీలన.* తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
2. రాజ్యలక్ష్మి, టి. 2002. *తాళ్ళపాక అన్నమాచార్య అధ్యాత్మిక సంకీర్తనల్లో భక్తితత్త్వం.* తిరుపతి: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
3. రెడ్డి శ్యామల, వై. 1996. *అన్నమయ్య పద కవిత – మధుర భక్తి.* హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.

4. వసుమతీదేవి, ఎస్. 1999. *అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావం.* వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.
5. విజయవల్లి, వి. 1989. *అన్నమాచార్య అధ్యాత్మ సంకీర్తనలలో ఆత్మ నివేదన.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం.
6. శారదాదేవి, ఎస్. టి. పి. 1995. *అన్నమయ్య సంకీర్తనలు – వైష్ణవ భక్తి తత్త్వం – ఒక పరిశీలన.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం.
7. శ్రీరంగాచారి, ఎ. 1990. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు – మధురభక్తి.* హైదరాబాదు: ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.
8. శ్రీవిద్య, పి. 2008. *ఆంధ్ర మహా భాగవతం – నవవిధ భక్తి మార్గానుయాయులు.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం.
9. సూర్యగోపాలకృష్ణ, ఎం. 1990. *పోతన అన్నమయ్యల భక్తి తత్త్వము తు.ప.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం.

## 0.4 ప్రధాన ఆకర గ్రంథాలు

ఈ పరిశోధన గ్రంథ రచనకు ఉపకరించిన ప్రధాన ఆకర గ్రంథాలను కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1. కొండమాచార్యులు, ముదివర్తి. 2017. *శ్రీమహాభాగవతము సంపుటాలు 1–2.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
2. కొండమాచార్యులు, ముదివర్తి. 1993. *ముకుందమాల.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
3. నరసింహాచార్యులు, కె.టి.యల్. 2009. *దివ్యప్రబంధత్రయి.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
4. రఘునాథాచార్యులు, న. చ. 1992. *శ్రీ మాలికా స్తుతి.* వరంగల్: సత్సంప్రదాయ పరిరక్షణ సభ.
5. రాఘవన్, టి.కె.వి. 2017. *తిరుప్పావై మేలుకొలుపులు.* గోరఖ్ పూర్: గీతాప్రెస్.
6. రామచంద్రశర్మ, జోస్యుల. 2017. *నవవిధ భక్తి రీతులు.* మూలం: గోయంద్‌కా, జయదయాల్. గోరఖ్ పూర్: గీతాప్రెస్.
7. రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటాలు 1–4.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
8. రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 1998. *శృంగార సంకీర్తనలు సంపుటాలు 5–6.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
9. లక్ష్మణయ్య, సముద్రాల. 2017. *శ్రీమహాభాగవతము సంపుటాలు 3–7.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
10. లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008. *మొల్ల రామాయణము.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
11. వరదాచార్యులు, ధనకుధరం. 1972. *శ్రీ రామానుజ కీర్తి కౌముది మొదటి భాగము.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

12. వసుమతీదేవి, శేషభట్టర్. 2002. *అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావము.* హనుమకొండ: వసుమతీ పబ్లికేషన్స్.

13. వాణి, కేసర్ల. 1997. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

14. భాస్కరుడు, హుళక్కి, ఇతరులు. 2015. *భాస్కర రామాయణము.* విశాఖపట్నం: జ్యోతి బుక్ డిపో.

15. Rajajee, M.S. 2001. *Sri Yamunacharya's Stotra Ratna*. Tirupati:Tirumala Tirupati Devasthanams Press.

వీటితోపాటు నిఘంటువులను, ఇతర పరిశోధన గ్రంథాలను, వ్యాసాలను, అంతర్జాలంలోని పుస్తకాలను అధ్యయనం చేశాను. వీటన్నిటి వివరాలను ఉపయుక్తగ్రంథసూచిలో చేర్చాను.

### 0.5. పరిశోధన గ్రంథ రచన – అనుసరించిన ప్రణాళిక

ఈ పరిశోధన వ్యాసాన్ని, పర్యవేక్షకులతో చేసిన చర్చల ఆధారంగా, అయిదు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయం: అన్నమయ్య భక్తి తత్త్వం – విశిష్టాద్వైతం

రెండవ అధ్యాయం: నవవిధ భక్తి మార్గాలు : పూర్వకవుల దర్శనం

మూడవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాలు

నాలుగవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనలలో ఇతర భక్తిమార్గాలు

ఐదవ అధ్యాయం: నేటి సమాజంలో అధ్యాత్మికత

ఈ పరిశోధనకోసం శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి పరిష్కరణతో తిరుమల తిరుపతి దేవస్థానములవారు 1998లో ముద్రించిన కీర్తనల సంపుటాలను స్వీకరించాను. మొదటి అధ్యాయంలో తొలుతగా అన్నమయ్య జీవితాన్ని సంగ్రహంగా పరిచయం చేశాను. తరువాత,

అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైత మతావిర్భావానికి చారిత్రక కారణాలను, విశిష్టాద్వైత సైద్ధాంతిక నేపథ్యాన్ని చర్చించి, విశిష్టాద్వైత మూలపురుషులైన ఆళ్వారులను, ఆచార్యులను, వారి రచనలను క్లుప్తంగా తెలిపి, అన్నమయ్యపై ఆయా రచనల ప్రభావాన్ని విశ్లేషించాను. విశిష్టాద్వైత సిద్ధాంతాలను సంగ్రహంగా పేర్కొన్నాను.

రెండవ అధ్యాయంలో నవవిధ భక్తిమార్గాలను నిర్వచించి, విష్ణు పారమ్య గ్రంథాలైన *ఆంధ్రమహాభాగవతం,* రామాయణాలలో (*భాస్కర రామాయణం, మొల్ల రామాయణం*) ఆయా భక్తి మార్గాలే విధంగా ఉన్నాయో పరిశీలించాను.

మూడవ అధ్యాయంలో 1-6 సంపుటాలలోని అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాలకు సంబంధించిన కీర్తనలను గుర్తించి ఆయా విభాగాలలో విభజించి, చర్చించాను. ఆయా విభాగాలకు చెందిన అన్నమయ్య కీర్తనల పట్టికలను అధ్యాయం అనంతరం అనుబంధంగా పొందుపరిచాను. అధ్యాయంలో భక్తి మార్గాలను చర్చించిన తరువాత అధ్యాయం వెనకనే కీర్తనల పట్టికలను అనుబంధంగా ఇస్తే, భక్తి మార్గం నిర్వచనంతో కీర్తన వర్గీకరణను పోల్చి చూసుకోవడానికి అవకాశం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ పద్ధతిని పాటించాను.

నాలుగవ అధ్యాయంలో అన్నమయ్య స్వయంగా ప్రతిపాదించిన ఏకాదశభక్తి మార్గాలకు, ఇతర భక్తి మార్గాలైన వాత్సల్య భక్తి, మధుర భక్తి, అనన్య భక్తి, వైర భక్తి మొదలైన ఇతర భక్తి మార్గాలకు సంబంధించిన కీర్తనలను వివరించాను. ఆయా భక్తి మార్గాలకు చెందిన అన్నమయ్య కీర్తనల పట్టికలను అనుబంధంగా ఇచ్చాను.

ఐదవ అధ్యాయంలో అధ్యాత్మికతకు అర్థాన్ని వివరించి, నేటి సమాజానికి అధ్యాత్మికత ఎందుకు అవసరమో చర్చించాను. ఇందుకోసం ఇద్దరు ఆధునిక రచయితల జీవితాలను నిదర్శనాధ్యయనంలో భాగంగా తీసుకుని, నాస్తికులైన వారు అధ్యాత్మికత వైపుకు మళ్లవలసి

వచ్చిన అవసరాన్ని పరిశీలించాను. నేటి సమాజానికి కావలసినది హేతుబద్ధతతో కూడిన అధ్యాత్మికతగా ప్రతిపాదించి, అన్నమయ్య ప్రదర్శించిన హేతుబద్ధమైన అధ్యాత్మికతను విశదీకరించాను. చివరగా ప్రముఖ ప్రవచనకర్త డా॥ గరికిపాటి నరసింహారావుగారితో అధ్యాత్మికత విషయమై జరిగిన ముఖాముఖిని పొందుపరిచాను.

ఈ పరిశోధన గ్రంథంలో ప్రాచీన, ఆధునిక కవులను, రచయితలను, విమర్శకులను...గురించి ప్రస్తావించవలసి వచ్చినప్పుడు వీరి నామాంతాలలో బహువచనమే వాడబడింది. పరిశోధన గ్రంథంలో ఏకరూపతకోసం, గౌరవసూచకంకోసం ఈ పద్ధతిని అనుసరించడం జరిగింది.

సిద్ధాంత గ్రంథంలో అన్నమయ్య సంకీర్తనలను ఉదహరించినపుడు వాటి క్రమసంఖ్య, సంపుటి వివరాలను ()ల మధ్య సూచించాను. ()ల మధ్య మొదటి సంఖ్య సంపుటి సంఖ్యను, రెండవ సంఖ్య సంకీర్తన సంఖ్యను తెలియజేస్తుంది. ఈ రెంటిని విభజించి చూపడానికి '–' వాడబడింది. అలాగే, ఇతర రచనలలోని సంకీర్తనలు/పద్యాలు/శ్లోకాలను ఉటంకించినపుడు వాటికి సంబంధించిన ఆకరాలను అక్కడికక్కడే ()ల మధ్య తెలియజేశాను.

## 0.6 పరిశోధన ప్రయోజనాలు

ఇప్పటికే కొన్ని పరిశోధనలు జరిగిన అంశాన్ని చేపట్టి, దానిపై కొత్తగా దృష్టి సారించడమనేది కష్టసాధ్యమైన విషయమే అయినా, నా ఈ పరిశోధనను అన్నమయ్యపై జరిగిన మిగిలిన పరిశోధనలకంటే విభిన్నంగా చేసే ప్రయత్నం చేశాను. ఇతర పరిశోధనలతో పోల్చి చూస్తే, ఈ పరిశోధనలో ఉన్న ప్రత్యేకతలను ఇక్కడ గమనించవచ్చు.

1) అన్నమయ్య భక్తి తత్త్వం విశిష్టాద్వైతమని ఇప్పటికే కొన్ని పరిశోధనలు నిరూపించాయి. ఈ పరిశోధనలో అన్నమయ్య భక్తితత్త్వమైన విశిష్టాద్వైత చారిత్రక, సైద్ధాంతిక నేపథ్యాలను

నిశితంగా పరిశీలించాను. విశిష్టాద్వైత మూల పురుషులైన ఆళ్వారుల, ఆచార్యుల కృషిని, రచనలను పరిచయం చేశాను. ఇవన్నీ అన్నమయ్య సాహిత్యాన్ని మరింతగా అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తాయని నమ్ముతున్నాను.

2) విష్ణు పారమ్య ప్రతిపాదకాలైన రామాయణ, భాగవతాలలో ప్రదర్శితమైన నవవిధభక్తి మార్గాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ ఫలితాలను పొందుపరిచాను. ఇది నవవిధ భక్తి మార్గాల స్వరూప స్వభావాలను విశదీకరించడంలో ఉపకరిస్తుందని విశ్వసిస్తున్నాను.

3) 1-6 సంపుటాల్లోని అన్నమయ్య కీర్తనలను నిశితంగా పరిశీలించి నవవిధ భక్తి మార్గాలలో వాటిని వర్గీకరించాను. నవవిధభక్తి మార్గాలను ప్రదర్శించే కీర్తనల పట్టికలను ఇచ్చాను.

4) అన్నమయ్య ఆత్మనివేదన భక్తిని విశిష్టాద్వైతపరంగా విశ్లేషించి, అన్నమయ్య శరణాగతి తత్త్వాన్ని నిరూపించాను.

5) అన్నమయ్య స్వయంగా ప్రతిపాదించిన ఏకాదశ భక్తి మార్గాలను, ఇతర భక్తి మార్గాలను చర్చించి, 1-6 సంపుటాల్లోని అన్నమయ్య కీర్తనలను ఆయా భక్తి మార్గాలలోకి విభజించాను. ఆయా భక్తి మార్గాలను ప్రదర్శించే కీర్తనల పట్టికలను ఇచ్చాను.

6) ఈ పరిశోధన అంతటా అన్నమయ్య కీర్తనలను, ఆళ్వారాచార్యుల రచనలతో తులనాత్మకంగా పరిశీలించి, అన్నమయ్య కీర్తనలపై వాటి ప్రభావాన్ని పట్టి చూపించాను.

7) పరిశోధనకు, సమాజానికి సంబంధం ఉండాలన్న వాస్తవాన్ని పురస్కరించుకుని, నేటి సమాజంలో అధ్యాత్మికత అవసరమేమిటో చర్చించాను.

8) అన్నమయ్య ప్రదర్శించిన హేతుబద్ధమైన అధ్యాత్మికతను నిదర్శనప్రాయంగా ప్రకటించాను.

# అధ్యాయం–1

# అన్నమయ్య భక్తి తత్త్వం

# – విశిష్టాద్వైతం

# అధ్యాయం-1

# అన్నమయ్య భక్తి తత్త్వం - విశిష్టాద్వైతం

## 1.0. అన్నమయ్య జీవితం – రచనలు – సంగ్రహ పరిచయం

15వ శతాబ్దమంతా ఆవరించి ఉన్న సాహితీమూర్తి అన్నమయ్య. తెలుగు సాహిత్య, సంగీత ప్రపంచాలకు పరిచయం అక్కరలేని పేరు అన్నమయ్యది. కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో 1408లో జన్మించి, 95 సంవత్సరాల నిండు జీవితాన్ని అనుభవించిన అన్నమయ్య 1503లో విష్ణుసాయుజ్యం పొందారు. తన 16వ ఏటనే కీర్తనలు అల్లడం ప్రారంభించి, 79 ఏళ్ళలో రోజుకో పాట తక్కువ కాకుండా 32వేల సంకీర్తనలు రచించి తెలుగు పద సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన పదకవితా పితామహుడు అన్నమయ్య. అచ్చ తెనుగు నుడికారంలో, సిసలైన తెలుగు పలుకుబడులలో రచించిన అన్నమయ్య కీర్తనలు తెలుగు భక్తి సాహిత్య శాఖలో అజరామరాలు.

తాళ్ళపాక చిన్నన్న పేరుతో వ్యవహరింపబడే అన్నమయ్య మనవడు తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు రచించిన *అన్నమాచార్య చరిత్ర* అన్నమయ్య జీవితాన్నిగురించిన పూర్తి వివరాలను ఇస్తోంది. ఇప్పటికే అన్నమయ్య జీవితంపై ఎన్నో రచనలు వచ్చినందువల్ల, ఇక్కడ అన్నమయ్య జీవితాన్ని సంగ్రహంగా మాత్రమే స్పృశించడం జరుగుతుంది.

అన్నమయ్య చిన్ననాటినుండే తిరుపతి వేంకటేశ్వరునిపై అమితమైన భక్తి కలిగి ఉండేవారు. తల్లిదండ్రులకు, అన్నవదినెలకు చేదోడుగా ఉంటూ, చెప్పిన పనులన్నీ చేసేవారు. ఒకనాడు ఇంట్లోవారు దర్భను తెమ్మని అన్నమయ్యను అడవికి పంపారు. అక్కడ దర్భను కోస్తూ, వేలు కోసుకుని, సంసారంపై విరక్తిని పొంది, శ్రీవేంకటేశ్వరుని సేవ చేయడానికి యాత్రికులతో కలిసి తిరుమల కొండకు వెళ్ళిపోయారు. అక్కడ స్వామివారిని దర్శించి,

అమ్మవారిపై, స్వామివారిపై శతకాలు చెప్పిన అన్నమయ్యకు ఘనవిష్ణుయతి పంచసంస్కారాలను కావించారు. కొన్నేళ్ళపాటు తిరుపతిలో ఉండి స్వామివారి సేవ చేసుకున్న అన్నమయ్యను ఆయన తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకువెళ్ళి, వివాహం జరిపించారు. అటు తరువాత అహోబిలక్షేత్రానికి వెళ్ళి, అహోబిలమఠస్థాపకుడైన ఆదివన్ శఠకోపయతివద్ద విశిష్టాద్వైతాన్ని అధ్యయనం చేశారు అన్నమయ్య. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని తరువాత అహోబిల నృసింహుని విశేషంగా ఉపాసించి, పలు సంకీర్తనలు రచించడం గమనార్హం.

టంగుటూరుకు దండనాథుడైన సాళువ నరసింహరాయలు అన్నమయ్య సంకీర్తనలనుగురించి విని, అన్నమయ్యను తనవద్దకు పిలిపించుకుని ఆయనను సత్కరించారు. అన్నమయ్య దీవెనల బలంవల్ల అనతికాలంలోనే నరసింహరాయలు పెనుగొండకు ప్రభువై అక్కడకికూడా అన్నమయ్యను రప్పించుకుని, అన్నమయ్యకు నగరు నిర్మించి సన్మానించారు. రాజాశ్రయం వైష్ణవ వ్యాప్తికి తోడ్పడుతుందనే ఉద్దేశంతో అన్నమయ్యకూడా రాజు నిర్మించిన నగరులో ఉండడానికి అంగీకరించారు. అన్నమయ్య నోట స్వామివారి దివ్య శృంగార కీర్తనలను విన్న రాయలు, తనపైకూడా అటువంటి పదాలను చెప్పించుకోవాలనే కోరికను వెలిబుచ్చారు. శ్రీహరిని కీర్తించే నోటితో అన్యులను కీర్తింపజాలనని రాజుకోరికను నిరాకరించారు అన్నమయ్య. ఈ ధిక్కారానికి కోపించిన నరసింహరాయలు, అన్నమయ్యను సంకెళ్ళతో బంధించారు. తరువాత అన్నమయ్య మహిమను తెలుసుకుని, పశ్చాత్తాపంతో అన్నమయ్యను వదిలిపెట్టారు. అన్నమయ్య తన శేషజీవితాన్ని తిరుమలలో స్వామివారిని కీర్తనల రూపంలో సేవిస్తూ గడిపినట్టుగా *అన్నమాచార్య చరిత్ర* ద్వారా తెలుస్తోంది.

అన్నమయ్య సంకీర్తనలనే కాక, పన్నెండు శతకాలను, ద్విపదలో *రామాయణాన్ని*, *శృంగార మంజరి* అన్న లఘుకృతిని, సంస్కృతంలో *వేంకటాచలమాహాత్మ్యాన్ని*, *సంకీర్తన లక్షణాన్ని* రచించినట్లు *అన్నమాచార్య చరిత్ర* చెబుతోంది (రామసుబ్బశర్మ, గౌరిపెద్ది.

2001:49). కాని, ప్రస్తుతానికి *వేంకటేశ్వర శతకం*, *శృంగార మంజరి*, 15 వేల కీర్తనలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

అన్నమయ్య రచించిన *శ్రీవేంకటేశ్వర శతకం* తొలి వైష్ణవ శతకం, తొలి భక్తి శృంగార శతకంకూడా. పద్మావతీశ్రీనివాసుల అలౌకిక శృంగారమే ఈ శతకంలోని వస్తువు. ఈ శతకంలో డోలోత్సవం, గరుడోత్సవం, కళ్యాణోత్సవం, కనకవాహనోత్సవంవంటి ఆనాటి తిరుమల ఉత్సవాల కైంకర్యాలు కూడా వర్ణింపబడ్డాయి. అన్నమయ్య స్వామివారికి, అలమేలుమంగకు మధ్య మనోహరమైన దృశ్యాలను ఊహించి వాటిని తన శతకంలో మధురంగా వర్ణించారు.

> *అందవు కోసి యిమ్ము విరు లంచును జే రలమేలుమంగ ని*
> *న్నుందగఁగోరఁ జెక్కులటు నొక్కిన నాకును నందవంచు, న*
> *య్యిందుముఖిం బ్రియంబలర నెత్తుచుఁ బువ్వులు కోయఁజేయ ని*
> *ష్యందమరందఘర్మరససంగతు లబ్బెను వేంకటేశ్వరా!* (శ్రీనివాసులు, కామిశెట్టి. 2000:19 – [శ్రీవేంకటేశ్వర శతకం–23వ పద్యం])

అమ్మవారు, స్వామివారు వనవిహారం చేస్తూ ఉండగా, అమ్మవారికి అందమైన పూలను కోయాలనే మనసు కలిగింది. తనకు అందటం లేదని స్వామివారి సాయం కోరారు. తనకూ అందటం లేదని చెప్పి, అమ్మవారిని ఎత్తుకుని అమ్మవారిచేతే పూలను కోయించారట స్వామి. పూలను కోస్తూండగా పూదేనె, స్వేదంకూడా కలిసి స్రవించాయిట. ఈ స్వేదం స్వామివారికి అమ్మవారిని ఎత్తడంలో కలిగిన శ్రమవలననా లేక అమ్మవారికి స్వామివారి సమక్షంలో లజ్జాతిశయంవలన కలిగినదా అన్న విషయం పాఠకుడి ఊహకు వదిలేశారు అన్నమయ్య. స్వేదాన్ని సాత్త్వికభావంగా చెబుతారు. నాయికకు నాయకుని సమక్షంలో లజ్జాతిశయంవలన

చెమట పట్టడం శృంగార రసంలో సహజమన్నది గమనార్హం. ఇటువంటి ముగ్ధమనోహర భావాలతోకూడిన *శ్రీవేంకటేశ్వర శతకం* శతకసాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది.

లభ్యమైన అన్నమయ్య లఘుకృతులలో రెండవది *శృంగార మంజరి*. ఇందులోని వస్తువుకూడా దివ్య శృంగారమే. ఇది మంజరీ ద్విపదలో ఉంది. పుష్పాపచయం, వసంత వర్ణన, నాయిక విరహ తాపం మొదలైన వాటితో దీనిలో వర్ణనలు ప్రబంధపు పోకడలో ఉంటాయి. వేంకటేశ్వరునిగురించి అందరూ చెప్పుకోగా విన్న ఒక బాల అతనిపై మరులుకొంటుంది. చెలికత్తెలు ఆమెను మరిపించడానికి ఉద్యానవనానికి తీసుకెళతారు. వసంతం ఆమె విరహతాపాన్ని పెంచుతుంది. ఆమె చెలులు స్వామివారికి ఆమె బాధను నివేదించి ఆయనను ఆమెవద్దకు తీసుకొస్తారు. స్వామివారు వేంచేసి ఆమె కోర్కెను తీరుస్తారు. ఇదీ *శృంగార మంజరి* కథాసంగ్రహం. పోతనకు ఏ మాత్రం తీసిపోని రీతిలో శబ్దాలంకారాలను ఇందులో ప్రయోగించారు అన్నమయ్య.

అన్నమయ్య ఇతరాలెన్ని రచించినా, ఆయన రచనలలో ఆయనకు అనంతమైన కీర్తిని తెచ్చిపెట్టింది సంకీర్తనలే. అన్నమయ్య కీర్తనలు రెండు విధాలుగా ఉన్నాయి. 1. అధ్యాత్మ సంకీర్తనలు 2. శృంగార సంకీర్తనలు.

**అధ్యాత్మ సంకీర్తనలు:**

ఈ కీర్తనలలో అన్నమయ్య భక్తి, అధ్యాత్మ, నీతి, వైరాగ్య భావాలు ప్రస్ఫుటమవుతాయి. భక్తి తత్త్వ నిరూపణమే వీటి ప్రధాన వస్తువు. అన్నమయ్య నవవిధ భక్తి మార్గాలలోనే కాక అనేక ఇతర రీతులలో తన స్వామిని అర్చించుకున్నారు. కొంగొత్త భక్తి మార్గాలను ఆవిష్కరించారు.

*నానాభక్తులివి నరుల మార్గములు*
*యే నెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి*

*హరిఁకిఁగా వాదించు టది ఉన్మాదభక్తి*
*పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి*
*అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి*
*అరమరచి చొక్కుటే ఆనందభక్తి*

*అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి*
*అతని దాసుల సేవే అదియే తురీయభక్తి*
*క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి*
*అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి*

*అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి*
*నెట్టన శరణనుటే నిర్మలభక్తి*
*గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి*
*తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి* (2-469)

అంటూ పదకొండు భక్తి మార్గాలను, వాటి లక్షణాలను తన కీర్తనలో చాటారు.

అన్నమయ్య కీర్తనలలో విశిష్టాద్వైత తత్త్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ తత్త్వంలో ఈశ్వరుడు జీవులకు, ప్రకృతికి ఆత్మ వంటివాడు. జీవులు, ప్రకృతి అతడికి శరీర భూతంగా ఉంటారు. వీరిరువురికీ మధ్య శరీర – శరీరి సంబంధం ఉంటుంది. దేహి తన శరీరం విడిచి పరమాత్మలో ఐక్యం కావడానికి పరితపిస్తాడు.

అన్నమయ్య విశిష్టాద్వైత తత్త్వానికి అనుగుణంగా సగుణోపాసనకే ప్రాముఖ్యం ఇచ్చినట్లుగా ఆయన కీర్తనలను గమనిస్తే అర్థమవుతుంది. అలాగే అన్నమయ్య కీర్తనలలో శరణాగతి తత్త్వం, భగవద్దాస్యం, భాగవత దాస్యంకూడా ప్రధానమైన లక్షణాలే. అన్నమయ్య కీర్తనల్లో భక్తి తత్త్వమే ఈ పరిశోధన ప్రధాన విషయం కనుక, అది తరువాతి అధ్యాయాల్లో విపులంగా చర్చించాను.

**శృంగార సంకీర్తనలు**:

15వ శతాబ్దపు ప్రముఖ కవులైన అన్నమయ్య, శ్రీనాథుడు, పోతనల రచనలలో కనిపించే సామాన్యమైన లక్షణం కవిత్వంలో భక్తి శృంగారాల మేళవింపు. మధురభక్తి విషయమై ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యంగారు అన్న మాటలు (సుబ్రహ్మణ్యం, జి.వి. 2012:144) గమనించదగ్గవి. "మధురభక్తిని పద్యకవితలో అనుభవించాలంటే పోతన భాగవత దశమ స్కంధం చదవాలి. సంకీర్తన సాహిత్యంలో అనుభవించాలంటే అన్నమాచార్య శృంగార సంకీర్తనలు చదవాలి. అన్నమయ్య సంకీర్తన సాహిత్యం మధుర భక్తి మహార్ణవం."

అన్నమాచార్యుని శృంగార కీర్తనలలో శ్రీవేంకటేశ్వరుడు నాయకుడు. అలమేలుమంగ నాయిక అలాంటప్పుడు అన్నమయ్య సహకారిణి అవుతారు. కొన్ని కొన్ని సందర్భాలలో అన్నమయ్య తానే నాయికగా మారి స్వామిని సేవించుకుంటారు. భావుకత తొణికిసలాడుతున్న ఈ కింది శృంగార కీర్తన అన్నమయ్య మధురభక్తికి ఒక ఉదాహరణ.

*ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను*
*భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా*

*కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన*
*చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు*
*నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు*
*నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా* (5-82)

అన్నమయ్య ప్రదర్శించిన ఈ మధురభక్తిని సంగ్రహంగా నాలుగవ అధ్యాయంలో వివరించాను.

ఈ అధ్యాయంలో అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైత చారిత్రక నేపథ్యాన్నిగురించి, సైద్ధాంతిక నేపథ్యంలో భాగంగా భక్తి ఉద్యమాన్నిగురించి, విశిష్టాద్వైత మూల పురుషులైన

ఆళ్వార్లు, ఆచార్యులగురించి, వారివారి రచనలగురించి, అన్నమయ్యపై వారి ప్రభావాన్నిగురించి, విశిష్టాద్వైత మత సిద్ధాంతాలనుగురించి చర్చించాను.

## 1.1 అన్నమయ్య భక్తి - చారిత్రక నేపథ్యం

సాహిత్యానికి సమాజంతో కల సంబంధం అవినాభావమైనది. ఒక విధమైన సాహిత్యం ఒకానొక కాలంలోనే ఆవిర్భవించటానికి ఖచ్చితంగా ఏదో ఒక చారిత్రక నేపథ్యం ఉండే తీరుతుంది. ముఖ్యంగా, తెలుగు సాహిత్యానికి మతంతో విడదీయలేని సంబంధం కనిపిస్తుంది. "ఆంధ్ర వాఙ్మయ వీధులలో బాహాటముగా జరిగిన సాహిత్య వ్యాపార మంతయు మతమను కాసుతోనే చెలామణి అగుచు వచ్చినది" అన్న వేటూరి ఆనందమూర్తిగారి మాటలు (ఆనందమూర్తి, వేటూరి. 1986:5-6) అక్షర సత్యాలు. తెలుగు సాహిత్యం మొదలవడమే వైదిక మత పునరుద్ధరణ ధ్యేయంగా మహాభారతంతో మొదలయింది. అనంతర శతాబ్దాలలో వచ్చిన సాహిత్యంలో సింహభాగం మతసంబంధమైనదే. అన్నమయ్య వెలువరించిన అనంతమైన సాహిత్య సంపదకుకూడా వెన్నుపూస మతమే – విశిష్టాద్వైత మతం. అన్నమయ్య కీర్తనల నిండా విశిష్టాద్వైత తత్త్వమే పరుచుకుని ఉంది. విశిష్టాద్వైత తత్త్వానికి అనుగుణంగానే అన్నమయ్య ప్రజల భాషలో, ప్రజాహితమైన గేయ ప్రక్రియలో సాహిత్యాన్ని సృజించారు. అన్నమయ్య కీర్తనలను అర్థం చేసుకోవడానికి శ్రీవైష్ణవం అనబడే విశిష్టాద్వైతాన్ని అర్థం చేసుకోవడం ఎంతో అవసరం.

అన్నమయ్య పలు కీర్తనలలో మాయావాదులు, ఏకాత్మవాదులు, అభేదవాదులు అనబడే అద్వైతులను ఖండించారు.

*లలి మాయా శబళితులకు మోక్ష మెక్కడిది*
*నలి నభేదవాది కానందానుభవ మేది* (4-270)

'మాయావాదికి మోక్షమెక్కడుంది? అభేదవాదికి ఆనందానుభవం ఎక్కడుంది?'

*తానే దైవమైతే తపమేల జపమేల*

*పూని సారెఁ బూజించే పూజలేల*(2-415)

'అద్వైత తత్త్వం ప్రకారం తానే దైవమైతే, ఇంక జపతపాదులెందుకు? పూజలు ఎందుకు?'

*అంతా బ్రహ్మమైతే నాతుమా వొక్కటియైతే*

*చింతింప గురుఁడు లేఁడు శిష్యుఁడూ లేఁడు* (3-65)

'ఉన్నదంతా బ్రహ్మమే అయితే, గురువెవరు? శిష్యుడెవరు?'

భక్త కవి అయిన అన్నమయ్యకు ఇలా ఇతర వైదిక శాఖలను ఖండించవలసిన అవసరం ఎందుకు కలిగింది? అన్నమయ్య కొన్ని కీర్తనలలో కులభేదాలను తెగనాడి, సర్వమానవ సమానత్వాన్ని బోధించారు. కులం, మతం, జాతి, మడి, ఆచారం అంటూ గీతలు గీసుకుని కూర్చున్న సమాజంలో,

*ఎక్కువ కులజుఁడైన హీనకులజుఁడైన*

*నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు* (1-318)

*జాతి యిందే దంత్యజాతి యిందేది*

*జాతులన్నిటా నాత్మ సర్వేశుఁడు* (2-136)

'అగ్రకులంలో పుట్టినా, హీనకులంలో పుట్టినా, సత్యం తెలుసుకున్నవాడే గొప్పవాడు' అని ఎలుగెత్తి చాటారు. 'జాతులన్నిటికీ ఆత్మగా సర్వేశుడుండగా అగ్రజాతి, అంత్యజాతి అని ఏమున్నాయి?' అని ప్రశ్నించారు. సమకాలీన సమాజంలో లేని ఇంతటి సామాజిక చైతన్యం అన్నమయ్యలో సహజంగానే కలిగిందా? దీని వెనుక కారణాలేమైనా ఉన్నాయా?

అన్నమయ్య తన కీర్తనలలో ప్రస్తావించిన ఆళ్వార్లు, ఆచార్యులు ఎవరు? వారి రచనలేమిటి? అన్నమయ్యపై వారి ప్రభావమేమిటి? *నానాఁటి బదుకు నాఁటకము* (3-576) అంటూ వైరాగ్యాన్ని ప్రదర్శిస్తూనే, మరో కీర్తనలో *దిమ్మరిజాణఁడవోరి తిరువేంకటేశ నన్ను క్రమ్మరఁ గ్రమ్మరఁ గూడి కాఁకరించేవేలరా* (6-8) అంటూ మధుర భక్తిని చిలికించడానికి గల నేపథ్యమేమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైతాన్ని కూలంకషంగా పరిశీలిస్తే కాని బోధపడవు. కనుక, అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైతం పుట్టుపూర్వోత్తరాలు, చారిత్రక, సైద్ధాంతిక నేపథ్యాలు, సిద్ధాంతాలనుగురించి ఈ అధ్యాయంలో చర్చించాను.

"తెలుగు సాహిత్యాన్నే కాదు, ఏ భారతీయ భాషా సాహిత్యాన్నైనా చారిత్రక దృష్టితో అధ్యయనం చేయాలంటే భారత ఉపఖండం మొత్తం చరిత్రను భూమికగా తీసుకోవలసి ఉంటుంది" అన్నారు (రంగనాథాచార్యులు, కె. కె. 1981:ix) కె.కె.రంగనాథాచార్యులుగారు. కనుక విశిష్టాద్వైత మతావిర్భావానికి దారి తీసిన పరిస్థితులను గురించి తెలుసుకోవాలంటే భారతదేశంలో ప్రాచీన మతాలు, వాటితో ముడిపడి ఉన్న సామాజిక పరిస్థితుల గురించిన స్థూల అవగాహనకు రావాలి.

భారతదేశంలో విశిష్టాద్వైతానికి ముందున్న మతాలు ప్రధానంగా:

### 1.1.1 వైదిక మతం

వైదిక మతమే భారతదేశంలోని తొలి మతం. ఇది భారతదేశానికి ఆర్యుల రాకతో ప్రారంభమయింది. ప్రధానంగా ప్రకృతి ఆరాధనగా మొదలయిన వైదిక మతాన్ని మతం అనడం కంటే జీవన విధానమనడం సబబుగా ఉంటుంది. పూర్వ వేదకాలంలో ఇంద్ర, అగ్ని, వరుణ, మిత్రుల (సూర్యుడు) ఉపాసన చేసేవారు. వేదాలలో వారికి సంబంధించిన ప్రార్థన

మంత్రాలే ఎక్కువగా కనిపిస్తాయి. వేదకాలంలో విగ్రహారాధన లేదు. తరువాత అది స్థానికులైన అనార్య జాతులనుండి వచ్చింది.

వేదాలు భారతీయ సంస్కృతికి, మతానికి పట్టుకొమ్మలు. మానవాళికి లభ్యమవుతున్న మొట్ట మొదటి సాహిత్య రూపం వేదం. *విద్* అన్న ధాతువునుండి వేదమనే పదం పుట్టింది. దానికి అర్థం తెలుసుకోవటం. వేదాలను అపౌరుషేయాలనికూడా అంటారు. *వేదార్థ ప్రకాశం* రాసి వేదాలకు భాష్యం చెప్పిన సాయణాచార్యులు వేదాలను ఇలా నిర్వచించారు.

*ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారయో రలౌకికం ఉపాయం యో గ్రంథో వేదయతి స వేదః ।*
(గోయందకా, హరికృష్ణదాస్ జీ. 2017:5)

'అభిమతమైన దాన్ని సంపాదించటానికి, అనిష్టమైన దాని పరిహారం సాధించటానికి అలౌకికమైన ఉపాయాలను చెప్పే గ్రంథమే వేద'మన్నారు.

వేదాలు లిఖిత సాహిత్య రూపాలు కాదు. అవి ధ్యానంలో ఋషులు, మహర్షులు పరమాత్ముడినుండి విన్నారని, అవే తరువాతి తరాల వారు, వారి దగ్గరనుండి విన్నారని, అలా విని నేర్చుకునేవి కనుక వాటిని శృతులని అన్నారు.

వేదాలు నాలుగు. అవి,

1. *ఋగ్వేదం* : ఇది వేదాలన్నిటిలో పురాతనమైనది. అన్నిటికంటే పెద్దది. ఇది యాగాలలో దేవతలను ఆహ్వానించడానికి, వారిని స్తుతించడానికి కావలసిన మంత్రాలను కలిగి ఉంది. పురుష సూక్తం, హిరణ్య గర్భ సూక్తం, అక్ష సూక్తం మొదలైనవి ఇందులోని భాగాలే.

2. *యజుర్వేదం* : *యజుర్వేదం* గద్యాత్మకంగా ఉంటుంది. యజ్ఞ కర్మలను ఆచరించే విధి విధానాలను, యాగం చేసే పద్ధతినిగురించి చెబుతుంది. ఇది ప్రధానంగా రెండు

విభాగాలుగా విభజించబడింది. 1. *శుక్ల యజుర్వేదం* 2. *కృష్ణ యజుర్వేదం*. చాతుర్వర్ణ వ్యవస్థకు మూలాలు *యజుర్వేదం*లో కనిపిస్తాయి.

3. *సామవేదం* : అన్నిటిలోనూ చిన్నది. *ఋగ్వేదం*తో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నది. ఇందులోని మంత్రాలు దాదాపుగా *ఋగ్వేదం*లోనివే. యజ్ఞం చేసేటప్పుడు గానం చేయవలసిన మంత్రాలనుగురించి చెబుతుంది. భారతీయ గాన కళకు సంబంధించిన మూలాలు ఇందులో కనపడతాయి.

4. *అధర్వణవేదం* : లౌకిక, అలౌకిక జ్ఞానాలు రెండూ సమపాళ్ళలో కలిగి ఉన్న వేదంగా *అధర్వణం* ప్రసిద్ధి చెందింది. స్తుతులు, మంత్రవిద్యలు, ఆయుర్వేదం, వైద్యవిద్య, యుద్ధ విద్యలకు సంబంధించిన మూలాలు ఇందులో ఉన్నాయి. రోగాలను నయం చేయడానికి, శత్రువులను నాశనం చేయడానికి, శాంతి సౌభాగ్యాలను పొందడానికి, ఆయురారోగ్యైశ్వర్యాలను పొందడానికి కావలసిన మంత్రాలను కలిగి ఉంది. పరబ్రహ్మాన్ని స్తుతించే మంత్రాలుకూడా ఇందులో ఉన్నాయి.

వేదాల ఆధారంగా వివిధ శాస్త్రాలు వృద్ధి చెందాయి. వేదాలను అర్థం చేసుకునే శాస్త్రాలను వేదాంగాలు అంటారు. అవి ఆరు

1. *శిక్ష* – ఇది వేదాన్ని ఉచ్చరించే పద్ధతినిగురించి తెలుపుతుంది

2. *వ్యాకరణం* – దోషాలు లేని పదప్రయోగాన్ని, పదనిర్మాణాన్నిగురించి ఈ శాస్త్రం వివరిస్తుంది.

3.*ఛందస్సు* – వేదమంత్రాలను నిబంధించిన ఛందస్సులు, ఇతర లౌకిక ఛందస్సులనుగురించి వివరిస్తుంది.

4. *నిరుక్తం* – వేదంలోని పదాలకు అర్థాలను తెలుపుతుంది.

5. *జ్యోతిషం* –యజ్ఞాలు ఆరంభించడానికి కాలనిర్ణయం చేయడం ముఖ్యం. ఈ కాలనిర్ణయం చేయడానికి కావలసిన సమాచారం జ్యోతిషంలో లభిస్తుంది.

6. *కల్పం* – యజ్ఞ యాగాదుల విధానము, వాటిలోని భేదాలనుగూర్చి తెలుపుతుంది.

ఒక్కో వేదంలో నాలుగు విభాగాలున్నాయి: 1. సంహిత 2. బ్రాహ్మణం 3. ఆరణ్యకం 4. ఉపనిషత్తులు.

మొదటి రెండు కర్మ కాండకు చెందినవికాగా, తరువాతి రెండూ జ్ఞాన సంబంధమైనవి.

సంహిత మంత్రాలను, స్తోత్రాలను కలిగి ఉంటుంది తరువాత ఉండే బ్రాహ్మణం ఆ మంత్ర భాగాన్ని, యజ్ఞయాగాదుల ప్రశస్తిని, వాటిని ఆచరించే విధానాన్ని వివరిస్తుంది. ఆరణ్యకం యజ్ఞయాగాదులు, వైదిక కర్మల వెనుక ఆంతర్యాన్ని వివరిస్తుంది. కర్మ విధులయిన యజ్ఞయాగాదులకు, జ్ఞాన విధులయిన ఉపనిషత్తులకు మధ్య వారధిలాంటిది ఆరణ్యకం. కర్మకు బదులుగా చేయగలిగిన ధ్యాన విధిని వివరిస్తుంది. ఇది సాధారణంగా వానప్రస్థాశ్రమంలో యజ్ఞ యాగాదులకు బదులుగా చేయతగిన జపతపాదుల వివరాలను కలిగి ఉంటుంది. ఉపనిషత్తులలోని జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికి కావలసిన సన్నద్ధతను ఆరణ్యకాలు అందిస్తాయి.

ఉపనిషత్తులు పూర్తిగా జ్ఞాన సంబంధులు. వీటిని రహస్య/గుహ్య విద్యలనికూడా అంటారు. ఆరణ్యకాల తరువాత, వేదాల చివరన ఉండేవి కనుక, వేదాల సారాన్ని కలిగి ఉండేవి కనుక, వీటిని వేదాంతాలనికూడా అంటారు. పరబ్రహ్మను గురించిన చింతన, మోక్ష చింతన, ఆత్మానాత్మ వివేకం ఇందులో ప్రధానాంశాలు. కర్మకాండలద్వారా సముపార్జించిన పుణ్యమైనా, స్వర్గప్రాప్తి అయినా అనుభవించిన తరువాత, మనిషి మళ్ళీ పూర్వస్థితికి

చేరుకుంటాడు. కనుక, జననమరణ చక్రాన్ని ఛేదించి, పునరావృత్తి రహితమైన శాశ్వతమైన స్థితిని, మోక్ష మార్గాన్ని చేరుకునే దిశగా ఉపనిషత్తులు జ్ఞానబోధ చేస్తాయి.

తత్త్వజ్ఞుల నిరంతన చింతనకు ఫలాలుగా ఉపనిషత్తులను వర్ణిస్తారు. తరువాత కాలంలో వెలసిన అద్వైతం, విశిష్టాద్వైతం వంటి వేదాంత శాఖలకు మూలాలు ఉపనిషత్తులలోనే ఉన్నాయి. వేదాలలో సకల జ్ఞాన సారం దాగి ఉందన్న ప్రశస్తికి కారణం ఉపనిషత్తులు.

ఉపనిషత్తు అనే పదానికి సమీపంలో కూర్చుని అభ్యసించడం అని అర్థం. ఇవి గురుముఖతః నేర్చుకునే విద్యలు. ఉపనిషత్తులు ఇహపరాలనుగురించి కాక, జరామరణ చక్రంనుండి విముక్తికై అన్వేషించే మార్గాలను బోధిస్తాయి. ఆత్మవిచారాన్ని కలిగి ఉంటాయి. కర్మ ఫలాలను అనుభవించడానికి మళ్ళీమళ్ళీ జన్మలనెత్తవలసిన అవసరం లేని స్థితిని సాధించడానికి పరితపించే సాధకుడికి సహాయపడతాయి. ముక్తి జ్ఞానం వల్లే సాధ్యమని, అంటే ఆత్మ ఒక్కటే శాశ్వతమని తెలుసుకోవడం, ఆత్మకు పరమాత్మకు భేదం లేదని తెలుసుకోవడంద్వారా జన్మరహిత స్థితిని పొందవచ్చని ప్రవచిస్తాయి.

ఉపనిషత్తులు 108 ఉన్నాయని *ముక్తికోపనిషత్తు* చెబుతుంది. అయితే అందులో 10–12 మాత్రమే ముఖ్యమైనవి. వీటికే శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలైన ప్రముఖులు భాష్యాలు రాశారు. అవి *1. ఈశోపనిషత్తు 2. కేనోపనిషత్తు 3. కఠోపనిషత్తు 4. ప్రశ్నోపనిషత్తు 5. ముండకోపనిషత్తు 6. మాండూక్యోపనిషత్తు 7. తైత్తిరీయోపనిషత్తు 8. ఐతరేయోపనిషత్తు 9. ఛాందోగ్యోపనిషత్తు 10. బృహదారణ్యకోపనిషత్తు.*

ఉపనిషత్తులలో క్షత్రియులకు, స్త్రీలకుకూడా స్థానం కల్పించబడింది. సత్యకామ జాబాలి, గార్గి మొదలైన వారు ఉపనిషత్తులలో దర్శనమిస్తారు. మన దైనందిన జీవనంలో మనం ఉపయోగించే సూక్తులలో కొన్ని ఉపనిషత్తులలోనివే. భారత జాతీయ నినాదంగా

రూపుదిద్దుకున్న *సత్యమేవ జయతే* అన్న వాక్యం *ముండకోపనిషత్తు* లోనిది. *సత్యం వద, ధర్మం చర; మాతృదేవోభవ, పితృదేవోభవ* అనే సూక్తులు *తైత్తిరీయ ఉపనిషత్తు* లోనివి.

క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంవరకు వేదసంస్కృతి బలంగా ఉండేది. తరువాత కాలంలో వైదిక మతం ఎన్నో దేశీయ, జానపద సంస్కృతులను తనలో లీనం చేసుకుంటూ హిందూ మతంగా ఆవిర్భవించింది.

కర్మకాండలలోని 'బలులు', వైదిక మతంలోని 'కులభేదాలు' మొదలైనవి జిజ్ఞాసువులను ఆలోచింపజేశాయి. ఫలితంగా బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించాయి.

### 1.1.2. బౌద్ధం

క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం ప్రపంచ చరిత్రలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగినది. ఈ శతాబ్దంలోనే ప్రపంచవ్యాప్తంగా ఎందరో తాత్త్వికులు ఉద్భవించి ప్రపంచ తత్త్వసంపదను సుసంపన్నం చేశారు. భారతదేశంలోకూడా మతపరంగా, తత్త్వ చింతనపరంగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటిదాక నెలకొనిఉన్న వైదిక సంస్కృతిని నిరసిస్తూ ఎన్నో కొత్త దృక్కోణాలు బయలుదేరాయి. వైదిక సంస్కృతిని సంచార జాతిగా ఉన్నప్పటి ఆర్యులు వృద్ధి చేశారు. అది క్రమంగా దాదాపుగా ఉత్తర భారతదేశమంతా విస్తరించింది. కాని సంచార జీవనం నుండి, వ్యవసాయ సమాజానికి మారి, గ్రామాలు, పెద్ద ఊర్లు, ఆ పై నగరాలు వృద్ధి చెందాక, నాగరిక సమాజంలోని కొన్ని వర్గాల ప్రజలకి వైదిక సంస్కృతి సంతృప్తిని ఇవ్వలేకపోయింది. కొందరు జిజ్ఞాసువులలో సత్యాన్వేషణ తత్త్వం వెల్లివిరిసింది. అది బౌద్ధం, జైనం, ఆజీవికం మొదలైన మతాల ఆవిర్భావానికి దారి తీసింది.

శాక్య యువరాజు సిద్ధార్థుడు రాజ్యభోగాన్ని విడిచిపెట్టి సత్యాన్వేషణకోసం, దుఃఖనివారణ మార్గాన్వేషణకోసం మహాభినిష్క్రమణం చేశాడు. అతడు తన అధ్యాత్మిక

యాత్రలో ‘అలార కలామ’ అనే హిందూ గురువువద్ద సాంఖ్య దర్శన విజ్ఞానం సంపాదించాడు, ధ్యానం నేర్చుకున్నాడు. కాని, దానివల్ల తృప్తి పొందలేకపోయాడు. అక్కడినుండి వెళ్ళి, మరో గురువు ‘ఉద్ధక రామపుత్రుని’వద్దకూడా కొంతకాలం శిష్యరికం చేశాడు. అక్కడకూడా అతడు నేర్చిన యోగ విద్య అతడికి కావలసిన దుఃఖోపశమన మార్గాన్ని బోధించలేకపోయింది. అక్కడినుండి ఉరువేల అనే ప్రాంతం చేరి, అక్కడి బోధి వృక్షంకింద ధ్యానం చేసి, జ్ఞానాన్ని పొంది, గౌతమ బుద్ధుడయ్యాడు. తను తెలుసుకున్న జ్ఞానాన్ని ప్రజలకు అందించాడు.

బుద్ధుడి ముఖ్య బోధనలను నాలుగు మహా సత్యాలని అంటారు. అవి:

1. జీవితమంతా దుఃఖమయం. జననం, మరణం, వార్ధక్యం, పేదరికం, రోగం ఇలా జీవితంలోని అన్ని దశలూ దుఃఖభరితాలే. తాత్కాలికంగా సుఖమిచ్చేదేదైనాకూడా తరువాత అంతం కావలసిందే. ఏదీ శాశ్వతం కాదు.

2. దుఃఖానికి కారణం కోరిక.

3. కోరికను చంపుకుంటే దుఃఖంకూడా సమసిపోతుంది. కనుక వస్తువులపట్ల కాని, వ్యక్తులపట్ల కాని, ప్రదేశాలపట్ల కాని మమకారం పెంచుకోరాదు. మమకారం దుఃఖకారణమవుతుంది. కనుక, నిర్మమకారంగా ఉండాలి.

4. అష్టాంగమార్గం అవలంబిస్తే కోరిక, తద్వారా దుఃఖం నశిస్తాయి.

అష్టాంగమార్గం:

1. ‘సమ్యక్ దృష్టి’ – పైన పేర్కొన్న నాలుగు సత్యాల జ్ఞానం కలిగి ఉండడం.
2. ‘సమ్యక్ సంకల్పం’ – కామోపభోగబద్ధం కాని శుద్ధసంకల్పం కలిగి ఉండడం.
3. ‘సమ్యక్ వాక్కు’ – సత్యభాషణం, ప్రియమిత భాషణం కావించడం.
4. ‘సమ్యక్ కర్మం’ – లోకకళ్యాణ కారకాలైన కర్మలను చేయడం.

5. 'సమ్యక్ ఆజీవనం' – సమాజానికి అపాయం కలగని రీతిలో జీవించడం.
6. 'సమ్యక్ వ్యాయామం' — చెడు ఆలోచనలకు అవకాశమివ్వకపోవడం, ఒకవేళ అటువంటివి జనిస్తే వెంటనే వాటిని నాశనం చేయడం, మంచిని కలిగించే భావాలను ఉదయింపజేయడం, వాటిని పెంచి పోషించడం – ఈ నాలుగు ప్రయత్నాలు చేయడమే 'సమ్యక్ వ్యాయామం'.
7. 'సమ్యక్ స్మృతి' — సుఖదుఃఖాల స్వరూపాన్ని మననం చేయడం, మనసు పోకడలను గమనించడం, ఇంద్రియనిగ్రహం కోసం ప్రయత్నించడం మొదలైనవి.
8. 'సమ్యక్ సమాధి' — ఏకాగ్రచిత్తంతో ధ్యానం చేయడం.

(నారాయణాచార్యులు, పుట్టపర్తి. 1957: 224–226)

అష్టాంగమార్గం అవలంబించిన మనిషి నిర్వాణ స్థితిని చేరుకుంటాడని బుద్ధుడు బోధించాడు. ఆ నిర్వాణం మరణానంతరం లభించేది కాదు; చావు పుట్టుకలగురించిన భయం లేని ఆనందమయ స్థితి. దేవుడినిగురించి కాని, మరణానంతరపు జీవితాన్నిగురించి కాని, మానవాతీత శక్తులనుగురించి కాని బుద్ధుడు మాట్లాడలేదు. యజ్ఞయాగాదులలో జరిగే జీవహింసను నిరసించాడు. కర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. మనిషి కర్మలకు ఫలితం తప్పకుండా ఉంటుందని, కనుక, మంచి కర్మలను ఆచరించాలని ఉద్బోధించాడు. అయితే ఆ ఫలితం ఎప్పుడోకాక, ప్రస్తుత జన్మలోనే ఉంటుందని విశ్వసించాడు.

### మధ్యేమార్గం

బౌద్ధ మత సంప్రదాయాలలోను, విశ్వాసాలలోను మధ్యేమార్గానికి చాలా ముఖ్యమైన స్థానం ఉంది. శాక్యముని గౌతమ బుద్ధుడు తన జ్ఞానోదయానికి ముందు ఈ మార్గాన్ని అవగతం చేసుకొన్నాడని ప్రతీతి. 'మధ్యేమార్గం' అన్న పదానికి వివిధ వివరణలు ఉన్నాయి. 1) అటు కఠోరమైన దీక్షతో శరీరాన్ని, మనస్సును కష్టపెట్టకుండా, ఇటు భోగలాలసత్వంలో

మునగకుండా జీవితాన్ని సాగించడం. 2) తత్వ చింతనలో చివరకు 'ఇది ఉంది' లేదా 'ఇది లేదు' అన్న పిడివాదనలకు పోకుండా మధ్యస్థంగా ఆలోచించడం.

గౌతమ బుద్ధుడి మరణానంతరం రెండు శతాబ్దాలవరకు బౌద్ధమత ప్రభావం అల్పమే! కాని, తరువాత కాలంలో దాదాపుగా పూర్తి భారతదేశాన్ని పరిపాలించిన అశోకుడు (273–232 BC) బౌద్ధాన్ని జాతీయ మతంగా అనుసరింపచేయడం వలన బౌద్ధానికి భారతదేశమంతటా ప్రాచుర్యం వచ్చింది (Eliot, Charles. 1957:xxiii). అంతే కాక బౌద్ధం ప్రవచించే ధర్మాలు సరళంగా ఉండడం, కులభేద రహితంగా ప్రతి మనిషి నిర్వాణ స్థితిని సాధించగలగడం సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించింది.

క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో పుట్టిన బౌద్ధం, తరువాతి 1000 సంవత్సరాలలో ఎన్నో మార్పులకు గురయింది. బుద్ధుడు బోధించిన ధర్మాలన్నీ పెడ వ్యాఖ్యానాలకు గురయ్యాయి. బుద్ధుడు మనిషి పాటించవలసిన నైతిక వర్తనంగురించి, అహింసా సిద్ధాంతంగురించి చర్చించాడు. ధర్మం, సంఘంగురించి బోధించాడే తప్ప దైవంగురించి మాట్లాడలేదు. కాని రాను రాను బౌద్ధులు బుద్ధుడినే దైవంగా పూజించసాగారు. వర్తనానికి ప్రాముఖ్యత పోయి వ్యక్త్యారాధన మొదలయింది. వైశ్యుల వితరణతో, ఆదరించిన రాజుల దానాలతో, బౌద్ధ విహారాలు సంపదలతో తులతూగుతూ ఉండేవి. బౌద్ధ సన్యాసులు బుద్ధుడు ప్రవచించిన నిరాడంబర జీవితానికి నీళ్ళొదిలి అట్టహాసంగా జీవించసాగారు. బుద్ధుడు హిందూ మతంలోని వేటినైతే నిరసించాడో అవన్నీ బౌద్ధ మతంలోకూడా చోటు చేసుకోనారంభించాయి.

బౌద్ధం క్షీణించటానికి కారణాలు:

1. ముస్లింల దాడుల ఫలితంగా బౌద్ధారామాలు నాశనం కావడం – బౌద్ధం ఆరామాల చుట్టూ కేంద్రీకృతమైన వ్యవస్థ కనుక బౌద్ధానికి అది పెద్ద దెబ్బగా పరిణమించింది.

2. బౌద్ధాన్ని హిందూ మతం తనలో లీనం చేసుకుని విష్ణువు దశావతారాలలో బుద్ధుని ఒకనిగా గుర్తించి తదనంతరం కాలంలో బుద్ధుడి ప్రాముఖ్యతను తగ్గించడం.
3. వివిధ హిందూ మత శాఖలు (శైవం, వైష్ణవం, అద్వైతం) విజృంభించడం
4. బౌద్ధం వివిధ శాఖలుగా (థేరవాదం, మహాయానం, వజ్రయానం) విడిపోవడం – అసలు బుద్ధుడు ప్రవచించిన ధర్మాలు 'హీన'మయిపోవడం.
5. తాంత్రిక ఆచారాలతో కూడుకున్న వజ్రయానం వంటి శాఖలకు చోటిచ్చి బౌద్ధం తన మౌలికతను కోల్పోవడం.

ఈ విధంగా క్రీస్తు పూర్వం 6వ శతాబ్దిలో పుట్టిన బౌద్ధం దేశమంతటా వ్యాపించి, పైన పేర్కొన్న కారణాలవల్ల క్రీస్తు శకం 7వ శతాబ్దికి క్షీణదశకు చేరుకుంది (Nilakanta Sastri, K.A. 1961:427).

### 1.1.3. జైనం

భారతదేశంలోనే అతి ప్రాచీన మతాలలో జైనం ఒకటి. బుద్ధుడి కాలంలోనే జీవించిన వర్ధమాన మహావీరుడిద్వారా ఈ మతానికి దేశంలో ఆదరణ పెరిగింది. 'జిన' అన్న శబ్దంనుంచి జైనం వచ్చింది. జిన అన్న మాటకు అర్థం విజేత. జినుడు తన కోరికల్ని జయించి, వస్తు సంచయంతో తన బంధాల్ని తుంచుకుని, నీతిమంతమైన వర్తనంద్వారా, కఠినమైన ఆచారాలద్వారా తన గత కర్మలను తొలగించుకుని, తన బుద్ధిని, శరీరాన్ని జయించి, జనన మరణ చక్రంనుండి విముక్తిని పొందుతాడు.

జైనంలో 24 తీర్థంకరులు–అంటే–మతగురువులు ఉన్నారు. మొట్ట మొదటి తీర్థంకరుడైన ఋషభుడు జైనాన్ని స్థాపించాడు. ఋషభుడిగురించిన ప్రస్తావన ఋగ్వేదంలో కనిపిస్తుంది. అయితే 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడిని చారిత్రకంగా జైనమత స్థాపకుడిగా పేర్కొంటారు. మనోవాక్కాయ కర్మలద్వారా అహింస, సత్యభాషణం, అస్తేయం– దొంగతనం

చేయకుండా ఉండటం, అపరిగ్రహం – ఎవరి నుండి ఏదీ ఉచితంగా గ్రహించకపోవడం జైనమత సూత్రాలుగా పార్శ్వనాథుడు బోధించాడు. వీటికి చివరి తీర్థంకరుడైన మహావీరుడు బ్రహ్మచర్యాన్ని జోడించాడు.

జైన మతం నాస్తిక మతం. ప్రపంచానికి వేరే సృష్టికర్త ఉంటాడంటే జైనులు అంగీకరించరు. మనిషి కర్మే మనిషిని నియంత్రిస్తుందని నమ్ముతారు జినులు. కామ, క్రోధ, లోభ మోహాదులు కర్మకు కారణాలని, కర్మల ఫలితాలను అనుభవించడం కోసమే ఆత్మ అనేక జన్మలను అనుభవించవలసి వస్తుందని జినుల విశ్వాసం. కఠోరమైన నియమాలను పాటించడంద్వారా కర్మలను నాశనం చేసుకున్నప్పుడు జీవుడు బంధవిముక్తుడవుతాడని, కాబట్టి జనన మరణాలనుండి విముక్తి పొందడమే జీవిత లక్ష్యంగా భావించాలని బోధించాడు మహావీరుడు. మహావీరుడి బోధలవలన జైనానికి విశేష ప్రాచుర్యం లభించి, క్రమంగా ఉత్తర భారతమంతటా జైన మతం విస్తరించింది. తరువాత క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దంలో జైనాచార్యుడు భద్రబాహు, ఉత్తర భారతదేశంలో పన్నెండు సంవత్సరాల పాటు క్షామం వస్తుందని ఊహించి, జైనసంఘంతో పాటుగా కర్ణాటకలోని శ్రావణ బెళగొళ ప్రాంతానికి తరలివెళ్ళాడు (Ramaswami Ayyangar, M.S. and B Seshagiri Rao. 1922: 19,20,24). ఆ విధంగా, క్రమంగా రాజుల ప్రాపకంవలన దక్షిణ భారతదేశంలో కూడా జైనం పాతుకుపోయింది.

స్థూలంగా జైన బౌద్ధ మతాల లక్షణాలు ఇవి:

1. సంఘ సంస్కరణాభిలాష.
2. కర్మకాండ, జంతుబలులపట్ల వ్యతిరేకత.
3. చాతుర్వర్ణ వ్యవస్థపట్ల నిరసన.
4. సర్వమానవ సమానత్వం.

5. ప్రజల భాషలో మత సాహిత్య ప్రచారం.
6. అన్ని వర్గాల/వర్ణాల ప్రజలకు సాధ్యమయ్యే నిర్వాణం.
7. లౌకిక జీవన విధానంవల్ల మోక్షసాధన.

హిందూ మతంలోని చాతుర్వర్ణ వ్యవస్థ బ్రాహ్మణులకు, క్షత్రియులకు ఇస్తున్న ప్రాముఖ్యత, సామాన్య ప్రజానీకాన్ని సర్వమానవ సమానత్వం చాటుతున్న బౌద్ధ, జైన మతాల వైపు ఆకర్షితుల్ని చేసింది. ఆ కాలంలో సముద్రతీరం వెంట వర్తక వ్యాపారాలు బాగా అభివృద్ధి చెంది వైశ్య సమూహాలు సంపత్సౌభాగ్యాలతో వర్ధిల్లాయి. అయినా వారికి సంఘంలో తగిన హోదా లభించకపోవడం వారిని అసంతృప్తికి గురి చేసింది. బౌద్ధం, జైనం వారికి సంఘంలో తగిన హోదాను కల్పించాయి. అలాగే సంఘంలోని కింది వర్గాలైన శూద్రులు, పంచములుకూడా వర్ణ భేదాలపట్ల అసంతృప్తి కలిగినవారై బౌద్ధ, జైనాలను పాటించారు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దిలో దక్షిణంలో అడుగుపెట్టిన జైనం కొన్ని శతాబ్దాలపాటు ప్రజాదరణ పొంది, క్రీస్తు శకం 7వ శతాబ్ది నాటికి, దక్షిణదేశంలో వచ్చిన భక్తి ఉద్యమంలో భాగంగా వృద్ధి పొందిన శైవ, వైష్ణవ శాఖల కారణంగా క్రమంగా క్షీణించింది (Ramaswami Ayyangar, M.S. and B Seshagiri Rao. 1922:66).

జైనం ప్రాభవం తగ్గడానికి కారణాలు:

1. వీరశైవం, వైష్ణవం, అద్వైతం జైన ప్రభావంనుండి దక్షిణ భారతాన్ని తప్పించాయి. శైవ, వైష్ణవ మత గురువులు రాజాస్థానాలలో వాదాలు పెట్టుకుని జైన పండితుల్ని ఓడించి, రాజులను తమ తమ మతాలలోకి మళ్ళించేవారు. రాజుల ప్రాపకం తగ్గడంతో మత ప్రాచుర్యంకూడా తగ్గింది.
2. శాఖలుగా విడిపోవడం – శ్వేతంబరులు, దిగంబరులు అనే రెండు శాఖలుగా విడిపోవడం జైనాన్ని బలహీనపరిచింది.

3. కఠోరమైన నియమాలు – జైనమత పద్ధతులు చాలా కఠినంగా ఉంటాయి. అహింస ఏ స్థాయిలో ఉంటుందంటే దున్నుతున్నప్పుడు జీవాలు చనిపోతాయి కనుక వ్యవసాయంకూడా చేయరు. అందుకే జైనులు ఎక్కువ శాతం మంది పట్టణాల్లోకి వచ్చి వర్తకంలో స్థిరపడ్డారు. భూమి కింద పండిన దుంపల వంటివాటిని తినరు. జైనంలో సల్లేఖన వ్రతమనేది ఉంది. అది నిర్వాణానికి మేలైన మార్గంగా భావిస్తారు. సల్లేఖన వ్రతమంటే ఆహారం తీసుకోకపోవడంద్వారా శరీరాన్ని కృశింపచేసుకుని మరణించటం.
4. బౌద్ధంలా హిందూమతంలో సంలీనం కాలేకపోవడం – బౌద్ధం హిందూ మతంతో ఆదాన ప్రదానాలు కలిగి ఉండడం వలన తన ప్రాచుర్యాన్ని కోల్పోయినా, ఉనికినైతే నిలుపుకోగలిగింది కాని జైనం హిందూమతంతో సంపర్కాన్ని ఏ దశలోనూ అంగీకరించలేదు.

### 1.1.4. శైవం

ప్రకృతిలోని విలయ రూపానికి అధినాథుడిగా రుద్రుడిని గుర్తించారు వేదకాలంనాటి ఆర్యులు. రుద్రుడిని స్తుతులద్వారా, ప్రార్థనలద్వారా శాంతింపజేసి, తమను కాపాడమని ప్రార్థించేవారు. ప్రకృతిలోని ఉగ్ర స్వరూపం రుద్రుడయితే, ఆ రుద్రుడు ఆపదలు రాకుండా కాపాడిన వేళ అతడి శాంత స్వరూపాన్ని/సాత్త్విక ప్రవృత్తిని శివుడని కొలిచారు (శివం=మంగళం). పశువులను రక్షించే పశుపతిగా, ప్రజలను రోగాల బారి నుండి రక్షించే శివుడిగా (మంగళ ప్రదాత), శుభాన్ని కలిగించే శంకరుడిగా (శం కరోతి ఇతి శంకరః –> శుభాన్ని కలిగించేవాడు), భూత ప్రేతాల బారి నుండి రక్షించే భూతనాథుడిగా, దేవతలందరిలో ఆదిదేవుడిగా, మహాదేవుడిగా పూజలందుకున్నాడు శివుడు. రుద్రుడి ప్రశంస మొదట

*ఋగ్వేదంలో*, తరువాత *అధర్వణవేదంలో*, ఆపై *శతపథ బ్రాహ్మణం, శ్వేతాశ్వతరోపనిషత్తులలో* కనిపిస్తుంది.

హిందూ మతశాఖలలో శైవం అత్యంత ప్రాచీనమైనది. ఇది శివపారమ్యాన్ని బోధించే మతం. సగుణారాధన ఇందులో ప్రధానమైన అంశం. ఈ మతంలో సశరీరుడైన శివుని ప్రార్థిస్తారు. ఆ శివరూపంగా లింగాన్ని పూజించేవారు. ఇలా శివుడిని మాత్రమే ప్రార్థించేవారంతా శైవులుగా గుర్తింపబడ్డారు.

శివారాధనకు ఆధారభూతమైన సాహిత్యం *లింగ, శివ, స్కాంద* పురాణాలు. ఇవి శివ పారమ్య బోధకాలు. శంకరాచార్యుల నాటికే శైవం ఎన్నో శాఖలుగా విడిపోయి ఉంది. శైవ శాఖలలో పాశుపతం అత్యంత ప్రాచీనమైనది. ఇది కాక శైవంలో కాలాముఖం, కాపాలికం, తాంత్రికం మొదలైన ఇతర శాఖలు ఉన్నాయి.

శైవంలో కర్మ ప్రధానమైన, భక్తి ప్రధానమైన రెండు మార్గాలు కనిపిస్తాయి. కర్మ ప్రధానమైన శైవంలో వైదికాచారాలు, ఆచరణలు కనిపిస్తాయి. ఈ విభాగంలో శాఖలైన పాశుపత, కాలాముఖ శైవ శాఖలు తెలుగునాట వర్ధిల్లాయి. భక్తి ప్రధానమైన శైవం ముఖ్యంగా తమిళ దేశంలో భక్త్యుద్యమంలో భాగంగా వచ్చింది. ఈ మార్గంలోని భక్తులు కులభేదాలను పాటించరు. క్రీస్తు శకం 6వ శతాబ్దినుండి 8వ శతాబ్దివరకు తమిళ దేశంలో ప్రవర్తిల్లిన శివభక్తులను నయనార్లు లేక నయన్మార్లు అని అంటారు. వీరు అరవై ముగ్గురు. వీరినిగురించి తమిళ ప్రబంధమైన *పెరియపురాణంలో* విస్తారంగా వర్ణించారు. వీరిలో ముఖ్యులు అప్పర్ స్వామిగళ్, తిరుజ్ఞాన సంబంధర్, సుందరమూర్తి నాయనర్. వీరు ముగ్గురూ రచించిన శైవ వాఙ్మయానికి *తేవారం* అని పేరు. ఈ ముగ్గురు శివ భక్తిని ప్రచారం చేయటమే కాక, జైన బౌద్ధాలను నిరసించి శైవమత వ్యాప్తికి తోడ్పడ్డారు.

### 1.1.5. వైష్ణవం

వేదకాలంలో సూర్యాంశగా కొలవబడ్డ విష్ణువు, వేదాంత (ఉపనిషత్తుల) కాలం నాటికి సమగ్ర స్వరూపాన్ని సంతరించుకుని త్రిమూర్తులలో ఒకడిగా, స్థితికారుడిగా, నారాయణుడిగా, వాసుదేవ కృష్ణుడిగా పూజలందుకున్నాడు. *విశ్వం వేవేష్టి వ్యాప్నోతీతి విష్ణుః* – సర్వ వ్యాపకుడైన భగవంతుడిని విష్ణు నామంతో పూజించారు.

విష్ణువును కొలిచేవారు వైష్ణవులుగా గుర్తించబడ్డారు; వారి మతం వైష్ణవం. వైష్ణవం సాత్త్విక మతంగా పేరు తెచ్చుకుంది. విష్ణు భక్తులను భాగవతులని అంటారు. క్రీస్తుపూర్వంనుండి వైష్ణవారాధన కనపడుతున్నా, భక్తి ప్రధానమైన వైష్ణవం ఆళ్వార్లతోనే మొదలయింది. విశిష్టాద్వైతం ఉపవిభాగంలో వైష్ణవాన్నిగురించిన విపులమైన చర్చ ఉంది.

### 1.1.6. అద్వైతం

శంకరాచార్యుల కాలం నాటికి అవైదిక మతాలైన బౌద్ధ, జైనాలు, వైదిక మతాలైన వైష్ణవం, శైవం, శాక్తేయం, గాణాపత్యం, సౌరం, స్కాంధం లేక కౌమారం, వివిధ ఆస్తిక, నాస్తిక దర్శనాలు ఇలా ఎన్నో మతాలు ఉండేవి. బౌద్ధం, జైనాలు వివిధ మార్పులకు గురయి వాటి ప్రభావం తగ్గుముఖం పట్టిన దశలో, శైవం, వైష్ణవం, శాక్తేయం అంటూ ప్రజలు తెగలుగా విడిపోయి దేవుని పేరుతో ఘర్షణలు పడుతున్న కాలంలో, వైదిక ధర్మానికి ప్రాభవం తగ్గుతున్న సమయంలో ఆదిశంకరులు అద్వైత దర్శనాన్ని చూపిస్తూ వేదాధ్యయనాన్ని, వేదధర్మాన్ని పునఃప్రతిష్ఠాపించారు. పంచాయతన పూజకు (ఐదుగురు దేవతల ఆరాధన – గణేశ, సూర్య, శివ, విష్ణు, దేవి) శ్రీకారం చుట్టి వివిధ దేవతారాధకుల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నించారు. పంచాయతన పూజలో ఇష్టదైవాన్ని పీఠంపై మధ్య భాగాన ప్రతిష్ఠించి, నాలుగు మూలలా మిగిలిన దైవాలను ఉంచి, పూజించవచ్చు. షణ్మతాలను (శైవం, వైష్ణవం, శాక్తేయం, గాణాపత్యం, సౌరం, స్కాందం) ఆదరించి వైదిక ధర్మం అనే గొడుగు కిందకు

తెచ్చారు. అన్యదైవ దూషణను నిరసించి, అన్ని దైవాలు ఒక్కటే, పరబ్రహ్మకు వేరు వేరు రూపాలు అని నిర్గుణోపాసనను ప్రతిపాదించారు. ఎన్నో మతాల తాకిడులతో పెను కుదుపులకు లోనయిన హిందూ మతం తిరిగి కుదురుకోవడానికి ప్రధానమైన కారణం శంకరాచార్యుల వారే.

*తత్త్వమసి* (Tridandi Sri Bhakti Prajnan Yati. 1982:905 – [Chandogya Upanishad-chapter6-section8-shloka7]) – 'ఆ బ్రహ్మానివి నీవే' అన్న *చాందోగ్యోపనిషత్‌*లోని సూక్తి అద్వైత సిద్ధాంతానికి మూలం. *బ్రహ్మ సత్యం జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ నః పరః* – బ్రహ్మమొక్కటే సత్యం. కనిపిస్తున్న జగత్తంతా మాయతో కూడుకున్నది. మాయ పొరలు కప్పివేయడం వల్ల ఒక్కటే అయిన బ్రహ్మం వివిధ రూపాల్లో కనిపిస్తోంది. ఎప్పుడైతే అజ్ఞానం తొలగుతుందో, అప్పుడు తనలోనూ, జగత్తులోనూ నిండి ఉన్నదంతా ఒక్కటే బ్రహ్మమని తెలుస్తుంది అని ప్రబోధించారు. దేశానికి నాలుగు దిక్కులలో – శృంగేరి (కర్ణాటక), ద్వారక (గుజరాత్), బదరీనాథ్ (ఉత్తరాఖండ్), పూరీ (ఒడిశా) క్షేత్రాలలో – నాలుగు మఠాలు స్థాపించారు. ఇలా కాలానుగుణమైన ధర్మాలను బోధిస్తూ వైదిక ధర్మాన్ని తిరిగి ప్రతిష్ఠాపించారు.

ఏ మతంలో అయినా మతస్థాపకుడు ఋజు మార్గాన్ని బోధిస్తూ కాలోచితమైన ధర్మాలను ప్రతిపాదిస్తాడు. అనంతర కాలంలో వారి శిష్యులు, ప్రశిష్యులు మతస్థాపకుని ఉద్దేశ్యాలను ఒక్కొక్కరు ఒక్కో విధంగా అర్థం చేసుకుని వ్యాఖ్యానిస్తుంటారు. అది బౌద్ధం, జైనంనుండి, అన్ని మతాలకూ వర్తించింది. ఆ విధంగానే ఆదిశంకరుల భావాలకుకూడా వక్రభాష్యాలు తీయబడి, పండితులంతా *అహం బ్రహ్మాస్మి* అన్న మాటలోని వాచ్యార్థాన్ని మాత్రమే తీసుకుంటూ, తామెవ్వరికీ జవాబుదారీ కాదంటూ, తమకు తోచినదల్లా ధర్మమన్నట్లు ప్రవర్తించసాగారు. దీనికితోడు, అద్వైతంలో సహజంగా ఉన్న తర్కం, క్లిష్టత సామాన్య

ప్రజానీకాన్ని ఆ మతానికి చేరువ చేయలేకపోయాయి. శంకరుని రచనలన్నీ సంస్కృతంలోనే ఉండి పండితవర్గపు చర్చల్లోనే మిగిలిపోయాయి. సామాన్యుడికి అద్వైత తత్వం పట్టుబడలేదు. ఇదే విషయాన్ని పుల్లెల శ్రీరామచంద్రుడుగారు వివరిస్తూ ఇలా పేర్కొన్నారు (శ్రీరామచంద్రుడు, పుల్లెల మరియు ఇతరులు. 2011: 56).

"అద్వైత తత్త్వం అనేది అందరికీ అందుబాటులో ఉండేది కాదు. ఇది అత్యుత్తమమైన ఆధ్యాత్మిక స్థితిని చేరగల్గిన కొందరి కొరకు మాత్రమే ఉద్దిష్టమైనది."

'అధికార తారతమ్యాన్ని విస్మరించి, కొన్ని అంశాలను విసర్జించి, తమకు అనుకూలమైన కొన్ని అంశాలను మాత్రమే పరిగ్రహించి, శుష్క వేదాంతులు తయారయ్యే ప్రమాదం ఉన్నందునే తరువాతి ఆచార్యులు భక్తి మార్గాన్ని బోధించా'రన్నారు వారు.

*క్లేశోఽధికతరస్తేషాం అవ్యక్తాసక్తచేతసాం ।*
*అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:262 – [భగవద్గీత–12వ అధ్యాయం–5వ శ్లోకం])

'నిర్గుణోపాసకులకు కష్టం అధికం. మనసుకు, వాక్కుకు గోచరము కాని ఆ నిర్గుణ బ్రహ్మ – దేహంపై అభిమానం కలవారికి లభించదు' అని గీతాచార్యుడు పేర్కొన్నట్లు సామాన్య ప్రజలకు నిర్గుణాకారుడైన భగవంతుడిపై గురి కుదరలేదు. అద్వైతవాదం శంకరుని కాలం నాటి ఆశయమైన వైదిక సంస్కృతి పునరుద్ధరణను సాధించగలిగింది, సామాజిక ప్రశాంతతను నెలకొల్పగలిగింది. కాని, అధ్యాత్మికత ప్రధాన ఆశయమైన మానసిక ప్రశాంతత, జీవన సాఫల్య భావనలను సామాన్య ప్రజలకు ఇవ్వలేకపోయింది. *సోహం* అన్న భావనకంటే *దాసోహం* అన్న భావనలోనే అసలైన ఆనందం పొందవచ్చునని ప్రతిపాదించింది విశిష్టాద్వైతం.

### 1.1.7. విశిష్టాద్వైతం

త్రిమతాలలో ఒకటైన విశిష్టాద్వైతానికి ఉపనిషత్తుల కాలంనుండి ఉనికి ఉన్నా, దీనిని వ్యాప్తిలోకి తెచ్చింది ఆళ్వార్లు, ఆచార్యులు, ముఖ్యంగా యామునాచార్యులు, ఆ తరువాత రామానుజాచార్యులు. విశిష్టమైన అద్వైత తత్త్వమే విశిష్టాద్వైతమనబడుతోంది. జీవాత్మకు పరమాత్మకు మధ్య గల సంబంధం శరీర శరీరి సంబంధం వంటిది. జీవాత్మ, పరమాత్మల మూలం ఒక్కటే. కాని, ఈశ్వరుని శరీరం జీవుడు. జీవుని ఆత్మ ఈశ్వరుడు. ఈ విధంగా వీరిలో విశిష్టమైన అద్వైతముంది.

*ఏకమేవ అద్వితీయమ్* (Tridandi Sri Bhakti Prajnan Yati. 1982:882 – [Chandogya Upanishad-chapter6-section2-shloka1]) అనే వాక్యం విశిష్టాద్వైతానికి మూలం. సాటి లేనిది ఈశ్వరుని శక్తి. ఆ ఈశ్వరశక్తికి–అంటే–పరమాత్మకు జీవాత్మ శరణాగతి చేయాలి అనేది విశిష్టాద్వైతంలోని ముఖ్యమైన సిద్ధాంతం. విశిష్టాద్వైత మత వ్యాప్తికి మూలాలు క్రీ.శ. ఏడు నుండి తొమ్మిది శతాబ్దాల మధ్య ద్రవిడ దేశంలో తలెత్తిన భక్త్యుద్యమంలో ఉన్నాయి.

### 1.2. సైద్ధాంతిక నేపథ్యం – భక్తి ఉద్యమం

కర్మ (యజ్ఞ యాగాలు), జ్ఞాన (ఉపనిషత్తులు) మార్గాల నుండి భక్తి మార్గం వైపు భారత సమాజం మళ్ళే ప్రయత్నంలో మొదటి దశ భక్తి ఉద్యమం. భక్తికి సంబంధించి హిందీలో ఒక మాట ప్రచారంలో ఉన్నట్లు పరిశోధకులు చెప్పారు.

*భక్తి ద్రావిడ ఉపజీ లాయే రామానంద్*

*ప్రకట్ కియా కబీర్ నే సప్తద్వీప్ నవఖండ్* (రెడ్డి శ్యామల, యద్దనపూడి. 1998:4)

'భక్తి ద్రావిడ దేశంలో పుట్టింది. దాన్ని రామానందుడు అక్కడినుండి ఉత్తర భారతదేశానికి తీసుకువెళితే, కబీర్ దాస్ ఆ భక్తిని సర్వత్రా వ్యాపింపజేశాడు.'

14–15 శతాబ్దులలో ఉత్తర భారతదేశంలో తలెత్తిన భక్తి ఉద్యమం తమిళ దేశంలో 7–9 శతాబ్దాలలోనే పుట్టింది. తమిళ దేశంలో సంగ యుగం నాటికే రామాయణ, భారతాది ఇతిహాసాలు, పురాణాలు, వేద సంస్కృతి నిలదొక్కుకున్నాయి. స్థానిక జాతుల గ్రామ దేవతారాధనతో పాటుగా వైదిక దేవతలైన శివ, విష్ణు, ఇంద్ర, సూర్య, వరుణుల ఆరాధనకూడా సాగుతూ ఉండేది. ఇలా ఘర్షణ రహితంగా గ్రామదేవత సంస్కృతి, వైదిక సంస్కృతి సమాంతరంగా ఆదరింపబడుతున్న సమయంలో, మొదట జైనం, ఆ పై బౌద్ధం దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించాయి.

బౌద్ధ జైనాల అహింస, నియమబద్ధ జీవనం, కులభేదరాహిత్యం వెరసి ఆయా మతాల ప్రశాంత జీవనం సామాన్యులను ఆకర్షించింది. క్రమంగా బౌద్ధం, జైనం మూడవ శతాబ్దికల్లా దక్షిణ భారతదేశంలో కుదురుకున్నాయి. బౌద్ధ, జైనాలు బాగా వర్ధిల్లినట్టుగా ఆ కాలంలో తమిళంలో వచ్చిన బౌద్ధ, జైన సాహిత్యాలవల్ల (*మణిమేకలై, సిలప్పదికారం, జీవక చింతామణి* మొ॥) తెలుసుకోవచ్చు. రాజాశ్రయంవల్ల ఆయా మతాలు మరింతగా వృద్ధి చెందాయి. కాలక్రమేణా, ఈ అవైదిక మతాలు పరమత సహనాన్ని విడిచిపెట్టి, రాజుల ప్రాపకంతో మతమార్పిడులకు పాల్పడ్డాయి. మొదట సాత్త్విక మతాలుగా ప్రారంభమైన ఈ మతాలు తరువాత ఎన్నో మార్పులకు లోనయ్యాయి. ఇతర మతాలతో సంగం వల్ల బౌద్ధం తన పూర్వస్థితిని కోల్పోయింది. బౌద్ధ శ్రమణులు నైతిక విలువలు కోల్పోవడం, తాంత్రిక ఆచారాలు బౌద్ధంలో చోటు చేసుకోవడం మొదలైన కారణాల వల్ల బౌద్ధం క్షీణించసాగింది. జైన మత కఠిన ఆచారాలు సామాన్యులను ఆ మతానికి దూరం చేయసాగాయి.

తొలుత బౌద్ధజైనాల తాకిడికి వెనకడుగు వేసిన వైదిక మతం, ఆయా మతాల ప్రాబల్యం తగ్గుముఖం పట్టడంతో తిరిగి పుంజుకునే ప్రయత్నం చేసింది. బౌద్ధ, జైన మతాల సర్వ మానవ సమానత్వం, వర్ణ తిరస్కారం, సామాన్య జీవన విధానం హిందూ సంస్కర్తలను ఆకర్షించాయి. ఫలితంగా, సరళీకృత రూపాలతో వైదిక మత శాఖలు తమను తాము పునరావిష్కరించుకునే

ప్రయత్నం చేశాయి. బౌద్ధ జైనాలకు ప్రత్యామ్నాయంగా కులభేద రహితమైన భక్తి మార్గాన్ని చూపించాయి. బౌద్ధజైనాలు జనబాహుళ్యాన్ని ఆకర్షించడానికి మరో కారణం సామన్యుడికి అర్థమయ్యే భాషలో ఆయా మతాల ప్రచారం జరగడం, అందుకు అనువైన సాహిత్యాన్ని వారు సృష్టించుకోవడం. ఈ పంథాలోనే, వైదిక దేవతలను సామాన్యులకు దగ్గర చేసే ప్రయత్నాలలో భాగంగా దేశీయ భాషలలో గేయరచన చేశారు భక్త కవులు. శైవ భక్తులైన నాయనార్లు భక్తి ప్రధానమైన గేయాలతో శైవానికి ఊపిరులూదారు. అలాగే ఆళ్వార్లు తమ పాశురాలతో వైష్ణవ మతోత్థానానికి దోహదం చేశారు.

ఈ భక్త కవులు వైదికాన్ని పూర్తిగా అనుసరించలేదు. అలా అని పూర్తిగా తిరస్కరించనూలేదు. మధ్యే మార్గాన్ని ఆవిష్కరించుకున్నారు. వైదిక సాహిత్యంలోని శివ, విష్ణు లీలలను తెలిపే గాథలను మాత్రమే తీసుకుంటూ, వాటికి ప్రచారం కల్పిస్తూ, వర్ణాతీతంగా ప్రజలనందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేశారు. అదే సమయంలో బౌద్ధ, జైనాలను తీవ్రంగా నిరసించారు.

బౌద్ధజైనాలు ప్రచారం చేసిన నాస్తిక, నిరాశావాద, సన్యాస భావాలు అలుముకున్న వాతావరణంలో, మహిమాన్విత గాథలతో, దివ్యమంగళ స్వరూప వర్ణనలతో కూడిన రసభరితమైన గీతాలతో సామాన్యులను ఆకట్టుకున్నారు భక్తకవులు. సామాన్యులు మళ్ళీ ఆస్తిక మతాల వైపుకు మళ్ళడానికి శివ భక్తులైన నాయనార్లు, విష్ణు భక్తులైన ఆళ్వార్లు ప్రధాన కారణమయ్యారు. ఈ భక్త్యుద్యమం ఫలితంగా ఎన్నో దేవాలయాలు వెలిసాయి. ఆయా దేవాలయాల వైభవాలు, మూలవిరాట్టుల మహిమలను స్తుతిస్తూ ఎన్నో గీతాలు వెలుగు చూశాయి. ఈ గీతాలు సామాన్యులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శంకరాచార్యులు ప్రచారం చేసిన నిరాకారోపాసనకు భిన్నంగా సగుణారాధన ప్రాచుర్యాన్ని సంపాదించింది.

అంతవరకు వ్యవస్థాగతమైన భక్తి, భక్త్యుద్యమంతో వ్యక్తినిష్ఠమైంది. భగవంతుడు భక్తుడికి మరింత చేరువయ్యాడు. ఏకేశ్వరోపాసన భక్త్యుద్యమంలో ప్రధానమైన లక్షణంగా నిలిచింది. వైదిక ఛాయలు కలిగి ఉంటూనే దేశీయ స్పర్శ కలిగి ఉండడం దీనిలో ప్రత్యేకత.

భక్తి మార్గం భక్తులకు గొప్ప స్వేచ్ఛను ఇచ్చింది. ఎవరికి నచ్చిన రీతిలో వారు తమ దైవాన్ని కొలుచుకున్నారు. ఒకరు పుష్పాలతో పూజిస్తే, మరొకరు భక్తిగీతాలతో అర్చించారు. ఒకరు ఆలయం కట్టిస్తే, మరొకరు భగవంతునితో తాదాత్మ్యం చెంది పరవశించారు. ఒకరు భగవంతుడిని ఆత్మోద్ధారకుడిగా భావించి సేవిస్తే, మరొకరు ప్రాణనాథుడిగా తలచుకుని పులకరించారు. అందుకే భక్తి మార్గం సామాన్య ప్రజలను అంతగా ఆకట్టుకుంది. దీనిలో ప్రత్యేకమైన విధి విధానాలు అవసరం లేదు, జ్ఞాన వైరాగ్యాలతో, కర్మాది విధులతో పని లేదు. భక్తికి శుద్ధాంతఃకరణం ఉంటే చాలు. భక్తి మార్గం సన్యసించమని ప్రబోధించదు. గృహస్థ జీవితం గడుపుతూనే భగవంతుడిని చేరే మార్గాన్ని సూచిస్తుంది. ఈ ప్రపంచంలో ఉంటూనే దానికి దూరంగా ఉండటం, కర్మలు చేస్తూనే కర్మఫలత్యాగం చేయడం దీని ప్రధాన లక్షణం.

ఈ ఉద్యమంలో భాగంగా తమ పాశురాలతో విశిష్టాద్వైత మతావిర్భావానికి కారణమైన ఆళ్వారులగురించి ఇక్కడ సంగ్రహంగా పరిశీలిద్దాం.

### 1.2.1. ఆళ్వార్లు

విశిష్టాద్వైత మతానికి ఆళ్వారులు, ఆచార్యులు మూలస్తంభాలు. ఆళ్వారుల భక్తి గీతాలు, ఆచార్యుల సిద్ధాంత గ్రంథాలు విశిష్టాద్వైతానికి జీవనాడులు. ఆళ్వారులు విష్ణు భక్తులు. విష్ణువును మాత్రమే కీర్తించినవారు. అన్యదేవతారాధన చేయనివారు. భగవంతుని కల్యాణగుణానుభవంతో నిరంతరం తన్మయం చెందేవారు.

*యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీ మదూర్జితమేవవా ।*

*త త్తదే వావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:262 – [భగవద్గీత–10వ అధ్యాయం–41వ శ్లోకం])

‘ఐశ్వర్య యుక్తమైన, కాంతి యుక్తమైన మరియు శక్తి యుక్తమైన వస్తువులు నా తేజస్సుయొక్క అంశలే’ అని గీతాచార్యుడు చెప్పినట్లుగా ఆయన వస్తు వాహన సంచయమే ఆళ్వార్లుగా రూపాంతరం పొందిందని వైష్ణవుల నమ్మకం.

ఈ ఆళ్వార్లు పన్నెండుగురు. వారు

1. పొయ్ గై ఆళ్వారు
2. పూదత్తాళ్వారు
3. పేయాళ్వారు
4. తిరుమళిశై ఆళ్వారు
5. తిరుప్పాణాళ్వారు
6. తొండరడిప్పొడి ఆళ్వారు
7. తిరుమంగై ఆళ్వారు
8. కులశేఖరాళ్వారు
9. పెరియాళ్వారు
10. ఆండాళ్
11. నమ్మాళ్వారు
12. మధురకవి

ఆళ్వార్ల రచనలలో సమకాలీన అంశాల ప్రస్తావనను బట్టి వారు సుమారుగా 3-9 శతాబ్దులకు మధ్యవారని పరిశోధకులు తేల్చారు (Krishnaswami, Aiyangar. 1920:89). వీరిలో అన్ని వర్ణాల వారూ ఉన్నారు. వీరి గీతాల సంకలనాన్ని *నాలాయిర దివ్య ప్రబంధ*మని అంటారు. ఈ *నాలాయిర దివ్య ప్రబంధాన్ని* ద్రావిడ వేదంగా ప్రస్తుతిస్తారు. ఆళ్వార్ల రచనల ప్రభావం అన్నమయ్యపై కనిపిస్తుంది కనుక వీరి రచనలను సంగ్రహంగా చర్చించడం జరుగుతుంది.

### 1.2.1.1. ముదలాళ్వార్లు

మొదటి ముగ్గురు ఆళ్వార్లను (పొయ్ గై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు) ముదలాళ్వార్లని అంటారు. ఈ ముగ్గురు సమకాలికులు. ఈ ముప్పురూ కూడా అయోనిజులని, శ్రీహరి పాంచజన్యం (శంఖం), కౌమోదకం (గద), నందకం (ఖడ్గం) అంశలని భక్తుల విశ్వాసం. తమిళ వైష్ణవ వాఙ్మయం వీరితోనే ప్రారంభమైంది. వీరు రచించిన తలో నూరు పాశురాలు *ముదల్ తిరువందాది, ఇరండాం తిరువందాది, మూంద్రాం తిరువందాది*గా ప్రసిద్ధి పొందాయి. తిరు గౌరవ సూచకం. అందాది అంటే తెలుగులో ముక్తపదగ్రస్తం వంటి ఛందస్సు. మొదటి పాశురం చివరి పదంతో రెండవ పాశురం, రెండవ పాశురం చివరి పదంతో మూడవ పాశురం ఇలా ఒక్కొక్కరు నూరు పాశురాలను చెప్పారు. 'పొయ్ గై ఆళ్వారు మోక్ష మార్గాలలో భక్తి మార్గమే సులభతరమైనదని ప్రబోధించారు. శ్రీరంగనాథుడినిగురించి, తిరుమల వేంకటేశ్వరుడునిగురించి పాశురాలు పాడారు. పూదత్తాళ్వారు విష్ణువు వివిధ అవతారాలనుగురించి, భక్తి, శరణాగతి మొదలైన అంశాలనుగురించి గానం చేశారు. పేయాళ్వారు వేదశాస్త్రాలను మథించి వాటిలోని తాత్త్విక రహస్యాలను గేయాలుగా మలిచారు' (వరదాచార్యులు, ధనకుధరం. 1981:81,82). ఈ ముగ్గురి కీర్తనల తత్త్వాన్ని అన్నమయ్య తన కీర్తనలలో ప్రతిబింబించారు.

ముఖ్యంగా పేయాళ్వారు రచించిన ఈ కింది గీతాన్ని పరికిస్తే,

*సిరిఁగంటిఁ జెన్ను మించిన మేను గంటిఁ*

*గరమొప్పు వదనవికాసంబుఁ గంటి*

...

*సరసిజ హల శంఖ చక్రాంకుశాంక*

*చరణముల్ జగదేక శరణముల్ కంటిఁ*

*దరణిబింబముచాయఁ దరళించుకనక*

*సురుచిరాంశుకము నంశుకముఁ గన్గొంటి*

*...*

*జుట్టుఁగైదువు వలచుట్టుశంఖంబు*

*పట్టిచూపట్టిన బాహువు ల్గంటి*

*శాతాంశుమండల శతకోటికోటి*

*రీతిఁజూపట్టు కిరీటంబుఁగంటి*

(వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పెండ్యాల. 1928:45,46)

ఈ పాశురం ప్రభావం అన్నమయ్య కింది కీర్తనపై ఉన్నట్లు స్పష్టమవుతుంది.

*ఇప్పుడిటు కలగంటి నెల్ల లోకములకు–*

*నప్పఁడగు తిరువేంకటాద్రీశుఁ గంటి*

*...*

*శతకోటి సూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి*

*...*

*అనుపమమణిమయమగు కిరీటము గంటి*

*కనకాంబరము గంటి గక్కన మేలుకంటి*

*అరుదైన శంఖచక్రాదులిరుగడఁ గంటి*

*సరిలేని అభయహస్తము గంటిని*

*తిరు వేంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి* (1–38)

### 1.2.1.2. తిరుమళిశై ఆళ్వారు

తిరుమళిశై ఆళ్వారు సుదర్శనాంశతో జన్మించారని ప్రతీతి. తన జీవితకాలంలో ఎన్నో మహిమలను ప్రదర్శించినట్లుగా శ్రీవైష్ణవులు చెప్పుకుంటారు. శైవ, జైన, బౌద్ధ మతాలను ఆచరించి ఆఖరికి పరతత్త్వం వైష్ణవంలో ఉందని తెలుసుకున్నట్లుగా తిరుమళిశై ఆళ్వారు తన రచనలలో ప్రస్తావించారు. *నాన్ముగన్ తిరువందాది* (96) అంటే నాలుగవ తిరువందాది, *తిరుచ్ఛంద విరుత్తమ్* (120) అనే ప్రబంధాలను రచించారు. *తిరుచ్ఛంద విరుత్తమ్* లో విష్ణు పారమ్యాన్ని బోధిస్తూ, భగవానుని అపారమైన దయా గుణాన్నిగురించి కీర్తించారు. *నాన్ముగన్ తిరువందాది*లోకూడా విష్ణువును పరమదైవంగా ప్రస్తుతించారు. ఈ రచనలోని మొదటి పాశురంలోనే విష్ణువు బ్రహ్మను పుట్టించాడని, అటు తరువాత బ్రహ్మ శివుడిని పుట్టించాడని చెప్పి, కనుక విష్ణువే ఆదిదైవమనే సత్యాన్ని తాను తెలుసుకున్నానని అంటారు. విష్ణు పారమ్యాన్ని స్థాపిస్తూ, 'విష్ణు పాదోద్భవి అయిన గంగను తలపై దాల్చిన శివుడు, విష్ణువుకు సమానుడెలా అవుతా'దని ప్రశ్నిస్తారు తిరుమళిశై ఆళ్వారు (Premananda Kumar. 1994:19–20).

అన్నమయ్య కూడా తిరుమళిశై ఆళ్వారులాగే విష్ణు పారమ్యాన్ని బోధిస్తూ కీర్తనలను రచించారు.

*హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును*
*హరితో సరి వీరను టెట్లూ*
*పొరిఁ గొండలందుఁ బుట్టిన శిలలివి*
*వరుసఁ బెట్టితే సరియౌనా* (3–350)

'హరినుండి పుట్టిన బ్రహ్మ, శివుడు హరితో సమానులని ఎలా అంటారు? కొండనుండి పుట్టిన శిలలను కొండ పక్కనే వరసగా పెడితే, అవి కొండతో సమానమవుతాయా?'

*ఘనుఁ డీతనిపాదము గడిగె బ్రహ్మదేవుఁడు*

*మునుముట్టి శిరసున మోఁచె శివుఁడు*

*వొనర మూఁడుమూర్తులం దొకఁడు శ్రీవేంకటేశుఁ-*

*డనుమాట యిది తగవవునా లోకులకు* (2-18)

'విష్ణువు పాదాన్ని కడిగాడు బ్రహ్మదేవుడు. విష్ణు పాదతీర్థాన్ని తలపై దాల్చాడు శివుడు. మరి త్రిమూర్తులలో ఒకడు విష్ణువనే మాటలో న్యాయమేమైనా ఉందా?' అంటూ సరిగ్గా తిరుమళి శై ఆళ్వారులాగే, విష్ణువే అధికుడని ఉద్ఘాటించారు అన్నమయ్య.

### 1.2.1.3. తిరుప్పాణాళ్వారు

శ్రీవత్సాంసగా భావింపబడే తిరుప్పాణాళ్వారు మునివాహనుడిగా ప్రసిద్ధుడు. అహర్నిశం తంబురా మీటుతూ శ్రీరంగనాథుడిగురించి భక్తి శ్రద్ధలతో పాడుకునేవారు. తన భక్తి భావనతో, వినయ సంపదతో పురప్రవేశానికికూడా నోచుకోని కులంలో పుట్టినా, మునివాహనుడిగా శ్రీరంగనాథుడి మూలవిరాట్టుముందు నిలిచారు. శ్రీరంగనాథుడిని కన్నులార చూసి, పరవశించి, స్వామిని ఆపాదమస్తకం వర్ణిస్తూ 10 పాశురాల *అమలనాది పిరాన్* ను పాడారు. అన్నమయ్య సైతం శ్రీవేంకటేశ్వరుని ఆపాదమస్తకం వర్ణిస్తూ కీర్తనలు రచించారు.

*చూచి మోహించకుందురా సురలైన నరులైన*

*తాచి నీవు ముందరఁ బ్రత్యక్షమైనను*

*భాగీరథి పుట్టిన పాదపద్మములు*

*భోగపు మరుని జన్మభూమి నీ తొడలు*

*యోగపు నవబ్రహ్మలుండిన నీ నాభి*

*సాగరకన్యక లక్ష్మి సతమైన వురము*

*అందరి రక్షించేటి అభయహస్తము*

*కంద నసురులఁ జంపే గదాహస్తము*

*సందడి లోకముల యాజ్ఞాచక్రహస్తము*

*చెంది ధ్రువు నుతియించఁ జేయు శంఖహస్తము*

*సకల వేదములుండే చక్కని నీ మోము*

*వొకటై తులసిదేవి వుండేటి శిరసు*

*ప్రకటపు మహిమలఁ బాయని నీ రూపము*

*వెకలి శ్రీవేంకటాద్రి విభుఁడ నీ భావము* (2-403)

ఈ కీర్తనలో స్వామి పాదాలను, తొడలను, నాభిని, హృదయాన్ని, చతుర్భుజాలను, వదనాన్ని, శిరస్సును వర్ణించారు అన్నమయ్య.

### 1.2.1.4. తొండరడిప్పొడి ఆళ్వారు

వైజయంతి అంశతో పుట్టిన తొండరడిప్పొడి ఆళ్వారు తెలుగువారికి విప్రనారాయణుడిగా సుపరిచితమైన ఆళ్వారు. తొండరడిప్పొడి ఆళ్వారు శ్రీరంగనాథుడిని తప్ప ఇతర విష్ణు అవతారాలనుకూడా కీర్తించలేదు. శ్రీరంగడికి నిత్యం తులసిమాలాకైంకర్యం చేసేవారు. కాలాంతరంలో వేశ్య అయిన దేవదేవి పంతంవలన భ్రష్టుడైన తొండరడిప్పొడి ఆళ్వారు పశ్చాత్తాపపడి 10 పాశురాల *తిరుప్పళ్లి యెళుచ్చి* ప్రబంధాన్ని, 45 పాశురాల *తిరుమాలై* ప్రబంధాన్ని రచించారు. *తిరుప్పళ్లి యెళుచ్చి*లోని 10 పాశురాలలో భగవంతునికి మేలుకొలుపులు పాడారు. ఆత్మనివేదనా పూర్వకంగా రచించిన *తిరుమాలై*లో భాగవత భక్తి, భాగవతులతోడి సాంగత్యంయొక్క ప్రాధాన్యత మొదలైన అంశాలను పొందుపరిచారు. తిరుమాలై తెలియనివారికి నారాయణుడు తెలియడని తమిళంలో ఒక నానుడి.

*అడి మైయిల్ కుడి మైయిల్లా అయల్ శతుప్పేది మారిల్*

*కుడి మైయిల్ కడై మై పట్ట కుక్కరిల్ పిరప్ప రేలుం*

*ముడియినిల్ తుళపం వైత్తాయ్ మొయ్ కళర్కన్బుశెయ్యుం*

*అడియరై యుగత్తి పోలుం అరంగమానగరుళానే* (రఘునాథాచార్యులు, న. చ. 1992:163 – [తిరుమాలై–39వ పాశురం])

'శ్రీ రంగనాథా! నీ సేవమీద ఆసక్తి లేనివారైన చతుర్వేద పారంగతులైన బ్రాహ్మణులకంటే తక్కువ కులంలో జన్మించినవారైనా నీ దివ్యపాదారవిందాలకు భక్తితో కైంకర్యం చేసే భాగవతులను నువ్వు ఎక్కువగా ఆదరిస్తావు. వారిని తులసిమాలతో సమానంగా మన్నించి సంతోషిస్తావు గదా!' అంటూ భక్తి లేని సకల వేదపారంగతుడైన బ్రాహ్మణుడికంటే భక్తుడైన అంత్యకులజుడే పవిత్రుడని *తిరుమాలై* లో ఉద్ఘాటించారు తొండరడిప్పొడి ఆళ్వారు. సరిగ్గా ఇవే భావాలను అన్నమయ్య కూడా తన కీర్తనలలో వ్యక్తీకరించారు.

*ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన*

*నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు*

*వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి*

*యాచరించని సోమయాజికంటె*

*యేదియునులేని కులహీనుఁడైనను విష్ణు*

*పాదములు సేవించు భక్తుఁడే ఘనుడు* (1–318)

'అగ్రకులంలో పుట్టినవాడైనా, హీనకులంలో పుట్టినవాడైనా సత్యం తెలుసుకున్నవాడే గొప్పవాడు. హరిభక్తిలేని వేదపారంగతుడైన బ్రాహ్మణుడి కంటే హరిభక్తి కలిగిన కులహీనుడే గొప్పవాడు.'

*తిరుప్పళ్లి యెళుచ్చి లో*

*అన్దర త్తమరర్ గళ్ కూట్టజ్గళ్ ఇవైయో? అరున్దవముని వరుం మరుదరుం ఇవరో?*

*ఇన్దిర నానైయుం తానుం వన్దివనో? ఎమ్బెరుమాన్! ఉనకోయిలిన్ వాశల్*

*శున్దరర్ నెరుక్క విచ్చాదరర్ నూక్క ఇయక్కరుం మయజ్గినర్ తిరువడిత్తొళువాన్*

*అన్దరం పారిడ మిల్లై మత్తిదువో? అరజ్గత్తమ్మా! పళ్లియెళున్దరుళాయే* (రాఘవన్, టి. కె. వి. 2017:14,15 – [తిరుప్పళ్లి యెళుచ్చి-7వ పాశురం])

'స్వామీ! నీ గుడి ముంగిట ఇంద్రుడు తన వాహనమైన ఐరావతంతో నిలిచి ఉన్నాడు. బ్రహ్మాండంలోని దేవతలంతా సపరివారంగా వచ్చి ఉన్నారు. అఖండ తపోధనులైన సనకాదులు, మరుద్గణములు, విద్యాధరులు సందడింపగా యక్షులు సైతం నీ పాదసేవకై పరవశులై ఉన్నారు. కదలడానికి, మెదలడానికి భూమ్యాకాశాలలో ఎక్కడా అవకాశమే లేదు. రంగనాథా! మేలుకో' అంటూ పాడిన మేలుకొల్పు ప్రభావం కింది అన్నమయ్య కీర్తనపై కనిపిస్తుంది.

*విన్నపాలు వినవలె వింత వింతలు*
*పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా*

*తెల్లవారె జామెక్కె దేవతలు మునులు*
*అల్లనల్ల నంతనింత నదివో వారె*
*చల్లని తమ్మిరేకుల సారస్యపుఁ గన్నులు*
*మెల్ల మెల్లనె విచ్చి మేలుకొనవేలయ్యా*

*గరుడకిన్నరయక్ష కామినులు గములై*
*విరహపు గీతముల వింతతాళాల*
*పరిపరివిధములం బాడేరు రాగాల నిన్నదివో*

*సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా*

*పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు*

*పంకజభవాదులు నీ పాదాలు చేరి*

*అంకెల నున్నారు లేచి అలమేలుమంగను*

*వేంకటేశుఁడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా* (6-25)

'తెల్లవారింది. దేవతలు, మునులు నీ దర్శనానికై వస్తున్నారు. గరుడుడు, కిన్నరులు, యక్షులు గుంపులుగా వచ్చి నీకు సేవచేయడానికి సిద్ధంగా ఉన్నారు. శేషుడు, తుంబురుడు, నారదుడు, బ్రహ్మ దేవుడు మొదలైనవారంతా నీ పాదాల దగ్గరే వేచి ఉన్నారు. ఇకనైనా మేలుకో' అంటూ మేలుకొలుపు పాడారు అన్నమయ్య.

### 1.2.1.5. తిరుమంగై ఆళ్వారు

విష్ణువు ధనస్సైన శార్ఙ్గం అవతారంగా భావింపబడే తిరుమంగై ఆళ్వారు నాలాయిర దివ్య ప్రబంధంలో అందరి కంటే ఎక్కువ పాశురాలు రాసిన మహాభక్తుడు, గొప్ప కవి. ఆయన రచనలు *తిరుమొళి, తిరుక్కురుందాండగమ్, తిరునెడుందాండగమ్, శిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్, తిరువెళక్కూత్తిత్తిరుక్కై*. అనేక విష్ణు క్షేత్రాలను దర్శించి ఆయా దేవతామూర్తులపై పాశురాలను గానం చేసిన తిరుమంగై ఆళ్వారు శ్రీరంగ క్షేత్రం వచ్చి, దీనావస్థలో ఉన్న శ్రీరంగనాథుని ఆలయాన్ని ఉద్ధరించారు. మొదట రాజుకు సేనాధిపతిగా, నగర పాలకుడిగా ఉన్న తిరుమంగై ఆళ్వారు, దైవ కైంకర్యం కోసం తన సమస్త సంపదను, పదవులను త్యాగం చేసి, చివరకు దారులు కొట్టి మరీ శ్రీరంగనాథాలయాన్ని నిర్మించారు. పరకాలుడన్న నామాంతరం కల తిరుమంగై ఆళ్వారు అన్యమతాలను నిరసించారు. విశేషించి హరి నామ మహిమనుగూర్చి కీర్తించారు. నారాయణ నామం సకల సంపదలను ఇస్తుందని,

భక్తుల కష్టాలను, దుఃఖాలను నిర్మూలిస్తుందని ప్రబోధించారు (వరదాచార్యులు, ధనకుధరం. 1984:13). అన్నమయ్య కూడా అనేక కీర్తనలలో నామ మహిమనుగూర్చి స్తుతించారు.

*చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు*
*చాలదా హితవైన చవులెల్ల నొసఁగ*

*ఇదియొకటి హరినామ మింతైనఁ జాలదా*
*చెదర కీజన్మముల చెఱలు విడిపించ*
*మది నొకటె హరినామమంత్ర మది చాలఁదా*
*పదివేలు నరకకూపముల వెడలించ*
*కలదొకటి హరినామ కనకాద్రి చాలదా*
*తొలఁగుమని దారిద్ర్యదోషంబు చెఱుచ*
*తెలివొకటి హరినామ దీపమది చాలదా*
*కలుషంపు కఠినచీఁకటి పారఁద్రోల* (1-52)

'జన్మబంధాలను తొలగించేది, నరకకూపాల బారిన పడకుండా కాపాడేది, సంపదలను ఇచ్చేది హరినామం' అంటూ నామమహిమను కీర్తించారు అన్నమయ్య.

### 1.2.1.6. కులశేఖరాళ్వారు

కులశేఖరాళ్వారు కౌస్తుభాంశతో జన్మించారని భక్తుల విశ్వాసం. చేరరాజయిన కులశేఖరాళ్వారు గొప్ప రామ భక్తుడు. సంస్కృతంలో *ముకుందమాలను* రచించారు. ఇది సంస్కృత సాహిత్యంలో గొప్ప పేరు పొందిన రచన. తమిళంలో *పెరుమాళ్ తిరుమొళి* అనే పేరుతో 105 గేయాలు రచించారు. రామ కథను వర్ణిస్తూ ఒక దశకం, తనను దశరథుడిగా భావించుకుంటూ రాముడి వియోగానికి విలపిస్తూ ఓ దశకం, రాముడికి జోల పాడుతూ ఒకటి,

గోపికలలాగ మధురభక్తిని ప్రదర్శిస్తూ ఒక దశకం ఇలా పది దశకాల్లో భక్తి భరితమైన గేయాలను రచించారు.

*పెరుమాళ్ తిరుమొళి* నాలుగవ దశకంలో, తిరుమలకొండ పై పక్షి రూపంలోకాని, చేపగాకాని, వృక్ష రూపంలోకాని, కొండశిఖరంలాకాని, లేక గుడిమెట్టుగానైనా పుట్టాలని వేడుకుంటూ పాశురాలు రచించారు (నాగేశ్వరశర్మ, ఇంద్రగంటి. 1994:26). అన్నమయ్య సైతం ఇదే భావాన్ని వెలిబుచ్చారు.

*కీటమై వేంకటగిరి కిందనైన నుండక యీ చేటువాటుకేల నోఁచె చెల్లఁబో ప్రాణి* (1-299) – 'వేంకటాచలంపై ఒక పురుగుగానైనా ఉండడమే నయ'మంటారు అన్నమయ్య.

*త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య*
*భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ!* (కొండమాచార్యులు, ముదివర్తి.
1993:122 – [ముకుందమాల-27వ శ్లోకం])

కులశేఖరాళ్వారు *ముకుందమాల* లో, 'ఓ స్వామీ! నీ సేవకుడికి సేవకుడు, అతడికి సేవకుడు అంటూ సాగే సేవకుల పరంపరలో నన్ను చివరి సేవకుణ్ణిగా భావించు' అని అంటారు. కులశేఖరాళ్వారు ప్రభావం ఈ కింది అన్నమయ్య కీర్తనలపై సుస్పష్టం.

*కందువ శ్రీవేంకటేశ కదు నీ బంటుబంటుకు సందడిబంట నవుటే చాలదా నాకు* (3-23)
*పట్టి నీదాసుల బంటుబంట నయ్యేనిఁకను* (3-51)

### 1.2.1.7. పెరియాళ్వారు

విష్ణుచిత్తుడిగా నామాంతరం కలిగిన పెరియాళ్వారు కథను *విష్ణుచిత్తీయం* పేరుతో శ్రీకృష్ణదేవరాయలు కావ్యంగా మలిచారు. గరుడుని అంశగా సంభావింపబడే పెరియాళ్వారు శ్రీరంగనాథునికి అనునిత్యం పుష్పమాలా కైంకర్యం చేసేవారు. పాండ్యరాజైన మత్స్యధ్వజుడు మోక్షప్రదమైన పరతత్త్వమేదో తెలుసుకోగోరి ఏర్పాటు చేసిన పండితగోష్ఠిలో, పెరియాళ్వారు

పండితులనందరినీ వాదంలో ఓడించి, విష్ణువే పరదైవమని స్థాపించి, రాజును వైష్ణవుడిగా మార్చారని *ఆముక్తమాల్యద* అన్న పేరుతో ప్రసిద్ధి పొందిన *విష్ణుచిత్తీయం* చెబుతోంది. 12 పాశురాలతో *తిరుప్పల్లాండు* రచించి భగవంతుడికి దిష్టి తగలకుండా మంగళాశాసనం చేశారు పెరియాళ్వారు.

*పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయి రత్తాణ్డు పలకోడి నూఱాయిరమ్*

*మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా! ఉన్ శేవడి శెవ్వితిరుక్కాప్పు* (రాఘవన్, టి. కె. వి. 2017:5 – [తిరుప్పల్లాండు-1వ పాశురం])

'మల్లయోధులను జయించిన దృఢమైన భుజములు కలిగిన ఓ మణివర్ణుడా, అనేక వేల సంవత్సరములు, ఎర్రనైన నీ దివ్యపాదాలకు రక్ష కలుగు గాక!' పరమాత్ముని ఎదపై నివసించే మంగతాయారుకు కూడా మంగళాశాసనం చేశారు.

*వడివాయ్ నిన్ వలమార్బినిల్ వాళ్ గిన్ఱమంగైయుం పల్లాణ్డు!* (రాఘవన్, టి. కె. వి. 2017:5 – [తిరుప్పల్లాండు-2వ పాశురం])

'నీ వక్షమున కుడిప్రక్క నిలిచియుండు శ్రీమహాలక్ష్మియు వేల సంవత్సరములు వర్ధిల్లుగాక!'

*పల్లాణ్డు* లేక *పల్లాండు* అనేది తమిళ పదం. దీనికి వర్ధిల్లమని దీవించినట్లు అర్థం చెప్పుకోవచ్చు. పెరియాళ్వారు *తిరుపల్లాండులో పల్లాండు పల్లాండు పల్లాయి రత్తాండు* అంటూ మంగళాశాసనం మొదలుపెడితే, అన్నమయ్య సైతం అదే పదాన్ని ఉపయోగిస్తూ లక్ష్మీనారాయణులకు మంగళం కలగాలని గానం చేశారు.

*గుట్టునఁ గోరికలెల్లఁ గొల్లవట్టీ నీ-*
*పట్టపుదేవికి నీకుఁ బల్లాండు పల్లాండే*

*పచ్చల సందిదండలు బాహుపురులు మెరయ*
*నెచ్చెలిపై మేను సోఁక నిలుచుండి*
*పచ్చవిలుకానితల్లి బంగారు దోసిట నీపై*

*బచ్చుకప్పురము చల్లీఁ బల్లాండు పల్లాండే* (5–188)

ఇంతే కాక, చాలా కీర్తనలలో అన్నమయ్య స్వామికి, అమ్మవారికి మంగళాశాసనం చేశారు.

*జయమంగళము నీకు సర్వేశ్వరా*
*జయమంగళము నీకు జలజవాసినికి* (2–431)

*మరలి మరలి జయమంగళము*
*సొరిది నిచ్చలును శుభమంగళము*
*కమలారమణికిఁ గమలాక్షునకును*
*మమతల జయజయమంగళము*
*అమరజననికిని అమరవంద్యునకు*
*సుముహూర్తముతో శుభమంగళము* (1–448)

విష్ణుచిత్తుని మరో రచన 461 పాశురాలు గల *పెరియాళ్వార్ తిరుమొళి.* ఈ గ్రంథంలో తాను యశోదగా తన్మయత్వం చెంది, అప్పుడే పుట్టిన బాలకృష్ణుడిని చూసి సంబరాలు చేసుకుంటారు, కృష్ణుడిని నఖశిఖపర్యంతం వర్ణించి మురిసిపోతారు. కృష్ణుడికి జోల పాడి నిద్రపుచ్చుతారు. కృష్ణుడితో ఆడుకోవడానికి చందమామను ఆహ్వానిస్తారు. చిన్ని కన్నయ్యకు స్నానం చేయిస్తానని పిలుస్తారు, తలదువ్వి, పూలతో అలంకరిస్తారు, దిష్టి తీస్తారు. చిన్ని కృష్ణుడి తప్పటడుగులు చూసి ఆనందిస్తారు. దోబూచులాడతారు. అలసిపోయాడని తన చనుబాలు తాగమని బ్రతిమాలుకుంటారు. బాలకృష్ణుని అల్లరి పనులకు మురిసిపోతారు. అన్నమయ్య కూడా యశోదగా మారి వాత్సల్యరస పూరితమైన భక్తిని చూపించారు.

*కానరటె పెంచరటె కటకటా బిడ్డలను*
*నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని*

*బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును*

*చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు*

*మీయిండ్లు జతనాలు మీరు సేసికొనక*

*పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని*

*మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ*

*ఆసపడకుందురా ఆడేబిడ్డలు*

*వోసరించి మోసపోక వుండలేక మీరు*

*సేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని* (5-253)

'బయటే పెట్టి వదిలేసిన పాలు వెన్నలలో చేయి పెట్టకుండా ఉంటారా చిన్న పిల్లలు? ముంగిట్లోనే పెట్టి ఉంచిన పెరుగుపై ఆశపడకుండా ఉంటారా ఆడుకునే పిల్లలు' అంటూ కృష్ణుడి అల్లరిపనులను యశోదగా మారి వెనకేసుకొస్తారు అన్నమయ్య.

అన్నమయ్య *చందమామ రావో జాబిల్లి రావో* పాటకు కూడా పెరియాళ్వార్ *తిరుమొళి* లో *తన్మకత్తు* అనే దశకంలోని చందమామను రమ్మని పిలిచే పాటలే స్ఫూర్తి కావచ్చు.

### 1.2.1.8. ఆండాళ్

పన్నిద్దరు ఆళ్వార్లలో ఏకైక స్త్రీమూర్తి అయిన ఆండాళ్‌ను భూదేవి అవతారంగా భక్తులు పూజిస్తారు. ఆండాళ్ పెరియాళ్వార్ పెంచుకున్న బిడ్డ. తులసివనంలో దొరుకుతుంది. ఆమె మరో పేరు గోదాదేవి. చిన్ననాటి నుండి తండ్రి కృష్ణుడి లీలలను వివరిస్తూ ఉంటే, వింటూ పెరిగిన గోదాదేవి తనను గోపికగా, శ్రీకృష్ణుడిని తన భర్తగా ఊహించుకుని పరవశించిపోయేవారు. శ్రీరంగేశుడే తన పతిగా రావాలని కాంక్షిస్తూ, అలనాడు గోపికలు ఆచరించిన కాత్యాయనీ వ్రతాన్ని 30 పాశురాల *తిరుప్పావై* పాడుతూ ఆచరించారు. *తిరుప్పావై*లో తనను గోపికలలో ఒకతెగా భావించుకుని కృష్ణుని కోసం కాత్యాయినీ వ్రతాన్ని చేయదానికి పూనుకుంటారు. ఈ వ్రతానికై ధనుర్మాసంలో తెల్లవారుఝామునే లేచి, తోటి

గోపికలను నిద్ర లేపి, అంతా కలిసి శ్రీకృష్ణుడి ఇంటికి వెళ్ళి స్తోత్రాలతో స్వామి నిద్ర లేపి, ఏడేడు జన్మాలకు స్వామి సేవను ప్రసాదించమని కోరతారు. *తిరుప్పావై* అనంతర కాలంలో వైష్ణవ భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన రచనగా నిలిచిపోయింది. ఇప్పటికీ ధనుర్మాసంలో వైష్ణవాలయాలలో నిత్యం *తిరుప్పావై* పాడుతూ భగవదారాధన చేస్తారు. గోదాదేవి మరొక రచన *నాచియార్ తిరుమొళి*. ఈ రచన నిండా మధురభక్తి తొణికిసలాడుతూ ఉంటుంది. గోదాదేవి కథను *ఆముక్తమాల్యద*లో కృష్ణదేవరాయలు విపులంగా వర్ణించారు. చూడుకొడిత్త నాచ్చియార్ అనబడే గోదాదేవిని లక్ష్మీదేవిగా కీర్తిస్తూ అన్నమయ్య అనేక కీర్తనలను రచించారు.

*చూడరమ్మ సతులాల సోబానఁ బాడరమ్మ*
*కూడున్నది పతిఁ జూడికుడుతనాచారి*

*శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు*
*కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు*
*సోముని తోఁబుట్టువట సొంపుఁ గళల కేమరుదు*
*కోమలాంగి యీ చూడికుడుతనాచారి*

*కలశాబ్ధికూఁతురట గంభీరాల కేమరుదు*
*తలఁప లోకమాతయట దయ మరి యేమరుదు*
*జలజనివాసియట చల్లఁదన మేమరుదు*
*కొలఁదిమీర యీ చూడికుడుతనాచారి*

*అమరవందితయట అట్టె మహి మేమరుదు*
*అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు*
*తమితో శ్రీవేంకటేశుఁ దానె వచ్చి పెండ్లాడె*
*కొమెరవయసు యీ చూడికుడుతనాచారి* (26-246)

### 1.2.1.9. నమ్మాళ్వారు

విష్వక్సేనుని అంశగా భక్తులు సంస్మరించుకునే నమ్మాళ్వారు ఆళ్వారులందరిలో ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించారు. నాలాయిర దివ్య ప్రబంధంలోని నాలుగువేల పాశురాల్లో ఆయనవే వేయికి పైచిలుకు ఉన్నాయి. పరాంకుశముని, శఠకోపముని అనే నామాంతరాలు కలిగిన నమ్మాళ్వారు రచించిన *తిరువాయిమొళి* వైష్ణవులకు అత్యంత పవిత్రమైన గ్రంథం. *తిరువాయిమొళిలో* తిరుమంత్రార్థం, చరమశ్లోకార్థం, తత్త్వత్రయం, ద్వయమంత్రార్థం మొదలైన శ్రీవైష్ణవ ప్రధానమైన విషయాలన్నీ వివరింపబడటంవలన దీనిని దీర్ఘశరణాగతి అని, భగవద్విషయమని, సామవేదసారమని అంటారు (రామానుజాచార్యులు, మాడభూషి. 1950:ii,iii). దీనిలో 1102 పాశురాలున్నాయి. *తిరువిరుత్తమ్, పెరియ తిరువందాది, తిరువాశిరియమ్* ఆయన ఇతర రచనలు. నమ్మాళ్వారు నాలుగు రచనలూ చతుర్వేదాలుగా ప్రసిద్ధి పొందాయి.

ముఖ్యంగా *తిరువాయిమొళి* ప్రాశస్త్యాన్ని గురించి అన్నమయ్య అనేక కీర్తనలలో పేర్కొన్నారు. ఈ కింది కీర్తనలో *తిరువాయిమొళిని* (*తిరువాయిమొళికి* వికృతి తిరువాముడి) కీర్తించడాన్ని గమనించవచ్చు.

*కలియుగంబునకుఁ గలదిదియే*
*వెలసిన పంచమవేదమె కలిగె*
*పరమగు వేదము బహుళము చదివియు*
*హరి నెరిఁగిన వారరుదనుచు*
*తిరువాముడియై దివ్యమంత్రమై*
*వెలసిన పంచమ వేదమె కలిగె* (4-591)

నమ్మాళ్వార్ *తిరువిరుత్తమ్* పాశురాలలోని ప్రధాన వస్తువు మధురభక్తి. నమ్మాళ్వారు తనను నాయికగా భావించుకుని, ప్రియుడైన శ్రీకృష్ణుడిపై విరహంతో ఎన్నో పాశురాలను రచించారు (వరదాచార్యులు, ధనకుధరం. 1981:84). నమ్మాళ్వారు మధురభక్తి పాశురాలు అన్నమయ్య కీర్తనలను ప్రభావితం చేశాయనటంలో సందేహం లేదు. ఉదాహరణకు, ఈ కింది కీర్తనలో అన్నమయ్య తనను నాయికగా భావించుకున్న తీరును గమనించవచ్చు.

*చతురుండని నా సరసతలూ*
*ఇతరము లైనవి యేమి సేతురా*

*చెనకుచు నీవు నాకు సేసిన మేలు*
*పెనఁగొని మతిలోఁ బెరిగేని*
*మనసు తమకమై మదనతాపమయి*
*యెనలేని విభుఁడ యేమి సేతురా*

*కదలు నీ మురిపపుంగన్నుల నగవు*
*పొదలుచు నామతిఁ బొలసీని*
*చెదరని యలపై చింతారతియై*
*హృదయము రేఁచి నేమిసేతురా* (5-138)

'ఇంతకుముందు నువ్వు చేసిన పనులు నన్ను నిలవనీక నా మనసులో పరితాపాన్ని కలిగిస్తూ మోహాన్ని పెంచుతున్నాయి. అందమైన నీ కన్నులతో నువ్వు నవ్వే నవ్వు నా మనసంతా నిండిపోయి కలచివేస్తోంది. నేనేం చేయాలి?' అంటూ శ్రీవేంకటేశ్వరునిపై విరహాన్ని ప్రకటించారు అన్నమయ్య.

నమ్మాళ్వారు తిరుపతితో సహా అనేక పుణ్యక్షేత్రాలను తన పాశురాలలో కీర్తించారు. పచ్చని పచ్చికతో, సెలయేళ్ళతో, ప్రకృతి సౌభాగ్యంతో విలసిల్లే తిరుమల కొండను విశేషంగా వర్ణించారు (వేదవ్యాస. 2001:128). అన్నమయ్య కూడా తన కీర్తనలలో తిరుమల కొండను వర్ణించారు.

*కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ*

*తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ*

*వేదములే శిలలై వెలసినది కొండ*

*యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ*

*గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ*

*శ్రీదేవుఁడుండేటి శేషాద్రి యీ కొండ* (3-471)

'సాక్షాత్తుగా వైకుంఠమే అంటే వైకుంఠవాసులంతా వచ్చి నివాసమేర్పరుచుకున్న కొండ, వేదాలు రాళ్ళుగా వెలసిన కొండ, పుణ్యరాసులే ఏరులుగా పారిన కొండ, శ్రీనాథుడు ఉండే కొండ' అంటూ తిరుమల కొండను ఈ కీర్తనలో అన్నమయ్య కీర్తించారు. ఈ కొండపై మహిమలన్నీ రాశిగా పోగుపోసి ఉన్నాయంటారు అన్నమయ్య.

### 1.2.1.10. మధురకవి

పన్నిద్దరు ఆళ్వార్లలో మధురకవి ఒక్కరే విష్ణువును కాక తన గురువైన నమ్మాళ్వారును కీర్తిస్తూ గేయాలను రచించినవారు. 11 పాశురాలతో రచించిన *కణ్ణినుణ్ శిరుత్తాంబు*లో తన గురువైన నమ్మాళ్వారును ప్రస్తుతించారు. తన గురువును దైవంగా భావించి ఈ పాశురాలలో కీర్తించారు మధురకవి (వరదాచార్యులు, ధనకుధరం. 1981:88).

ఆళ్వార్ల *నాలాయిర దివ్య ప్రబంధ* గేయాలు అనంతర కాలంలో వైష్ణవుల నిత్య పారాయణలో భాగమయ్యాయి. శ్రీవైష్ణవానికి సైద్ధాంతిక భూమికను ఇచ్చాయి. అన్నమయ్య

అహోబిల మఠాధిపతి ఆదివన్ శఠకోప యతీంద్రుల దగ్గర సకల వేదాంత పఠనం చేసినట్లు అన్నమాచార్య చరిత్ర వివరిస్తోంది (రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 2001:33). వేదాంత పఠనం అంటే ద్రావిడ వేదమైన ఆళ్వారుల దివ్య ప్రబంధ గీతాలు మొదలుగా గల విశిష్టాద్వైత గ్రంథాలనే అన్నమయ్య అధ్యయనం చేశారు. అందుకు అనుగుణంగా అన్నమయ్య చాలా తావులలో ఆళ్వార్లను అనుసరించినట్లుగా కనపడుతుంది. తెలుగులో పదకవితలకు ఆద్యుడు అన్నమయ్యే అయినా జానపద బాణీలలో రచన చేయటం భక్తి ఉద్యమ కాలపు సంప్రదాయం, ఆళ్వార్లు నడిచిన మార్గం. అదే బాటలో వెళ్ళారు అన్నమయ్య. అలాగే, ప్రజాహితమైన భాషా ప్రయోగం, మధుర భక్తికూడా ఆళ్వార్లు చూపిన దారే!

అన్నమయ్య తన కీర్తనలలో ఆళ్వారులను ప్రస్తుతించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు:

*వాఁడె వేంకటేశుఁడనేవాఁడె వీఁడు*
*వాఁడి చుట్టుఁగైదువవలచేతివాఁడు* అన్న కీర్తనలో
*కారిమారసుతుని చక్కని మాటలకుఁ జొక్కి*
*చూరగా వేదాలగుట్టు చూపినవాఁడు*
*తీరని వేడుకతో తిరుమంగయాళువారి*
*ఆరడి ముచ్చిమి కూటి కాసపడ్డవాఁడు*

*పెరియాళువారి బిడ్డ పిసికి పైవేసిన*
*విరుల దండల మెడవేసినవాఁడు*
*తరుణి చేయి వేసిన దగ్గరి బుజము చాఁచి*
*పరవశమై చొక్కి పాయలేని వాఁడు* (1–121)

'కారిమారసుతుడు అంటే నమ్మాళ్వారు కీర్తనలకు లొంగి, వేదసారమంతా ఉపదేశించాడు హరి. తిరుమంగై ఆళ్వారు దొంగతనాలు చేసి శ్రీరంగనాథాలయాన్ని నిర్మించాడంటారు. అలా

దొంగసొమ్ముకు ఆశపడ్డాడు స్వామి. పెరియాళ్వారు బిడ్డ గోదాదేవి తాను వేసుకుని నలిపేసిన పూలదండను ఆదరణతో ధరించాడు' అంటూ ఈ కీర్తనలో నమ్మాళ్వారుని, తిరుమంగై ఆళ్వారుని, పెరియాళ్వారుని, ఆండాళుని ప్రస్తుతించారు అన్నమయ్య.

అలాగే, *హరియవతారమె ఆతఁ డితఁడు* అన్న కీర్తనలో తనను ఆళ్వారుల తేజంగా అభివర్ణించుకున్నారు.

*చరియించు నొకవేళ సనకాదిమునులలో*
*హరిఁ బాడుఁ దాళ్ళపాకఅన్నమయ్య*
*తిరమై యాళువారల తేజము దానైయుండు*
*గరుడానంత ముఖ్య ఘనులసంగడిని* (4-192)

విశిష్టాద్వైత మతంలో ఆళ్వార్ల తరువాత అంతటి ప్రముఖమైన స్థానాన్ని సంపాదించుకున్నవారు ఆచార్యులు. ఆళ్వార్లు ప్రబోధించిన విష్ణు భక్తికి ఆచార్యులు శాస్త్రీయతను జోడించి, శ్రీవైష్ణవానికి మతంగా ప్రాచుర్యం కల్పించారు.

### 1.2.2 ఆచార్యులు

### 1.2.2.1. నాథముని

అన్నమయ్య 32 వేల కీర్తనలు రచించినట్లుగా తాళ్లపాక చిన్నన్న తెలిపారు (రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 2001:49). ఆ కీర్తనలనన్నింటిని రాగిరేకుల మీద చెక్కించిపెట్టారు. అంత భద్రంగా దాచినా వాటిలో ఈ నాటికి లభ్యమవుతున్నవి 15వేలు మాత్రమే. మరి అలా రాగిరేకుల మీద చెక్కించి ఉండకపోయి ఉంటే ఈనాటికి ఎన్ని విస్మృతమై, చేజారిపోయేవో చెప్పలేం. మౌఖికమైన జానపద సాహిత్యం ప్రజల నాలుకలపై తప్ప చరిత్ర పుటలకెక్కి తరతరాలుగా నిలిచి ఉన్న సంఘటనలు తక్కువే. అందుకే దాన్ని అనాదృత సాహిత్యం అన్నారు. అటువంటిది పన్నెండు వందల సంవత్సరాలకు పూర్వం, మౌఖిక

సాహిత్యంగా ప్రవర్తిల్లిన గేయాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయంటే అది వాటిని సేకరించి, సంకలనపరచి, తరువాతి తరాలకు అందించిన వారి ఘనతగానే భావించాలి. ఆ ఘనకార్యాన్ని సాధించినవారు నాథముని. గొప్ప వైష్ణవ భక్తుడైన నాథముని ఉత్తర, దక్షిణ దేశాల్లోని వైష్ణవ క్షేత్రాలన్నిటిని దర్శించి, ఒక చోట నమ్మాళ్వారుల గేయాన్ని భక్తుల నోట విని, ఆ గేయపు మాధుర్యానికి, భావ సౌందర్యానికి, కవితా వైభవానికి పరవశించి, అటువంటివి ఇంకా వినాలనే కోరికతో ఆళ్వారులు నడయాడిన ప్రదేశాలన్నీ తిరిగి, వాటిని సేకరించి, నాలుగువేల పాటల సంకలనంగా *నాలాయిర దివ్య ప్రబంధాన్ని* కూర్చారు. అంతటి మహత్తరమైన ప్రయత్నంవల్లే శ్రీవైష్ణవానికి అమూల్యమైన సాహిత్య సంపద సమకూరింది. విశిష్టాద్వైత సంప్రదాయంలో మొట్ట మొదటి ఆచార్యులు నాథముని. '*నాలాయిర దివ్య ప్రబంధ* సారంగా ప్రపత్తి సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఘనతకూడా నాథమునికే దక్కుతుంది (వరదాచార్యులు, ధనకుధరం. 1984:187).'

### 1.2.2.2. యామునాచార్యులు

విశిష్టాద్వైతంగా ప్రవర్తిల్లిన శ్రీవైష్ణవ సిద్ధాంతాలకు రామానుజాచార్యులవల్ల విశేష ప్రాచుర్యం లభించినా, ఆ సిద్ధాంతాలకు తొలి రూపం కల్పించింది మాత్రం యామునాచార్యులు. యామునుడు నాథముని పౌత్రుడు. యామునుని కథ *ఆముక్తమాల్యదలో* కనిపిస్తుంది. యామునుడు చిన్ననాట తాతగారైన నాథమునుల ప్రశిష్యుడు శ్రీరామమిశ్రునివద్ద వేదాధ్యయనం చేస్తాడు. తరువాత కాంచీ నగరంలో మహాభాష్యభట్టు అనే గురువువద్ద శాస్త్రవిద్యను అభ్యసిస్తూ ఉంటాడు. ఆ సమయంలో, పండితులందరి వద్ద కప్పాలు వసూలు చేస్తున్న చోళరాజ ఆస్థాన పండితుడైన విద్వజ్జన కోలాహలుడనే పండితుడిని వాదంలో ఓడించి, చోళరాజు అర్ధ రాజ్యాన్ని కైవసం చేసుకుంటాడు. రాజ్యాన్ని పరిపాలిస్తూ, రాజకీయ వ్యవహారాల్లో తలమునకలై ఉంటాడు. యౌగిక సామ్రాజ్యాన్ని పరిపాలించవలసిన వ్యక్తి

లౌకికమైన రాజభోగాల్లో చిక్కుకుపోయాడని బాధపడ్డ శ్రీరామమిశ్రుడు, ఉపాయంతో యామునుడిని వైష్ణవ సంప్రదాయం వైపుకు మళ్ళిస్తాడు. తన పరమ గురువు, యామునుడి తాతగారు అయిన నాథమునులు బోధించమని చెప్పిన వైష్ణవ తత్త్వాలను యామునుడికి ఉపదేశిస్తాడు. యామునుడి పూర్వీకులు దాచి ఉంచిన పెన్నిధిగా శ్రీరంగనాథుడి పాదపద్మాలను చూపించి, వాటిని ఆశ్రయించవలసిందిగా బోధిస్తాడు.

తన కర్తవ్యమేమిటో తెలుసుకున్న యామునుడు రాజ్యత్యాగం చేసి, సన్యాసం స్వీకరించి, శ్రీరంగక్షేత్రంలో శ్రీరంగనాథస్వామి ఆలయానికి దగ్గరలోనే ఆశ్రమాన్ని ఏర్పాటుచేసుకుని, శ్రీవైష్ణవ మతానికి ఆధారభూతమనదగ్గ గ్రంథాలనెన్నిటినో రచించి యామునాచార్యులుగా దేశవ్యాప్తమైన కీర్తిని సంపాదించాడు.

యామునాచార్యులు రచించిన గ్రంథాలు: 1. *శ్రీస్తుతి* 2. *స్తోత్రరత్నం* 3. *గీతార్థ సంగ్రహం* 4. *ఆగమ ప్రామాణ్యం* 5. *సిద్ధిత్రయం*.

*శ్రీస్తుతి*లో లక్ష్మీస్తోత్రపరమైన నాలుగు శ్లోకాలు ఉన్నాయి. అందుచేతనే దీన్ని చతుశ్శ్లోకి అన్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో లక్ష్మీదేవికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. లక్ష్మీదేవి నారాయణుడి నుండి వేరు కాదు. లక్ష్మీనారాయణులు అవిభాజ్యులు. అందుకే విశిష్టాద్వైతాన్ని 'శ్రీవైష్ణవం' అన్నారు.

*స్తోత్రరత్నం*లో 65 శ్లోకాలున్నాయి. ఇందులో కళ్యాణగుణస్వరూపుడైన భగవంతుని దివ్యమంగళ స్వరూప వర్ణన, స్వీయ అల్పత్వ ప్రకటన, భగవానుని దయాగుణం తదితర అంశాలు వర్ణించబడ్డవి. *స్తోత్ర రత్నం* హృదయం ప్రపత్తి అని వేదాంత దేశికులు ఆ గ్రంథానికి రాసిన వ్యాఖ్యలో పేర్కొన్నారు (వరదాచార్యులు, ధనకుధరం. 1984:197).

*గీతార్థ సంగ్రహం*లో విశిష్టాద్వైత సిద్ధాంతానికి అనుగుణంగా భగవద్గీతలోని రహస్యాలు వివరించబడ్డవి. *ఆగమ సామ్రాజ్యం*లో పాంచరాత్రాగమశాఖ ప్రామాణ్యాన్ని నిరూపించబడింది. ఇందులో దేవాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ, ఆరాధనా విధానం

మొదలైన విషయాలు చెప్పబడ్డాయి. ఇవే ఈనాటికీ శ్రీవైష్ణవులు అనుసరిస్తారు. *సిద్ధి త్రయంలో* ఆత్మసిద్ధి, ఈశ్వరసిద్ధి, సంవిత్సిద్ధి అనే మూడు భాగాలున్నాయి. ఆత్మసిద్ధి జీవునిగురించి, ఈశ్వరసిద్ధి పరమాత్మునిగురించి చర్చిస్తే, సంవత్సిద్ధిలో మాయావాద ఖండనం, ఆత్మ స్వరూప నిరూపణం మొదలైన విషయాలు వివరించబడ్డాయి.

ఈ విధంగా విశిష్టాద్వైతానికి గట్టి సైద్ధాంతిక పునాదిని కల్పించి, తన వారసుడిగా సమర్థుడైన రామానుజుడిని ప్రకటించి, అతనికి కర్తవ్య నిర్దేశం చేసి తుదిశ్వాస విడిచారు యామునాచార్యులు. యామునాచార్యుల రచనల ప్రభావం అన్నమయ్య కీర్తనలపై కనిపిస్తుంది.

*యది మే న దయిష్యసే తతో దయనీయస్తవ నాథ దుర్లభః*

*తదహం త్వదృతే న నాథవాన్మదృతే త్వం దయనీయవాన్ న చ* (Rajajee, M. S. 2001:72,74 – [Stotra Ratna-50,51 shlokas])

'నువ్వు నాపై దయచూపనట్లైతే, నీ దయకు పాత్రుడవగలిగేవాడు మరొకడుండడు ఎందుకంటే నాకంటే అధముడు లేడు. కనుక, నీవు లేక నాకు స్వామి లేడు, నేను లేక నీకు దయాపాత్రుడు లేడు.' పై *స్తోత్ర రత్న* భావానికి కింది అన్నమయ్య కీర్తనకు సామ్యం కనిపిస్తుంది.

*నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది*
*పూని నా వల్లనే కీర్తిఁ బొందేవు నీవు*
.....
*భావించి నావంటి నీచుఁ బట్టి కాచినప్పుడుగా*
*యేవంక నీకీర్తి గడునెంతురు భువి*
*నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు*
*శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు* (3-48)

'నేనొక్కడిని లేకపోతే నీ దయకు పాత్రులెవరున్నారు? నావల్లనే నీకు కీర్తి కలుగుతోంది. ఎందుకంటే నావంటి నీచుడిని రక్షించినప్పుడు కదా నీ కీర్తినిగురించి చెప్పుకుంటారు. నావల్లనే నీకు పుణ్యం. నీవల్లనే నాకు బ్రతుకు.'

అలాగే, మరో శ్లోకంలో యామునాచార్యులు,

*తవదాస్య సుఖైక సంగినాం*

*భవనేష్వస్త్వపి కీటజన్మమే* (Rajajee, M. S. 2001:78 – [Stotra Ratna-55th shloka])

'నిను సేవించే నీ దాసుల ఇంట్లో కీటకంగా జన్మించినా నాకు సమ్మతమే' అంటారు. అన్నమయ్య కూడా, 'హరిదాసులున్న ఊర్లో ఉంటే చాలు, భాగవతుల ఇళ్లలో పురుగుగా పుట్టినా చాలు' అంటూ కింది కీర్తన పాడారు.

*ఇన్ని జన్మము లేఁటికి హరిదాసు–*

*లున్నవూరఁ దా నుండినఁ జాలు*

*పరమభాగవతభవనంబులఁజెద్ద*

*పురువు దానయి పొడమినఁ జాలు* (1–367)

### 1.2.2.3. రామానుజాచార్యులు

శ్రీవైష్ణవ ఆచార్య పరంపరలో సమున్నతమైన స్థానాన్ని సంపాదించిన ఆచార్యులు, విశిష్టాద్వైత మతప్రవర్తకులు రామానుజాచార్యులు. రామానుజులను మతప్రవర్తకుడు అనే కంటే గొప్ప సంఘ సంస్కర్త అనడం సబబుగా ఉంటుంది. 1000 ఏళ్ళ క్రితమే సంఘంలో విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టి వర్ణాతీత సమసమజాన్ని స్థాపించిన ఘనత రామానుజునిదే. ఆయన జీవితం ఆనాటి సమాజానికే కాక ఈనాటికికూడా ఆదర్శవంతంగా

ఉంటుంది. ఒక్క వ్యక్తి వేయి సంవత్సరాల కిందటి సమాజానికి ఎదురొడ్డి నేటి సమాజానికికూడా మార్గదర్శకమైన భావజాలాన్ని స్థాపించాడంటే ఆశ్చర్యం కలుగుతుంది.

రామానుజుని పేరుమీద విశిష్టాద్వైతమతం నేటికీ రామానుజమతంగా పరిగణించబడుతోంది. రామానుజునికి నాలుగు శతాబ్దాల తరువాతవారైన అన్నమయ్య పలు కీర్తనలలో శ్రీవైష్ణవాన్ని రామానుజ మతంగానే సంబోధించారు.

*ఇంతకంటే మరిలేదు యెవ్వరికి నుపాయము*
*యెంతైనా నిదియు నీ విచ్చితేనే కలుగు*
*పుట్టుగులు గెలిచి నిన్ను బొందుట కుపాయము*
*అట్టె నీరూపమైన ఆచార్యుడే*
*యిట్టె శ్రీవేంకటేశ యిన్నిటికి నుపాయము*
*మట్టులేని రామానుజమతము చేకొనుటే* (2-334)

*సహజ వైష్ణవాచార వర్తనుల-*
*సహవాసమె మా సంధ్య*
*అతిశయమగు శ్రీహరిసంకీర్తన*
*సతతంబును మాసంధ్య*
*మతి రామానుజమతమే మాకును*
*చతురతమెఱసిన సంధ్య* (1-10)

రామానుజుని జీవితం-సందేశం తెలుసుకోవడం అన్నమయ్య కీర్తనలను అర్థం చేసుకోవడంలో ఉపకరిస్తుంది కనుక రామానుజుని చరిత్రను వివరంగా పరికించాల్సిన అవసరం ఉంది.

క్రీస్తు శకం 1017లో శ్రీపెరుంబుదూరులో రామానుజులు జన్మించారు. అప్పటికి శంకరాచార్యుని ప్రయత్నం వలన వైదికం మళ్ళీ పునర్వైభవాన్ని సంతరించుకుని, అద్వైతం పేరుతో ప్రాచుర్యంలో ఉంది. రామానుజులు విద్య నేర్చుకున్నదికూడా అద్వైత మతావలంబి అయిన యాదవ ప్రకాశులవద్దనే. అయితే చిన్ననాటి నుండి యామునాచార్యుని శిష్యుడు, వైష్ణవుడు అయిన మేనమామ శ్రీశైలపూర్ణుడి(తిరుమలనంబి)వద్ద, మరొక ప్రఖ్యాతి చెందిన వైష్ణవ భక్తుడైన కాంచీపూర్ణుడి(తిరుక్కచ్చినంబి)వద్ద విష్ణుభక్తులైన ఆళ్వారుల దివ్యకథలు వింటూ పెరిగిన రామానుజునికి వైష్ణవ భక్తి భావాలు అప్పటికే నరనరాల జీర్చించుకుపోయి ఉన్నాయి. అందువలన గురువు యాదవప్రకాశుడు బ్రహ్మసూత్రాలకు చేసే అద్వైతపరమైన వ్యాఖ్యానాలతో ఏకీభవించలేకపోయేవారు. గురుశిష్యుల మధ్య ఎప్పుడూ వాదోపవాదాలు జరుగుతూ ఉండేవి. అణకువతోనే అయినా దృఢంగా తన భావాలను వ్యక్తపరిచేవారు రామానుజులు. రామానుజుని పాండిత్యం, ఆయన విశ్లేషణ, అన్వయం, అద్వైత వ్యతిరేకమైన ఆలోచనలు యాదవప్రకాశునిలో అసహనాన్ని, అసూయను రగిల్చాయి. క్రమంగా వాదోపవాదాలు, ఖండనలు ఎక్కువై, యాదవప్రకాశుని అసూయాద్వేషాలు తీవ్రరూపం దాల్చి, శిష్యుని అంతమొందించాలని గురువే ప్రయత్నం చేసేవరకు వెళ్ళింది పరిస్థితి. సోదరుడు, సహపాఠి అయిన గోవిందునివల్ల ఈ కుట్రనుగురించి తెలుసుకున్న రామానుజులు, తనపై జరగనున్న హత్యాయత్నంనుండి తప్పించుకుని, యథావిధిగా యాదవప్రకాశునివద్ద విద్యాభ్యాసం కొనసాగించారు. అయితే రామానుజునిలో నానాటికీ వృద్ధి పొందుతున్న అద్వైత వ్యతిరేక భావజాలాన్ని సహించలేని యాదవప్రకాశులు, రామానుజుని తన గురుకులంనుండి వెలి వేశారు.

జరిగింది మంచికేననుకున్న రామానుజులు, తన అధ్యాత్మిక యాత్రలో ప్రథమాచార్యుడైన కాంచీపూర్ణుడి ఆదేశం మేరకు కంచి వరదరాజస్వామి కైంకర్యం చేస్తూ కాలం గడపసాగారు. ఆ సమయానికి శ్రీరంగంలో విశిష్టాద్వైత మతాన్ని స్థాపించిన

యామునాచార్యులు వార్ధక్యంలో ఉన్నారు. అప్పటికే శ్రీశైలపూర్ణుడివలన రామానుజుని గుణగణాలనుగురించి, యాదవప్రకాశుడివద్ద రామానుజులు వెలిబుచ్చిన భావాలనుగురించి తెలుసుకున్న యామునాచార్యులు, తన తదనంతరం రామానుజుని తన వారసునిగా చేయాలని సంకల్పించుకుని రామానుజుని పిలువనంపారు. కాని, దురదృష్టవశాత్తు, రామానుజులు శ్రీరంగం చేరుకునే సమయానికి యామునాచార్యులు తుదిశ్వాస విడిచారు. యామునాచార్యుని శిష్యులవలన యామునాచార్యుల చివరి కోరికలు తెలుసుకుని వాటిని నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేశారు రామానుజులు. యామునాచార్యుని చివరి కోరికలు:

1. తత్త్వత్రయ జ్ఞానాన్ని ప్రకాశింపజేయటంద్వారా *విష్ణుపురాణ* కర్త అయిన పరాశర మహర్షి కీర్తిని శాశ్వతం చేయటం.
2. *నాలాయిర దివ్య ప్రబంధాన్ని* ప్రచారం చేయటం.
3. ప్రస్థాన త్రయం అనబడే బ్రహ్మ సూత్రాలకు, ఉపనిషత్తులకు, భగవద్గీతకు భాష్యం రచించటం.

తిరిగి కంచి చేరి కాంచీపూర్ణులవద్ద సత్యమార్గానికి సంబంధించిన ఉపదేశాన్ని పొందారు. దీన్ని విశిష్టాద్వైతాన్ని నిర్వచించే మహాసందేశంగా శ్రీవైష్ణవులు భావిస్తారు. అది

1. అహమేవ పరంతత్త్వం – ఆ పరతత్త్వమే నేను.
2. దర్శనం భేద ఏవచ - వివిధ మతాలు విభిన్న దర్శనాలను సూచిస్తాయి కాని సత్యమొక్కటే.
3. ఉపాయేన ప్రపత్తిస్యాత్ – ప్రపత్తి అంటే శరణాగతే మోక్షదాయకం.
4. అంతిమ స్మృతి వర్జనమ్ – అవసాన కాలంలో దైవ స్మరణ చేస్తే చాలునన్నది సరి కాదు. ఎల్లప్పుడూ దైవస్మరణ చేస్తూ ఉండాలి.
5. దేహావసానేన మోక్షం చ – శరీర భావమునుండి విముక్తియే మోక్షం అంటే స్వార్థరాహిత్యం.

6. మహాపూర్ణ సమాశ్రయః – మహాపూర్ణుని ఆచార్యునిగా స్వీకరించు.

కాంచీపూర్ణుల సందేశానికి అనుగుణంగా మహాపూర్ణులను గురువుగా ఆశ్రయించి, పంచసంస్కారాలను, అష్టాక్షరి మంత్రోపదేశాన్ని పొందారు. తరువాత రామానుజులు సన్యాసం స్వీకరించి, రామానుజమఠాన్ని కంచిలో స్థాపించి యతిరాజయ్యారు. ఆ కాలంలోనే కూరేశుడు, దాశరథి అనే ఇద్దరు రామానుజునికి ఆంతరంగిక శిష్యులయ్యారు.

రామానుజుని బోధలగురించి విన్న యాదవ ప్రకాశులు అద్వైత తత్త్వం ఇవ్వని శాంతి భావం, ఆనందం, భక్తిలో, సమర్పణలో, సగుణదైవోపాసనలోనే ఉన్నాయని గ్రహించినవారై తన శిష్యుడికే శిష్యుడిగా చేరి గోవిందదాసుగా మారారు. మాయావాద ప్రవర్తకుదు, అద్వైత సిద్ధాంత వేదాంతి అయిన యాదవప్రకాశులు రామానుజుని మతంలో చేరడం విశిష్టాద్వైతానికి లభించిన గొప్ప విజయంగా పరిణమించి, రామానుజుని కీర్తి చంద్రికలు దేశంలో నలమూలలా వ్యాపించసాగాయి.

కొద్ది కాలం తరువాత శ్రీరంగంలోని యామునాచార్యుని శిష్యుల కోరికపై శ్రీరంగం చేరి అక్కడి విశిష్టాద్వైత మఠాధిపత్యాన్ని స్వీకరించి రామానుజాచార్యులయ్యారు. ఆలయ నిర్వహణను వ్యవస్థీకృతం చేశారు. యామునాచార్యుని ఏర్పాటును అనుసరించి ఆయన శిష్యులవద్ద *నాలాయిర దివ్య ప్రబంధాన్ని*, న్యాసాది విషయాలను అధ్యయనం చేశారు. గోష్ఠీపూర్ణులవద్ద తిరుమంత్రోపదేశం పొందాల్సి ఉన్నది. గోష్ఠీపూర్ణులు రామానుజుని భక్తిశ్రద్ధలను పరీక్షించదలచి 'ఇప్పుడు కాదు' అని 18 సార్లు తిప్పి పంపారు. అయినా వదలక, రామానుజులు పట్టుదలతో, గోష్ఠీపూర్ణునివద్ద మంత్రోపదేశం పొందారు. అయితే, మంత్రోపదేశం చేస్తున్నపుడు దానిని బహిరంగపరచకూడదనే నియమం పెట్టారు గోష్ఠీపూర్ణులు. గురువాజ్ఞ మీరి తాను నరకానికే పోవలసి వచ్చినా, తనవల్ల మంత్రోపదేశం పొంది అశేష ప్రజానీకం మోక్షానికి అర్హులైనప్పుడు అదే ఆచరణీయమని రామానుజులు

తిరుక్కోట్టియూర్ లోని దేవాలయ గోపురంపైకి చేరి జనులందరికీ మంత్రోపదేశం చేశారు. ఇది రామానుజుని స్వార్థరాహిత్యానికి, లోకకళ్యాణకాంక్షకు ప్రబలమైన ఉదాహరణ. ఈ సంఘటనవల్ల గురువైన గోష్టీపూర్ణులనుండి *ఎంబెరుమానార్* (మా ప్రభూ) అన్న బిరుదాన్ని పొందారు. తిరుపతిలో తన మేనమామ తిరుమలనంబివద్ద రామాయణ రహస్యాలను అధ్యయనం చేశారు.

అనంతర కాలంలో రామానుజాచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రస్థానత్రయానికి భాష్యం రాసి, భాష్యకారుడన్న పేరు సంపాదించుకున్నారు. రామానుజులు రాసిన భాష్యాన్ని *శ్రీభాష్యమని* పిలుస్తారు. రామానుజులు *శ్రీభాష్యంతో* పాటుగా *వేదాంత సారం, వేదాంత దీపం, వేదార్థ సంగ్రహం, గద్య త్రయం (శరణాగతి గద్య, శ్రీరంగ గద్య, శ్రీ వైకుంఠ గద్య), నిత్య గ్రంథం* అనే గ్రంథాలను రాసి విశిష్టాద్వైతానికి బలమైన ప్రమాణ గ్రంథాలను అందించారు. కాశ్మీరంనుండి కన్యాకుమారివరకు పర్యటించి, విశిష్టాద్వైతానికి విశేషప్రచారం కల్పించారు. పంచవర్ణాలనుండి శిష్యులను స్వీకరించారు. మేల్కొటెలో పంచములకుకూడా ఆలయప్రవేశం కల్పించి ఆ రోజుల్లోనే విప్లవాత్మకమైన మార్పులను ప్రవేశపెట్టారు. గృహ్యాసూత్రాలకు విరుద్ధంగా స్త్రీలకుకూడా సన్యాసం ప్రసాదించడమే కాకుండా, దైవకైంకర్యాలలోకూడా వారికి సముచితమైన బాధ్యతలను ఇచ్చి స్త్రీలకు సమాన ప్రతిపత్తిని కల్పించారు. మతం అనేది సంఘసేవకు ఉపకరించాలనే యామునాచార్యుని సిద్ధాంతాన్ని పాటించారు. దేవాలయాలలో కులభేదరహితంగా అందరికీ ప్రసాదాలు అందేటట్టుగా చేశారు. రామానుజాచార్యులు తీసుకొచ్చిన సంస్కరణలను ఓర్వలేని మత ఛాందసులు ఆయనను విషప్రయోగంద్వారా హతమార్చాలని ప్రయత్నించినా రామానుజులు తమ సంస్కరణల విషయంలో వెనుకంజ వేయలేదు.

రామానుజాచార్యుని జీవితంలో మరొక విశేషమైన ఘట్టం తిరుపతిలో జరిగింది. ఆ కాలంలో తిరుపతిలో ఉన్న మూలవిరాట్టు శివుడని శైవులు, విష్ణువని వైష్ణవులు వాదోపవాదాలు

చేసుకునేవారు. ఆళ్వారుల కాలంలో సైతం తిరుపతిలో వెలసిన వేంకటేశ్వరుడు పూజలు అందుకుంటూ వచ్చినా, అనంతర కాలంలో శైవరాజులు ఆ ప్రాంతంలో రాజ్యం చేస్తుండడంతో, శైవులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుడిలో ఉన్న మూల విరాట్టుకి శంఖచక్రాలు లేనందువలన అది శివుడని వాదించి, తదనుగుణంగా పూజాదికాలు నిర్వహించసాగారు. దాంతో అక్కడి శైవ వైష్ణవుల మధ్య ఘర్షణ ఏర్పడింది. ఇద్దరి తగవు తీర్చడానికి స్థానిక ప్రభువు యాదవ రాయలి మధ్యవర్తిత్వంలో ఇరు పక్షాల పెద్దల మధ్య తర్కచర్చ ఏర్పాటు చేయడానికి నిశ్చయమైంది. అయితే వైష్ణవుల తరపున వాదించడానికి సమర్థుడెవరూ లేనందువల్ల రామానుజునికి ఆహ్వానం పంపారు. రామానుజులు స్థల పురాణ, చారిత్రక, గ్రంథ రూప ఆధారాలనెన్నిటినో చూపి తిరుపతి ఆలయం వైష్ణవాలయమని, అర్చామూర్తి వేంకటేశ్వరుడని నిరూపించడమే కాక, మూలవిరాట్టుకు శంఖచక్రాలను అమర్చాడు; ఊర్ధ్వపుండ్రాలను దిద్దాడు. ఈ విధంగా వైష్ణవ సంస్కారాలివ్వడంవలన, వైష్ణవ సంప్రదాయం ప్రకారం రామానుజులు వేంకటేశ్వరునికే గురువుగా కీర్తి పొందారు.

శైవుడయిన చోళరాజు కులోత్తుంగ చోళుడి వైష్ణవ ద్వేషం కారణంగా 12 సంవత్సరాలు శ్రీరంగాన్ని వదలవలసి వచ్చినా, ఆ సమయాన్ని మైసూరు రాజ్యంలో శ్రీవైష్ణవ ప్రచారానికి వినియోగించారు రామానుజులు. అలాగే, మేల్కొటేలో మహమ్మదీయుల దాడుల వలన జీర్ణావస్థలో ఉన్న సంపత్కుమార స్వామి ఆలయాన్ని పునరుద్ధరించారు. తస్కరింపబడిన స్వామి ఉత్సవ విగ్రహాన్ని మహమ్మదీయరాజులవద్దనుండి తీసుకువచ్చారు. కులోత్తుంగ చోళుని మరణానంతరం తిరిగి చోళ రాజ్యంలో అడుగుబెట్టిన రామానుజులు దక్షిణ భారతయాత్ర చేపట్టి, ధ్వంసమైన వైష్ణవాలయాలను పునరుద్ధరించారు. చిదంబరంలో చోళుని దాడినుండి తప్పించిన గోవిందరాజస్వామిని తిరుపతిలో ఆలయాన్ని నిర్మింపజేసి, అందులో ప్రతిష్ఠింపజేశారు. విశిష్టాద్వైత ప్రచారం కోసం 74 మంది ఆచార్య పురుషులను నియమించారు. శతవృద్ధులైన రామానుజాచార్యులు తన ఆత్మీయ శిష్యుడైన కూరేశుడి

కుమారుడు – పరాశరుడికి మఠాధిపత్యాన్ని అప్పగించి, సర్వసంగపరిత్యాగం చేసి 20 సంవత్సరాలు ధ్యానంలో గడిపి, 120 ఏళ్ళ వయసులో క్రీ.శ.1137లో తనువు చాలించారు.

రామానుజాచార్యులు ఆస్తిక హేతువాది (rational theist). దైవంపట్ల అచంచలమైన విశ్వాసం ప్రకటించారు. అదే సమయంలో, మూఢనమ్మకాలకు చోటివ్వని వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. సమాజ వికాసానికి అడ్డుపడేది ఎంతటి ప్రాచీనమైన ఆచారమైనా, అది మార్చుకోవడానికి వెనకాడాల్సిన పని లేదు అని చాటిచెప్పారు.

పురుషుడు పురుషోత్తముని అనుసరిస్తాడు కనుక, సర్వకల్యాణగుణసంపన్నుడు, త్రిభువన సుందరుడు అయిన మూర్తిని పూజించడంద్వారా మనిషి వ్యక్తిత్వ వికాసానికికూడా ఉపయోగపడుతుందని హేతుబద్ధంగా సగుణోపాసనను సమర్థించారు.

ఇదే భావాన్ని అన్నమయ్య, *ఇదివో సుజ్ఞానము సూత్రే మణిగణా యివ* అన్న కీర్తనలో ఇలా చెప్పారు.

*వెదకు మా శ్రీవేంకటపతి నిను సేవించఁగ నిను సేవించఁగను*

*అదన నిన్నంటినవారల నీయంతలు సేతువుగాన* (2-121)

మోక్షం జీవుడు సాధించవలసిన పరమ పురుషార్థం. అయితే, స్వార్థ రాహిత్యమే మోక్ష భావం అని, స్వార్థ రాహిత్యం లోకసేవకు, లోకకల్యాణానికి దారి తీస్తుందని, సంఘసేవే మతానికి అసలైన పరమార్థమని రామానుజాచార్యులు ప్రబోధించారు. తన ఉన్నతి కోసమే కాక, లోకోన్నతి, లోక కల్యాణంగురించి కృషి చేయడం మోక్ష సన్యాస యోగమని బోధించడమే కాక, తనకు లభించిన అష్టాక్షరి మంత్రాన్ని పురప్రజలందరికీ పంచడంద్వారా దాన్ని ఆచరించి చూపించారు. అనన్యసామాన్యమైన రామానుజుని కృషిని అన్నమయ్య ఈ కింది కీర్తనలో వివరించారు.

*గతులన్ని ఖిలమైన కలియుగమందును*

*గతి యీతఁడే చూపె ఘనగురుదైవము*

*యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి-*

*మీతనివల్లనే కంటి మీతిరుమణి*

*యీతఁడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర-*

*మీతఁడే రామానుజులు యిహపరదైవము*

*వెలయించె నీతఁడేకా వేదపు రహస్యములు*

*చలిమి నీతఁడే చూపె శరణాగతి*

*నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రధారణము*

*మలసి రామానుజులే మాటలాడే దైవము*

*నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు*

*దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే*

*నయమై శ్రీవేంకటేశు నగ మెక్కేవాకిటను*

*దయఁజూచీ మమ్ము నిట్టే తల్లితండ్రి దైవము* (2-372)

‘కలియుగంలో ఇతర యుగాలలోలాగా తపస్సు, యోగం, భక్తి నిలవడం దుస్సాధ్యం. ఇటువంటి పరిస్థితుల్లో మోక్షాన్ని పొందడానికి ప్రపత్తి అనే సరికొత్త మార్గాన్ని చూపించారు రామానుజులు. రామానుజులవల్లే శ్రీవైష్ణవం అభివృద్ధి చెందింది. తనకు లభించిన అష్టాక్షరి మంత్రాన్ని గురువాజ్ఞ ధిక్కరించి మరీ జాతికి ఉపదేశమిచ్చారు రామానుజులు. తిరుమణి, ముద్రధారణం మొదలైన శ్రీవైష్ణవ ఆచారాలను పాదుకొల్పింది రామానుజులవారు. *వేదాంత సారం, వేదాంత దీపం, వేదార్థ సంగ్రహం* పేర్లతో వేదపు రహస్యాలను బహిర్గతం చేసిన మహనీయులాయన. ప్రస్థానత్రయానికి విశిష్టాద్వైతపరంగా భాష్యం రాసి, శ్రీవైష్ణవానికి బలమైన ప్రమాణ గ్రంథాలను కూర్చారు. తిరుపతిలో ఉన్న మూలవిరాట్టు విష్ణురూపమైన శ్రీవేంకటేశ్వరుడని నిరూపించి, శ్రీవేంకటేశ్వరుడికి శంఖచక్రాలను అమర్చిన ఘనత రామానుజులదే. తిరుపతిలో అర్చనా విధానాన్ని స్థిరపరచింది కూడా రామానుజులే. కనుకే,

శ్రీవేంకటేశ్వరాలయంలో భాష్యకార సన్నిధి పేరిట గర్భగుడికి దగ్గరలో రామానుజుల విగ్రహం ఉంటుంది. అలా శ్రీవేంకటేశ్వరుని వాకిట్లో కొలువై ఉన్న రామానుజులే తనకు దైవం' అని రామానుజాచార్యులపట్ల భక్తిభావాన్ని ప్రదర్శించారు అన్నమయ్య.

రామానుజుని అనంతరం విశిష్టాద్వైతం తెంగలై, వడకలై అనే రెండు శాఖలుగా విడిపోయింది. పిళ్ళై లోకాచార్యులు తెంగలై శాఖకు, వేదాంత దేశికులు వడగలై శాఖకు ప్రచారం కల్పించారు. తెంగలై శాఖ వారు దక్షిణ దేశ సంప్రదాయ విధానాన్ని అనుసరిస్తారు. ద్రావిడ వేదమైన *నాలాయిర దివ్య ప్రబంధానికి* ప్రాధాన్యతను ఇస్తారు. వడగలై శాఖ వారు ఉత్తర దేశ సంప్రదాయాలను అనుసరిస్తారు. వేదాలను, *శ్రీభాష్యాన్ని* ప్రమాణంగా స్వీకరిస్తారు. ఈ రెండు శాఖల మధ్య అష్టాదశ భేదాలు ఉన్నట్లుగా చెబుతారు (ఆనందమూర్తి, వేటూరి. 1986:56). ముఖ్యంగా భక్తుని పట్ల భగవంతుని కృప నిర్హేతుకమని తెంగలై వారు, సహేతుకమని వడకలై వారు భావిస్తారు. వేదాంత దేశికులు స్థాపించిన వడకలై సంప్రదాయాన్ని పాటించే ఆదివన్ శఠగోపయతి అహోబిల మఠాన్ని స్థాపించారు. అహోబిల మఠం వడకలై సంప్రదాయానికి చెందిన ముఖ్యమైన మఠంగా ప్రసిద్ధి పొందింది. అయితే శఠగోపయతివద్ద విశిష్టాద్వైతాన్ని అధ్యయనం చేసిన అన్నమయ్య మాత్రం తెంగలై సంప్రదాయాన్ని అనుసరించినట్లుగా అన్నమయ్య కీర్తనల వల్ల స్పష్టమవుతోంది.

*నిరుహేతుక దయానిధివి నీవు*
*కరుణించు నీకు నొక్కటి విన్నపము* (2-106)
*నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపు దయ*
*జోక నురుత మెచ్చిన సులభుఁడవే కా* (3-451)
*ఏ వుపాయములు మాకిఁకఁ బనికిరావు*
*నీవే హరి కావవే నిరుహేతుకమున* (2-408)

ఈ కీర్తనలలో భగవంతుని నిర్హేతుక దయనుగురించి ప్రశంసించి, తెంగలై సంప్రదాయాన్ని అనుసరించారు అన్నమయ్య.

## 1.3. విశిష్టాద్వైత సిద్ధాంతాలు

అన్నమయ్య కీర్తనలలో చాలా చోట్ల విశిష్టాద్వైత సిద్ధాంతాల ప్రస్తావన, విశిష్టాద్వైత మత సంబంధితమైన పదజాలం కనిపిస్తుంది. కనుక, ఆ కీర్తనలను అర్థం చేసుకోవడానికి విశిష్టాద్వైత సిద్ధాంతాలగురించిన కనీస పరిజ్ఞానం అవసరం.

విశిష్టాద్వైతంలో ముఖ్యంగా తత్త్వత్రయ జ్ఞానం, జీవాత్మ–పరమాత్మ సంబంధం, భగవంతుని కళ్యాణ గుణ స్వరూప కీర్తన, ముక్తిమార్గంగా శరణాగతి ప్రాముఖ్యం, రహస్య మంత్ర త్రయం, గురు భక్తి, భాగవత భక్తి అనేవి ప్రధానమైన అంశాలు.

### 1.3.1 తత్త్వ త్రయం

'చిత్తు' అంటే జీవుడు, 'అచిత్తు' అంటే ప్రకృతి, ఈశ్వరుడు – ఈ మూడింటిని తత్త్వత్రయం అంటారు. భగవంతుని శరీరం జీవుడు. జీవుడి ఆత్మ భగవంతుడు. జీవుడి శరీరం ప్రకృతి. ఈ విధంగా చిదచిదీశ్వరులు వేరు వేరు అస్తిత్వం ఉన్న పదార్థాలైనప్పటికీ వేరు వేరు కాదు. ఈశ్వర శక్తి చిత్, అచిత్ రెంటిలోనూ వ్యాపించి ఉన్నది. జీవాత్మ పరమాత్మకు శరణాగతి చేసి తద్వారా భగవంతుని చేరుకోవటమే జీవునికి ముక్తి అన్నది విశిష్టాద్వైత సారం.

#### 1.3.1.1. చిత్తు

'చిత్తు' అంటే జీవుడు. *తుదఁ దొల్లె నీదాసులు గలరు తుదఁ దొల్లియే నీవుఁ గలవు* (2-121) అని అన్నమయ్య పేర్కొన్నట్టు భగవంతుడిలాగే జీవుడు కూడా నిత్యుడే. తన కర్మఫలం వల్ల వివిధ శరీరాల్లో జన్మిస్తూ తన కర్మఫలాన్ని అనుభవిస్తూ ఉంటాడు. జీవులు బద్ధులు, ముక్తులు, నిత్యులు అని మూడు విధాలుగా ఉన్నారు.

**బద్ధులు:** వీరు జీవనమరణచక్రంలో పడి మరలమరల పుడుతూ, చస్తూ, సంసారంలోని ఈతి బాధలను అనుభవిస్తూ ఉండేవారు. సామాన్య మానవులందరూ ఈ కోవలోని వారే.

**ముక్తులు:** మొదట వీరుకూడా బద్ధుల లాగే, సుఖదుఃఖాదులను అనుభవిస్తూ, సంసార సాగరంలో చిక్కుకున్నవారే అయినప్పటికీ, దైవానుగ్రహంవల్లనో, ఆచార్యుని అనుగ్రహంవల్లనో ముక్తి మార్గం తెలుసుకుని భగవంతునికి శరణాగతి చేసినవారు.

**నిత్యులు:** వీరు సంసారబంధాల్లో చిక్కుకొననివారు. ఎప్పుడూ భగవంతుని సన్నిధిలో అతనికి సేవకులై ఉండేవారు; నిత్యసంతోషులు. గరుడుడు, శేషుడు, విష్వక్సేనుడు మొదలైన వారు నిత్యులు.

### 1.3.1.2. అచిత్తు

'అచిత్తు' అంటే ప్రకృతి. *వికారాన్ ప్రకరోతి ఇతి ప్రకృతిః* అనే వ్యుత్పత్తి ప్రకారం వికారాలను కలిగించేది కనుక దీనికి ప్రకృతి అని పేరు. ఈ ప్రకృతికే అవిద్య, మాయ అనికూడా పేరు. ప్రపంచంలోని జడపదార్థమంతా అచిత్తు కిందకే వస్తుంది. అచిత్తు ప్రాణశక్తితో కూడి ఉన్నపుడు చిత్తు అనబడుతుంది. అంటే ఉట్టి మానవ శరీరం అచిత్తు అయితే ప్రాణశక్తి ఉన్న శరీరి చిత్తు.

### 1.3.1.3. ఈశ్వరుడు

చిత్తు అచిత్తులలో వ్యాపించి ఉన్న శక్తి ఈశ్వరుడు. అతడు సర్వాంతర్యామి, సర్వ వ్యాపకుడు, సర్వ శక్తిమంతుడు, త్రిభువన సుందరుడు, సకల కళ్యాణ గుణ స్వరూపుడు. ఈశ్వరుడు జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు అనే ఆరు కళ్యాణ గుణాలు కలిగినవాడు. ఇవే తిరిగి అనేక కళ్యాణ గుణాలుగా విస్తరిస్తాయి. పరమాత్ముడు ఐదు విధాలుగా వ్యక్తమవుతాడు. అవి

1) పరం
2) వ్యూహం

3) విభవం

4) అంతర్యామి

5) అర్చావతారం

**పరం:** శ్రీ వైకుంఠంలో శంఖ చక్రాది దివ్యాయుధాలతో కూడి ఉన్న శ్రీమన్నారాయణుడే పరతత్త్వం, పర స్వరూపం.

**వ్యూహం:** పరమాత్ముడు సృష్ట్యాది కార్యాల కోసం నాలుగు వ్యూహాల్లో ప్రకటితమవుతున్నాడు. అవి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు. వాసుదేవ వ్యూహంలో షడ్గుణ సమన్వితుడైతే, ఇతర వ్యూహాలలో ఆయా వ్యూహ కర్తవ్యాలను అనుసరించి జ్ఞాన, బల (సంకర్షణ), వీర్య, ఐశ్వర్య (ప్రద్యుమ్న), శక్తి, తేజో (అనిరుద్ధ) గుణాలను కలిగి ఉంటాడు.

**విభవం:** గీతాచార్యుడు తెలిపినట్లుగా శిష్టరక్షణకు, దుష్టశిక్షణకు, ధర్మపరిరక్షణకు భగవంతుడు దాల్చిన అవతారాలే విభవ స్వరూపాలు.

**అంతర్యామి:** సమస్త జీవుల్లోనూ హృదయ స్థానంలో నివసించే భగవద్రూపమే అంతర్యామిత్వం.

**అర్చావతారం:** దేవాలయాల్లో భక్తులను అనుగ్రహించటానికి వెలసిన ప్రతిమా స్వరూపమే అర్చావతారం.

చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు – ఈ మూడు తత్త్వాలు సత్యాలు, నిత్యాలు. ఈ తత్త్వత్రయ జ్ఞానం కలిగి, ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నది ఈశ్వర శక్తే అని తెలుసుకుని దానికి శరణాగతి చేయడమే శ్రీవైష్ణవ ధర్మం. తత్త్వత్రయ జ్ఞానాన్నిగురించి అన్నమయ్య పాడిన ఈ కీర్తనను గమనించవచ్చు.

*ఓహో దేండేం వొగి బ్రహ్మ మిదియని*

*సాహసమున శ్రుతి చాటెడిని*

*పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా*

*వెరవు దెలియుటే వివేకము*

*పరము దేవుఁడును అపరము జీవుఁడు*

*తిరమైన ప్రకృతియె దేహము* (1-396)

**1.3.2. శరణాగతి**

దీన్నే ప్రపత్తి లేక భరన్యాసం లేక ఆత్మనివేదన అని అంటారు. వేదోపనిషత్తులు, పురాణాలు, పాంచరాత్రాగమం మొదలైన గ్రంథాలు శరణాగతి మార్గాన్ని ప్రస్తుతించాయి. ఆళ్వారులు, ఆచార్యులు దీనికి అతి సులభమైన మోక్ష మార్గంగా విశేష ప్రాచుర్యం కల్పించారు. ఈ శరణాగతి ఆరు రకాలుగా ఉంది.

1) అనుకూల్య సంకల్పం: భగవద్విషయాలలో మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం.

2) ప్రాతికూల్య వర్జనం: భగవంతుని పట్ల శ్రద్ధాసక్తులను భంగపరిచే విషయాలను వర్జించటం.

3) రక్షిష్యతీతి విశ్వాసం: భగవంతుడు తనను రక్షిస్తాడన్న అచంచలమైన విశ్వాసం కలిగి ఉండటం.

4) గోప్తృత్వవరణం: భగవంతుడు తప్ప తనకు వేరే రక్షకుడు లేడు అని నిశ్చయించుకోవటం.

5) కార్పణ్యం: తన దీనత్వాన్ని, అల్పత్వాన్ని చాటుకొనటం, భగవంతుని ఆధిక్యాన్ని కీర్తించటం.

6) ఆత్మనిక్షేపణం: తన భారాన్ని భగవంతుడిపై వేసి, ఆత్మ సమర్పణ చేయటం.

అన్నమయ్య కీర్తనల నిండా శరణాగతి భావమే పలు రూపాల్లో ద్యోతకమవుతూ ఉంటుంది.

*నీవే కానింక నే నన్యమెఱఁగ యే-*

*త్రోవ చూపి నాకుఁ దోడయ్యెదవయ్య* (1-17)

'నీవు తప్ప నాకు వేరే ఇంకేమీ తెలియదు. నాకే దారి చూపిస్తావో!' అంటూ గోప్తృత్వ వరణాన్ని,

*నా తప్పు లోఁ గొనవే నన్నుఁ గావవే దేవ*

*చేఁతలిన్నీఁ జేసి నిన్నుఁ జేరి శరణంటిని* (1-427)

'నా తప్పులను క్షమించి నన్ను కాపాడు. నిన్నే శరణు వేడుతున్నాను' అంటూ ఆత్మనిక్షేపణాన్ని,

*నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము*

*దైవమవై నీ వుండఁగ తగ మాదే బ్రదుకు* (2-500)

'నువ్వు రక్షిస్తావని నిన్నే నమ్ముకున్నాను. కాపాడే స్వామివి నీవుండగా మాకిక చింత లేదు' అంటూ రక్షిష్యతీతి విశ్వాసాన్ని ప్రకటించారు అన్నమయ్య.

ఇటువంటి శరణాగతి వల్ల లభించే మోక్షం నాలుగు రకాలని భక్తుల విశ్వాసం. 1) సాలోక్యం అంటే పరమాత్మ ఉండే లోకాన్ని చేరటం. 2) సారూప్యం అంటే పరమాత్మతో సమానమైన రూపాన్ని ధరించడం. 3) సామీప్యం అంటే పరమాత్మ సమీపానికి చేరడం. 4) సాయుజ్యం అంటే జీవుడు పరమాత్మలో లయం కావడం.

విశిష్టాద్వైతంలో ఇతర ప్రముఖమైన అంశాలు పంచ సంస్కారాలు, భాగవత సేవ, ఆచార్య భక్తి.

### 1.3.3. పంచ సంస్కారాలు

పంచ సంస్కారాలనే సమాశ్రయణమని, వైష్ణవ దీక్ష అని అంటారు. వైష్ణవంలోకి ప్రవేశించడానికి గురువు ఈ పంచ సంస్కారాలను ఇస్తాడు. అవి వరుసగా,

1. తాపం: గురువువలన శంఖ చక్రాల ముద్రలు భుజాలపై పొందడం.
2. పుండ్రం: ముఖంతో మొదలుకొని పన్నెండు స్థానాల్లో భగవానుని పాదాల ఆకృతిలో ఊర్ధ్వ పుండ్రాలను ధరించడం.

3. నామం: ఆచార్యుడు వైష్ణవుని నామం చివరన దాస శబ్దం చేరుస్తాడు. ఇక ఆజీవపర్యంతం అతడు శ్రీమన్నారాయణదాసు, భగవద్రామానుజదాసు అని చెప్పుకోవాలి.

4. మంత్రం: రహస్య మంత్రత్రయాన్ని గురువునుండి ఉపదేశం పొందడం.

5. యాగం: గురువునుండి సరైన ఆరాధనా విధానాన్ని/పూజా పద్ధతిని తెలుసుకోవడం.

అన్నమయ్య వీటినిగురించి చాలా కీర్తనలలో (ఉదా: 2-486, 3-490, 3-531) ప్రస్తావించారు.

### 1.3.4. రహస్య మంత్ర త్రయం

#### 1.3.4.1. తిరుమంత్రము

*ఓం నమో నారాయణాయ.*

మంత్రాలలోకెల్లా శ్రేష్ఠమైన మంత్రం కనుక దీనికి తిరుమంత్రం అని పేరు వచ్చింది. దీనినే అష్టాక్షరిమంత్రమని, మహామంత్రమని, మంత్రరాజమని అంటారు. ఈ మంత్రానికి విశిష్టాద్వైతంలో అత్యంత ప్రాధాన్యత ఉంది.

#### 1.3.4.2. ద్వయ మంత్రము

*శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే. శ్రీమతే నారాయణాయ నమః.*

ఇది మంత్రరత్నంగా ప్రసిద్ధి పొందింది. శ్రీమన్నారాయణుని పాదాలను ఆశ్రయించమని ఈ ద్వయమంత్రంలో మొదటి భాగం చెబితే, లక్ష్మీనారాయణుల అద్వైత తత్త్వాన్ని, అమ్మ లక్ష్మీదేవిద్వారానే భగవంతుడిని ఆశ్రయించే శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని రెండవ భాగం బోధిస్తుంది.

### 1.3.4.3. చరమశ్లోకము

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।*

*అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:358 – [భగవద్గీత–18వ అధ్యాయం–66వ శ్లోకం])

'అన్ని ధర్మాలను విడిచిపెట్టి నన్ను శరణు వేడు. నేను నిన్ను అన్ని పాపాలనుండి విముక్తుడిని చేస్తాను.' భగవద్గీతలోని ఈ శ్లోకం చరమశ్లోకంగా ప్రసిద్ధి పొందింది. ఈ మంత్రాన్ని గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు. కలియుగంలో ప్రపత్తే మోక్షానికి మహామంత్రంగా ఉద్దేశించబడింది కనుక చరమశ్లోకం మోక్షోపాయంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

### 1.3.5. గురు భక్తి

శ్రీవైష్ణవంలో ఆచార్యుడిని శ్రీమన్నారాయణుడితో సమానంగా భావించి పూజిస్తారు (వరదాచార్యులు, ధనకుధరం. 1984:24). గురువు ద్వారానే దైవాన్ని తెలుసుకోవచ్చు కనుక గురువుకు అంతటి ప్రాముఖ్యతను ఇస్తారు. గురువే సాధకుడికి సాధన చేసే పద్ధతి, సాధన చేయవలసిన మంత్రాన్ని బోధిస్తాడు, మంత్రార్థాన్ని వివరిస్తాడు. మంత్రం తెలిసినా అది గురువు ఉపదేశంద్వారా పొందితేనే ఫలితమిస్తుంది. అందుకే గోష్ఠీపూర్ణులవారు 18 సార్లు తిప్పి పంపినా, వదలక గురువును ఆశ్రయించి మంత్రోపదేశాన్ని పొందారు రామానుజాచార్యులు.

మధురకవి ఆళ్వారు అయితే తన గురువును దైవంకంటే ఎక్కువగా పూజించారు. తన పాశురాలలో గురువుకు తప్ప ఆ దైవానికికూడా స్థానం కల్పించలేదు. మధురకవి ఆళ్వారుతోనే విశిష్టాద్వైతంలో గురుపూజా సంప్రదాయం బాగా కుదురుకొంది.

నాథమునులు యామునాచార్యుని శ్రీవైష్ణవం వైపుకు తిప్పవలసిందిగా శిష్యులకు చెప్పి పరమపదించారు. నాథమునుల శిష్యులు పుండరీకాక్షులు, ప్రశిష్యులు శ్రీరామమిశ్రులు గురువుగారు భౌతికంగా లేకపోయినప్పటికీ వారి ఆదేశాలను పాటించడానికి జీవితపు

చరమదశలలోకూడా ఎనలేని కృషి చేశారు. అలాగే, యామునుల శిష్యులైన పెరియనంబి, తిరుమలనంబి మొదలైనవారు వయస్సులో, జ్ఞానంలోకూడా తమకంటే చిన్నవాడైన రామానుజుని, గురువు చెప్పాడన్న ఒకే ఒక్క కారణంవల్ల, మఠాధిపతిగా గౌరవించారు. రామానుజులు నిమ్నకులస్థుడైన కాంచీపూర్ణుడిని గురువుగా భావించినందువలన అతని ఉచ్ఛిష్టాన్ని ప్రసాదంగా స్వీకరించడానికి తపించారు. రామానుజుని శిష్యుడైన దాశరథి, సకలవేదశాస్త్రపారంగతుడైనప్పటికీ, గురువాజ్ఞమేరకు వంట బ్రాహ్మడిగా పనిచేశారు. గురువాజ్ఞను శిలాశాసనంగా పాటించడం శ్రీవైష్ణవంలో గుర్తించదగిన అంశం.

అన్నమయ్య కూడా, *మీఁదైనగురువుకంటే మీఁద రక్షకుఁడు లేఁడు* (1-443) అని భావిస్తూ అనేక కీర్తనలలో గురుభక్తిని ప్రదర్శించారు.

*జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము*
*నానార్థములు నిన్నే నడపె మాగురుఁడు*

*అలరి దేహమనేటి యాగశాలలోన*
*బలువై యజ్ఞానపు పశువు బంధించి*
*కలసి వైరాగ్యపు కత్తులఁ గోసి కోసి*
*వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు*

*మొక్కుచు వైష్ణవులనే మునిసభ గూడపెట్టి*
*చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానము నించి*
*చక్కఁగా సంకీర్తనసామగానము చేసి*
*యిక్కువతో యజ్ఞము సేయించెఁబో మాగురుఁడు*

*తదియ్యగురుప్రసాదపు పురోడాశ మిచ్చి*

*కొదదీర ద్వయమను కుండంబులు వెట్టి*

*యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె*

*యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుడు* (2-148)

'శరీరాన్నే యాగశాలగా చేసి, అజ్ఞానం అనే పశువును అక్కడ బంధించి, వైరాగ్యం అనే కత్తులతో ఆ అజ్ఞానపు పశువును కోసి, జ్ఞానమనే అగ్నిలో వేలుస్తాడు గురువు. వైష్ణవులనే మునులతో ఒక సభ పెట్టించి, భాగవతుల పాదతీర్థమనే సోమపానాన్ని ఇచ్చి, సంకీర్తనలనే సామగానాన్ని చేసి, యజ్ఞాన్ని చేయిస్తాడు గురువు. ఈ విధంగా గురుప్రసాదమనే పురోడాశాన్ని, ద్వయ మంత్రం అనే కుండలాలను తనకు పెట్టి, పంచ సంస్కారాలనే వైష్ణవ దీక్షను ఇచ్చి, శ్రీవేంకటేశ్వరుడిని ప్రత్యక్షం చేయించిన గురువుపట్ల భక్తిని ఈ కీర్తనలో చాటుకున్నారు అన్నమయ్య.'

### 1.3.6. భాగవత భక్తి

భాగవతులపట్ల భక్తి, వారితోడి సంగానికి విశిష్టాద్వైతంలో ప్రముఖమైన స్థానం ఉంది. *నీ పాదార్చకుల తోడి నెయ్యము* కావాలని సుదాముడు కృష్ణభగవానుని కోరుకున్నట్లుగా శ్రీవైష్ణవులుకూడా నిరంతరం భాగవతుల సంగాన్ని కాంక్షిస్తారు. భాగవతసేవ చేసి తరించాలనుకుంటారు.

భాగవతులతో కూడికవలన భక్తి భావం వికసిస్తుంది. భక్తుడి అధ్యాత్మిక యాత్రలో ఒకవేళ ఆటంకాలు కలిగినా భాగవతుల సాంగత్యం ఉన్నట్లైతే తిరిగి సక్రమమైన మార్గంలోకి ప్రవేశించవచ్చు. అందుకే భాగవతులసంగానికి చాలా ప్రాముఖ్యతను ఇస్తారు భక్తులు. తొండరడిప్పొడి ఆళ్వారు, కులశేఖరాళ్వారు మొదలైనవారు తమ పాశురాలలో భాగవతోత్తములపట్ల భక్తిని, భాగవత సాంగత్యపు విశిష్టతను ప్రబోధించారు. తొండరడిప్పొడి ఆళ్వారు తన *తిరుమాలై* లో ఇలా అంటారు.

*పళుదిలా వొళుగలాత్తు పలశ తుప్పేది మార్గళ్*

*ఇళి కులత్తవర్గళేనుం ఎమ్మడి యార్గళా గిల్*

*తొళుమి నీర్ కొడు మిన్ కొణ్మిన్ ఎన్జు నిన్నోడు మొక్క*

*వళి పడ వరుళి నాయ్ పోల్ మదిళ్ తిరువరంగతానే* (రఘునాథాచార్యులు, న. చ. 1992:175 – [తిరుమాలై–42వ పాశురం])

'శ్రీరంగనాథ స్వామీ! ఉత్తమ వంశంలో జన్మించిన దోషరహితులైన, చతుర్వేదవేత్తలైన బ్రాహ్మణులకు, హీనకులంలో జన్మించిన నీ దాసులకు నమస్కరించమని, కానుకలు సమర్పించమని, వారి శేషాన్ని స్వీకరించమని, నీతో సరిసమానులుగా భావించమని నీవు ఉపదేశించావు కదా!' అంటూ భాగవతభక్తిని బోధించారు.

అన్నమయ్య భాగవతోత్తములైన హనుమంతుడు, ప్రహ్లాదుడు, ధృవుడు మొదలైన వారిని కీర్తించారు (ఉదా: 2–207, 2–41, 4–528 మొ॥). అలాగే, రామానుజుని కడపటి సందేశమైన భాగవత భక్తిని తన కీర్తనలలో ప్రతిఫలించారు.

*హరిదాసులు మెట్టినక్కడే పరమపద–*

*మరయ నిందుకంటె నవల లేదు*

*తిరమై వీరి పాదతీర్థమే విరజానది*

*సొరిది నన్ని చోట్లు చూచినట్టే వున్నది*

*మచ్చిక వైష్ణవుల మాటలెల్లా వేదములు*

*యిచ్చల నిందుకంటే నింక లేదు*

*అచ్చట వీరిప్రసాద మమృతపానములు*

*అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది* (1–479)

'హరిదాసులున్న చోటే పరమపదం. వారి పాదతీర్థమే విరజానది. వైష్ణవుల మాటలే వేదాలు. వారి ఉచ్ఛిష్టం అమృతంతో సమానం' అంటూ భాగవత భక్తిని అన్నమయ్య ప్రదర్శించారు.

ఈ విధంగా అన్నమయ్య కీర్తనల నిండా వ్యాపించి ఉన్న విశిష్టాద్వైత తత్త్వాన్ని, విశిష్ట పురుషులను, విశిష్టాద్వైత సిద్ధాంతాలను ఈ అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేశాను. భారతదేశంలో తొలి మతం వైదిక మతం. ఆ మతంలోని ఆచారాలను, చాతుర్వర్ణ వ్యవస్థను ఖండిస్తూ బౌద్ధ, జైన మతాలు వెలుగు చూశాయి. వివిధ వైదిక, అవైదిక మతాల మధ్య విభేదాలను ఖండిస్తూ, అవైదిక మతాలను నిరసిస్తూ, వేద ప్రామాణ్యాన్ని తిరిగి నెలకొల్పుతూ అద్వైతం ప్రభవించింది. నిరాకార, నిర్గుణ బ్రహ్మాన్ని, జీవబ్రహ్మైకత్వాన్ని ప్రతిపాదించిన అద్వైతాన్ని ఖండిస్తూ అప్పటి సమాజపు చారిత్రకావసరంగా విశిష్టాద్వైతం ఆవిర్భవించింది. విశిష్టాద్వైతానికి సైద్ధాంతిక నేపథ్యం ద్రవిడ దేశంలో క్రీస్తు శకం 3-9 శతాబ్దుల మధ్య పుట్టిన భక్తి ఉద్యమం అందించింది. భక్తి ఉద్యమంలో భాగంగా ఆళ్వారులు రచించిన పాశురాలు, వాటి ఆధారంగా ఆచార్యులు రూపొందించిన సిద్ధాంత గ్రంథాలు విశిష్టాద్వైతానికి స్పష్టమైన స్వరూపాన్ని కల్పించాయి. ఆళ్వార్ల గీతాలు, ఆచార్యుల గ్రంథాలు, విశిష్టాద్వైత సిద్ధాంతాలు విశిష్టాద్వైతి అయిన అన్నమయ్యని విశేషంగా ప్రభావితం చేశాయి.

రెండవ అధ్యాయంలో *భాగవతం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణా*ల్లోని ఉదాహరణలను అనుసరించి నవవిధ భక్తిమార్గాలను అధ్యయనం చేసే ప్రయత్నం చేశాను. ఈ అధ్యయనం అన్నమయ్య సంకీర్తనలలోని నవవిధ భక్తిమార్గాలను విశ్లేషించడానికి ఉపకరించింది.

*****

# అధ్యాయం—2

## నవవిధ భక్తి మార్గాలు :

## పూర్వ కవుల దర్శనం

# అధ్యాయం-2

# నవవిధ భక్తి మార్గాలు : పూర్వ కవుల దర్శనం

## 2.0. పరిచయం

అధ్యాత్మిక చింతనలో భాగంగా భారతదేశంలో కర్మ (యజ్ఞ యాగాదులు), జ్ఞాన (జప, తపాదులు, తాత్త్విక చింతన), భక్తి మార్గాలను అవలంబించినట్లుగా మొదటి అధ్యాయంలో గమనించాం. అన్ని మార్గాలలోకి భగవంతుని చేరే సులభతరమైన మార్గం, అందునా కలియుగంలో అనుసరించగలిగిన ఏకైక మార్గం భక్తి అని మన పూర్వీకులు గుర్తించారు. *సంసార ప్రవిష్టుండైన వానికిఁ దపోయోగాదు లయిన మోక్షమార్గంబులు పెక్కులు గల వందు భక్తిమార్గంబుకంటె సులభంబు లేదు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:313 – [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-34వ పద్యం]) – 'సంసారి అయిన మానవుడికి తపస్సు, యోగం వంటి మోక్షమార్గాలు అనేకం ఉన్నప్పటికీ భక్తి మార్గంకంటే సులభమైనది వేరొకటి లేదు.' ఈ భక్తికి అనేక నిర్వచనాలు ఉన్నాయి.

*సా త్వస్మిన్ పరమప్రేమ రూపా* (వేంకటేశ్వర శాస్త్రి, జంధ్యాల. 1985:9) అంటూ 'భగవంతుడిపట్ల ఉత్కృష్టమైన ప్రేమ రూపమే భక్తి' అన్నారు నారదమహర్షి.

ఆదిశంకరులు *స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే* (ఉదయభాస్కరమ్, బులుసు. 2017:21) అంటూ 'మానవుడు తన స్వరూపాన్ని తెలుసుకొని, దానితో మమేకం చెందడమే భక్తి' అన్నారు.

*అన్యాభిలాషితా శూన్యం జ్ఞానకర్మాద్యనావృతమ్ । అనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తిరుత్తమా ॥* (వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985:3 – [భక్తిరసామృత సింధువు-

పూర్వవిభాగం-ప్రథమలహరి-11వ శ్లోకం]) - 'ఇతరమైన కోరికలు లేనిది, జ్ఞానకర్మాదులచే ఆవరింపబడనిది, నిరంతరం కృష్ణుని ఆరాధించేది అయిన భక్తి ఉత్తమమైన' దని భక్తిరసామృత సింధువు చెబుతోంది.

'భగవంతుడిగురించి నిజమైన నిష్కళంకమైన అన్వేషణయే భక్తియోగ'మని స్వామి వివేకానందులు చెప్పారు (స్వామి చిరంతనానంద. 2015:1).

భక్తి కవిత్వానికి పట్టాభిషేకం చేసి, తెలుగు సాహిత్యంలో భక్తిని రసస్థాయికి తీసుకెళ్ళిన రచనలు 15వ శతాబ్దిలో వెలువడ్డాయి. శ్రీనాథుడు, పోతన, అన్నమయ్య, మొల్లవంటి ఎందరో భక్త కవులు ఈ శతాబ్దిలో అజరామరమైన భక్తి సాహిత్యాన్ని సృజించి తెలుగునేలపై భక్తి మార్గాన్ని సుప్రతిష్ఠితం చేశారు.

ఒకే భగవంతుడు వివిధ రూపాల్లో కనిపిస్తూ వివిధ మనఃప్రవృత్తులు కలిగిన భక్తులను ఆకర్షిస్తున్నట్టే, ఒకే భక్తి ప్రవాహం వివిధ భక్తులద్వారా అనేక విధాలుగా ప్రవహిస్తూ దయా సముద్రుడైన భగవంతుడిని చేరుకుంటోంది. విష్ణువును కొలుచుకునేందుకు నవవిధ మార్గాలు ఉన్నట్లు కనుగొన్నాడు వేదవ్యాసుడు.

*శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం*
*అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్* (వీరరాఘవ. 1976:68 –
[శ్రీమద్భాగవతమ్-7వ స్కంధం-5వ అధ్యాయం-23వ శ్లోకం)

'శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే తొమ్మిది మార్గాల ద్వారా భక్తులు విష్ణువును కొలుస్తా'రని వ్యాసుడు చెప్పాడు.

ఈ నవవిధ భక్తి మార్గాలు విష్ణుపారమ్య బోధకాలైన రామాయణ, భాగవతాల్లో ఎలా ప్రతిఫలించాయో, ముఖ్యంగా నవవిధ భక్తి మార్గాలను తెలుగులో తొలిసారిగా ప్రతిపాదించిన

*పోతన భాగవతంలో* అవి ఎలా ద్యోతకమవుతున్నాయో పరిశీలించడం ఈ అధ్యాయం ముఖ్యోద్దేశం. అలాగే, *మొల్ల రామాయణం, భాస్కర రామాయణాల*లోకూడా ఇందుకు సంబంధించిన ఉదాహరణలు చూపడానికి ప్రయత్నించాను.

> *తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా*
> *ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం*
> *బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స*
> *జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలతున్ సత్యంబు దైత్యోత్తమా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:356 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–167వ పద్యం])

'రాక్షసరాజా! భక్తి మార్గాలు తొమ్మిది; అవి సఖ్యం, శ్రవణం, దాస్యం, వందనం, అర్చనం, సేవనం, ఆత్మనివేదనం, కీర్తనం, చింతనం; ఈ తొమ్మిది భక్తి మార్గాలతో సర్వాంతర్యామి అయిన శ్రీహరిని పూజిస్తూ ఉత్తముడిగా జీవించుటే సత్యమార్గం అని నాకు అనిపిస్తుంది' అని వ్యాసుడు నిర్వచించిన నవవిధ భక్తిని పోతన ఆంధ్రీకరించారు.

ఈ నవవిధ భక్తి మార్గాలను పోతన తన భాగవతంలో సర్వత్రా నిక్షేపించి, వీటికి శాశ్వతత్వాన్ని కల్పించారు. భాగవతారంభమే *శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెద* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:1 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–1వ పద్యం]) అంటూ స్మరణభక్తితో ప్రార్థన చేసి, *వాలిన భక్తి మ్రొక్కెద* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:2 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–2వ పద్యం]) అని వందనభక్తిని, *ఆతత సేవఁ జేసెద* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:3 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–3వ పద్యం]) అని దాస్యభక్తిని, *చేతులారంగ శివునిఁ బూజింపఁడేని, నోరు నొవ్వంగ హరి కీర్తి నొడవఁడేని*

(కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:10 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-14వ పద్యం]) అంటూ అర్చన, కీర్తన భక్తి మార్గాలను నిక్షిప్తం చేసిన పోతన, భాగవతం నిండా నవవిధ భక్తి మార్గాలకు సంబంధించిన, నవవిధ భక్తి మార్గానుయాయులకు సంబంధించిన కథలను విపులీకరిస్తూ, నవవిధ భక్తి మార్గాలను ప్రతిష్ఠాపించారు.

### 2.1. శ్రవణం

*శ్రవణం నామ చరితగుణాదీనాం శృతిర్భవేత్* (వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985:68 – [భక్తిరసామృత సింధువు-పూర్వవిభాగం-ద్వితీయలహరి-170వ శ్లోకం]) – 'భగవంతుని నామ, గుణ, చరిత్రలను శ్రద్ధతో వినడమే శ్రవణభక్తి'గా భక్తిరసామృత సింధువు పేర్కొంది. శ్రవణంవల్లనే మానవుడికి మొట్టమొదటిసారిగా దైవంగురించిన పరిచయం ఏర్పడుతుంది. బాల్యదశలోనే తల్లి లేక తండ్రి భగవంతుడిగురించి చెబుతారు. ఆ విధంగా శ్రవణంద్వారా భగవత్పరిచయం మొదట కలుగుతుంది. దేనిగురించి నిరంతరం వింటూ ఉంటామో దానిమీదనే మనసు లగ్నమయి ఉంటుంది. అదే ఆరాధనా పూర్వకమైన భక్తి భావంగా పరిణమిస్తుంది.

ఆది నుండి భారతీయులది శ్రవణ సంప్రదాయమే. రామాయణ, మహాభారతాది ఇతిహాస కథా శ్రవణం, మహాభాగవతాది పురాణ కథా శ్రవణం చేయడం జానపదుల జీవితాల్లో ఒక భాగంగా ఉండేది. *శృణ్వం తపః* అన్నారు పెద్దలు. వినడం ఒక తపస్సుగా భావించేవారు. అక్షర శుద్ధి లేని అశేష ప్రజానీకం భగవత్కథా శ్రవణంద్వారానే అధ్యాత్మికతను అనుభవించేవారు. వినడంవల్ల జ్ఞానం కలుగుతుంది. శ్రవణంలో ఏది వినాలి? ఎవరినుండి వినాలి? అనేవి ముఖ్యమైన ప్రశ్నలు.

లౌకిక శ్రవణంవల్ల అంటే మంచి సలహా విని ఆచరించడం వలన లౌకిక ప్రయోజనాలు నెరవేరతాయి. అదే దైవికమైన శ్రవణం వల్ల అధ్యాత్మిక ప్రయోజనాలు నెరవేరతాయి. ఎవరు

పడితే వారు చెప్పింది వినడంవల్ల ఏ ప్రయోజనం ఉండదు. వక్తకు లేక ప్రవచనకర్తకు అర్హత ఉండాలి. శ్రవణానికి మంచి శ్రోత ఎంత అవసరమో, గొప్ప వక్తను ఎంచుకోవడం కూడా అంతే ముఖ్యం. అందుకే శ్రవణానికి సత్పురుషుల స్నేహం చాలా అవసరమని అంటారు గోస్వామి తులసీదాసు.

*బిను సత్సంగ్ న హరికథా తేహి బిను మోహ న భాగ్ ।*

*మోహ్ గయేఁ బిను రామ్ పద్ హోఇ న దృఢ అనురాగ్ ॥* (రామచంద్రశర్మ, జోస్యుల. 2017:10)

'సత్పురుషులతో కలవనిదే భగవంతుని కథలు లభించవు, ఆ కథలు లభించనిదే మోహం నశించదు, మోహం నశించనిదే భగవంతుని పాదకమలాలపై స్థిరమైన అనురాగమేర్పడదు. కాబట్టి, శ్రేయస్సు ప్రాప్తించడానికి సత్పురుషుల కలయిక మొదటి మెట్టు'

శౌనకాది మహర్షులకు సూతుడు, పరీక్షిత్తుకు శుకుడు, రుక్మిణికి నారదుడు వంటి గొప్ప బోధకులు దొరికారు కనుకనే, వారు హరికథా శ్రవణంద్వారా తరించగలిగారు.

భాగవతారంభంలోనే సూతుడు శౌనకాది మహర్షులకు శ్రవణంవల్ల కలిగే ప్రయోజనాలను గురించి చెబుతూ ఇలా అంటాడు.

*కర్మనిర్మూలన హేతువు లైన కమలలోచను కథలం దెవ్వండు రతిసేయు, విన నిచ్చగించు, వాని కితరంబు లెవ్వియు రుచి పుట్టింపనేరవు. పుణ్యశ్రవణకీర్తనుండైన కృష్ణుండు దన కథలు వినువారి హృదయంబులందు నిలిచి శుభంబు లాచరించు; నశుభంబులు పరిహరించు* (పోతన, 2009[సంపుటం-1]:9) (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:36,37 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-58వ వచనం])

‘ఎవరైతే విష్ణు కథలను వినటానికి ఇష్టపడతారో, వారికి ఇతరమైన లౌకిక విషయాల వైపుకు ధ్యాస మళ్ళదు. తన కథలను ఇష్టంగా వినే భక్తుల హృదయాలలో నిలిచి, శ్రీకృష్ణుడు శుభాన్ని కలిగిస్తాడు. అశుభాలను తొలగిస్తాడు.’ అంతే కాక, శ్రవణ భక్తివల్ల సామీప్య మోక్షం లభిస్తుందని భాగవతం చెబుతోంది.

> ------------------హరికథామృతమును గర్ణపుటంబులఁ గాంక్ష దీరఁ
> గ్రోలుచుండెడు ధన్యులు కుటిలబహుళ విషయ మలినీకృతాంగముల్ వేగ విడిచి
> విష్ణుదేవుని చరణారవిందయుగము, కడకుఁ జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర!
> (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:314 –
> [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-36వ పద్యం])

‘హరి కథలను చెవులారా వినే ధన్యులు విషయవాసనలను త్వరగా విడిచిపెట్టి, విష్ణు పాదాలను చేరుకుంటారు’ అని శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో అంటారు. *నీ కథల్ చెవులలో సోకుట మొదలుగా పులకాంకురము మేనబుట్టువాడు..నీదు లోకంబు నందుండు నీరజాక్ష* (నరసయ్య, సంగనభట్ల. 2014:94 – [నరసింహ శతకం-91వ పద్యం])’ – ‘భగవత్కథలు చెవిలో పడగానే శరీరంలో పులకరింతలు కలిగి మైమరిచిపోతూ వినా’లంటూ శ్రవణం ఏ విధంగా ఉండాలో చెప్పారు నరసింహ శతకకర్త శేషప్ప కవి.

### 2.1.1. భాగవతం

అసలు భాగవతంలోని ఇతివృత్తమంతా ఇద్దరు వక్తలు తమ తమ శ్రోతలకు విష్ణు సంబంధితమైన కథలను చెప్పడమే. పరీక్షిత్తు శుకమహర్షివద్ద విన్న విష్ణు సంబంధమైన కథలను, శౌనకాది మహర్షులు సూతునిద్వారా విన్నారు. ఆ విధంగా శ్రవణ భక్తి ప్రాధాన్యాన్ని సంస్థాపించింది భాగవతం.

*పూనిన తద్భక్తి సమీ*

*చీనగతిం దెలియ ననఘ; చిర వైరాగ్య*

*జ్ఞాన జనక మగు భక్తి ని*

*ధానము గోవింద వరకథాశ్రయమ యగున్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–3:421 – [ఆంధ్రమహాభాగవతం–4వ స్కంధం–866వ పద్యం])

'భక్తి తత్త్వం తెలియాలంటే గోవిందుని కథలను వినటమే మార్గ'మని భాగవతం ప్రవచించింది.

*...............ముకుందుని పదకమలమరందపానపరవశులై పెం*

*పొదవిన వారిచరిత్రము సదమలమతి వినిన భవము సఫలము గాదే?*

(కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–2:187 – [ఆంధ్రమహాభాగవతం–3వ స్కంధం–392వ పద్యం])

'భగవంతుని కథలే కాక, భాగవతుల కథలు విన్నా జన్మ సఫలమవుతుం'దని ఉద్ఘాటించింది. ఆ విధంగానే, భాగవతం మొత్తం భగవంతుని లీలల, భాగవతుల కథల సమాహారంగా ఉంటుంది.

### 2.1.1.1. శౌనకాది మహర్షులు

నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు విష్ణు సాన్నిధ్యం కోసం వెయ్యి సంవత్సరాల పాటు సత్రయాగం చేస్తూ, అక్కడికి వచ్చిన సూతమహర్షిని చూసి,

*ఎవ్వని యవతార మెల్ల భూతములకు సుఖమును వృద్ధియు సొరిదిఁజేయు*

*నెవ్వని శుభనామ మే ప్రొద్దు నుడువంగ సంసార బంధంబు సమసిపోవు*

*నెవ్వని చరితంబుఁ హృదయంబుఁ జేర్పంగ భయమొంది మృత్యువు పరువువెట్టు*

*నెవ్వని పదనది నేపాఱు జలములు సేవింప నైర్మల్యసిద్ధి గలుగుఁ*

*దపసు లెవ్వని పాదంబు దగిలి శాంతి*

*తెరువుఁగాంచిరి; వసుదేవదేవకులకు*

*నెవ్వఁ డుదయించెఁ దత్కథలెల్ల వినఁగ*

*నిచ్చ పుట్టెడు నెఱిఁగింపు మిద్ధచరిత!* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017.

సంపుటం–1:29 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–45వ పద్యం])

'ఎవరు అవతారం దాల్చడంవలన సకలజీవులకు సుఖసౌఖ్యాలు కలుగుతాయో, ఎవరి పేరు పలకడంవలన సంసారబంధాలు తొలగిపోతాయో, ఎవరి చరిత్ర తలచుకున్నంతమాత్రాన మృత్యువు పరుగు పెడుతుందో, ఎవరి పాదతీర్థం సేవించడంవలన సమస్త దోషాలు పరిహారమవుతాయో, ఎవరి పాదాలను చేరి ఋషులు శాంతి పొందుతారో, వసుదేవ దేవకులకు ఎవడు పుట్టాడో, అట్టి కృష్ణుడి కథలు వినాలనే కోరిక కలుగుతోంది. మాకు చెప్పవయ్యా' అని హరికథాశ్రవణం చేయాలనే ఆసక్తి కనపరచడంతో భాగవతం ప్రారంభమవుతుంది.

*అనఘ! విను రసజ్ఞులై వినువారికి*

*మాటమాట కధిక మధురమైన*

*యట్టి కృష్ణు కథన మాకర్ణనము సేయఁ*

*దలఁపు గలదు మాకుఁ దనివి లేదు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017.

సంపుటం–1:31 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–48వ పద్యం])

'మధురాతి మధురమైన కృష్ణుని కథలు వినాలనే కోరికతో ఉన్న మాకు, ఎంత విన్నా తనివి తీరదు' అంటూ శౌనకాది మహర్షులు ఎంతో శ్రద్ధాభక్తులతో హరికథలను విన్నారు.

### 2.1.1.2. పరీక్షిత్తు

ఏడు రోజుల్లో తాను మరణించబోతున్నానని తెలుసుకొన్న పరీక్షిన్మహారాజు, ఆ ఏడు రోజుల్లో కర్మమార్గంలో వెళ్ళి యజ్ఞయాగాదులను ఆచరించలేదు. జ్ఞాన మార్గమైన జప తపాదులలో మునగలేదు. భక్తిని, అందునా శ్రవణ భక్తిని మోక్ష సాధనంగా ఎంచుకుని, శుకమహర్షివంటి గొప్ప భక్తునిద్వారా భాగవత కథా శ్రవణం చేసి తరించాడు.

> *బ్రాహ్మణ శాపంబునం జేసి శోకవ్యాకుల చిత్తుండవై యనశన వ్రతుండవైన నీవు వినుట యెట్లని సందేహింప వలదు; త్వదీయ ముఖారవింద వినిఃసృత నారాయణ కథామృత పాన కుతూహలి నైన నాకు నింద్రియంబులు వశంబులై యుండు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:404 – [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-222వ పద్యం])

'బ్రాహ్మణ శాపంవల్ల కలత చెంది ఉన్నాను, పైగా ఉపవాస వ్రతంతో ఉన్నాను. మరి ఎలా వింటానోనని సందేహించనవసరం లేదు. నారాయణ కథామృత పానం చేయాలనే ఉత్సుకతతో ఉన్న నాకు నా ఇంద్రియాలు వశమై ఉంటాయి' అంటూ పరీక్షిన్మహారాజు శుకమహర్షితో పలికి, ఏడు రోజులపాటు శ్రద్ధగా హరికథలు విన్నాడు. జిజ్ఞాసతో అనేక సందేహాలను వెలిబుచ్చి, సమాధానాలను తెలుసుకున్నాడు.

ఎంతో ఆసక్తితో వినడమే కాక;

> *అప్పటినుండి బుధోత్తమ! చెప్పెదు భగవత్కథావిశేషంబులు నా*
> *కెప్పుడుఁదనివి జనింపదు సెప్పఁగదే చెవులు నిండ శ్రీహరికథలన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:66 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-144వ పద్యం])

'ఎంతోకాలంనుండి నువ్వు భగవత్కథా విశేషాలు చెబుతున్నా, నాకు తనివి తీరట్లేదు. ఇంకా నా చెవులకు పండుగగా శ్రీహరికథలను వినిపింపు'మని కోరాడు.

*ఏ యే యవతారంబుల నే యే కర్మములు సేసె నీశుఁడు హరి భ*

*ద్రాయతనము లన్నియు వినఁ బాయదు చిత్తంబు సెవులపండువు లయ్యెన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:93 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-245వ పద్యం])

'హరి తన అవతారాలలో చేసిన లీలలు మనసును విడిచి పోవట్లేదు. చెవులకు పండుగగా ఉంది' అంటూ మురిసిపోయిన పరీక్షిన్మహారాజు చక్కటి శ్రవణభక్తిని ప్రదర్శించాడు.

### 2.1.1.3. నారదుడు

నారదుడి పూర్వ జన్మ వృత్తాంతం శ్రవణభక్తికి తార్కాణంగా చెప్పుకోదగ్గది. పూర్వ జన్మలో వేదవాదుల ఇంటిలో దాసీపుత్రుడిగా జన్మించిన నారదుడు, ఆ యోగిజనుల నోట కృష్ణుని కథలు వినివిని, నిరంతర శ్రవణ ఫలంగా పూర్తిగా హరిభక్తుడిగా మారి జన్మ సాఫల్యాన్ని పొందాడు.

*వారల్ కృష్ణు చరిత్రముల్ చదువఁగా, వర్ణింపఁగాఁ, బాడఁగా,*

*నా రావంబు సుధారసప్రతిమమై యశ్రాంతమున్ వీనులం*

*దోరంబై పరిపూర్ణమైన, మది సంతోషించి నే నంతటం*

*బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభదూరుండనై* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:73 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-107వ పద్యం])

అలా ఉత్తర జన్మలో బ్రహ్మ మానసపుత్రుడైన నారదుడిగా పుట్టి పూర్వజన్మ స్మృతివలన నిరంతర హరిచింతనారతుడై, బ్రహ్మవలన భగవంతుడి గుణస్వరూపాలనుగురించి,

లీలలనుగురించి తెలుసుకునే క్రమంలో గొప్ప శ్రవణ భక్తిని ప్రదర్శించాడు (2–74 నుండి 2–79).

### 2.1.1.4. విదురుడు

వేదాంతవిద్యాతత్త్వరహస్యాలను మైత్రేయ మహర్షివద్ద తెలుసుకోవాలనుకున్న విదురుడు శ్రవణ భక్తికి ఉదాహరణ.

*సతతమున్ సరసీరుహోదరసత్కథామృతపూరమున్*
*శ్రుతిపుటాంజలిచేత నిమ్ముల జుఱ్ఱియుందనివోదు భా*
*రతకథామిషమూని విష్ణుఁ బరాశరప్రియసూతి స*
*న్మతి నుతించిన చోట సన్మునినాథ! నా మది నుబ్బుదున్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–2:78 – [ఆంధ్రమహాభాగవతం–3వ స్కంధం–185వ పద్యం])

'విష్ణుకథామృతాన్ని నా చెవులనే దోసిళ్లతో ఎంత ప్రీతిగా జుఱ్ఱినా నాకు తనివి తీరదు. భారత కథా సందర్భంలో అక్కడక్కడ వ్యాస మహర్షి చేసిన విష్ణుకథా ప్రసంగానికే నేను ఎంతో పొంగిపోతాను' అని విష్ణుకథాశ్రవణంపట్ల ఎంతో ఆసక్తిని ప్రదర్శించాడు విదురుడు.

*మృదుగతిఁబువ్వుఁ దేనియ రమించుచుఁ బానము సేయఁ బాఱు ష*
*ట్పదమునుబోలి యార్తజనబాంధవు విశ్వభవస్థితివ్యయా*
*స్పదమహితావతారుఁ డగు పంకరుహోదరు నిత్యమంగళ*
*ప్రద గుణకీర్తనామృతముఁ బాయక గ్రోలెదఁ జెప్పవే దయన్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–2:81 – [ఆంధ్రమహాభాగవతం–3వ స్కంధం–194వ పద్యం])

'తుమ్మెద పూదేనెను ఆస్వాదించేందుకు ఎంత ఆనందంగా వెళుతుందో, అలాగే నేనుకూడా ఆపద్బాంధవుడు, సృష్టిస్థితిలయాలకు కారణభూతుడైన శ్రీమహావిష్ణువు గుణకీర్తనామృతాన్ని సంతోషంగా ఆస్వాదిస్తాను' అన్న విదురుడు శ్రవణభక్తికి మంచి ఉదాహరణగా నిలిచాడు.

## 2.1.2. మొల్ల రామాయణం

రామాయణ ఫలశృతిగా

*ఈ రామచరిత మెప్పుడు*

*వారక విన్నట్టివారు వ్రాసినవారున్*

*గోరి పఠించినవారును*

*శ్రీరామునికరుణ మేలు సెందుదు రెలమిన్* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:160 – [మొల్ల రామాయణం–యుద్ధకాండ–తృతీయాశ్వాసం–136వ పద్యం])

తను రచించిన 'రామచరితను వదలక, ఎప్పుడూ వినేవారు, రాసేవారు, చదివేవారు రామునికరుణవలన మేలు పొందుతా'రంటూ శ్రవణభక్తి మహత్వాన్ని చెప్పారు కవయిత్రి మొల్ల.

## 2.1.3. భాస్కర రామాయణం

రామాయణం బాలకాండ మొత్తం శ్రవణానికి ప్రాధాన్యతనిచ్చిన కాండ. యాగరక్షణార్థం విశ్వామిత్రుడి వెంట వెళ్ళిన రామలక్ష్మణులు ఎన్నో విషయాలను విశ్వామిత్రుడిని అడిగి తెలుసుకుంటారు.

తాను స్వయంగా సర్వజ్ఞుడైనా, పెద్దలవద్ద శ్రద్ధతో పుణ్యకథాశ్రవణం చేయాలనే సంప్రదాయాన్ని పాటించి, శ్రీరామచంద్రుడు లోకానికి ఆదర్శప్రాయంగా నిలిచాడు. వామన

చరిత్ర, కుశనాభ వృత్తాంతం, కుమారస్వామి వృత్తాంతం, గంగావతరణం, క్షీరసాగరమథనం మొదలైన కథలను భక్తిశ్రద్ధలతో రామలక్ష్మణులు విశ్వామిత్రుడివద్ద విన్నారు.

> *కని రాముఁడు సంతోషంబున విశ్వామిత్రుఁ జూచి పుణ్యప్రదయై*
> *తనరెడు గంగ జగత్పావనజననక్రమము వినఁగవలయున్ మాకున్* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:37 – [భాస్కర రామాయణం–బాలకాండ–344వ పద్యం])

రాముడు సంతోషంతో విశ్వామిత్రుని చూసి, 'పుణ్యదాయినిగా పేరు పొందిన గంగ జన్మవృత్తాంతం వినాలని ఉంది' అంటూ అడగడమే కాకుండా, ఎంతో శ్రద్ధతో విని,

> *మునివర గంగాగమనంబును సాగరపూరణంబు ముదమున నీచే*
> *వినఁగా క్షణమై రాతిరి చనియెను మది విమలమయ్యె సమ్మద మొదవెన్* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:48 – [భాస్కర రామాయణం–బాలకాండ–463వ పద్యం])

'నువ్వు చెప్పిన పుణ్యకథలను సంతోషంగా వింటూంటే రాత్రి క్షణంలో గడిచిపోయింది, మనస్సు నిర్మలమై, సంతోషభరితం అయిం'దని విశ్వామిత్రుడితో చెప్పిన రాముడి శ్రవణభక్తిని భాస్కరరామాయణం ఎంతో శ్లాఘించింది.

## 2.2. కీర్తనం

శ్రవణం ద్వారా పరిచయమైన భగవంతుని గుణాలను అనుభవించిఅనుభవించి, పలవరించటాన్ని కీర్తనం అంటారు. భగవంతుని నామ, రూప, గుణ, లీలా విశేషాదులను కీర్తించడమే కీర్తన భక్తి. అనాదిగా భక్త కవులంతా కీర్తనంద్వారానే భగవంతుడిని సేవించి తరించారు.

*హరునకు నవ్విభీషణున కద్రిజకుం దిరుమంత్ర రాజమై*

*కరికి నహల్యకున్ ద్రుపదకన్యకు నార్తిహరించు చుట్టమై*

*పరగినయట్టి నీ పతిత పావననామము జిహ్వపై నిరం*

*తరము నటింపజేయుమిఁక దాశరథీ కరుణాపయోనిధీ!* (కులశేఖరరావు, ఎం. 2000:39)

'శివుడికి, విభీషణుడికి, పార్వతికి శ్రీమంత్రంగా; కరిరాజుకు, అహల్యకు, ద్రౌపదికి కష్టాలను తీర్చే చుట్టంగా భాసిల్లిన నీ పవిత్రమైన నామం నా నాలుకపై నిరంతరం ఉండేటట్లు చూడ'మని రామచంద్రుని వేడుకుంటూ నామకీర్తన ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు భక్త కవి రామదాసు.

**2.2.1. భాగవతం**

*భూషణములు వాణికి నఘ*

*పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ*

*త్తోషణములు కల్యాణ వి*

*శేషణములు హరి గుణోపచిత భాషణముల్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:30 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–46వ పద్యం])

'హరి కీర్తనలు మృత్యువును ఓడించేవి, మనస్సుకు సంతోషాన్ని కలిగించేవి, పాపాలను తొలగించేవి, శుభాలను సమకూర్చేవి'గా శౌనకాది మహర్షులు పేర్కొన్నారు.

కీర్తనభక్తి అనేక రకాలుగా ప్రవర్తిల్లుతుంది. భాగవతంలో కీర్తనభక్తిని ఈ విభాగాలుగా పేర్కొనవచ్చు. 1. నామ కీర్తన 2. దివ్య స్వరూప కీర్తన 3. గుణ కీర్తన 4. లీలా విశేష/అవతార కీర్తన

### 2.2.1.1. నామ కీర్తన – కుంతి

తన మేనల్లుడనే భ్రాంతిని విడిచి, కృష్ణుడిని భగవానునిగా తెలుసుకున్న కుంతి, *యాదవు లందుఁ బాండుసుతులందు నధీశ్వర! నాకు మోహవిచ్ఛేదము సేయుమయ్య* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:119 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-199వ పద్యం]) – 'తన కన్నకొడుకులపై మోహాన్ని తొలగించ'మని ప్రార్థించింది. తద్వారా అహర్నిశం తనకు భగవంతుడి పాదపద్మాలపై భక్తి కలిగేటట్టు చేయమన్న కుంతి చేసిన నామకీర్తన:

*శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!*
*లోకద్రోహి నరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా*
*నీక బ్రాహ్మణ గోగణార్తిహరణా! నిర్వాణసంధాయకా!*
*నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:119,120 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-200వ పద్యం])

### 2.2.1.2. దివ్యస్వరూప కీర్తన

#### 2.2.1.2.1. భీష్ముడు

అంపశయ్యపై పడి ఉన్న భీష్ముడు ధర్మరాజుకు అతని కోరికపై ఎన్నో ధర్మాలను బోధించాడు. అటు పిమ్మట ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిందని తెలుసుకుని ప్రాణాలను వదలడానికి సిద్ధమయ్యాడు. తన చూపులను పూర్తిగా శ్రీకృష్ణునిపై కేంద్రీకరించి, తన అంత్యకాలంలో ఈ విధంగా పరమాత్ముని దివ్యస్వరూప కీర్తన కావించాడు.

*త్రిజగన్మోహన నీలకాంతిఁ దను వుద్దీపింపఁ బ్రాభాత నీ*

*రజబంధుప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక*

*వ్రజ సంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా*

*విజయుం జేరెడు వన్నెలాఁడు మది నావేశించు నెల్లప్పుడున్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:119 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-218వ పద్యం])

'ముల్లోకాలకు సమ్మోహనమైన నీలవర్ణ కాంతులతో నిగనిగలాడే మనోహరమైన దేహం గలవాడు, పొద్దుపొడుపు వేళ వెలుగులు చిమ్ముతున్న బాలభానుని ప్రభలతో మెరిసిపోతున్న బంగారు వస్త్రం ధరించువాడు, నల్లని ముంగురులు కదలాడుతుండే వాడు; ముద్దులు మూటగడుతున్న ముఖపద్మం కలవాడు, మా విజయుని చేరే వన్నెకాడు అయిన ఆ కృష్ణుడు నా మదిలో ఎప్పుడూ నిలుచి ఉండు గాక!' అంటూ అవసానదశలోకూడా పరమాత్ముని రూపకీర్తన చేస్తూ మరణించిన భీష్ముడు కీర్తనభక్తికి తార్కాణంగా నిలిచాడు.

### 2.2.1.2.2. శుకుడు

రామావతారం గురించి చెబుతూ పులకించిపోయి శుక మహర్షి చేసిన శ్రీరామ రూప కీర్తన ఇది.

*నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులన్*

*విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షమువాఁడు మేలు పైఁ*

*జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం*

*జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:451 – [ఆంధ్రమహాభాగవతం-9వ స్కంధం-361వ పద్యం])

'నల్లని రూపం కలవాడు, కమలాలవంటి కన్నులు కలవాడు, గొప్ప విల్లు, బాణాలను ధరించేవాడు, విశాలమైన వక్షస్థలం కలవాడు, ఎత్తైన భుజాలు కలవాడు, దిక్కుల్లో విస్తరించిన కీర్తి కలవాడు, అందరికీ శుభాన్ని కలిగించేవాడు, రఘువంశ శ్రేష్ఠుడు, అభీష్టప్రదాయకుడు' అంటూ రాముడిని తలచుకున్నాడు శుకమహర్షి. సూర్యవంశపు రాజులగురించి చెబుతూ, రాముడి కథను వంద పద్యాలలో వర్ణించి చెప్పిన తరువాతకూడా, తనివితీరక, శుకమహర్షి రాముని రూపాన్ని తన్మయంతో వర్ణించి గొప్ప కీర్తనభక్తిని చాటుకున్నాడు.

### 2.2.1.2.3. బ్రహ్మ

విష్ణుమాయను దాటడం ఎవరికీ శక్యం కాదు. ఒక్కోసారి చతుర్ముఖబ్రహ్మకూడా ఆ మాయలో పడుతుంటాడు. నిశ్చల ధ్యానంతో తిరిగి ఆ మాయను ఛేదిస్తుంటాడు. అలా ఒకసారి బ్రహ్మ శ్రీమహావిష్ణువే కృష్ణుడిగా అవతరించాడని తెలిసుండికూడా విష్ణు మాయలో పడి, ఈ చిన్ని బాలుడు అఘాసురుడు మింగిన గోపబాలురను, దూడలను ఎలా బ్రతికించాడో, అసలితని శక్తి ఎంతటిదో తెలుసుకుందామనుకుని, గోపబాలురను, దూడలను దాచేస్తాడు. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు కనుక, బ్రహ్మ దాచిన సంగతి తెలుసుకుని, తానే గోపబాలకుల, దూడల రూపాల్లో మారి సంచరిస్తాడు. బ్రహ్మ తన కాలమానంలో క్షణకాలం తరువాత వచ్చి, గోపబాలురు, దూడలు యథాతథంగా ఉండటం చూసి నివ్వెరబోతాడు. అప్పుడు శ్రీకృష్ణుడే బ్రహ్మపై జాలి తలచి, తన మాయను ఉపసంహరిస్తాడు. మాయపొరలు తొలగిన తరువాత, బ్రహ్మ శ్రీకృష్ణుని ముగ్ధమనోహర రూపాన్ని చూసి పరవశత్వంతో స్తోత్రం చేస్తాడు.

*శంపాలతికతోడి జలదంబు కైవడి మెఱుఁగు టొల్లియతోడి మేనివానిఁ*
*గమనీయ మృదులాన్నకబళ వేత్ర విషాణ వేణుచిహ్నంబులు వెలయువాని*
*గుంజా వినిర్మిత కుండలంబులవాని శిఖిపింఛవేష్టిత శిరమువానిఁ*

*వనపుష్పమాలికావ్రాత కంఠమువాని నలినకోమల చరణములవానిఁ*

*గరుణ గడలుకొనిన కడగంటివాని గో*

*పాలబాలుభంగిఁ బరగువాని*

*నగుమొగంబువాని నను(గన్నతండ్రిని*

*నిను భజింతు మ్రొక్కి నీరజాక్ష!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:205 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-548వ పద్యం])

'మెరుపుతీగతో కూడిన నీలమేఘంలా మెరుస్తున్న ఉత్తరీయంతో, చేతిలో చల్ది ముద్ద, కర్ర, కొమ్ము, పిల్లనగ్రోవులతో, గురువిందగింజలతో తయారైన కర్ణాభరణాలతో, తలపై నెమలిపింఛంతో, మెడలో పూలమాలతో, పద్మాలవంటి పాదాలతో, కరుణ నిండి ఉన్న కళ్ళతో, నవ్వుముఖంతో, గోపాలబాలుని వేషంలో ఉన్న నీకు నమస్కరిస్తున్నాను' అంటూ కమనీయమైన బాలకృష్ణుని రూపకీర్తన కావించాడు.

### 2.2.1.3. గుణ కీర్తన - ప్రచేతసులు

బ్రహ్మ సృష్టి మొదట్లో తన కుమారులైన సనకసనందులకు ఉపదేశించిన విష్ణు స్తోత్రాన్ని రుద్రుడు, పృథు చక్రవర్తి వంశస్థులైన ప్రచేతసులకు బోధించాడు. ప్రచేతసులు ఆ స్తోత్రంతో విష్ణువును మెప్పించగా, దర్శనమిచ్చిన విష్ణువును ఉద్దేశించి వారు చేసిన గుణకీర్తన ఈ విధంగా ఉంది.

*కేశవ! సంతత క్లేశనాశనుఁడవు కోరి మనో వాగగోచరుఁడవు*

*నిద్ధమనోరథ హేతుభూతోదార గుణనాముఁడవు సత్త్వగుణుఁడ వఖిల*

*విశ్వోద్భవస్థితి విలయార్థ ధారిత విపుల మాయాగుణ విగ్రహుఁడవు*

*మహితాఖిలేంద్రియ మార్గ నిరధిగత మార్గుండ వతి శాంతమానసుఁడవు*

*తవిలి సంసార హారి మేధస్కుఁ డవును*

*దేవదేవుఁడవును వాసుదేవుఁడవును*

*సర్వభూత నివాసివి సర్వసాక్షి*

*వైన నీకు నమస్కారమయ్య! కృష్ణ!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-3:447,448 – [ఆంధ్రమహాభాగవతం-4వ స్కంధం-918వ పద్యం])

'కేశవా! నీవు ఎల్లప్పుడూ భక్తుల కష్టాలను నశింపజేసేవాడవు. మనసుకు, మాటలకు అందనివాడవు. నీ గుణాలు, నీ పేర్లు గొప్ప కోరికలకు కారణమవుతుంటాయి. లోకాల సృష్టి, స్థితి, లయాలకు కారణమయ్యేది నీ మాయా శక్తి. ఇంద్రియాలకు అంతుచిక్కని వాడవు. ప్రశాంతమైన మనస్సు కలవాడవు. సంసార బంధాలను హరించేవాడవు. సర్వ ప్రాణులలో నివసిస్తావు. సర్వ సాక్షివి' అంటూ భగవానుని గుణాలను కీర్తించారు ప్రచేతసులు.

### 2.2.1.4. లీలా విశేష/అవతార కీర్తన

#### 2.2.1.4.1. శుక మహర్షి

ఆవు పాలు పితకడానికి పట్టే సమయానికంటే ఎక్కువ సమయం ఎక్కడా కుదురుగా ఉండని శుకమహర్షి ఏడు రోజులపాటు పరీక్షిత్తుకు హరి గాథలను, లీలలను చెప్పి పరవశించిపోయాడు. *యోగిసంఘమునకు నుత్తమవ్రతములు వాసుదేవనామవర్ణనములు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:290 – [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-7వ పద్యం]) అంటూ పొంగిపోతూ విష్ణుకథావిశేషాలను పరీక్షిత్తుకు తెలిపిన శుకుడు లీలా కీర్తనతో తరించినవాడు.

#### 2.2.1.4.2. బ్రహ్మ

*అన్య కథానులాపము లహర్నిశమున్ వినునట్టి సత్క్రియా*

*శూన్యములైన కర్ణముల సూరిజనస్తుత సర్వలోక స*

*మ్మాన్యమునై తనర్చు హరిమంగళ దివ్యకథామృతంబు సౌ*

*జన్యతఁ గ్రోలవయ్య బుధసత్తమ! యే వివరించి చెప్పెదన్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:357 – [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-113వ పద్యం])

'రేయింబవళ్ళు ఏ మాత్రం పసలేని ఇతర కథా ప్రసంగాలను వినే చెవులకు, ముల్లోకాలకు పూజనీయమైన హరి మంగళ దివ్య కథామృతాన్ని అందిస్తాను. తనివితీరా ఆస్వాదించవయ్యా' అంటూ విష్ణువు 25 అవతార విశేషాలను నారదుడికి చెబుతూ బ్రహ్మ పులకించిపోయాడు.

### 2.2.2. మొల్ల రామాయణం

రావణునితో మాట్లాడుతూ సీత చేసిన మూలంలో లేని ఈ మధుర రామ కీర్తనం కవయిత్రి మొల్ల చేసిన రామకీర్తనమే.

*కూకటిముడికినై కురులు గూడనినాఁడె బెదరక తాటకఁ బీఁచ మణఁచె*

*గాధేయుఁడొనరించు క్రతువును రక్షింపఁ బెక్కండ్రు దైత్యుల నుక్కణంచె*

*నవనిపై విలసిల్లు నఖిలరాజన్యులు వ్రేలఁ జూఁపఁగలేనివిల్లు విఱిచె*

*ఘోరాటవులలోనఁ గ్రుమ్మరునప్పుడు ఖరదూషణాది రాక్షసులఁ జంపెఁ*

*బాదరజమున నొకఱాయిఁ బడఁతిఁ జేసె*

*లీల మాయామృగంబును గూలనేసె*

*రాజమాత్రుండె మేదినీరక్షకుండు*

*రామభూపాలుఁడాదినారాయణుండు* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:64 – [మొల్ల రామాయణం-సుందరకాండ-64వ పద్యం])

'ముడికట్టుకోవడానికి తలపై సరిగ్గా జుత్తు కూడా మొలవనినాడే భయపడకుండా తాటకిని చంపాడు. విశ్వామిత్రుడి యాగరక్షణకోసం ఎందరో రాక్షసులను అంతమొందించాడు. రాజులెవ్వరూ వేలితో చూపడానికికూడా సాహసించలేని విల్లును విరిచాడు. అడవులలో తిరుగుతూ ఖరదూషణాది రాక్షసులను అణిచాడు. తన కాలిధూళితో ఒక రాతిని నాతిని చేశాడు. మాయామృగాన్ని కూల్చి వేశాడు. ఇన్ని లీలామానుష కార్యాలను చేసిన రామచంద్రుడు కేవలం రాజమాత్రుడనుకుంటున్నావా? రాముడు సాక్షాత్తు ఆదినారాయణుడే' అని రాముడిని తేలికగా తీసుకోవద్దంటూ రావణుడికి హితబోధ చేసింది సీతమ్మ. ఇది పూర్తిగా అమూలకమే. మొల్ల స్వతంత్రించి మూలంలో లేని రామకీర్తనం సీత పాత్రద్వారా చేయించారు.

హనుమంతుడు కూడా రామకీర్తనంలో పరవశించాడు.

*నీలమేఘచ్ఛాయఁ బోలు దేహము వాఁడు ధవళాబ్జ పత్ర నేత్రముల వాఁడు*
*కంబుసన్నిభమైన కంఠంబు గలవాఁడు బాగైన యట్టి గుల్భముల వాఁడు*
*తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాఁడు ఘనమైన దుందుభిస్వనము వాఁడు*
*పద్మరేఖలు గల్గు పదయుగంబులవాఁడు చక్కని పీనవక్షంబువాఁడు*
*కపటమెఱుఁగని సత్యవాక్యముల వాఁడు*
*రమణి రాముండు శుభలక్షణములవాఁడు*
*ఇన్ని గుణముల రూపింప నెసఁగువాఁడు*
*వరుస సౌమిత్రి బంగారువన్నెవాఁడు* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:70 – [మొల్ల రామాయణం–సుందరకాండ–102వ పద్యం])

'నీలమేఘాన్ని పోలిన దేహం, తెల్లకలువలవంటి కన్నులు, శంఖంలాంటి కంఠం, దీర్ఘమైన బాహువులు, భేరివంటి స్వరం, పద్మరేఖలు కలుగు పాదాలు, విశాలమైన వక్షం కలిగినవా'డని రాముడిని వర్ణిస్తాడు హనుమ. సీతమ్మ హనుమంతుడిని రామబంటుగా విశ్వసించలేక,

రాముడిగురించి వివరించమన్నప్పుడు చేసిన ఈ రాముని రూప, గుణ కీర్తనం, అటు తరువాత రావణుడివద్ద చేసిన రాముని లీలా కీర్తనం హనుమంతుడి కీర్తన భక్తికి ఉదాహరణలు.

### 2.2.3. భాస్కర రామాయణం

తనకంటే రామస్తుతిపరాయణుడైన వానరేంద్రుడిగా సీతచేత ఎన్నుకోబడిన హనుమ కీర్తన భక్తి శ్లాఘనీయమైనది.

*రాఘవుఁడు చారుమేచక మేఘశ్యాముఁడు గృపాసమేతుఁడు విబుధ*
*శ్లాఘాకలితుఁడు సమరామోఘాస్త్రుఁడు వికచపద్మముఖుఁడును మఱియున్*
(భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:323 – [భాస్కర రామాయణం–సుందరకాండ–287వ పద్యం])

'నల్లనిమేఘం వంటి శరీరచ్ఛాయ కలవాడు, దయకలవాడు, స్తుతిపాత్రుడు, తిరుగులేని అస్త్రములు కలవాడు, వికసించిన పద్మంవంటి ముఖం కలవాడు' అంటూ సీత కోరికపై రాముని రూప, గుణ కీర్తనం చేసి హనుమంతుడు రాముడిపై తన భక్తిని చాటుకున్నాడు.

## 2.3. స్మరణం

శ్రవణం వల్ల పరిచయమైన భగవంతుని గుణగణాలను నిరంతరం స్మరిస్తూ ఉండడమే స్మరణం. *ధ్యానం రూపగుణక్రీడాసేవాదేః సుష్ఠుచిన్తనమ్* (వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985:71 – [భక్తిరసామృత సింధువు–పూర్వవిభాగం–ద్వితీయలహరి–178వ శ్లోకం]) నిరంతరం ఈశ్వరుని రూపాన్నిగురించి, గుణగణాలనుగురించి, లీలలనుగురించి, కృపనుగురించి, ఈశ్వరుని సృష్టి అయిన ఈ ప్రకృతి విశేషాలనుగురించి స్మరించడాన్ని, భగవంతుడు జ్ఞాపకంరాని క్షణాన్ని వృథాగా భావించడాన్ని స్మరణ భక్తి అంటారు.

*సత్య మా హరినామ సంస్మరణ మొక్క ముహూర్తమాత్రము చాలు ముక్తిదమౌ నృపా* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:290 – [ఆంధ్రమహాభాగవతం–2వ స్కంధం–8వ పద్యం]) – 'ఏకాగ్రతతో ఒక్క ముహూర్తకాలం హరిని స్మరించినా అది మోక్ష కారణ'మవుతుందని భాగవతం బోధించింది.

*బిడ్డపేరుఁ బెట్టి పిలుచుట విశ్రామ*
*కేళినైన మిగులఁ గేలినైన*
*పద్య గద్య గీత భావార్థముల నైనఁ*
*గమలనయనుఁ దలఁపఁ గలుషహరము* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017.
సంపుటం–4:50 – [ఆంధ్రమహాభాగవతం–6వ స్కంధం–122వ పద్యం])

'బిడ్డ పేరు పిలిస్తూ అయినా, విశ్రాంతి సమయంలోనైనా, ఆటలలోనైనా, పద్య, గద్య, గీతాలలోనైనా శ్రీమహావిష్ణువును స్మరిస్తే చాలు, అది సకలపాపాలను తొలగిస్తుంది.' అంతే కాక, దైవం అంటే ఏమిటో తెలియని అజ్ఞాని సైతం హరిభక్తులతో కలిసి హరినామ స్మరణ చేస్తే చాలు, అది పాపాలను నిర్మూలిస్తుందని ఉద్ఘాటించింది భాగవతం. భగవంతుని నిరంతర స్మరణ ఏ కారణంవల్ల జరిగినా అది మోక్ష కారకమేనని భాగవతం ప్రబోధించింది.

### 2.3.1. భాగవతం

*ఉరుసంసారపయోనిధి తరణంబులుఁ బాపపుంజతరణంబులు శ్రీ*
*కరణంబులు ముక్తిసమాచరణంబులు బాలకృష్ణసంస్మరణంబుల్* (లక్ష్మణయ్య,
సముద్రాల. 2017. సంపుటం–6:93 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–
పూర్వ భాగము–246వ పద్యం])

'బాలకృష్ణుడిని స్మరించటం దాటశక్యంకాని సంసారసముద్రాన్ని దాటిస్తుంది; పాపరాశులనుండి ముక్తిని కలిగిస్తుంది; శ్రేయోదాయకమైనది; మోక్షదాయకమైనది' అంటూ బాలకృష్ణుడి లీలలు వింటూ మురిసిపోతాడు పరీక్షిన్మహారాజు.

ఋషభుని కుమారులు, భరతుని తమ్ములు, నిరంతర హరిస్మరణ పరాయణులు అయిన తొమ్మిది మంది ఋషులు ఒకనాడు విదేహరాజైన నిమి చేస్తున్న యజ్ఞం ముగుస్తున్న సమయంలో వెళ్ళారు. రాజు ప్రశ్నలకు బదులు చెబుతూ వారిలో కవి అనే మహర్షి హరిస్మరణ ఎలా ఉండాలో చెబుతూ ఇలా అంటారు.

*సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగ వినఁగవలయు*
*హర్షంబుతోడుత హరినామకథనంబు పాటల నాఁటలఁ బరఁగవలయు*
*నారాయణుని దివ్యనామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్నవలయుఁ*
*గంజాక్షులీలలు కాంతారముల నైన భక్తి యుక్తంబుగాఁ బాడవలయు*
*వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని*
*నొడువుచును లోకబాహ్యత నొందవలయు*
*నింతయును విష్ణుమయ మని యెఱుఁగవలయు*
*భేద మొనరింప వలవదు మేదినీశ!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-8:21,22 – [ఆంధ్రమహాభాగవతం-11వ స్కంధం-44వ పద్యం])

'ఎల్లప్పుడూ చెవులకు ఇంపుగా కృష్ణుని సంకీర్తనాలు వినాలి. సంతోషంగా ఆటల, పాటల రూపంలో హరికథా విశేషాలను జరపాలి. నారాయణ నామం నిరంతరం మనసులో జపించాలి. అడవిలో ఉన్నా హరిలీలలను భక్తితో గానం చేయాలి. పిచ్చివాడిలా బాహ్యస్మృతిని వీడి విష్ణువును కీర్తించాలి. జగమంతా విష్ణుమయంగా భావిస్తుండాలి. భేదభావం

చూపించరాదు.' కలికాలంలో ఇటువంటి భక్తి కలిగిఉండడం కష్టసాధ్యం. కనుక, ఒక్క ముహూర్తకాలమైనా హరినామాన్ని భక్తితో జపిస్తే, తరించవచ్చని మోక్షోపాయాన్ని చెప్పారు.

> *యీ కలియుగంబున నొక్క ముహూర్తమాత్రం బయిన నారాయణస్మరణ పరాయణులై మనంబున శ్రీనృసింహ వాసుదేవ సంకర్షణాది నామంబుల నచంచలభక్తిం దలంచు వారలకుఁ గ్రతుశత ఫలంబు గలుగు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-8:108 – [ఆంధ్రమహాభాగవతం-12వ స్కంధం-20వ వచనం])

'ఈ కలియుగంలో ఒక్క ముహూర్తకాలమయినా *శ్రీనృసింహ, వాసుదేవ, సంకర్షణ* అంటూ భక్తితో నారాయణ స్మరణ చేసినవారికి నూరుయజ్ఞాలు చేసిన ఫలం కలుగుతుంది' అని శుక మహర్షి పరీక్షిత్తుతో అంటారు. ఈ మాటలు స్మరణ మహత్యాన్ని నిరూపిస్తాయి.

**2.3.1.1. ఖట్వాంగుడు**

శుక మహర్షి పరీక్షిత్తుకు స్మరణ భక్తికి ఉదాహరణగా ఖట్వాంగుడనే రాజు కథ చెప్పాడు. పూర్వం ఖట్వాంగుడనే రాజు దేవదానవ యుద్ధ సమయంలో దానవులను ఓడించడానికి దేవతలకు సహాయం చేశాడు. దానికి దేవతలు సంతోషించి ఖట్వాంగుడిని వరం కోరుకోమంటే, తన ఆయుర్దాయమెంతో చెప్పమన్నాడు. ఇంకొక్క ముహూర్త కాలం మాత్రమే తన ఆయువుందని తెలుసుకున్న ఖట్వాంగుడు ఆ ముహూర్తకాలంలో హరి నామ స్మరణ చేసి ముక్తిని పొందాడు.

> *గోవిందనామకీర్తనఁ గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి*
> *త్రీవిభుఁడు సూరగొనియెను గైవల్యముఁ దొల్లి రెండుగడియలలోనన్*
> (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:292 –
> [ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-11వ పద్యం])

‘గోవిందనామకీర్తన చేసి భయంలేనివాడై ఖట్వాంగుడు రెండు గడియలలోనే మోక్షం పొందాడు.’ ఖట్వాంగుడి కథ స్మరణభక్తి ప్రాశస్త్యాన్ని తెలియజెబుతుంది.

### 2.3.1.2. అజామిళుడు

అజామిళోపాఖ్యానం స్మరణ భక్తికి ఉదాహరణగా పేర్కొనదగింది. అజామిళుడు భ్రష్టుడైన ఒక బ్రాహ్మణ యువకుడు. ఒక గొప్ప కుటుంబంలో జన్మించి, వేదశాస్త్రాలను అభ్యసించికూడా యౌవనోద్రేకంలో ఒక శూద్రకాంతమీద అనురాగంతో భార్యను, కుటుంబాన్ని వదిలి, దొంగతనాలకు, దారిదోపిడీలకు పాల్పడుతూ, వ్యసనపరుడయ్యాడు.

> *మరణపువేళ నద్దనుజమర్దను సంస్మరణంబు సేయఁ ద*
> *త్పరిసరవర్తు లాత్మపరిపాలకు నామము నాలకించి ని*
> *ష్ఠురగతి నేగుదెంచి పొడసూపి యదల్చిరి కాలుదాసులన్*
> *ఖరతరభాషలన్ వికటకల్పితవేషుల దీర్ఘరోషులన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-4:29 – [ఆంధ్రమహాభాగవతం-6వ స్కంధం-73వ పద్యం])

‘మరణ సమయంలో *నారాయణా* అంటూ తన చిన్న కొడుకును పిలిచినందుకుగాను విష్ణుదూతలచే యమపాశంనుండి రక్షించబడ్డాడు.’ అనంతరం తన పాతజీవితంపై రోసి, పశ్చాత్తాపం చెంది, నిరంతర హరినామ స్మరణంతో మోక్షమందుకున్నాడు.

### 2.3.1.3. ప్రహ్లాదుడు

ప్రహ్లాదుడు స్మరణభక్తికి దృష్టాంతంగా పేర్కొనదగ్గవాడు. నిరంతర విష్ణుధ్యాన తత్పరుడైన ప్రహ్లాదుడికి సర్వం హరిమయంగానే తోస్తుంది. ప్రహ్లాదుని హరి ధ్యాన తత్పరతను పోతన విపులంగా వర్ణించారు.

శ్రీమహావిష్ణువు తనను చేరినట్లనిపిస్తే, తన స్నేహితులను చేరడం మరచిపోయేవాడు. అసురాంతకుడైన ఆ హరి తన ముందున్నట్లు అనిపిస్తే, తన తోటివారితో ఆడుకోవడం మరచిపోయేవాడు. భక్తవత్సలుడైన నారాయణుడు తనతో మాట్లాడినట్లు తోస్తే, ఇతరుల మాటలకు బదులివ్వడం మరచిపోయేవాడు. సురవందితుడైన ఆ శ్రీహరిని తనలో చూచినట్లనిపిస్తే, ఇతరమైన ప్రపంచాన్ని చూడడం మరచిపోయేవాడు. ఈ విధంగా శ్రీమన్నారాయణుని స్మరణంలో అతడు పరిపూర్ణత్వాన్ని పొంది, సర్వం మరచి చరించేవాడు.

*పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాస లీ*
*లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత*
*శ్రీనారాయణ పాదపద్మ యుగళీ చింతామృతా స్వాద సం*
*ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:337 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–123వ పద్యం])

'తాగుతున్నప్పుడు, తింటున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు, నవ్వుతూ, ఆడుతూ, నిద్రపోతూ, తిరుగుతూ ఉన్నప్పుడు అంటే నిరంతరం హరిపాదపద్మాలమీద ధ్యానంతో బాహ్య స్మృతిని మరచిపోతుండేవాడు.'

*అదు గద్దునకు మాధవానుచింతన సుధా మాధుర్యమున మేను మఱచువాని*
*నంభోజగర్భాదు లభ్యసింపఁగ లేని హరిభక్తి పుంభావమైనవాని*
*మాతృగర్భము సొచ్చి మన్నది మొదలుగాఁజిత్త మచ్యుతుమీఁదఁ జేర్చువాని*
*నంకించి తనలోన నఖిల ప్రపంచంబు శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:352 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–160వ పద్యం])

'అడుగు తీసి అడుగు వేసేంతలో హరిచింతన అనే అమృత ప్రవాహంలో పడి కొట్టుకుపోయి తనను తాను మరచిపోయేవాడట. బ్రహ్మాదులకుకూడా సాధ్యంకాని, నేర్వలేని హరిభక్తిని పుట్టుకతోనే సాధించినవాడట. తల్లి కడుపులో ప్రవేశించినది మొదలుగా తన హృదయాన్ని అచ్యుతునిపై లగ్నం చేసినవాడట. తనలోనూ, ఈ విశాల విశ్వంలోనూ ప్రతి అణువణువును విష్ణురూపమే అని సంభావించేవాడట.' అటువంటిది ప్రహ్లాదుని స్మరణ భక్తి.

ఇటువంటి నిరంతర స్మరణ వల్లే హరిని అన్నిటా, అంతటా దర్శనం చేయగలిగాడు. తన తండ్రి హరి ఎక్కడున్నాడో చూపమన్నప్పుడు సముద్రంలో, గాలిలో, ఆకాశంలో, భూమిలో, అగ్నిలో, దిశలలో, పగళ్ళలో, రాత్రుళ్ళలో, సూర్యచంద్రులలో, ఓంకారంలో, త్రిమూర్తులలో అంతటా ఉన్నాడని అంటాడు. చివరకు *ఇందుగలడందు లేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు* అని తండ్రికి బోధించి, ముల్లోకాలలోనూ అతడికి దొరకని హరి దర్శనాన్ని ఎదురుగా ఉండే స్తంభంలో చేయించగలిగాడు.

భక్తితోనే కాక, ఇతర మనోప్రవృత్తులతో హరి స్మరణం చేసినా మోక్షాన్ని పొందవచ్చునని భాగవతం చెబుతోంది.

*కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైర క్రియా*
*సామాగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,*
*ప్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రిం గంటి; మెట్లైన ను*
*ద్దామ ధ్యానగరిష్ఠుఁ డైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:287 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–18వ పద్యం])

'కామంతో గోపికలు, భయంవలన కంసుడు, శత్రుత్వ భావంతో శిశుపాలాది రాజులు, సంబంధం చేత వృష్ణులు, ప్రేమతో ధర్మరాజాదులు, భక్తితో నారదాదులు హరిని పొందారు. ఏ భావంతో స్మరించినా హరిని చేరవచ్చు.'

తిరుగుచుఁ గుడుచుచుఁ ద్రావుచు

నరుగుచుఁ గూర్చుండి లేచు చనవరతంబున్

హరిఁ దలఁచితలఁచి జగ మా

హరిమయ మని చూచెఁ గంసుఁ డాఅని యలుకన్ (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–6:32 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–పూర్వ భాగము–85వ పద్యం])

అచ్చంగా ప్రహ్లాదుడిలాగే, 'తిరుగుతూ, తింటూ, తాగుతూ, నడుస్తూ, కూర్చుని లేస్తూ, అనుక్షణం హరిని స్మరిస్తూ, భయంవలన, లోకమంతా హరిమయంగా చూశాడు కంసుడు.' ఈ నిరంతరం హరిస్మరణం ఫలితంగా భగవంతుడిలోనే ఐక్యమయ్యాడు.

### 2.3.2. మొల్ల రామాయణం

*ఏయెడఁ జూచిన ధరణీనాయకు శ్రీపాదయుగము నా చిత్తములో బాయదని* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:72 – [మొల్ల రామాయణం–సుందరకాండ–111వ పద్యం]) – 'క్షణకాలంకూడా రామభూపాలుని పాదస్మరణ లేకుండా నా మనస్సు ఉండ'దని విన్నవించిన సీత స్మరణ భక్తికి ప్రబలమైన ఉదాహరణ.

*పతిఁబాసినట్టి యాపదకంటెఁ బలుమాఱు వివిధ మాయలచేత వేఁగి వేఁగి*

*వీరదానవకోటి వికృతవేషంబులు కనుఁగొని చిత్తంబు క్రాఁగి క్రాఁగి*

*తనదిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ లోపల మిక్కిలి లోఁగి లోఁగి*

*కర్ణకఠోరంబుగా నాడుమాటలఁ దొరఁగెడి కన్నీటఁ దోఁగి తోఁగి*

*రామఁదలఁచుకొంచు రాముఁని బేర్కొంచు*

*రామ రామ యనుచు రమణి పలుకఁ*

*గపివరుండు సూచి కామినీరత్నంబు*

*సీత యనుచుఁ బొంగెఁ జిత్తమందు* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:59 – [మొల్ల రామాయణం–సుందరకాండ–41వ పద్యం])

'రాక్షసమాయలచేత విసిగి, వారి వికృతవేషాలకు దుఃఖించి, తన దిక్కులేనితనానికి తల్లడిల్లి, రావణుని చేరమని చెబుతూ, రాముని దూషిస్తూ రాక్షస వనితలు పలికే శూలాలైన మాటలకు కృశించి ఉన్న సీతమ్మ, రామనామ స్మరణమే తనను కష్టాలనుంచి తప్పించే సాధనంగా ఎంచి, నిరంతరం రామనామజపం చేసింది.' ఈ పద్యంలో సీత, రాముని ఎడబాసినది మొదలుగా దుఃఖిస్తూ, అనుక్షణం తన స్వామిని స్మరించిన తీరును కన్నులకు కట్టారు మొల్ల.

### 2.3.3. భాస్కర రామాయణం

అశోకవృక్షపు కొమ్మలలో దాక్కుని సీతను చూసిన హనుమ, ముందుగా రామకథను తెలిపి, సీతను ప్రసన్నం కావించుకుని ఆపై జరగవలసిన కార్యాన్ని నిర్వహించాలని నిర్ణయించుకుంటాడు. ఆ ప్రకారం సుమధుర స్వరంలో రామకథను వినిపిస్తాడు. అప్పుడు సీతమ్మ ఆశ్చర్యం, ఆనందం, ఉద్వేగం ముప్పిరిగొనగా, తలెత్తి హనుమను చూసి తాను చూసినది కలగా భావించుకుంటుంది.

*వేమఋఁ దలఁచినతలఁపు న్వేమఋఁ బేర్కొన్నయదియు నిద్రం గల యౌ*
*వేమఋ రాముని తలఁతును రామునిఁ బేర్కొందు రామ రామాయనుచున్*
(భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:322 – [భాస్కర రామాయణం–సుందరకాండ–273వ పద్యం])

'ఏదైనా విషయాన్నిగురించి చాలా సార్లు తలచుకున్నా, దాన్నిగురించి మాట్లాడినా అదే నిద్రలో కలగా వస్తుంది. నేను ప్రతి క్షణం రాముడిని తలుస్తాను. రామా! రామా! అనుకుంటాను.' కనుక, తాను చూసినది కలేమో అనుకుంటుంది. కాని, అనుక్షణం రామ, రామ అంటూ

రాముడిని తలచుకుంటూ నిద్ర కూడా మరచిపోయిన తనకు కలలెలా వస్తాయని అనుకొంటూ తాను చూసినది కలకాదని తెలుసుకుంటుంది. ఈ ఘట్టంద్వారా సీత స్మరణ భక్తి ప్రకటితమవుతోంది.

### 2.4. పాదసేవనం

భగవంతుడి పాదాలను సేవించటం, భక్తితో కొలవటం పాదసేవన భక్తి కిందకు వస్తుంది. భగవంతుడి అవతారాలలో స్వామికి సమకాలికులైన వారికే నేరుగా స్వామి పాదసేవనం లభిస్తుంది. ఇతరులకది దుర్లభము కనుక,

*కడు నీ పాదతీర్థము కడగన్నవారెవ్వరు*
*బడిబడి నీ భక్తపాదజలమువలె* (4-122)

*తలప శ్రీవేంకటేశు దాసులే యాతనిరూపు*
*లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి* (1-479)

అని అన్నమయ్య పేర్కొన్నట్లు, భాగవతుల పాద సేవ, ఆచార్యుల పాదసేవకూడా పాదసేవన భక్తిగానే పరిగణించబడుతుంది. ఈ విషయాన్నే స్పష్టం చేస్తూ బ్రహ్మకూడా భాగవతంలో ఇలా అంటాడు.

*ఏలా బ్రహ్మపదంబు? వేదములకున్ వీక్షింపఁగారాని ని*
*న్నీలోకంబున నీవనాంతరమునం దీ మందలోఁ గృష్ణ యం*
*చాలాపాది సమస్త భావములు నీ యందే సమర్పించు నీ*
*వ్రేలం దొక్కని పాదరేణువులు పై వేష్టించినం జాలదే?* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:218 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-572వ పద్యం])

'వేదాలు కూడా సమగ్రంగా వర్ణించలేని నిన్ను, ఈ లోకంలో, ఈ అడవిలో, ఈ గోవులమందలో సహచరుడిగా పొందారు. *కృష్ణా! కృష్ణా!* అంటూ తాము చేసే ప్రతి పనిని, తలచే ప్రతి భావాన్ని నీకే సమర్పిస్తారు. అటువంటి ఈ గోపకులలో ఒక్కడి పాదరేణువులు తలపై దాల్చినా చాలు, ఈ బ్రహ్మపదమెందుకు నాకు?' అంటూ భాగవతుల పాదసేవన గొప్పదనాన్ని ప్రస్తుతించాడు.

అలాగే, ఈ కలికాలంలో స్వామి నడచిన త్రోవలో నడవడానికి ఇష్టపడి, ఆయనని అనువర్తించేవారుకూడా పాదసేవన భక్తితో స్వామిని కొలిచినట్లే అని భావించవచ్చు.

### 2.4.1. భాగవతం

#### 2.4.1.1. లక్ష్మీదేవి

నిత్యానపాయిని అయిన లక్ష్మీదేవి పాదసేవన భక్తికి ఉత్తమ ఉదాహరణ. భాగవతంలో పలు తావులలో లక్ష్మీదేవి నారాయణుని పాదసేవన చేస్తూ కానవస్తుంది. బ్రహ్మ వైకుంఠపురాన్ని దర్శించిన సందర్భంలో, లక్ష్మి నారాయణుని పాదాలొత్తుతూ కనిపిస్తుంది.

*కమనీయ రూపరేఖా రమణీయతఁ జాల నొప్పు రమణీమణి య*
*క్కమలాలయ దన మృదు కర కమలంబుల విభుని పాదకమలము లొత్తెన్*
(కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:416 –
[ఆంధ్రమహాభాగవతం-2వ స్కంధం-232వ పద్యం])

'కమనీయమైన రూపురేఖావైఖరులతో ప్రకాశించే స్త్రీరత్నమయిన లక్ష్మీదేవి తన మృదువైన కమలాలవంటి చేతులతో శ్రీమహావిష్ణువు పాదకమలాలను ఒత్తుతోంది.'

లక్ష్మి పాదసేవనలోనే కాక, స్వామిని అనునిత్యం అనుసరించడంలోకూడా పాయనిదై నిత్యానపాయినిగా పేరు తెచ్చుకుంది.

*దేవా! దేవర యడుగులు, భావంబున నిలిపి కొలుచు పని నా పని గా*

*కో వల్లభ! యే మనియెద, నీ వెంటను వచ్చుచుంటి నిఖిలాధిపతీ!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:60 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-132వ పద్యం])

గజేంద్రుడు రక్షించమని మొరపెట్టినప్పుడు, కేళీవినోదంగా పట్టుకున్న లక్ష్మీదేవి చీరచెంగునుకూడా వదలకుండా భక్తరక్షణకోసమని తరలిపోయాడు శ్రీమహావిష్ణువు. ఆ సందర్భంలో తననుగురించి ఏమనుకుందని శ్రీహరి లక్ష్మిని ప్రశ్నిస్తాడు. దానికి లక్ష్మి, 'స్వామీ! నీ పాదాలను నా మనసులో నిలిపి కొలవడమే నా పని కనుక, ఏమీ అనుకోకుండానే నిన్ను అనుసరించి వచ్చాను' అంటుంది. ఈ ఘట్టంకూడా శ్రీమహాలక్ష్మి పాదసేవనభక్తిని తెలియబరుస్తుంది.

### 2.4.1.2. పృథు చక్రవర్తి

పాదసేవన భక్తికి మరొక ఉదాహరణగా పృథు చక్రవర్తి కనిపిస్తాడు. పృథు చక్రవర్తి శాంతశీలాదులను మెచ్చుకుని శ్రీమహావిష్ణువు తనంతట తానే వచ్చి వరం కోరుకోమంటే *ఉత్సుకమతినైన యేను లక్ష్మి కరణి నిన్ను భజింతునో పరమపురుష* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-3:261 – [ఆంధ్రమహాభాగవతం-4వ స్కంధం-553వ పద్యం]) - 'లక్ష్మీదేవివలె నీ పాదాలను సేవించా'లని కోరుకున్నాడు.

### 2.4.1.3. భరతుడు

శ్రీరామచంద్రుని తమ్ముడు భరతుడు పాదసేవనభక్తికి పేరుపడ్డవాడు. రాముని పాదుకలను పూజించి, వాటికి పట్టం కట్టి, వాటిని రాముని ప్రతినిధులుగా భావించి, వాటిచేత రాజ్యాన్ని పరిపాలింపజేసిన భక్తశిఖామణి భరతుడు.

*వచ్చి పాదుకల ముందట నిడికొని, యెడనెడ సాష్టాంగదండప్రణామంబులు సేయుచు, మెల్లమెల్లన డాసి, రామచంద్రుని పాదంబులు దన నొసలం గదియించి, తచ్చరణరేణువులు దుడిచి, శిరంబునం జల్లికొని, తనివిలేక, మఱియు నప్పదకమలంబు లక్కున మోపి కొనుచు, సంతసంపుఁ గన్నీటం గడిగి, సేమంబు లరయుచుండె* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:434 – [ఆంధ్రమహాభాగవతం-9వ స్కంధం-317వ పద్యం])

'శ్రీరాముని పాదుకలు ముందు పెట్టుకుని వస్తూ, మధ్య మధ్యలో సాష్టాంగ ప్రణామాలు ఆచరిస్తూ, మెల్ల మెల్లగా వచ్చి, రాముని పాదాలను తన నుదుటను చేర్చుకుని, స్వామి పాదాలకు అంటుకున్న ధూళిని తుడిచి, తన తలపై జల్లుకొని, ఇంకా తనివి తీరక, రాముని పాదకమలాలు తన ఎదపై పెట్టుకుని, తన ఆనందబాష్పాలతో వాటిని కడిగి, క్షేమాన్ని అడిగాడు.' ఈ విధంగా, రాముడు వనవాసం ముగించుకొచ్చిన సందర్భంలో, భరతుడు చూపిన భక్తితన్మయత్వం నిరుపమానమైనది.

### 2.4.2. మొల్ల రామాయణం

శ్రీరామచంద్రుని పాదసేవకుడిగా అనుక్షణం తనను తాను పేర్కొంటూ రామునికి బదులుగా రామపాదుకలకే పట్టాభిషేకం చేసి, పదునాలుగేళ్ళు రామునికి మారుగా వాటినే పూజించిన భరతుడు పాదసేవన భక్తికి ఉదాహరణ.

***చనుదెంచి రాముని చరణంబులకు మ్రొక్కి*** *కైకేయి చేసిన కపటమునకు*
*నగరంబు విడిచి యీ పగిది ఘోరారణ్యమున కిట్లు రానేల మునులపగిది..*
(లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:32 – [మొల్ల రామాయణం-అయోధ్యాకాండ-38వ పద్యం])

'వస్తూనే రాముని పాదాలపై పడి మొక్కి, కైకేయి చేసిన పనికి ఈ విధంగా ఘోరారణ్యాలకు రావలసిన పనేమి'టని వాపోయిన భరతుడు సదా పాదసేవకుడై అన్నను కొలుచుకున్నాడు.

అలాగే, మూలంలో రాముని స్నేహితుడు, నిషాదరాజైన గుహుడిని జానపదుడిగా, అమాయకుడిగా చిత్రీకరించి రాముని పాదాలను కడిగించారు కవయిత్రి మొల్ల.

*సుడిగొని రాము పాదములు సోఁకిన ధూళి వహించి రాయి యే*
*ర్పడ నొక కాంత యయ్యె నఁట, పన్నుగ నీతని పాద రేణు వి*
*య్యెడ వడి నోడసోఁక నిది యేమగునో యని సంశయాత్ముఁడై*
***కడిగె గుహుండు రామపదకంజయుగంబు*** *భయమ్ము పెంపునన్* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:31 – [మొల్ల రామాయణం–అయోధ్యాకాండ–32వ పద్యం])

'రాముని పాదధూళి సోకినంత మాత్రాన ఒక రాయి స్త్రీగా మారిందట. మరి ఇతని పాదరేణువులు తగిలితే తన ఓడ ఏమయిపోతుందో అని అనుమానంతో, భయంతో గుహుడు రాముని పాదాలను కడిగాడు' అని మూలంలో లేని ఘట్టాన్ని ఆవిష్కరింపజేసి గుహుని రూపేణా తన పాదసేవనభక్తిని ప్రదర్శించారు మొల్ల.

### 2.4.3. భాస్కర రామాయణం

తన భార్యను సైతం వదిలి, రాముడితో పాటుగా అడవులకు వెళ్ళడానికి నిశ్చయించుకుంటాడు లక్ష్మణుడు.

*అనవుడు సౌమిత్రి యన్నమాటలు విని మాఱాడ కిట్లను మనుజనాథ*
*యిక్కడి భోగంబు లెవ్వియు నేనొల్ల వనభూములను జటావల్కలములు*
*నెమ్మితో ధరియించి నీపాదపద్మముల్ గొలిచి వచ్చెదను నే వలవ దనిన*
*నొల్లఁ బ్రాణములన్న నుడుప నేరక రాముఁ డనుజుని రాకకు ననుమతించె*

(భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:84 – [భాస్కర రామాయణం–అయోధ్యాకాండ–58వ పద్యం])

'రాజా! ఈ రాజభోగాలేవీ నాకవసరం లేదు. నేను కూడా నారబట్టలు ధరించి ఆనందంగా నీతో అడవులకు వస్తాను. అక్కడ నీ పాదపద్మాలను సేవిస్తాను. వద్దు అంటే ప్రాణాలను వదిలేస్తాను' అన్న లక్ష్మణుడు పాదసేవనభక్తికి చక్కని ఉదాహరణ.

## 2.5. అర్చనం

భగవంతుని పంచతత్త్వాలయిన *పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా* రూపాలలో అర్చారూపమే మానవునికి అత్యంత సులభసాధ్యమైనది. సర్వకాల సర్వావస్థలలో భక్తులకు మానుషనేత్రాలతో దర్శించి, పూజించతగిన అనువైన రూపం అర్చారూపం.

అర్చన భక్తి అంటే సగుణ స్వరూపుడైన భగవంతుడిని కొలవటం. సగుణ భక్తినిగూర్చి సాక్షాత్తుగా శ్రీకృష్ణుడే ఉద్ధవుడితో చెబుతూ, ఇలా అన్నాడు. *నేను సర్వవర్ణంబులకు సమంబైన పూజాప్రకారం బెఱింగించెద; నాచారంబునంజేసి యొకటిఁ బాషాణమృణ్మయదారువులం గల్పించి, నా రూపంబుగా నిల్పికొని కొందఱు పూజింతురు; కాంస్య త్రపు రజత కాంచన ప్రతిమావిశేషంబు లుత్తమంబు; లిట్లు నా ప్రతిమారూపంబు లందు మద్భావంబుంచి కొల్చినవారికి నేఁ బ్రసన్నుండ నగుదు; నీ లోకంబున మనుష్యులకు ధ్యానంబు నిలువనేరదు; గావునం బ్రతిమా విశేషంబు లనేకంబులు గలవు; వానియందు సౌందర్యసారంబులు మనోహరంబులు నైన రూపంబుల మనఃప్రసన్నుండనై నే నుండుదుఁ; గావున దుగ్ధార్ణవశాయిఁగా భావించి ధౌతాంబరాభరణ మాల్యానులేపనంబులను, దివ్యాన్నపానంబులను, షోడశోక్త ప్రకారంబుల రాజోపచారంబులను, బాహ్యపూజా విధానంబుల నాచరించి మత్సంకల్పితంబు లైన పదార్థంబులు సమర్పించి, నిత్యంబును నాభ్యంతరపూజావిధానంబులం బరితుష్టునిం జేసి; దివ్యాంబరాభరణ మాల్యశోభితుండును,*

*శంఖ చక్ర కిరీటాద్యలంకార భూషితుండును, దివ్యమంగళవిగ్రహుండునుగాఁ దలంచి ధ్యానపరవశుండైన యతండు నాయందుఁ గలయు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-8:76 – [ఆంధ్రమహాభాగవతం-11వ స్కంధం-115వ వచనం])

'నేను అన్ని వర్ణాల వారూ ఆచరించదగ్గ పూజావిధానాన్ని చెబుతాను. వారివారి ఆచారాల ప్రకారం, రాతితో గాని, మట్టితో కాని, కొయ్యతో గాని, నా ప్రతిమను ఏర్పరిచి కొందరు పూజిస్తారు. కంచుతో గాని, సీసంతో గాని, వెండి, బంగారాలతోగాని చేసిన ప్రతిమలు శ్రేష్ఠమైనవి. ఇలా నా ప్రతిమలను, నన్నుగా భావించి కొలిచినవారికి నేను ప్రసన్నుడనవుతాను. మనుషులకు ధ్యానం నిలవడం కష్టం. కనుక అందమైనవి, సారవంతమైనవి అయిన నా ప్రతిమలలో నన్ను సంభావించి, వస్త్రభూషణాలు, పూలదండలు, అన్న పానీయాలు మొదలైన వాటితో షోడశోపచార పూజలుచేసి, ధ్యానపరవశుడైన భక్తుడు నన్ను చేరుకుంటాడు' అంటూ అర్చనభక్తిలో షోడశోపచారాల ప్రాముఖ్యతను పేర్కొన్నాడు శ్రీకృష్ణుడు.

షోడశోపచారాలు:

1) ఆవాహన 2) ఆసనం 3) పాద్యం 4) అర్ఘ్యం 5) ఆచమనీయం 6) అభిషేకం 7) వస్త్రం 8) యజ్ఞోపవీతం 9) గంధం 10) పుష్పం 11) ధూపం 12) దీపం 13) నైవేద్యం 14) తాంబూలం 15) ప్రదక్షిణం 16) నమస్కారం (వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2010:259). ఇవి కాక, నీరాజనం, మంత్రపుష్పం, అధాంగపూజ, వింజామర వీయటం, ఆభరణాలు సమర్పించటం, ఉద్వాసనం ఇతర ఉపచారాలు. అలాగే, శ్రీమహావిష్ణువుపూజలో తులసీదళాలతో పూజించడంకూడా అర్చనలో ఒక ముఖ్యమైన భాగంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ ఉపచారాలు మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా చేయటాన్నే అర్చన భక్తి అంటారు.

### 2.5.1. భాగవతం

#### 2.5.1.1. భరతుడు

సాక్షాత్తు శ్రీహరి అవతారంగా-నాభి రాజేంద్రునికి, మేరుదేవికి ఋషభుడు జన్మించాడు. అతడి పుత్రుడైన భరతుడు భాగవతోత్తముడు. అతడు పాలించినందువల్లనే అజనాభమనే పేరుగల భూభాగానికి భరతవర్షం అనే పేరు స్థిరపడింది. అటువంటి భరతుడు ప్రజారంజకంగా చాలా సంవత్సరాల పాటు రాజ్యపాలనచేసి, ఎన్నో యజ్ఞయాగాదులను నిర్వర్తించి, తుదకు సకల భోగభాగ్యాలను విడిచిపెట్టి పులహాశ్రమానికి చేరాడు.

*ఏ యాశ్రమంబున నిందిరాధీశ్వరుఁడచ్చటి వారల నాదరించి*
*ప్రత్యక్షమున నుండుఁ బాయక యెప్పుడు నట్టి రమ్యం బైన యాశ్రమమున*
*నిలిచి సాలగ్రామములు గల గండకీ నది యెందు నెంతయుఁ గదిసి యుండు*
*నచ్చోట నేకాకి యగుచును భరతుండు బహువిధ నవపుష్ప పల్లవముల*
*నతుల తులసీ దళంబుల నంబువులను*
*గందమూలాది ఫలములఁ గంజములను*
*ఘనత నర్చించి నిచ్చలుఁదనివి లేక*
*సేవ చేయుచు నుండె నా శ్రీశు హరిని* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-3:539 – [ఆంధ్రమహాభాగవతం-5వ స్కంధం-ప్రథమాశ్వాసం-98వ పద్యం])

'ఏ ఆశ్రమంలో అయితే శ్రీహరి అక్కడుండేవారిని ఆదరించి, వారికి ఎప్పుడూ కనిపిస్తూ ఉంటాడో, సాలగ్రామాలతో కూడిన గండకీనది ఏ ఆశ్రమం దగ్గరలో ప్రవహిస్తూ ఉంటుందో అటువంటి ఆశ్రమానికి చేరాడు భరతుడు. అక్కడ ఒంటరిగా ఉంటూ శ్రీహరిని అనేకరకాలైన పూలతో, తులసీదళాలతో, జలాలతో, కందమూలాది ఫలాలతో, కమలాలతో అర్చించాడు.' తనుహృద్భాషలతో అంటే త్రికరణశుద్ధిగా భక్తిమార్గాలను ఆచరించాలన్నారు పోతన. భరతుడు

అటువంటి తన్మయత్వంతో కూడిన అర్చనభక్తిని ప్రదర్శించడంవలన, అతనికి విషయవాంఛలు నశించి భక్తియోగం ప్రాప్తమయింది.

### 2.5.1. 2. బ్రహ్మాది దేవతలు

త్రివిక్రమావతారం దాల్చి, విష్ణువు ఒక పాదంతో భూమండలాన్ని ఆక్రమించి, రెండవ పాదంతో పైలోకాలన్నిటినీ కప్పిన సమయంలో బ్రహ్మ తన కమండలంలోని జలంతో స్వామి పాదాలను కడిగాడు.

*యోగమార్గంబున నూహించి బహువిధ పుష్పదామంబులఁ బూజ సేసి*
*దివ్యగంధంబులు తెచ్చి సమర్పించి ధూపదీపములఁ దోడ్తోడ నిచ్చి*
*భూరి లాజాక్షతంబులు సల్లి ఫలములుఁ గానిక లిచ్చి రాగములఁ బొగడి*
*శంఖాదిరవములు జయఘోషములు సేసి 'కరుణాంబునిధి! త్రివిక్రమ!' యటంచు*
*బ్రహ్మ మొదలు లోకపాలురుఁ గొనియాడి ((*లక్ష్మణయ్య, సముద్రాల. 2017.
సంపుటం–5:263,264 – [ఆంధ్రమహాభాగవతం–8వ స్కంధం–632వ పద్యం])*)*

'బ్రహ్మాది దేవతలు బహువిధాలైన పూలమాలలచేత హరిని పూజించారు. గంధంతో, ధూప, దీపాలతో, పేలాలు, అక్షతలతో అర్చించి, పండ్లను కానుకలుగా సమర్పించారు. శంఖరావాలతో జయజయధ్వానాలు చేశారు.' ఈ విధంగా బ్రహ్మాది దేవతలు తమ అర్చనభక్తిని చాటుకున్నారు.

### 2.5.1.3. సుదాముడు

కంసుని పనుపున మధురకు ధనుర్యాగం చూడటానికి వెళతారు రామకృష్ణులు. అక్కడ సుదాముడనే మాలాకారుని ఇంటికి వెళతారు.

*దామోదరరాముల కుద్దామయశోహసితతుహినధాములకు వధూ*
*కాములకుఁ దెచ్చియిచ్చె సుదాముఁడు ఘనసురభికుసుమదామము లధిపా!*
(లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:509 – [ఆంధ్రమహాభాగవతం-
10వ స్కంధం-పూర్వ భాగము-1268వ పద్యం])

రామకృష్ణులను చూడగానే, కూర్చుని ఉన్న సుదాముడు వినయసంభ్రమాలతో వెంటనేలేచి, అర్ఘ్యపాద్యాది ఉపచారాలుచేసి, తాంబూలం సమర్పించి, పూలు, గంధం మొదలైన వాటిని భక్తితో సమర్పించాడు. సుదాముడు మాలాకారుడు. పేదవాడు. కొండంత దేవునికి కొండంత పత్రి సమర్పించలేకపోయినా తనకున్నదాంట్లో తగిన ఉపాచారాలను, అర్చనను భక్తితో చేసి, ఫలితంగా శ్రీకృష్ణుని అనుగ్రహం పొందాడు.

### 2.5.1.4. శ్రుతదేవుడు

విదేహ రాజ్యంలో మిథిలాపురిలో శ్రుతదేవుడనే గొప్ప విష్ణు భక్తుడుండేవాడు. రాగద్వేషాలు విడిచి, శాంతస్వభావంతో గృహస్థధర్మాన్ని ఆచరిస్తూ, జీవించేవాడు. అతడిని కరుణించడానికి శ్రీకృష్ణుడు అతని ఇంటికి వెళతాడు. అప్పుడా శ్రుతదేవుడు శ్రీకృష్ణుడిని, అతనితోపాటు వచ్చిన ఋషులను దర్భాసనాలపై కూర్చుండబెట్టి, సతీసమేతంగా కృష్ణుని పాదాలను ప్రక్షాళన చేస్తాడు.

*మఱియుఁ దత్పాదతీర్థంబు మందిరమునఁ గలయఁ జిలికించి సంప్రీతి గడలు కొనఁగఁ*
*బత్త్రఫలపుష్పతోయముల్ భక్తి నొసఁగి, హరిమురాంతకమూర్తి నిజాత్మ నిలిపి*
(లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-7:508 – [ఆంధ్రమహాభాగవతం-
10వ స్కంధం-ఉత్తర భాగము-1192వ పద్యం])

‘కృష్ణుని పాదతీర్థాన్ని శిరస్సుపై జల్లుకుని, తన ఇల్లంతా చిలికించాడు. తులసిమాలలతో, దర్భలతో, పూలతో చేసిన మాలికలతో పూజించాడు. పత్రపుష్పఫలతోయాలను స్వామికి అర్పించాడు.’ పరమాత్ముని పాదాలను తన ఒడిలో పెట్టుకుని ఒత్తి, ‘స్వామి నా ఇంటిలో భోజనం చేశాడు’ అని ఆనందంతో నృత్యం చేశాడు. శ్రీకృష్ణుడు తన ఇంటికి వచ్చి, తన ఆతిథ్యం స్వీకరించినందుకు పొంగిపోతూ, స్వామిని అర్చనాదికాలతో పూజించాడు శృతదేవుడు.

### 2.5.2. మొల్ల రామాయణం

అర్చన భక్తికి మొల్ల రామాయణంలో భరద్వాజ మహర్షి, శబరి తార్కాణంగా నిలుస్తారు. పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏదైనా తనకు భక్తితో సమర్పిస్తే తాను వాటిని ప్రీతితో స్వీకరిస్తానని గీతాచార్యుడి ఉవాచ.

*రాజకులావతంసుఁ డగు రాముఁడు తమ్ముఁడుఁ దాను నాభర*

*ద్వాజమహామునీంద్రు పదవారిజముల్ గని మ్రొక్కఁ నాతఁడం*

*భోజహితాన్వయాబ్ధిపరిపూర్ణ సుధాకరుఁడైన రామునిం*

*బూజ లొనర్చి కందఫలమూలములం బరితృప్తుఁ జేసినన్* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:32 – [మొల్ల రామాయణం–అయోధ్యాకాండ–34వ పద్యం])

‘రామలక్ష్మణులు భరద్వాజ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి, అతడి పాదపద్మాలకు నమస్కరించగా, మహర్షి, రామునికి సపర్యలు చేసి కందమూలాలతో కూడిన భోజనం పెట్టి తృప్తి పరిచాడు.’ భరద్వాజ మహర్షి ఆగ్రహానుగ్రహ సమర్థుడు, మహిమ కలవాడే అయినా మునివృత్తిని స్వీకరించి అడవులలో అడుగుబెట్టిన రామునికి తగినవిధంగా కందఫలమూలాలతో భోజనం సమర్పించాడు. రాబోయే అరణ్యవాసానికి రాముడిని సన్నద్ధం చేశాడు. ఆ విధంగా భరద్వాజ మహర్షి గొప్ప అర్చన భక్తిని ప్రదర్శించాడు.

### 2.5.3. భాస్కర రామాయణం

రాముడు వనవాస సమయంలో విరాధుడిని హతమార్చి, అక్కడినుండి శరభంగ మహర్షి ఆశ్రమానికి వెళతాడు. అదే సమయంలో శరభంగుని తపశ్శక్తికి మెచ్చి, అతడిని ఉత్తమలోకాలకు తీసుకుపోవటానికి సాక్షాత్తుగా దేవేంద్రుడే వస్తాడు. అయితే రాముడు వస్తాడని, అతడికి ఆతిథ్యం ఇవ్వాలని, దేవేంద్రునితో వెళ్ళకుండా నిలిచిపోయిన శరభంగ మహర్షి అర్చన భక్తి మహత్తరమైనది.

## 2.6. వందనం

భగవంతుడికి భక్తిశ్రద్ధలతో నమస్కరించటాన్ని వందనభక్తి అంటారు. భగవంతుడు ప్రత్యక్షంగా లేకపోయినా, స్వామి అర్చామూర్తికి భక్తి ప్రపత్తులతో వినయపూర్వకంగా నమస్కరించటంకూడా వందనభక్తిలోకే వస్తుంది.

*మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు।*

*మామేవైష్యసియుక్త్వైవ మాత్మానం మత్పరాయణః॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:210 – [భగవద్గీత-9వ అధ్యాయం-34వ శ్లోకం])

'నాపైనే మనస్సు నిలిపి, నాభక్తుడవై, నన్నే సేవిస్తూ, నాకే నమస్కరించు. ఈ విధంగా మనస్సు నాపైనే నిలిపితే నన్ను పొందగలవు' అంటూ వందనభక్తితో అతి సులభంగా భగవదనుగ్రహం పొందవచ్చని సూచించాడు గీతాచార్యుడు.

### 2.6.1. భాగవతం

#### 2.6.1.1. బ్రహ్మ

శ్రీమహావిష్ణువు నాభికమలంలో పుట్టిన బ్రహ్మ తన పుట్టుకనుగూర్చి ఆలోచిస్తూ తనకు జన్మనిచ్చిన పద్మనాళాన్ని చూడడానికి ప్రయత్నించి, మొదలు కానరాక చివరకు గొప్ప తపస్సు

చేసి, జ్ఞానాన్ని సంపాదించి, తన తండ్రి అయిన నారాయణుడిని తన హృదయంలో దర్శిస్తాడు. అలా దర్శించిన శ్రీమన్నారాయణుడికి స్తోత్రం చేసి, వినయ భక్తితో వందనం చేస్తాడు.

*యనుకంప దోఁప వినయంబునఁజాఁగిలి మ్రొక్కి (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-2:143 – [ఆంధ్రమహాభాగవతం-3వ స్కంధం-313వ పద్యం])* – 'జాలి కలిగేటట్టుగా వినయంతో సాష్టాంగపడి శ్రీహరికి నమస్కరిస్తాడు.'

మరొక సందర్భంలో బ్రహ్మ బాలకృష్ణుడి శక్తిని పరీక్షిద్దామనుకుని తానే భంగపడతాడు. అప్పుడు తన కళ్ళుతెరిపించిన బాలకృష్ణుడిని చూసి భక్తితో తన హంసవాహనంపైనుండి దూకి, తన ప్రపత్తిని చాటుకుంటూ నేలపై సాష్టాంగ పడతాడు. తన కిరీటంలోని మణులు కృష్ణుని పాదాలకు తాకేలా నమస్కరిస్తాడు. ఆనందబాష్పాలతో బాలకృష్ణుని పాదాలను కడుగుతాడు.

*అడుగులపైఁ బడు లేచుం,*
*బడుఁ గ్రమ్మఱ లేచు, నిట్లు భక్తిన్ మును తాఁ*
*బొడగనిన పెంపుఁ దలఁచుచు*
*దుడుకని మహిమాబ్ధి నజుఁడు దుడు కడిచె నృపా (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:204 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-546వ పద్యం])*

'ఆనంద పారవశ్యంలో బ్రహ్మ ఆ చిన్నికృష్ణుని పాదాలపై పడతాడు. లేస్తాడు, మళ్ళీ పడతాడు. మళ్ళీ లేస్తాడు. భక్తితో తాను అంతకుమునుపు చూసిన బాలకృష్ణుని మహిమను స్మరించుకుంటూ, తన్మయత్వం చెందుతూ కృష్ణుని మహిమ అనే సముద్రంలో తన అహంకారాన్ని అణిచేసుకున్నాడు.' ఇలా ఎప్పటికప్పుడు విష్ణుమాయలో పడుతున్నా, భక్తితో ఆ

మాయను ఛేదించుకుని, తన అహంకారాన్ని శ్రీహరి పాదాలవద్ద సమర్పించుకునే బ్రహ్మ వందనభక్తి శ్లాఘనీయమైనది.

### 2.6.1.2. ధ్రువుడు

బాలుడైన ధ్రువుడి కఠోరమైన తపస్సుకు ముల్లోకాలు వణికిపోయాయి. విష్ణువు సైతం చలించిపోయి, దేవతల ప్రార్థన మన్నించి, ధ్రువుడికి దర్శనం ఇచ్చాడు. తన తపస్సుకు మెచ్చి సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణుడిని చూసిన బాలుడైన ధ్రువుడి కళ్ళ వెంట ఆనందబాష్పాలు రాలాయి. ఒళ్ళంతా పులకించిపోయింది.

*నయనముల విభుమూర్తిఁ బానంబు సేయు*
*పగిదిఁ దన ముఖమునను జుంబనము చేయు*
*లీలఁ దగ భుజములను నాలింగనంబు*
*సేయుగతి దండవన్నమస్కృతు లొనర్చె* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-3:134 – [ఆంధ్రమహాభాగవతం-4వ స్కంధం-279వ పద్యం]) (4-279)

'కళ్ళతో భగవంతుడి మూర్తిని జుర్రుకుంటున్నట్లుగా, ముఖంతో ముద్దుపెట్టుకుంటున్నట్లుగా, భుజాలతో కౌగిలించుకుంటున్నట్లుగా అనుభూతి చెందుతూ, సాగిలిపడి నమస్కరించాడు.' ఈ విధమైన ధ్రువుడి వందనభక్తి అపూర్వమైనది.

### 2.6.1.3. వసుదేవుడు

శంఖచక్రగదాఖడ్గాదులతో చతుర్బాహు స్వరూపంతో తనకు కుమారునిగా జన్మించిన శ్రీమహావిష్ణువును చూసి, పరవశించిపోయాడు వసుదేవుడు. ఉప్పొంగిపోయి, మహోత్సాహంతో ఆనందరసాబ్ధిలో స్నానం చేసి, పదివేలగోవులను తన మనసులోనే దానం చేశాడు.

*చాఁగి మ్రొక్కి లేచి సరగున నొసలిపై గేలుఁదమ్మిదోయిఁ గీలుకొలిపి*

*పాపఁడనక వెఱక పాపనిమొదలింటి పోకలెల్లఁ దలఁచి పొగడఁ దొడఁగె* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:389 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-116వ పద్యం])

'పసిబాలుడని గాని, తన కుమారుడని గాని తలచక, ఆ బాలుడిని శ్రీమన్నారాయణమూర్తిగా గుర్తించి సాష్టాంగ దండప్రణామాలు చేశాడు. లేచి, నిలబడి, నొసటన తన రెండు చేతులు జోడించి, అతడి లీలామహత్త్వాలను స్మరించుకుని పొగడడానికి ఉపక్రమించాడు.' ఎప్పటికప్పుడు తన మహిమలు చూపిస్తూనే ఉన్నా, తన కొడుకేననుకుంటూ మాయలో పడిపోయింది యశోద. కాని వసుదేవుడు అప్పుడే పుట్టిన పిల్లవాడని భావించకుండా, ఆ పాపడు ఆదినారాయణమూర్తి అన్న ఎఱుకతో, అతడికి సాష్టాంగ నమస్కారాలు చేశాడు.

### 2.6.1.4. అక్రూరుడు

శ్రీకృష్ణుని చంపటానికి ఎందరో రాక్షసులను పంపి, విఫలమైన కంసుడు చివరకు బలరామకృష్ణులను ధనుర్యాగం పేరుతో మధురకు రప్పించి, తన కళ్ళ ముందే చంపిద్దామనుకుంటాడు. రామకృష్ణులను రప్పించటానికి యాదవశ్రేష్ఠుడైన అక్రూరుడిని నియోగిస్తాడు. గతజన్మలో ఎటువంటి తపస్సు చేశానో, ఎటువంటి దానాలు చేశానో సాక్షాత్తుగా పరబ్రహ్మ స్వరూపమైన శ్రీకృష్ణుడిని చూడడానికి వెళుతున్నాననుకుంటూ పరమోత్సాహంతో బయలుదేరతాడు అక్రూరుడు.

*కని వారల పాదములకు వినయంబున మ్రొక్కె భక్తివివశుం డగుచుం*

*దనువునఁ బులకాంకురములు మొనయఁగ నానందబాష్పములు జడి గురియన్*

(లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:480 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-1200వ పద్యం])

'కృష్ణుడిని చూడగానే, భక్తితో పరవశించిపోయిన అక్రూరుడు, శరీరంలో గగుర్పాటు కలగగా, ఆనందబాష్పాల వాన కురియగా, వినయంతో రామకృష్ణుల పాదాలకు నమస్కరిస్తాడు.'

### 2.6.2. మొల్ల రామాయణం

మొల్లరామాయణంలో సీత, హనుమంతుడు తమ వందన భక్తితో శ్రీరామచంద్రుడిని మెప్పించారు.

*ఇట్లు గొనివచ్చి రామభూపాలుని సమ్ముఖంబున నునిచిన నద్ధరాతనూజాత పతికి* ***వినయభక్తి తాత్పర్యంబులు వెలయఁ బ్రణమిల్లిన*** (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:155 – [మొల్ల రామాయణం-యుద్ధకాండ-తృతీయాశ్వాసం-114వ వచనం]) – రావణ సంహారం తరువాత తన సమ్ముఖానికి రప్పించుకున్న రాముడికి సీత వినయ భక్తి తాత్పర్యాలు ఉట్టిపడేటట్లుగా నమస్కరించింది.

సీతాన్వేషణ అనంతరం స్వామి హనుమ ప్రదర్శించిన వందన భక్తి కూడా అటువంటిదే. *చనుదెంచి శ్రీరామచంద్రుని పాదారవిందములకు సాష్టాంగ దండ ప్రణామమ్ము లాచరించి* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:94 – [మొల్ల రామాయణం-సుందరకాండ-244వ వచనం]) – 'రాముని పాదపద్మాలకు సాష్టాంగ దండప్రణామాలు చేసి' హనుమ తన వందనభక్తిని చాటుకున్నాడు.

### 2.6.3. భాస్కర రామాయణం

వాలి వధ అనంతరం రాజ్యాభిషిక్తుడైన సుగ్రీవుడు, వర్షాకాలం ముగిసి, శరత్కాలం మొదలయ్యాక లక్ష్మణుడితో కలిసి రాముడిని చూడడానికి మాల్యవంత పర్వతానికి వెళతాడు.

*తరణిసుతుండు రామవిభు దవ్వులఁ గన్గొని హస్తపద్మముల్*
*శిరమునఁ జేర్చి మ్రొక్కుచును జేరఁగ వచ్చి సమగ్రభక్తితో*

*ధరపయిఁ జక్కఁ జాఁగిపడి దండము వెట్టిన...*(భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:257 – [భాస్కర రామాయణం-కిష్కింధాకాండ-528వ పద్యం]) 'దూరంనుండి చూస్తూనే, తలపై తన చేతులు చేర్చి మొక్కుతూ, భక్తితో నేలపై సాగిలిపడి సాష్టాంగ ప్రణామం చేశాడు సుగ్రీవుడు.' ఈ సందర్భంలో సుగ్రీవుడు చూపిన వందనభక్తి ఎన్నతగినది.

## 2.7. దాస్యం

దాస భావంతో భగవంతుడికి సేవ చేయటాన్ని దాస్య భక్తి అంటారు. దాసుడు తనకు కలిగే కష్టాలనుగురించి కించిత్‌కూడా ఆలోచించకుండా తన ప్రభువుకు మేలు కలిగే పని చేయడంలో ముందుంటాడు. *దాస్యం కర్మార్పణం తస్య కైంకర్య మపి సర్వదా* (వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985:73 – [భక్తిరసామృత సింధువు-పూర్వవిభాగం-ద్వితీయలహరి-183వ శ్లోకం]) – సర్వకర్మలు భగవదర్పణం చేసి కైంకర్యం చేయడం దాస్యభక్తి.

సఖ్యం, పాదసేవనం లాగే, దాస్యం కూడా భగవంతుడి అవతార సమయంలోనే సాధ్యపడే భక్తి మార్గం. కనుక, భగవత్ దాస్యానికి మార్గాంతరంగా భాగవత దాస్యం ప్రతిపాదించబడింది. కులశేఖరాళ్వారు *ముకుందమాల* లో 'ఓ స్వామీ! నీ సేవకులకు సేవకులు, వారికి సేవకులు అంటూ సాగే సేవకుల పరంపరలో నన్ను చివరి సేవకుణ్ణిగా భావించుము' అని కోరుకుంటారు (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:122 – [ముకుందమాల-27వ శ్లోకం]).

### 2.7.1. భాగవతం

#### 2.7.1.1. ఉద్ధవుడు

కురుపాండవ యుద్ధం జరగడానికి ముందు దుర్యోధనుడు చేసిన అవమానానికి మనస్తాపం చెంది, విదురుడు తీర్థయాత్రా దర్శనం చేయడానికి వెళ్ళిపోతాడు. చాలా కాలం

తరువాత యమునానదీ తీరంలో ఉద్ధవుడిని చూసి పాండవుల, యాదవుల కుశలసమాచారాన్ని తెలుసుకోవాలనుకుంటాడు. అయితే అప్పటికే కృష్ణుడు అవతారసమాప్తి చేసి ఉండడంవలన ఉద్ధవుడికి కృష్ణుడి వియోగాన్ని తలచుకోగానే అపరిమితమైన దుఃఖం కలిగి నోరు పెగలలేదు. అటు పిమ్మట అతడు కృష్ణుడిని తలచుకుని పలవరించిన తీరు అతని దాస్యభక్తికి ఉదాహరణ. ఉద్ధవుడి గురించి ప్రస్తావిస్తూ శుకమహర్షి అతని బాల్య వృత్తాంతమొకటి చెబుతాడు.

> *మున్ను కృష్ణునిం గూడి యాడు బాలకులలో నొక్క బాలునిఁ గృష్ణునింగా భావించి పరిచర్య సేయుచుండ గుణవతీమతల్లి యగు తల్లి సనుదెంచి 'యాకొంటి విదియేల రావన్న' యని పిలిచిన జననీవాక్యంబులు గైకొనక యఖండతేజోనిధియైన పుండరీకాక్షు పాదారవింద మకరంద సేవానురక్తింజేసి యున్న యుద్ధవుండు నేఁడు కృష్ణవియోగతాపంబున హరివార్త విదురునకుఁ జెప్పంజాలక యొప్పఱి యుండుట యేమి చిత్రం* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-2:28 – [ఆంధ్రమహాభాగవతం-3వ స్కంధం-79వ వచనం])

'ఒక సారి కృష్ణుడితో ఆటలాడే పిల్లలలో ఒక పిల్లవాడిని కృష్ణుడిగానే భావిస్తూ ఉద్ధవుడు సేవలు చేస్తుండగా, అతని తల్లి భోజనానికి రమ్మని పిలిచింది. శ్రీకృష్ణుడి పాదసేవనంలో మైమరచిపోయి ఉండిపోయిన ఉద్ధవుడు తల్లి మాటలను వినిపించుకోలేదు. అటువంటి ఉద్ధవుడు కృష్ణుడు లేడన్న దిగులుతో ఆ విషయాన్ని విదురుడికి చెప్పలేక స్తబ్ధుడైపోవడంలో చిత్రమేముంది?' ఈ వృత్తాంతం అతని దాస్యభక్తిని నిరూపిస్తుంది.

ఉద్ధవుడు తన స్వామిపట్ల ఎప్పుడో జరిగిన అపచారాలకు పరితపిస్తాడు. *అభిజన విద్యాధన బలగర్వ మదాంధీభూతచేతస్కులైన శిశుపాలాది భూపాలకు లమ్మహాత్మునిం బరతత్త్వంబని యెఱుంగక నిందించు దుర్భాషలు దలంచి మనస్తాపంబు నొందుచుండుదు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-2:31 – [ఆంధ్రమహాభాగవతం-3వ

స్కంధం–87వ వచనం]) – 'గర్వాంధులైన శిశుపాలుడు మొదలైన రాజులు శ్రీకృష్ణుడిని పరమాత్మగా తెలుసుకోలేక, అతడిని దుర్భాషలతో నిందించేవారు. వాటిని తలచుకుని మనస్తాపం చెందుతుంటాను'.

*కడఁగి పెక్కిడుమలఁ గుడుచుచుఁ జిత్తముల్ కలఁగఁగ బంధనాగారములను*
*వనరిన దేవకీవసుదేవులను డాయఁ జనుదెంచి భక్తివందన మొనర్చి*
*తలిదండ్రులార! యేఁ గలుగంగ మీరలు కంసుచే నలజడిఁ గ్రాగుచుండఁ*
*గడగి శత్రుని జంపఁగా లేక చూచుచు నున్న నాతప్పుఁ బ్రసన్ను లగుచుఁ*
*గావుఁడని యానతిచ్చిన దేవదేవు*
*నద్భుతావహ మధురవాక్యములఁ దలఁచి*
*తలఁచి నాచిత్తమునఁ బెద్ద గలుగుచుందుఁ*
*బృథులపాతకభూమిభృద్భిదుర విదుర!* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017.
సంపుటం–2:35 – [ఆంధ్రమహాభాగవతం–3వ స్కంధం–94వ పద్యం])

'కంసుడి కారాగారంలో మగ్గుతూ ఎన్నో కష్టాలు పడిన దేవకీవసుదేవుల దగ్గరకు వెళ్ళి భక్తితో నమస్కరించి, *తల్లిదండ్రులారా! నేనుండగా మీరు కంసుడిచేతిలో ఎన్నో కష్టాలను పడవలసి వచ్చింది. మీ కష్టాలను కళ్ళారాచూస్తూ కూడా శత్రువును వెంటనే చంపక ఉపేక్షించినందుకు నన్ను క్షమించండి* అన్న నా స్వామి మధురమైన మాటలను తలచుకొంటే నా మనసు క్షోభిస్తుంటుంది*'* అంటూ కృష్ణుడి జ్ఞాపకాలను తలచుకొని బాధపడతాడు. కృష్ణుడు కంసుడిని చంపి, అతని తండ్రి అయిన ఉగ్రసేనుడికి పట్టంకట్టి తాను నిమిత్తమాత్రుడిగా మిగిలిపోవటాన్ని తలచుకుని కలత చెందుతాడు.

అవతార సమాప్తికి ముందు శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి అవధూత సంవాదం మొదలైన తత్త్వ, భక్తి బోధకమైన విషయాలను బోధిస్తాడు.

*ఉద్ధవుండు భక్తి భయ వినయంబులం గరంబులు మొగిడ్చి 'మహాత్మా! సన్న్యస్త లక్షణంబు దుష్కరంబు; పామరులగు వార లాచరింపలేరు; నీ మాయచేత భ్రాంతులైన సాంసారికులు భవాబ్ధిం గడచి యెట్లు ముక్తి వడయుదురు? **భృత్యుండనైన నా మీఁది యనుగ్రహంబునం జేసి యానతిమ్ము;...... బరమేశ్వరా! నీదు చరణంబుల శరణంబు నొందెద; గృపారసంబు నాపై నిగిడింపు'మని ప్రియసేవకుండైన యుద్ధవుండు** పలికిన నతనికిఁ గంసమర్దనుం డిట్లనియెఁ...* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–8:51,52 – [ఆంధ్రమహాభాగవతం–11వ స్కంధం–91వ వచనం])

ఈ సందర్భంలో తనను తాను సేవకుడినని చెప్పుకున్న ఉద్ధవుడి దాస్యభక్తి తేటతెల్లమైంది.

### 2.7.1.2. అంబరీషుడు

విశాలమైన రాజ్యాన్ని పరిపాలించే మహారాజైనప్పటికీ అంబరీషుడు దాస్య భావంతో నిరంతరం హరిసేవ చేసేవాడు.

*చిత్తంబు మధురిపు శ్రీపాదముల యంద పలుకులు హరిగుణపఠనమంద*
*కరములు విష్ణుమందిర మార్జనములంద శ్రవములు హరికథాశ్రవణమంద*
*చూపులు గోవింద రూపవీక్షణమంద శిరము గేశవనమస్కృతుల యంద*
*పదము లీశ్వరగేహపరిసర్పణములంద కామంబు చక్రికైంకర్యమంద*
*సంగ మచ్యుతజన తనుసంగమంద*
*ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద*
*రసనఁ దులసీదళములంద; రతులు పుణ్య*
*సంగతుల యంద యా రాజచంద్రమునకు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–5:341 – [ఆంధ్రమహాభాగవతం–9వ స్కంధం–82వ పద్యం])

‘తన మనసును మధ్వారి పాదాలమీద నిలిపేవాడు. ఎల్లప్పుడూ విష్ణు కీర్తనలను ఆలపించేవాడు. విష్ణు మందిరాన్ని తానే స్వయంగా తన చేతులతో శుభ్రపరిచేవాడు. నిరంతరం హరికథాశ్రవణం చేసేవాడు. చూపులు గోవిందుని విగ్రహంమీదనే నిలిపేవాడు. తన శిరస్సును నారాయణునిముందు వందనంకోసం వంచేవాడు. నిరంతరం భాగవతుల సాహచర్యంలోనే గడిపేవాడు. విష్ణు భక్తుల పాదసేవనం చేసేవాడు. తులసిదళాలను సేవించేవాడు. విష్ణులీలలను వినటం మీదే ఆసక్తిని చూపేవాడు.’ ఇలా తన సర్వేంద్రియాలతో విష్ణు సేవ చేసేవాడు. తన సర్వకర్మలను హరికి అంకితం చేసి తన దాస్యభక్తిని నిరూపించుకున్నాడు అంబరీషుడు. అటువంటి భక్తుడు కనుకనే నారాయణుడు తన భక్తుడిని రక్షించటానికి తన సుదర్శన చక్రాన్నే పంపించాడు.

ఒకసారి అంబరీషుడు ద్వాదశీవ్రతాన్ని ఆచరించి, వ్రతాంతంలో యథావిధిగా దానధర్మాధికాలు, బ్రాహ్మణులకు అన్నసమారాధన చేసి, పారణ చేయడానికి కూర్చున్న సమయంలో దుర్వాస మహర్షి అతిథిగా వస్తాడు. మహర్షిని భోజనానికి ఆహ్వానిస్తాడు అంబరీషుడు. దుర్వాసుడు అందుకు ఒప్పుకుని, యమునలో స్నానం చేయడానికి వెళతాడు. ద్వాదశి గడియలు ముగుస్తున్నా, మహర్షి ఇంకా రాకపోవడంతో, పండితులను సంప్రదించి, రాజు నీటిని పారణ చేస్తాడు. సరిగ్గా అదే సమయానికి వచ్చిన దుర్వాసుడు, అతిథిని పిలిచి అతనికంటే ముందే భుజించిన నేరానికి అతనిమీదకు కృత్యను పంపుతాడు. తన దాసుడిని రక్షించడానికి, అతడు ప్రార్థించకుండానే తన సుదర్శనాన్ని పంపుతాడు హరి.

దుర్వాసుడు చక్రం బారినుండి తనను తాను కాపాడుకోవడానికి మూడు లోకాలు తిరిగి, ఆఖరికి విష్ణువు సలహా మేరకు అంబరీషుడినే శరణు వేడతాడు. *హరి సుఖియై నా కొలువువలనఁ జొక్కెడినేనిన్..* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:360 – [ఆంధ్రమహాభాగవతం-9వ స్కంధం-138వ పద్యం]) –‘తన సేవలవల్ల విష్ణువు తృప్తి

పొందినట్లైతే దుర్వాసుడు రక్షింపబడుగాక!' అంటూ తనను తాను భగవంతుడి కొలువు చేసేవాడిగా చెప్పుకుంటాడు అంబరీషుడు. అలా దుర్వాసుడిని చక్రాగ్ని బారి నుండి రక్షిస్తాడు. ఈ ఘట్టంలో అంబరీషుడి దాస్యభక్తి నిరూపితమైంది.

### 2.7.2. మొల్ల రామాయణం

దాస్య భక్తికి రామాయణంలో లక్ష్మణుడు, హనుమంతుడు ఉత్తమ ఉదాహరణలుగా నిలుస్తారు.

*నెఱయక నిద్రాహారము*

*లెఱుఁగక పదునాలుగేండ్లు హితమతితో మ*

*మ్మఱిముఱి నరసిన నిన్నును*

*మఱువనగునె నీతి గల్గుమనుజుల కెందున్* (6-2-50) (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:128 – [మొల్ల రామాయణం-యుద్ధకాండ-ద్వితీయాశ్వాసం-50వ పద్యం])

'నిద్రాహారాలు మాని పద్నాలుగేళ్ళు నన్ను సంరక్షించిన నిన్ను మరవడం నీతిపరులైన మానవులకు సాధ్యమా?' అంటూ వనవాస సమయంలో నిద్రాహారాలు మాని, తనను సేవించిన లక్ష్మణుడి దాస్య భక్తినిగురించి సాక్షాత్తుగా శ్రీరామచంద్రుడే పేర్కొన్నాడు.

దాసుడు తన ప్రభువు బాధపడితే చూడలేడు. కార్యమెంతటి అసాధ్యమైనదైనాచేసి తన ప్రభువుకు సంతోషం కలిగించాలనుకుంటాడు. అటువంటి దాస్యభక్తిని లక్ష్మణుడి నోట మొల్ల మనోహరంగా పలికించింది

*వ్రచ్చెద నాకలోకమునవారల గుండెలు నాగలోకమున్*

*గ్రొచ్చి యహీంద్రవర్గమును గూల్చెదఁ గవ్వపుగొండ కైవడిన్*

*ద్రచ్చెద మర్త్యలోకము నుదారత నేగతి నైనఁ గ్రమ్మఱం*

*దెచ్చెద సీత నీక్షణమ దేవరచిత్తము మెచ్చునట్లుగన్* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:44 – [మొల్ల రామాయణం-ఆరణ్యకాండ-60వ పద్యం])

*చించెద దైత్యసంఘములఁ జిందఱవందఱఁ జేసి బ్రహ్మ బా*

*ధించెద లోకపాలకులఁ ద్రెళ్ళఁగ నేసెద భూతలమ్ము గ్ర*

*క్కించెద శైలజాలముల గీటడఁగించెద భూమినందనన్*

*గాంచెదఁ దల్లడిల్లకుము కంజహితాన్వయ వార్ధి చంద్రమా!* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:44 – [మొల్ల రామాయణం-ఆరణ్యకాండ-62వ పద్యం])

'స్వర్గలోకవాసుల గుండెలు చీలుస్తాను. పాతాళానికి తవ్వుతూ పోయి, నాగజాతినంతటినీ కూలుస్తాను. కవ్వంతో చిలికినట్లు మనుష్యలోకాన్నంతటినీ మథిస్తాను. నా స్వామివైన నువ్వు సంతోషించేటట్టు ఈ క్షణంలో సీతను తెస్తాను. రాక్షస సమూహాలను చెండాడుతాను. ఈ విధమైన రాత రాసినందుకుగాను బ్రహ్మను బాధిస్తాను. సీతను రావణుడు ఎత్తుకుపోతూంటే చూస్తూ ఊరుకున్నందుకుగాను లోకపాలకులను శిక్షిస్తాను. భూతలాన్ని వణికిస్తాను. పర్వతాల తలదించుతాను. ఎలా అయినా సరే భూమిజ అయిన సీతను రక్షిస్తాను. నువ్వు బాధపడకు' అనే లక్ష్మణుడి మాటలలో సాధ్యాసాధ్యాల విషయం పక్కన పెడితే, ఏదైనా చేసి తన ప్రభువు బాధపడకుండా చేయాలనే దాసుని తపన వ్యక్తమవుతోంది.

### 2.7.3. భాస్కర రామాయణం

వనవాసపు పదునాలుగేళ్ళు, నిద్రాదులను విసర్జించి, రఘురాముడిని కొలవాలని ప్రతిన పూనిన లక్ష్మణుడు, ఆ ప్రకారం వనవాస కాలంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా తన అన్న రాముడికి భక్తి శ్రద్ధలతో సేవలు చేశాడు.

*బహుమృగమాంసఖండములు పక్వఫలంబులు తేనియల్ రఘూ*

*ద్వహుసతి గోరు భూరుహలతాకుసుమాదులుఁ దెచ్చి యిచ్చుచుఁ*

*మిహిరసమానతేజుఁడు సుమిత్రతనూజుఁడు గొల్వఁగా ముదా*

*వహములయ్యెఁ దత్సమయవాసరముల్ గురువంశభర్తకున్* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:128 – [భాస్కర రామాయణం–ఆరణ్యకాండ–ప్రథమాశ్వాసం–116వ పద్యం])

'అనేకరకాలైన మాంసాలు, దోరగాపండిన పళ్ళు, తేనెలు, సీత కోరుకునే లతలు, పుష్పాదులు తెచ్చి ఇస్తూ, లక్ష్మణుడు సేవిస్తుండగా, రాముడికి వనవాసపు రోజులు ఆనందదాయకంగా గడిచాయి.' ఈ విధంగా లక్ష్మణుడు తన సేవలతో రామునికి వనవాసపురోజులనుకూడా ఆనందమయం చేసి తన దాస్యభక్తిని నిరూపించుకున్నాడు.

## 2.8. సఖ్యం

భగవంతుడిపట్ల సఖ్య భావాన్ని ప్రదర్శించటం సఖ్యభక్తి. భగవంతుడిని స్నేహితుడిగా భావించి, అతనికి జరిగిన మంచికి పొంగిపోవడం, అతని కష్టానికి బాధపడడం, అతడికి చేదోడు వాదోడుగా ఉండడం, తన కష్టసుఖాలను అతడితో పంచుకోవడం, అతడి పట్ల విశ్వాసం కలిగి ఉండడం సఖ్యభక్తిగా పరిగణించబడుతుంది. పరిపక్వం చెందిన దాస్య భక్తి సఖ్య భక్తి అవుతుంది.

### 2.8.1. భాగవతం

#### 2.8.1.1. అర్జునుడు

భగవంతుడితో సఖ్యం అనగానే గుర్తొచ్చే మొదటి అనుబంధం శ్రీకృష్ణార్జునులదే. శ్రీరామావతారంలోకూడా రామచంద్రమూర్తికి సుగ్రీవుడు, విభీషణుడు స్నేహితులే అయినా,

అవి అవసరార్థం ఏర్పడ్డ స్నేహాలు. శ్రీకృష్ణుడికి అర్జునుడితో స్నేహం అటువంటిది కాదు. కృష్ణుడు అర్జునుడికోసం తన అన్నను సైతం ఎదిరించి తన చెల్లెలిని ఇచ్చి వివాహం చేశాడు. సాక్షాత్తు భగవానుడయినప్పటికి, యుద్ధంలో అర్జునుడికి రథసారథ్యంచేసి పార్థసారథిగా వినుతికెక్కాడు. అడుగడుగునా అర్జునుడిని కాస్తూ వచ్చాడు.

అర్జునుడుకూడా శ్రీకృష్ణుడిపట్ల అదేవిధమైన అభిమానాన్ని ప్రదర్శించాడు. శ్రీకృష్ణ నిర్యాణానంతరం ఆ వార్త ధర్మరాజుకు తెలుపుతూ అర్జునుడు వగచిన తీరు అతని సఖ్యభక్తికి నిదర్శనం. ద్రౌపదీ స్వయంవరంలో గెలుపు, ఖాండవవన దహనం, రాజసూయ యాగ నిర్వహణ, ద్రౌపదీ మాన సంరక్షణ, వనవాసంలో దూర్వాసుని కోపానలంనుండి రక్షింపబడడం, కురుపాండవ యుద్ధంలో అనేక పర్యాయాలలో తాము (పాండవులను) ముఖ్యంగా తాను (అర్జునుడు) ఆదుకొనబడడం... ఇలా చిన్ననాటినుండి శ్రీకృష్ణుడు వారి పక్షాన వహించి వారికై చేసిన పనులను పరిపరివిధాల తలచుకుని వాపోయాడు అర్జునుడు. తను చేసిన ప్రతి పని, ప్రతి వీరోచిత కార్యం, ప్రతి సాహస కృత్యం వెనుక ఉన్నది శ్రీకృష్ణుడి కరుణే అని అర్జునుడి విశ్వాసం. ఈ కింది పద్యం కృష్ణార్జునుల స్నేహంలోని గాఢతకు తార్కాణం.

*చెలికాఁడ! రమ్మని చీరు నన్నొకవేళ, మన్నించు నొకవేళ మఱఁది యనుచు,*
*బంధుభావంబునఁ బాటించు నొకవేళ, దాతయై యొకవేళ ధనము లిచ్చు,*
*మంత్రియై యొకవేళ మంత్ర మాదేశించు, బోధియై యొకవేళ బుద్ధి సెప్పు,*
*సారథ్య మొనరించుఁ జనవిచ్చి యొకవేళఁ, గ్రీడించు నొకవేళ గేలి సేయు,*
*నొక్క శయ్యాసనంబున నుండుఁ గన్న*
*తండ్రి కైవడిఁ జేసిన తప్పుఁ గాచు,*
*హస్తములు వట్టి పొత్తున నారగించు*

*మనుజవల్లభ! మాధవు మఱవ రాదు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:213 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–369వ పద్యం])

'చెలికాడా రా అని నన్నొకమారు పిలిచేవాడు. ఒక్కోమారు మరిదిగా గౌరవించేవాడు. ఇంకోసారి బంధువుగా ఆదరించేవాడు. ఒకసారి దాతగా ధనమిచ్చేవాడు. ఒకసారి మంత్రిగా ఉపదేశించేవాడు, బుద్ధి చెప్పేవాడు. నా రథసారథ్యం చేసేవాడు. ఒక్కోసారి ఆట పట్టించేవాడు. మేళమాడేవాడు. ఒక పర్యాయం మంచంపై కూర్చోబెట్టుకుని నేను చేసిన తప్పును తండ్రిలా కాచేవాడు. ఇంకో పర్యాయం చేతులు పట్టుకుని సహపంక్తిలో కూర్చోబెట్టుకుని భోజనం చేసేవాడు. అటువంటి మాధవుడిని నేనెలా మరువగలను.' అంటూ వాపోతాడు అర్జునుడు. విజయ, ధనంజయ, ఫల్గున, పార్థ అంటూ తనను పలునామాలతో ప్రేమగా పిలిచేవాడని తలచుకుని బాధపడతాడు.

*వారిజగంధులు దమలో*
*వారింపఁగరాని ప్రేమ వాదము సేయన్*
*వారిజనేత్రుఁడు ననుఁ దగ*
*వారిండ్లకుఁ బనుపు నలుక వారింప నృపా!* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–1:214 – [ఆంధ్రమహాభాగవతం–1వ స్కంధం–371వ పద్యం])

'తన అంతఃపుర స్త్రీలతో ప్రణయ కలహాలు సంభవించినపుడు, వారి అలకలు తీర్చడానికి శ్రీకృష్ణుడు తనను పంపేవాడని, తన ప్రియురాళ్ళతో జరిపే రహస్య సంభాషణలను సైతం తనతో పంచుకునేవా'డని ధర్మరాజుతో చెబుతూ దుఃఖిస్తాడు అర్జునుడు.

"వదలి ఉండటాన్ని సహించనివాడు బంధువు. ఎప్పుడూ అనుమతితో ఉండేవాడు సుహృత్తు. ఒక పనిలో కలసి ఉండేవాడు మిత్రుడు. సమప్రాణుడు సఖుడు"

(కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:214) అని నిర్వచనం. ఆ విధంగానే శ్రీకృష్ణార్జునులు ఒకరికొకరు బహిఃప్రాణంగా మెలిగేవారు.

తన మిత్రుడు ఈ లోకం వీడి వెళ్ళిపోతే, తన ప్రాణాలు ఇంకా తననే అంటిపెట్టుకుని ఉండడం ఎంత దురదృష్టమో అని అర్జునుడు దుఃఖించిన తీరు అతని సఖ్యభక్తికి అద్దం పడుతుంది.

### 2.8.1.2. ఉద్ధవుడు

అర్జునుడి తరువాత పరమాత్ముడితో అంతటి స్నేహ సంబంధాన్ని నెరపిన వాడు ఉద్ధవుడు. కృష్ణుడు బృందావనం విడిచిపెట్టి మధురకు వెళ్ళిన తరువాత రాచకార్యాలలో మునిగి, తిరిగి బృందావనానికి వెళ్ళలేకపోయాడు. తన మీదే ప్రాణాలు పెట్టుకుని ఉన్న గోపకాంతలు ఎంతటి దైన్యం పొంది ఉంటారో అని విచారించి, వారికి అనునయవాక్యాలతో సందేశం పంపుదామనుకున్న కృష్ణుడు, అందుకు ఉద్ధవుడిని తగినవాడిగా భావిస్తాడు. *మందహాససుందరవదనారవిందుడై కరంబు కరంబున నవలంబించి, సరసవచనంబు లాడుచు* సందేశాన్నందించమని ఉద్ధవుడిని పంపిస్తాడు. ఇలా తన ప్రియురాళ్ళ వద్దకు ప్రేమ సందేశం పంపటానికి ఉద్ధవుడిని ఎన్నుకున్నాడంటే వారి మధ్య ఉన్న స్నేహబంధమెంత గాఢమైనదో గమనించవచ్చు. ఇదే మాటను గోపికలు కూడా పేర్కొంటారు. *ఎఱుఁగుదు మేము నిన్ను వనజేక్షణ మిత్రుఁడ వీవు* – 'నువ్వు శ్రీకృష్ణుడి మిత్రుడివని మాకు తెలుసు' అంటూ ఉద్ధవుడితో సంభాషణ మొదలుపెట్టి,

*ఏకాంతంబున నీదుపైఁ నొరగి తా నేమేని భాషించుచో*
*మా కాంతుండు వచించునే రవిసుతా మధ్యప్రదేశంబునన్*
*రాకాచంద్ర మయూఖముల్ మెఱయఁగా రాసంబు మాతోడ నం*
*గీకారం బొనరించి బంధనియతిం గ్రీడించు విన్నాణముల్* (లక్ష్మణయ్య, సముద్రాల.

2017. సంపుటం–6:592 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–పూర్వ భాగము–1479వ పద్యం])

'మీరిద్దరూ ఏకాంతంలో ఉన్నప్పుడు, నీ భుజం మీదకు వాలి, యమునానదిలో, పున్నమి రాత్రులలో మాతో సలిపిన రాసక్రీడల సంగతులు నీతో చెబుతాడా?' అంటూ అడుగుతారు. అంతే కాదు, కుబ్జ కోరిక తీర్చడానికి ఆమె ఇంటికి వెళ్ళి, అక్కడ కొంతకాలం గడిపినప్పుడుకూడా ఉద్ధవుని తోడుగా తీసుకుని వెళ్ళాడు కృష్ణుడు. దీనిని బట్టి ఉద్ధవుడు కృష్ణుడికి ఆంతరంగిక మిత్రుడని తేటతెల్లమవుతోంది.

కృష్ణుడు కొలువు తీరి ఉండగా, ఒకనాడు ఒక బ్రాహ్మణుడు వచ్చి జరాసంధుడి చెరలో ఉన్న రాజుల సందేశాన్ని వినిపిస్తాడు. వారంతా తమను జరాసంధుడి చెరనుండి విముక్తుల్ని చేయమని కృష్ణుడిని వేడుకుంటారు. అదే సమయానికి నారదుడు అక్కడికి వచ్చి, ధర్మరాజు నిర్వహించబోయే రాజసూయానికి రావలసిందిగా ఆహ్వానిస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఉద్ధవుడిని మార్గ నిర్దేశనం చేయాల్సిందిగా కోరతాడు.

*అనఘచారిత్ర! నీవు మా యక్షియుగము వంటివాఁడవు మనకు నవశ్య మగుచుఁ*
*జేయఁ దగినట్టి కార్యంబుఁ జెప్పు నీవు ఏమి పంచినఁ గావింతు నిద్ధచరిత!*
(లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–7:279 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–ఉత్తర భాగము–667వ పద్యం])

'ఉద్ధవా! నువ్వు నా రెండు కళ్ళవంటివాడివి. ఇప్పుడు మనం చేయవలసిన పనేదో నువ్వే చెప్పు. నువ్వేం చెప్పినా చేస్తాను' అని ఉద్ధవుడి మాటలకు ప్రాముఖ్యతనిస్తాడు కృష్ణుడు.

అప్పుడు ఉద్ధవుడు, రాజసూయానికే వెళ్ళమని, అక్కడ దిగ్విజయ యాత్ర చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. కనుక, ఆ సందర్భంలో జరాసంధుడిని భీమునిచేత చంపించి, అతని

చెరలో ఉన్న రాజులను విడుదల చేయించవచ్చని చెబుతాడు. అంతేకాక, జరాసంధుడు బ్రాహ్మణులేమడిగినా ఇస్తాడు కనుక, కపట బ్రాహ్మణ వేషంలో వెళ్ళి, అతడిని యుద్ధ భిక్ష పెట్టవలసిందిగా కోరమనికూడా సూచిస్తాడు. అతడి ఆలోచనకు శ్రీకృష్ణుడు సంతోషించి అదే విధంగా పాటిస్తాడు. ఈ విధంగా కృష్ణుడికి మంత్రాంగంలోకూడా చేదోడు వాదోడుగా ఉంటూ జగద్రక్షకుడితో సఖ్యబంధాన్ని నెరపిన ధన్యుడు ఉద్ధవుడు.

### 2.8.1.3. కుచేలుడు

శ్రీకృష్ణుడి బాల్యమిత్రుడైన కుచేలుడుకూడా పరమాత్ముడిపట్ల సఖ్యభక్తిని చూపి తరించినవాడే. దారిద్ర్యంతో బాధపడుతున్న కుచేలుడు తన భార్య సలహా మేరకు బాల్యసఖుడైన కృష్ణుడిని చూడటానికి వెళతాడు. చాలా కాలం తరువాత తన మిత్రుడిని చూడటానికి వెళుతూ, తన ఆప్యాయతకు చిహ్నంగా అటుకులను కానుకగా తీసుకెళతాడు.

తనను చూడటానికి వచ్చిన కుచేలుడిని కృష్ణుడు దూరం నుంచే చూచి, ఎదురెళ్ళి, ఆప్యాయతతో కౌగిలించుకుని, తీసుకు వచ్చి, తన పానుపుపై కూర్చుండబెడతాడు. మంచి గంధాన్ని శరీరానికి పూసి, మార్గాయాసం తీరేలాగ స్వయంగా వీవెన వీచి, కుచేలుని సిగలో పూలదండలు తురిమి, కర్పూర తాంబూలమిస్తాడు. కుచేలుని చేతిని తన చేతిలోకి తీసుకుని చిన్ననాటి ముచ్చటలు ప్రస్తావిస్తాడు. తనకోసం తెచ్చిన అటుకులను తీసుకుని ఎంతో ఆదరంతో భుజిస్తాడు.

*నా పుణ్య మరయ నెట్టిదొ, యా పుణ్యనిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల*
*వ్యాపకు బ్రహ్మణ్యునిఁ జి, ద్రూపకుఁ బురుషోత్తమునిఁ బరుం గనుఁగొంటిన్.*

(లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–7:434 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–ఉత్తర భాగము–1016వ పద్యం])

'అచ్యుతుడు, సర్వవ్యాపకుడు, పురుషోత్తముడు అయిన శ్రీ కృష్ణుడిని చూడగలిగిన నా పుణ్యమెటువంటిదో' అని పొంగిపోతాడు కుచేలుడు. తనను ఎంతో ఆదరించిన కృష్ణుడు తన దారిద్ర్య నివారణ మాత్రం చేయలేదు. ఆశ్రితజనవత్సలుడైన శ్రీకృష్ణుడు తనకు సంపదలివ్వకపోవడానికి కారణం తనను అనుగ్రహించటానికే. సంపదలుంటే ఆ విభవంలో పడి కృష్ణుడిని మరచిపోతానని ఇవ్వలేదని అనుకుంటాడు. శ్రీకృష్ణుని కృపవల్ల దేవేంద్రవైభవం కలిగినా, ఆ భోగాలపట్ల ఆసక్తి చూపించకుండా, *కారుణ్యసాగరుండైన గోవిందుని చరణారవిందంబులయందుల భక్తి ప్రతిభవంబునఁ గలుగుం గాక!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-7:440 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-ఉత్తర భాగము-1031వ వచనం]) – 'ప్రతి జన్మలోనూ నాకు దయాసముద్రుడైన కృష్ణుని పాదాలపై భక్తి కలుగుగాక' అని కోరుకున్న కుచేలుడు గొప్ప సఖ్యభక్తుడు.

### 2.8.2. మొల్ల రామాయణం

రామాయణంలో సుగ్రీవుడు, విభీషణుడు సఖ్య భక్తికి మంచి ఉదాహరణలు. శరణు జొచ్చిన *విభీషణు నెత్తి యాలింగనంబుచేసి యభయప్రదానం బొసఁగి నేఁడు మొదలు నీవు మాకు హితుండవు బంధుండవు నయితివి గావున నిన్ను మాతమ్ములలో నొకనిఁగాఁ జూచుకొనియెద* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:104 – [మొల్ల రామాయణం-యుద్ధకాండ-ప్రథమాశ్వాసం-32వ వచనం]) – 'శరణు వేడిన విభీషణుడిని కౌగిలించుకొని, అభయమిచ్చి, ఇవాళ్టి నుండి నీవు నాకు హితుడవు, బంధుడవు. నిన్ను మా తమ్ముళ్ళలో ఒకడిగా చూసుకుంటా'నని పలికిన శ్రీరాముడికి కడదాక మంచి మిత్రుడిగా నిలిచాడు విభీషణుడు.

యుద్ధసమయంలో రావణుడి తలలు, చేతులు తుంచితుంచి రాముడు విసిగెత్తి ఉన్న సమయంలో

*పోలఁగ నాతని నాభీ*

*మూలంబున నున్న యమృతమును మొదలను ని*

*ర్మూలముగా శ్రీరఘుభూ*

*పాలక! తెగవ్రేయు మగ్నిబాణముచేతన్* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:151 – [మొల్ల రామాయణం–యుద్ధకాండ–తృతీయాశ్వాసం–96వ పద్యం])

'అగ్నిబాణంచేత రావణుని కడుపులో ఉన్న అమృతభాండాన్ని పగలగొట్ట'మని అమృతభాండాన్ని ఛేదింపజేసి, ఆపై *బ్రహ్మాస్త్రంబున నడఁగింపఁ దగు* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:153 – [మొల్ల రామాయణం–యుద్ధకాండ–తృతీయాశ్వాసం–104వ వచనం]) – 'బ్రహ్మాస్త్రంతో సంహరించ'మని రాముడికి ఎక్కడికక్కడ మార్గనిర్దేశనం చేస్తూ సఖ్యభక్తిని ప్రదర్శించాడు విభీషణుడు.

### 2.8.3. భాస్కర రామాయణం

భాస్కర రామాయణంలో గుహుడు, సుగ్రీవుడు, కొన్ని పర్యాయాల్లో లక్ష్మణుడు సఖ్యభక్తిని ప్రదర్శించారు. రాముడు వనవాసానికి వెళుతూ, గంగానదిని దాటే సందర్భంలో అక్కడి కిరాతరాజైన గుహుడు తారసపడతాడు. *మహితాంబర రత్నఖచిత మందన సుమనస్సహితోపాయనముల* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:92 – [భాస్కర రామాయణం–అయోధ్యాకాండ–136వ పద్యం]) తో రాముడికి ఎదురేగి స్వాగతించి, రాముడి తపస్వి రూపానికి కలతపడి, రామునికి కలిగిన దురవస్థకు చింతిస్తాడు. ఆ రాత్రి రాముడక్కడ విడిది చేసిన తరువాత, దగ్గరుండి నావలో సీతారామలక్ష్మణులను గంగానది దాటిస్తాడు గుహుడు. భరతుడు సైన్యసమేతంగా రాముడిని వెనక్కి తీసుకురావడానికి బయలుదేరగా, భరతుడు రాముడిపై యుద్ధానికి వెళుతున్నాడేమోనని భావించి,

*నీ సేన విఱిగి పోవcగ నాసురగతి నె(త్తువఱద లడరcగc బటుబా*

*ణాసారము చూపెద బాణాసన మనుఘోషభీషణాభ్రము వలనన్* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:105 – [భాస్కర రామాయణం–అయోధ్యాకాండ–246వ పద్యం])

'నీ సేనలు కూలిపోయేటట్టుగా, నెత్తురువరదలు పారేటట్లుగా నా బాణాల వాడి నీకు చూపిస్తాను.' *ఏను సమసిన వెనుక నీ వేఱు దాcటు* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015:105 – [భాస్కర రామాయణం–అయోధ్యాకాండ–247వ పద్యం]) – 'నేను చనిపోయాకనే నీవు ఏరు దాటగలవు' అని పలికి రాముడిపై తన సఖ్యభక్తిని చాటుకున్నాడు గుహుడు.

## 2.9. ఆత్మ నివేదనం

భక్తికి పరాకాష్ట ఆత్మనివేదనం. నవవిధభక్తిమార్గాలన్నిటిలోనూ 'ఆత్మనివేదనం' అత్యంత ప్రధానమైనది. తనువును, మనస్సును, ఆత్మను పూర్తిగా సమర్పించటం, అంటే పరిపూర్ణ శరణాగతి చేయడమే ఆత్మనివేదన. మనోవాక్కాయ కర్మలలో 'నేను నీ వాడను' అన్న భావంతో ప్రవర్తించడమే శరణాగతి.

### 2.9.1. భాగవతం

#### 2.9.1.1. ఉత్తర

*అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ* (రఘునాథాచార్య, ఎస్. బి. 2012:19) – 'నాకు వేరే దిక్కు లేదు. నిన్నే శరణు వేడుతున్నాను, రక్షించ'మంటూ చేసే శరణాగతి ఆత్మనివేదనలోనిదే. ఇటువంటి ఆత్మ నివేదనాపూరితమైన భక్తి ఉత్తరలో కనపడుతుంది.

పాండవ కౌరవ యుద్ధం ముగిసింది. దుర్యోధనుడు తొడలు విరిగి నేలకూలి ఉన్నాడు. అలా పడి ఉన్న తన ప్రభువైన దుర్యోధనుడికి సంతోషం కలిగించాలనే ఉద్దేశంతో అశ్వత్థామ పాండవశిబిరానికి వెళ్ళి నిద్రపోతున్న వాళ్ళందరినీ దొరికిన వాళ్ళను దొరికినట్లుగా చంపేశాడు. అలా చనిపోయినవాళ్ళలో ఉపపాండవులు, ధృష్టద్యుమ్నుడు ఉన్నారు. తన పుత్రుల మరణానికి శోకిస్తున్న ద్రౌపదిని అనునయించి, అశ్వత్థామను చంపి ప్రతీకారం చేస్తానని అర్జునుడు బయలుదేరతాడు. తనను హతమార్చడానికి వెన్నంటి తరుముకొస్తున్న అర్జునుడిని చూసి, భయంతో అశ్వత్థామ *అపాండవ మగు గాక* అని మంత్రించి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. ఆ బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భంలో పెరుగుతున్న పాండవ వంశాంకురాన్ని చెణకడానికి వస్తుండగా ఉత్తర, జగదేకవీరులైన తన మామగార్లవద్దకు వెళ్ళకుండా శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తుంది.

*ఇదె కాలానల తుల్యమైన విశిఖం బేతెంచె దేవేశ! నే*
*దుదరాంతర్గత గర్భ దాహమునకై యుగ్రప్రభన్ వచ్చుచు*
*న్నది దుర్లోక్యము మానుపన్ శరణ మన్యం బేమియున్ లేదు నీ*
*పదపద్మంబులె కాని యొండెఱుఁగ నీ బాణాగ్ని వారింపవే!* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-1:108 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-178వ పద్యం])

'ప్రళయాగ్నిలా భయంకరమైన బాణమొకటి నా కడుపులో ఉన్న శిశువును చంపడానికి వస్తోంది. నాకు వేరే గతి లేదు. నీ పాదాలు తప్ప వేరొకటి నాకు తెలియదు. ఈ బాణాగ్నినుండి నీవే కాపాడాలి' అని శ్రీకృష్ణుడికి శరణాగతి చేసింది.

### 2.9.1.2. భీష్ముడు

భీష్ముడి నాయకత్వంలో కురుపాండవ యుద్ధం మొదలైంది. భీష్ముడు విజృంభించి పాండవ సేనలను అశేషంగా కూల్చాడు. తొమ్మిదవరోజున, అర్జునుడిని తన బాణాలతో తీవ్రంగా గాయపరచి, అతడు అలసిపోయి వివశుడై ఉండగా, మరింతగా చెలరేగి అర్జునుడిపై బాణాలను ప్రయోగిస్తున్నాడు భీష్ముడు. ఆ దృశ్యాన్ని చూసి పట్టలేని కోపంతో కృష్ణుడు ఒక్క ఉదుటున భీష్ముడిపైకి లంఘించాడు. ఆ దూకుడుకు భూమి కంపించిపోయింది. కులపర్వతాలు ఒరిగిపోయాయి. దిశాచక్రం చలించిపోయింది. కురుసైన్యాలు చెదిరిపోయాయి.

*కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ*
*నుఱికిన నోర్వక యుదరంబులో నున్న జగముల వ్రేఁగున జగతి గదలఁ*
*జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ బైనున్న పచ్చనిపటము జాఱ*
*నమ్మితి నాలావు నగుఁబాటు సేయక మన్నింపు మని క్రీడి మరలఁ దిగువఁ*
*గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి*
*నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు*
*విడువు మర్జున యనుచు మద్విశిఖ వృష్టిఁ*
*దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017.
సంపుటం-1:133 – [ఆంధ్రమహాభాగవతం-1వ స్కంధం-222వ పద్యం])

‘ఒక్కసారిగా భీష్ముడిపైకి ఎగిరి దూకగానే, కృష్ణుడి కుండలాల కాంతి ఆకాశాన్నంతటినీ కప్పేసింది. కృష్ణుడి దూకుడుకి, అతని కడుపులో ఉన్న భువనభాండాలన్నీ కదిలిపోయాయి. చక్రం పట్టుకుని వచ్చిన ఆ వేగానికి కృష్ణుడి పైనున్న ఉత్తరీయం జారిపోయింది. *నా సామర్థ్యం మీద నాకు నమ్మకం ఉంది. తాను చేయలేక కృష్ణుడితో చేయించాడని అందరూ నన్ను గేలిచేస్తారు. అలా నలుగురిలో నవ్వులపాలు చేయకు. వెనక్కి రా* అంటూ అర్జునుడు కృష్ణుడిని

బ్రతిమాలుకుంటున్నాడు. ఏనుగుపైకి దూకే సింహంలా యుద్ధానికి ఉపక్రమిస్తూ, *ఇవాళ భీష్ముని చంపుతాను. నిన్ను కాపాడతాను. నన్ను విడిచిపెట్టు అర్జునా* అంటూ భీష్ముడి బాణాలను తప్పించుకుంటూ అతడిమీదకు దూకాడు కృష్ణుడు.'

ఈ విధంగా కృష్ణుడు భీష్ముడిపైకి ఉరికేసరికి, భీష్ముడి పనయిపోయిందనుకుంటూ చుట్టూ ఉన్నవారు నిశ్చేష్టులై నిలబడిపోయారు. అటువంటి పరిస్థితిలో భీష్ముడు ఉప్పొంగిపోయిన హృదయంతో, కృష్ణుడిని, 'రావయ్యా! వేగమే వచ్చి, నన్ను సంహరించి, ఇహలోకంలో శాశ్వతమైన కీర్తిని, పరలోకంలో సద్గతులను ప్రసాదించు' అంటూ చేతులు మోడ్చి ఆహ్వానిస్తాడు. ఈ ఘట్టంలో భీష్ముడి ఆత్మసమర్పణ భావం ప్రస్ఫుటమవుతోంది.

### 2.9.1.3. గజేంద్రుడు

*నీవే తప్ప ఇతః పరంబెరుగన్* – 'నువ్వు కాక నాకు వేరే గతి లేదు' అన్న మానవుడి శరణాగతి గజేంద్రుడి రూపేణా వ్యక్తమయిన ఘట్టం గజేంద్ర మోక్షం. ఈ ఘట్టంలో మదగజాన్ని మనిషికి, సరోవరాన్ని-ప్రాపంచిక సుఖాలకు, మొసలిని-సంసార బంధాలకు సంకేతాలుగా మలిచారు పోతన. పలు పద్యాలలో ఈ విషయాన్ని అన్యాపదేశంగా వ్యక్తం చేశారు.

> *ఊహ గలంగి జీవనపుటోలమునం బడి పోరుచున్ మహా*
> *మోహలతా నిబద్ధపదమున్ విడిపించుకొనంగ లేక సం*
> *దేహముఁ బొందు దేహిక్రియ దీనదశన్ గజ ముండె భీషణ*
> *గ్రాహ దురంత దంత పరిఘట్టితపాదఖురాగ్రశల్యమై* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:33 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-67వ పద్యం])

'సంసారంలో మహామోహం అనే లతలచేత బంధింపబడి, విడిపించుకోలేక, సంశయానికి గురయ్యే జీవుడి పరిస్థితిలాగ ఆ గజేంద్రుని స్థితి ఉంది' అని వర్ణించారు పోతన.

*తమముం బాసిన రోహిణీవిభు క్రియన్ దర్పించి సంసారదుః*
*ఖము వీడ్కొన్న విరక్తచిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా*
*దము లల్లార్చి కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె సం*
*భ్రమదాశాకరిణీ కరోజ్ఝిత సుధాంభస్స్నాన విశ్రాంతుఁడై* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:53,54 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-115వ పద్యం])

'తుదకు ముక్తి పొందిన గజేంద్రుడు సంసార దుఃఖాలనుండి విముక్తి పొందిన విరాగిలా కనిపించా'డన్నారు పోతన. దాహానికై కొలనులో ప్రవేశించి, మొసలి బారిన పడి, పెక్కు సంవత్సరాలు దానితో పోరాడతాడు గజేంద్రుడు.

*ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై*
*యెవ్వని యందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం*
*బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైన వాఁ*
*డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:35 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-73వ పద్యం])

'ఈ జగత్తంతా ఎవరివల్ల పుడుతుందో, ఎవరిలోపల ఉంటుందో, ఎవరిలో లయిస్తుందో, ఈ సృష్టంతటికీ మూలకారణమైనవాడెవడో, ఆది, మధ్యం, అంతం అంటూ లేనివాడెవడో, అన్నీ తానే అయిన వాడెవడో, పుట్టుకే లేనివాడెవడో ఆ ఈశ్వరుడిని నేను శరణు వేడుతున్నాను' అంటూ మొసలిని జయించలేక భగవంతుడికి శరణాగతి చేస్తాడు గజేంద్రుడు.

స్వీయ అల్పత్వ ప్రకటనకూడా శరణాగతిలో భాగమే. దీనినే కార్పణ్యం అంటారు. కార్పణ్యంలో భక్తుడు తన అల్పత్వాన్ని, భగవంతుడి గరిమను, అపారమైన కరుణని సంస్మరిస్తాడు. ఈ పద్యంలో గజరాజు తన స్వశక్తితో పోరాడిపోరాడి చివరకు మొసలిని జయించేందుకు తన శక్తి చాలదని గ్రహించి, తన దీనతను చాటుకున్నాడు.

*లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్*
*ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్*
*నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్*
*రావే! యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–5:43 – [ఆంధ్రమహాభాగవతం–8వ స్కంధం–90వ పద్యం])

'ఒంట్లో సత్తువ అస్సలు లేదు. ధైర్యం క్షీణించిపోయింది. ప్రాణాలు ఉన్నచోట నిలవనంటున్నాయి. స్పృహ తప్పేటట్టుగా ఉంది. శరీరం పూర్తిగా ఆలసిపోయింది. నువ్వు తప్ప వేరే గతిలేని దీనుడిని. నన్ను కాపాడాల్సింది నువ్వే. ఈశ్వరా రా! వచ్చి రక్షించు.' ఇలా ఈ పద్యంలో గజేంద్రుడు తన నిస్సహాయతను ప్రకటించి, తనకు భగవంతుడు తప్ప వేరే దిక్కు లేదని, తన భారం ఆయనదేనని సంపూర్ణ శరణాగతి చేశాడు. తద్వారా స్వామి కటాక్షానికి ప్రాప్తుడయ్యాడు. సారూప్య మోక్షాన్ని పొందాడు.

### 2.9.1.4. బలి

ఆత్మనివేదన రూపమైన భక్తికి బలిచక్రవర్తి లక్ష్యాయుడు. ఇంద్రాది దేవతలను ఓడించి త్రిలోకాధిపత్యం చేస్తున్న బలిచక్రవర్తిని అణిచి, ఇంద్రుడికి తిరిగి స్వర్గాధిపత్యం ఇప్పించడానికి అదితి, కశ్యపులకు వామనుడై జన్మిస్తాడు శ్రీమహావిష్ణువు. బలిచక్రవర్తి అశ్వమేధ యజ్ఞం

చేస్తున్న యజ్ఞవాటికకు దానం పట్టడానికి వెళతాడు. మూడు అడుగుల నేలను మాత్రం దానమిమ్మని కోరతాడు.

*కులమున్ రాజ్యముఁదేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం*
*డలఁతింబోఁడు; త్రివిక్రమస్ఫురణవాఁడై నిండు బ్రహ్మాండమున్*
*గలఁడే మాన్ప నొకండు? నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్*
*వలదీ దానము గీనముం బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–5:247 – [ఆంధ్రమహాభాగవతం–8వ స్కంధం–586వ పద్యం])

'వచ్చినవాడు శ్రీమహావిష్ణువు. నువ్విచ్చిన దానం కొంచెంతో పోయేది కాదు. త్రివిక్రముడై ఈ బ్రహ్మాండాన్నంతా ఆక్రమిస్తాడు. నీ కులాన్ని, రాజ్యాన్ని, నిన్ను నిలుపుకో. దానాన్ని మానుకో' అంటూ గురువు శుక్రాచార్యుడు బలిని హెచ్చరిస్తాడు.

*ఉడుగని క్రతువుల వ్రతముల బొడగనఁజననట్టి పొడవు పొడవునఁగుఱుచై*
*యడిగెడినఁట ననుబోఁటికి నిడరాదె మహానుభావ! యిష్టార్థంబుల్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–5:249 – [ఆంధ్రమహాభాగవతం–8వ స్కంధం–591వ పద్యం])

'ఎడతెగకుండా వ్రతాలు, యజ్ఞాలు చేసినా దుర్లభమైనట్టి వాడు తనంతట తానుగా వచ్చి నన్ను అర్థిస్తే, అది ఎటువంటి దానమైనా ఇవ్వడం కంటే కావలసిందేముంది? శ్రీమహావిష్ణువంతటి వాడి చేయి కిందై ఉండి, నా చేయి మీదవటం కంటే అదృష్టమేముంది? ఈ రాజ్యం కాని, శరీరం కాని శాశ్వతాలా?' అంటూ *నీ తృతీయపదము నిజము నా శిరమున నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–5:269 – [ఆంధ్రమహాభాగవతం–

8వ స్కంధం–643వ పద్యం]) – 'నీ మూడో అడుగు నా తలపై పెట్టు' అని పలికి శ్రీహరి పాదాన్ని తన తలపై మోపించుకుని ఆత్మనివేదన చేసిన భక్తాగ్రగణ్యుడు బలి.

### 2.9.1.5. గోపకులు

ఆత్మనివేదన భక్తికి, సంపూర్ణ శరణాగతికి గోపబాలురు ప్రబలమైన ఉదాహరణగా నిలుస్తారు. కృష్ణుడు తప్ప గోపబాలలు అన్యమెరుగరు. వారి ప్రపంచమంతా కృష్ణుని చుట్టే తిరుగుతుంది. కష్టం వస్తే కృష్ణుడు; ఏదైనా కోరిక కలిగితే కృష్ణుడు; మాటిమాటికి కృష్ణా! కృష్ణా! అంటూ తమ జీవితాలను కృష్ణుడితో ముడిపెట్టుకున్నారు.

*ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయుం*
*గన్నులఁ గాన రట్టి హరిఁ గౌఁగిఁటఁ జేర్చుచుఁ జెట్టఁ బట్టుచుం*
*దన్నుచు గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైఁపడి కూడి యాడుచున్*
*మన్నన జేయు వల్లవకుమారుల భాగ్యము లింత యొప్పునే?* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–6:169,170 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–పూర్వ భాగము–461వ పద్యం])

'యోగిపుంగవులు సైతం ఏ పరమాత్మ పాదరేణువుల్ని సైతం స్పర్శించలేరో అట్టి పరమాత్మని నిరంతరం కౌగిలించుకుంటూ, చేతులు పట్టుకు నడుస్తూ, తంతూ, గుద్దుతూ, కలిసి పరాచికాలాడుతూ, మీదపడుతూ, కలిసి ఆడుకున్నట్టి ధన్యులు గోపబాలకులు' అంటూ పరవశించిపోతారు శుకమహర్షి.

అఘాసురుడనే భయంకరమైన రాక్షసుడు కొండచిలువ రూపంలో దారికి అడ్డంగా పడుకుని ఉంటే, 'కృష్ణుడుండగా మనకు భయం దేనికి, అంతగా అది మన జోలికి వచ్చిందంటే దాన్ని కృష్ణుడే బకాసురుడి వెంట పంపుతాడు' అని ముందుకెళతారు.

*అలసినచోఁ గొంద ఱతిమోదమున వీపు లెక్కించుకొని పోదు రేపు మెఱసి*

*సొలసి నిద్రించినచోఁ నూరుతల్పంబు లిడుదురు కొందఱు హితవు గలిగి*

*చెమరించి యున్నచోఁ జిగురుటాకులఁ గొంద ఱొయ్యన విసరుదు రుత్సహించి*

*దవ్వేగి నిలుచుచోఁ దడయకఁ గొందఱు పదము లొత్తుదు రతిబాంధవమున*

*గోపవరులు మఱియుఁ గొందఱు ప్రియమున*

*మాధవునకుఁ బెక్కుమార్గములను*

*బనులు చేసిరెల్ల భవములఁ జేసిన*

*పాపసంచయములు భస్మములుగ* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–6:231 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–పూర్వ భాగము–609వ పద్యం])

'కృష్ణుడికి అలుపు కలిగితే కొందరు గోపబాలకులు చాలా సంతోషంతో తమ వీపు మీద ఎక్కించుకుని తీసుకుని వెళతారు. కృష్ణుడు అలసి సొలసి నిద్రపోతే తమ ఒడిలోనే ఎంతో ఇష్టంగా పడుకోపెట్టుకుంటారు. కృష్ణుడికి చెమటలు పోస్తే చిగురుటాకులతో గాలి తగిలేలా వీస్తారు. కొంత దూరం నడచి దస్సిపోతే కాళ్ళు నొప్పిపుట్టాయేమోనని పాదాలు వత్తుతారు. ఇంకొందరు ప్రేమతో ఎన్నో విధాలైన సేవలు చేస్తారు. ఆ సేవలతో పూర్వజన్మలలో వారు చేసిన పాపాలన్నీ పటాపంచలు చేసుకున్నారు.' గోపకులకు కృష్ణుడుతోడిదే లోకమంతా. వారు అమాయకభక్తితో సర్వం విష్ణుమయం చేసుకున్నారు.

కృష్ణుడు కాళింది మడుగులో దూకి, కాళియుడి కాటుకు గురై చేష్టలుడిగినవాడిలా ఉన్న సమయంలో తమ ధన, మాన, ప్రాణాలన్నీ అతడికే సమర్పించినవారు కనుక దుఃఖంతో సోలిపోయారు. అడవిలో దావాగ్ని చుట్టుకొస్తే,

*అదె వచ్చెన్ దవవహ్ని ధూమకణకీలాభీలదుర్వారమై*

*యిదె కప్పెన్ మము నెల్లవారి నిట మీఁదేలాగు రక్షింపు నీ*

*పదపద్మంబులకాని యొండెఱుఁగ; మో పద్మాక్ష! యో కృష్ణ! ప్రమొ*

*క్కెద మో! రామ! మహాపరాక్రమ! దవాగ్నిన్ వేగ వారింపవే* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:276 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-713వ పద్యం])

'నీ పాదాలే తప్ప వేరే గతి మాకు లేదు. త్వరగా ఈ దావాగ్నినుండి మమ్మల్ని కాపాడు', అంటూ ప్రార్థించారు.

నీ చుట్టాలకు నాపదల్ గలుగునే? నే మెల్ల నీ వార మ

న్యాచారంబు లెఱుంగ; మీశుడవు; మా కాభీలదావాగ్ని నే

డే చందంబున నింక దాఁటుదుము? మమ్మీక్షించి రక్షింప వ

న్నా! చంద్రాభ! విపన్నులన్ శిఖివితానచ్ఛన్నులన్ ఖిన్నులన్ (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:290 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-745వ పద్యం])

'నీ ఆప్తులకు ఆపదలు కలుగుతాయా? మేమంతా నీ వారం. నీవు తప్ప అన్యమెరుగని వారం. నీవే మా పాలి దేవుడవు. ఈ భయంకరమైన దావాగ్ని నుండి మమ్ము నీవే రక్షించు' అని కార్చిచ్చు చుట్టుముట్టినప్పుడు సంపూర్ణ శరణాగతి చేశారు. ఈ విధంగా తమ ధన మాన ప్రాణాలను కృష్ణుడికే అర్పించిన గోపబాలలది అచ్చమైన ఆత్మనివేదన భక్తి.

### 2.9.2. మొల్ల రామాయణం

శరణాగతి ఆత్మనివేదన భక్తిలోని భాగమని ఈ అధ్యాయం మొదట్లో చర్చించాను. ఇటువంటి ఆత్మనివేదన భక్తి విభీషణుడిలో కనపడుతుంది.

*భానుకులోత్తంస! వందితామరలోక! జానకీనాయక! శరణు! శరణు!*

*తాటకాప్రాణవిదారణ! రఘురామ! సకలలోకాధార! శరణు! శరణు!*

*దిక్కునీవని వచ్చితిని దీనమందార! పరమపూరుష! రామ! శరణు! శరణు!*

*మాతృపిత్రాదులమాడ్కి సంరక్షించు సర్వలోకస్తుత్య! శరణు! శరణు!*

*రాను వెఱచినాఁడ రక్షించు రక్షించు*

*మిపుడు నాకు నభయ మిమ్ము ఇమ్ము*

*చూడు చూడు నన్నుఁ జొచ్చితి శరణమ్ము*

*కావు కావు నన్నుఁ గరుణ తోడ* (లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008:103 – [మొల్ల రామాయణం–యుద్ధకాండ–ప్రథమాశ్వాసం–31వ పద్యం])

'సూర్యవంశపుంగవా! నీవే దిక్కని నీ వద్దకు వచ్చాను. తల్లిదండ్రులు తమ బిడ్డను కాపాడినట్లుగా నీవే నన్ను కాపాడాలి. నీ దగ్గరగా రావాలంటే చుట్టూ ఉన్న వానరకోటిని చూసి భయం కలుగుతోంది. శరణాగతుడనైన నాకు అభయం ఇచ్చి, నన్ను దయతో కాపాడు' అని వేడుకున్నాడు విభీషణుడు. తన అన్న రావణుని తిరస్కారానికి గురయి, రాముడివద్దకు వచ్చిన విభీషణుడు 'నేను నీ దగ్గరకు వచ్చి, నీకు సాయపడతాను. నన్ను లంకకు రాజును చెయ్యి' అని అడగలేదు. షరతులు లేని శరణాగతి చేశాడు. అందుకే రామచంద్రుడు విభీషణుడిని ఆప్యాయంగా ఆదరించి తన తమ్ముళ్ళలో ఒకడిగా చూసుకున్నాడు.

### 2.9.3. భాస్కర రామాయణం

మాయజింక వేషంలో రాముని యెదుట పడితే తనకు మృత్యువు తప్పదని మారీచుడికి తెలుసు. లోకరక్షణకోసం, కైకేయి వరం నెపంగా రాక్షసవధ చేయటానికి అరణ్యానికి వచ్చినవాడని తెలిసుండికూడా, *అమ్మారీచుండు దనమనంబున నిన్నీచు చేతం జచ్చుటకంటె రఘురామునిచేతఁ జచ్చినం బరమగతి గలదు* (భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు.

2015:158 – [భాస్కర రామాయణం–ఆరణ్యకాండ–ద్వితీయాశ్వాసం–23వ వచనం]) – 'రావణుడి చేతిలో చావడంకంటే రఘురాముడి చేతిలో చస్తే మోక్షం సిద్ధిస్తుం'దన్న ఎరుకతో తనను తాను సమర్పించుకున్న మారీచుడు ఆత్మనివేదనభక్తికి ఉదాహరణ.

ఈ విధంగా ఈ అధ్యాయంలో భాగవతంలో ప్రదర్శింపబడిన నవవిధ భక్తిమార్గాలను కూలంకషంగా చర్చించడమే కాకుండా, మొల్ల, భాస్కర రామాయణాల్లో ప్రదర్శింపబడిన నవవిధ భక్తి మార్గాల ఉదాహరణలనుకూడా ఇచ్చాను. ఈ అవగాహనతో మూడవ అధ్యాయంలో అన్నమయ్య తన కీర్తనల్లో ప్రదర్శించిన నవవిధ భక్తిమార్గాలను విశ్లేషించాను.

*****

# అధ్యాయం—3

# అన్నమయ్య సంకీర్తనలలో

# నవవిధ భక్తి మార్గాలు

# అధ్యాయం-3

# అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తి మార్గాలు

## 3.0. పరిచయం

రెండవ అధ్యాయంలో నవవిధ భక్తిమార్గాలను చర్చించి, *పోతన భాగవతం*, *భాస్కర రామాయణం*, *మొల్ల రామాయణాల్లోని* నవవిధ భక్తిమార్గాలను పరిశీలించాను. అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రదర్శించిన నవవిధ భక్తి మార్గాలను విపులీకరించడం ఈ అధ్యాయం ప్రధానోద్దేశం. అన్నమయ్య భక్తికి విశిష్టాద్వైత తత్త్వమే నేపథ్యమని మొదటి అధ్యాయంలో గమనించాం. కనుక, అన్నమయ్య భక్తిని విశిష్టాద్వైతమనే తాత్త్విక నేపథ్యంలోనే పరిశీలించే ప్రయత్నం ఈ పరిశోధనలో కొనసాగించబడుతోంది. అన్నమయ్యపై ఆళ్వారాచార్యుల ప్రభావాన్ని పరిశీలించడంకూడా ఈ అధ్యాయంలో జరుగుతోంది.

అన్నమయ్య సంకీర్తనలు భాగవత, రామాయణాల్లా కథా సంబంధమైనవి కాదు. కనుక, ఏదైనా భక్తి మార్గాన్ని పాటించడంవల్ల కలిగే ఫలితాలను ఉగ్గడించినా/ప్రాశస్త్యాన్ని వివరించినా (ఫలితం), లేక ఆ భక్తి మార్గాన్ని పాటించమని ఉపదేశించినా (ప్రవచనం), లేదా ఆ భక్తి మార్గాన్ని అన్నమయ్య స్వయంగా కీర్తనలో ప్రదర్శించినా (ప్రదర్శనం) ఆ కీర్తనను ఆ భక్తి మార్గానికి సంబంధించినదిగా పరిగణించాను. ఒక్కో భక్తి మార్గానికి సంబంధించిన కొన్ని కీర్తనలను చర్చించి, మొదటి ఆరు సంపుటాలలో ఉన్న ఆయా భక్తి మార్గాలకు చెందిన కీర్తనలను అధ్యాయం చివరన అనుబంధం–1 గా ఇచ్చాను. ఒకటికి మించిన భక్తిమార్గాలను పట్టిచూపదగిన సంకీర్తనలను కూడా అనుబంధం–2 గా ఈ అధ్యాయం చివరన కూర్చాను. ఈ అధ్యాయంలో అన్నమయ్య నవవిధభక్తిమార్గాలనుగురించి వివరించేటప్పుడు, చర్చిస్తున్న భక్తి మార్గం సంకీర్తనలో కొద్దిభాగంలో (కొన్ని పాదాలలో) వ్యక్తం అవుతుందనిపించినపుడు ఆ

భాగాన్ని మాత్రమే యథాతథంగా ఇచ్చాను. అర్థావగాహనకు ఆటంకం కలుగుతుందని భావించినపుడు సంకీర్తనను పూర్తిగా ఇవ్వవలసివచ్చింది.

*గురువు నొక్కఁడే మంత్ర మొక్కటే కొలువు నొక్కటేపో*

*అరయ భక్తియ వేరు వేరై యలరుచున్న దిదే* (4-115)

అని అన్నమయ్య పేర్కొన్నట్లు గమ్యమొక్కటే అయినా, వేరు వేరు రూపాల్లో అలరారుతున్న భక్తి మార్గాలను అన్నమయ్య కీర్తనల్లో అధ్యయనం చేసే ప్రయత్నం చేశాను.

భక్తుడు భగవంతుడిని చేరే క్రమంలో పాటించే నవవిధభక్తిమార్గాలలో ఒక పరిణామక్రమం, పరిపక్వత కనపడతాయి. అయినా ఏ ఒక్క భక్తి మార్గాన్ని అయినా నిష్ఠతో అనుసరిస్తే, అదే అనంత ఫలదాయకంగా, మోక్షదంగా పనిచేయడంకూడా ఈ కీర్తనలు చేసే బోధగా గమనించవచ్చు.

## 3.1. శ్రవణ భక్తి

అన్నమయ్య శ్రవణ మహాత్మ్యాన్ని ఉగ్గడించిన, శ్రవణ భక్తిని ప్రవచించిన, తాను స్వయంగా శ్రవణ భక్తిని ప్రదర్శించిన కీర్తనలన్నీ ఈ విభాగంలో చేరతాయి.

### 3.1.1. ఫలితం

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రవణభక్తి ఎటువంటి ఫలితాన్ని ఇస్తుందో చెబుతారు.

*మొదలనే యెచ్చరికెతో మోసపోక యేపొద్దూ*

*వెదకి హరికథలే వినుచుండవలయు*

*వెలఁదుల సుద్దులు వీనులను వింటేను*

*పెలుచుఁజూపులఁ జూడఁ బ్రేమ వుట్టించు*

*మలసి యాచూపులు మనసునఁ దగిలించు*

*తలఁపు మాటలాడఁ దమిరేఁచును*

*మగువలతోడుత మాటలాడ దొరకొంటే*

*నగినగి సంసారాలనంటు గల్పించు*

*తగిలిన నవ్వులు తనువులు సోఁకింపించు*

*మిగులాఁ దనుసోకులే మించి వలపించును*

*సతులతో మోహము సంపదలు పోరించు*

*అతిసంపదలు దేహి నజ్ఞానిఁ జేయు*

*తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడే*

*గతియని కొలిచితే ఘనునిఁగా జేయును* (2–267)

'స్త్రీల ముచ్చటైన కబుర్లు వింటూ వారిని చూస్తూ ఉంటే ప్రేమ పుడుతుంది; ఆ చూపులు మనసుకు గాలాలు వేస్తాయి; మనసులో మాట్లాడాలనే తలపు కలుగుతుంది; ఆ సరసపు మాటలవలన సంసారంపై వ్యామోహం కలుగుతుంది; స్త్రీ సౌందర్యంపై మనసు వెళుతుంది; స్త్రీలపై మోహం సంపదలకోసం పాకులాడేలా చేస్తుంది. ఎందుకంటే స్త్రీని సంతోషపెట్టడానికి సంపదలను సంపాదించవలసి వస్తుంది. ఆ యాతనలో జ్ఞాన సంపాదన మరుగున పడుతుంది. తద్వారా జీవుడు అజ్ఞాని అవుతాడు. అటువంటి ప్రమాదాలు జరగకుండా మొదటే మెలకువతో మెలగి, ఎల్లవేళలా ఎక్కడెక్కడ హరికథలు చెబుతున్నారో తెలుసుకుని, అక్కడక్కడికి పోయి హరికథలు వింటూ ఉండాలని, అలా హరియే గతి అని కొలిచినవాడు ఘనుడవుతా'డని అన్నమయ్య శ్రవణ భక్తి ఫలితాన్ని కీర్తించారు. *వెలదుల సుద్దులు* అని అన్నమయ్య అన్నారు కాని స్థూలంగా, ఇంద్రియాలకు మోహం కలిగించే విషయాలేవైనా అని దీనిని అర్థం చేసుకోవాలి.

*రంపపు వేంకటరమణునికథ విన*

*నింపగు వానికి నిదే ధనము* (1-42)

'వేంకటరమణుని కథలను వినడంలో ఆనందం అనుభవించేవారికి అదే పెద్ద ధనం' అని మరో కీర్తనలో పేర్కొన్నారు అన్నమయ్య.

### 3.1.2. ప్రవచనం

తిరుమళిశై ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారు, కులశేఖరాళ్వారు తదితరులు చూపిన త్రోవలోనే అన్నమయ్య శ్రవణ భక్తిని ప్రవచించారు. తిరుమళిశై ఆళ్వారు *తిరుచ్ఛందవిరుత్తమ్* లో, ఈ విధంగా శ్రవణ భక్తిని ఉగ్గడించారు.

*శంద మండలత్తి నూడు నెంఢ్రు వీడు వెట్రుమేల్*

*కండు వీడిలాద కాదల్ ఇన్బనాళు మెయదువీర్*

*పుండరీకపాదపుణ్యకీర్తి నుం చెవి మడుత్తు*

*ఉండునుమ్ మురువినైత్తుయరుళ్ నీంగియుమ్ మినో* (మునిరత్నం, జె. 1996:245 – [తిరుచ్ఛందవిరుత్తం-67వ పాశురం])

'సూర్య మండల మధ్య మార్గంలో వెళ్ళి, మోక్షాన్ని పొంది, ఎన్నటికీ నశించని భక్తి ఫలితమైన కైంకర్యానందాన్ని నిత్యం పొందదలిస్తే, పుండరీకపాదుని పుణ్యకీర్తిని మీ చెవులార గ్రోలి, మీ ఘోర పాపాలవలన పుట్టిన దుఃఖంనుండి విముక్తులై చక్కగా జీవించండి.'

*వినరో భాగ్యము విష్ణుకథ*

*వెను బలమిదివో విష్ణుకథ*

*ఆదినుండి సంధ్యాది విధులలో*

*వేదంబయినది విష్ణుకథ*

*నాదించీనిదె నారదాదులచే*

*వీదివీధులనే విష్ణుకథ*

*వదలక వేద వ్యాసులు నుడిగిన*

*విదిత పావనము విష్ణుకథ*

*సదనంబైనది సంకీర్తనయై*

*వెదకిన చోటనే విష్ణుకథ*

*గొల్లెతలు చల్ల గొనకొని చిలుకఁగ*

*వెల్లవిరియాయ విష్ణుకథ*

*యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము*

*వెల్లిగొలిపె నీ విష్ణుకథ (3-355)*

అంటూ 'విష్ణు కథను వెనుబల'మన్నారు అన్నమయ్య. వెన్నుపూస బలంగా ఉంటేనే మనిషి నిటారుగా నిలుచోగలుగుతాడు. అలాగే విష్ణుకథాశ్రవణం అనేది మోక్షగామి అయిన మనిషిని కుంగిపోనీయకుండా సరైన దారిలో నడిపే సామర్థ్యం కలిగినది. '*పుండరీకాక్ష* అంటూ శుద్ధి చేస్తూ, *ఓం కేశవాయ స్వాహ* అంటూ ఆచమనంతో సంధ్యావందనం ప్రారంభిస్తారు. అలా సంధ్యావందన మంత్రాలలో విష్ణునామం ప్రాముఖ్యతను సంతరించుకుంది. త్రిలోకసంచారులయిన నారదాది మహర్షుల నోటి వెంట నిరంతరం వాడవాడలా వినపడ్డవి విష్ణుమహత్యానికి సంబంధించిన కథలే! విశేషంగా పురాణాలను చెప్పినా, అనంతమైన వేదరాశిని క్రమబద్ధీకరించినా, పంచమవేదమైన మహాభారతాన్ని రచించినా వదలని వేదవ్యాసుని మనోక్లేశాన్ని తగ్గించినది భాగవత రూపంలో ఉన్న విష్ణుకథ. మహాభాగవతం రచించాకనే, ఆయన జీవితం పరిపూర్ణమైంది.' అటువంటి విష్ణు కథలను వినడానికి ఏ పురాణప్రవచకుడి దగ్గరకో వెళ్ళక్కరలేదంటున్నారు అన్నమయ్య. 'ఎక్కడుంటే అక్కడే, సంకీర్తనే

ఇల్లుగా అందులో వసించి ఉంటుంది విష్ణుకథ. అంటే సంకీర్తనల రూపంలో విష్ణుకథ ఎక్కడ పడితే అక్కడే దొరుకుతోంది. అంతే కాదు, గొల్ల పడుచులు తమ ఇళ్ళలో వెన్న చిలుకుతూ ఉన్నప్పుడు వారి కబుర్లలో చిన్ని కృష్ణుడి అల్లరి పనులను, లీలలను ముచ్చటించుకుంటుంటారు. ఈ విధంగా అంతటా విస్తరించిన విష్ణుకథలను విని తరించ'మని శ్రవణభక్తిని ప్రవచించారు అన్నమయ్య.

### 3.1.3. ప్రదర్శనం

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడికి నేరుగా చేస్తున్న నివేదనగా ఈ కింది కీర్తనను రూపొందించాడు.

*నీ కథామృతము నిరత సేవన నాకు*
*చేకొనుట సకలసంసేవనం బటుగాన*

*ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు–*
*నిదియె వేదసంహితపాఠము*
*యిదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు–*
*నిదియె సంధ్య నాకిదియ జప మటుగాన*

*యిదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు–*
*నిదియె దుఃఖవిరహితమార్గము*
*యిదియె భవరోగహితభేషజము నాకు–*
*నిదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన*

*యిదియె దానఫల మీఁజాలినది నాకు*
*యిదియే తలఁపఁ బరహితకర్మము*

*యిదియె తిరువేంకటేశ నీసంస్మరణ-*

*మిదియె యిదియె ఇన్నియును నటుగాన* (1-54)

'శ్రీహరి కథామృతాన్ని నిరంతరం సేవించడమెందుకంటే అదే గొప్ప ఉపాసన. మంత్రం పఠించడం, వేదం చదవడం, శాస్త్రాధ్యయనం చేయడం, సంధ్య వార్చడం.. ఇలా అన్నీ హరికథామృత సేవనంలోనే దొరుకుతాయి. హరికథాశ్రవణమే బ్రహ్మోపదేశంకూడా' అంటూ 'శ్రీహరికథలు వింటూ అతడిని స్మరించడంలోనే తనకు సర్వధర్మాచరణం పూర్తవుతుం'దని ముగించారు అన్నమయ్య.

## 3.2. కీర్తన భక్తి

*నాహం వసామి వైకుంఠే యోగినాం హృదయే న చ।*

*మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద॥* (స్వామి హర్షానంద. 2014:244)

'నారదా! నేను వైకుంఠంలో వశించను. యోగుల హృదయాలలో ఉండను. ఎక్కడ నా భక్తులు నాగూర్చి భజనలు చేస్తుంటారో అక్కడ వసిస్తాను' అని శ్రీమహావిష్ణువే *పద్మపురాణం*లో నారదుడికి స్వయంగా ఉపదేశించినట్లుగా చెబుతారు.

శ్రీమహావిష్ణువు కీర్తనప్రియుడు. *నారద భక్తి సూత్రాలు* కూడా ఇదే విషయాన్ని తెలియచేస్తాయి.

*సంకీర్త్యమానః శీఘ్రమేవావిర్భవతి*

*అనుభావయతి చ భక్తాన్* (వేంకటేశ్వర శాస్త్రి, జంధ్యాల. 1985:177 – [నారద భక్తి సూత్రాలు-80వ సూత్రం])

'కీర్తనీయుడు, స్తవనీయుడు అయిన ఈశ్వరుడు సంకీర్తనకు సంతోషించి సత్వరం సాక్షాత్కరిస్తాడు. భక్తులకు భవ్యమైన దివ్యానుభవం ప్రసాదిస్తాడు.' తదనుగుణంగానే ఏ ఇతర

దైవానికి లేనన్ని స్తుతులు శ్రీమహావిష్ణువుకే వెలిసాయి. ఎందరో భక్తులు పద్యాల ద్వారా, శ్లోకాల ద్వారా, కావ్యాల ద్వారా హరికీర్తన చేశారు.

*దాఁచుకో నీపాదాలకుఁ దగ నేఁ జేసిన పూజలివి*
*పూఁచి నీ కీరితిరూపపుష్పము లివియయ్యా*

*వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ*
*తక్కినవి భండారాన దాఁచివుండనీ*
*వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము*
*దిక్కై నన్నేలితివిఁక నవి తీరని నా ధనమయ్యా* (2–338)

అన్నమయ్యకూడా తన కీర్తనలనే పుష్పాలతో స్వామివారికి పూజ చేసినట్టుగా చెప్పుకున్నారు. తాను చేసిన ఒక్క సంకీర్తనే తనను రక్షించడానికి చాలనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తక్కినవాటితో స్వామే తనకు ఋణపడ్డాడని సూచిస్తున్నారు. అంటే సంకీర్తనం అంతటి గొప్ప మహిమ కలది.

*చాలదా బ్రహ్మమిది సంకీర్తనం* అంటూ ‘సామవేదాన్ని మించిన మహిమగల సంకీర్తనం’ గురించి పాడాడు.

*సంతోషకరమైన సంకీర్తనం*
*సంతాపమణఁగించు సంకీర్తనం*
*జంతువుల రక్షించు సంకీర్తనం*
*సంతతముఁ దలచుఁడీ సంకీర్తనం* (1–343)

‘సంతోషం కలిగించేది, సంతాపం తగ్గించేది, ప్రాణులను రక్షించేది సంకీర్తనం కనుక నిరంతరం హరికీర్తన చేయ’మంటారు అన్నమయ్య. వేదశాస్త్రాలను, ఎన్నో చదువులను చదవక్కరలేదంటూ హరిసంకీర్తన ఫలితాన్నిగురించి అన్నమయ్య ఈ కీర్తనలో ప్రస్తావించారు.

*చాలదా హరిసంకీర్తనం గల–*
*మే లిది దీననే మెరసిరి ఘనులు*

*తలఁప వేదశాస్త్రములు గానక*
*అలరుచు వాల్మీకాదులు*
*తలకొని హరిమంత్రమే దగఁ బేర్కొని*
*అలవిమీరఁ గడు నధికములైరి*

*యితరదైవముల నెఱఁగనేరక*
*ప్రతిలేనిమహిమఁ బార్వతి*
*మతిఁ దలఁపుచు హరిమంత్రమె పేర్కొని*
*సతతము హరులో సగమై నిలిచె*

*చదువులుఁ బలుమరుఁ జదువనోపక*
*అదివో నారదాదులు*
*పదిలపువేంకటపతిహరినామమే*
*వదల కిదియ జీవనమై మనిరి* (1–205)

‘వాల్మీకి మహర్షి పూర్వాశ్రమంలో కిరాతుడనే కథ ప్రచారంలో ఉంది. కనుక వేదశాస్త్రాలను చదివే అవకాశం లేనివాడయినా హరి మంత్రాన్నే, జపించి మహర్షిగా తన సమకాలీనులచేత, తన తరువాతివారిచేత కీర్తింపబడ్డాడు. పార్వతీదేవికూడా హరినామమహిమవలనే హరునిలో

సగభాగమైందని అన్నమయ్య ఊహించారు. అలాగే, నారదమహర్షికూడా దాసీపుత్రుడిగా జన్మించి, చదువులేవీ చదవకపోయినా, హరినామజపాన్ని తన జీవితంగా చేసుకున్నాడు.' ఇక్కడ వాల్మీకి, పార్వతీదేవి చేసింది రామనామజపమే అయినా అన్నమయ్య హరి అవతారాల మధ్య అభేదాన్ని పాటించారన్న విషయం గమనార్హం.

అన్నమయ్య కీర్తనలు చాలావరకూ స్తుతిపరమైనవే. అన్నమయ్య రకరకాల రీతులలో స్వామి వారిని కొలుచుకున్నారు. అన్నమయ్య కీర్తన భక్తిని ఈ విధంగా విభజించవచ్చు. 1. నామ కీర్తన 2. లీలా కీర్తన 3. గుణ కీర్తన 4. రూప కీర్తన 5. మహత్వ కీర్తన 6. ప్రతాప కీర్తన 7. అవతార కీర్తన 8. దశావతార కీర్తన 9. వ్యాజ స్తుతి

### 3.2.1. నామ కీర్తన

భగవంతుడి కీర్తనలో నామకీర్తన చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. నామకీర్తన మహిమను రూపగోస్వామి ఇలా చెప్పారు.

*కృష్ణేతి మంగలం నామ యస్య వాచి ప్రవర్తతే ।*
*భస్మీభవన్తి రాజేన్ద్ర మహాపాతకకోటయః ॥* (వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985:60 – [భక్తిరసామృత సింధువు–పూర్వవిభాగం–ద్వితీయలహరి–146వ శ్లోకం])

'కృష్ణ అనే మంగళమయమైన భగవన్నామం ఎవరి నాలుకపై వస్తుందో వారి కోట్ల కొలది మహాపాతకాలుకూడా భస్మీభూతమవుతాయి.'

అన్నమయ్య నామకీర్తన మహత్యాన్ని ఇలా చెప్పారు.

*ఇచ్చలోఁ గోరేవల్లా ఇచ్చే ధనము*
*అచ్చుతనామమె పో అధికపు ధనము*

*నారదాదులు వొగడే నాలుకపయి ధనము*
*సారపు వేదములలో చాటే ధనము*
*కూరిమి మునులు దాఁచుకొన్నట్టి ధనము*
*నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము*

*పరమపదవికి సంబళ మైన ధనము*
*యిరవై భక్తులకెల్లా నింటి ధనము*
*పరగ నంతరంగాన పాఁతినట్టి ధనము*
*హరినామ మిదియ పో అరచేతి ధనము*

*పొంచి శివుఁడు కాశిలో బోధించే ధనము*
*ముంచిన ఆచార్యుల మూలధనము*
*పంచి శ్రీవేంకటపతి పాలించే ధనము*
*నించి విష్ణునామ మదే నిత్యమైన ధనము* (3-27)

ఈ కీర్తనలో 'విష్ణునామాన్ని కోరిన కోరికలను తీర్చే ధనంగా, నాలుకపై ఉండే ధనంగా, వేదాలు చాటే ధనంగా, సర్వసంగ పరిత్యాగులైన మునులు దాచుకొనే ధనంగా, పరమపదవి చేరుకోవడానికి కావాలసిన దారిబత్తెంగా, అంతరంగంలో పాతిపెట్టిన ధనంగా, అరచేతిలో సిద్ధంగా ఉన్న ధనంగా, శివుడు కాశిలో బోధించే ధనంగా, ఆచార్యుల మూలధనంగా' అభివర్ణించారు. ఇలా నామమహత్యాన్ని ఉగ్గడిస్తూ పురుషోత్తముని అనేక నామాలను స్మరించుకున్నారు అన్నమయ్య.

*నీ నామమే మాకు నిధియు నిధానము*
*నీ నామమె యాత్మనిధానాంజనము*

*నమో నమో కేశవ నమో నారాయణ*

*నమో నమో మాధవ నమో గోవింద*

*నమో నమో విష్ణు నమో మధుసూదన*

*నమో త్రివిక్రమ నమో వామనా*

*నమో నమో శ్రీధర నమో హృషీకేశ*

*నమో పద్మనాభ నమో దామోదర*

*నమో సంకర్షణ నమో వాసుదేవ*

*నమో ప్రద్యుమ్నతే నమో యనిరుద్ధా*

*నమో పురుషోత్తమ నమో యధోక్షజ*

*నమో నారసింహ నమో యచ్యుత*

*నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర*

*నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణా* (4-425)

'భగవంతుని నామమే తనకు నిధి' అని పేర్కొంటూ అన్నమయ్య ఈ కీర్తనలో నామ జపం చేశాడు.

### 3.2.2. లీలా కీర్తన

లీల అంటే క్రీడ అని అర్థం. భగవంతుడు తన అవతారాలలో ఎన్నో లీలా విశేషాలను చేస్తూ ఉంటాడు. తన సంకల్ప మాత్రంచేత రాక్షసులను సంహరించగలిగేవాడు నవమాసాలు తల్లి గర్భస్థుడై ఉండడం, పుట్టడం, పెరగడం, సర్వజ్ఞుడైనా గురుముఖతా చదువుకోవడం, తోటి పిల్లలతో ఆడుకోవడం ఇవన్నీ భగవంతుడి లీలా విశేషాలే. దేశాన్నేలే ఒక చక్రవర్తి మారువేషంలో ఉన్నప్పుడు ఒక పేదవాడి ఇంట్లో భోంచేయడం, కాలినడకన సంచారం

చేయడంవంటివి విడ్డూరం కలిగిస్తాయి. అటువంటిది అఖిలాండకోటి బ్రహ్మాండాలకు నాయకుడైన పరమాత్ముడు భూలోకంలో చేసే చర్యలన్నీ సహజంగానే భక్తులకు ఆశ్చర్యజనకంగా, ఆనందదాయకంగా ఉంటాయి. వాటినే లీలలుగా భావించి భక్తజనం మరీమరీ తలచుకుంటూ ఉంటారు. అటువంటి లీలా కీర్తనమే అన్నమయ్య ఈ కీర్తనలో చేయడాన్ని చూడవచ్చు.

*ఎంతకత నడిపితి వేమి జోలిఁ బెట్టితివి*
*చింతించ లోకములు నీచేతివే కావా*

*కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల*
*నేరిచి సారథ్యము నెఱపనేలా*
*కోరి భూభార మణఁచేకొరకై తే నీచే చక్ర-*
*మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా*

*చేకొని వానరులఁగాఁ జేయనేల దేవతల*
*జోకతో లంకాపురి చుట్టుకోనేల*
*కాకాసురు వేసిన కసవే రావణుమీఁద-*
*నాకడఁ జంపువెట్టితే నప్పుడే సమయఁడా*

*గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల*
*చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల*
*చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక*
*తక్కించి నీవెడసితే తానే పొలియఁడా* (2-315)

‘పరమాత్ముడే తలచుకుంటే కౌరవులకు, పాండవులకు మైత్రి చేసేవాడే. అయినా తన రాయబారంతో వారి మధ్య విరోధాన్ని పెంచి వచ్చాడు. ఆ పై రథ సారథ్య బాధ్యతను తనపై వేసుకుని, అర్జునుడి చేత దుష్టసంహారం చేయించాడు. భూభారాన్ని తగ్గించడమే భగవానుడి లక్ష్యమైతే, ఊరకే తాను ఉన్నచోటినుండి తన చక్రాన్ని పంపితే దుష్టులంతా ఒక్కసారే సమసిపోయేవారు కదా!

పనికట్టుకుని దేవతలనందరినీ వానరులుగా పుట్టించడం, అటు తరువాత వారినందరినీ తీసుకుని లంకాపురిని చుట్టుముట్టడం లీల కాకపోతే, కాకాసురుడిపై వేసినట్టే దర్భను మంత్రించి వేస్తే రావణాసురుడు అంతమయ్యేవాడు కదా!

మనిషి శరీరంలో పరమాత్మ పరంజ్యోతి రూపంలో ప్రకాశిస్తూ ఉండడంవలననే మనిషి జీవంతో ఉంటాడు. ఎప్పుడైతే పరంజ్యోతి వెళ్ళిపోతుందో అప్పుడు శవంగా మారతాడు. కనుక, హిరణ్యకశిపుని ఆత్మలోనుండి తొలగిపోతే, పోయే ప్రాణాన్ని, నరసింహావతారంగా స్తంభంలో ప్రవేశించి మరీ తీయవలసిన పనేమిటి?’ అంటూ అన్నమయ్య పరమాత్ముని లీలా విశేషాలను తలచుకుని అబ్బురపడ్డారు.

*అమృతము చేతఁ దచ్చి అందరికిచ్చినవాఁడు*
*తమితో వెన్న దొంగిలెఁ దానె యట్టె*
*గుమురై దేవదానవకోటికిఁ జిక్కనివాఁడు*
*భ్రమసి గోపికల పాలఁ జిక్కినాఁ డట్టె* (3–316)

‘తనచేతి మీదుగా అమృతాన్ని అందరికీ పంచినవాడు, ఆత్రుతగా వెన్నను దొంగిలించాడట. దేవతలు, దానవులు ఎంత ప్రయత్నించినా దొరకనివాడు, గోపికలకు వశమయ్యాడట’ అంటూ స్వామి లీలలను మరో కీర్తనలో మననం చేసుకున్నారు. ఏదైనా మధురమైన పదార్థాన్ని తింటే అమృతంలా ఉందంటారు. అంటే అమృతాన్ని మాధుర్యానికి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు.

అలాంటి అమృతాన్నే అందరికీ పంచిపెట్టినవాడు వెన్నను దొంగిలించడం లీల కాకపోతే మరేమిటి? అలాగే, దేవతలకు, రాక్షసులకు కూడా అందనివాడు, సామాన్య మానవుడిగా మారి గోపికలకు చిక్కడం మరొక లీల.

### 3.2.3. గుణ కీర్తన

ఈ కీర్తనలో శ్రీమహావిష్ణు గుణకీర్తన చేశారు అన్నమయ్య.

*సతతవిరక్తుఁడు సంసారి గాఁడు*
*రతిసమ్మదుఁడు విరక్తుఁడు నితఁడె*

*నిత్యుఁడైనవాఁడు నిఖిలలోకములఁ-*
*బ్రత్యక్షవిభవసంపన్నుఁడు గాఁడు*
*నిత్యుఁడు నితఁడే నిరుపమానుఁడైన*
*ప్రత్యక్షవిభవసంపన్నుఁ డితఁడె*

*యోగియైనవాఁడు వొనర నేకాలము*
*భోగియై భోగిపై భోగింపలేఁడు*
*యోగియు నితఁడే వుడుగక భోగిపై*
*భోగించునటువంటి పురుషుండు నితఁడె*

*దేవుడైనవాఁడుఁ దెలుప లోకముల*
*దేవతారాధ్యుఁడై దీపింపలేఁడు*
*దేవుఁడు నితఁడే దివిజవంద్యుఁడైన*
*శ్రీవేంకటగిరిదేవుండితఁడె (1-272)*

‘భగవంతుడు నిరంతరం విరక్తుడై ఉంటాడు. కాని రతి పరాఙ్ముఖుడు కాడు. తనది అంటూ ఏదీ కలిగినవాడు కాడు. కాని అన్నీ తనవే. యోగి అతడే. భోగి అతడే. దేవుడు అతడే. దేవతారాధ్యుడు అతడే.’ ఇలా పరస్పర వైరుధ్యాలు కలిగిన భగవంతుని గుణస్వభావ కీర్తన ఇక్కడ కనిపిస్తుంది.

### 3.2.4. రూప కీర్తన

*అహోబలేశ్వరుఁ దరికులదమనుఁడు*
*మహామహిమలను మలసీ వాఁడె*

*కదలుఁ గన్నులును కరాళవదనము*
*గుదిగొను భయదపుఁ గోరలును*
*అదరు మీసములు నలరఁగ నవ్వుచు*
*వుదుటు తోడఁ గొలువున్నాఁడు వాఁడె*

*అతిసిత నఖములు ననంతభుజములు*
*వితతపరాక్రమవేషమును*
*అతులదీర్ఘజిహ్వాయుఁ గడు మెరయఁగ*
*మితిలేని కరుణ మెరసీ వాఁడే*

*సందడి సొమ్ములు శంఖచక్రములు*
*పొందుగ దివిజులు పొగడఁగను*
*యిందిరఁ దొడపై నిడి శ్రీవేంకట–*
*మందు నిందు గడుఁ నలరీ వాడే* (2–112)

‘కదిలే కన్నులతో, భయం పుట్టించే కోరలు కలిగిన మొహంతో, అదిరే మీసాలతో, భక్తులను అలరించే చిరునవ్వుతో, తెల్లని గోర్లతో, అనంతమైన భుజాలతో, పొడవాటి నాలుకతో, శంఖ చక్రాలతో, ఇందిరను తొడపై కూర్చుండబెట్టుకుని కరుణారసాన్ని కురియజేసే నరసింహమూర్తి’ని ఈ కీర్తనలో దర్శనం చేయించారు అన్నమయ్య.

### 3.2.5. మహత్వ కీర్తన

ఈ కీర్తనలో అన్నమయ్య అలవికాని శ్రీహరి గొప్పతనాన్ని శ్లాఘించారు.

*ఇన్నియు ముగిసెను ఇటు నీలోననె*
*పన్ని పరులఁ జెప్పఁగఁ జోటేది*

*కుందని నీరోమకూపంబులలో*
*గొందుల బ్రహ్మాండకోట్లట*
*యెందరు బ్రహ్మలో యెంత ప్రపంచమో*
*యిందుఁ బరులమని యెంచఁగనేది*

*నీ కొనచూపున నెఱిఁ గోటిసూర్య-*
*లేకమగుచు నుదయింతురటా*
*నీ కాయమెంతో నీ వునికేదో*
*నీకంటెఁ బరులని నిక్కఁగనేది*

*జీవకోటి నీ చిన్నిమాయలో*
*ప్రోవులగుచు నటు పొడమెనటా*
*శ్రీవేంకటేశ్వర చెప్పఁగ నీవెంతో*
*ఆవలఁ బరులకు నాధిక్యమేది* (3-87)

‘భగవానుడి రోమకూపాల నుండి బ్రహ్మాండాలు పుట్టాయని ప్రతీతి. కనుక లెక్కలేనన్ని రోమకూపాలలో ఎంత మంది బ్రహ్మలో, ఎంత ప్రపంచమో’ అని అబ్బురపోయారు అన్నమయ్య. ‘భగవంతుడు కొనచూపు చూస్తే, కోటి సూర్యులు ప్రభవిస్తారని, ఆయన దేహమెంత పరిమాణం కలదో, ఆయన నివాస స్థానమేమిటో ఆయనకే తెలియ’దని అన్నమయ్య నివ్వెఱపాటును వ్యక్తం చేశారు. ‘జీవకోటి అంతా ఆయన మాయలో చిక్కుకుని ఉందని, ఇంక ఆయనకంటే పరదైవమెవరున్నా’రని శ్రీమహావిష్ణువు మహిమను స్తుతించారు. ఈ విధమైన కీర్తనలన్నీ మహత్వకీర్తన అన్న విభాగానికి చెందుతాయి.

### 3.2.6. ప్రతాప కీర్తన

ఈ విభాగంలో అన్నమయ్య స్వామివారి ప్రతాపాన్ని, శౌర్యాన్ని స్తుతించిన కీర్తనలు అన్నీ చేరతాయి.

*భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె*
*పైకొని నిలువరాదు పారరో దిక్కులకు*

*బండికండ్లరవమదే బంగారుమెఱుఁగులవే*
*కొండవంటి రథమదె గొడగులవే*
*మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే*
*బండుబండై యసురలు పారరో దిక్కులకు*

*గరుడధ్వజమదే ఘంటారవములవే*
*సొరిది ముత్యాలకుచ్చులు నవే*
*బిరుదుశంఖముమ్రోఁత బెరయించీ దేవుఁడదే*
*పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు*

*ముంగిట బలములవే మొరసీ భేరులవే*

*సంగతిఁ బ్రతాపమదే సాకారమదే*

*కుంగ కలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడు*

*భంగపెట్టీ దైతేయులు పారరో దిక్కులకు* (3-164)

స్వామివారి యుద్ధసంరంభాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో ఆవిష్కరించారు. 'భీకరమైన చక్రం అదిగో వస్తోంది! అదిగో స్వామి రథం! అదే గరుడధ్వజం! అదిగో దేవదేవుడు రానే వచ్చాడు! అవిగో స్వామి సైన్యాలు! అవే యుద్ధభేరులు! రాక్షసులారా పారిపొండి!' అంటూ ఈ కీర్తనలో అన్నమయ్య స్వామివారి ప్రతాపాన్ని కీర్తించారు.

### 3.2.7. అవతార కీర్తన

అన్నమయ్య రామ, కృష్ణ, నరసింహావతారాలపై విడివిడిగా ఎన్నో కీర్తనలను రచించి ఆయా అవతార మహిమలను, గాథలను, లీలలను కొనియాడారు. *వినరయ్య నరసింహవిజయము జనులాల అనిశము సంపదలు నాయువు నొసఁగును* (4-513) అన్న కీర్తనలో నరసింహావతార విశేషాలను సవివరంగా ప్రస్తావించారు.

*ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుఁడు*

*రతికెక్కఁ గొలిచిన రక్షించు నితఁడు*

*తరణివంశజుఁడై తాటకను హరియించి*

*అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి*

*హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లియాడి*

*పరశురాముని నిజబలిమి చేకొనెను*

*మునులకభయమిచ్చి మొగి నసురలఁ ద్రుంచి*

*ఘనమైన మాయామృగముఁ జంపి*

*కినిసి వాలిఁ గొట్టి సుగ్రీవునిఁ బట్టముగట్టి*

*వనధి బంధించి లంక వడిఁ జుట్టుముట్టెను*

*బలురావణునిఁ జంపి పుష్పకముపైఁ దాఁ జేకొని*

*లలి విభీషణునకు లంక ఇచ్చి*

*చెలఁగి యయోధ్య యేలి శ్రీవేంకటాద్రిమీఁద*

*వెలయ రాముఁడు దానై విశ్వమెల్లా నేలెను* (4-159)

'సూర్యవంశంలో పుట్టి, తాటకిని దునుమాడి, విశ్వామిత్రుడి యాగాన్ని రక్షించాడు. శివధనుర్భంగం చేసి సీతను పెండ్లాడాడు. పరశురాముడి గర్వాన్ని అణిచాడు. అడవులలో మునులను బాధిస్తున్న ఎందరో రాక్షసులను సంహరించాడు. మాయలేడిని చంపాడు. వాలిని పడగొట్టి, సుగ్రీవుడికి పట్టం కట్టాడు. సముద్రాన్ని నియంత్రించి, వారధిని కట్టి, లంకపై దాడి చేశాడు. రావణుడిని పరిమార్చి, విభీషణుడిని లంకకు రాజుగా చేశాడు. పుష్పక విమానాన్ని ఎక్కి అయోధ్యను చేరుకొని ప్రజారంజకంగా ప్రజలను పాలించాడు.' ఈ విధంగా ఈ కీర్తనలో రామావతారంలో రాముడు చేసిన ఘనకార్యాలనన్నిటినీ అన్నమయ్య శ్లాఘించారు.

### 3.2.8. దశావతార కీర్తన

అవతార కీర్తనంలో అన్నమయ్య ఏదో ఒక స్వామి అవతారాన్ని లక్ష్యంగా చేసుకుని కీర్తించడం చూశాం. దశావతార కీర్తనలో శ్రీమహావిష్ణు దశావతారాలను ఒక కీర్తనలో ప్రస్తావించడం కనపడుతుంది. అనాదిగా కవులంతాకూడా హరికీర్తనలో భాగంగా దశావతారాలను స్తుతించడం పరిపాటి. ఇదే బాటలో అన్నమయ్య కొన్ని కీర్తనలలో దశావతారాలను స్తుతించారు.

*ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే*
*అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటి కాధారము దానె*

*మది జలధుల నొక దైవము వెదకిన మత్స్యావతారం బితఁడు*
*అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీవిష్ణుఁడు*
*పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి*
*చెదఱక కొండల గుహల వెదకితే శ్రీనరసింహం బున్నాఁడు*

*తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది*
*బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁ డొకఁడై నాఁడు*
*తలఁపున శివుఁడునుఁ బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు*
*కెలఁకుల నావులమందల వెదకిన కృష్ణుఁడు రాముఁడునైనారు*

*పొంచి యసురకాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాఁడు*
*మించిన కాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యావతారము*
*అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను*
*యెంచుక ఇహమునఁ బరమున వెదకిన యీతఁడే శ్రీవేంకటవిభుఁడు* (3-370)

'ఇతని కంటే వేరే దైవం కనిపించదు. ఎక్కడ చూసినా ఇతడే కనిపిస్తాడు. గొప్ప మహిమలతో ప్రపంచానికి ఆధారభూతంగా ఉన్నాడు. నీటిలో దైవమున్నాడేమోనని వెతికితే మత్స్యావతారంగా కనిపిస్తాడు. పాతాళంలో వెతికితే ఆదికూర్మంగా దర్శనమిస్తాడు. అడవులలో చూద్దామనుకుంటే వరాహావతారంగా ప్రత్యక్షమవుతాడు. కొండ గుహలలో నరసింహమై ఉంటాడు. భూమ్యాకాశాలలో వెతికితే త్రివిక్రముడై ఆక్రమిస్తాడు. వీరులలో చూస్తే పరశురాముడతడే. శివపార్వతులు కనుగొన్న తారకబ్రహ్మంగా రామావతారం దాల్చాడు. ఆవులమందలలో కృష్ణుడిగా, బలరాముడిగా వెలిసాడు. రాక్షసకాంతల మధ్య

బుద్ధావతారమయ్యాడు. రాబోయేకాలంలో కల్కిగా వస్తాడు. జీవులందరిలోనూ అంతరాత్మగా ఉన్నాడు. ఇహంలో కాని, పరంలో కాని శ్రీవేంకటేశ్వరుడే దైవం' అంటూ శ్రీమహావిష్ణువు దాల్చిన దశావతారాలను ఈ కీర్తనలో సంస్మరించుకున్నారు అన్నమయ్య.

### 3.2.9. వ్యాజ స్తుతి

పైకి నిందిస్తున్నట్లు కనిపించినా, తరచి చూస్తే పొగుడుతున్నట్లు అనిపించడం వ్యాజ స్తుతి. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడిని రకరకాల రీతులలో స్తుతించారు. అందులో వ్యాజస్తుతి ఒకటి.

*బిడ్డఁ డంటా నమ్మి యెట్టు వెట్టుకొన్నా రిందుకంటె*
*గొడ్డువో మేలు యిట్టి కొత్త లెందుఁ గలవా*

*నోరినిండాఁ జన్ను లేక నొగిలెడిఁ బాప మయ్యో*
*ఊరివారిపాపఁ డఁటా నొకయింతి*
*నేరుపునం జన్నియ్యంగ నెత్తు రెల్లఁ దాగి తాగి*
*గోరపెట్టి చంపె నిట్టి కొత్త లెందుఁగలవా*

*ఎత్తుకొనేవారు లేక యేఁకరే నటంచు నొక్కఁ*
*డెత్తుకొని వేడుకతో నేఁగఁగానే*
*బత్తిగలవానివలె ప్రాణము వోయినదాఁకా*
*కుత్తుక బిగించె నిట్టి కొత్త లెందుఁగలవా*

*నిప్పు వలె నెండగాయ నీడలే దటంచుబండి*
*యొప్పుగం జాటిడి తనకుండంగానే*

*అప్పుడు వేంకటరాయఁ డడ్డపాపఁ డరకాల*

*కుప్పవడఁ దన్నె నిట్టి కొత్త లెందుఁగలవా* (6-60)

'పాపం బిడ్డడికి సరిపడా పాలు అందటం లేదని, ఒకామె పాలిస్తే, నెత్తురు తాగి చంపాడు. ఎత్తుకునేవారు లేక ఏడుస్తున్నాడని ఒకడెత్తుకుంటే ప్రాణం పోయేదాకా గొంతు పట్టి నులిమాడు. ఎండ నిప్పల్లే కాలుతుంటే, నీడనందిద్దామని ఒక బండి ముందుకొస్తే, ముక్కలయ్యేట్టుగా తన్నాడు. ఇవేం పను'లని స్వామిని నిందిస్తున్నారు అన్నమయ్య. కాని నిజానికవన్నీ బాలకృష్ణుని లీలలు. పూతన, తృణావర్తుడు, శకటాసురుడు అనే రాక్షసులను చంపడం ఈ లీలలలో కనపడుతుంది. బయటకు నిందిస్తున్నట్టు కనపడుతూ, స్వామి లీలా కీర్తనం చేస్తున్న అన్నమయ్యది వ్యాజస్తుతి.

ఇవి కాక, అన్నమయ్య చేసిన క్షేత్ర కీర్తన, దేవేరి కీర్తన, ఆయుధ కీర్తన, తేరు కీర్తన మొదలైనవి నాలుగవ అధ్యాయంలో (అధ్యాయం-4.16, పుటలు:333-338) చర్చించబడతాయి.

## 3.3. స్మరణ భక్తి

నవవిధ భక్తి మార్గాలన్నిటిలోనూ సులువైన మార్గం స్మరణం. శ్రవణానికి ప్రవచకుడు ఉండాలి, కీర్తనానికి కీర్తన చేయగల పాండిత్యమో, ఇతరుల కీర్తనలు పాడుకోవటానికైనా స్వరజ్ఞానమో, గాత్రమో ఉండాలి. పాదసేవన, అర్చన, వందనాదికాలకు అర్చామూర్తి ఉండాలి. దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం పరిపక్వమైన భక్తికలవారు తప్ప చేయలేరు. కాని, స్మరణ భక్తికి ఏ ఇతర సాధనాలు అవసరం లేదు. ఈ భక్తిమార్గం ఎవరైనా ఆచరించదగ్గది. నిరంతరం భగవంతుడి లీలా విశేషాలను మనసులో మననం చేసుకోవడమే చాలు. అదే అనంత ఫలదాయకం.

*భావే భావే హృదయభవనే భావయేయం భవంతం* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:33 – [ముకుందమాల–4వ శ్లోకం]) – 'నా మనస్సులో కలిగే ప్రతి భావంలోనూ నిన్నే ధ్యానించాలి' అని కోరుకున్నారు *ముకుందమాల* లో కులశేఖరాళ్వారు. అంటే మనస్సు పూర్తిగా భగవంతునిపై లగ్నమై ఉండాలి. అదే భగవద్ధ్యానం. అలా ధ్యానించగలిగితే కలిగే ప్రయోజనం ఈ కింది కీర్తనలో చెబుతారు అన్నమయ్య.

*పొద్దు వొద్దు హరిఁ దలఁపున దలపోయఁగ*
*వొద్దికైన పలుచేత లున్న వెల్లా మరచును*
*నిద్దిరించువాని చేతి నిమ్మ పంటివలెనే*
*బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును* (4–414)

'నిద్రపోతున్న వాడి చేతిలోని నిమ్మపండు తెలియకుండానే ఎలా జారిపోతుందో, అలాగే నిరంతర హరి స్మరణంవల్ల మనిషి ఇతరమైన ఆలోచనలన్నీ మరచిపోతా'డని చెబుతారు.

### 3.3.1. ఫలితం

అన్నమయ్య పలు కీర్తనలలో స్మరణ భక్తి వల్ల కలిగే ఫలితాలను ఉటంకించారు.

*ఏమరక తలఁచరో యిదే చాలు*
*కామించినవి యెల్లఁ గక్కుననే కలుగు*

*దురితములెల్లఁ దీరు దుఃఖములెల్ల నణఁగు*
*హరియని వొకమాఁటు అన్నాఁజాలు*
*సురలు వూజింతురు సిరులెల్లఁ జేరును*
*మరుగురునామ మటు పేరుకొన్నఁ జాలు*

*భవములిన్నియుఁ బాయు పరము నిహముఁజేరు*

*అవల నారాయణయన్నాఁ జాలు*

*భువి యెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు*

*తవిలి గోవిందు నాత్మఁదలఁచినఁ జాలు*

*ఆనందము గలుగు నజ్ఞానమెల్లఁ బాయు*

*ఆనుక శ్రీ వేంకటేశ యన్నాఁ జాలు*

*యీ నెపాన నారదాదు లిందరు నిందుకు సాక్షి*

*దానవారి మంత్రజపతపమే చాలు* (4-463)

'ఏమరపాటు లేక హరిని తలచినంత మాత్రానే, కోరుకున్నవెల్లా వెంటనే లభిస్తాయి. *హరి* అని ఒక్క మారు అన్న మాత్రం చేతనే పాపాలన్నీ నాశనమవుతాయి; దుఃఖాలన్నీ తొలగిపోతాయి. మన్మథజనకుడి పేరు స్మరించినంత మాత్రాన దేవతలు సైతం పూజిస్తారు; సంపదలు సిద్ధిస్తాయి. *నారాయణా* అని ఒక్క సారి అంటే చాలు, జన్మలు నశిస్తాయి; ఇహపరాలు రెండూ సిద్ధిస్తాయి. గోవిందుడిని మనసులో తలచినంతనే, భూమండలాన్ని పాలించగలుగుతారు; పుణ్యాలన్నీ వచ్చి చేరతాయి. *శ్రీవేంకటేశా* అని అంటే చాలు, నారదాదుల సాక్షిగా, ఆనందం గలుగుతుంది; అజ్ఞానం నశిస్తుంది' అంటూ స్మరణవల్ల కలిగే ఫలితాలను ఈ కీర్తనలో అన్నమయ్య వివరించారు.

*పాపములే సంబళమెపుడూ యీ-*

*యాపదఁ బడి నే నలసేనా*

*ఎన్నిపురాణము లెటువలె విన్నా*

*మన్న మనువు దిమ్మరితనమే*

*నన్ను నేనే కానఁగలేనట నా*

*విన్న వినుకులకు వెఱచేనా*

*యెందరు పెద్దల నెట్లఁ గొలిచినా*

*నిందల నామతి నిలిచీనా*

*కందువెఱిఁగి చీకటికిఁ దొలఁగనట*

*అందపుఁబరమిఁక నందేనా*

*తిరువేంకటగిరిదేవుఁడే పరమని*

*దరి గని తెలివిఁక దాఁగీనా*

*తిరముగ నినుఁ జింతించినచింతే*

*నిరతము ముక్తికి నిధిగాదా* (1–82)

'ఎన్ని పురాణాలను విన్నా, ఆ విన్నదాని మీద ధ్యాస నిలకడగా నిలపటం కష్టం. ఎందరు పెద్దలను కొలిచినా, శ్రద్ధ లేకపోతే పరం లభించదు. కనుక, స్థిరంగా భగవంతుడిగురించి చేసిన ఆలోచనలే ముక్తికి దారి చూపుతాయి' అంటూ అసలు స్మరణానికి ఎందుకంత మహిమ ఉందో ఈ కీర్తనలో వర్ణించారు అన్నమయ్య.

### 3.3.2. ప్రవచనం

*ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం వేదవ్రతా న్యన్వహం*

*మేదశ్ఛేదఫలాని పూర్తవిధయః సర్వే హుతం భస్మని*

*తీర్థానా మవగాహనాని చ గజస్నానం వినా యత్పద–*

*ద్వంద్వాంభోరుహసంస్మృతిం విజయతే దేవస్స నారాయణః* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:117 – [ముకుందమాల–25వ శ్లోకం])

'నారాయణ పాదకమలాల ధ్యానం లేని వేదాధ్యయనం, యజ్ఞాది కర్మలు, ధర్మకార్యాలు, తీర్థస్నానాలు అన్నీ వృథా, బూడిదలో పోసిన పన్నీరే. నారాయణ స్మరణమే నిత్యం ప్రథమ కర్తవ్యం' అన్నారు కులశేఖరాళ్వారులు.

*హరినామము కడు నానందకరము*
*మరుగవో మరుగవో మరుగవో మనసా*

*నలినాక్షుని శ్రీ నామము*
*కలి దోషహరము కైవల్యము*
*ఫలసారము బహుబంధ మోచనము*
*తలఁచవో తలఁచవో తలఁచవో మనసా* (4-409)

'హరినామం ఎంతో ఆనందదాయకం, కలిదోషాలను హరిస్తుంది. బంధవిమోచనం చేస్తుంది. ఫలదాయకం. కనుక, అటువంటి నామాన్ని మరీమరీ తలచుకో'మని తన మనసుకు హరి నామస్మరణ మప్పుతున్నారు అన్నమయ్య.

*పోయఁ గాలం బడవికిఁ గాయు వెన్నెలకరణిని*
*శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు మాయఁబడి చెడక*

*చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను*
*చిత్తజగురునిఁ దలఁచుఁడీ చిత్తజుఁ జొరనీక* (1-194)

'అడవిలో కాచిన వెన్నెలలా, కాలమంతా వృథా అయిపోతోంది. మాయలో పడి చెడిపోక శ్రీపతిని తలచుకోండి. మన్మథుని మనసులోకి వెళ్ళనీయకుండా, ఏకాగ్రతతో మన్మథ జనకుడైన నారాయణుని తలచుకోండి' అంటూ అన్నమయ్య లోకానికి స్మరణభక్తిని ప్రవచించారు.

### 3.3.3. ప్రదర్శనం

అన్నమయ్య అనేక కీర్తనల్లో శ్రీహరి రూప, లీలా, అవతార విలాసాదులను స్మరించుకున్నారు. ఈ కింది కీర్తనలో 'గోపాలబాలుడైన చిన్నికృష్ణుడి పాదాలను నిరంతరం మనస్సులో స్మరిస్తున్నాను' అంటూ, బాలకృష్ణుడి మనోహర రూపాన్ని స్మరించి, పాఠకులకుకూడా బాలకృష్ణ రూప సాక్షాత్కారం చేయించారు.

భావయామి గోపాలబాలం మన–
స్సేవితం తత్పదం చింతయేఽయం సదా

కటిఘటిత మేఖలా ఖచిత మణిఘంటికా–
పటల నినదేన విభ్రాజమానం
కుటిల పదఘటిత సంకుల శింజితే నతం
చటుల నటనా సముజ్జ్వల విలాసం

నిరత కర కలిత నవనీతం బ్రహ్మాది–
సుర నికర భావనా శోభితపదం
తిరు వేంకటాచల స్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం (1–137)

నవరత్నాల రాళ్ళు పొదగబడిన, చిన్ని చిన్న గంటలు కూర్చబడిన మొలత్రాటిని ధరించి నర్తిస్తూ, అ నర్తనకు శరీరంపై కల భూషణాలుకూడా కదులుతూ శబ్దం చేస్తుండగా, అటూ ఇటూ తిరుగుతూ, ఇంటి పైకప్పు దద్దరిల్లేలా చప్పుడు చేస్తూ, అగ్నితో సమానంగా ప్రకాశిస్తున్న బాలగోపాలుని' రూపాన్ని భావించుకున్నారు అన్నమయ్య. 'నిరంతరం చేతిలో వెన్నముద్దను ఉంచుకున్న వాడు, బ్రహ్మాది దేవతలచేత ధ్యానింపబడే ప్రకాశవంతమైన పాదాలు కలిగినవాడు,

తిరువేంకటాచలంపై నివాసమున్నవాడు అయిన బాలకృష్ణుని' ఈ కీర్తనలో అన్నమయ్య స్మరించుకున్నారు.

### 3.4. పాదసేవన భక్తి

*శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే* అంటూ శ్రీవైష్ణవులు మోక్షోపాయంగా శ్రీహరి పాదాలను శరణు వేడతారు. భగవానుడి పాదాలే భక్తులకు కల్పవృక్షాలు, చింతామణులు. అటువంటి పాదాలను అన్నమయ్య ఈ కీర్తనలో వర్ణించారు.

*బ్రహ్మఁ గడిగిన పాదము*
*బ్రహ్మము దానె నీపాదము*

*చెలఁగి వసుధ గొలిచిన నీపాదము*
*బలి తల మోపిన పాదము*
*తలఁకక గగనము దన్నిన పాదము*
*బలరిపుఁ గాచిన పాదము*

*కామినిపాపము గడిగిన పాదము*
*పాముతల నిడిన పాదము*
*ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము*
*పామిడి తురగపుఁ బాదము*

*పరమయోగులకుఁ బరిపరివిధముల*
*పరమొసఁగెడి నీపాదము*
*తిరువేంకటగిరి తిరమని చూపిన–*
*పరమపదము నీపాదము* (1–191)

అన్నమయ్య శ్రీవారి పాదాలపై తన భక్తిని సహేతుకంగా ప్రదర్శించారు. ఆ శ్రీపాదం ఎంత గొప్పదో, ఎన్ని ఘనతలకు కారణమయినదో వివరించారు. పల్లవి, మొదటి చరణాలలో శ్రీమహావిష్ణువు త్రివిక్రమావతారంలో చేసిన లీలలను వర్ణించారు.

'విష్ణుమూర్తి వామనుడై బలివద్దకు దానమడగడానికి వచ్చి, మూడు అడుగుల నేలను దానంగా పొందుతాడు. ఆ పై త్రివిక్రముడై, ఒక పాదంతో ఆకాశం మొత్తాన్ని ఆక్రమిస్తాడు. ఆ సమయంలో ఆకాశంలోకి సాగుతున్న విష్ణుపాదాన్ని తన కమండలంలోని జలాలతో అభిషేకిస్తాడు బ్రహ్మ. ఆ సంఘటన ప్రస్తావనతో ఈ కీర్తన మొదలయింది. మొదటి చరణంలో స్వామి తన పాదంతో భూమి మొత్తాన్ని కొలవడాన్ని, ఆకాశాన్ని ఆక్రమించడాన్ని, బలి తలపై మోపి, ఆయనను పాతాళానికి పంపడాన్ని, ఆ విధంగా బలరిపుడైన ఇంద్రుడిని రక్షించడాన్ని వర్ణించారు అన్నమయ్య.

రెండవ చరణంలో వివిధ అవతారాల, లీలల ప్రస్తావన తీసుకువచ్చారు. రామావతారంలో అహల్యను తన పాదస్పర్శ ద్వారా పాపవిముక్తురాలిని చేసిన సంఘటనను, కృష్ణావతార సమయంలో తాండవమాడి కాళియుని తలలపై తన పాదముద్రలను వదిలిన సంగతిని, అలాగే, సమస్త సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవి ఎప్పుడూ నిత్యానపాయినియై శ్రీమన్నారాయణుని పాదాలను ఒత్తుతూ ఉండే విషయాన్ని ప్రస్తావించారు. చివరగా *పామిడి తురగపు పాదము* అన్నాడు. పామిడి అంటే పాములకు శత్రువు అయిన గరుత్మంతుడు. ఆ గరుత్మంతుడిని వాహనముగా కలిగినవాడు శ్రీమహావిష్ణువు. అమితబలశాలి, వీర్యవంతుడు అయిన గరుత్మంతుడిమీద ఎల్లవేళలా మోపబడే పాదము శ్రీమహావిష్ణువు పాదం.

మూడవ చరణంలో ఆ పాదాన్ని నమ్ముకోవడంవలన కలిగే ఫలాలను వర్ణించారు. పరమయోగులెందరికో ముక్తిని ప్రసాదించినటువంటి పాదాలు స్వామివారివి. ఆ పాదాలనే

మోక్షగాములెందరో నమ్ముకున్నారు. *శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే* అంటూ స్వామివారి చరణాలకు శరణాగతి చేస్తారు భక్తులు. ముఖ్యంగా తన పాదాలను శరణు వేడమని నేరుగా భక్తులకు సూచిస్తున్నట్లుగా తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామివారి ప్రతిమ ఉంటుంది.' అటువంటి పాదాలపై తనకు గల భక్తిని తన కీర్తనల ద్వారా తెలియజేశారు అన్నమయ్య.

### 3.4.1. ప్రాశస్త్యం

*ఈ పాదమే కదా యిలనెల్లఁ గొలిచినది* (1-66) అంటూ శ్రీహరి పాదాన్ని పరిపరివిధాల సంస్తుతించిన అన్నమయ్య శ్రీహరి పాదసేవే భోగమని ఈ కీర్తనలో పేర్కొన్నారు.

*కామధేనువిదే కల్పవృక్షమిదే*
*ప్రామాణ్యముగల ప్రపన్నులకు*

*ధరణిధరు పాదసేవే భోగము*
*పరమంబెరఁగిన ప్రపన్నులకు* (2-488)

### 3.4.2. ప్రవచనం

*చెన్నుమీఱ హరిపాదసేవ సేయు మనసా* (2-90) అంటూ సంతోషంగా హరిపాదసేవ చేయమని అన్నమయ్య ఉగ్గడించారు.

*భవరోగవైద్యుని పాదములు సేవించి*
*భువి రోగములఁ బాసి పొదలరో* (1-441)

'జన్మ అనే రోగానికి వైద్యుడై, అటువంటి జన్మలను తొలగించే ఆ శ్రీహరి పాదాలను సేవించి పరమపదం పొంద'మని ఈ కీర్తనలో ప్రవచించారు.

### 3.4.3. ప్రదర్శనం

ఈ కీర్తనలో అన్నమయ్య పాదసేవనభక్తిని ప్రదర్శించారు.

*తల్లి దండ్రి దాత గురువు తానెయైననాచారి*

*వల్లభుండు నాకు మేలువంటిదాయ జన్మము*

*కల్లగాదు వేంకటేశుఘనుని పాదసేవ నాకు*

*మొల్ల మాయ నామనసు మోదమాయ దైవమా* (1-186)

'అన్నమయ్య తనకు తల్లి, తండ్రి, దైవముకూడా ఆ నాంచారివల్లభుడైన శ్రీ వేంకటేశ్వరుడేనని, ఆ వేంకటేశ్వరుడి పాదసేవే తనకు ఎనలేని సంపద అని, తన మనసుకు ఆనందదాయక'మని స్వామివారి పాదసేవనంపై తనకు కల మక్కువను చాటుకున్నారు.

### 3.5. అర్చన భక్తి

అర్చారూపంలో ఉన్న భగవంతుడికి పూజలు, ఉపచారాలు చేయటం అర్చనభక్తి. "పరమాత్ముని అర్చారూపమునకు ఆగమవిహితము లగు నిత్యనైమిత్తికముల నాచరించుటయే అర్చనారూపమగు భక్తి. మేలుకొలుపు మొదలుకొని పవళింపుసేవ వఱకును భక్తులర్చామూర్తి కొనరించు సేవలన్నియు నర్చనలే" అని వేటూరి ఆనందమూర్తిగారు పేర్కొన్నట్లుగా (ఆనందమూర్తి, వేటూరి. 1976:166), షోడశోపచారాలతో పాటు ఉయ్యాల సేవ, పవళింపు సేవ, మేల్కొలుపు సేవ, మంగళాశాసనం వంటివన్నీ అర్చన భక్తిలోకే వస్తాయి.

అద్వైతంలో భగవంతుడికి రూపు అంటూ ఉండదని భావిస్తారు. అయితే, విశిష్టాద్వైతంలో భగవంతుడు త్రిభువన సుందరుడు, సకల కళ్యాణ గుణ స్వరూపుడు. ఆ స్వరూపాన్ని ఎన్నో ఉపచారాలతో భక్తులు పూజించుకుంటారు. అన్నమయ్య విశిష్టాద్వైతి. కనుక, *నలి నభేదవాది కానందానుభవ మేది* (4-270) – 'అద్వైతికి మూర్తిని అర్చించుకునే

ఆనందం ఎక్కడిది?' అంటూ సగుణారాధననే చేస్తారు. అయితే ఆయన తాను పాటించే ఆచారాలను అనాలోచితంగా చేయరు. చేసే ప్రతి పని పట్ల స్పష్టత కలిగిన జ్ఞాని. ఈ కింది కీర్తనలో అర్చన భక్తి ఎందుకు అవసరమో చెబుతారు.

*అందుకే సుమ్మీ నేఁ జేసే ఆచారాలు దైవమా*
*నిందవాయ నా మనసు నీపై నిలుపవే*

*బట్టబయటఁ దోలితేను బందె మేయుఁ బసురము*
*పట్టి మేపితేను తనపనులు సేయు*
*ఇట్టె వదిలితేను యెందైనాఁ బారు మనసు*
*కట్టుక నేమస్తుఁడైతే కైవసమై యుండును*

*బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు*
*యెడయక కూడుకొంటే హితు లౌదురు*
*విడిచితే నిటులానే కడకుఁ బారు మనసు*
*వొడలిలో నణఁచితే వొద్దికై వుండును*

*చే వదలితే పెంచిన చిలుకైనా మేడ లెక్కు*
*రావించి గూఁటఁ బెట్టితే రామా యనును*
*భావించకుండితే యిట్టె పారు నెందైనా మనసు*
*శ్రీవేంకటేశుఁ గొల్చితే చేతఁ జిక్కి వుండును* (2-341)

'బయలు ప్రదేశంలో వదిలేస్తే దొరికినవెల్లా తింటూ గడుపుతుంది పశువు. అదే, పట్టుకుని మేపితే తన పనులనుకూడా చేసిపెడుతుంది. కట్టుదిట్టంలో పెట్టకపోతే, సేవకుడు పారిపోతాడు. వదలకుండా జాగ్రత్తగా చూసుకుంటే, హితుడై కోరిన పనులు చేసి పెడతాడు. పెంచుకుంటున్న

చిలకైనా, వదిలేస్తే, ఎగిరిపోతుంది. గూట్లో పెట్టి నేర్పితే, *రామ* అంటూ చిలకపలుకులు పలుకుతుంది. ఇటువంటిదే మనసు కూడా. స్వేచ్ఛగా వదిలేస్తే, మనసు ఏవేవో ఆలోచనలు చేస్తుంది. అదే నియమాలతో కట్టడి చేస్తే, స్వాధీనంలో ఉంటుంది. అందుకే ఈ ఆచారాలన్నీ పాటించడం. మనసును కుదురుగా దైవం మీద నిలిపి ఉంచడానికే ఈ ఆచారాలు, అర్చనలు' అంటారు అన్నమయ్య.

తదనుగుణంగా షోడశోపచారాలే కాక, ఎన్నో ఇతర సేవలతో స్వామివారి అర్చామూర్తిని పూజించారు. అన్నమయ్య అర్చన భక్తిని ఈ విధంగా విభజించవచ్చు.

1) షోడశోపచారాలు 2) మేల్కొలుపులు 3) మంగళాశాసనం 4) లాలి – ఇతర సేవలు

### 3.5.1. షోడశోపచారాలు

అధ్యాయం 2.5లో చెప్పుకొన్నట్లుగా షోడశోపచారాలు ఇవి: 1) ఆవాహన 2) ఆసనం 3) పాద్యం 4) అర్ఘ్యం 5) ఆచమనీయం 6) అభిషేకం 7) వస్త్రం 8) యజ్ఞోపవీతం 9) గంధం 10) పుష్పం 11) ధూపం 12) దీపం 13) నైవేద్యం 14) తాంబూలం 15) ప్రదక్షిణం 16) నమస్కారం.

(వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2010:259)

కింది కీర్తనద్వారా అన్నమయ్య స్వామివారికి ఈ షోడశోపచారాలన్నీ చేశారు.

*షోడశకళానిధికి షోడశోపచారములు*
*జాడతోడ నిచ్చలును సమర్పయామి*

*అలరు విశ్వాత్మకున కావాహన మిదె పర్వ–*
*నిలయున కాసనము నెమ్మి నిదె*

*అల గంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు*

*జలధిశాయికిని మజ్జన మిదె*

*వర పీతాంబరునకు వస్త్రాలంకార మిదె*

*సరి శ్రీమంతునకు భూషణము లివె*

*ధరణీధరునకు గంధపుష్ప ధూపములు*

*తిర మిదె కోటిసూర్యతేజునకు దీపము*

*అమృతమథనునకు నదివో నైవేద్యము*

*గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము*

*అమరిన శ్రీవేంకటాద్రిమీఁది దేవునికి*

*తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో* (2-134)

ఇవే కాక, మరో ఉపచారమైన నీరాజనాన్ని కూడా స్వామికి ఇతర కీర్తనలలో అందించారు అన్నమయ్య.

*ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు*

*యిత్తల నేఁగి వచ్చీని యిందిరానాథుఁడు* (4-31)

అలాగే, పలు కీర్తనలలో స్వామికి నైవేద్యాన్ని సమర్పించారు.

*ఆరగింపవో మాయప్ప యివే*

*పేరిన నేతులు పెరుగులును*

*పరమాన్నంబులు పంచదారలును*

*అరిసెలు గారెలు నవుగులును*

*కరజికాయలును ఖండమండెఁగలు*

*పరి పరి విధముల భక్ష్యములు* (6-4)

### 3.5.2. మేల్కొలుపులు

మనిషి సగుణారాధన చేస్తున్నప్పుడు, భగవంతుడినికూడా తనలాగే, మానుషదేహంతో ఉన్నట్లుగా భావిస్తాడు. తనలాగే భగవంతునికి కూడా ఆహారం, నిద్ర, మైథునం అవసరమైనట్లుగా తలుస్తాడు. అందువల్లనే భగవంతుడికి నైవేద్యాలు, మేల్కొలుపులు, శృంగార కీర్తనలు వెలువడ్డాయి. *అందుకే సుమ్మీ నేఁ జేసే ఆచారాలు దైవమా* (2-341) అనే కీర్తనలో అన్నమయ్య చెప్పినట్లుగా, ఎప్పుడూ ఒకే విధమైన పూజంటే భక్తుడికికూడా ధ్యాస మరలొచ్చు. అందుచేతనే ఆవాహన అని, ఆసనం అని, స్నానం అని ఇలా రకరకాల విధులవల్ల భక్తుడి ఏకాగ్రత స్థిరంగా భగవంతుడిమీద ఉంటుంది. అందులో భాగమే ఈ మేల్కొలుపుకూడా.

*వారిధిశయన వో వటపత్రపరియంక*
*గారవాన మేలుకొని కన్నులు దెరవవే*

*ఘన యోగి హృదయపు కమలాలు వికసించె*
*వొనర విజ్ఞాన సూర్యోదయమాయ*
*మును జీవ పరమాత్మముల జక్కవలు గూసె*
*వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే*

*కలుషము లనేటి చీఁకట్లెల్లఁ బెడఁబాసె*
*నలువంక వేద కీరనాదము మ్రోసె*
*అలరి యితర ధర్మా లనేటి చుక్కలు మాసె*
*జలజాక్ష మేలుకొని సతి మోము చూడవే*

*కపట రాక్షస నేత్ర కలుహారములు మోడ్చె*

*యిపుడే సుకర్మముల యెండలు గాసె*

*అపురూప శ్రీ వేంకటాద్రీశ మేలుకొని*

*నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁ గావనవే* (4-465)

'యోగుల హృదయాలనే కమలాలు వికసించాయి. విజ్ఞానమనే సూర్యుడు ఉదయించాడు. జీవాత్మ, పరమాత్మ అనే చక్రవాకాలు కూస్తున్నాయి. చక్రవాకపు పక్షులు రాత్రుళ్ళు విడిపోయి, తెల్లవారగానే కలుసుకుంటాయని కవిసమయం. జీవాత్మ అజ్ఞానమనే చీకటి ఆవరించినపుడు పరమాత్మనుండి విడిపోయి, జ్ఞానసూర్యోదయంతో మళ్ళీ పరమాత్మను కలుసుకుంటాడు. కనుక, చక్రవాకాలు కలిసాయి అంటే తెల్లవారింది అని అర్థం. పాపాలనే చీకట్లు తొలగిపోయాయి. నాలుగు దిక్కుల్లో వేదనాదాలు మిన్నంటాయి. ఇతర ధర్మాలనే చుక్కలు మాసిపోయాయి. రాక్షసుల కలువ కళ్ళు మూతలుపడ్డాయి. సూర్యోదయమైంది. కనుక వనజాక్షా మేలుకో!' అంటూ అన్నమయ్య స్వామికి మేల్కొలుపు పాడారు.

### 3.5.3. మంగళాశాసనం

సర్వలోకాలకూ మంగళకరుడైన భగవంతునికే మంగళం పలకడం భగవంతుడిపై వాత్సల్య భక్తి భావనవల్ల అనుకోవచ్చు. భారతీయ సాహిత్యంలో మొదటిసారిగా ఈ విధమైన మంగళాశాసనం పెరియాళ్వారు చేసినట్లుగా కనిపిస్తుంది. *తిరుప్పల్లాండు* పేరుతో ఆయన 12 పాశురాలను రచించి భగవంతుడికి మంగళాశాసనం చేశారు. ఆళ్వారుల బాటలోనే నడిచిన అన్నమయ్యకూడా శ్రీవేంకటేశ్వరుడికి మంగళాశాసనం చేశారు.

*మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును*

*మంగళము సర్వాత్మునకు ధర్మస్వరూపునకూ – జయజయ*

*ఆదికిని నాదైన దేవున కచ్యుతున కంభోజనాభున-*
*కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని*
*వేదరక్షకునకును సంతతవేదమార్గవిహారునకు బలి-*
*భేదికిని సామాదిగానప్రియవిహారునకు*

*హరికిఁ బరమేశ్వరునకును శ్రీధరునకును గాలాంతకునకును*
*పరమపురుషోత్తమునకును బహుబంధదూరునకు*
*సురమునిస్తోత్రునకు దేవాసురగణశ్రేష్టునకు కరుణా-*
*కరునకునుఁ గాత్యాయనీ నుతకలితనామునకు*

*పంకజాసనవరదునకు భవపంకవిచ్ఛేదునకు భవునకు*
*శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు*
*వేంకటాచలవల్లభునకును విశ్వమూర్తికి నీశ్వరునకును*
*పంకజాకుచకుంభకుంకుమపంకలోలునకు* (1-46)

'గరుడధ్వజునికి, సర్వాత్మకునికి, ధర్మస్వరూపునికి, అచ్యుతునికి' అంటూ ఈ కీర్తనలో స్వామికున్న ఎన్నో పేర్లను, గుణాలను పేర్కొంటూ స్వామికి మంగళం కలగాలని కోరుకున్నారు. *క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికి నీరజాలయకును నీరాజనం (20-295)* అంటూ అమ్మవారికి కూడా మంగళాశాసనం చేశారు అన్నమయ్య.

### 3.5.4. లాలి – ఇతర సేవలు

అన్నమయ్య తన కీర్తనలలో శ్రీవేంకటేశ్వరునికి ఎన్నో నిత్య నైమిత్తిక సేవలను చేశారు.

జోజో యని మీరు జోల వాడరో (3-461)

*నిద్దిరించీఁ బాలజలనిధి వలెనే*
*ఒద్దిక శ్రీరమణునికి నొత్తరే పాదములు*

*యేగతిఁ బవళించెనో యెట్ల భోగించెనో*
*యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను*

*నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత*
*కాలము కన్నుల దిప్పీఁ గప్పరే దోమతెర*

*అరుదుగ సకలలోకారాధ్యుఁడాయె మించి*
*విరివి నాలవట్టాలు విసరరే సతులు* (4-570)

పై కీర్తనలలో 'అలసిన స్వామికి జోల పాడమని, పాదాలను ఒత్తమని, ఉయ్యాలను ఊచమని, దోమతెరను కప్పమని, విసనకర్రలు వీచ'మని అన్నమయ్య ప్రజలకు బోధించారు.

## 3.6. వందన భక్తి

రెండు చేతులూ జోడించి నమస్కరించటమే వందనభక్తి. అన్నమయ్య తన కీర్తనల్లో అనేక సార్లు వందనభక్తిని ప్రదర్శించి, ప్రవచించారు. వందనభక్తి ఫలాన్ని ఉగ్గడించారు.

### 3.6.1. ఫలితం

*త్వదఙ్ఘ్రిముద్దిశ్య కదాపి కేనచిద్యథా తథా వాఽపి సకృత్కృతోఽఞ్జలిః ।*
*తదైవ ముష్ణాత్యశుభాన్యశేషతశ్శుభాని పుష్ణాతి న జాతు హీయతే ॥* (Rajajee, M. S. 2001:44 – [Stotra Ratna-28th shloka])

‘ఎవరైనా ఏ పద్ధతిలోనైనా, ఏ సమయంలోనైనా చేతులు జోడించి నీ పాదకమలాలకు నమస్కరిస్తే, వారి దోషాలన్నీ ఆ క్షణంలో తొలగిపోయి, నిరంతరం శుభాలు కలుగుతాయి’ అని యామునాచార్యులు అన్నారు.

*నలినాక్ష నీకు నమస్కరించిన-*
*ఫలము వొగడ నిఁక బ్రహ్మకు వశమా* (3-131)

అన్నమయ్య ‘స్వామి వారికి నమస్కరిస్తే కలిగే ఫలితాన్ని నాలుగు ముఖాలు కలిగిన బ్రహ్మ దేవుడుకూడా వర్ణించలే’డన్నారు.

*మొదల శ్రీవేంకటపతికినిఁ జేయెత్తి మొక్కిన మాత్రములోపలనే*
*పదిలపు షోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును*
*వదలక సాంగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా పలుమారు*
*మదిమదినుండే కాయక్లేశము మాఁటికి మాఁటికిఁ దనకేలా* (2-236)

‘భగవంతుడికి భక్తితో ఒక్కసారి నమస్కరించిన మాత్రంచేతనే షోడశదానాలు, పంచమహాయజ్ఞాలు చేసిన ఫలితం కలుగుతుం’దని అన్నమయ్య వందన ఫలాన్నిగురించి ఈ కీర్తనలో చెప్పారు.

భారతీయ సంస్కృతిలో *షోడశ* – పదహారు సంఖ్యకు ప్రాముఖ్యత ఉంది. షోడశ ఉపచారాలు, షోడశ కర్మలు, షోడశ కళలు...ఈ వరసలో షోడశ దానాలు కూడా ఉన్నాయి. ఈ షోడశ దానాల గురించి పారమార్థిక పదకోశంలో ఇలా ఉంది.

షోడశ దానాలు –

1. భూమి 2. ఆసనం 3. జలం 4. వస్త్రం 5. దీపం 6. అన్నం 7. తాంబూలం 8. ఛత్రం 9. గంధం 10. పుష్పమాల 11. ఫలం 12. శయ్య 13. పాదుకలు. 14. గోవు 15. బంగారం 16. వెండి. (వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2002:259)

అలాగే, పంచమహాయజ్ఞాలు –

1. బ్రహ్మయజ్ఞము – ఒక ఋక్కును కాని యజుస్సునుకాని సామాన్ని కాని శక్తికొలది నిత్యం అభ్యసించటం.

2. దేవయజ్ఞము – దేవతల తృప్తికోసం అగ్నిలో హవిస్సులతో హోమం చేయడం.

3. పితృయజ్ఞము – పితృదేవతల ప్రీతికోసం తర్పణంచేసి ద్విజులకు భోజనం పెట్టడం.

4. మనుష్యయజ్ఞము – శక్తికొలది అతిథులకు అన్నం పెట్టడం.

5. భూతయజ్ఞము – వైశ్వదేవానుష్ఠానం తరువాత ఆరుబయట భూతతృప్తికోసం బలి యివ్వటం.

(వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2002:159)

వీటన్నిటినీ ఆచరించిన ఫలం త్రికరణశుద్ధిగా ఒక నమస్కారం చేసినంత మాత్రాన కలుగుతుందని చెప్పారు అన్నమయ్య.

### 3.6.2. ప్రవచనం

షోడశదానాల, పంచమహాయజ్ఞాల ఫలాన్ని ప్రజలందరూ పొందాలని కాంక్షించి, వందనభక్తిని ప్రవచించారు అన్నమయ్య.

*మొక్కరె మొక్కరే మీరు ముందు ముందే జయ లిడి*

*దక్కి శ్రీవేంకటేశుఁడే తానైన దేవునికి* (2–379)

*సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో*

*వావిరిఁ బ్రహ్లాదునికి వరదుఁడు వీఁడే* (4–500)

ఈ కీర్తనలలో అన్నమయ్య చేతులెత్తి స్వామికి నమస్కరించమని లోకులకు ప్రబోధించారు.

### 3.6.3. ప్రదర్శనం

అన్నమయ్య అనేక కీర్తనల్లో స్వయంగా వందనభక్తిని ప్రదర్శించారు.

*నవనీతచోర నమో నమో*

*నవమహిమార్ణవ నమో నమో*

*హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ*

*నరసింహ వామన నమో నమో*

*మురహర పద్మనాభ ముకుంద గోవింద*

*నరనారాయణరూప నమో నమో*

*నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ*

*నగధర నందగోప నమో నమో*

*త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక–*

*నగరాధినాయక నమో నమో*

*వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర*

*నాకేశవందిత నమో నమో*

*శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర*

*నాకజననుత నమో నమో* (3–24)

*వందే వాసుదేవం*

*బృందారకాధీశ వందిత పదాబ్జం* (1–53)

*కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద*

*మూశిన ముత్తెమువలె మొక్కేము నీకు* (2–365)

పై కీర్తనలలో దశావతారాలను, స్వామి నామాలను, గుణాలను ప్రస్తావిస్తూ స్వామికి నమస్కృతులు సమర్పించారు అన్నమయ్య. 'మూశిన ముత్యంలాగ నీకు నమస్కరిస్తున్నాం' అంటారు అన్నమయ్య. అంటే వినయభక్తితో నమస్కరిస్తున్నట్లుగా అర్థం.

### 3.7. దాస్య భక్తి

విశిష్టాద్వైత మౌలిక సిద్ధాంతాలలోనే వినయం, కార్పణ్యం, అహంకార నిరసనం మొదలైన లక్షణాలు ఉన్నాయి. తమను తాము తక్కువగా చేసుకుని, ప్రపంచమంతటినీ భగవత్స్వరూపంగా భావిస్తారు విశిష్టాద్వైతులు. కనుకనే మరొక భాగవతుడిని చూడగానే *అడియేన్* అంటూ నమస్కరిస్తారు. *అడియేన్* అన్న మాటకు 'పాద సేవకుడను' అని అర్థం. 'నేను పాదసేవకుడను' అని కాకుండా ఉట్టి 'పాదసేవకుడను' అని మాత్రమే అంటారు. 'నేను' అన్నది అహంకారసూచిక కనుక అంతగా 'నేను' అన్న భావనను తృణీకరిస్తారు శ్రీవైష్ణవులు. భగవంతుడిపట్ల, భాగవతులపట్ల, ఆచార్యులపట్ల భక్తులు దాస్య భావం కలిగి ఉండటం విశిష్టాద్వైత భక్తిలో కీలకమైన భాగం.

తొండరడిప్పొడి ఆళ్వారు, పెరియాళ్వారు మొదలైన భక్తులు నిరంతరం శ్రీమహావిష్ణువుకు పూలమాలా కైంకర్యం చేస్తూ, దాస్య భక్తికి నిదర్శనంగా నిలిచారు.

*అడియో మోడుం నిన్నోడుం పిరివిన్ని ఆయిరం పల్లాణ్డు* (రాఘవన్, టి. కె. వి. 2017:5 – [తిరుప్పల్లాండు-2వ పాశురం]) – 'మేము నీకు దాసులము, నీవు మాకు స్వామివి. మన బంధం జన్మజన్మాంతరాలలో ఎడబాటులేక వేలాది సంవత్సరాలు నిత్యంగా ఉండుగాక' అంటారు *తిరుప్పల్లాండు* లో పెరియాళ్వారు.

విశిష్టాద్వైతి అయిన అన్నమయ్యకూడా అనేక కీర్తనలలో భాగవతులపట్ల, భగవంతుడిపట్ల దాస్య భావాన్ని ప్రదర్శించారు. అన్నమయ్య స్వయంగా దాస్య భావనను ప్రదర్శించినా, ప్రవచించినా, దాస్య భక్తి వల్ల కలిగే ప్రయోజనాన్ని ఉగ్గడించినా, దాసోహం అంటూ ప్రకటించుకున్నా దాస్య భక్తికి సంబంధించిన కీర్తనగా తీసుకోవడం జరిగింది. భజించు, సేవించు, కొలుచు మొదలైన పదాలను దాస్యార్థంలో తీసుకోవడం జరిగింది.

*తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు యెక్కడా మోక్షోపాయ మింకఁ జెప్ప నున్నదా* (2-170) అని దాస్యం కంటే మోక్షోపాయం వేరే లేదని అన్నమయ్య అభిప్రాయం.

### 3.7.1. ప్రకటనం

*దాసోహం* అనడం అహంకార నిరాకరణ. 'నీ దాసుడను' అని భగవంతుడికి నివేదించడం, శ్రీపతి దాసుడను అని చెప్పుకోవడం దాస్య భక్తి.

*ఎన్నాళ్ ఎంబెరుమాన్ ఉన్దన క్కడియో మెన్దెళత్తుప్పట్ట*
*వన్నాళే అడియోంగ ళడిక్కుడిల్ వీడు పెత్తు ఉయ్న్దదుకాణ్* (రాఘవన్, టి. కె. వి. 2017:8 – [తిరుప్పల్లాండు-10వ పాశురం])

'నా స్వామీ! ఏనాడైతే నీకు దాసులం అనే మాట అన్నామో, ఆనాడే మా ఇంటిల్లిపాది జీవితాలూ ధన్యతను పొందాయి' అంటారు పెరియాళ్వారు.

అన్నమయ్య కూడా అనేక కీర్తనల్లో స్వామి వారికే కాక, స్వామి వారి దాసుల దాసులకుకూడా దాసుడనని వినమ్రంగా చాటుకున్నారు.

*జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము*
*శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను* (4–113)

'మంచి, చెడు, జ్ఞానం, అజ్ఞానం ఇవేమీ మాకు తెలియవు. ఓ శ్రీనివాసా! నీ సేవకుడిని నేను.'

*తగు హరిడింగరీఁడ దాసుఁడ బంటననేటి–*
*మిగులఁ బెద్దతనము మించేది మాకు* (4–236)

'హరి సేవకుడిని, బంటును, దాసుడిని అని చెప్పుకునే అదృష్టం మాది.'

*ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు*
*ఆతని బంట్లము మాకు నన్నిటా నిశ్చింతము* (2–237)

'ఆ ఆదినారాయణుడే మాకు యజమాని. అతనికి మేము సేవకులం. ఇంక మాకు చింతలేమున్నాయి? అంతా నిశ్చింతే!'

*నీదాసుల బంటుబంట నయ్యేనిఁకను* (3–51)

'స్వామీ! నీ దాసానుదాసులకు దాసుడను నేను.'

### 3.7.2. ప్రవచనం

*నిత్యసుఖానంద మిదె నీ దాస్యము* (4–78) అంటూ అన్నమయ్య దాస్య మహిమ తెలిసినవాడై *కొలువుఁడీ భక్తిఁ గొండలకోనేటినిలయుని శ్రీనిధియైనవాని* (1–44) అంటూ లోకులకు దాస్యభక్తినిగురించి ప్రవచించారు.

*అలరిన చైతన్యాత్మకుఁడెవ్వఁడు*

*కలఁ డెవ్వఁ డెచటఁ గలఁడనిన*

*తలఁతు రెవ్వనినిఁ దనువియోగదశ*

*యిల నాతని భజియించుఁడీ*

*కదిసి సకలలోకంబులవారలు*

*యిదివో కొలిచెద రెవ్వనిని*

*త్రిదశవంద్యుఁడగు తిరువేంకటపతి*

*వెదకి వెదకి సేవించుఁడీ* (1-5)

'మరణించే సమయంలో ప్రాణులు ఎవరిని తలుచుకుంటారో, జీవులందరి ఆత్మలలో ఉంటూ వారికి చైతన్యానిచ్చేవాడెవరో, సకలలోకారాధ్యుడెవరో, దేవతలందరికీ ఆరాధ్యుడెవరో అతడిని వెతికివెతికి మరీ సేవించ'మని ప్రబోధించారు అన్నమయ్య.

### 3.7.3. ప్రదర్శనం

ఈ కింది కీర్తనలో అన్నమయ్య దాస్య భావం ప్రకటితమవుతోంది.

*ఎన్నఁడుఁ జెడనియీవు లిచ్చీని మాధవుఁడు*

*పన్నిన యాసలితని పై పై నిలుపవో*

*కొననాలుకా హరిగుణములే నుడుగవో*

*మనసా అతని దివ్యమహిమెంచవో*

*తనువా శ్రీపతితీర్థ దాహమే కోరవో*

*యెనలేని అడియాస లేఁటికి నీ కిఁకను*

*వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో*
*ఆనిన చేతులితని కంది మొక్కరో*
*కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో*
*యీనేటి పాపాలబారి నేల పడేవిఁకను*

*నలిఁ బాదాలాల హరినగరికే నడవరో*
*కలభక్తి యాతనిపై ఘటియించవో*
*చలమా శ్రీవేంకటేశు సంగతినే వుండవో*
*యెలయింపుఁ గోరికల కేల పారే విఁకను* (4–14)

పై కీర్తనలో, 'నాలుకా! హరిగుణాలనే పొగడు. మనసా! అతని దివ్యమహిమలే తలచుకో. శరీరమా! శ్రీపతి తీర్థదాహమే కోరుకో. చెవులారా! విష్ణుకథలనే నిరంతరం వినండి. చూపులారా! కమలాక్షుడినే చూడండి. పాదాలారా! హరిమందిరానికే నడవండి. చిత్తమా! శ్రీవేంకటేశుడిపై భక్తి కలిగి ఉండు' అంటూ అన్నమయ్య తన సర్వేంద్రియాలద్వారా కూడా సమర్పణభావాన్ని, దాసభావాన్ని ప్రకటించారు. తన ఇంద్రియాలన్నిటినీ హరిసేవకే ఉపయోగపడమని బోధించారు. ఇదే భావాన్ని కులశేఖరాళ్వారులో కూడా గమనించవచ్చు.

*జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం*
*పాణిద్వంద్వ సమర్చ యాచ్యుతకథా శ్రోత్రద్వయ త్వం శృణు*
*కృష్ణం లోకయ లోచనద్వయ హరే ర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం*
*జిఘ్ర ఘ్రాణ! ముకుంద పాదతులసీం మూర్ధ న్నమాధోక్షజమ్* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:90 – [ముకుందమాల–16వ శ్లోకం])

'ఓ నాలుకా! కేశవుడిని కీర్తించు. ఓ మనసా! మురారిని భజించు. ఓ చేతులారా! శ్రీధరుడిని అర్చించండి. ఓ చెవులారా! అచ్యుతుని కథలను వినండి. ఓ కన్నులారా! కృష్ణుని చూడండి. ఓ

పాదాలారా! హరి మందిరమునకు నడువండి. ఓ నాసికా! ముకుందుని పాదతులసిని వాసన చూడు. ఓ శిరమా! అధోక్షజునకు నమస్కరించు.'

### 3.8. సఖ్య భక్తి

భగవంతుడిపట్ల స్నేహభావ ప్రదర్శనే సఖ్య భక్తి. ఇటువంటి భక్తికి ఉదాహరణగా రామావతార కాలంలో సుగ్రీవ, విభీషణాదులను, కృష్ణావతార కాలంలో అర్జున, కుచేలులను చెబుతారు. అయితే భగవంతుడిపట్ల దాసభావాన్ని ప్రదర్శించడమే విశిష్టాద్వైత మత లక్షణం. కనుక ఆ మతానుయాయి అయిన అన్నమయ్య సఖ్య భక్తిని ప్రదర్శించే కీర్తనలు పెద్దగా కనపడవు. అయితే భగవానుడి సఖ్యభక్తి స్వభావాన్నిగురించి, అర్జునుడి సఖ్య భక్తినిగురించి కొన్ని కీర్తనలలో ప్రస్తావించారు అన్నమయ్య.

*పెంచఁబెంచ మీఁదఁ బెరిగేటి చెలిమి*
*ఇంచుకంత తాలిముల కెడలేని చెలిమి*
*అంటుముట్టులేక మనసులంటుకొన్న చెలిమి*
*కంటఁగంట నవ్వించేఘనమైనచెలిమి*
*వెంటవెంటఁ దిరిగాడు వెఱ్ఱిగొన్న చెలిమి*
*యింటివారిచిత్తములకు నెడరైనచెలిమి*

*చెక్కుచెమట పెక్కు వలనే చిక్కనైన చెలిమి*
*యెక్కడౌటా తమ్ముఁదమ్ము నెఱఁగనీని చెలిమి*
*చక్కఁదనమే చిక్క మేనుచిక్కినట్టి చెలిమి*
*లెక్కలేని యాసలెల్లా లేఁతలయిన చెలిమి*

*అంకురించినట్టితలఁపు లధికమయిన చెలిమి*

*లంకెలయినయాసలెల్లా లావుకొన్న చెలిమి*

*వేంకటాద్రివిభునిఁ గూడి వేడుకయిన చెలిమి*

*పంకజాననలకెల్లఁ బాయరానిచెలిమి* (1-29)

ఈ కీర్తనలో వేంకటేశ్వరుడితో చెలిమి ఏ విధమైనదో వివరించారు అన్నమయ్య. 'మైలలతో, క్షమలతో పనిలేని చెలిమి; తమను తాము మరచిపోయేంత గాఢమైన చెలిమి, కళ్ళతోనే నవ్వించే చెలిమి' అంటూ శ్రీవేంకటేశ్వరుడి చెలిమిని కీర్తించారు.

కృష్ణార్జునుల మైత్రి లోకంలో ప్రసిద్ధి చెందింది. అర్జునుడితో తన స్నేహాన్ని గురించి శ్రీకృష్ణుడి మాటలను గమనిస్తే వారి స్నేహం ఎంత గాఢమైనదో స్పష్టమవుతుంది.

*సఖుఁడు సంబంధి శిష్యుండు*

*సవ్యసాచి నాకు నతనికి నై యేను నరవరేణ్య*

*కూర్మిమై నిత్తుఁగండలు గోసియైన*

*నరయ నాతండు నా యెడ నట్టివాఁడ* (తిక్కన. 1989. సంపుటం-3:100 –

[ఆంధ్రమహాభారతము-భీష్మపర్వం-తృతీయాశ్వాసం-283వ పద్యం])

'అర్జునుడు నాకు సఖుడు, బంధువు, శిష్యుడు. అతడి కోసం నేను నా శరీరాన్ని అయినా ఇష్టంగా కోసి ఇస్తాను. అతడికికూడా నాపట్ల అటువంటి అభిమానమే ఉంది' అంటాడు కృష్ణుడు. అటువంటి వీరి మైత్రీబంధాన్ని కింది కీర్తనలో వర్ణించారు అన్నమయ్య.

*బలువగుఁ దనరూపము చూపెన్*

*కలదింతయుఁ దనఘనతెఱిఁగించెన్*

*పాండవరక్షణపరుఁడై నరునకు*
*నండనే తెలిపె మహామహిమ*
*దండి విడిచి తనదయతో నర్జును–*
*డుండఁగ మగటిమి నొదఁబడఁ బలికె*

*మగుడఁగ కులధర్మములుఁ బుణ్యములు*
*తెగి పార్థున కుపదేశించెన్*
*నగుచు నతనితో నానాగతులను*
*నిగమము నియమము నిజమెరిఁగించెన్*

*వెరవుమిగుల నావిజయునిమనుమని*
*పరీక్షిత్తుఁ దగఁ బ్రదికించెన్*
*తిరువేంకటగిరిదేవుఁడు దానై*
*గరిమల భారతకథ గలిగించెన్* (1–295)

'శ్రీకృష్ణుడు అర్జునుడికి తన విశ్వరూపాన్ని చూపించాడు; తన అనుభవసారమైన భగవద్గీతను బోధించాడు. పాండవులందరూ బాంధవ్యపరంగా తనకు సమానులే అయినప్పటికీ, అర్జునుడిపట్ల కృష్ణుడికి సఖ్యభావం మెండు. ఆ సఖ్యభావంతోనే అర్జునుడికి నిరంతరం అండగా ఉండి ఎన్నో సార్లు తన మహిమను చూపించాడు. సైంధవవధ సమయంలో సూర్యుడికి తన చక్రం అడ్డు వేసి, అర్జునుడి ప్రతిజ్ఞ, పర్యవసానంగా ప్రాణం నిలబెట్టాడు. భగవద్గీతలో భాగంగా కులధర్మాన్ని ఉపదేశించాడు. నవ్వుతూనే, అతనితో కలిసి మెలసి ఉంటూనే అతనికి వేదాలు, నియమాలు, ధర్మాలు ఉపదేశించాడు. అందరికీ ఆశ్చర్యం కలిగించే రీతిలో గర్భస్థ శిశువుగా ఉండి మరణించబోతున్న అర్జునుడి మనుమడైన పరీక్షిత్తును

కాపాడాడు.' ఈ విధంగా సఖ్య భక్తి పాటించడంవలన అర్జునుడికి కలిగిన ఫలితాన్ని, సఖ్యభక్తి గొప్పతనాన్ని ఈ కీర్తనలో ఉగ్గడించారు అన్నమయ్య.

### 3.9. ఆత్మనివేదన భక్తి

ఆత్మనివేదనం విశిష్టాద్వైతంలో శరణాగతిగా పేరు పొందింది. దీనినే ప్రపత్తి, భరన్యాసం అని కూడా అంటారు. భక్తిమార్గాలన్నిటిలోనూ ఆత్మనివేదన రూపంలో ఉండే ప్రపత్తే శ్రీవైష్ణవులకు అతి విశిష్టమైనది. ఆత్మనివేదనకు సంబంధించి అన్నమయ్య కీర్తనలు సంఖ్యాపరంగాకూడా ఎక్కువగా కనిపిస్తాయి.

భారతీయ సంస్కృతిలో మానవ జీవితానికి అంతిమ లక్ష్యమైన మోక్షానికి మార్గాలుగా కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలను అవలంబించారు మన ప్రాచీనులు. ఇవన్నీ ఆచరణకు కష్టసాధ్యంగా తెలుసుకొని, చివరకు ప్రపత్తిని మోక్షానికి ఏకైన శరణోపాయంగా, సులువైన ఉపాయంగా శ్రీవైష్ణవులు ధ్రువీకరించారు. కనుక, ప్రపత్తి శ్రీవైష్ణవంలో ప్రముఖమైన స్థానాన్ని కైవసం చేసుకుంది.

వేదాంత దేశికులు *శరణాగతి దీపిక* లో ప్రపత్తిని గురించి ఇలా అంటారు.

*ఉద్బాహుభావమపహాయ యథైవ ఖర్వః*
*ప్రాంశుం ఫలార్థమభియాచతి యోగిచిన్త్య ।*
*ఏవం సుదుష్కరముపాయగణం విహాయ*
*స్థానే నివేశయతి తస్య విచక్షణస్త్వామ్ ॥* (Vedanta Desika. 1973:100 – [శరణాగతి దీపిక –25వ శ్లోకం])

'ఒక మరుగుజ్జువాడికి ఒక చెట్టుకొమ్మ మీదున్న పండు తినాలని కోరిక తీవ్రంగా కలిగింది. అతడు చాలా పొట్టివాడు. పండు అతనికి అందనంత ఎత్తులో ఉంది. కాని, అతడు

తెలివైనవాడు. కనుక, స్వప్రయత్నంతో కాలం వృథా చేయకుండా, ఒక పొడవైన వ్యక్తిని పండు కోసివ్వమని అడిగి, ఆ విధంగా పండును అనుభవించాడు. అలాగే, ఒక జ్ఞాని కర్మ, జ్ఞాన, భక్తి యోగాలు కష్టసాధ్యమని తెలుసుకున్నవాడై ఆ మార్గాల్లో వెళ్ళక, ప్రపత్తిని అవలంబించి మోక్షఫలాన్ని అందుకుంటాడు.'

ఆళ్వారుల మొదలుకొని, ఆచార్యుల దాకా అందరూ ప్రపత్తిని మోక్షోపాయంగా అంగీకరించి, ఆచరించినవారే.

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ*
*అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:358 – [భగవద్గీత–18వ అధ్యాయం–66వ శ్లోకం])

'సమస్త ధర్మాలను విడిచిపెట్టి నన్ను మాత్రమే శరణు వేడు. నీ పాపాలన్నిటినుండి నీకు విముక్తి కలిగిస్తాను' అని శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా చెప్పిన వాక్యమే ప్రపత్తి స్వభావంగా అంగీకరించారు. సర్వధర్మాలను, ఇతర ఉపాయాలను విడిచి, పరమాత్ముడే గతి అని ఉండటమే ప్రపత్తి.

ప్రపత్తిని గురించి నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు అన్న మాటలు (రఘునాథాచార్యులు, న. చ. 1992:160) ప్రపత్తి స్వభావాన్ని మరింత విశదీకరిస్తాయి. "అహంకారపూరితమైన ఆ స్వప్రవృత్తిని పూర్తిగా మానుకునియే భగవంతునిపై సంపూర్ణముగా భారము వేయుట అనునది శరణాగతికి సమగ్ర స్వరూపము. ఇతర ధర్మములను గూడ చేయుచూ శరణాగతిని అనుష్ఠించుట స్వరూప విరుద్ధము. నన్ను నేను రక్షించుకొనగలను అను అభిమానమును ప్రకృతితోసహా పూర్తిగా విడిచియే సర్వరక్షకునిపై భారము నుంచవలెను"

ఇదే భావాన్ని వేదాంత దేశికులు *పాదుకా సహస్రం* లో ఇలా పేర్కొన్నారు.

*సాధయన్తి మురవైరిపాదుకే సాధవః స్థిర ముపాయ మన్తిమమ్।*

*త్వత్ప్రవృత్తి వినివర్తనోచితస్వప్రవృత్తి వినివర్తనాన్వితమ్ ॥*

(అణ్ణఙ్గరాచార్యులు. 1948:72 – [పాదుకా సహస్రము–879వ శ్లోకం])

'ఓ పాదుకా! సాధువులకు మోక్షాన్ని ప్రసాదించే సాధనానివి నీవు. కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలను అవలంబిస్తే నువ్వు మౌనంగా ఉంటావని వారు గ్రహిస్తారు. ఇతరమైన ఉపాయాలన్నిటినీ విసర్జిస్తేనే నువ్వు మోక్షానికి దారి చూపుతావు. అలా విసర్జించి, శరణు వేడితే, నీవు ప్రపత్తిని మోక్షోపాయంగా చూపి అనుగ్రహిస్తావు.'

ప్రపత్తి లేక శరణాగతి ఆరు విధాలుగా ఉంది.

*అనుకూలస్య సంకల్పః ప్రాతికూల్యస్య విసర్జనం*
*రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా*
*ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః* (వరదాచార్యులు, ధనకుధరం. 1972:241)

1. అనుకూల్య సంకల్పం 2. ప్రాతికూల్య వర్జనం 3. రక్షిష్యతీతి విశ్వాసం 4. గోప్తృత్వవరణం 5. కార్పణ్యం 6. ఆత్మనిక్షేపం. పాంచరాత్రాగమంలోని అహిర్బుధ్న్య సంహిత (37–18) లో ఈ షడ్విధ శరణాగతి గురించి ఉంది (వరదాచార్యులు, ధనకుధరం. 1972:241). ఈ షడ్విధ శరణాగతిలో అనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, రక్షిష్యతీతి విశ్వాసం, గోప్తృత్వవరణం, కార్పణ్యం అంగాలుకాగా, ఆత్మనిక్షేపం అంగిగా పరిగణించబడుతోంది. అందుకే ఆత్మనివేదన లేక శరణాగతిని షడాంగయోగంగా పేర్కొంటారు.

షడాంగ శరణాగతిని గురించి వేదాంత దేశికులు ఇలా పేర్కొన్నారు.

*త్వత్ప్రాతికూల్యవిముఖాః స్ఫురదానుకూల్యాః*
*కృత్వా పునః కృపణతాం విగతాతిశఙ్కాః ।*

*స్వామిన్ భవ స్వయముపాయ ఇతీరయన్తః*

*త్వయ్యర్పయన్తి నిజభారమపారశక్తౌ* ॥(Vedanta Desika. 1973:100 – [శరణాగతి దీపిక –27వ శ్లోకం])

'భగవంతుడికి ప్రతికూలమైన విషయాల పట్ల విముఖత (ప్రాతికూల్య వర్జనం), భగవంతుడికి అనుకూలమైన విషయాలపట్ల నిశ్చయం (అనుకూల్య సంకల్పం), తమ అసహాయతను, అశక్తతను ప్రకటిస్తూ భగవంతుని కృపాకటాక్షాలకై వేడుకోవటం (కార్పణ్యం), భగవంతుడు తమను రక్షిస్తాడనే మహావిశ్వాసం కలిగి ఉండటం (రక్షిష్యతీతి విశ్వాసం), తమ రక్షకుడిగా భగవంతుడిని ఎంచుకోవడం (గోప్తృత్వవరణం) అనే విషయాలు అంగాలుగా, కడకు తమ రక్షణ భారాన్ని భగవంతునిపై వేయటం (ఆత్మనిక్షేపం) అనే విషయం 'అంగి'గా ఉన్న షడాంగ శరణాగతి'ని గురించి వివరించారు.

విశిష్టాద్వైతి అయిన అన్నమయ్యకూడా అనేక కీర్తనలలో షడ్విధశరణాగతిని ప్రకటించారు.

### 3.9.1. అనుకూల్య సంకల్పం

భగవంతుడి సేవకు అనుకూలంగా భక్తుడు తనను తాను మలచుకోవడం. భగవంతుడి దిశగా తీసుకెళ్ళే పనులను చేయడం, భగవద్విషయంలో మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం అనుకూల్య సంకల్పం. భగవంతుడి వైపు పూర్తిగా మళ్ళే ముందు, ప్రాథమికంగా తనను తాను బాహ్యంగా, మానసికంగా భగవదనుకూలంగా మలచుకోవడం భక్తుడు చేయవలసిన మొదటి పని. బాహ్య విషయాలలో భాగంగా, సాత్వికమైన ఆహారాన్ని స్వీకరించడం, ఊర్ధ్వ పుండ్రాలను ధరించడం, భాగవతులతో సాంగత్యం కలిగి ఉండడం; మానసికంగా అరిషడ్వర్గాలను నియంత్రించి, సాత్వికమైన, భగవత్సంబంధమైన ఆలోచనలు కలిగి ఉండడం ఇందులో ప్రధానాంశాలు.

*నెయ్యిడై నల్లదోర్ శోరుం నియతముం అత్తాణి చ్చేవగముం*

*కైయడై కాయుం కళుత్తుక్కు పూణొడు కాదుక్కు క్కుండలముం*

*మెయ్యిడ నల్లదోర్ శాందముం తందు ఎన్నై వెళ్ల యిరాక్క వల్ల* (రాఘవన్, టి. కె. వి. 2017:8 – [తిరుప్పల్లాండు-8వ పాశురం])

'నేతితో కూడిన రుచ్యమైన ప్రసాదం, భగవత్సేవాభాగ్యం, స్వయంగా భగవంతుడి చేతితో తాంబూలం, కంఠాభరణాలు, చెవులకు కుండలాలు, మేనిపూతకు తగిన మృదువైన చందనం ఇచ్చి భగవంతుడు నా వంటివాడిని సాత్త్వికుడిగా చేశాడు' అని *తిరుప్పల్లాండు* లో పెరియాళ్వారు పేర్కొన్నారు.

*ఉడుత్తు క్కళైనంద నిన్ పీదగవాడై ఉడుత్తు క్కలత్తదు ఉండు*

*తొడుత్త తుళాయ్ మలర్ శూడిక్కళైందన శూడుం ఇత్తొండర్ గళోమ్* (రాఘవన్, టి. కె. వి. 2017:8 – [తిరుప్పల్లాండు-9వ పాశురం])

'నీవు ధరించి విడిచిన పీతాంబరం ధరించి, నీ భోజనపాత్రలో మిగిలింది ప్రసాదంగా తీసుకొని, నీకు అలంకరించి తీసేసిన తులసిదళాలమాలలు తలపై ధరించు దాసులం మేము' అంటారు పెరియాళ్వారు. ఈ పాశురాలలో పెరియాళ్వారు భగవదనుకూలమైన బాహ్య విషయాలను అవలంబించడం కనపడుతుంది.

*సొరిది మమ్మిట్టే దయఁజూతువు గాకా*

*వెరసి మరి యెక్కడా నేమి విన్నవించే మిఁకను*

*తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు*

*కలసితి నీదాసుల గమిలోనను*

*చలివాసె భవములు సడిదీరెఁ గర్మములు*

*యెలమి నీమహిమలు యేమి చెప్పే మిఁకను*

*నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి*

*చేముట్టి పూజించితి శ్రీయంగాలు*

*తామసములెల్లా నూడె తతివచ్చె సాత్వికము*

*గోమున మరేమి నిన్ను కొసరే మిఁకను*

*తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి*

*విరివైన నీకథలు వీనుల వింటి*

*పరగ శ్రీవేంకటేశ పరము నిహముఁ గంటి*

*అరసి యితర మేమి ఆశపడే మిఁకను* (2-257)

ఈ కీర్తనలో అన్నమయ్య అనుసరించినట్లుగా పేర్కొన్న భాగవతసాంగత్యం, భగవంతుడిని అనుక్షణం తలచుకోవడం, ముద్రాధారణం, భాగవత కథాశ్రవణం మొదలైన భగవదనుకూలమైన పనులవలన తనలో తామసమైన గుణాలు పోయి, సాత్వికత అలవాటయిందని పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా భక్తుడు శరణాగతికి సంసిద్ధంగా ఉంటాడు. ఇదే అనుకూల్య సంకల్పం.

### 3.9.2. ప్రాతికూల్య వర్జనం

*శ్రీ వేంకటాద్రీశుఁ జేరనిపనులెల్ల నేవగింతలే కాక యిందేమిగలదు* (1-150) అని అన్నమయ్యే చెప్పిన్నట్టు, భగవంతుని పట్ల శ్రద్ధాసక్తులను భంగపరిచే విషయాలను వర్జించటం, భగవంతుడినుండి దూరంగా తీసుకెళ్ళే పనులను, ఆలోచనలను వదిలిపెట్టడం ప్రాతికూల్య వర్జనం. *యద్భావం తద్భవతి* అన్నట్లుగా మన భావనలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయి. ఎప్పుడూ

భగవదనుకూలమైన ఆలోచనలతో ఉంటే, అవి భగవంతుడి వైపుగా తీసుకెళతాయి. భగవంతునికి వ్యతిరేకమైన ఆలోచనలు కలిగి ఉంటే అవి భగవంతుడినుండి దూరంగా తీసుకువెళతాయి. అందుకే కులశేఖరాళ్వారు ఇలా అంటారు:

*మాద్రాక్షం క్షీణపుణ్యాన్ క్షణమపి భవతో భక్తిహీనాన్ పదాబ్జే*
*మాశ్రౌషం శ్రావ్యబంధం తవ చరిత మపాస్యాన్య దాఖ్యానజాతమ్ ।*
*మా స్మార్షం మాధవ త్వామపి భువనపతే చేతసాపహ్నువానాన్*
*మా భూవం త్వత్సపర్యా వ్యతికరరహితో జన్మజన్మాంతరేఽపి ॥* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:82 – [ముకుందమాల–15వ శ్లోకం])

'ఓ మాధవా! నీ పాదకమలాలపై భక్తిలేనివారిని నేను చూడజాలను. నీ కథలను విడిచి ఇతర ప్రబంధాలను చెవులార వినను. నిన్ను మనస్సులోనైనా తిరస్కరించువారిని తలచుకోను. ఇతర జన్మలలోసైతం నిన్ను సేవించని జన్మ నాకు వద్దు' అంటారు. ఇక్కడ భగవంతుడికి ప్రతికూలమైన విషయాలుగా 1) భక్తులు కాని వారి దర్శనం 2) భగవతేతరమైన ప్రసంగాలను వినడం 3) భగవంతుడిని నిరసించే వారి స్మరణం మొదలైన వాటిని ప్రస్తావించారు.

*తవదాస్య సుఖైక సంగినాం*
*భవనేష్వస్త్వపి కీటజన్మమే*
*ఇతరావసథేషు మాస్మభూత్*
*అపిమే జన్మచతుర్ముఖాత్మనా* (Rajajee, M. S. 2001:78 – [Stotra Ratna-55th shloka])

'నిను సేవించే నీ దాసుల ఇంట్లో కీటకంగా జన్మించినా నాకు సమ్మతమే కాని నీ భక్తులు కాని వారింట్లో చతుర్ముఖ బ్రహ్మ పదవి లభించినా నాకొద్దు' అంటారు యామునాచార్యులు.

అన్నమయ్య భగవంతుడికి ప్రతికూలమైన ఆలోచనలను, ప్రవర్తనను విసర్జించే ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తుంది.

*ఏఁటికి నెవ్వరిపొందు యిస్సిరో చీచీ*
*నాటకములాల చీచీ నమ్మితిఁగా మిమ్మును*

*జవ్వనమదమ చీచీ చక్కఁదనమరో చీచీ*
*రవ్వైనరాజసగర్వమరో చీచీ*
*కొవ్వినమదమ చీచీ కూరిమియాసరో చీచీ*
*నవ్వులదేహమ చీచీ నమ్మితిఁగా మిమ్మును*

*సిరులచీఁకటి చీచీ సిలుగుసంపద చీచీ*
*వరవిభవమ చీచీ వాసిరో చీచీ*
*కరుణించెఁ దిరువేంకటగిరిపతి నన్ను*
*విరసవర్తన చీచీ వీడెఁగా మీ భారము* (1–195)

మోక్షమార్గంలో ప్రతిబంధకాలు, అంతఃశత్రువులు అయిన అరిషడ్వర్గాలను జయించటం ప్రాతికూల్య వర్జనమే! ఈ కీర్తనలో 'యవ్వనమదం, రాజసగర్వం, అహంకారం, కూరిమి ఆశలు, దేహభ్రాంతి, సిరిసంపదలపై వ్యామోహం మొదలైన విరసవర్తనలు కలిగిన తను భగవంతుడి దయవల్ల వాటిని విడిచిపెట్టినట్లు' అన్నమయ్య పేర్కొవడం కనిపిస్తుంది. అన్నమయ్య ప్రాతికూల్య వర్జనం చేసి ప్రపత్తి మార్గానికి సిద్ధమైనట్లుగా తెలుస్తోంది.

### 3.9.3. రక్షిష్యతీతి విశ్వాసం

భగవంతుడు తనను తప్పక రక్షిస్తాడనే అచంచలమైన విశ్వాసం కలిగి ఉండటం రక్షిష్యతీతి విశ్వాసం. రోగికి వైద్యుడిపై విశ్వాసం ఉంటేనే వైద్యం ఫలిస్తుందంటారు. అలాగే,

భక్తుడికి తను నమ్మిన భగవంతుడిపై, తన భక్తిమార్గంపై విశ్వాసం ఉంటేనే, అధ్యాత్మిక పథంలో ముందడుగు వేయగలుగుతాడు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని 'ఎవరి అండ చూసుకుని నన్నెదిరిస్తున్నా'వని ప్రశ్నించినపుడు, ప్రహ్లాదుడు నమ్మకంతో,

*బలయుతులకు దుర్బలులకు*
*బల మెవ్వఁడు? నీకు నాకు బ్రహ్మాదులకున్*
*బల మెవ్వఁడు ప్రాణులకును*
*బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:405 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–264వ పద్యం])

'బలవంతులకు, బలహీనులకు బలమెవరు? నీకు, నాకు, బ్రహ్మాదులకు బలమెవరు? సకలప్రాణులకు బలమెవరు? అతడే నాకుకూడా బలం' అని జవాబిచ్చాడు. తనను భగవంతుడు ఎలాగైనా రక్షిస్తాడనే విశ్వాసంతో ప్రహ్లాదుడు ఉండబట్టే, శ్రీమహావిష్ణువు ప్రహ్లాదుడిని కాపాడడానికి నరసింహాకృతి దాల్చి, *నానా జంగమస్థావరోత్కర గర్భంబుల నన్ని దేశముల* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:410 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–277వ పద్యం]) – 'సకల చరాచరజీవులలో, సమస్తమైన ప్రదేశాలలో' ప్రవేశించి తన భక్తుడిని కాచుకోవడానికి సిద్ధంగా ఉండవలసి వచ్చింది.

*తిరుమాలై* లో తొండరడిప్పొడి ఆళ్వారు ఇటువంటి విశ్వాసాన్నే వ్యక్తం చేశారు.

*అయ్యనే! అరంగనే! ఉన్నరుళెన్ను మాశై తన్నాల్*
*పొయ్య నేన్ వన్దు నిన్ఱేన్ పొయ్య నేన్ పొయ్య నేనే* (నరసింహాచార్యులు, కె. టి. యల్. 2009:38 – [తిరుమాలై–33వ పాశురం])

‘ఇక మీ సన్నిధే సర్వవిధ శరణ్యమని నమ్ముకున్నాను. శ్రీరంగనాథా! ఎన్ని దోషములున్నా నీవాడనని శరణు జొచ్చిన వాడిని రక్షింపక వదలను అని నువ్వు చేసిన ప్రతిజ్ఞే అన్ని విధాల అయోగ్యుడనైన నన్ను కాపాడక మానదు.’ తొండరడిప్పొడి ఆళ్వారు స్త్రీలోలత్వానికి గురయి, మోక్షపథాన్ని తప్పి భ్రష్టుడయ్యారు. తరువాత తన తప్పుల్ని తెలుసుకుని, భగవంతుడికి శరణాగతి చేసి, ‘ఎన్ని దోషాలున్నా నువ్వే శరణమని నమ్ముకున్నాను కనుక, నువ్వు నన్ను తప్పక రక్షిస్తా’వనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

*మా భీ ర్మందమనో విచింత్య బహుధా యామీశ్చిరం యాతనాః*
*నాఽమీ నః ప్రభవంతి పాపరిపవః స్వామీ నను శ్రీధరః ।*
*ఆలస్యం వ్యపనీయ భక్తిసులభం ధ్యాయస్వ నారాయణం*
*లోకస్య వ్యసనాపనోదనకరో దాసస్య కిం న క్షమః* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:66 – [ముకుందమాల–11వ శ్లోకం])

‘ఓ మందమనసా! యమయాతనలకు భయపడకు. పాపాలు అనే శత్రువులు మనను ఏమీ చేయలేవు. శ్రీధరుడు మనకు స్వామి కదా! ఆలస్యం చేయక భక్త సులభుడైన శ్రీమన్నారాయణుని ధ్యానించు. లోకుల దుఃఖాలను పోగొట్టువాడైన హరి తన దాసుడి కష్టాలను తీర్చలేడా?’ అంటూ కులశేఖరాళ్వారు స్వామి తనకు అండగా ఉంటాడనే నమ్మకాన్ని కనబరిచారు.

ఈ కీర్తనలో అన్నమయ్యకూడా తనకు భగవంతునిపై గల అనంతమైన విశ్వాసాన్ని ప్రకటించారు.

*ఇంకనేల నాకు వెరపింతమాట గలిగియు*
*సంకెలెల్లఁ బాసె నాస్వతంత్రము లొక్కటే*

*నేనెంత పాపబుద్ధినై నేరమెంత సేసినాను*
*కానీలే నన్నెలేవాఁడు కావఁగలఁడు*
*ఆనతిచ్చెఁ దొల్లె యాతఁ డదె చరమార్థమందు*
*మేనిదోసమెల్లఁ బాపి మేలొసఁగేననుచు*

*మట్టులేకతనినెంత మరచి నే వుండినాను*
*పుట్టించిన దేవుఁడే ప్రోవఁగలఁడు*
*గుట్టుచూపె తొల్లె తన గుణము పాండవులందు*
*గట్టిగాఁ దనవారైతే కాచుకుందు ననుచు*

*తప్పు నే నడచినాను తగిలి శ్రీవేంకటేశుఁ*
*డొప్పులు సేసి రక్షించ నొద్దఁగలఁడు*
*చెప్పనేల గోపికలు సేసిన దోసాలు దొల్లి*
*కప్పుక పుణ్యాలు సేసె ఘనుఁడఁ దాననుచు* (3-251)

'తానెంత పాపబుద్ధికలవాడనైనా, నేరములెన్ని చేసినా, చరమ శ్లోకంలో చెప్పినట్లుగా సర్వ ధర్మాలను పరిత్యజించి భగవంతుడి శరణు వేడితే, తనను తప్పక రక్షిస్తాడని; తాను దైవాన్ని మరచినా, తనను పుట్టించిన దైవం తన బాగోగులు చూసుకుంటాడని, తన వారిని రక్షించే గుణం స్వామికి ఉందని, అది పాండవుల విషయంలోనే ఋజువయిందని; కనుక, తాను తప్పులు చేసినా, ఆ తప్పుల్ని కాచి, ఒప్పులుగా చేస్తా'డని సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు అన్నమయ్య.

### 3.9.4. గోప్తృత్వవరణం

*అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ* (రఘునాథాచార్య, ఎస్. బి. 2012:19) – 'నాకు వేరే దిక్కు లేదు. నిన్నే శరణు వేడుతున్నాను, రక్షించ'మంటూ త్రికరణశుద్ధిగా భగవంతుడి వేడుకోవడం గోప్తృత్వవరణం.

*హే గోపాలక హే కృపాజలనిధే హే సింధుకన్యాపతే*
*హే కంసాంతక హే గజేంద్రకరుణాపారీణ హే మాధవ ।*
*హే రామానుజ హే జగత్త్రయగురో హే పుండరీకాక్ష మాం*
*హే గోపీజననాధ పాలయ పరం జానామి న త్వాం వినా* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:104 – [ముకుందమాల–21వ శ్లోకం])

స్వయంగా రాజైనప్పటికీ కులశేఖరాళ్వారు, 'నన్ను రక్షించు. నిన్ను తప్ప మఱి యెవరిని ఎఱుగను' అని జగత్ప్రభువైన ఆ పరమాత్మను వేడుకున్నారు.

*ఆరుళర్ కళైకణమ్మా! అరంగమానకరుళానే* (నరసింహాచార్యులు, కె. టి. యల్. 2009:34 – [తిరుమాలై–29వ పాశురం]) – 'నువ్వు తప్ప రక్షకులెవరున్నారు?' అన్నారు తొండరడిప్పొడి ఆళ్వారు.

*పితా త్వం మాతా త్వం దయిత తనయస్త్వం ప్రియసుహృ*
*త్త్వమేవ త్వం మిత్రం గురురసి గతిశ్చాసి జగతామ్ ।*
*త్వదీయస్త్వద్భృత్యస్తవ పరిజనస్త్వద్గతిరహం*
*ప్రపన్నశ్చైవం సత్యహమపి తవైవాస్మి హి భరః ॥* (Rajajee, M. S. 2001:84 – [Stotra Ratna-60th shloka])

'జగత్తంతటికీ నువ్వే తండ్రివి, నువ్వే తల్లివి, నువ్వే కొడుకువి, స్నేహితుడివి, ఆప్తుడివి, గురువువి, శరణ్యుడివి. నేను నీవాడను. నీ భృత్యుడను, నీ పరిజనుడను. ప్రపన్నుడను. నువ్వే నాకు గతి' అంటారు యామునాచార్యులు.

*మఱియెందూ గతిలేదు మనుప నీవే దిక్కు*
*జఱసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు*

*భవసాగరంబులోఁబడి మునిఁగిన నాకు*
*తివిరి నీనామమను తేపయే దిక్కు*
*చివికి కర్మంబనెడి చిచ్చు చొచ్చిన నాకు*
*జవళి నాచార్య కృపాజలధియే దిక్కు*

*ఘనమోహపాశముల గాలిఁ బొయ్యెడి నాకు*
*కొనల నీ పాదచింతకొమ్మయే దిక్కు*
*కనలి మనసనెడి యాకాసముననున్న నాకు*
*కనుఁగొనఁగ నీదాస్యగరుడఁడే దిక్కు*

*మరిగి సంసారమనెడి మంటికిందటి నాకు*
*ధర భక్తియను బిలద్వారమే దిక్కు*
*యిరవైన శ్రీవేంకటేశ యిన్నిటా నాకు-*
*నరుదైన నీవంతరాత్మవే దిక్కు* (2-146)

ఈ కీర్తనలో అన్నమయ్య 'తనకు వేరే గతి లేదని, రక్షించే దిక్కు భగవంతుడేనని, భవసాగరంలో పడి మునిగిన తనకు భగవంతుడి నామమనే తెప్పే దిక్కని, మోహపాశమనే సుడిగాలిలో చిక్కుకున్న తనకు భగవచ్చింత అనే కొమ్మే దిక్కని, సంసారం అనే మట్టికింద

ఉన్న తనకు భక్తి అనే బిలద్వారమే ది'క్కని పరిపరి విధాల భగవంతుడిని వేడుకోవడం కనపడుతుంది.

### 3.9.5. కార్పణ్యం

తన అల్పత్వాన్ని, అశక్తతను చాటుకుని, భగవంతుడి కృపను వేడుకోవడం కార్పణ్యం. శరణాగతి పొందదలచుకున్న భక్తుడికి ప్రధానంగా ఉండవలసిన లక్షణం కార్పణ్యం. అహంకార నిరసనమే కార్పణ్యం. 'నేను' అన్న మమకారం పోగొట్టుకుంటే భగవత్స్వరూపమైన లోకానికి దాస్య భావనతో సేవ చేయగలుగుతాడు. భక్తుడి అశక్తత, భగవంతుడి దయే తనను దరి చేర్చగలదనే భావన కార్పణ్యంలో వ్యక్తమవుతుంది.

*న ధర్మనిష్ఠోఽస్మి న చాత్మవేదీ*
*న భక్తిమాంస్త్వచ్చరణారవిన్దే ।*
*అకిఞ్చనోఽనన్యగతిశ్శరణ్య*
*త్వత్పాదమూలం శరణం ప్రపద్యే ॥* (Rajajee, M. S. 2001:38 – [Stotra Ratna-22nd shloka])

'ధర్మనిష్ఠ కలిగినవాడనుకాను, ఆత్మజ్ఞానిని కాను, భక్తిశ్రద్ధలు కలిగినవాడను కాను, దరిద్రుడను, నీవు తప్ప వేరే గతి లేని వాడను, నీ పాదాలనే శరణు వేడుతున్నాను' అంటూ యామునాచార్యులు *స్తోత్ర రత్న* లో కార్పణ్యాన్ని ప్రదర్శించారు.

*అమర్యాదః క్షుద్రశ్చలమతిరసూయాప్రసవభూః*
*కృతఘ్నో దుర్మానీ స్మరపరవశో వఞ్చనపరః ।*
*నృశంసః పాపిష్టః కథమహమితో దుఃఖజలధేః*
*అపారాదుత్తీర్ణస్తవ పరిచరేయం చరణయోః* (Rajajee, M. S. 2001:87 – [Stotra Ratna-62nd shloka])

'నియమాలు పాటించనివాడను, క్షుద్రుడను, చంచలమతిని, అసూయాగ్రస్తుడను, కృతఘ్నుడను, దురహంకారిని, మదనవశుడను, వంచనపరుడను, క్రూరుడను, పాపిష్ఠివాడను' అంటూ యామునాచార్యులు తనకు దశవిధమైన దోషాలున్నాయని చెప్పుకున్నారు. ఇటువంటి దుఃఖసముద్రంలో మునిగి ఉన్న తాను భగవానుడి పాదాలను చేరే దారేదని ప్రశ్నించారు. ఈ దోషాలన్నీ నిజంగా వారిలో ఉన్నాయని అర్థం చేసుకోకూడదు. ప్రజలందరి తరపున, ప్రతినిధిగా భగవంతుడిని వేడుకుంటున్నారనే అర్థాన్ని గ్రహించాలి.

రామానుజులు *శరణాగతి గద్య* లో

> *మనోవాక్కాయైః అనాది కాల ప్రవృత్తానంతా కృత్యకరణ కృత్యాకరణ భగవదపచార భాగవతాపచార సహ్యాపచార అసహ్యాపచార రూప నానావిధ అనంతాపచారాన్ కృతాన్, క్రియ మాణాన్, కరిష్యమాణాంశ్చ సర్వానశేషతః క్షమస్వ* (రామానుజ భట్టర్, కె. 2016:19 – [శరణాగతి గద్యమ్–22వ ఖండిక])

'మనోవాక్కాయకర్మలచేత తాను చిన్ననాటినుండి చేస్తూ వచ్చిన, చేస్తున్న, ఇకపై చేయబోయే అశేషమైన అపచారాలను క్షమించ'మని వేడుకున్నారు.

వేదాంత దేశికులు *దయా శతకంలో అహమస్మి అపరాధ చక్రవర్తీ* (జయప్రకాష్, ఎస్., వీరరాఘవన్, ఎల్. 2004:22 – [దయా శతకం–30వ శ్లోకం]) – 'దుర్గుణాలన్నిటికీ నేను చక్రవర్తిని' అని పేర్కొన్నారు. అన్నమయ్య కూడా ఇదే భావనను కింది కీర్తనలో వెలిబుచ్చారు.

> *అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను*
> *ప్రతిలేని ఘనగర్వపర్వతమను*
>
> *భావించి నావంటి నీచుఁ బట్టి కాచినప్పుడుగా*
> *యేవంక నీకీర్తి గడునెంతురు భువి* (3–48)

'నేను అతిమూర్ఖులలో మొదటివాడిని, గర్వపర్వతాన్ని. నా వంటివాడిని రక్షిస్తేనే కదా! భూమి మీద నీ కీర్తిని గురించి చెప్పుకుంటారు' అంటూ తన తక్కువతనాన్ని చెప్పుకున్నారు అన్నమయ్య.

తమంతవారు లేరని విర్రవీగి అహంకరించిన వారెందరో ఆ గర్వంతో పతనమయ్యారు. తాము గొప్పవారమనే భావన ఎదుటివారిని తక్కువ చేసే దృష్టిని కలిగిస్తుంది. ఎదుటి మనిషిని గౌరవించలేనప్పుడు, దాస్యభావంతో పూజించడమనేది అసాధ్యం. కనుక, తానే అందరికంటే తక్కువ వాడిననే వినయ భావన కలిగి ఉండాలనేది మహాపురుషుల జీవితాలనుండి నేర్చుకోవలసిన పాఠం.

హనుమంతుడు, సీతతో, సుగ్రీవుని సేనలో తనకంటే శక్తిమంతులే కాని తన కంటే తక్కువ వారు కాని, తనతో సమానులు కాని ఎవరూ లేరంటాడు. మనుషులతో సామ్యమే కుదరనప్పుడు ఇక పరమాత్ముడితో పోలిక చెప్పే పనే లేదు. ఈ భావనే పై మహాపురుషుల రచనలలో వ్యక్తమయింది.

అన్నమయ్య అనేక కీర్తనలలో కార్పణ్యాన్ని ప్రకటించారు.

*పురుషోత్తముఁడ నీవు పురుషాధముఁడ నేను*
*ధరలో నాయందు మంచితన మేది*

*అనంతాపరాధములు అటు నేము సేసేవి*
*అనంతమయిన దయ అది నీది*
*నిను నెఱఁగకుండేటి నీచగుణము నాది*
*నను నెడయకుండే గుణము నీది*

*నేరమింతయును నాది నేరుపింతయును నీది*

*సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు*

*యీరీతి శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి*

*ధారుణిలో నిండెను ప్రతాపము నీది* (2-53)

తనను పురుషాధముడిగా, నీచుడిగా, అనంతమైన అపరాధాలు చేసినవాడిగా, అజ్ఞానిగా చిత్రించుకున్న అన్నమయ్య, పురుషోత్తముడు, దయాసముద్రుడు, జ్ఞాని అయిన భగవంతుని దయకోసం తపిస్తూ రాసిన ఈ కీర్తనలో కార్పణ్యం ప్రతి పాదంలోనూ స్ఫుటమవుతోంది.

### 3.9.6. ఆత్మనిక్షేపం

తన భారాన్ని భగవంతునిపై వేసి, తనను తాను భగవంతుడికి అర్పించుకోవడం ఆత్మనిక్షేపం. ఇది శరణాగతిలోని చివరి దశ. భక్తుడు భగవన్మార్గానికి అనుకూలంగా తనను తాను మలుచుకుని, తద్వ్యతిరేకమైన ఆలోచనలను, పనులను వదిలిపెట్టి, 'నేను' అన్న అహంకారాన్ని విడనాడి, భగవంతుడు తప్ప వేరు గతి లేదని, అతడే తనను రక్షిస్తాడనే మహా విశ్వాసాన్ని కలిగి, తన భారాన్ని భగవంతుడిపై వేస్తాడు. దీనితో శరణాగతి పూర్తవుతుంది.

*తత్త్వం ప్రసీద భగవన్ కురు మ య్యనాధే*

*విష్ణో కృపాం పరమకారుణికః కిల త్వమ్ ।*

*సంసార సాగర నిమగ్న మనంత దీన*

*ముద్ధర్తు మర్హసి హరే పురుషోత్తమోఽసి ॥* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:137 – [ముకుందమాల-34వ శ్లోకం])

‘ఓ భగవంతుడా! దిక్కులేని నన్ను అనుగ్రహించు. నీవు పరమదయాళుడవు గదా! సంసారసాగరంలో మునిగి ఉన్న దీనుడనైన నన్ను దరిచేర్చడానికి పురుషోత్తముడవయిన నీవే సమర్థుడివి.’

*వపురాదిషు యోఽపి కోఽపి వా గుణతోఽసాని యథాతథావిధః ।*

*తదయం తవ పాదపద్మయోరహమద్యైవ మయా సమర్పితః ॥* (Rajajee, M. S. 2001:75 – [Stotra Ratna-52nd shloka])

‘నాది అనబడిన శరీరము, దాని అవయవాలు ఎటువంటివైనప్పటికీ, వాటి గుణస్వభావములెటువంటివైనప్పటికీ, వాటితో కూడిన ‘నన్ను’ నీ పాదపద్మములందు సమర్పించుకుంటున్నాను.’

సర్వధర్మాంశ్చ సంత్యజ్య *సర్వకామాంశ్చ సాక్షిరాన్ ।*

*లోక విక్రాంతచరణౌ శరణంతే వ్రజం విభో॥* (రామానుజ భట్టర్, కె. 2016:17 – [శరణాగతి గద్యమ్–18వ ఖండిక])

‘సర్వధర్మాలను, సకలకోరికలను, విడచి లోకప్రసిద్ధి చెందిన నీ చరణాలను ఆశ్రయిస్తున్నాను.’

పై శ్లోకాలలో వరుసగా కులశేఖరాళ్వారు, యామునాచార్యులు, రామానుజాచార్యులు ఆత్మనిక్షేప భావాన్నే ప్రదర్శించారు.

*నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగాదేవియును*
*ధారుణి లోపలఁ బుట్టించితివి తరువాతి పనులు నీకే సెలవు*

*శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లే*
*యేపున విషయములందులోఁ దగిలి యేమయిన నీకే సెలవు*

*చూపరఁ బసురము తొరలు వోయినను సొమ్ముగలుగువాఁడే పరవంజుక*
*పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారముగాన*

*యీడులేక శ్రీహరి నీవుండెడి యీ దేహపు నీపరికరమూఁ*
*బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడిఁ దిప్పెడి నీకే సెలవు*
*వోడక యధికులు తమ దాసులు మరివొకరిపంపు లటు సేయఁగను*
*చూడరు తమబలములనే విడిపించుక తామే రక్షింతురు గాని*

*శ్రీవేంకటపతి నీవే నన్నిటు సృష్టించిన జీవుఁడనింతే*
*కావిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు*
*ధావతిఁ దలిదండ్రులు తమ బిడ్డల తనువులఁ బంకము లంటినను*
*యేవిధముల నీరార్చి పెంతు రటు ఇన్నిట నీవే గతి నాకు* (3-392)

'పశువులకాపరి తన మందలో దూడ తప్పిపోతే, తానే వెతికి దారికి తెచ్చుకున్నట్లు, యజమాని తన దాసుడు వేరొకరి పనులను చేస్తున్నా, అతడిని విడిపించి రక్షించే బాధ్యత తానే వహించినట్లు, తల్లిదండ్రులు తమ పిల్లల ఒంటికి బురద అంటితే, తామే కడిగి శుభ్రపరచినట్లు, విషయలంపటాల్లో, ఇంద్రియదాహంలో, అజ్ఞానంలో పడిన తనను చూసుకోవా'లంటూ, తన భారాన్ని భగవంతుడిపై వేశారు అన్నమయ్య. ఇది సంపూర్ణ శరణాగతికి ఉదాహరణ.

షడ్విధ శరణాగతి లేదా షడాంగ శరణాగతి అంచెలంచెలుగా భగవంతుడికి సంపూర్ణ శరణాగతి చేయడానికి ఉద్దేశించిన మార్గం. మొదటి అయిదూ సాధిస్తే, ఆరవది అయిన ఆత్మనిక్షేపాన్ని సాధించడానికి మార్గం ఏర్పడుతుంది. ఆత్మనిక్షేపమే శరణాగతి. అన్నమయ్య అనేక కీర్తనలలో శరణాగతికి చెందిన షడాంగాలను ప్రదర్శించారు.

ఈ అధ్యాయంలో అన్నమయ్య తన సంకీర్తనలలో ప్రదర్శించిన నవవిధ భక్తిమార్గాలను విపులీకరించాను. సంకీర్తనాచార్యుడైన అన్నమయ్య నవవిధ భక్తిమార్గాలలో సహజంగానే కీర్తనభక్తిని ఎక్కువగా (పుటలు:218-244) అనుష్ఠించారు. అటుతరువాత, శరణాగతి రూపంలో ఆత్మనివేదన భక్తిని ఆశ్రయించారు (పుటలు:257-273). తన కీర్తనలలో విశిష్టాద్వైత సామాన్య లక్షణమైన దాస్యాన్ని ప్రకటించారు. షోడశోపచారాలతో స్వామిని కొలుచుకున్నారు. శ్రీమన్నారాయణుని లీలా విశేషాలను స్మరించుకున్నారు. హరి మహత్వాలను వినాలని తపించారు. తన సంకీర్తనలతో మళ్ళీమళ్ళీ నమోవాకాలు అర్పించుకున్నారు. స్వామి పాదాలను సేవించాలనే ఆసక్తి కనబరిచారు. స్వామితో సఖ్య సంబంధాన్ని నెరపిన అర్జునాది భక్తులను తలచుకున్నారు. ఈ విధంగా నవవిధ భక్తిమార్గాలలో శ్రీవేంకటేశ్వరుడిని పూజించారు.

అన్నమయ్య తన కీర్తనలలో నవవిధ భక్తిమార్గాలనే కాక, మరిన్ని విలక్షణమైన భక్తిమార్గాలను ప్రదర్శించారు. మధుర భక్తి, వాత్సల్య భక్తి, అనన్య భక్తి, వైర భక్తి తదితర స్థాపించబడిన భక్తిమార్గాలలోనే కాక, తనవైన భక్తిమార్గాలను ప్రతిపాదించి, వాటిద్వారా కూడా స్వామిని సేవించి తరించారు. ఈ భక్తిమార్గాలను నాలుగవ అధ్యాయంలో వివరించాను.

*****

# అనుబంధం – 1

# నవవిధ భక్తి మార్గాలకు చెందిన అన్నమయ్య కీర్తనలు

## 1. శ్రవణ భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:42 | పుట్టుగు లక్ష్మీ భువిఁ గొనరో | రంపపు వేంకటరమణుని కథ వినినింపగు వారికి నిదే ధనము |
| 2 | 1:54 | నీ కథామృతము నిరతసేవన నాకు | నీ కథామృతము నిరతసేవన నాకు |
| 3 | 2:267 | మొదలనే యెచ్చరికెతో మోసపోక | మొదలనే యెచ్చరికెతో మోసపోక యేపొద్దూ వెదకి హరికథలే వినుచుండవలయు |
| 4 | 3:355 | వినరో భాగ్యము విష్ణుకథ | వినరో భాగ్యము విష్ణుకథ వెను బలమిదివో విష్ణుకథ |
| 5 | 4:579 | నీ కథామృతము నా నిరతసేవన | నీ కథామృతము నా నిరతసేవన నాకు |

## 2. కీర్తన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:8 | ఇందిరానామ మిందరికి | ఇందిరానామ మిందరికి కుందనపుముద్ద వో గోవింద |
| 2 | 1:13 | మలసీ జూడరో | వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు కదిసి కానఁగలేని ఘనసింహము |
| 3 | 1:25 | నిత్యానంద ధరణీధర | భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద సాగరనిజావాస సకలాధిప |
| 4 | 1:52 | చాలదా హరినామసౌఖ్యామృతము | తగువేంకటేశు కీర్తన మొకటి చాలదా జగములో కల్పభూజంబు వలెనుండ |
| 5 | 1:58 | పట్టవసముగానిబాలుడా | కల్లనిదురతోఁ గనుమూసుక రేపల్లెలోఁ బెరిగినబాలుఁడా |
| 6 | 1:68 | ఘోరవిదారణ నారసింహ నీవీరూపముతో నెట్లుండితివో | కాలానలములు గక్కుచు నయనజ్వాలల నిప్పులు చల్లుచును |
| 7 | 1:74 | ఎవ్వఁడో కాని యెరఁగరాదు కడు | మిగులాఁబొట్టివాడు మింటికినిఁ బొడవు |
| 8 | 1:75 | నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై | ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సంస్తుత్యుఁడీ తిరువేంకటాద్రివిభుఁడు |
| 9 | 1:80 | ఆదిమపూరుషుఁ డచ్యుతుఁ | ఏకార్ణవమై..నొకవటపత్రములోపలను చేకొని పవళింపుచు.. |
| 10 | 1:85 | ఇలయును నభమును నేలరూపమై | ఎడసిన నలముక హిరణ్యకశిపునిఁ దొడికిపట్టి చేతుల బిగిసి |
| 11 | 1:100 | ఏ దైవము శ్రీపాదన్నఖమున | ఏ దైవము అవలోకన మింద్రాదిదివిజగణంబుల కెల్లప్పుడును సుఖంబు లాపాదించును |
| 12 | 1:105 | తలఁపు కామాతురత్వము మీఁద | ఓలి నిరువురు సతుల నాలింగనము సేయ లోలుఁడటుగాన నాలుగుచేతులాయ |
| 13 | 1:111 | దిక్కిందరికినైన దేవుఁడు | దిక్కిందరికినైన దేవుఁడు కడుఁదెక్కలికాఁడైన దేవుఁడు |
| 14 | 1:116 | ఘనుఁడీతఁడొకఁడు గలుగఁగఁగదా | కమలాక్షుఁడితఁడు గలుఁగగఁగదా దేవతలు గుమిగూడి రిందరును |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 15 | 1:121 | వాఁడె వేంకటేశుఁడనేవాఁడె | పెరియాళువారి బిడ్డ పిసికి పైవేసిన విరుల దండల మెడవేసినవాఁడు |
| 16 | 1:122 | అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె | కాఁగెడు పెరుగుచాడె కవ్వముతో బొడిచి లేఁగలఁ దోలుకొని |
| 17 | 1:126 | ఇతఁడు చేసినసేఁత ఎన్నిలేవిల మీద | కుడువఁడా ప్రాణములుగొనుచుఁ బూతకిచన్ను |
| 18 | 1:127 | ఆదిదైవుఁడై అందరిపాలిటి | బ్రహ్మాండతతులెల్ల మోచి తానెక్కడ నుండెనో |
| 19 | 1:133 | చూడఁజూడ మాణిక్యాలు | చెక్కులవే నగవుతో జిగిమోమదె |
| 20 | 1:137 | భావయామి గోపాలబాలం | కటిఘటిత మేఖలా ఖచితమణిఘంటికా పటలనినదేన |
| 21 | 1:141 | కోరుదు నామది | కుండలమణిమయభూషణు కువలయదళవర్ణాంగుని |
| 22 | 1:151 | కొండలలో నెలకొన్న | కురువరతినంబి ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు |
| 23 | 1:165 | సతతం శ్రీశం | గదాధరం మేఘగంభీరనినదం |
| 24 | 1:166 | ఇన్నిలాగుల చేతులివియపో | గోవర్ధనగిరి వెల్లగించిన యినుమువంటి చేతులివియపో |
| 25 | 1:170 | ఈతఁడఖిలంబునకు నీశ్వరుఁడై | తాపసోత్తములచింతాసౌధములలోన దీపించు సుజ్ఞానదీప మితఁడు |
| 26 | 1:192 | తానేకాకెవ్వరు మాకు | చదివించి, కూడువెట్టి,జారకుండ నిల్లుగట్టి |
| 27 | 1:200 | సామాన్యమా పూర్వసంగ్రహంబగుఫలము | జగతిఁ బ్రాణులకెల్ల సంసారబంధంబు తగుల బంధించు దురితంపుఁగర్మమున.. |
| 28 | 1:205 | చాలదా హరిసంకీర్తనంగల | హరిసంకీర్తనం గలమేలిది దీననే మెరసిరి ఘనులు |
| 29 | 1:207 | పటుశిష్టప్రతిపాలకుఁడ వనఁగ | తుత్తుమురుగ దైత్యుల దనుజుల నని మొత్తి |
| 30 | 1:211 | ఎటువంటి రౌద్రమో | తోరంపుఁబెనుచేతుల మల్లచఱచి..చాణూరుఁ గదుభంగపఱచి |
| 31 | 1:258 | భావమునఁ బరబ్రహ్మమిదె | నీలమేఘ ముపనిషదర్థం బదె |
| 32 | 1:259 | నగధర నందగోప నరసింహ | నగధర నందగోప నరసింహ |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 33 | 1:261 | ఆదిమునుల సిద్ధాంజనము | పరమునకునుఁ దాఁ బరమై వెలసిన పరిపూర్ణ పరాత్పరుఁడు |
| 34 | 1:264 | శ్రీశోకయం మస్థిరోకయం | కౌశికమఖరక్షకోకయం |
| 35 | 1:267 | మందరధర మధుసూధన | మందరధర మధుసూధన |
| 36 | 1:272 | సతతవిరక్తుఁడు సంసారి గాఁడు | నిత్యుఁడు నితఁడే నిరుపమానుఁడైన ప్రత్యక్షవిభవ సంపన్నుఁ డితఁడె |
| 37 | 1:277 | ఎట్టివారికినెల్ల నిట్టికర్మములు మా | పనిలేక జీవులను భవసాగరంబులో మునుఁగ లేవఁగఁ జేయు మోహదోషమున<br>పనిపూని జలధిలోఁబండఁబెట్టిరి నిన్ను వెనకెవ్వరో మొదలివేలుపనక |
| 38 | 1:281 | భాలనేత్రానలప్రబలవిద్యుల్లతా | భాలనేత్రానలప్రబలవిద్యుల్లతాకేళీవిహార లక్ష్మీనారసింహా |
| 39 | 1:293 | సేవింతురా యితనిఁ జెలఁగి | తల్లిచనుఁబాలుసహితంబు...నెక్కడిదైవ మితఁడు |
| 40 | 1:294 | అరిది సేఁతలే చేసి | పిడిచివేసితి వొకని బృందావనముకాడ వొడిసితివి వొకని నావులమందకాడ |
| 41 | 1:311 | పాలదొంగవద్ద వచ్చి పాడేరు | నోరునిండా జోల్లుగార నూఁగి ధూళిమేనితో |
| 42 | 1:312 | నందనందన వేణునాదవినోదము | రామ రామగోవింద రవిచంద్రలోచన |
| 43 | 1:314 | దేవదేవం భజే దివ్యప్రభావం | రాజవరశేఖరం రవికులసుధాకరం |
| 44 | 1:317 | తెలిసినఁ దెలియుఁడు తెలియనివారలు | వరదుఁడఖిలదేవతలకు వంద్యుఁడు |
| 45 | 1:320 | జనులు నమరులును జయలిడఁగా | వేంకటపతి వరములరాయఁడు..నీడ దిరుగని చింతాడ |
| 46 | 1:322 | వీఁడివో యిదె వింతదొంగ | వెలయ నీటఁ జొప్పవేసేటి దొంగ |
| 47 | 1:324 | ఆదిదేవుఁడనఁగ మొదల నవతరించి | అడుగుకింద లోకమెల్ల నడఁచదలఁచి..పొడవు వెరిగి |
| 48 | 1:332 | సకలసందేహమై జరుగుచున్నది | ఇనవంశమున లోకహితకల్పభూజమై |
| 49 | 1:333 | చిరంతనుఁడు శ్రీవరుఁడు | నిఖిలనిలయుఁడు మునివరదుఁడధికుఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 50 | 1:334 | ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి | వెలఁలేని వేదములు వెదకితెచ్చినచేయి |
| 51 | 1:335 | అందరిబ్రదుకులు నాతనివే | ఆలరినయమరేంద్రాదుల బ్రదుకులు బలిబంధనుకృపఁ బరగినవే |
| 52 | 1:342 | కరుణానిధిం గధాధరం శరణాగతవత్సలం భజే | శుకవరదం కౌస్తుభాభరణం |
| 53 | 1:343 | చాలదా బ్రహ్మ మిది సంకీర్తనం మాకు | చలిగొండసుతదలఁచు సంకీర్తనం.. చలపట్టి తలఁచుఁడీ సంకీర్తనం |
| 54 | 1:344 | ఎదుటినిధానమ వెటుచూచిన నీ | కరుణఁ గాచితివి కౌండిన్యుని |
| 55 | 1:349 | సకల సంగ్రహము సకలసంచయము | ఆకృతసుకృతమిది హరినామం |
| 56 | 1:351 | అందరి కాధారమైన ఆదిపురుషుఁడీతడు | వనజభవాదులకు దైవంబైన నతఁడీతఁడు |
| 57 | 1:354 | ఎక్కడనున్నా నీతఁడు | సరసుఁడు చతురుఁడు జగదేకగురుఁడు |
| 58 | 1:355 | విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ | సర్వప్రపూర్ణునకు సంచార మిఁక నేడ వుర్వీధరునకుఁ గాలూఁదనొక చోటేడ |
| 59 | 1:356 | తలఁపులోపలి తలఁపు దైవ మితఁడు | గొడగువట్టినవానిఁ గోరి యడిగిన తలఁపు తడఁబడక విప్రులకు దానమిడు తలఁపు |
| 60 | 1:392 | రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన | చెలఁగి చుప్పనాతి గర్వమడఁచి దైత్యసేనలఁ జంపిన రాఘవా |
| 61 | 1:394 | సులభుఁడు మధుసూధనుఁడు | పదుచుమాటన కాప్రహ్లాదునెదుట పొడచూపె నాదిపురుషుడు |
| 62 | 1:410 | భక్తికొలఁదివాఁడే పరమాత్ముఁడు | పచ్చిపాలలోనివెన్న పరమాత్ముఁడు |
| 63 | 1:415 | మాకెల్ల 'రాజానుమతో ధర్మ' యిది | అలగరుడగమన మహిశయనంబును కలిసి నీయందె కలిగెనటా |
| 64 | 1:421 | నగుమొగము తోడి వో నరకేసరి | అమితదానవప్రాణ ఆదినరకేసరి |
| 65 | 1:422 | వాఁడె వేంకటాద్రిమీఁద వరదైవము | వొక్కొక్క రోమకూపాన..బ్రహ్మాండకోట్లు పిక్కటిల్ల వెలుఁగొందే పెనుదైవము |
| 66 | 1:425 | శ్రీవేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే | వెలయ సప్తరుషులు ప్రదక్షిణము లలరఁజేసిన దేవుఁడాతఁడీతఁడే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 67 | 1:428 | పరిపూర్ణగరుడాద్రి పంచాననం | వీరపంచాననం విజయపంచాననం |
| 68 | 1:436 | నిక్కించీఁ గర్ణములు మానిసిమెకము | కరములు వేయింటాఁ గైకొని యాయుధములు నిరతి జళిపించీ మానిసిమెకము |
| 69 | 1:453 | నవనారసింహా నమో నమో | సతతప్రతాపరౌద్రజ్వాలానారసింహా |
| 70 | 1:460 | పొడవైన శేషగిరి బోయనాయఁడు | పొలసి మీసాల పెద్దబోయనాయఁడు |
| 71 | 1:473 | ఎంత భక్తవత్సలుఁడ విట్టుండవలదా | యిల నసురారియనే యీ బిరుదు చెల్లె నీకు |
| 72 | 1:474 | రాముఁడిదే లోకాభిరాముఁడితఁడు | యీతఁడా తాటకిఁ జించె యీపిన్నవాఁడా |
| 73 | 1:475 | ఏమి సేసినా నీకరుణ మెట్టు వాసును | కామితఫలద వో కరుణానిధి |
| 74 | 1:477 | ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని | యెందు చొచ్చె బ్రహ్మవర మిల రావణుతలలు.. రాఘవుఁడు ఖండించునాడు |
| 75 | 1:478 | అలవటపత్రశాయివైన రూప మిట్టిదని | సిరులసొమ్ములతోడ శేషునిపైఁ బవళించి..దాసులఁ గృపఁ జూచుకొంటాను |
| 76 | 1:480 | అరుదరుదు నీ మాయ హరిహరీ | అరుదరుదు నీ మాయ హరిహరీ |
| 77 | 1:503 | ఏల మోసపోయిరొకో యెంచి | పసులఁగాచేవాని బ్రహ్మ నుతించేనంటేను దెసల దేవుఁడేయని తెలియవద్దా |
| 78 | 2:31 | ఇందుకే పో వెరగయ్యీ నేమందును | అటు దేవతల కెల్ల నమృతమిచ్చిన నీవు యిటు వెన్నదొంగిలుట కేమందును |
| 79 | 2:32 | వెన్నలు దొంగిలునాటి వెట్టివా నీవు | పావనులయి లోకమెల్లా బదుకుమంటాఁ బేళ్లు వేవేలు వెట్టుకొంటివి వెట్టివా నీవు |
| 80 | 2:47 | నీయంతటివా రెవ్వరు నీకు నెదురేది యెందు | కావలనంటేఁ దొల్లి కంభము చించుకవెళ్లి కైవశమై ప్రహ్లాదుఁ గావవా నీవు |
| 81 | 2:48 | అందరివలెనే వున్నాఁ డాతడాఁ వీఁడు | నిలుచుం డేడుదినాలు నెమ్మది వేలఁ గొండెత్తి యిల నావులఁ గాచినాఁడీతఁడానాఁడు |
| 82 | 2:50 | అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల | అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 83 | 2:81 | మర్ద మర్ద మమబంధాని | నక్రహరణ హరినవ్యకరాంకా |
| 84 | 2:83 | కిన్నజానేఽహం కేశవాత్సర మహో | నిరుపమానందాయ నిత్యాయ |
| 85 | 2:91 | వీటిగిరి దానవవీరు లదె | పరగుకంభ మదె పగిలె పగిలె నదె హరినరసింహంబాయ నదె |
| 86 | 2:95 | ఎంత వాటువడె నీశ్వరుఁడు | పన్నిన జగములు ప్రాణాధారము యెన్నిట నున్నాఁ డీశ్వరుఁడు |
| 87 | 2:98 | ఎంత చదివి చూచిన నీతఁడే ఘనము గాక | పరమాణువైనవాఁడు బ్రహ్మాండమైనవాఁడు |
| 88 | 2:107 | శ్రీవేంకటేశ్వరుఁడు చేరి విజయముఁ బొంది | అరికమ్ము వేసెనట్టె అల్లనరకాసురుపై మేరమీరి రావణునిమీఁద నేసెను |
| 89 | 2:112 | అహోబలేశ్వరుఁ దరికులదమనుఁడు | కదలుఁ గన్నులును కరాళవదనము గుదిగొను భయదపుఁ గోరలును |
| 90 | 2:113 | సిరిఁ దొడపై నిడి శ్రీనరసింహుఁడు | ఘనమగు కోరలు కరాళవదనము చెనకుచు గొడసెటి జిహ్వాయును |
| 91 | 2:142 | బిరుదులన్నియు నీవే బిరుదు లోకములెల్ల | బహుదేవతాసార్వభౌమ బిరుదు నీకే సహజము నీవు భూసతిపతివి గాన |
| 92 | 2:143 | ఎందు నీకు బ్రియమో యీ తెప్పతిరుణాళ్ళు | అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము తెమలఁ దేలించు |
| 93 | 2:156 | హరి నీ ప్రతాపమున కడ్డమేది లోకమున | నీవు నీళ్ళు నమలితే నిండెను వేదములు |
| 94 | 2:165 | మీరు సాక్షి మీరు సాక్షి మే మేమీ ననలేము | వారము నేసేమనుచు వడి నింటివార మెల్లా కూరలు పాశాలు దొంతిఁ గూడఁబెట్టితే<br>ఆరగించ వేలుపుల అలికి పూసి కుడిపీ కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుఁ డమ్మా |
| 95 | 2:166 | ఇదివో మాయింట నేఁడు యింతసేసెఁ గృష్ణుఁడు | వొక్కరోలు దాపు వెట్టి వుట్టియెక్కి అందుమీఁది చక్కెరల్లా మెసఁగి |
| 96 | 2:167 | అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు | ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 97 | 2:173 | ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను | కోరి నుతించినవారికి కొంగుపైఁడివి |
| 98 | 2:178 | దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు | హరుని తారకబ్రహ్మమంత్రమై యమరిన యర్థము రాముఁడు |
| 99 | 2:194 | ఏమని తలఁచవచ్చు నిటువంటి నీచి త్తము | రవిచంద్రగ్రహ తారకములకుఁ దెరువు వివరించనున్నదా నీవే యాధారముగాక |
| 100 | 2:208 | ఈతఁడు తారక బ్రహ్మమితఁడు మాదేవుఁడు | రాముఁడు యిందీవరశ్యాముఁడు నానాసార్వభౌముఁడు షోడశకళాసోముఁడు |
| 101 | 2:219 | రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్యధాముఁడు | రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్యధాముఁడు రణరంగభీముఁడు వాఁడె |
| 102 | 2:221 | శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే | కరిరాజుఁ గాచిన చక్రమువట్టిన హస్తము కరితుండమని చెప్పఁగా నమరును |
| 103 | 2:226 | శరణన్న విభీషణుఁ గరుణఁ గాచినవాఁడు | ఱాలను జలధిగట్టి కేలను మోక్షమిచ్చి యేలేను జటాయువును .. రాముఁడు |
| 104 | 2:228 | సింగారాల మించీ నరసింహదేవుఁడు | కాంచనదైత్యుఁడు దొరకాలువనెత్తురు వార చించెను గోళ్ళ నరసింహదేవుఁడు |
| 105 | 2:231 | పరము నిహము పంటవండినయట్టు | మొలచి సుజ్ఞానము మోసులెత్తి వుండినట్టు యెలమి శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు |
| 106 | 2:232 | పరమాత్ముఁడు సర్వపరిపూర్ణుఁడు | వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై పూవులు వాసనవలె బొంచియున్నాఁడు |
| 107 | 2:243 | అహోబలేశ్వరునకు నాదిమూర్తికి | శైలములే పాదములు జానువులే లోకములు |
| 108 | 2:273 | రాజీవనేత్రాయ రాఘవాయ నమో | దశరథతనూజాయ తాటకదమనాయ కుశికసంభవయజ్ఞగోపనాయ |
| 109 | 2:275 | కౌసల్యానందనరామ కమలాప్తకులరామ | సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక జలధి బంధించి లంక సాధించి |
| 110 | 2:277 | ఆతురబందుగుఁడవు హరినారాయణ కృష్ణ | గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు ధరలో గజరాజు నుద్ధరించినట్లు |
| 111 | 2:278 | వేదములు నుతించఁగ వేడుకలు దైవారఁగ | నెఱులజడలతోడ నిక్కుఁ గర్ణములతోడ కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ |
| 112 | 2:279 | సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు | మరుని తండ్రికిని మఱి చక్కఁదనమెంత సిరిమగని భాగ్యము చెప్పనెంత |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 113 | 2:283 | పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా | పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా పురుఁడు లే దిఁక నీకుఁ బురుషోత్తమా |
| 114 | 2:289 | జయ జయ నృసింహ సర్వేశ | మిహిరశశినయన మృగనరవేష బహిరంతస్స్థలపరిపూర్ణ |
| 115 | 2:314 | ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినాఁ దానే | యెనసి పదునాలుగే యెడమైన లోకములు అనిశము నీవియైతే ననంతమహిమలు |
| 116 | 2:315 | ఎంతకత నడిపితి వేమి జోలిఁ బెట్టితివి | కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల నేరచి సారథ్యము నెఱపనేలా |
| 117 | 2:332 | పసులఁ గాచుట యెట్టు బండిబోయిఁడ వౌటెట్టు | పరమపదము పరాత్పరము బ్రహ్మమునై తిరమైన యాదిదేవదేవుఁడవు నీవు |
| 118 | 2:333 | ఏపొద్దూ నీచేఁతలెల్లా యెదుటనే కానవచ్చీ | పుట్టిన మెకానకుఁ బూరి మేయ నేరిపిరా అట్టె పిల్లలఁ బెట్ట నటు నేర్పిరా.... యేవలఁ జూచినా నీమహిమ లింతేగాక |
| 119 | 2:335 | తెలియరాదు నీమాయ తెరమరఁగు | జగత్తుకు సూత్రధారివి నీవు జోడై నీసూత్రాన నాడుచును సర్వంబునున్నది |
| 120 | 2:338 | దాఁచుకో నీపాదాలకుఁ దగ నేఁ జేసిన పూజలివి | నా నాలికపైనుండి నానా సంకీర్తనలు పూని నాచే నిన్నుఁ బొగడించితివి |
| 121 | 2:344 | ఎఱఁగక వేసారు నిల జీవుఁడు | పూరకే పరాకైనట్టుండును దేవుఁడు నారుకొన మతిలోఁ దనపైనే చింత |
| 122 | 2:345 | విష్ణుఁడొక్కఁడే విశ్వాత్మకుఁడు | అంతటఁగల మాయా విలాసములు పొంతఁ బరమపద భోగములు.. యింతయు శ్రీవేంకటేశు మహిమలే |
| 123 | 2:348 | నమో నమో లక్ష్మీనరసింహా | వరద సులభ భక్త వత్సల నరసింహా |
| 124 | 2:355 | వాఁడె వో ప్రహ్లాదవరదుఁడు | తెల్లని మేనితోడ తీగెనవ్వులతోడ చల్లని గంధముల వాసనలతోడ |
| 125 | 2:359 | పావనము గావో జిహ్వా బ్రదుకవో జీవుఁడా | పావనము గావో జిహ్వా బ్రదుకవో జీవుఁడా వేవేల కితని నింక వేమారునుఁ బాడి |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 126 | 2:361 | ఎత్తుకొన్న బహురూప మిఁక మరి మానరాదు | పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి గట్టిగా కనకదైత్యు ఖండించితివి |
| 127 | 2:371 | ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచి | విశ్వరూపబ్రహ్మము విరాట్టయిన బ్రహ్మము<br>శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైన బ్రహ్మము |
| 128 | 2:374 | డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం | మీనకూర్మ వరాహ మృగపతి అవతారా దానవారే గుణశౌ రే ధరణిధర<br>మరుజనక |
| 129 | 2:377 | దేవ నమో దేవా | జగదాకారచతుర్భుజ గగననీలమేఘశ్యామ |
| 130 | 2:387 | నందగోపనందనుడే నాఁటి బాలుదు | పువ్వువంటి మఱ్ఱియాకుపొత్తిఁ బవళించనేర్చె యెవ్వఁడోకాని తొల్లె<br>యీబాలుఁడు |
| 131 | 2:401 | తే శరణ మహం తే శరణ మహం | దశవిధావతార ధర్మరక్షకమూర్తి |
| 132 | 2:403 | చూచి మోహించకుందురా సురలైన నరులైన | అందరి రక్షించేటి అభయహస్తము కంద నసురులఁ జంపే గదాహస్తము |
| 133 | 2:429 | అరు దరుదు నీమహి మతిమానుషము చూడ | పసులఁ గాచే దేడ బ్రహ్మ నుతియించు టేడ.. |
| 134 | 2:432 | అణురేణుపరిపూర్ణమైన రూపము | బ్రహ్మాదులకు మూలమైన రూపము కొంచని మఱ్ఱాకుమీఁది కొన రూపము |
| 135 | 2:459 | తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ | సిరుల సింగారరాయ చెలువపు తిమ్మరాయ సరస వైభవరాయ<br>సకలవినోదరాయ |
| 136 | 2:462 | వినవమ్మ జానకి నీవిభుఁ డింత సేసినాఁడు | లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె చేవల నోసీత నిన్నుఁ జేకొనెను |
| 137 | 2:470 | కంటిరా వింటిరా కమలనాభుని శక్తి | యీతని నాభిఁ బొడమె యెక్కువైన బ్రహ్మయు యీతఁడే రక్షించినాఁడు<br>యింద్రాదుల |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 138 | 2:473 | తానే తెలియుఁ గాక తలంచఁగ నెట్టువచ్చు | అట్టె యేఁబదియైన యక్షరాలలోనట తిట్టులట వొకకొన్ని దీవెనలటా మట్టుతో వేదములట మంత్రములట కొన్ని యిట్టివి చిక్కులు భూమి నిఁకనెన్ని గలవో |
| 139 | 2:491 | ఎంతకెంత యిది యేమని పొగడుట | పిడుగులఁ బోలెడి పెను నీ నఖములఁ కెడయక హిరణ్యుఁ డెట్లుండెనో |
| 140 | 2:496 | చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ | చెలఁగు వేయిచేతుల శ్రీనరసింహా చిలకేటి నగవుల శ్రీనరసింహా |
| 141 | 2:497 | నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడు గాక | యీతఁడాతాటకిఁ జంపె నీమారీచసుబాహుల నీతఁడా మదమణఁచె |
| 142 | 2:499 | ఆతనిఁ బో పొగడేము ఆతని శరణంటిమి | వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు |
| 143 | 2:503 | ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు | చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి |
| 144 | 2:508 | ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు | సెలవి నవ్వులవాఁడు చేకత్తిగోళ్లవాఁడు పలుపేగుల జంధ్యాల పంతాలవాఁడు |
| 145 | 2:509 | పరమపురుషుఁ డీబాలుఁడట | దేవుఁడితఁడు సర్వదేవతల కొడయఁడు వేవేలు వేదములచే వేద్యుఁడితఁడు |
| 146 | 3:4 | ఎక్కడ చూచిన వీరే యింటింటి ముంగిటను | నల్లనివాఁడు కృష్ణుడు తెల్లనివాఁడు రాముఁడు అల్లదివో జోడుకోడెలై వున్నారు రోలఁ జిక్కె నొకఁడు రోకలి వట్టె నొకఁడు |
| 147 | 3:17 | భూమిలోనఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిదివో | పొదవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు అదరి తొట్టెల బాలుఁడాయనమ్మ |
| 148 | 3:27 | ఇచ్చలోఁ గోరేవల్లా ఇచ్చే ధనము | నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము..హరినామ మిదియ పో.. ధనము |
| 149 | 3:31 | అని రావణుతల లట్టలుఁ బొందించి | పరగ విభీషణుఁ బట్టము గట్టెను తొరలి లంకకును తొలుఁదొలుతే |
| 150 | 3:36 | పట్టరో వీదులఁ బరువులు వెట్టి | వేవేలు నేరాలు వెదకేటి దేవుఁడు ఆవులఁ గాచీ నలవాఁడే |
| 151 | 3:44 | ఇతర దేవతల కిది గలదా | దేవపితామహ త్రివిక్రమ హరి జీవాంతరాత్మక చిన్మయుఁడా |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 152 | 3:63 | చింతలు రేఁచకు మమ్ము చిత్తమా నీవు | కీలు మాకు నీతని సంకీర్తన మోక్షమునకు |
| 153 | 3:76 | నీమహి మది యెంత నీవు చేసే చేఁతలెంత | యే లీలఁ జూచినాను యింతటి దైవమవు బాలుఁడవై రేపల్లెలోఁ బారాడితివెట్టయ్యా |
| 154 | 3:81 | అనంతమహిముఁడవు అనంతశ క్తివి నీవు | జీవుల కేలికవు శ్రీవేంకటేశుఁడవు నీవేవలఁ జూచిన నీ కే యేలికే లేఁడు |
| 155 | 3:90 | కన్నవిన్నవారెల్లా కాకు సేయరా | దేవతలఁ గాచినట్టి దేవుఁడ నీకుఁ బసుల నీవలఁ గాచితివనే హీనమేలా |
| 156 | 3:92 | ఎదురేది యెంచి చూడ నితని ప్రతాపానకు | అలమేలుమంగవిభుఁడటు వీధులేఁగితేను ఖలు లేఁగిరి యమునికట్టెదిరికి |
| 157 | 3:94 | రామా దయాపరసీమా అయోధ్యపురధామా | సేయరాని ద్రోహము సేసిన పక్షికి నీవు పాయక అప్పటి నభయ మిచ్చితి |
| 158 | 3:102 | ఏ లోకమున లేఁడు యింతటి దైవము మరి | మంచిరూపున నెంచితే మరుని గన్నతండ్రి ఇంచుకంత సరిలేదు ఇతనికిని |
| 159 | 3:112 | ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు | బాలలీలలు నటించి బహుదైవికము మించె పాలువెన్నలు దొంగిలెఁ |
| 160 | 3:113 | అంతవాని కింతసేయ నమరునటే | అడుగులుమూఁట లోకాలటు గొలచినవాఁడు బడిబడి రేపల్లెఁ బారాడీని |
| 161 | 3:133 | బాపు బాపు రాఘవ నీ ప్రతాపమేమని చెప్ప | వాలినెత్తురు నీటను వాఁడి పదనిచ్చినమ్ము కూలిచె నొక్కమాటునఁ గుంభకర్ణుని |
| 162 | 3:142 | కొమ్మలు చూడరే గోవిందుఁడు | దిట్ట బాలులతోఁ దిరిగి వీధుల గొట్టీ నుట్లు గోవిందుఁడు |
| 163 | 3:149 | అక్కలాల చూడుఁ డందరును | పానకపుటుట్టి బలిమినే అనుక కోలల నందియంది కొట్టి తేనెవుట్టి గొట్టీ దేవకీసుతుఁడు |
| 164 | 3:151 | వీఁడె వీఁడె కూచున్నాఁడు వేడుకతో గద్దెమీఁద | అరయఁ బ్రహ్లాదుని ఆపదోద్ధారసింహము |
| 165 | 3:153 | నానాటికిఁ బెరిగీని నరసింహము | వాఁడివాఁడి కోరలతో వడి నసురఁ జక్కాడి తీఁడేటి మీసాలతోడి |
| 166 | 3:154 | ఎందుఁ జూచినా నీవే ఇదివో నీ ప్రతాపము | జలధు లేదును నీకు జలకపు మడుగులు అలరి భూమెల్లా విహారదేశము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 167 | 3:157 | సీతారమణ వో శ్రీరామచంద్ర | చెలువపు సింగారాల శ్రీరామచంద్ర నీ సెలవుల నవ్వుగారీ శ్రీరామచంద్ర |
| 168 | 3:161 | పైకొని చూడరో వుట్లపండుగ నేఁడు | తొట్టిన రాకాసులతోడఁ గూడ భువిమీఁద నట్టె కంసుని మదము హతమాయను |
| 169 | 3:162 | ఒకరి కొకరు వొద్దు దప్పులనే | వారవట్టీఁ బాలు వంచి గోవిందుఁడు గోర గీరే రదే గొల్లెతలు |
| 170 | 3:164 | భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె | బిరుదుశంఖముమ్రోఁత బెరయించీ దేవుఁడదే పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు |
| 171 | 3:178 | ఏమనఁగ వచ్చునమ్మ ఇటువంటివారిఁ జూచి | వేలఁ గొండెత్తినవాఁడు వేరే యేరుసేసేవాఁడు బాలులవలెనే వీధిఁ బారాడేరు వారివో |
| 172 | 3:179 | చేరి యందెలమోతతో చెన్నకేశవా | మున్ను యశోద వద్దను ముద్దు గునిశాడితివి పన్ని రేపల్లె వీధులఁ బారాడితివి |
| 173 | 3:184 | నేఁడు నీ మహిమ నెరపెడి సమయము | అల చక్రపాణివై యసురల తలలిలఁ గూల్చిన జగదీశ్వరుఁడ |
| 174 | 3:186 | ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లిఁక | పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు కోపించినంత నెత్తురుగుండాల పాలౌదురు |
| 175 | 3:193 | ఆదివిష్ణు వీతఁడే యటరమ్మా | వసుదేవుని యెదుట వైకుంఠనాథుఁడు సిసువై యవతరించి చెలఁగీనమ్మా |
| 176 | 3:233 | రాముఁడు లోకాభిరాముఁడు | చక్కఁదనములవాఁడు జానకీవల్లభుఁడు గక్కన శబరిపూజ గైకొన్నవాఁడు |
| 177 | 3:234 | కంటిరా వో జనులాల కరుణానిధి యితఁడు | వాఁడివో ప్రతాపసుగ్రీవ నరసింహు డట్టె మూఁడుమూర్తు లొకరూపై ముంచివున్నాఁడు |
| 178 | 3:235 | ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుఁడు | అచ్చపు బాలుఁడై శకటాసురు మర్దించినాఁడు కుచ్చి కాఁగిళ్ల నింతులఁ గూడినాఁడు |
| 179 | 3:236 | అరుదరుదీగతి యహోబలేశ్వర | యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని అదె ప్రహ్లాదుఁడు బంటగుటెట్లు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 180 | 3:239 | శరణని బ్రదుకరో జనులాల | అచ్చట హిరణ్యు నదరంటఁబట్టి యిచ్చలఁ దొడపై నిడి చించి కుచ్చి వాని పేగులు జంధ్యములుగ విచ్చి వేసుకొనె విష్ణుసింహము |
| 181 | 3:247 | అంతటి దైవమ వటు గాఁగా | కొంగుపైడియగు గురుమంత్రంబులు సంగడి వైష్ణవసంభాషలు నింగికి భూమికి నిజపురాణములు సంగతిగల నీ సంకీర్తనలు |
| 182 | 3:253 | ఏమని చెప్పగవచ్చు నీసంతోషపుసుద్ది | పుట్టినది మధుర పెంపుడుఁజోటు రేపల్లె వొట్టిన మాయల పురుషోత్తమునికి |
| 183 | 3:258 | శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును | హరి కృష్ణావతారమందినయంతలోనే పరమ మునులకెల్ల భయముడిగెను |
| 184 | 3:264 | నారాయణుఁడే సర్వనాయకుఁడు | ఆకస మొకపాదము అట్టె భూమొక పాదము పైకొని యొకపాదము పాతాళము |
| 185 | 3:271 | ఈతఁడు బలువుఁడౌట కివియే సాక్షి | అమరుల మొరాలించి అసుర బాధలు మాన్పె అమరుల కెక్కుడౌట కదియే సాక్షి |
| 186 | 3:274 | వీడె వీడె వాఁడే వాఁడే వీఁడే వీఁడే చెలఁగీని | పేరుకొన్న వేదముల బిరుదుపద్యములవె శ్రీరమణుఁడు మెరసె చిక్కులు వాపఁగను |
| 187 | 3:277 | కనియుఁ గానరు నీమహిమ కౌరవకంసజరాసంధాదులు | పుక్కిటనే లోకములు చూపితి పూతకి చన్నటు దాగితివి పక్కననే బండి దన్ని విరిచితివి బాలులు సేసేటి పనులివియా |
| 188 | 3:281 | అందరికి సులభుఁడై అంతరాత్మ యున్నవాఁడు | యోగీశ్వరుల మతినుండేటి దేవుఁడు క్షీరసాగరశాయియైన సర్వేశుఁడు |
| 189 | 3:289 | ఇతరము లేదిఁక నెంచి చూచితేఁ | సకలలోకములు చర్చించి వెదకిన వొకఁడేపో పురుషోత్తముఁడు |
| 190 | 3:297 | ఎందుకుఁ బనిగొందము యేమి సేతమివి యెల్లా | హరినామ మొకటనే అణఁగెఁ బాపములు..సిరులిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 191 | 3:300 | జయజయ రామా సమరవిజయరామా | జలధి బంధించిన సౌమిత్రిరామా..కలిగి యజ్ఞము గాచే కౌసల్యరామా |
| 192 | 3:304 | రామభద్ర రఘువీర రవివంశతిలక | మారీచసుబాహుమర్దన తాటకాంతక దారుణవీరశేఖర ధర్మపాలక |
| 193 | 3:315 | తగు మునులు ఋషులు తపములు సేయఁగ | ధరణీధర మందరధర నగధర చిరకౌస్తుభధర శ్రీధరా |
| 194 | 3:316 | ఎవ్వరుఁ గాననివాఁడు యశోద గనె నట్టె | ఘనయోగీంద్రుల మతిఁ గట్టువడనట్టివాఁడు పనిలేక రోలఁ గట్టువడినాఁడట్టె |
| 195 | 3:358 | ఆతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు | నారదుఁడు దలఁచేటి నామమది యెవ్వనిది గౌరి నుడిగేటి నామకథ యేదది |
| 196 | 3:370 | ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే | మది జలధుల నొక దైవము వెదకిన మత్స్యావతారం బితఁడు.. |
| 197 | 3:397 | ఇదె చిక్కితివిఁక నెందు వోయెదవు | దేవతలకు పరదేవుఁడవు కైవల్యమునకుఁ గలుగు బ్రహ్మమవు |
| 198 | 3:402 | వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు | కొండ గొడగుగ నెత్తి గోవులఁ గాచె నాఁడు కొండవంటి దానవునిఁ గోరి చించెను |
| 199 | 3:411 | ఇంతటి దైవము లేఁడు యెందుఁ జెప్పి చూపఁగ | గక్కన మన్మథునిఁ గన్నతండ్రి గనక యెక్కువ చక్కఁదనాల కితఁడే దొడ్డ |
| 200 | 3:419 | కొలిచినవారల కొంగు పైఁడితఁడు | యినవంశాంబుధి నెగసిన తేజము ఘనయజ్ఞంబులఁ గల ఫలము |
| 201 | 3:434 | మా దురితములు వాపి మమ్ముఁ గాచుటరుదా | అంబరీషుఁ బైకొన్న ఆపదలన్నియుఁ బాపి బెంబడిఁ గాచె నీచే పెనుచక్రము |
| 202 | 3:467 | పాడేము నేము పరమాత్మ నిన్నును | పాడేము నేము పరమాత్మ నిన్నును వేదుక ముప్పదిరెండువేళల రాగాలను |
| 203 | 3:470 | అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ | అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ డతనికంటే మరి యధికులు వేరయ్యా |
| 204 | 3:472 | విజయపుటమ్ము వేసె వేంకటేశుఁడు | పాటితెంచి దశకంఠు పదిశిరసులమీఁద ఆటికి నమ్ము వేసె నాదిదేవుఁడు |
| 205 | 3:480 | తెలిసినవారికి దేవుఁ డితఁడే | పురుషుల లోపలఁ బురుషోత్తముఁడు నరులలోన నరనారాయణుఁడు |
| 206 | 3:482 | కొలిచినవారి పాలి కొల్లలివివో | యిల నిట్టి దైవమవు యిఁక వేరే కలరా |
| 207 | 3:485 | చేరి యశోదకు శిశు వితఁడు | మాటలాడినను మరి యజాండములు కోటులు వొడమేటి గుణ రాశి |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 208 | 3:491 | అన్నిటి మూలం బతఁడు | వెనుకొని పొగడేటి వేదాల మూలము మునుల తపములకు మూలము |
| 209 | 3:499 | సౌమిత్రిసహోదర దశరథరామా | శిలనుఁ బడఁతిఁ గావించిన రామా |
| 210 | 3:502 | ఆనందనిలయ ప్రహ్లాదవరదా | పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా హరి యచ్యుతానంత ప్రహ్లాదవరదా |
| 211 | 3:504 | అవధారు సకలలోకైకనాథ | అరుదుగ మీరు సింహాసనముపై నుండఁగ యిరుగడ సేవించేరు ఇంద్రాదులు |
| 212 | 3:505 | శరణు శరణు రామచంద్ర నరేంద్రా | కనలి తాటకిఁ జంపి కౌశికు జన్నము గాచి చనవు లిచ్చిన రామచంద్ర నరేంద్రా |
| 213 | 3:506 | కంభమున వెడలి ఘననరసింహము | తొడికి దైత్యుఁ దన తొడపైకిఁ దిగిచి కడుపు చించి రక్తము చల్లి |
| 214 | 3:507 | ఆదిమపురుషుడు అహోబలమునను | కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు నెదుట గద్దెపై నిరవై నిలిచె |
| 215 | 3:508 | ఏమని నుతింతు నేను యిందిరానాయక నీవు | నెట్టనఁ దలఁచేవారి నిండు నిధానమవు పట్టినవారి చేతి బంగారమవు |
| 216 | 3:509 | సురలు సంతోషించి రసురలెల్లా నడఁగిరి | కఁడగి వసుదేవుని కాంత దేవకిదేవికి..కొడుకై జన్మించినాఁడు కూరిమి శ్రీకృష్ణుఁడు |
| 217 | 3:513 | నానాభరణముల నరసింహా | నగవుల నెమ్మోము నరసింహా పొగరుమించు టూర్పుల నరసింహా |
| 218 | 3:514 | నమితదేవం భజే నారసింహం | విజయ నరసింహం వీర నరసింహం భుజబలపరాక్రమస్ఫుట నృసింహం |
| 219 | 3:516 | సీతాసమేత రామ శ్రీరామ | ఆదిత్యకులమునందు నవతరించిన రామ కోదండభంజన రఘుకుల రామ |
| 220 | 3:518 | దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ | నిక్కిన కర్ణములతో నిట్టచూపు గుడ్లతో మిక్కుటమైన పెద్దమీసాలతోడ |
| 221 | 3:523 | త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు | మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు అరుదైన ప్రతాపపు ఆదినారాయణుఁడు |
| 222 | 3:533 | అతని నమ్మలే రల్పమతులు భువి | సకలలోకపతి సర్వేశ్వరుఁడట వొకఁడిఁక దొర మరి వున్నాఁడా |
| 223 | 3:535 | వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు | భేదించె రావణాది భీకరదైత్యుల నెల్ల నాదించె శంఖమున నున్నతజయము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 224 | 3:536 | ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము | విష్ణుఁడే యమృత మిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె విష్ణువాజ్ఞ నడచేది విశ్వ మింతాను |
| 225 | 3:563 | ఒక్కఁడే దైవం బున్నతుఁ డీతఁడు | పురుషుల కెల్లాఁ బురుషోత్తముఁడు సురేంద్రాదులకు సురేంద్రుఁడు |
| 226 | 3:567 | చేకొని కొలువరో శ్రీనరసింహము | వెడలేటి వూర్పుల వేఁడిమి చల్లీ చిడుముడి కోపపు శ్రీనరసింహము |
| 227 | 3:574 | నారాయణ నీ నామమహిమలకు | హరియని నొడిగిన నణఁగేటి పాపము సిరుల నేను నుతిసేయఁగఁగలనా |
| 228 | 3:577 | ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీఁడు | అంతనింత గొల్లెతల అరచేతి మాణికము పంతమాడే కంసుని పాలి వజ్రము |
| 229 | 4:1 | ఎక్కడి కంసుడు యిఁక నెక్కడి భూభారము | పరంజ్యోతిరూప మిదె పాండవుల బ్రదికించె అరిది కౌరవులసంహారమూ నిదె |
| 230 | 4:6 | ఆతఁ డితఁడా వెన్న లంతట దొంగిలినాఁడు | ముగురువేలుపులకు మూలభూతి యీతఁడా జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను |
| 231 | 4:16 | ఇహపరసాధన మిది యొకటే | ఇహపరసాధన మిది యొకటే సహజపు మురారిసంకీర్తన నొకటే |
| 232 | 4:17 | ఏమని పొగడుదు నిట్టి నీగుణము | నిండెను జగముల నీ ప్రతాపములు చెండిన బాణునిచేతులతో |
| 233 | 4:19 | భావించువారల పాలిభాగ్య | యీశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు శాశ్వతమూరితి జగములకు |
| 234 | 4:20 | జగములెల్లా నీదేరె జయ వెట్టి రిందరును | అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి |
| 235 | 4:32 | కదిరి నృసింహుఁడు కంభమున వెడలె | ఫాలలోచనము భయదోగ్రముఖము జ్వాలామయ కేసరములును |
| 236 | 4:52 | తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము | అసపడి వరదానమడిగిన పొలము బాసలతోఁ గదు నెత్రుపట్టమైనపొలము |
| 237 | 4:104 | అచ్చుతుఁడనియెడి నామముగలిగినయట్టి నీవె కాక | దాకొని జగములు పుట్టించు బ్రహ్మకు తండ్రివి నీవే<br>కైకొని చదువులఁ దెలిసిచూడ రక్షకులిఁక మరి వేరి |
| 238 | 4:109 | ఆతఁడే పో మా యేలిక ఆతఁడే | జలధి బంధించి లంక సంహరించినవాఁడు<br>జలధిచొచ్చినదైత్యుఁజంపినవాఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 239 | 4:133 | ఇలువేల్పితఁడే ఇందరికిని మరి | కమలారమణుని కరుణేకాదా అమరులు గొనియెడి యమృతము |
| 240 | 4:139 | శ్రావణబహుళాష్టమి జయంతి నేఁడు | హర విరంచాదులకు నాదిమూల కారణము పరమమునుల తపఃఫల సారము |
| 241 | 4:140 | వెల(ర?)సె నహోబలాన విదారణసింహము | హిరణ్యకసిపుని నిరుచాతులాఁ జించి అరిదిఁ బేగులు జందేలవే వేసుకొనెను |
| 242 | 4:144 | నమో నమో దశరథనందన రామ | వారిధిబంధన రామ వాలిహరణ రామ చారుహరకోదండభంజన రామ |
| 243 | 4:146 | సుగ్రీవనారసింహుని జూడరో వాఁడె | అసురలను గెలిచి అదె సింహాసనముపై వెసఁగొలువున్నాడు వీర సింహము |
| 244 | 4:147 | రామచంద్రుఁ డితఁడు రఘువీరుఁడు | గౌతము భార్య పాలిటి కామధేనువు వితఁడు ఘాతలఁ గౌశికు పాలి కల్పవృక్షము |
| 245 | 4:151 | దేవుదేవుఁ డితడే దివ్యమూరితి | వేంకటాచలము మీఁది విశ్వరూప విశేషము అంకెల ననంతావతారాలైన విశేషము |
| 246 | 4:156 | రామా దశరథరామా నిజ సత్యకామా | కరుణానిధి రామ కౌసల్యానందన రామ పరమ పురుష సీతాపతిరామ |
| 247 | 4:157 | సేవించరో జనులాల చిత్తజగురుఁ డీతఁడు | వేయిచేతులతోడ వెన్నెలనవ్వులతోడ..శ్రీయుతుఁడై యెదుట సుగ్రీవనారసింహుఁడు |
| 248 | 4:159 | ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుఁడు | తరణివంశజుడై తాటకను హరియించి అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి |
| 249 | 4:160 | అదర శ్రావణబహుళాష్టమి నేఁడితఁడు | గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు పంతపుపాండవులకు బావమరఁది |
| 250 | 4:161 | చూడవమ్మ కృష్ణుఁడు నీ సుతుఁ డోయమ్మ | కోలలు చాఁచీ వుట్లు గొట్టఁగా బాలుఁ బెరుగు కాలువలు గట్టి పారెఁ గదవమ్మా |
| 251 | 4:162 | ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు | గక్కన నహోబలాన కంబములోన వెడలి వుక్కుమీరి హిరణ్యుని నొడిసిపట్టి |
| 252 | 4:163 | కొలువై తా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద | చిదుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ |
| 253 | 4:164 | జూటుఁదనాలవాఁడవు సుగ్రీవనారసింహ | అమరుల కేలికవు అసురలకు వైరివి రమణఁ బ్రహ్లాదునకు రక్షకుఁడవు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 254 | 4:165 | మతంగపర్వతము మాల్యవంతము నడుమ | కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి తలచిఁనవారినెల్లా ధన్యులఁజేసి |
| 255 | 4:168 | నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు | కమలావరుడు శ్రీకర మదనగురుఁడు సమర దానవకుల సంహారుఁడు |
| 256 | 4:169 | రాముఁడు రాఘఁవుడు రవికులుఁ డితఁడు | అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున పరగ జనించిన పరబ్రహ్మము |
| 257 | 4:170 | శరణు శరణు దేవ సర్వపోషక | వారిధిబంధన రావణ శిరశ్ఛేదక మారీచ సుబాహుబలమర్దన |
| 258 | 4:171 | వినోదకాఁడ వౌదువు విఠలేశ్వరా | పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే వెస నీమహిమ యెంత విఠలేశ్వరా |
| 259 | 4:172 | విచ్చనవిడినీ యాడీ వీఁడె కృష్ణుఁడు | గల్లుగల్లుమనఁగాను గజ్జలు నందెలతోడ బిల్లఁగోట్లాడీని పిన్నకృష్ణుఁడు |
| 260 | 4:175 | ఎంత పరాక్రమము యీ సింహము | కొండమీఁదఁ గూచుండి దైత్యుమై చెండివేసె నీ సింహము |
| 261 | 4:179 | జగతిలో మనకెల్ల జయంతి నేఁడు | హరిమాయ కంసుమద మడఁచె నేఁడు పొరుగిరుగులవా రుప్పొంగిరి నేఁడు |
| 262 | 4:180 | కొలిచితే రక్షించే గోవిందుఁ డితఁడు | గోవర్ధనమెత్తినట్టి గోవిందుఁడితఁడు వేవేలుగొల్లెతల గోవిందుఁడితఁడు |
| 263 | 4:181 | కొండంత పొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె | ధరమీఁదఁ గలిగిన దనుజకోట్ల నెల్ల సొరిది శ్రీవేంకటేశుఁడు పొరఁదోలెను |
| 264 | 4:182 | నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె | నగముపై యోగానందనరసింహము వీఁడె మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము |
| 265 | 4:234 | అనుచుఁ బొగడఁ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట | ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు తగుబలభద్రునికి తమ్ముఁడాయను |
| 266 | 4:237 | ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ | చెక్కుమీఁటి పాలువోయి చేరి నోరు దెరచితే పక్కుననుఁ బొడచూపె బ్రహ్మాండాలు |
| 267 | 4:240 | నీవంటి దైవాలు వేరీ నిఖిలలోకములందు | అగపడ్డనీగుణము లవి యెంచిచూచితిమా నిగిడి కల్యాణగుణనిధివనీ శ్రుతులు |
| 268 | 4:249 | అనుచు మునులు ఋషు లంతనింత నాడఁగాను | ఆదిమూల మితఁడు యమరవంద్యుఁ డితఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 269 | 4:255 | కలఁడా యింతటి దాత కమలనాభుఁడే కాక | కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద కట్టె విభీషణుకు లంకారాజ్యము |
| 270 | 4:258 | వెఱపించబోయి తానె వెఱచెఁ దల్లి యశోద | గొంగ యెందునున్నాఁడని నోరు దెరచితే పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను |
| 271 | 4:262 | అని బ్రహ్మాదులెంచేరు హరి బాలలీలలు | పొత్తులలోఁ బవ్వళించె పురుషోత్తముఁడు దొల్లి హత్తి మఱ్ఱాకుపైఁ బండినటువలెనె |
| 272 | 4:263 | నర(వ?)రూప ప్రహ్లాదనరసింహా | పగరపై కోపము బంటుఁజూచి మరచితి నగుమొగము ప్రహ్లాదనరసింహా |
| 273 | 4:271 | అహోబలేశ్వరుఁ డఖిలవందితుఁడు | మూఁడుమూర్తులకు మూలం బీతఁడు వేఁడిప్రతాపపు విభుఁ డీతఁడు |
| 274 | 4:274 | ఏడకేడ నీచెరిత లేమని పొగడవచ్చు | పరమాన్నములోఁబుట్టి పక్కనఁ దాటకిఁ జంపి సరుస విశ్వామిత్రుయజ్ఞము గాచి |
| 275 | 4:275 | సులభుఁ డీతఁ డిదివో సుగ్రీవనారసింహుఁడు | నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు .. దేవతల రక్షించేవాఁడు |
| 276 | 4:276 | శరణు శరణు నీకు జగదేకవందిత | ఘనరణరంగవిక్రమ దశరథపుత్ర వినుతామనస్తోమ వీరరాఘవ |
| 277 | 4:277 | రాముఁడు లోకాభిరాముఁ డందరికి | తలఁప దశరథుని తనయుఁడట తానెతారకబ్రహ్మమట |
| 278 | 4:279 | ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు | తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము పడె రావణుతలలు పంక్తులై ధరణిని |
| 279 | 4:280 | ఇందులోనే కానవచ్చె నిన్నిటా నీ మహిమలు | దేవ నీకు వలసితే తృణము బ్రహ్మాస్త్రమాయ భావించితే రాతికిఁ బ్రాణము వచ్చె |
| 280 | 4:281 | ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ ప్రతాపము | వెరవున హరువిల్లు విరుఁగఁ దీసిననాఁడే అరయ విరిగె వీపు లసురలకు |
| 281 | 4:282 | కొలువరో మొక్కరో కోరి తలఁచరో | పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు వేయినామములవెన్నుఁడు |
| 282 | 4:283 | రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరొ | చలమునఁ దాటికిఁ జదిపిన బాణము లలి మారీచసుబాహూలపై బాణము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 283 | 4:285 | జగతి వైశాఖశుద్ధచతుర్దశి | పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి |
| 284 | 4:287 | శ్రావణబహుళాష్టమి సవరేత్రికాడను | అసురల శిక్షించ నమరుల రక్షించ వసుధ భారమెల్లా నివారింపను |
| 285 | 4:288 | కోలలెత్తుకొని గోపాలులునుఁ దాను | జన్నెవట్టి వుట్టి జక్కఁగఁ బెట్టిన వెన్నదిన్నవాఁడు వీఁడు గదె |
| 286 | 4:289 | ఈడ నిందరికి నేలికై వున్నాఁడు | ఆవులఁ బేయల నందరియిండ్ల వావిరిఁ గాచినవాఁడా వీఁడు |
| 287 | 4:295 | ఓవో రాకాసులాల వొద్దు సుండి వైరము | జగములో రాముఁడై జనియించె విష్ణుఁడదె అగపడి లక్ష్మి సీతయై పుట్టెను |
| 288 | 4:297 | చేరి కొల్వరో యాతఁడు శ్రీదేవుఁడు | ఘనమకరకుండలకర్ణముల దేవుఁడు కనకపీతాంబర శృంగార దేవుఁడు |
| 289 | 4:298 | ఇతఁడొకఁడే సర్వేశ్వరుఁడు | పరమయోగులకు భావనిధానము అరయనింద్రాదుల కైశ్వర్యము |
| 290 | 4:300 | దేవతలఁ గాచిన దేవుఁ డితఁడు | రావణుఁజంపి పుష్పకరథ మెక్కి సీతతోడ తావుగా నయోధ్యను పట్టముగట్టుక |
| 291 | 4:301 | నమో నమో దశరథనందన మమ్ము రక్షించు | కోదండదీక్షాగరుఁడ రామచంద్ర ఆదిత్యకుల దివ్యాస్త్రవేది |
| 292 | 4:306 | ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు | జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు |
| 293 | 4:309 | పెదయౌబళపుఁ గొండఁ బెరిగీనిదే | పదివేలశిరసుల బలునరసింహము గుదిగొన్నచేతుల గురుతైనది |
| 294 | 4:310 | నరులార నేఁడువో నారసింహజయంతి | గరిమఁ బ్రహ్లాదునిఁ గాచిరక్షించి నిలిచె గురుతర బ్రహ్మాండ గుహలోనను |
| 295 | 4:313 | యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె | అయమేవ సతతం శ్రియః పతిర్దేవేషు అయమేవ దుష్ట దైత్యాంతకస్తు |
| 296 | 4:314 | ఇన్నిటా నింతటా నిరవొకటే | తిరువేంకటగిరి దేవుని నామము ధరఁదలపగ నాధారమిదే<br>గరుడధ్వజుని సుఖప్రదనామము నరులకెల్లఁ బ్రాణము దానాయ |
| 297 | 4:330 | మాధవ కేశవ మధుసూదన విష్ణు | వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా రామ రామ కృష్ణ నారాయణాచ్యుత |
| 298 | 4:331 | అందిచూడఁగ నీకు నవతారమొకటే | నవనీతచోరా నాగపర్యంకా సవనరక్షక హరీ చక్రాయుధా |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 299 | 4:334 | సోదించిరిదియె సురలును మునులును | ప్రకటము సులభము పరమపావనము అకుటిలమిది హరినామం |
| 300 | 4:352 | వింతనా నేఁ దనకు వేసాలవాఁడు | జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు వెడమాయలుగ బారి విద్యలవాఁడు |
| 301 | 4:355 | తానే తానే యిందరి గురుఁడు | పన్నగ శయనుఁడే బ్రహ్మ యోగి..అనిమిషగతుల నభ్యాస యోగి |
| 302 | 4:356 | పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవే | పెక్కురోమకూపముల పెనుబ్రహ్మాండాలు మోచే.. నీకుఁ ద్రివిక్రమాకృతి యేమి |
| 303 | 4:357 | భళి భళి రామా పంతపు రామా | విలువిద్య రామా వీరవిక్రమ రామా తలకొన్న తాటకాంతక రామా |
| 304 | 4:359 | ఎల్లలోకములవారి కేలిక దానే | నాలుగు చేతుల తోడ నవ్వుల మోముతోడ సోలి సంకుఁజక్రముల సొంపుతోడ |
| 305 | 4:364 | అల్లదెకో విజయధ్వజము | చక్కుగ నసురల సంహరించి యిదె దిక్కులు గెలిచెను దేవదేవుడు |
| 306 | 4:365 | ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా | పల్లించి గరుడనిపై నీ వుబ్బునెక్క అల్లనాఁడె పారిజాత మడవికెక్కె |
| 307 | 4:372 | ఇట్టిదివో హరికృప యెంచినను | బలుహిరణ్యాక్షుఁడు ప్రహ్లాదునిబట్టి జలధి వేసిన నీరుచట్టె తేలె |
| 308 | 4:374 | ఏమి సేయవచ్చు హరి యెలయించే మాయ లివి | శ్రీ వేంకటేశు నామము నోరనుంటే పచ్చి తనభాగ్యమంటా బ్రదుకుటగాక |
| 309 | 4:384 | ఇదియే సాధన మిహపరములకును | కలి దోష హరము కైవల్యకరము అలరిన మా శ్రీ హరి నామం |
| 310 | 4:386 | సందడి సొమ్ములతోడి సాకారమిదె వీఁడె | సందడి సొమ్ములతోడి సాకారమిదె వీఁడె యిందరు వర్ణించరే యీ రూపము మిక్కిలి నానావర్ణ మేఘపంక్తి గాఁబోలు యిక్కడనే నిలుచున్న దీరూపము |
| 311 | 4:387 | అతఁడే యెక్కుడు దైవ మందరికంటే | జలధి దచ్చేనాఁడు సకల దేవత లుండ యెలమి నేదేవుఁ జేరె నిందిరాదేవి అల గజేంద్రుఁడు మూలమని మొరవెట్టునాఁడు వెలయ నే దేవుఁడు విచ్చేసి కాచెను |
| 312 | 4:390 | ఒకరి బుద్ధులు వేరొకరి పనికి రావు | మతి యిచ్చు నాతఁడే మరపించు నాతఁడే గతియౌ నాతఁడే కరుణానిధి |
| 313 | 4:391 | కేవల కృష్ణావతార కేశవా | కేకిపింఛావతంస కేశవ శ్రీ కర గుణాభి రామ చెన్న కేశవ |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 314 | 4:393 | ఓహో యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి | జలధిలోఁ బవళించి జలనిధి బంధించి జల నిధి కన్యకను సరిఁ బెండ్లాడి జలనిధిలో నీఁది జలనిధి మథియించి జలధి వెరించిన చలమరా యితఁడు |
| 315 | 4:398 | అమ్మే దొకటియును యసిమలో దొకటి యని | సరవితో నిను నుపనిషద్వాక్యములయందు పురుషోత్తముడవనుచుఁ బొగడఁగాను అరిది నారాయణివియై యమృత మొసఁగుచో అరయ శ్రుతిదె విరోధంబాయ నీమాఁట |
| 316 | 4:400 | తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము | తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము వెగటు నాయుధ మిది |
| 317 | 4:415 | పరగీనదివో గద్దెపై సింహము వాఁడె | తెల్లని మేని సింహము దేవ సింహము మెల్లని చిరునవ్వుల మేటిసింహము |
| 318 | 4:425 | నీ నామమే మాకు నిధియు నిధానము | నమో నమో కేశవ నమో నారాయణ నమో నమో మాధవ నమో గోవింద |
| 319 | 4:452 | రామ మిందీవరశ్యామం | వీరం రణరంగధీరం సార ధర్మకులోద్ధారం క్రూరదానవ సంహారం |
| 320 | 4:457 | ఆ రూపమునకే హరి నేను మొక్కెదను | అనంత శిరసుల... ననంత నయనము లనంత కరముల ఘన నీ రూపము |
| 321 | 4:466 | చేకొన్న భక్తుల పాలి చింతామణి | వాఁడిగోళ్లచేత వడి హిరణ్యునిఁ జంపి వేడుక నెత్తురు లెల్ల వెదచల్లుచు |
| 322 | 4:468 | వేవేల చందాలవాఁడు విఠలేశుఁడు | దేవతల కెల్లాను దిక్కు దెసై వెలుఁగొంది తావుకొన్న యట్టి యాధార మీతఁడు |
| 323 | 4:471 | నమో నమో రఘుకులనాయక దివిజవంద్య | విహిత ధర్మపాలక వీర దశరథ రామ గహనవాసినీ తాటకా మర్దన |
| 324 | 4:477 | చెప్పితే నాశ్చర్యము సేసినచేఁత లితఁడు | రాముఁ డుదయించె దశరథునికిఁ దమ్ములతో గామిడైన తాటకిని ఖండించెను |
| 325 | 4:482 | ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము | అనంత సూర్య తేజుఁడట కాంతి చెప్ప నెంత దనుజాంతకుఁడట ప్రతాప మెంత |
| 326 | 4:485 | ఎంతని నుతియింతు రామరామ యిట్టి నీ | కొలఁదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 327 | 4:488 | దాసుల పాలిటి నిధానమై వున్నాఁ డదిగో | నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి |
| 328 | 4:491 | దేవదేవోత్తమ తే నమో నమో | దనుజ సంహారక దశరథ నందన జనక భూపాలక జామాత |
| 329 | 4:492 | కొలువరో మొక్కరో కోరిన వరము లిచ్చీ | కంబములోనఁ బుట్టి కనకదైత్యునిఁ గొట్టి అంబరపు దేవతల కభయ మిచ్చి |
| 330 | 4:494 | నమో నమో జగదేకనాథ తవ సర్వేశ | రామ రఘువర సిత రాజీవ లోచన భూమిజా రమణ త్రిభువన విజయ |
| 331 | 4:495 | ఎక్కడఁ జొచ్చెదరింక రక్కసులు | పిడుగుల మ్రోఁతలఁ బెళపెళ నార్చుచు వెడలెఁ గంభమున వీరసింహుఁడు |
| 332 | 4:496 | కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు | దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు రూపు చూపె నిదివో బోరున దేవుఁడు |
| 333 | 4:498 | కంటిఁగంటి వీఁడివో కని కృతార్థుఁడనైతి | యీతఁడా గోవర్ధనమెత్తిన పసిబాలుఁడు కాతరీఁ డీతఁడా గోపికా వల్లభుఁడు |
| 334 | 4:500 | సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో | జగన్నాథుఁడు వీఁడే సర్వరక్షకుఁడు వీఁడే నిగమవేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే |
| 335 | 4:502 | ఎంత ప్రతాపమువాఁడు యెంతటి నేరుపరి | వాలి నొక్క కోలనేసి వారిధి గట్టిన వాఁడు తాలిమితో సుగ్రీవుని |
| 336 | 4:503 | సర్వరక్షకుఁడైన సర్వేశుఁడే కాక | చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి బలువుగ సీతఁగూడి పట్టమేలి |
| 337 | 4:504 | కంటిమి నేఁడిదె గరుడాచలపతి | శ్రీ నరసింహుఁడు చిన్మయ కాంతుఁడు దానవాంతకుఁడు దయానిధి |
| 338 | 4:505 | అల్లవాఁడే గద్దెమీఁద నౌభళపు గుహలోన | వుక్కుఁగంభములోఁ బుట్టి వుగ్రనారసింహుఁడు మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి |
| 339 | 4:507 | ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి | వెలసి వనాల లోన వేద వేద్యుఁడైన హరి అలరి కృష్ణావతారమై యున్నాఁడు |
| 340 | 4:508 | ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు | గగనమూ నేలాఁ గాని గనమైన తొడమీఁద నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహ దేవుఁడు |
| 341 | 4:512 | సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు | తుంగభద్రా తటమున తొడపై నిందిర తోడ సింగారించుకొన్నవేల్పుసింహము |
| 342 | 4:513 | వినరయ్య నరసింహవిజయము జనులాల | ఘననారసింహుఁ డదె కంబము నందు వెడలె కనుపట్టె నదిగొ చక్ర జ్వాలలు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 343 | 4:514 | అదె లంక సాధించె నవనిభారము దించె | శరణాగత వజ్రపంజరుఁ డితఁడు సరిలేని యసుర భంజకుఁ డితఁడు |
| 344 | 4:515 | రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో | చెలువపు రూపమున జితకాముఁడు మలసీ బిరుదున సమర భీముఁడు |
| 345 | 4:518 | వినుఁ డిదె రఘుపతి విజయములు | కులగిరు లదరెను కుంభిని వడఁకెను యిల రాముఁడు రథమెక్కినను |
| 346 | 4:519 | ఇతఁడే పరబ్రహ్మ మిదియే రామకథ | ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె అరణ్య వాసుల కెల్లా నభయమిచ్చె |
| 347 | 4:520 | రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను | తరగె రావణు పూర్వతపములయాయుష్యము ఖర దూషణాదులకు కాలము దీరె |
| 348 | 4:521 | జయము జయము ఇఁక జనులాల | ఘన నరసింహుఁడు కంభమున వెడలె దనుఁజులు నమసిరి ధర వెలసె |
| 349 | 4:524 | ఆదిమూర్తి యీతఁడు ప్రహ్లాదవరదుఁడు | నవ్వుల మోము తోడ నరసింహ రూపు తోడ జవ్వని తొడ మీఁదట సరస మాడ |
| 350 | 4:526 | వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు | మంతు కెక్కిన ద్రౌపదీ మాన రక్షకుఁడీతఁడు<br>చెంతనే వుద్ధవు పాలి చింతామణి యీతఁడు |
| 351 | 4:527 | ఈతని మహిమలు యెంతని చెప్పెద | దారుణ దైత్య విదారుఁడు విష్ణుఁడు తానకమగు మా దైవంబితఁడు |
| 352 | 4:530 | అదె వచ్చె రాఘవుఁ డాతని దాటి ముట్టె | భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు అవల మీకు దిక్కేది యసురలాల |
| 353 | 4:533 | వెరపు దెలుపు నీ వేగిరమే | గోరపురుధిరము గురియు గోళ్ళ నీ తోరమైన యా తొడమీఁద |
| 354 | 4:543 | ఎన్నటి కెవ్వరి కితఁడే | పాతక శూరుఁడు పారశరీరుఁడు పూతన ప్రాణ ఘాతకుఁడు |
| 355 | 4:554 | అన్నివిభవముల అతఁ డితఁడు | వేదాంతకోట్ల విభుఁ డితఁడు నాదబ్రహ్మపు నడుమితఁడు |
| 356 | 4:563 | నారాయణ తే నమో నమో | మురహర భవహర ముకుంద మాధవ గరుడ గమన పంకజనాభ |
| 357 | 4:564 | త్వమేవ శరణం త్వమేవ శరణం | వాసుదేవ కృష్ణ వామన నరసింహ శ్రీ సతీశ సరసిజ నేత్ర |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 358 | 4:565 | పాలజలనిధిలోఁ బాయని | పరమ మునీంద్రులుఁ బద్మభవాదులు ఇరువంకల నుతియించఁగను అరవిరిమోమున నల్లన నవ్వెడి నిరతమూర్తివట |
| 359 | 4:567 | బొడ్డు తామెరలోన గడ్డివయసు | బిరుసైన దొకకొండ పెనుబాముతోఁ జుట్టి బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు |
| 360 | 4:568 | ఆదిపురుషా అఖిలాంతరంగా | భవపాథోనిధి బాడబానల భవజీమూత ప్రభంజనా |
| 361 | 4:569 | నీవు తురగముమీఁద నేర్పు | నీవు..నేర్పు మెరయ వేవేలు రూపులై వెదచల్లితపుడు |
| 362 | 4:575 | నన్ను నింత సేయుకంటె నవ్వులున్నవా పంట | నాలుకందునున్న విష్ణునామమంత్రము చెప్పు తోలుబిల్ల మాడకంటె దొడ్డసేసె నన్నును |
| 363 | 4:577 | అచ్చపు రాల యమునలోపల | ఊరుఁగాయలును నొద్దిక చద్దులు నారగింపుచు ...కోరి చవులు గొంటివి కృష్ణా |
| 364 | 4:578 | ఈతఁడే హరుఁడు యీతఁడే యజుఁడు | కడుఁ బెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన కడుపులో నిడుకొన్న ఘనుఁడు |
| 365 | 4:591 | కలియుగంబునకుఁ గలదిదియే | సంకీర్తనమే సకలలోకముల వేంకటేశ్వరుని వేదమె కలిగె |
| 366 | 4:595 | ఏలయ్య పరమాత్మ యేలికవు మాకునై | భారమగు నీటిలోఁ బవళించి నీ వాది నారాయణుఁడవైతి నాఁడూను |
| 367 | 4:597 | నందకధర నందగోపనందన | ముకుంద కేశవ మురహర సకలాధిప పరమేశ్వర దేవేశ |
| 368 | 4:603 | పృథులహేమకౌపీనధరః | తరుణః ఛత్రీ దండకమండలు |
| 369 | 4:605 | పొలమెల్లఁ దిరిగిన బోడెద్దు | ఒడలెత్తి నాలుగుయుగముల బడిఁ బడి ధర్మదేవతై పరగినెద్దు |
| 370 | 5:48 | బండి దొక్కెఁ బామునెక్కెఁ బనులెల్లాఁ దక్కె | బండి దొక్కెఁ బామునెక్కెఁ బనులెల్లాఁ దక్కె |
| 371 | 5:94 | గోళ్ళు మీఁటుచునుండెఁ గొన్నాళ్ళు | కొండ గొడుగుగాఁ బట్టెఁ గొన్నాళ్ళు తాఁ గొండముచ్చుల నేలెఁ గొన్నాళ్ళు |
| 372 | 5:98 | కొలనిదోఁపరికి గొబ్బిళ్ళో | కొండ గొడుగుగా గోవులఁ గాచిన కొండుక శిశువుకు గొబ్బిళ్ళో |
| 373 | 5:182 | శిఖుత నవ్వులవాఁడు శిన్నెకా వీఁడు | మేఁటి కుఱుచవాఁడు మెడమీఁది గొడ్డలి సీటకాలవాఁడు సిన్నెకా |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 374 | 5:216 | ఎండలు రేయెండలుగా నిరువంకఁ జూచువాఁ డు | పాలఁ బుట్టినట్టికూడు పంచిపెట్టినవాఁడు పాలునేయి ముచ్చిలించి బదికినవాఁడు |
| 375 | 5:218 | ఏమీననకురే యెప్పుడు మీరు | పొలసీననకురే పొదిగి యిందరుఁగూఁడి వులికి తలదీసుకవున్న బాలుని |
| 376 | 5:220 | అబ్బురంపు శిశువు ఆకుమీఁది శిశువు | నిండిన బండి దన్నిన చిన్నిశిశువు అండవారి మదమెల్ల నణఁచిన శిశువు |
| 377 | 5:226 | చూడవమ్మ యశోదమ్మ | పేరీఁ బేరని నేతులు చూరలు వెన్నల జున్నులును ఆరగించి యట సగఁబాళ్ళు పారవేసిన బానలివిగో |
| 378 | 5:227 | బండి విరిచి పిన్నపాపలతో నాడి | గొల్లపల్లెలో యిల్లిల్లూ చొచ్చి కొల్లలాడిన కోడెకాఁడు |
| 379 | 5:231 | ఎట్టుసేయనైన నేర్చు నిందునందు నీతఁడు | పలుదెరఁగుల దొంతులైన పాలపెరుగుకుండలెల్లఁ దొలఁగ దించి పాలుద్రాగి దొంతివేర్చె నీతఁడు |
| 380 | 5:233 | రెప్పవేసి లోకమెల్ల రేయిఁ బగలుఁ జేయనేర్చుఁ | పాలలోను దచ్చి వెన్న పలుదెరఁగులఁ దివియనేర్చు రాలువేసి నీరుమీఁదఁ దేలఁజేయు నేర్చును |
| 381 | 5:239 | ఎవ్వరు గలరీతని కిఁక నేమిటికిని వెరవకు | పెనుమాఁకుల పైపాటున బెదరి వెరచెఁ బిన్నవాఁడు ఘనమగు సుడిగాలి దాఁకి కనుమూయనోపఁడు |
| 382 | 5:244 | నల్లనిమేని నగవుఁ జూపులవాఁడు | బిరుసైన దనుజుల పీఁచమణఁచినట్టి తిరుపుఁగైదువతోడి దేవుఁడు |
| 383 | 5:254 | పేగుల జంద్యాలు వేసి పెంచపు నమలిపురి | నెత్తురుదానము సేసి నిండిన జడలతోడ బత్తుఁడైన చక్కని నాబాఁపనయ్య వీఁడివో |
| 384 | 5:257 | కలిమి నిందరిని దగ్గరుకొరకే | భంగపెట్టి గొల్లవారి పాలువెన్నలు దొంగిలించు కొరకే తోవలనెల్లా |
| 385 | 5:275 | పొద్దువోకలివి నీకు భువిలో నెన్నఁగ | మోఁతనీటిలోని యీఁత మూఁపునఁ బుట్టిన మేఁత మూఁతిమీఁది కత్తికోఁత మొనగోరివాఁత |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 386 | 5:276 | నేనెందు వోయె తా(యే–దా?) నెందు వోయీ | మీనైన నాఁటి తన మిడుకెల్ల దిగవలె కానీలే కానీలే కానీలే |
| 387 | 5:295 | తెప్పగా మఱ్ఱాకుమీఁదఁ దేలాడువాఁడు | కోడికూఁతనోరివాని కుఱ్ఱతమ్ముఁడైనవాఁడు<br>బూడిది పూసినవాని బుద్ధులవాఁడు |
| 388 | 5:374 | దశవిధాచరణం తన్నభవతి | రావణం జేష్యామి రణ ఇతి వ్యాజేన భూవరత్వే తే భోగ: పురా |
| 389 | 6:46 | తత్తా తిగుడి దింధి తక దింధిం | దానవవదనవితానదాన సంధాన రుధిరనిజపానమిదం |
| 390 | 6:58 | యెన్ని మారులు యిట్టె నీపనులు | నీళ్లే నమలేవు నీలోనె సన్నల వేళ్లే చూపేవు వెలుపలికి |
| 391 | 6:60 | బిడ్డఁ డంటా నమ్మి యెట్టు వెట్టుకొన్నా రిందుకంటె | నొకయింతి నేరుపునం జన్నియ్యంగ నెత్తు రెల్లఁ దాగి తాగి గోరపెట్టి చంపె |
| 392 | 6:62 | ఎటువంటి బిడ్డఁడె యితఁడు | నడుఁక కెటు నీటిలోననె యీఁదులాడేని తడవి పట్టెదమనిన దాఁగిపోయీని |
| 393 | 6:81 | ఘుమ్మనియెడి శ్రుతి గూడఁగను | నీలవర్ణుఁ డని నీరజాక్షుఁడని బాలుని నతివలు పాడేరో |
| 394 | 6:90 | పట్ట కింత మాచెఱఁగు బాఁపఁడా నాఁడె | పలుకుల వాదాలబాఁపఁడా యిట్టె పలునీళ్ల మునిఁగె బాపఁడా |
| 395 | 6:112 | ఓయమ్మ వెరపించె నొకభూతమూ | పది శిరసుల పెద్ద బమ్మ రాకాసునిని జెదరనీక యడిచిన భూతమూ |
| 396 | 6:151 | చక్కని సరసపు శిశువు | చుట్టమువలెనే సుడిగాలినిఁ గని బెట్టుగఁ గౌఁగిట బిగించేని |

# 3. స్మరణ భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:7 | సదా సకలము సంపదలే | వేంకటపతిఁ దలఁచి రతు లెఱుఁగగవలె రవణము వలెను హిత మెఱుఁగఁగవలె |
| 2 | 1:32 | ఎంతటివారలు నెవ్వరును హరిఁ | ఎంతటివారలు నెవ్వరును హరిఁ జింతించక నిశ్చింతులు గారు |
| 3 | 1:38 | ఇప్పుడిటు కలగంటి | ఎల్లలోకములకు నప్పఁడగు తిరువేంకటాద్రీశుఁ గంటి |
| 4 | 1:39 | తీపనుచు చేఁదు తెగఁదిని | వేంకటేశ్వరునిఁ దలఁచి యిన్నిటాఁ దాము విగతభయులయి భ్రాంతి విడువవలె |
| 5 | 1:64 | ఈ విశ్వాసంబు యెవ్వరికిఁ దోఁప | సరిలేని దుష్కర్మసంఘములు రాసులై..బెరసి కొండలమీఁదఁ బిడుగువడ్డట్లౌను తిరువేంకటాచలాధిపునిఁ దలఁచినను |
| 6 | 1:82 | పాపములే సంబళమెపుడూ | తిరముగ నినుఁ జింతించినచింతే నిరతము ముక్తికి నిధిగదా |
| 7 | 1:84 | వెలయునిన్నియును వృథా వృథా | యెరవులతపముల నెంతైనా విరవిరవీఁగుట వృథా వృథా<br>హరినచ్యుతుఁ బరమాత్మునిని మరిగి తలఁచక మఱచినను |
| 8 | 1:132 | చలపాదిరోగ మీసంసారము | హితవైన వజ్రాంగిజోడువో హరిఁదలంచుట జీవులకును |
| 9 | 1:188 | పారకుమీ వోమనసా | వేంకటగిరిపతిఁదలఁచుము వేసారకుమీ వోమనసా |
| 10 | 1:193 | చెదఱక వెలుఁగే చేనుమేయగ | శ్రీవేంకటేశుని చింతాపరతఁగాని కావఁగ నాత్మకు గతి దానేది |
| 11 | 1:194 | పోయఁగాలం బడవికిఁ | శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు |
| 12 | 1:202 | వెన్నవట్టుక నేయి వెదకనేలా | తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు కలుగుటే కలుగవలెఁగాక |
| 13 | 1:251 | కడునడుసు చొరనేల | యాత్మేశ్వరునిఁ దలఁపంగ వలదా |
| 14 | 1:262 | నారాయణ నీ నామము | నలువైన శ్రీహరినామము మతిఁదలచిన నాబంధములూడఁగా |
| 15 | 1:383 | అభయ మభయమో హరి | పాపపు బంధము లూడెను చిక్కక నినుఁదలచిన వలన |
| 16 | 1:407 | దైవమా నీకు వెలితా | వేదనారాయణయంటే వీడేటిబంధములు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 17 | 1:461 | వెడమంత్ర మిఁకనేల | హరి యచ్యుతాయంటే నణఁగుఁ బాపములు |
| 18 | 2:21 | చెప్పరానిమహిమలశ్రీవేంకటేశుఁ దలఁచి | శ్రీవేంకటేశుఁ దలఁచి యిప్పుడిన్నిటా గెలిచె నేఁటిదో యీమనసు |
| 19 | 2:225 | ఇహపరసాధన మీ తలఁపు | సుఖదుఃఖములు ముంచినను జడియని నామస్మరణమే తలఁపు |
| 20 | 2:409 | సమబుద్ధే యిందరికి సర్వవేదసారము | నెవ్వరైనానేమి శ్రీవేంకటపతి నందముగాఁ దలఁచిన దది సుఖము |
| 21 | 3:307 | కడనుండి రావు కానివి నైనవి | తతి నీ నామము దలఁచినవారిఁ అతిపాపమె పుణ్యంబాయ |
| 22 | 3:477 | మునుల తపము నదె మూలభూతి యదె | మనసులోననే మాధవుఁ డుండఁగ..తనుఁ దా రక్షించుఁ దలఁచినను |
| 23 | 3:496 | కడవ రాదు హరి ఘనమాయ | తగు మోక్షమునకుఁ దాపయైన దిదె నగి హరిఁ దలఁచిన నాలుకిది |
| 24 | 4:148 | కైకొంటే కాక కమలనాభుని యాజ్ఞ | శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా పావనమైతిమి యిఁక బరచింత యేది |
| 25 | 4:201 | అంతటనే వచ్చి కాచు నాపద్బంధుఁడు హరి | దురితవిధులు సేసి దుఃఖించు మానవుఁడు తరవాత హరిపేరు దలఁచుటే చాలు |
| 26 | 4:216 | విడువుము మనసా వీరిడి చేఁతలు | విడువుము మనసా వీరిడి చేఁతలు తడయక శ్రీహరిఁ దలఁచవొ యిఁకను |
| 27 | 4:242 | వెగ్గల మింతా వృథా వృథా | మరవఁగమరవఁగ మాయలే యింతా మురహరుఁదలచితే మోక్షము |
| 28 | 4:326 | చవి నోరి కేడఁ దెత్తు సంపదేడఁ దెత్తు వీని | వేడుకైనపొందు శ్రీవేంకటేశుఁ దలఁచుటే ఈడులేనిబంధుకోటి ఈతఁడెకాఁడా |
| 29 | 4:405 | ఇవియే పో ప్రద్యుమ్న యిహపరసాధనము | నీ నామజపమే చాలు నాలుక సులభము |
| 30 | 4:412 | మఱచితిమంటే మరి లేదు | నట్టనడుమనే నరహరినామము గుట్టున దలఁచవో గొనకొని మనసా |
| 31 | 4:414 | నేనై విడువవద్దు తానై తగులవద్దు | పొద్దు వొద్దు హరిఁ దలఁపున దలపోయఁగ వొద్దికైన పలుచేత లున్న వెల్లా మరచును |
| 32 | 4:463 | ఏమరక తలఁచరో యిదే చాలు | భువి యెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు తవిలి గోవిందు నాత్మఁదలఁచినఁ జాలు |
| 33 | 4:589 | కంటి నఖిలాండ కర్త నధికుని గంటి | పరమ యోగీంద్రులకు భావగోచరమైన సరిలేని పాదాంబుజములు గంటి |

## 4. పాదసేవన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:66 | ఈ పాదమేకదా యిలయెల్లఁ గొలిచినది | ఈ పాదమేకదా ఇందరును మొక్కెడిది యీ పాదమే కదా యీగగనగంగ పుట్టినది |
| 2 | 1:186 | ఎంతపాపకర్మమాయ | వేంకటేశు ఘనుని పాదసేవ నాకు మొల్లమాయ |
| 3 | 1:191 | బ్రహ్మగడిగినపాదము | బ్రహ్మగడిగినపాదము బ్రహ్మము దానె నీపాదము |
| 4 | 2:90 | అన్నియునుఁ దనఆచార్యాధీనము | చెన్నుమీఱ హరిపాదసేవ సేయు మనసా |

## 5. అర్చన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:12 | సందడి విడువుము సాసముఖా | అమరాధిపు లిడు డాలవట్టములు కమలజ పట్టుము కాళాంజి |
| 2 | 1:22 | ఇందిర వడ్డించ | సక్కెరరాసులు సద్యోఘృతములు కిక్కిరియ నారగించవో స్వామీ |
| 3 | 1:46 | మంగళము గోవిందునకు | మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును |
| 4 | 1:67 | అలరఁ జంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు సేసె నీవుయ్యాల | అలరఁ జంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు సేసె నీవుయ్యాల |
| 5 | 1:138 | పంకజాక్షులు సొలసిపలికి నగఁగా | కలవంటకములు పులుఁగములు..నారగించవయ్యా |
| 6 | 1:139 | భోగిశయనమును బుసకొట్టెడిని | యోగనిద్ర పాయును మేల్కొనవే |
| 7 | 1:374 | మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా | మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా |
| 8 | 1:377 | మేదిని జీవులఁ గావ మేలుకోవయ్యా | మేదిని జీవులఁ గావ మేలుకోవయ్యా |
| 9 | 1:448 | మరలి మరలి జయమంగళము | మరలి మరలి జయమంగళము |
| 10 | 2:60 | చూపఁ జెప్పగల భక్త సుజనుఁడవు మాకు | వూరకే మాయింట నీవు వొదవినపాటి నీవారగించవయ్య చవు లొఁగాములెంచక |
| 11 | 2:134 | షోడశకళానిధికి షోడశోపచారములు | అల గంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు జలధిశాయికిని మజ్జన మిదె |
| 12 | 2:280 | కోటిమన్మథాకార గోవింద కృష్ణ | అకాశమువంటి మేన నమరేమూ ర్తివి గాన అకాశనదియే నీకు నభిషేకము |
| 13 | 2:431 | జయమంగళము నీకు సర్వేశ్వరా | జయమంగళము నీకు సర్వేశ్వరా జయమంగళము నీకు జలజవాసినికి |
| 14 | 2:436 | ఎందాఁక నిద్ర నీకిదె తెల్లవారెఁ గదె | ఎందాఁక నిద్ర నీకిదె తెల్లవారెఁ గదె యిందిరారమణ నీవిటు మేలుకొనవే |
| 15 | 3:163 | మదనజనకునికి మజ్జనవేళ | వేద ఘోషాల నుర్వీధరుని మీఁద పన్నీటి కాలువలు పారీనదె |
| 16 | 3:298 | వేఁకునఁ దిరుపళచ్చి విష్ణునికిఁ జేయరో | పట్టపుదేవుళ్లుఁ దాను బంతి సాగి వున్నవాఁడు అట్టె సేయరో పులుఁగ మారగింపులు |
| 17 | 3:461 | జోజో యని మీరు జోల వాడరో | షోడశోపచారములఁ జొక్కించి శ్రీవేంకటేశుఁ బాడరో ధర్మము నిల్పె భార మణఁచె |
| 18 | 3:484 | ఏమి నిద్దిరించేవు యెందాఁకాను | తోడనే గంధాక్షతలు ధూపదీపా లివిగో..వాడుదేరఁ బూజించవలెఁ గమ్మఁబువ్వులివె |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 19 | 3:543 | హరికృష్ణ మేలుకొను ఆదిపురుషా | కనుదెరవు నా తండ్రి కమలాప్తుఁ డుదయించె..దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే |
| 20 | 4:27 | అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు | దేవునిఁ బూజించితిమి తేరో నైవేద్యాలు కైవసమై కృష్ణునికి గంపల కొలఁదులు |
| 21 | 4:130 | రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో | దీపములు దెల్లఁబారె తిమిరమింతయు జారె శ్రీపురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే |
| 22 | 4:177 | ఎన్నిమహిమలవాఁడె యీ దేవుఁడు | పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి..తట్టుపునుఁగు కాపు దైవశిఖామణికి |
| 23 | 4:465 | వారిధిశయన వో వటపత్రపరియంక | వారిధిశయన వో వటపత్రపరియంక గారవాన మేలుకొని కన్నులు దెరవవే |
| 24 | 4:570 | నిద్దిరించీఁ బాలజలనిధి వలెనే | యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను |
| 25 | 4:576 | ముదమలర కాలముల మీరిటు మోసపోక | పరగు చీనాంబరములను నతి పరిమళమ్ముల బుష్పముల..ధూపముల బహుదీపాదులను<br>తాంబూలవిధులను పరగఁ బూజింపుఁడు |
| 26 | 5:343 | నిద్దిరించి పాల జలనిధివలెనే | యోగీంద్రవరదుని వూఁచరే వుయ్యాలను..విరివి నాలవట్టాలు విసరరే సతులు |
| 27 | 6:4 | ఆరగింపవో మాయప్ప యివే | ఆరగింపవో మాయప్ప యివే పేరిన నేతులు పెరుగులును |
| 28 | 6:25 | విన్నపాలు వినవలె వింత వింతలు | చల్లని తమ్మిరేకుల సారసపుఁ గన్నులు<br>మెల్ల మెల్లనె విచ్చి మేలుకొనవేలయ్యా |

## 6. వందన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:53 | వందే వాసుదేవం బృందారకాధీశవందితపదాబ్జం | వందే వాసుదేవం బృందారకాధీశవందితపదాబ్జం |
| 2 | 1:245 | నమో నారాయణాయ నమః | నమో నారాయణాయ నమః |
| 3 | 1:269 | నమో నారాయణాయ | నమో నారాయణాయ |
| 4 | 1:289 | ఆదిదేవ పరమాతుమా | వేదవేదాంతవేద్య నమో నమో |
| 5 | 1:380 | నారాయణాయ నమో నమో | నారాయణాయ నమో నమో |
| 6 | 1:481 | జడమతిరహం కర్మజంతురేకో | జడధినిలయాయ నమో సారసాక్షాయ |
| 7 | 2:7 | ఒల్లదుగాక దేహి వుద్యోగించదు గాక | మొక్కనేరిచితే జాలు మోక్షమేమి లేదో యెక్కువ శ్రీవేంకటేశు డిదె వున్నాడు |
| 8 | 2:83 | కిన్నజానేs హం కేశవాత్సర మహో | కాలాత్మకాయ నిజకరుణాకరాయ నమో ..శ్రీవేంకటేశాయ నమో నమో |
| 9 | 2:236 | త్రికరణశుద్ధిగా చేసిన పనులకు దేవుదు | శ్రీవేంకటపతికినిఁ జేయెత్తి మొక్కిన మాత్రములోపలనే పదిలపు షోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును వదలక సాగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా |
| 10 | 2:248 | నిండె నిన్నిచోటులను నీమహిమలే | అండనే మొక్కేము నీకు నాదినారసింహా |
| 11 | 2:297 | ఇటులైతేఁ బుణ్యము నీకు యిది | ధరణిధర శ్రీవేంకటేశ నమోనమో యని మొక్కంగాఁ ననుఁగాతువు గాక |
| 12 | 2:365 | కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద | కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద మూశిన ముత్తెమువలె మొక్కేము నీకు |
| 13 | 2:379 | మొక్కరె మొక్కరే మీరు ముందు ముందే | మొక్కరె మొక్కరే మీరు ముందు ముందే జయ లిడి దక్కి శ్రీవేంకటేశుఁడే తానైన దేవునికి |
| 14 | 2:391 | గరుడగమన గరుడధ్వజ | కమలనయన కమలాప్తకుల నమో నమో హరి నమో నమో |
| 15 | 2:453 | పరమపురుష హరి పరమపరాత్పర | జలనిధికారుణ్య నమో తేహం జలనిధిగంభీర నమో నమో |
| 16 | 2:498 | అదివో చూదరో అందరు మొక్కరో | అదివో చూదరో అందరు మొక్కరో గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని |
| 17 | 3:24 | నవనీతచోర నమో నమో | నవనీతచోర నమో నమో నవమహిమార్ణవ నమో నమో |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 18 | 3:131 | నలినాక్ష నీకు నమస్కరించిన | నలినాక్ష నీకు నమస్కరించిన ఫలము వొగడ నిఁక బ్రహ్మకు వశమా |
| 19 | 3:527 | శ్రీహరి నిత్యశేషగిరీశ | రామనామ నారాయణ విష్ణో దామోదర శ్రీధర నమో నమో |
| 20 | 4:100 | పాపపుణ్యముల పక్వమిదెరఁగను | వెలుపల లోపల వేళావేళల నలినాక్ష నీకే నమోనమో |
| 21 | 4:536 | కందర్పజనక గరుడగమన | నీరజ నాభ నిగమ గోచర నారాయణ హరి నమో నమో |

## 7. దాస్య భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:21 | దురితదేహులే తొల్లియును | అనంతకోటి మహామునులు.. ఇనశశినయనుని నితనిని మును గని<br>భజించి గత కల్మషులైరి |
| 2 | 1:28 | పాపపుణ్యములరూపము దేహమిది | తిరువేంకటాచలాధిపునిఁ గొలిచినఁగాని పరగు బ్రహ్మానందపరుఁడుఁ దాఁగాడు |
| 3 | 1:44 | కొలువుఁడీ భక్తిఁ గొండలకోనేటి నిలయుని | కొలువుఁడీ భక్తిఁ గొండలకోనేటి నిలయుని |
| 4 | 1:115 | కూడువండుట గంజికొరకా | కొండలకోనేటిపతిఁ గొలిచి తనదు నిండినాపదలెల్ల నీఁగవలెఁ గాక |
| 5 | 1:429 | వివేకమెఱఁగని వెఱ్ఱులము గాక నేము | ఆలించి శ్రీవేంకటేశుఁ డాత్మలో వెలుఁగగాను మేలి మాతనిఁ గొలిచి మెరయంగఁవలదా |
| 6 | 1:444 | అతనినే కొలిచి నేనందితిఁ బో | ఆతని కైంకర్యమెపో కలకాలము మాకు కాణాచి |
| 7 | 2:10 | అతిసులభం బిది యందరిపాలికి | అతిసులభం బిది యందరిపాలికి గతియిది శ్రీపతికైంకర్యం |
| 8 | 2:20 | నీ దాస్యమొక్కటే నిలిచి నమ్మఁగలది | నీ దాస్యమొక్కటే నిలిచి నమ్మఁగలది |
| 9 | 2:57 | ఈతనిఁ గొలిచితేనే యిన్ని గొలలును | ఈతనిఁ గొలిచితేనే యిన్ని గొలలునుఁ దీరు చేతనఁ బెట్టు పుణ్యాలు చేరువనే కలుగు |
| 10 | 2:77 | బలువుఁడు హరిఁ జేపట్టితిని | సిరివరుఁ డితనినిఁ జేకొని కొలిచిన పరమసుఖమెపో భయ మెక్కడిది |
| 11 | 2:88 | ఏ పురాణముల నెంత వెదకినా | శ్రీవేంకటపతి సేవించు సేవలు పావనము లధికభాగ్యపు సిరులు |
| 12 | 2:116 | ఇంతదేవుఁ డింక వేఁడీ యెంచి చూపుఁడా | శ్రీవేంకటపతై వరములిచ్చేటివాఁడు యేలీలఁ గొల్చిన మెచ్చు నీవిభుఁగొలువరో |
| 13 | 2:164 | చాటెద నిదియే సత్యము సుండో | చాటెద నిదియే సత్యము సుండో చేటు లేదీతని సేవించినను |
| 14 | 2:170 | అన్నిటాను హరిదాసు లధికులు | తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు యెక్కడా మోక్షోపాయ మిఁకఁ జెప్ప నున్నదా |
| 15 | 2:171 | ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱిలేదు | ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱిలేదు కదిసి నీబంటనంటే కాతువు నన్నును |
| 16 | 2:182 | పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో | శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు |
| 17 | 2:201 | ఒడఁబరుచుకొంటివి వుపేంద్ర నిన్ను | నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 18 | 2:210 | ఇదియే ఉపాయ మిఁక నాకు నిందుల | శ్రీవేంకటేశుఁడు నాకును యేలికయై మన్నించఁగను పదిలముగా నాతనిసేవచేసి పరమానందుఁడనయ్యేఁ గాక |
| 19 | 2:215 | ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు సేసితి | శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి నిలిచిన కాలమెల్లా నీసేవే చేసితి |
| 20 | 2:233 | మూఁడే మాటలు మూఁడుమూండ్లు | శ్రీవేంకటేశ్వరుఁగొలిచి దాసుఁడౌటే వీడని బ్రహ్మానంద వేదాంతరహస్యము |
| 21 | 2:237 | ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు | ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు ఆతని బంట్లము మాకు నన్నిటా నిశ్చింతము |
| 22 | 2:254 | దేవుఁడుగలవారికి దిగులుఁ జింతయు లేదు | యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు అరయ దాసులము మా కడ్డాఁకే లేదు |
| 23 | 2:294 | అతని నడుగవో చిత్రగుప్త నాయందలి | చెప్పఁగ నాపాలి దేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే |
| 24 | 2:296 | ఎట్టు సేయఁగలవాఁడవో యిఁక నీచేతిది | ఎట్టు సేయఁగలవాఁడవో యిఁక నీచేతిది నావునికి నెట్టన నీదాఁసుడనైతిని నీచిత్తం బిఁకను |
| 25 | 2:340 | ఇదివో నాసంపదా ఆస్తియుఁ బాస్తి నీవు | పదిలంబుగ నా బ్రతుకెల్లా నీవే పాలించఁగదే నారాయణా |
| 26 | 2:482 | కేశవదాసినైతి గెలిచితి నన్నిటాను | కేశవదాసినైతి గెలిచితి నన్నిటాను |
| 27 | 2:488 | కామధేనువిదే కల్పవృక్షమిదే | శ్రీవిభు భక్తే జీవనము ఆ విష్ణుకైంకర్యమే సంసారము పావనులగు యీప్రపన్నులకు |
| 28 | 2:493 | ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను | యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటికి మూలము చిక్కులు వాపె నితని సేవించరో |
| 29 | 3:7 | పూచిన యీ దేహము పువ్వుగాని పిందెగాని | యేలినవాఁడు శ్రీహరి యేమి సేసినా మేలె |
| 30 | 3:84 | ఇన్ని దేహములఁ బుట్టి యేమి గంటిమి | శ్రీవేంకటాధిపతి సేవించి యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము |
| 31 | 3:91 | చేసినట్టే సేసుఁ గాక చింత మాకేలా | యీ గతి శ్రీవేంకటేశుఁ డెట్టు వలసినఁ జేసు బాగులుగా నీతని శ్రీపాదమే మా దిక్కు |
| 32 | 3:198 | ఏడ ధర్మ మేడ కర్మ మిన్నియు నీ సేవేకాక | శ్రీవేంకటేశ నిన్ను సేవించవచ్చితేఁ జాలు భావించి రక్షింతువు నీపరుషలను |
| 33 | 3:201 | ఏమి సేయఁగలవార మెందుకు నౌదుము నేము | శ్రీవేంకటేశ్వర నీ సేవే ధ్రువపదము |
| 34 | 3:260 | ఎటువంటి వెట్టినో యేమని విన్నివింతును | మహిలో శ్రీవేంకటేశ మరి నీదాఁసుడనైతి |
| 35 | 3:378 | రెప్పలమరఁ గదె రేపును మాపును | యీతఁడె శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన చేచేతనే సుఖములు సేనాసేన |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 36 | 3:379 | అన్నియు నాయందే కంటి నన్నిటివాఁడా నేనే | శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను తగు నీదాఁసుడనై దాసరి నేనైతి |
| 37 | 3:413 | విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁడని | యెన్నఁగ శ్రీవేంకటేశ యిందరి నేలేవు నీవే నిన్నే కొలుచుటఁ గాక నీటుగర్వాలేల |
| 38 | 3:427 | ఎన్ని చందముల నెట్టైన నుతింతు | సరుగ శ్రీవేంకటేశ్వర నీదాస్యము మరిగితె నదె ముమ్మాఁటికిని |
| 39 | 3:435 | తప్పు లెంచ కిఁక దరి చేర్చవయ్యా | కలిదోషహరణ కర్మవిదారణ సులభపు నీ దాసులమయ్యా |
| 40 | 3:465 | ఏమి సేయుదును నా కేది బుద్ధి యంతర్యామి | తనిసితి నింక నీదాస్యంబే గతి ఘనుఁడవు శ్రీవేంకటనాథా |
| 41 | 3:479 | ధరలో నా జన్మమే తనువు నదియె | యిరవై నీ దాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే |
| 42 | 3:481 | సంసారికిఁ గల సహజమిది మతిఁ | యేచిన శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన చూచినవెల్లా సులభములే తాచి యీతనికె దాసులమయితిమి |
| 43 | 3:486 | జీవన్ముక్తులము శ్రీపతిదాసులము | జీవన్ముక్తులము శ్రీపతిదాసులము |
| 44 | 3:537 | నిండిన జగములెల్లా నీయాధీనము | పక్కన నీ బంటనింతే పరచింత లెఱఁగ బందు జన్మములవాఁడ భయమేమీ నెరఁగ |
| 45 | 3:549 | గోవిందుదాసులమై కొన కెక్కుదుముఁ గాక | గోవిందుదాసులమై కొన కెక్కుదుముఁ గాక వేవేలు విధుల నమ్మి వెతఁబడఁగలమా |
| 46 | 3:552 | తెలిసినవారి కింతా దేవుఁడై యుండు | యెక్కువతో శ్రీవేంకటేశ్వరు దాఁసుడ నైతి వొక్కఁడే మాకిన్నిటికిఁ నొడయఁడై నిలిచె |
| 47 | 3:554 | ఎందరు గలిగిన నితనిలోనే | గోవిందుఁ డితనిఁ గొలిచితి మిదివో తోవయుఁ గంటిమి తుదకెక్కితిమి |
| 48 | 3:568 | అతనిలోనే యణఁగె నన్నియును | దినదిన తపములఁ దీదీపులవుకంటే తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో |
| 49 | 4:14 | ఎన్నఁడుఁ జెడనియీవు లిచ్చీని మాధవుఁడు | *సర్వేంద్రియాలతో హరికి సేవ చేసే దాస్య భావమే ఈ కీర్తనలో ప్రతిఫలించింది* |
| 50 | 4:42 | విత్తొకటి వెట్టఁగా వేరొకటి మొలచునా | యిహమునకు శ్రీవేంకటేశ నీదాస్యమున విహరించెఁ దనువు యిఁక వెఱపేల కలుగు |
| 51 | 4:50 | ఎంచి సేయు పను లిఁక లేవు | ఎంచి సేయు పను లిఁక లేవు కొంచక యాతనిఁ గొలుచుటే కలది |
| 52 | 4:51 | అన్నివిధములుఁ దానై యాతుమలో మరి వీఁడే | అమర శ్రీవేంకటేశు నడుగులే మాకు నిండ్లు తమితో నాతనిసేవే తల్లియుఁ దండ్రియును |
| 53 | 4:71 | ఇదివో శ్రుతిమూల మెదుటనే వున్నది | యిన్నిటా శ్రీవేంకటేశ్వరు సేవె పన్నినగతి నిహపరసాధన మదే |
| 54 | 4:78 | నిత్యసుఖానంద మిదె నీ దాస్యము | నిత్యసుఖానంద మిదె నీ దాస్యము సత్యములేని సుఖాలు చాలుఁ జాలు నయ్యా |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 55 | 4:113 | జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము | జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను |
| 56 | 4:126 | కావఁగ (క ) నీకే పోదు కరుణానిధివి గాన | యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత |
| 57 | 4:131 | పుట్టెడి దింతా బూటకంబులే | శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి యాతనిఁగొలిచితి మడ్డంబేది |
| 58 | 4:135 | మఱి విచారించఁబోతే మంచంముకిందే నూయి | పమ్మిని శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు |
| 59 | 4:195 | కటకటా యీ ప్రాణి గతి గనుట యెన్నఁడో | దైవమొక్కఁడవే నీ దాసానుదాసుఁడనైతి యేవిధులు నే నెరఁగ నిటు నిన్నేకాని |
| 60 | 4:222 | ఏమిటికిఁక నితరపుణ్యములు | ఏమిటికిఁక నితరపుణ్యములు తాము దామె హరి దాసుఁడ నేను |
| 61 | 4:233 | ఇదిగో రూపై తోఁచీ యిందరియెదుట నివి | ధర నాతనిదాస్యమే తగిన ముక్తి |
| 62 | 4:236 | ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల | తగు హరిడింగరీఁడ దాసుఁడ బంటననేటి మిగులఁ బెద్దతనము మించేది మాకు |
| 63 | 4:260 | అజ్ఞానులకివి యరుహము లింతే | అగపడి శ్రీవేంకటాధిపుఁ గొలిచితే యెగువ దిగువ మాకెదురేదయ్య |
| 64 | 4:261 | హరి సర్వాత్మకుఁ డాదిమపురుషుఁడు | చేరువ నిదివో శ్రీవేంకటపతి ధారుణిఁ గొలిచేటి దాసులభాగ్యము |
| 65 | 4:308 | ఎన్నఁడొకో నే నీచెరఁ దగులక | చేవల మోక్షము శ్రీవేంకటపతి సేవాధీనము సిలుగే లేదు |
| 66 | 4:311 | దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు | తపములు జపములు దాస్యమూలమె కాన..యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి |
| 67 | 4:312 | ఏ గతి నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము | యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా నెప్పన నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె |
| 68 | 4:329 | ఏదియుఁ గానఁడు (గాననందు?) నేది గాదందు | ఆదిపురుష నీ దాస్యమే చాల నాకు |
| 69 | 4:399 | ఇతరములన్నియు నడుమంత్రములే యెంచి చూచినను | శ్రీవేంకటగిరి నాయకుఁ డితఁడే చేరి భజించుము జీవాత్మా |
| 70 | 4:407 | బాపు బాపు దేవుఁడా పంతపు వో మనసా | యెక్కువ శ్రీ వేంకటేశ యిన్నియు నీదాసుఁడైతే వొక్కటఁ గానఁగవచ్చు నోహో నీమాయ |
| 71 | 4:451 | వలసిన వారికి వై పులివి | యెదుటనే శ్రీవేంకటేశ్వరుని కదిసి భజించుటే ఘనమర్మం |
| 72 | 4:549 | తనకేఁటి యేతులిందరిలోన | చెడక వేంకటపతి సేవించి సకలము కడుగుకొనెడి బుద్ధి కనవలెఁగాక |
| 73 | 4:556 | ధనముగని మరికదా ధనికుఁడౌట | వేరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ దాసులై మరికదా ధన్యులౌట |
| 74 | 4:560 | ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినంత కాని లేదు | ఎచ్చరకఁ దిరువేంకటేశుఁ గొలువకుంటే ఇచ్చటచ్చట సుఖమించుకంత లేదు |

## 8. సఖ్య భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:29 | పెంచఁబెంచ మీఁదఁ బెరిగేటిచెలిమి | వేంకటాద్రివిభునిఁ గూడి వేడుకయిన చెలిమి |
| 2 | 1:295 | బలువగుఁ దనరూపము చూపెఁ | నరునకు నందనే తెలిపె మహామహిమ |

## 9. ఆత్మనివేదన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 1 | 1:17 | నీవే కానింక నే | నీవే కానింక నే నన్య మెఱగ |
| 2 | 1:27 | నిన్నుఁ దలఁచి నీపేరు | ఘనపాపుని నన్నుఁ గాచు..యెలమితోఁ దిరువేంగళేశుఁడ నాపాలఁ గలిగి నీకృప గలుగఁజేతువుగాక |
| 3 | 1:33 | పరమపాతకుఁడ భవబంధుఁడ | అపవిత్రుఁడ నే నమంగళుఁడఁ గడు నపగతణ్యుఁడ నలసుఁడను |
| 4 | 1:35 | ఏ నిన్ను దూరక నెవ్వరి దూరుదు | అపరాధిఁ గనక నన్నరసి కావుమని ..నీకు శరణంటిఁగాక |
| 5 | 1:62 | ఎంతచదివిన నేమివినిన | పరధనములయాస పాసినఁగాక అరిదినిందలులేనియప్పుడు గాక విరసవర్తనము విడిచినఁగాక పరమేల కలుగు నాపదలేల మాను |
| 6 | 1:78 | అతిదుష్టుఁడ నే నలసుఁడను | నీవే దిక్కుగాక మరి దిక్కేది |
| 7 | 1:108 | నాపాలిఘననిధానమవు నీవే | ఒలిసి నన్నేలే దేవుడవు నీవే |
| 8 | 1:150 | పనిలేనిధనవాంఛఁ బడిపొరలిన | శ్రీవేంకటాద్రీశుఁ జేరనిపనులెల్ల నేవగింతలే కాక యిందేమి గలదు |
| 9 | 1:155 | శ్రీమన్నారాయణ | నీ శ్రీపాదమే శరణు |
| 10 | 1:158 | ఆఁకటివేళల నలపైన వేళలను తేఁకువ | హరినామమే దిక్కు మఱి లేదు |
| 11 | 1:167 | వాసివంతు విడిచినవాఁడే | యింద్రియపు మోహజలధిలోన వంచన మునుఁగనట్టువాఁడే యోగి |
| 12 | 1:195 | ఏఁటికి నెవ్వరిపొందు | జవ్వనమదము చీచీ చక్కఁదనమరో చీచీ |
| 13 | 1:210 | ఇన్నిచేఁతలును దేవుఁడిచ్చినవే | తెగని యాపదలకు దేవుఁడే కలఁడుగాక |
| 14 | 1:266 | ఆపన్నులపాలిదైవ మాతఁడే గతిఁదక్క | ఆపన్నులపాలిదైవ మాతఁడే గతిఁదక్క |
| 15 | 1:286 | ఏమీ నెఱఁగనినా కేడపుణ్యము | భారము నీది దైవమా |
| 16 | 1:291 | దైవమా పరదైవమా | అతికష్టుఁడగునాకు..నను నీవే మెరయింతుగాక |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 17 | 1:323 | త్వమేవ శరణం త్వమేవ శరణం | త్వమేవ శరణం త్వమేవ శరణం |
| 18 | 1:327 | జీవుఁడెంతటివాఁడు చిత్తమెంతటిది | తిరువేంకటాధిపుని మన్ననఁగాని వెరసి యిన్నిటి గెలువ వెరవు మఱి లేదు |
| 19 | 1:341 | సతతము నేఁజేయు ననాచారములకు | మతి ననుఁగని కావుము రామా రామా రామా |
| 20 | 1:361 | ఎక్కడ చొచ్చెడి దీభవమేదియుఁ | తిరువేంకటగిరిపతియగు దేవశిఖామణిపాదము శరణని బ్రదుకుటదప్పను సన్మార్గము లేదు |
| 21 | 1:370 | ఎట్టు వేగించే దిందుకేగురే సిత్తరకాండ్లు | యిల్లిదె నీ శరణంటి మిందరిని గావవే |
| 22 | 1:372 | దేవ నీవిచ్చేయందుకు దీనికిఁగా | శ్రీవేంకటేశ శరణంటి నిదె నీకు |
| 23 | 1:373 | పరుసమొక్కటే కాదా పయిఁడిగాఁ జేసేది | సాకారుడైన హరి శరణుచొచ్చినఁ జాలు |
| 24 | 1:379 | ఇందిరానాయిక యిదివో మాపాటు | శ్రీవేంకటపతి నీవే కాతువుగాక |
| 25 | 1:381 | అంతర్యామీ అలసితి సొలసితి | అంతర్యామీ అలసితి సొలసితి యింతట నీ శరణిదె చొచ్చితిని |
| 26 | 1:382 | దేవ నీ మాయతిమిర మెట్టిదో | శ్రీవేంకటేశ బంధముక్తునిఁజేసి తలఁపులో నెలకొని దయఁజూడవయ్యా |
| 27 | 1:385 | అంతయు నీవే హరి పుండరీకాక్ష | శ్రీవేంకటేశ్వరుఁడా నాకు నెట్టన గతి యింక నీవే నీవే |
| 28 | 1:389 | పనిమాలినట్టి వట్టిపఁఅదుగాక | చప్పుడుగా నతనికే శరణన్నఁజాలుఁగాక తప్పులును వొప్పులు నాతనివేకావా |
| 29 | 1:391 | ఇటుగన సకలోపాయము | ఇటుగన సకలోపాయములుడిగిన యీశ్వరుఁడే రక్షకుఁడు |
| 30 | 1:409 | సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను | సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను సర్వాపరాధినైతి |
| 31 | 1:427 | నా తప్పు లోఁగొనవే నన్నుఁగావవే దేవ | శ్రీవేంకటేశ సర్వాపరాధి నేను మొక్కితి నన్ను రక్షించు ముందెఱుఁగ నేను |
| 32 | 1:432 | తెలియక వూరక తిరిగేము | శ్రీవేంకటేశు శరణమిటు గని మనకుండిన గతి యిఁక నేది |
| 33 | 1:434 | ఇందిరాధిపునిసేవ యేమరకుండుటగాక | శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డందరికి తప్పక యాతఁడే కాచు |
| 34 | 1:438 | ఆపద్బంధుడు హరి మాకుఁ గలఁడు | ఆపద్బంధుడు హరి మాకుఁ గలఁడు |
| 35 | 1:443 | కంటినిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి | శ్రీవేంకటేశుఁ దగిలి శరణుచొచ్చి నిర్మలాన నుండుకంటే నిశ్చయము లేదు |
| 36 | 1:445 | దైవమ నీవే గతి మాతప్పులు పనిలేదు | దైవమ నీవే గతి మాతప్పులు పనిలేదు శ్రీవల్లభుఁడవు నీవే చేకొని కావఁగదే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 37 | 1:455 | నీవేలికవు మాకు నీ దాసులము నేము | దండిగా నమ్మితే నీవు దయఁజూచు టరుదా |
| 38 | 1:465 | బోధకులెవ్వరు లేక భోగినైతిని | శ్రీధరుఁడే మాకు దిక్కు చింతింపనిఁకను |
| 39 | 1:466 | మొదలుండఁగొనలకు మోచి నీళ్ళుపోయనేల | శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి |
| 40 | 1:499 | ఎట్టయినాఁ జేయుము యింక నీచిత్తము | ఇదె సందడి హరి నీ శరణాగతుఁడ |
| 41 | 1:500 | ఒక్కఁడే అంతర్యామి వుపకారి చేపట్టు | శ్రీవేంకటేశుఁడితని మూలమే యింత నెమ్మిఁదానే గతియంటే నిత్యమవు నింతే |
| 42 | 1:506 | మొఱ వెట్టెదము మీకు మొగసాల | మఱఁగుచొచ్చితి మీకు మముఁగావరో |
| 43 | 2:2 | విడువరా దెంతైనా వెట్టివాడనైన నీకు | విడువరా దెంతైనా వెట్టివాడనైన నీకు కడవారు నవ్వకుండా కాచుకో నన్నును |
| 44 | 2:9 | అన్నిటి కెక్కుడు యీని హరి యిచ్చేది | యెడయక శ్రీ వేంకటేశుఁడై వున్నాఁడు వీఁడె  జడియ కితఁడే కాచు శరణంటే జాలును |
| 45 | 2:15 | పెట్టిన నీ వెఱుఁగుదు పెనుదిక్కు | జట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి |
| 46 | 2:35 | వేసరకు వీఁడేల యనకుము విడువ నిన్నిఁక | విడువ నిన్నిఁక శరణు చొచ్చితి |
| 47 | 2:36 | ఏమందురు యీమాటకు నిందరూ నిన్ను | శ్రీవేంకటేశ అరితేరినట్టినన్నువదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా |
| 48 | 2:39 | నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ | ఆరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నాభారమేరీతినైన మోపు మిఁక నంతర్యామి |
| 49 | 2:52 | ఎక్కడి మతము లింక నేమి | తక్కక శ్రీపతి నీవే దయఁజూతుగాక |
| 50 | 2:53 | పురుషోత్తముడఁ నీవు పురుషాధముఁడ నేను | పురుషోత్తముడఁ నీవు పురుషాధముఁడ నేను |
| 51 | 2:66 | విభుఁడ వింతటికి వెరవుతో నను఼గావు | పలులంపటాలచేతఁ బాటుపడి పాటుపడి అలసితిఁ గావవే వో ఆదిమూలమా |
| 52 | 2:73 | ధ్రువవరదా సంస్తుతవరదా | విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు చక్రధర శరణంటి సరిఁగావవే |
| 53 | 2:78 | మేలు లేదు తీలు లేదు మించీనిదే | సాజపు శ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి |
| 54 | 2:81 | మర్ద మర్ద మమభంధాని | శరణం గతోऽస్మి యితరాన్ విభజ్య యిహ మాం రక్ష |
| 55 | 2:85 | నాటికి నాఁడు గొత్త నేటికి నేఁడు గొత్త | అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ |
| 56 | 2:94 | ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు | తనంతఁ దా నూరకున్న దైవమే తోడౌను కినిసి తాఁ బదిరితే కిందుమీఁదౌను |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 57 | 2:96 | నమ్మలేము కానలేము నరులాల మనమింతే | అంటుక దేహి నేపొద్దు అంతరాత్మయై వుండీ జంటయై కాచుకున్నాఁడు సర్వేశుఁడే సుండీ |
| 58 | 2:106 | నిరుహేతుక దయానిధివి నీవు | కవిసి యింద్రియములఁ గట్టువడ్డాఁడ జవళి నీపాదములే శరణము చొచ్చినాఁడ |
| 59 | 2:127 | హరిహరి నీమాయాజగమిది అండనే చూచుచు నవ్వుచును | పరచింతలలోఁ దడఁబడక పరమార్గంబుల కగపడక పరహింసలకును యెన్నఁడు జొరక పరదూషణలకు నెడగిలిసి పరదేవుఁడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు |
| 60 | 2:129 | నీవు సర్వసముడఁవు నీవు దేవదేవుఁడవు | శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో నిలిచి వరములిచ్చి నేఁడు గావవే |
| 61 | 2:146 | మఱియెందూ గతిలేదు మనుప | మఱియెందూ గతిలేదు మనుప నీవే దిక్కు జఱసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు |
| 62 | 2:154 | అనుచు దేవగంధర్వాదులు పలికేరు | దేవదేవ వాసుదేవ దిక్కు నీవే మాకు మాకు |
| 63 | 2:157 | మాపులే మరణములు రేపులే పుట్టువులు | చాపలాలు మాని విష్ణు శరణను మనసా |
| 64 | 2:158 | దైవమా నీవే మమ్ము దయదలఁచుట గాక | యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి తవిలి నీవే గతి |
| 65 | 2:185 | అది నేనెఱఁగనా అంతలో భ్రమతుఁ గాక | వింతైన జనులతోడి వినోదము నిష్ఫలము చెంత సజ్జనసంగతి చేరిన యాదాయము |
| 66 | 2:190 | దైవమా నీపెరరేఁపణ లివి తప్పక వున్నవి | ధారుణి నే నివి గెలుచుట యెన్నఁడు తగ శ్రీవేంకటనాయక నీవే గారవించి రక్షింపుము |
| 67 | 2:192 | నీవు నన్ను రక్షించితే నింద నీపైఁ బడదు | నీవు నన్ను రక్షించితే నింద నీపైఁ బడదు భావించి నన్నెట్టయినా బ్రదికించుకొనవే |
| 68 | 2:214 | దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే | దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే సేవ సేయకుండినా రక్షించ నీకు భారము |
| 69 | 2:220 | శరణు శరణు విభీషణవరదా | శరణు శరణు విభీషణవరదా శరధిబంధన రామ సర్వగుణస్తోమ |
| 70 | 2:229 | దానవారితోడి పగ ధరించరాదు మీకు | యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులేదితనికి గతియని మొక్కరో వో కపటులాల |
| 71 | 2:235 | ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు | సంచితముగ నితని శరణంటే సర్వఫలప్రద మిందరికి |
| 72 | 2:240 | మాయ కిదె సహజము మాయను గెలువరాదు | చలపట్టి యీతనినే శరణని కొలిచితే యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడై రక్షించును |
| 73 | 2:245 | విఱిగి పారెడియట్టి వీరిడి యో రిపులాల | తఱి శరణు చొరరో దండాలు వెట్టరో |
| 74 | 2:255 | కమలారమణ నీకల్పితపుమానిసిని | కమలారమణ నీకల్పితపుమానిసిని తమితోడ నాదిక్కు దయఁ జూడవే |
| 75 | 2:257 | సొరిది మమ్మిట దయఁజూతువు గాకా | తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు కలసితి నీదాసుల గమిలోనను |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 76 | 2:259 | అంతరంగములో నున్న హరియే గతిగాక | అంతరంగములో నున్న హరియే గతిగాక చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును |
| 77 | 2:262 | ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా | దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి |
| 78 | 2:263 | నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను | పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ జట్టిగొనుకొరకు నీశరణను టింతే |
| 79 | 2:265 | నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి | పాయపు టలమేల్మంగపతివి శ్రీవేంకటేశ యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ |
| 80 | 2:271 | విచార మెన్నఁడు లేదు వీరిడి జీవులకును | నలమేల్మంగనాయక శ్రీవేంకటేశ రవ్వల నీ వేలికవు రక్షించు మిఁకను |
| 81 | 2:281 | చంచలపడఁగవద్దు సారె సారెఁ గోరవద్దు | లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁడిదే నాకు నభయములిచ్చి నన్నుఁ గాచును |
| 82 | 2:282 | నెట్టన శ్రీసతిమగనికి శరణు | గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము లెరవులేక యిచ్చేటి యీతనికి శరణు |
| 83 | 2:299 | ఎదురుమాటలాడితి నీకు యీతప్పులు | కరుణతోడ నాయపరాధంబులు కడపు కావుమనుచు యిరవై నీపేరు వెట్టితే |
| 84 | 2:302 | ఇప్పుడే నే నొడఁబడ మరవఁగఁ దగదు జెప్పితి యెల్లనాఁడు | నామీఁదట నేరము లెంచక మాధవ నన్నిటు రక్షించవే |
| 85 | 2:306 | ఎవ్వరికి యెవ్వరయ్యేరు యిందరికి నీవే దిక్కు | ఎవ్వరికి యెవ్వరయ్యేరు యిందరికి నీవే దిక్కు అవ్వలనివ్వల నీ వనాథనాథుఁడవు |
| 86 | 2:313 | అతఁడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు | చతురుఁడితఁడే రక్షించఁగలవాఁడు శరణని బ్రదుకవో వో మనసా |
| 87 | 2:321 | అరుదు నీచెరిత్రము హరి నే నిదియే | శరణంటిఁ గావు మిదియ విన్నపము సరిలేరు నీకు |
| 88 | 2:323 | అనంతాపరాధి నేను అటుగాన శరణంటిని | అనంతాపరాధి నేను అటుగాన శరణంటిని |
| 89 | 2:326 | అపరాధిని నేనైనాను | నిను మరచియున్నాఁడ ననుఁ దెలుపవయా..యిరవు నీవే యట యెఱిఁగించఁగదే |
| 90 | 2:328 | ఇవి సేయఁగ నే నలసుఁడ యెటువలె మోక్షం | శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడి దాతవు సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు |
| 91 | 2:329 | నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము | నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము కావు మా నేరమెంచక కరుణానిధీ |
| 92 | 2:349 | చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు | చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు యిత్తల మా నేరములు యెన్ని లేవయ్యా |
| 93 | 2:356 | ఎఱిఁగినవారికి హింస లిన్నియు మాని | పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు శరణంటే నితని చరణాలే దిక్కు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 94 | 2:367 | పరమపురుష నిరుపమాన శరణు శరణు రే | పరమపురుష నిరుపమాన శరణు శరణు |
| 95 | 2:382 | ఆర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు | ఆర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే |
| 96 | 2:388 | అంతరాత్మ హరి గలఁడంతే చాలు | శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది యిరవైతి నింకా నాకేలా వెఱవ |
| 97 | 2:390 | అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు | అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు....నీకు శరణని యిట్టె నే ధన్యుఁడనైతి |
| 98 | 2:395 | హరి నీవే బుద్ధి చెప్పి యాదరించు నా మనసు | శ్రీవేంకటేశ కావవే నామనసు సరి నీయానతి నీకే శరణనీఁ గాక |
| 99 | 2:396 | జలజనాభ హరి జయ జయ | యిరవుగ శ్రీవేంకటేశుఁడ నీమాయ మరలుచ నీవే సమర్థుఁడవు శరణనుటకే నే శక్తుఁడను |
| 100 | 2:400 | ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా | వోపక నానేరముల కొగి నీవు వేసరితే నీపాదాలే గతిగాక నే మానేనా |
| 101 | 2:408 | ఏ వుపాయములు మాకిఁకఁ బనికిరావు | ఏ వుపాయములు మాకిఁకఁ బనికిరావు నీవే హరి కావవే |
| 102 | 2:417 | ఈతని మరచివుంటి మిన్నాళ్లును | తల్లియై పోషించు తండ్రియై రక్షించు వుల్లపు బంధువుఁడై వొడ లరయు |
| 103 | 2:423 | నారాయణాచ్యుతానంత గోవింద హరి | నారాయణాచ్యుతానంత గోవింద హరి సారముగ నీకు నే శరణంటినే |
| 104 | 2:425 | నీ వొక్కఁడవే నాకుఁ జాలు నీరజాక్ష నారాయణ | నీవే నాకు గతియని తెలిసితి నెక్కొని యితరము వృథా వృథా |
| 105 | 2:428 | నిక్కమైన నాలోని నెలవు గానలేను | దిక్కు నీవే హరి నాతెలి వేఁటితెలివి |
| 106 | 2:430 | కలియుగ మెటులైనాఁ గలదుగా నీ కరుణ | ధర నింద్రియా లెంత తరముకాడిన నన్ను సరిఁ గావఁగద్దుగా నీ శరణాగతి |
| 107 | 2:433 | నేనేమిఁ జేయఁగలేను నీవు పరిపూర్ణుఁడవు | హీనుఁడ నే నధికుఁడ విన్నిటా నీవు |
| 108 | 2:434 | ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను | ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను యిట్టే నీకు శరణంటి నిదియే తెరఁగు |
| 109 | 2:437 | రామా రామభద్ర రవివంశరాఘవ | సరుస విభీషణుఁడు శరణంటేఁ గాచితివి గరిమ నే శరణంటిఁ గావరాదా |
| 110 | 2:441 | నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్య | చేరి నన్ను నీవే పుట్టించితివట నేఁ జేసే మేరతోఁ బుణ్యపాపాలు మీవే సుమ్మీ |
| 111 | 2:444 | నీవే సేసిన చేఁత నీవే చేకొనుటింతే | వేంకటేశ ఆతుమలోనున్న నిన్ను గని మని శరణంటిఁ గడఁ బూజించనేలయ్యా |
| 112 | 2:447 | రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన | మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ |
| 113 | 2:455 | మరిగితి నేమి సేతు మగిడి నేనెందు వోదు | దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 114 | 2:458 | నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు | వేడుక నీశరణంటి విడిపించు మీమాయ |
| 115 | 2:463 | ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను | తనువూ హరియే తలఁపూ హరియే వినికి మనికియును విష్ణుఁడే |
| 116 | 2:472 | పట్టలేని మన భ్రమగాక | తెగని బంధువుఁడు దేవుఁడు.. అగపడి సందేహములేలా తగ నమ్మిన దయదలఁచనివాఁడా |
| 117 | 2:475 | అంతర్యామీ అలసితి సొలసితి | అంతర్యామీ అలసితి సొలసితి ఇంతట నీ శరణిదే చొచ్చితిని |
| 118 | 2:479 | హితవే సేసుఁ గాకాతఁడేల మానును | భూమిమీఁద దేహమిచ్చి పుట్టించినట్టివాఁడు ప్రేమతో నన్నపానాలు పెట్టుఁ గాక |
| 119 | 2:480 | ఎవ్వరి నేమనఁగల నెంతబలువుఁడ నేను | కామక్రోధములకు కాణాచికాఁపను ఆమని యింద్రియముల కడిబంటను |
| 120 | 2:484 | నావల్ల నీ కేమున్నది నారాయణ నీవు నన్ను | శరణాగతుఁడ నీకెచ్చట శ్రీవేంకటేశుఁడ దొరనై యేమిట సరిఁదూఁగఁగలను<br>ధరలోన నీవు దయదలఁచి నన్నేలుకోఁగా పరగు నీమఱఁగున బదుకుదుఁ గాక |
| 121 | 2:492 | నీయంత నీవే యెరిఁగి నిచ్చ నన్నుఁ గాతు గాక | విన్నవించేవాఁడనా వీడుజోడువాఁడనా అన్నిటా శరణుచొచ్చినట్టి జీవిని |
| 122 | 2:500 | నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము | నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము దైవమవై నీ వుండఁగ తగ మాదే బ్రదుకు |
| 123 | 2:502 | ఎటిఁగితి నమ్మితి నితఁడు దయానిధి | వెదికితి మీతఁడు విడువఁడు మమ్మిఁక తుదకును మొదలికి దొరికినవాఁడు |
| 124 | 2:506 | వెదకనేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని | శ్రీవేంకటేశుఁ డీతనిఁ జేరి శరణంటేను ఆవల నీవలఁ దాను అన్నిటా గెలుచుట |
| 125 | 2:510 | ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము | అదనఁ గంసునిజన్మ మస్తమించెను ... సదర మీ శిశువుకు శరణనరే |
| 126 | 2:512 | నీ చేతఁలోవారము నీ వారము | యేవల మాపరభారా లింతయు నీకెక్కినది ఆవటించి నే నీశరణన్నదే మాత్రతము |
| 127 | 2:514 | నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొక దుర్గుణిని | అవలనీవల దాతవు నీవు యాచకుఁడను నేను నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను |
| 128 | 3:6 | వెఱ్ఱివాఁడ వెఱ్ఱివాఁడ వినియుఁ గనియుఁ మరి | శ్రీవేంకటేశుఁడ నేను చేరి నీకు శరణంటి దేవుఁడవై కావఁగా నే దిద్దుకొనేఁ గాక |
| 129 | 3:11 | జ్ఞానినైనా నీకుఁ బో దజ్ఞానినైనా నీకు బోదు | వెరవు లెంచుకోఁబోతే వేరే మాకు గతి లేదు నిరతి మా బదుకులు నీకు సెలవయ్యా |
| 130 | 3:12 | ఎక్కడి నరకములు యెక్కడి మృత్యువు మాకు | వడిగా శ్రీవేంకటేశ్వర మీ శరణనఁగా అదరి వైకుంఠము మాయరచేత నిలిచె |
| 131 | 3:16 | ఊరకే నీ శరణని వుండుటే నా పనిఁ గాక | ఊరకే నీ శరణని వుండుటే నా పనిఁ గాక యీ రీతి నా వుపాయము లేద కెక్కినయ్యా |
| 132 | 3:18 | అందాఁకా నమ్మలేక అనుమానపడు దేహి | భారము నీ దంటేఁ జాలు నీవారి రక్షించ నీవే దిక్కొదువు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 133 | 3:19 | కదు నజ్ఞానపు కరవుకాలమిదె | శ్రీవేంకటపతి నీ శరణము విడువక చొచ్చితి వెసఁ గావఁగదే |
| 134 | 3:26 | అద్దిరా వోయయ్య నేనంతవాఁడనా | గట్టిగా శ్రీవేంకటేశ కదిసి నీ శరణంటి |
| 135 | 3:28 | ఇతనికంటె ఘను లిఁక లేరు | తల్లియు నితఁడే తండ్రియు నితఁడే వెల్లవిరై యిఁక విడువకురో...నితని శరణని బ్రతుకరో |
| 136 | 3:30 | ఎన్నఁడొకో నేఁ దెలిసి యెక్కుడయి బ్రదికేది | యేవంకా నీతఁడే గతి యిన్నిటా మాకు యే వుపాయమును లేక యీతని మఱఁగు చొచ్చి<br>దేవుఁ డంతర్యామియని తేజముఁ బొందితిమి |
| 137 | 3:32 | దైవమ నీవే యిఁక దరి చేరుతువుఁ గాక | దైవమ నీవే యిఁక దరి చేరుతువుఁ గాక జీవుల వసము గాదు చిక్కిరి లోలోననే |
| 138 | 3:37 | వెట్టివారిఁ దెలుపుట వేవేలు సుకృతము | దీపనపు జంతువునుఁ దెచ్చి పావనుఁ జేసితి చేపట్టి నన్ను రక్షించు శ్రీవేంకటేశుఁడా |
| 139 | 3:38 | ఎందరితోఁ బెనఁగేను యెక్కడని పొరలేను | ఎందరితోఁ బెనఁగేను యెక్కడని పొరలేను కందర్పజనక నీవే గతిఁ గాక మాకు |
| 140 | 3:45 | ఎట్టు వలసినాఁ జేయు మేఁటి విన్నపము లిఁక | యిన్నిటా నాకంటే హీనుఁడిఁక మరెవ్వఁడూ లేఁడు వున్నతి నీకంటే ఘనులొకరూ లేరు |
| 141 | 3:48 | నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది | అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను ప్రతిలేని ఘనగర్వపర్వతమను |
| 142 | 3:54 | వట్టిమోపు మోయనేల వడిఁ ములుగఁగనేల | శ్రీవేంకటేశు దాసులైన ప్రపన్నులు పాలించినాతని నమ్మి బ్రతుకఁగ వలదా |
| 143 | 3:70 | పెంచి తమ పెట్టుఁ జెట్టు పెరికివేయ రెవ్వరు | తక్కక మాయలోఁ బడి దరిదాపు లేని నన్ను వెక్కసాన రక్షించక విడిచేవా నీవు |
| 144 | 3:71 | ఎన్నఁడు మంచివాఁడ నయ్యేను నేను | కామక్రోధుఁడ.. నీ కృపయందు గలిగిన మేలు నాపై తటుకన ముంచి నన్ను దరి చేర్పవే |
| 145 | 3:74 | నన్ను నెవ్వరు గాచేరు నాఁటి పగెంతురుఁ గాక | నేనిన్నిటా సిగ్గుపడి నీ మరఁగు చొచ్చితిని ఆనుకొని శ్రీవేంకటాధిపుఁడ కావవే |
| 146 | 3:82 | పాటించి నమ్మినవారి భాగ్యము గాదా | చిక్కులిన్నీ నిఁకనేల చేరి యేపాటివాఁడైన గక్కన నీశరణంటేఁ గాతువు నీవు<br>అక్కరతో నిన్ను శరణంటిమి శ్రీవేంకటేశ |
| 147 | 3:88 | ఎన్నఁడు నే నిఁక బుద్ధెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలెడిది | ఎన్నఁడు నే నిఁక బుద్ధెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలెడిది విన్నప మిదియే<br>నీకే భారము వీని గెలువ నా వసమౌనా |
| 148 | 3:97 | ఈ తగవే నాకు నీకు నెంచి చూచితే | భారము నీది గనక పలుమారుఁ బాపములే చేరి మొక్కలాన నేఁ జేసితిని |
| 149 | 3:100 | పలువిచారములేల పరమాత్మ నీవు నాకు | సొరిది నీ శరణము చొచ్చితినంటేఁ జాలు కరుణించి యప్పుడట్టే కాతువు నీవు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 150 | 3:103 | అవాప్తసకలకాముఁ డనుమాట నీకుఁ జెల్లె | కొసరుచు నిన్ను నేము కొలిచినదెల్లాను వెస మా భారము నీపై వేయుకొరకే |
| 151 | 3:116 | నీవు దేవుఁడవు నే నొక జీవుఁడ | ఘనుఁడవు నిన్నేగతి నేఁ దెలిసెద అనువుగ మిము శరణనుటే కాక |
| 152 | 3:117 | శరణాగత వజ్రపంజరుఁ డీతఁడు చక్రధరుఁ దసురసంహారుఁడు | వెరవుతోడఁ దను శరణనువారి వెనుబల మీతఁడే రక్షకుఁడు |
| 153 | 3:121 | పురుషోత్తముఁడ నీవే పుణ్యము గట్టుక నన్ను | పురుషోత్తముఁడ నీవే పుణ్యము గట్టుక నన్ను దరిచేర్చి రక్షించి దయఁ జూడఁగదవే |
| 154 | 3:124 | ఎక్కడి సుద్ది యీ భ్రమనేల పడేరు | దినమత్తులము మా తెలివేఁటిది యెనలేని శ్రీవేంకటేశ్వరు శరణుచొచ్చి మనువార మింతేకాక మరి గతియేది |
| 155 | 3:127 | అటిముటిఁ జూడఁబోతే నజ్ఞాని నేను | అటిముటిఁ జూడఁబోతే నజ్ఞాని నేను మఱఁగు చొచ్చితి మీకు మహిలో నారాయణా |
| 156 | 3:141 | నారాయణుఁ డీతఁడు నరులాల | నారాయణుఁ డీతఁడు నరులాల మీరు శరణనరో మిమ్ముఁ గాచీని |
| 157 | 3:155 | శరణు వేఁడెద యజ్ఞసంభవరామ | శరణు వేఁడెద యజ్ఞసంభవరామ అరసి రక్షించు మమ్ము నయోధ్యారామా |
| 158 | 3:159 | సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే | సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే |
| 159 | 3:167 | నేరనైతి నింతేకాక నే నిన్నాళ్లు | యీకడ నాకంటే హీనునిఁక నీవు గాచేవా శ్రీకాంతుఁడ యిఁక నీ చిత్తమింతే కాక |
| 160 | 3:172 | హరి నిను నెరఁగని యలమటలింతే శాయ | శరణంటి నిదె నీకే సర్వేశ కావవే |
| 161 | 3:173 | నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి | కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి అమితదుర్గుణరాసి నన్నిటా నేను |
| 162 | 3:176 | అమ్మే దొకటియును అసిమలోని దొకటి | ననిచి శ్రీవేంకటేశ నాఁడే నీకు శరణంటి వెనక ముందెంచక నీవే కావవయ్యా |
| 163 | 3:177 | వెట్టి దెలిసి మరియు వేఁదురు దవ్వేము నేము | ముట్టుఁబాల మంకువాఁడ మూలమా శరణు |
| 164 | 3:195 | ఇందుకే కాలమందే యీతని శరణంటిమి | ఇందుకే కాలమందే యీతని శరణంటిమి ముందుముందే దయఁజూచి మొగిఁ గాచుఁగాక |
| 165 | 3:197 | మంగళసూత్ర మొక్కటే మగనాలికిఁ గట్టేది | బడినే శ్రీవేంకటేశ పలునా వుద్యోగాలేల నిడివి నిన్ను నుతించే నేమమే నాది |
| 166 | 3:199 | నమో నారాయణ నా విన్నప మిదివో | మును నీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే |
| 167 | 3:200 | ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను | ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను నీమరఁగు చొచ్చితిఁగా నీచిత్త మిఁకను |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 168 | 3:208 | మాయామయములివి మాయకు నీ వేలికవు | యేపొద్దు శ్రీవేంకటేశ యివి వాని స్వభావాలు కాపాడవే నన్ను |
| 169 | 3:212 | పరమయోగీశ్వరుల పద్ధతి యిది | యెడయక శ్రీవేంకటేశుపై భారమువేసి కడు వైష్ణవుల కృప గలిగి సుఖించుట |
| 170 | 3:216 | ఏమిసేతు నాభాగ్య మిట్లున్నది | ఏమిసేతు నాభాగ్య మిట్లున్నది నేమమేమీ నెరఁగను నీవే గతి యిఁకను |
| 171 | 3:229 | జగములేలేవాఁడవు జనార్దనుఁడవు | గతి నీవు మతి నీవు కాణాచిచోటు నీవు తల్లియుఁ దండ్రివి నీవు దాత దైవమవు నీవు |
| 172 | 3:231 | విశ్వరూప నీ మూర్తి వివేకించలేను నేను | శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము శరణు చొచ్చితిమిఁక చనవిచ్చి కావుమీ |
| 173 | 3:249 | దైవమా నీచేతిదే మా ధర్మపుణ్యము | ఆదిమూర్తి నీకు శరణాగతులము ..నీదయ గలుగఁగాను నీ వారము |
| 174 | 3:251 | ఇంకనేల నాకు వెరపింతమాట గలిగియు | నేనెంత పాపబుద్ధినై నేరమెంత సేసినాను కానీలే నన్నెలేవాఁడు కావఁగలఁడు |
| 175 | 3:263 | వానివాని సహజము వద్దననేల | సావధానాన నీతని శరణనుకొంటేఁ జాలు యే విధులు భవములునేమి సేయఁగలవు |
| 176 | 3:265 | ఇంక నా దైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని | ఇంక నా దైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని సంకె దీరఁ బులిసితి సర్వేశ్వరా |
| 177 | 3:269 | ఈ యపరాధములు సహించవయ్యా | ఈ యపరాధములు సహించవయ్యా పాయక మమ్ము రక్షించేపని నీదే కాదా |
| 178 | 3:275 | జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు | సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను |
| 179 | 3:286 | మమ్ముఁ జూడ నేమున్నది మావంక నీకే లాభము | దేవ నేనొక్క నీచుఁడ దీనరక్షకుఁడవు నీవీవిధమెంచుక మమ్ము నీడేరింతుఁ గాక |
| 180 | 3:291 | ఆతఁడు సేసే చేఁత లన్యులు సేయఁగలరా | యెందరెందరుండినాను యీతఁడు గలఁడు మాకు.. నాతఁడే అన్నిచక్కఁబెట్టీఁ బనులు |
| 181 | 3:311 | సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను | సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ నిన్ను మరిగి శరణంటిని మన్నించవయ్యా |
| 182 | 3:327 | పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ గాననైతి | పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ గాననైతి యెట్టు గాచేవయ్య నన్ను యిందిరానాథా |
| 183 | 3:330 | ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరివీకులై | నవ్వుచు నీ శరణంటి నన్నుఁ గావవయ్యా |
| 184 | 3:336 | ఎన్నఁడు దెలిసే మెచ్చరికెపుడో | యెడపక శ్రీవేంకటేశ నీ మఱఁగు బడిఁ జొచ్చితి నా భారము నీది |
| 185 | 3:338 | నాలో నున్నాఁడవు నన్నుఁ గావ(క) నీకుఁ బోదు | బంతిగట్టి నురిపెడి పసురమునై చెంతల శ్రీవేంకటేశ చేరితి నీవద్ద నేఁడు<br>వంతుకుఁ గామధేనువు వద్ది దూడవలెను |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 186 | 3:371 | చాలుఁజాలు నీ హరియే మాకును సకలక్రియలకు నాయకుఁడు | పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి యీకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశములేదు |
| 187 | 3:373 | నీకెటు వలసె నటుసేయి నీచిత్తము నా భాగ్యము | నెఱవుగ శ్రీవేంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని తటి దరిచేర్పఁగఁ గూడువెట్టఁగా దైవమ నీకే భారము |
| 188 | 3:374 | అరసి నన్నుఁ గాచినాతనికి శరణు | అరసి నన్నుఁ గాచినాతనికి శరణు పరము నిహమునేలే పతికిని శరణు |
| 189 | 3:384 | నాకేల విచారము నాకేల యాచారము | నాకేల విచారము నాకేల యాచారము సాకిరైనవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు |
| 190 | 3:385 | ఏఁటి పరిణామము మమ్మేల యడిగేరయ్య | ఏఁటి పరిణామము మమ్మేల యడిగేరయ్య గాఁటపుహరి యొక్కఁడే గతి మా కిఁకనయ్య |
| 191 | 3:387 | నీకు నీ సహజమిది నాకు నా సహజమిది | యిట్టె నే నడిగినా నేమీ నడుగకుండినా జట్టిగా నీవు రక్షించక మానవు |
| 192 | 3:392 | నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగాదేవియును | నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగాదేవియును ధారుణి లోపలఁ బుట్టించితివి తరువాతి పనులు నీకే సెలవు |
| 193 | 3:398 | తెలిసియుఁ దెలియను తెగదీ చిక్కేమిటాను | దిక్కు నీవే శ్రీవేంకటదేవుఁడ నీ శరణంటే యెక్కువ బ్రదుకుఁదోవ యిదియే కలది |
| 194 | 3:405 | రుచులు నే నిటు గొనని వేడవి రోఁతలయ్యెడిఁ గాక నేఁడు | నేను సేయని పాపమేదది నిఖిలలోకములందును..పూని హరి నిను శరణుచొరఁగాఁ బుణ్యుఁగాఁ జేసితివి |
| 195 | 3:410 | నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య | నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య పైకొని శ్రీహరి నీవే పరిహరించవే |
| 196 | 3:417 | నిలిచినచోటనెల్లా నిధాన మీతఁడు | గోవిందుఁడు గలఁడుగా కొంకు దీర్చి ననుఁ గావ..దేవుఁడితఁ డున్నాఁడుగా దిక్కుదెసై |
| 197 | 3:420 | అభయదాయకుఁడ వదె నీవే గతి | నియతము మా కిదె నీ పాదములే గతి |
| 198 | 3:437 | సొమ్ము గలవాఁడు తన సొమ్ము చెడనిచ్చునా | సొమ్ము గలవాఁడు తన సొమ్ము చెడనిచ్చునా కమ్మి నీ సొమ్మను నేను కాపాడవే హరి |
| 199 | 3:438 | మెచ్చుల దంపతులార మీరే గతి | తమ్మిలోని మగువా వో ధరణీధరుఁడా మిమ్ము నే నమ్మితి నాకు మీరే గతి |
| 200 | 3:441 | పొందినవెల్లా భోగ్యములే | కమ్మి నీ శరణగతి యిటు చూపఁగ కమ్మర నుద్యోగము మాకేఁటికి |
| 201 | 3:443 | ఇంతటఁ గావఁగదే ఇందిరానాయక నన్ను | నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాఁడఁ గాన బాతితో సర్వము నీ కొప్పనము సేసితిని |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 202 | 3:451 | నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపు దయ | నేరములు దొలఁగించ నెలవులు గలిగించ గారవించ హరి నీవే కలవు నాకు |
| 203 | 3:453 | బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే | బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే తలఁ చాతనికి మొక్కఁ దగులింతే నేము |
| 204 | 3:455 | ఒక్కమాటు శరణుని వుండేనింతే కాక | యీ మేర శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గావు దీమసాన నిఁక వేరేతెరువు లేదయ్యా |
| 205 | 3:458 | అంతర్యామీ వో అంతర్యామీ | చేచేత శ్రీవేంకటేశ చేరి నీకు శరణంటి |
| 206 | 3:462 | చరమార్థమందు నీవు చాటితివి గాన | చరమార్థమందు నీవు చాటితివి గాన ఇరవిది నమ్మితి నా కెదురెందు లేదు |
| 207 | 3:469 | చెలఁగి యధర్మము వుట్టింప నీకేల సృష్టింపఁగ మరి నీకేల | గతి నీ శరణాగతియని నమ్మినఁ గలవిందరికిని నారాయణా |
| 208 | 3:474 | దీనుఁడ నేను దేవుఁడవు నీవు | దీనుఁడ నేను దేవుఁడవు నీవు.. అలరిన నాలో యంతర్యామివి కలుష మెడయ నను గాతువుఁ గాకా |
| 209 | 3:476 | నేరుపు నతఁడే నేరమి నతఁడే | నేరుపు నతఁడే నేరమి నతఁడే భారమెల్ల నాతఁడే పని లేదు మాకు |
| 210 | 3:495 | నీ శరణమే గతి నే నితర మెరఁగ | నీ శరణమే గతి నే నితర మెరఁగ పాశబంధముల పనులేలయ్యా |
| 211 | 3:497 | పంచేంద్రియములాల పంచభూతములాల | కొంచక శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి |
| 212 | 3:498 | అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు | అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు |
| 213 | 3:515 | దేవుఁడవు నీవు జీవులు నీ బంట్లు | చెలఁగి నీ శరణు చొచ్చేదే నా స్వభావము నెలవై యేలుకొనేది నీ స్వభావము |
| 214 | 3:531 | కలదు తిరుమంత్రము కల దిహముఁ బరము | కమలాక్ష నీవు మాకుఁ గలిగియుండఁగ భూమి నమరలేని దొకటి నవ్వల లేదు |
| 215 | 3:532 | దేవుఁ డొక్కఁడే మాకు దిక్కు గాని | దేవుఁ డొక్కఁడే మాకు దిక్కు గాని కావ నెవ్వరును లేరు కతలింతే కాని |
| 216 | 3:547 | ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి | ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి తొట్టిన నా బ్రదుకుకుఁ దుదయు లేదు |
| 217 | 3:571 | సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ | సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ నా పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి |
| 218 | 3:573 | శ్రీపతి యొకఁడే శరణము మాకును | శ్రీపతి యొకఁడే శరణము మాకును తేప యితఁడె మఱి తెరఁగేది |
| 219 | 3:575 | నీవెటు దలఁచిన నిఖిలము నట్టౌ | శ్రీవేంకటేశ్వర ఆదె నిను శరణంటిమి గొంత |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 220 | 3:580 | పరిణామమే మాకుఁ బతివి నీవు గలుగ | పరిణామమే మాకుఁ బతివి నీవు గలుగ శరణాగతే మాకు సకలరక్షయ్యా |
| 221 | 4:15 | కొసరి కొసరి యిఁకఁ గోరఁగనేఁటికి | వుడుగనికర్మము లొడలోముటలును జడులము మాకిది సహజము<br>యెడయక శ్రీవేంకటేశ నీకు మము నదరి కాచుటే అది సహజము |
| 222 | 4:22 | ఘనుఁడాతఁడే మముఁ గాచుఁ గాక హరి | యెవ్వనిమూలము యీ సచరాచర మవ్వలనివ్వల నతనికే శరణు |
| 223 | 4:34 | శరణ మాతనికే సర్వభావాల | శరణ మాతనికే సర్వభావాల యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు |
| 224 | 4:49 | ఆదిమూలమే మాకు నంగరక్ష | ఆదిమూలమే మాకు నంగరక్ష శ్రీదేవుఁడే మాకు జీవరక్ష |
| 225 | 4:54 | సిరిమగఁడే మొగసిరి రక్ష | సిరిమగఁడే మొగసిరి రక్ష మరుగురుఁడే మా మర్మపు రక్ష |
| 226 | 4:61 | ఊలు దింటా మలిగండ్లాఅడి రాసిగా నేరేము | నిక్కి శ్రీవేంకటపతి నీకు నేనే శరణంటి గక్కన నీజీవమును గరుణింతుగాక |
| 227 | 4:70 | తెలియుట యెన్నఁడు దేహి తనంతట | యింతట శ్రీవేంకటేశ్వర నీకృప చింతించి కావవే చేకొని నన్ను |
| 228 | 4:77 | హరి "సర్వపాపేభ్యో అహం త్వా" యనె | శ్రీవేంకటపతి శరణాగతి వొకటే గతి నాకు |
| 229 | 4:79 | జీవములు దవ్వవోయ చీమలునుఁ బుట్టచొచ్చె | శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను భావపుబంధములాల పారరో |
| 230 | 4:90 | సర్వం విష్ణుమయం బను భావము సత్యం బిన్నిటను | సర్వేశ్వరుఁడే పొందేటి వస్తువు శరణాగతియే వుపాయము |
| 231 | 4:91 | తలఁపులోని వెలితే దైవము వెలితౌ | ఇహమున శ్రీవేంకటేశు శరణనుటే సహజపు జన్మము సఫలం బనుట |
| 232 | 4:92 | మరుగుచుఁ జేసీ మానదుద్యోగము | యిరవగు శ్రీవేంకటేశ్వర నీవే పరమాత్మవు ననుఁ బాలించఁగదే |
| 233 | 4:93 | వెలినుండు లోనుండు విశ్వమింతటనుండు | జలజాక్షు శరణమే సాధనము సుండీ |
| 234 | 4:103 | నీకంటే నితరము మరి లేదు నేనెవ్వరితో భాషింతు | యీ యపరాధము యెంచకుమీ నను యిందునె పో నీశరణంటి<br>పాయక నిన్నిఁక శ్రీవేంకటపతి పరబ్రహమవుఅటు గాన |
| 235 | 4:105 | హరి నే నిన్నిందులకుఁ గా దర్చించి కోరెడిది | దైవశిఖామణి వాదిమూరితివి తగిన స్వతంత్రుఁడవు యేవిధులు నేనెఱఁగను<br>నీవే యింతాఁ జుమ్మీదాఁచఁగనేల |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 236 | 4:112 | హరి నీవే సకలలోకారాధ్యుఁడవు | ధర నీకు శరణంటీ తలఁపిదే చాలును |
| 237 | 4:114 | నిన్ను నీవే తెలుసుకో నిరుహేతుకబంధుఁడ | రవ్వల శ్రీవేంకటేశ రక్షింతువుగాక అవ్వల వివ్వల శరణాగతరక్షకుఁడా |
| 238 | 4:128 | గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ | యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే |
| 239 | 4:132 | ఉమ్మడికర్మములాల వుండఁ జోటు మీకు లేదు | మనసునఁ దలచేది మాధవుని పాదములు దినముఁ గడుపునించేది హరిప్రసాదము |
| 240 | 4:143 | వాసుదేవ నీవు నెలవరివి మగుడనేల | శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో పొంచి నీకు శరణంటి బోధించవయ్యా |
| 241 | 4:149 | విష్ణుదేవు పాదములే విద్యాబుద్ధీ మాకు | మురహరు పాదములే ముందరవెనకా మాకు శరణంటి మెందైనాఁ జనరో దుఃఖములు |
| 242 | 4:150 | ఇందుకేది వుపాయమో యీశ్వర నీకే తెలుసు | అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి జట్టిగొని నీపాదాలే శరణంటిని |
| 243 | 4:154 | ఇన్నిటికి మూలము యెప్పుడు నీవే | లక్షోపలక్షలు కర్మలంపటములు..రక్షించ నిన్నిటికి భారము నీదేయయ్యా |
| 244 | 4:176 | కొసరనేల నాగుణము లివి | నేరమి నాది నేరుపు నీదే..కారుణ్యాత్మక గతి నీవు సుమీ |
| 245 | 4:189 | పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు | కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి మానిసి నింతే యెట్టు మన్నించీనో |
| 246 | 4:194 | నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు | నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నా రిఁకను |
| 247 | 4:202 | దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే | యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక ఘాతల నీదాసులకు గతి యెవ్వరో |
| 248 | 4:205 | తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక | తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు |
| 249 | 4:206 | విడువ విడువ నింక విష్ణుఁడ నీపాదములు | శ్రీదేవుఁడవైన శ్రీవేంకటేశ నీకు సోదించి నీశరణమె చొచ్చితి నే నిఁకను |
| 250 | 4:226 | వేగిరించనేల విష్ణుఁడే యింతకుఁ గర్త | వెలసి యాతనిమాయే విశ్వమింతా నిండినది తెలిపి రక్షించుటకు దిక్కు దెస యితఁడే |
| 251 | 4:230 | ఊరకే నోరుమూసుక వొంటి నీకు మొక్కేమయ్య | శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము |
| 252 | 4:254 | హరినే యడుగరో ఆమాఁట | యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి చాయల నితనికి శరణంటిమి |
| 253 | 4:256 | ఎదురేది యింక మాకు యెందు చూచినను | శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా కావ నీపాదములె గతి యిహముఁ బరము |
| 254 | 4:265 | ఎందరి వెంటల నేఁగేము | ఎందరి వెంటల నేఁగేము చందపు హరి నీ శరణనియెదము |
| 255 | 4:268 | అల బ్రహ్మాదుల కణఁగ దిది | శ్రీవేంకటేశుఁడ జిగి నీ శరణని దీవెనఁ బొందితి దేహపుగుణము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 256 | 4:292 | చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా | సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా |
| 257 | 4:321 | మాధవ భూధవ మదనజనక | వారాహ వామన వాసుదేవ మురారి శౌరి జయజయతు శరణు శరణు |
| 258 | 4:323 | తెలిసియుఁ దెలియదు దేరిన చిత్తము | తెలిసియుఁ దెలియదు దేరిన చిత్తము నలినాక్ష గోవింద ననుఁ గావవయ్యా |
| 259 | 4:333 | సర్వేశ్వరుఁడే శరణ్యము | అనేకవిధముల నిఖిలజీవులకు జనార్దనుఁడే శరణ్యము |
| 260 | 4:337 | దేవుని మరవకు మంతే మాట చిత్తమా | తల్లియుఁ దండ్రియునై దాతయై కలఁడు మాకు తెల్లమి శ్రీవేంకటాద్రిదేవుఁడు |
| 261 | 4:338 | ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ | నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గావ సాకారరూప నీకే శరణుచొచ్చితిమి |
| 262 | 4:345 | నీవే కాచుట గాక నేరుపు నా యందేది | నీవే కాచుట గాక నేరుపు నా యందేది<br>నీలవర్ణ నినుమాని నిత్యసంసారైన నేను కాలమందే నిన్నెరఁగఁ గలనా నేను |
| 263 | 4:350 | ఇందరి గాచిన నీవు యిట్టే నీవు నాకు | ఇందరి గాచిన నీవు యిట్టే నీవు నాకు కందువ నిధానమవై కలవుగా నీవు |
| 264 | 4:354 | భారకుఁ డతఁడే బంధువుఁ డతడే | భారకుఁ డతఁడే బంధువుఁ డతడే చేరితి మతనినే చెంచెలమేలా |
| 265 | 4:360 | బల్లిదులు నీకంటెఁ బరులున్నారా | ముంచి నీ పాదాలకు మొరవెట్టితి భువన రక్షకుఁడవు పంచల నున్నాఁడ<br>నన్నుఁ బాలించవయ్యా |
| 266 | 4:367 | నే నవగుణి నైన నీకుఁ బోదు భువి | నిగమగోచర నేను నీయాధీనమ నింతే నగుఁబాటు గాకుండ ననుఁగావుమిపుడు |
| 267 | 4:373 | అది బ్రహ్మాండం బిది పిండాండం | చలమున నీతని శరణాగతియే ఫలమును భాగ్యము బహుసంపదలు |
| 268 | 4:376 | ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము | ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము సతతపూర్ణునికి శరణ్యము |
| 269 | 4:378 | శరణాగత వజ్రపంజర బిరు దది నీది | శ్రీ వేంకటేశ నిన్నుఁ జేరినట్టివారి నెల్ల తావుల నిలిపి యిట్టే దయఁగావవే |
| 270 | 4:380 | అతఁడే రక్షకుఁ డందరి కతఁడే | అతఁడే రక్షకుఁ డందరి కతఁడే పతి యుండఁగ భయపడఁ జోటేది<br>దైవ శిఖామణి దాపగు మాకును భావింపఁగ భయపడఁజోటేది |
| 271 | 4:382 | ముట్టితేనే మూయెఁ బట్టితేనే పంతమయీా | యిన్ని చిక్కులునేల యిట్టె శ్రీ వేంకటేశ మిన్నక నీశరణంటే మేలైని |
| 272 | 4:383 | ఎప్పు డేబుద్ధి వుట్టునో యెరఁగరాదు | కడఁగి శ్రీ వేంకటేశు గతియే మాది అడఁగు మా పుణ్యపాపా లతని కర్పణము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి ప్రదర్శన |
|---|---|---|---|
| 273 | 4:392 | ఒలపక్షము లేనొక్క దేవుఁడవు | సాదనైన నేఁ జలమతినైనా నీ పాదమొక్కటేఁ నే బట్టినది |
| 274 | 4:395 | ఆచారవిచారా లవియు నే నెరఁగ | యెలమితో శ్రీ వేంకటేశ నీవు గతిదక్క పలుబుద్దులు నేఁబొరలు భావనలేనెరఁగ |
| 275 | 4:397 | నిచ్చలూ లోకము చూచి నివ్వెరగయ్యీ నాకు | యిటు నీ శరణనుటే శీలము నాకు నీ చిత్తము నా భాగ్యము |
| 276 | 4:402 | నారాయణ నిను నమ్మిన నాకును | శ్రీ వేంకటనాథ నన్నేలఁగ మిగులఁగ నీ పాదమే శరణంబు |
| 277 | 4:403 | శరణం బితఁడే సకలము నాకును | శరణం బితఁడే సకలము నాకును వెరవున మనసా వెతకవో యితని |
| 278 | 4:404 | ఎఱఁగఁడు పరసుఖ మీశ్వర నీ మాయ | యింతట శ్రీ వేంకటేశ్వర నిన్నే రంతుల శరణనె రక్షించవే |
| 279 | 4:411 | చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁ బ్రపంచముల | నాతనిపై భారము వేసినఁ జాలు వింత వుద్యోగములు గోవిందుఁడే యెరుఁగు |
| 280 | 4:418 | హరి నీ మయమే అంతాను | హరి నీ మయమే అంతాను అరసి నీకు శరణనియెద నేను |
| 281 | 4:422 | విన్నపమిదే నీకు వేవేలు విధముల | విన్నపమిదే నీకు వేవేలు విధముల నన్నుఁ గావవే హరి నమో నమో |
| 282 | 4:424 | తథాకురుష్వ ముదా మామద్యేవ | తవాస్మి శరణం దహరాహం భవదురితాని భంజ మమ |
| 283 | 4:440 | ఇదివో తెరమరఁ గిహపరములకును | సటలేక యాతని శరణము చొచ్చితేనే పటు జీవన్ముక్తి యదే పలు మాటలేలా |
| 284 | 4:442 | అతఁడే యెరుఁగును మముఁ బుట్టించిన యంతరాత్మయగు | గట్టిగ శ్రీవేంకటపతి శరణని కంటి మిదివో మోక్షము తెరువు |
| 285 | 4:445 | కదిసి యాతఁడు మమ్ముఁ గాచుఁగాక | యెవ్వఁడు రక్షకుఁ డాయ నీ జంతుకోట్లకు అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు |
| 286 | 4:447 | నిఖిలమింతయు మేలు నేనే తీలు | యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే |
| 287 | 4:456 | పుట్టఁగా బుట్టిన నా భోగపుటాస | కందువ శ్రీ వేంకటేశుఁ గని శరణంటి నేను పందతనమొల్ల నింక బదుకవో యాసా |
| 288 | 4:461 | ఏమిటివాఁడఁ గాను యిఁక నేను | ఏమిటివాఁడఁ గాను యిఁక నేను నా సామపుఁ గర్మము నీకే సమర్పయామి |
| 289 | 4:476 | నీ గురుతులు చూచుకో నీ బిరుదు లెంచుకో | నీ గురుతులు చూచుకో నీ బిరుదు లెంచుకో యీ గతిని కలబంట నిఁక నన్నుఁ గావవే |
| 290 | 4:479 | శ్రీసతీశ బహుజీవచైతన్యుఁడవు నీవు | ఆనుక జగద్రూపుఁడవని నిన్నందురుగాని నేనిట్టే చూచిన వెల్లా నీ రూపులే |
| 291 | 4:573 | త్వమేవ శరణం త్వామేవ మే | త్వమేవ శరణం త్వామేవ మే |

| **సంఖ్య** | **కీర్తన సంఖ్య** | **కీర్తన పల్లవి** | **భక్తి ప్రదర్శన** |
|---|---|---|---|
| 292 | 4:580 | ఎవ్వరు గల రెవ్వరికి | వరతఁ బోవునట్టి వడిసంసారపు తెరలఁ దగిలి.. తరితోడ నీతఁడె కాచుఁగాక |

# అనుబంధం – 2

# సమ్మిళిత భక్తి మార్గాలకు చెందిన అన్నమయ్య కీర్తనలు

## సమ్మిళిత భక్తి మార్గాలు గల కీర్తనలు

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 1 | 1:4 | ఏవం శ్రుతిమత మిదమేవ | కీర్తనం, దాస్యం | సతతం శ్రీహరి సంకీర్తనం తద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి,<br>అహిశయనమనోహరసేవా తద్విహరణం వినా విధిరపి నాస్తి |
| 2 | 1:5 | వేదం బెవ్వని వెదకెడిని ఆ దేవుని కొనియాడుడీ | కీర్తనం,దాస్యం | వేదం బెవ్వని వెదకెడిని ఆ దేవుని కొనియాడుడీ, యిల నాతని భజియించుడీ,<br>తిరువేంకటపతి వెదకి వెదకి సేవించుడీ |
| 3 | 1:56 | నగుఁబాట్లఁబడే నా జిహ్వా | స్మరణం, కీర్తనం | నలినోదరుశ్రీనామము దలఁచిన ఫలమున కిదివో పావనమాయ,<br>అమరవంద్యుఁడగు హరి నుతియించఁగ ప్రమదము చవిగొని పావనమాయె |
| 4 | 1:101 | ఏటికిఁ దలఁకెద రిందరును | స్మరణం, దాస్యం | అందునున్న హరి నాత్మఁదలఁచిన పండినపసిఁడే బ్రతుకరొ ప్రజలు,<br>లక్ష్మిపతికి దాసులై పొడవగుపదవులఁ బొందరొ ప్రజలు |
| 5 | 1:213 | తనకర్మమెంత చేఁతయు నంతే | స్మరణం, అర్చనం | తలపులో హరినెంత దలఁచె నేఁడే వాని కలిమియు సుఖమును గల దంతే<br>సిరివరుపూజెంత సేసె నేఁడే వాని దరియును దాపు నెంతయు నంతే |
| 6 | 1:285 | ఇన్ని సేఁతలకు నిది యొకటే | స్మరణం, దాస్యం | పాతకకోట్లు భవములు భస్మీభూతము సేయఁగఁ బొడవొకటే శ్రీతరుణీపతిచింత,<br>దుర్గుణములునుఁ దృణీకృతములు సేయఁగ గురుతొకటే పతియగు వేంకటపతిసేవారతి |
| 7 | 1:338 | అలర నుతించరో హరిని | కీర్తనం, స్మరణం, శ్రవణం | అలర నుతించరో హరిని, సేయరో మనుజులార చింత హరి నిఁకనైన,<br>మెచ్చరో మనుజులార మీరే హరికథలు |
| 8 | 1:357 | అస్మదాదీనాం అన్యేషాం | దాస్య, స్మరణ, కీర్తన | గతిరిహ స్మర్తుం కా జగత్యాం పరస్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ, దేహసంక్షాళన<br>విదేశకోవా దాశ్రీహరిస్మరణవిశేష: పునశ్చ,<br>శంకాం నిరురుతి స్వరసా కా శ్రీవేంకటాచలపతేర్వినుతి: పునశ్చ |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 9 | 1:426 | పట్టినచోనే వెదకి భావించవలె | స్మరణం, దాస్యం | హరినామమే యేపొద్దు నాలికతుదను యెంచి తలఁచదలఁచ నిరవౌ సుజ్ఞానము,<br>శ్రీవేంకటేశు నిటు దినదినమును ..కొలిచితే బ్రహ్మపట్ట మెక్కును |
| 10 | 1:439 | ఇరవగువారికి యిహపర మిదియే | కీర్తనం, స్మరణం, శ్రవణం, దాస్యం, ఆత్మనివేదన | దురితమోచనము దుఃఖపరిహరము హరినామమెపో ఆత్మలకు, పరమపదంబును<br>భవనిరుహరణము పరమాత్ముచింతే ప్రపన్నులకు<br>సారము, ధనములు సంతోషకరములు శౌరికథలు సంసారులకు, కోరినకోర్కియు<br>కొంగుబంగరువు సారె విష్ణుదాస్యము లోకులకు<br>అచ్చపు శ్రీవేంకటాధిపు శరణము రచ్చల మాపాలిరాజ్యపు సుగతి |
| 11 | 1:441 | ఉన్నవిచారములేల వోహో సంసారులాల | స్మరణ, పాదసేవన, కీర్తన, ఆత్మనివేదన | లక్ష్మీనారాయణులఁ దలఁచి మీరు చొక్కి...సుఖమున నుండరో, భవరోగవైద్యుని<br>పాదములు సేవించి భువి రోగములఁ బాసి పొదలరో, పదిదిక్కులు తానైనవానిఁ గవిసి<br>పొగడి దిక్కుగలిగి బ్రదుకరో,  శ్రీవేంకటేశు శరణంటి మిదె మేము |
| 12 | 1:446 | మఱియు మఱియు నివె మా పనులు | వందనం, దాస్యం | నారాయణునకు నమస్కారము, గోవిందునకే కొలువులు సేతుము |
| 13 | 2:140 | ఇందుకుఁ జింతించనేల యీశ్వరుని మాయ లివి | స్మరణం, ఆత్మనివేదనం | మూలము హరి యీతనిఁ జింతించరే, శ్రీవేంకటేశుఁ గని శరణన్నఁ జాలు |
| 14 | 2:464 | కలిగె మాకు నిది కైవల్యం | శ్రవణం, కీర్తనం, దాస్యం, ఆత్మనివేదన | కలకాలము హరికథాశ్రవణం, అచలంబిదివో హరికీర్తనం, పరమ మంగళం భావాతీతం<br>కరివరదం నిజ కైంకర్యం,<br>ఫలదం లలితం భయహరణం కలితం శ్రీవేంకటపతిశరణం |
| 15 | 2:465 | ఎఱుఁగుటకంటే నెఱఁగమే మేలు | దాస్యం, ఆత్మనివేదనం | శ్రీపతి దాస్యమే శేఖరము, యేపున శ్రీవేంకటేశ్వరు శరణమే<br>తీపులు మఱపేటి దివ్యానందము |
| 16 | 2:466 | కలిగె నిదె నాకు కైవల్యము | దాస్యం, ఆత్మనివేదన, వందనం, కీర్తనం | నిరతము నాగతి నీ దాస్యమే, శరణు శరణు శ్రీజనార్దన,<br>నమో నారాయణ నమో లక్ష్మీపతి, నా క్రియ యిది నీ దివ్యకీర్తనమే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 17 | 3:3 | గెలిచితి భవములు గెలిచితి లోకము | దాస్యం,కీర్తనం, వందనం, ఆత్మనివేదన | గెలిచితి భవములు గెలిచితి లోకము యెలమి నీ దాసుల కెదురింక నేది, భయహరణము మాకుఁ బాపనాశనము క్రియతోడి నీ సంకీర్తన గలిగె, నమో నమో దేవ నమో నాగపర్యంక, రక్ష రక్ష పరమాత్మ రక్ష శ్రీవేంకటపతి |
| 18 | 3:261 | ఇందరు నెఱుఁగుదు రీయర్థమే భువి | దాస్యం, కీర్తనం | ఆదికి ననాది హరిదాస్యంబిది వేదాంతంబుల వెలసినది, పరము శ్రీవేంకటపతి సంకీర్తన సొరిది గురుఁడొసఁగు సూక్ష్మమిది |
| 19 | 3:332 | గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు | కీర్తనం,దాస్యం, ఆత్మనివేదన | ఆవల నీవల నోరఁ గుమ్మలుగ నాడుద మీతనిఁ బాడుదము, అత్యంతము శరణనరో యితని, కోటికి యీతనిఁ గొలువరో జనులు |
| 20 | 3:377 | సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి | స్మరణం, వందనం, శ్రవణం, ఆత్మనివేదన | మనసులో పాపబుద్ధి మరి యెంతదలఁచినా నినుఁ దలఁచినంతనే నీరౌను, చేతనంటి పాతకాలు సేవగా నేఁ జేసినాను ఆతల నీకుమొక్కితే నన్నియుఁ బాయు ఘాతలఁ జెవుల వినఁగా నంటిన పాపము నీతితో నీ కథ వింటే నిమిషానఁ బాయును, యేయెడ శ్రీవేంకటేశ యేయేపాతకమైనా ఆయమైన నీశరణాగతిచే నణఁగు |
| 21 | 3:399 | అల్లనాఁడే యిదెరఁగ మైతిమి గాని | దాస్యం, ఆత్మనివేదనం, కీర్తనం | ధరఁ జేతిది వైకుంఠ మతని దాస్యమునకు, తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి, తెలిసి శ్రీవేంకటేశు తిరుమంత్రము నాలికెఁబలికినాడనే దివ్యపద మబ్బుఁ జుండి |
| 22 | 3:403 | కడుపు నిండె నిఁకఁ గడమేది । మును | స్మరణం, వందనం, ఆత్మనివేదన | హరిహరి యని నే నన్ననాఁడె నా పరగిన జన్మము ఫలియించె, ముందర నీకును మొక్కినయపుడే అందితిఁ దుదిపదమగు సుఖము, శ్రీవేంకటపతి శరణనినపుడే దైవము నాపాల దక్కితివి |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 23 | 3:424 | విడువవో మాయా విష్ణువధీనము | కీర్తనం, స్మరణం, శ్రవణం, ఆత్మనివేదన | శ్రీపతినామము చేకొనే నాలుక యే పాపములకు నెడలేదు, దాపగు గోవిందుఁ దలఁచిన మనసిది కోపముల కిరవుకొన నెడలేదు<br>నెలవుగ హరికథ నిండెను వీనుల కలిదోషము లిక్కడ లేవు, అలరిన జన్మం బచ్యుతు శరణని నిలిచె దుఃఖముల నివారణము |
| 24 | 3:426 | మనసొకటి కోరికలు మాలు గలపుచు(?)నుండు | శ్రవణం, కీర్తనం | వీనుల..నారాయణుని కథలు వూని నించిన పుణ్యభోగములే యొసఁగు,<br>నాలుక.. శ్రీవేంకటేశు నామామృతము సోలి నించవే ఆత్మ శుభములే కలుగు |
| 25 | 3:431 | అన్నిటికి నారదాదు లదివో సాక్షి | స్మరణం, దాస్యం | సామజవరదు నొక్కసారె దలఁచినందుకు యేమియును సరిగావు యెట్టయినాఁ గాని,<br>చిత్తజగురుని నటు సేవించే పుణ్యమువలె నిత్తెము గావు గాని నిచ్చలు నెంతైనను |
| 26 | 3:446 | కలదందే పో సర్వముఁ గలదు కామితార్థమునుఁ గలదు | దాస్యం, స్మరణం | కలదు గలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు, శ్రీకాంతుని మతిఁ జింతించి యాసలఁ జిక్కక తొలఁగిన నందే కలదు |
| 27 | 3:488 | సకలముఁ జదివిన శాస్త్రము లెఱిఁగిన | దాస్యం,ఆత్మనివేదన | యివల నీదాస్యం బెప్పుడు నొకటే కవిసిన నీ మాయఁ గడిచినది,<br>గతి నీ శరణము గలిగిన దొకటే యితవగు మోక్షం బిచ్చేది |
| 28 | 3:534 | ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు | దాస్యం,ఆత్మనివేదన | అంతట హరి దాస్యమేపో ఘనము, శరణాగతియే ఘనము |
| 29 | 3:546 | వింటిమి నీ కతలు కంటిమి నీమాయలు | దాస్యం,ఆత్మనివేదన, పాదసేవనం, వందనం | బంటుల మచ్యుత నీ పాలివారమయ్యా, చలపట్టి హరి నీకు శరణనేమయ్యా,<br>బదికిరి విప్రులు నీపాద సేవను, మొదల వెనక నీకే మొక్కేమయ్యా |
| 30 | 3:548 | ఇందునే తుదిపద మెక్కి రిందరును | పాదసేవనం, కీర్తనం, అర్చనం, ఆత్మనివేదన | మరిగిన పుణ్యుల మతిలో కోరిక పరమపు హరి నీ పాదములు, పొంచి వేదములు పొగడెడి యర్థము అంచెల గుణకథ లవి నీవి, పంచి యజ్ఞముల ఫలమై యున్నవి నించి దేవ నీ నిజపూజలెపో, కై వల్యమునకుఁ గడుఁ దెరువై నది ఆవల నీ శరణాగతియే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 31 | 3:561 | భావములోనా బాహ్యమునందును | దాస్యం, కీర్తనం, ఆత్మనివేదన | గోవింద గోవింద యని కొలువవో మనసా, హరిహరిహరి యనవో మనసా, అచ్యుతయచ్యుత శరణనవో మనసా |
| 32 | 3:564 | ఓహో నిలిచిన దొకటిదియే | స్మరణం, ఆత్మనివేదనం, కీర్తనం, అర్చనం | నిలిచిన దొకటిదియే శ్రీహరి సాకారచింతనము, అంచెఁ బాపహర మౌషధము పంచలఁ బీతాంబరు శరణాగతి, విందులకుడుపులు విష్ణుకీర్తనము, చందపు వైకుంఠ సంబళము పొందుగ నచ్యుతుఁ బూజించు పూజలు |
| 33 | 4:38 | ఇదియే సులభం బిందరికి | దాస్యం,ఆత్మనివేదన | అగణితుఁడితని నరసి తెలియఁగాఁ దగు నా కనెడిది దాస్యమే కాక, విమలుఁడీహరి వెదకి కానఁగను అమరునా శరణాగతిఁగాక |
| 34 | 4:65 | తక్కిన చదువులొల్ల తప్ప నొల్లా | స్మరణం,దాస్యం | పాపపుణ్యాలవి యొల్ల భవమునఁ బుట్టనొల్ల శ్రీపతినే నిరతము చింతించుటే చాలు, యిదుమల వేఁడనొల్ల యెక్కువ భోగములొల్ల తడయక హరి నీదాస్యమే చాలు |
| 35 | 4:80 | ఇంతే యింతే యింకా నెంత చూచినా | స్మరణం,అర్చనం, ఆత్మనివేదనం | బల్లిదుని హరినాత్మ భావించుటొకటే ముల్ల ముంటఁ దీసి సుఖమున నుండినట్లు, పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు, చనవై శ్రీవేంకటేశు శరణను టొక్కటే పనివడి చెఱకునఁ బండువండినట్లు |
| 36 | 4:138 | తొల్లిటివారు వెట్టిన తోవ యిది | ఆత్మనివేదనం, స్మరణం, దాస్యం, కీర్తనం | సులభుఁడు శరణము చొచ్చితేఁ గాచు నతఁడు, ఇన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చు నిహముఁ బరము, సేవించిన యంతలోనే చేకొని యేలు నీతఁడు, భావించితని నుతించి బ్రదుకుటే మేలు |
| 37 | 4:174 | చేపట్టుఁ గుంచము శ్రీవిభుఁడు | స్మరణం,కీర్తనం, దాస్యం | మనసులోనిహరి మరవక తలఁచిన యెనయ నిహపరము లేమరుదు, పెనగొన నాతనిపేరు నుడిగినను తనకు మహానందము లేమరుదు, పుట్టించినాతని పొసఁగఁగ గొలిచిన యిట్టె వివేకం బేమరుదు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 38 | 4:184 | రంటదెప్పరపు రచన మా బదుకు | ఆత్మనివేదన, దాస్యం | రంటదెప్పరపు రచన మా బదుకు జంటల శ్రీపతిశరణమే నిజము,<br>కడcగి శ్రీవేంకటపతి నాలోననే యెడయcడు యతనినే యిటు గొలిచితిని |
| 39 | 4:191 | ఇతరోపాయములెల్ల యీ సందివే | దాస్యం,స్మరణం, ఆత్మనివేదన | ఇతరోపాయములెల్ల యీ సందివే అతిశయపదమైతే హరిదాస్యఫలమే, దానాలు<br>సేయనేరరా తగిలి యోగీంద్రు లన్ని మాని హరిజపమే నెమ్మడిc జేసిరి, నానావిధు<br>లెరcగరా నాcడు విభీషణాదులు శ్రీనాథు శరణని చిరదేహులైరి |
| 40 | 4:211 | ఒక్కమాcటలోనివే వొగి బంధమోక్షాలు | స్మరణం, దాస్యం | మతిలో గోవింద యన్న మాత్రమున నంటేటి అతిపుణ్యాలిలమీద నన్ని గలవా, శ్రీవేంకటేశ<br>నిన్ను సేవించితే నిచ్చేటి యేవల వరాలు లెక్క నెంచవసమా |
| 41 | 4:224 | నీటముంచు పాలముంచు నీచిత్త మిcకను | పాదసేవనం, దాస్యం, ఆత్మనివేదన, కీర్తనం | గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు, దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు,<br>తగుసంకీర్తన గురి తపమునకు |
| 42 | 4:229 | వర్ణాశ్రమములాల వడిc జిత్రగుప్తులాల | దాస్యం, స్మరణం, ఆత్మనివేదన, అర్చనం | అదన యోగీంద్రవంద్యుcడైన కృష్ణుc గొలిచితి,కూరిమి యజ్ఞకర్తైనగోవిందుc దలcచితి,<br>ఆరయ విజ్ఞానమూర్తియైన హరి శరణంటి,దేవతాశిఖామణియైన దేవునిc బూజించితిని |
| 43 | 4:266 | కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ | అర్చనం, కీర్తనం, ఆత్మనివేదనం | చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు, నీతి నా నాలికగురి నీ నామము,<br>యిహపరాలకు గురి యీ నీ శరణాగతి |
| 44 | 4:303 | తెలియcడు గాక ద్రిష్టము జీవుcడు | స్మరణం, కీర్తనం, దాస్యం | అనువుగ నిటువలె హరిcదలపోసిన తనకు బ్రహ్మానందము సమకొనదా, నాcట నిట్ల<br>హరినామము నొడివిన గాcటపువరములు కలుగునె కాదా,<br>వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని ఆసల కైంకర్యము ఫలించును |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 45 | 4:319 | ఒసఁగితి విన్నియు నొకమాఁటే | స్మరణం, దాస్యం, ఆత్మనివేదనం, కీర్తనం, వందనం | నారాయణ నీనామము దలఁచిన నీరానివరములిచ్చితివి, చేరి నిన్ను నిటు సేవించిన నీకఁగోరి పదయ నీకఁ గోరికలేవి, హరి నీకొకమరి యటు శరణంటే గరిమల నన్నిటు గాచితివి, నిరతముగా నీక నిను నుతియింపుచు అరగొరతనివి నిను నడిగేదేదో, శ్రీవేంకటేశ్వర చేయెత్తిమొక్కిన భావమే నీవై పరగితివి |
| 46 | 4:336 | నమ్మితే నితఁడే మన్ననఁ గాచు | పాదసేవనం, దాస్యం, కీర్తనం | తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాదమేరీతిఁ గొలిచినా నెవ్వరికిని, కలుగనిసిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరి గొలిచినవారికిఁ గోరినట్లే, చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు |
| 47 | 4:340 | ఎన్నిటికెన్నిటికని యెక్కడఁ దగిలెదము | దాస్యం,ఆత్మనివేదన | మఖపతి మీసేవే మాకుఁజాలు, మలసి నీశరణమే మాకుఁజాలు |
| 48 | 4:358 | అన్నిటికి నిది పరమౌషధము | కీర్తన, పాదసేవన, అర్చనం, దాస్యం, ఆత్మనివేదన | వెన్నుని నామమే విమలౌషధము, హరిపాద జలమె యౌషధము, మురహర పూజే ముఖ్యౌషధము, నిందిరావిభుని నలరి భజింపుటె యౌషధము, శ్రీ వేంకటపతి శరణమే నిలిచిన మాకిది నిత్యౌషధము |
| 49 | 4:385 | నమ్మిన దిదివో నా పితురార్జిత | స్మరణం,దాస్యం | శ్రీ పతి రూపమే చింతించు తలఁపే పై పై మాయింటి భాగ్యములు, శ్రీ వేంకటపతి సేవిది యొకటే భావించు నాయుష్యభౌష్యములు |
| 50 | 4:401 | హరి నీకే శరణని గెలుచుట గాక | దాస్యం,ఆత్మనివేదనం | హరి నీకే శరణని గెలుచుట గాక యిరవుగ నెరఁగఁగ నెవ్వరి తరము, మతి శ్రీ వేంకటపతి నిన్నుఁ గొలిచిన యితరము దగ్గర నెవ్వరితరము |
| 51 | 4:409 | హరినామము కడు నానందకరము | స్మరణం, కీర్తనం | నలినాక్షుని శ్రీ నామము..తలఁచవో మనసా, నగధరు నామము.. పొగడవో మనసా |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గాలు | భక్తి మార్గ ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 52 | 4:410 | ఇందుకు ధ్రువాదు లిటు సాక్షి | స్మరణం,ఆత్మనివేదనం | కొండలవంటివి ఘోరపాపములు ఖండించును హరి ఘన నామ జపము,<br>తోవరాని బహుదుఃఖము లణఁచును శ్రీ వేంకటపతిఁ జేరిన శరణము |
| 53 | 4:411 | చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁ బ్రపంచముల | స్మరణం, దాస్యం, ఆత్మనివేదనం, అర్చనం | అంతరంగమునఁ దాను హరిఁ దలఁచినఁ జాలు అంతటి మీఁదటి పనులాతఁ డెరుగు,<br>చేకొని యాతనిరూపు సేవించినఁ జాలు, సాధించి మాధవుని శరణుచొచ్చినఁ జాలు,<br>పోదియై శ్రీ వేంకటేశుఁ బూజించినఁ జాలు పాదుకొని రక్షించఁ బరమాత్ముఁ డెరుఁగు |
| 54 | 4:416 | అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ | ఆత్మనివేదనం, వందనం, దాస్యం, కీర్తనం | శరణు శరణు వోసర్వేశ్వర నీకు, దండము దండము నీకు దైవశిఖామణి,<br>అండనే దాస్యము దాస్యము నీకు నేనైతి, విభుఁడ శ్రీ వేంకటేశ వినుతి సేసెద నిన్ను |
| 55 | 4:450 | హరిహరి నిను సకలాంతర్యామివి(ని?) ఆత్మఁ దలఁచుటే | దాస్యం,ఆత్మనివేదనం | శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నీ భజియించెద,<br>శరణాగతరక్షామణి నిన్నే శరణనియెడిదే తుదిపదము, |
| 56 | 4:455 | ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి | దాస్యం,ఆత్మనివేదనం | హరిదాస్యం బదియే సుఖము, శ్రీ వేంకటపతి నీకే శరణని యెడి నాజన్మమే సుఖము |
| 57 | 4:484 | ఇన్నిళ్ళు నెఱఁగక యిందులోనే వోలాడితి | ఆత్మనివేదనం,వందనం, కీర్తనం | చందములన్నిటా నీకు శరణంటిని, నీ పాదాలకు మొక్కితి నేను,<br>నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని |
| 58 | 4:487 | నమ్మితిఁ జుమ్మీ వో మనసా నాకే హితవయి | స్మరణం,దాస్యం,కీర్తనం | మురహరునామమే జపించుమీ, గోవిందునినే భజించుమీ, ధ్రువవరదునినే నుతించుమీ |
| 59 | 4:510 | నరులాల మునులాల నానాదేవతలాల | దాస్యం,కీర్తనం,వందనం, అర్చనం, ఆత్మనివేదనం,స్మరణం | సేవించరో తొడమీఁది శ్రీ సతిని, వావిరి నుతించరో వరశంఖచక్రాలవె, చెలఁగి మొక్కరో<br>వీఁడె శ్రీ నరసింహ దేవుఁడు, అలరి పూజించరో అనంతహస్తము లవె, యిదె శరణనరో<br>హిరణ్యదైత్యహరుని, అదన జపించరో యీ హరినామము |
| 60 | 4:604 | నారాయణుని శ్రీ నామమిది | స్మరణం, దాస్యం | శుక వరదుని సొంపుగఁ దలఁచుటె సకల భవ విజయము, వేంకటాధిపు సేవించఁగదో |

# అధ్యాయం—4

# అన్నమయ్య సంకీర్తనలలో

# ఇతర భక్తి మార్గాలు

# అధ్యాయం-4

# అన్నమయ్య సంకీర్తనలలో ఇతర భక్తి మార్గాలు

## 4.0. పరిచయం

అనాదిగా 'భక్తి' మానవ జీవితంలో భాగమై ఉంది. మౌలికమైన భక్తి స్వరూపం ఒకటే అయినా, భక్తి అనేకరూపాల్లో, అనేక విధాలుగా ప్రవర్తిల్లుతూ వచ్చింది. భక్తి మార్గాలను భాగవతం 1) శ్రవణం 2) కీర్తనం 3) స్మరణం 4) పాదసేవనం 5) అర్చనం 6) వందనం 7) దాస్యం 8) సఖ్యం 9) ఆత్మనివేదనం అంటూ నవవిధాలుగా ప్రతిపాదించింది (వీరరాఘవ. 1976:68 – [వ్యాస భాగవతం–7వ స్కంధం–5వ అధ్యాయం–23వ శ్లోకం]).

భక్తి ఒక్కటే అయినప్పటికీ, అది పదకొండు విధాలుగా ఉంటుంది అని నారదమహర్షి ప్రతిపాదించారు (వేంకటేశ్వర శాస్త్రి, జంధ్యాల. 1985:181 – [నారద భక్తి సూత్రాలు–82వ సూత్రం]). అవి 1) గుణమాహాత్మ్యాసక్తి 2) రూపాసక్తి 3) పూజాసక్తి 4) స్మరణాసక్తి 5) దాస్యాసక్తి 6) సఖ్యాసక్తి 7) వాత్సల్యాసక్తి 8) కాంతాసక్తి 9) ఆత్మనివేదనాసక్తి 10) తన్మయాసక్తి 11) పరమవిరహాసక్తి.

ఆధునికులైన స్వామి వివేకానంద తన భక్తియోగంలో పంచవిధ భక్తి మార్గాలను చూపించారు (స్వామి చిరంతనానంద. 2015:109–118). అవి 1) శాంతభక్తి 2) దాస్యభక్తి 3) సఖ్యభక్తి 4) వాత్సల్యభక్తి 5) మాధుర్యభక్తి

ఒక్కొక్కరి దర్శనం, భక్తి నిర్వచనం ఒక్కోలా ఉంది. అన్నమయ్యకూడా తన కీర్తనలలో తనవైన భక్తిమార్గాలను ప్రతిపాదించారు. వాటికి లక్షణాలను నిర్వచించారు. వాటికి లక్ష్యాలుగా తన కీర్తనలనే రూపొందించారు. అవే కాక, మరిన్ని భక్తి మార్గాలను తన కీర్తనల ద్వారా

ప్రదర్శించారు. మూడవ అధ్యాయంలో భాగవతం ప్రతిపాదించిన నవవిధ భక్తిమార్గాలను అన్నమయ్య కీర్తనలతో సమన్వయించాను. ఈ అధ్యాయంలో ఇతర భక్తిమార్గాలను విశ్లేషించాను.

*నానాభక్తులివి నరుల మార్గములు*
*యే నెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి*

*హరిఁకిఁగా వాదించు టది ఉన్మాదభక్తి*
*పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి*
*అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి*
*అరమరచి చొక్కుటే ఆనందభక్తి*

*అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి*
*అతని దాసుల సేవే అదియే తురీయభక్తి*
*క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి*
*అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి*

*అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి*
*నెట్టన శరణనుటే నిర్మలభక్తి*
*గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి*
*తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి* (2-469)

'మానవులు అవలంబించే భక్తి మార్గాలు అనేకం ఉన్నాయని, ఏ భక్తి మార్గాన్నైనా భగవంతుడు అంగీకరిస్తాడని చెబుతూ, అన్నమయ్య ఏకాదశ భక్తి మార్గాలను ప్రతిపాదించారు. అవి

1. ఉన్మాద భక్తి 2. పతివ్రతా భక్తి 3. విజ్ఞాన భక్తి 4. ఆనంద భక్తి 5. రాక్షస భక్తి 6. తురీయ భక్తి 7.తామస భక్తి 8. వైరాగ్య భక్తి 9. రాజస భక్తి 10. నిర్మల భక్తి 11. నిజ భక్తి'

పై భక్తి మార్గాలకే కాక, మధుర భక్తి, వాత్సల్య భక్తి, అనన్య భక్తి, వైర భక్తి మొదలైన భక్తి మార్గాలకు అన్నమయ్య కీర్తనల్లో లక్ష్యప్రాయమైన వాటిని గ్రహించి, సమన్వయించడం ఈ అధ్యాయంలో ప్రధానమైన అంశం. ఈ భక్తిమార్గాలకు సంబంధించి ఉదాహరణలుగా చెప్పదగిన (1-6 సంపుటాలలోని) సంకీర్తనలను ఈ అధ్యాయం చివర్లో ఆయా విభాగాల కింద పట్టికలుగా కూర్చి చూపడం జరిగింది.

## 4.1. ఉన్మాద భక్తి

*హరిఁకిఁగా వాదించు టది ఉన్మాదభక్తి* (2-469) - హరి మాత్రమే పరదైవం, పరమదైవం అని వాదించటమే ఉన్మాద భక్తి. మతవిషయమైన తీంద్రను - దూకుడును ఉన్మాదభక్తి అనవచ్చని వేటూరి ఆనందమూర్తిగారు (ఆనందమూర్తి, వేటూరి. 1976:175) పేర్కొన్నారు.

మత విషయమైన తీంద్ర పలురూపాల్లో ఉంటుంది. అందులో అన్యదైవ తృణీకరణం - తన ఇష్టదైవం అందరికంటే గొప్పవాడని, పరదైవాలు తమ దైవముందు తక్కువ వారని నిరసించడం ఒకటి. ఈ విధమైన ఉన్మాద భక్తి ఎక్కువగా తెలుగు సాహిత్యంలో శివకవులలో దర్శనమిచ్చింది. విశిష్టాద్వైత మతానికి పట్టుకొమ్మలైన ఆళ్వారులలోకూడా (తిరుమళిశై ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారు, తొండరడిప్పొడి ఆళ్వారు మొ॥) హరికీర్తనంతో పాటుగా, అన్యదైవతృణీకరణం ఉండేది.

*నాన్ముగన్ తిరువందాదిలో* విష్ణు పారమ్యాన్ని స్థాపించడమే తిరుమళిశై ఆళ్వారు ధ్యేయంగా కనిపిస్తుంది. బ్రహ్మ, మహేశ్వరుల పుట్టుకకు కారణమైన విష్ణువు ఆదిదైవమని,

పరమదైవమని అంటారు. విష్ణు పాదోద్భవి అయిన గంగను తలపై దాల్చిన శివుడు, విష్ణువుకు సమానుడెలా అవుతాడని ప్రశ్నిస్తారు (Premananda Kumar. 1994:19-20) తిరుమళిశై ఆళ్వారు.

విశిష్టాద్వైత సిద్ధాంతాలకు ఊపిరి పోసి, రామానుజుడికి మార్గనిర్దేశం చేసిన యామునాచార్యులు కూడా *స్తోత్రరత్న*లో ఇదే విధంగా అంటారు.

*బ్రహ్మా శివశ్శతమఖః పరమస్వరాడితి*

*ఏతేஉపి యస్య మహిమార్ణవవిప్రుషస్తే* (Rajajee, M. S. 2001:18 – [Stotra Ratna-11th shloka])

'బ్రహ్మ, రుద్ర, ఇంద్రాదులు కూడా నీ మహిమార్ణవంలో నీటి బిందువులు మాత్రమే.'

*కోஉన్యః ప్రజాపశుపతీ పరిపాతి కస్య*

*పాదోదకేన స శివస్స్వశిరోధృతేన* (Rajajee, M. S. 2001:21 – [Stotra Ratna-13th shloka])

'బ్రహ్మ రుద్రులను రక్షించేది ఎవరు? (నీవే!). నీ పాదోదకమైన గంగా జలాలను శిరస్సుపై ధరించడంవల్లనే శివుడు శివుడయ్యాడు (మంగళకరుడయ్యాడు).'

తొండరడిప్పొడి ఆళ్వార్ *తిరుమాలై* లో, *మత్తుమోర్ తెయ్‌వముండే?* – 'కృష్ణుడికంటే వేరొక దైవము కలడా?' అని ప్రశ్నించి, *అవనల్లాన్ తెయ్‌వమిల్లై* – 'అతడు తప్ప వేరొక దైవం లే'దని నిర్ణయిస్తారు (రఘునాథాచార్యులు, న. చ. 1992:62 – [తిరుమాలై–9వ పాశురం]). *తెయ్‌వమెంగుం నాట్టినాన్* (రఘునాథాచార్యులు, న. చ. 1992:66 – [తిరుమాలై–10వ పాశురం]) – 'ఇతర దేవతలను లోకంలో అతడే సృష్టించా'డంటారు.

ఇటువంటి మతావేశం విశిష్టాద్వైత ప్రవర్తకులైన రామానుజాచార్యులవారి రచనలలో కనపడకపోయినా, కాలానుగుణంగా ఆ మతానుయాయులలో అక్కడక్కడా దర్శనమిస్తూ

వచ్చింది. అన్నమయ్య చాలావరకు సాత్త్వికుడిగానే కనిపించినా, అక్కడక్కడ ఉన్మాద భక్తి తత్త్వం అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తుంది.

*పాపము పాపము ప్రజలాలా*

*పై పై నిటువలెఁ బలుకకురో*

*హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును*

*హరితో సరి వీరనుటెట్లా*

*పొరిఁ గొండలందుఁ బుట్టిన శిలలివి*

*సరుసఁ బెట్టితే సరియౌనా* (3-350)

'విష్ణువు పుట్టించిన బ్రహ్మ, శివుడు ఆయనతో సమానులెట్లా అవుతా'రని తిరుమళిశై ఆళ్వారు మాదిరిగా ప్రశ్నిస్తారు. 'కొండలలో పుట్టిన రాళ్ళు కొండలకు సమానం కావు కదా?' అంటూ సమర్థించుకుంటారు.

*నరహరి యజాండనాయకుడు*

*సురలితనినే సంస్తుతించిరి*

*పురుషోత్తముఁ డిదె భూమికి - యీ*

*హరిఁ గొలువనివా రసురలు సుండీ* (4-210)

పై కీర్తనలో 'నరహరి బ్రహ్మాండనాయకుడు, దేవతలంతా అతనినే స్తుతించారు' అన్నంతవరకు ఇబ్బందిలేదు, ఆపై, 'పురుషోత్తముడైన హరిని కొలవనివారు రాక్షసులే సుమా' అనడం ఉన్మాద భక్తే అనిపించుకుంటుంది.

*బెండుపడఁ గేశవునిఁ బేరుకొనని నాలికె*

*వుండెనేమి వుండకుండెనేమిరే*

*వెదకి శ్రీపతిసేవ వేడుకఁ జేయనివాఁడు*
*చదివెనేమి చదువు చాలించెనేమిరే*
*శ్రీవేంకటేశ్వరుఁ జేరనిధర్మములెల్ల*
*తోవల నుండెనేమి తొలఁగినేమిరే* (1-456)

'కేశవనామం పలకని నాలుక ఉంటే ఏమి? లేకుంటే ఏమి? శ్రీనాథుడి సేవ చేయనివాడు చదివితే ఏమి? చదవకుంటే ఏమి? శ్రీవేంకటేశ్వరుడిని బోధించని ధర్మాలు ఉంటే ఏమి? లేకుంటే ఏమి?' వంటి కీర్తనలలోకూడా ఉన్మాదభక్తి తత్త్వం కనిపిస్తుంది.

## 4.2. పతివ్రతా భక్తి

*పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి* (2-469) – పర దేవతలను కొలవకుండా శ్రీమహావిష్ణు అవతారాలను మాత్రమే కొలవటం పతివ్రతా భక్తి. అద్వైతులు ఏ దైవమైనా ఒకటేనంటూ భావిస్తారు; పూజిస్తారు. విశిష్టాద్వైతులు విష్ణు రూపాన్ని, విష్ణువు అవతారాలను మాత్రమే కీర్తిస్తారు. ఏ విధంగా పతివ్రత పతిని మాత్రమే దైవంగా భావించి పూజిస్తుందో, పతివ్రతా భక్తులు తమ ఇష్టదైవాన్ని మాత్రమే పూజిస్తారు, ఇతర దేవతలను పూజించరు. విశిష్టాద్వైతులంతా సహజంగా విష్ణువారాధన మాత్రమే చేస్తారు. *నిన్నేకాని యితరుల నేఁ గొలువనొల్ల నంటి* (2-177) అనే భావనే పతివ్రతా భక్తి. తొండరడిప్పొడి ఆళ్వారు అయితే కావేరీ తీరంగా శ్రీరంగంలో వెలసిన శ్రీరంగనాథుడినే తప్ప ఇతర విష్ణువవతారాలనుకూడా కీర్తించలేదు.

*తావియస్టులకమెల్లాం తలైవిళాక్కొండ వెందాయ్*
*శేవియేన్నున్నై యల్లాల్ శిక్కెనచ్చంగణ్ మాలే*
*అవియే! యముతే! ఎన్దనారుయి రనైయ వెన్దాయ్*

*పావియే నున్నై యల్లాల్ పావియేన్ పావియెనే* (రఘునాథాచార్యులు, న. చ. 1992:145 – [తిరుమాలై–35వ పాశురం])

'ఆనాడు లోకములన్నింటిని కొలిచి మా శిరస్సులపై నీ పాదస్పర్శ కలిగించిన నా స్వామివైన ఓ పుండరీకాక్షా! నిన్ను తప్ప ఇతరులను సేవింపబోను. ఇది నా దృఢ నిశ్చయము. నాకు ప్రాణమైనవాడా! అమృతంలా భోగ్యమై, నా అంతరాత్మగా నాలో వ్యాపించి ఉన్న నా స్వామీ! మహాపాపినైన నేను నిన్ను తప్ప ఇతరుల నెవ్వరిని మనస్సులోకూడా తలచుకోను.'

అన్నమయ్య కూడా ఇటువంటి పతివ్రతా భక్తి భావనను ఎన్నో కీర్తనల్లో ప్రదర్శించారు.

*ఇందులోనఁ గల సుఖమింతే చాలు మాకు*
*నిందు వెలియైన సిరులేమియు నొల్లము*

*ఆదిదేవు నచ్యుతు సర్వాంతరాత్మకుని*
*వేదవేద్యుఁ గమలాక్షు విశ్వపూర్ణుని*
*శ్రీదేవు హరి నాశ్రిత పారిజాతుని*
*అదిగాని శరణంటి మన్యము నేమొల్లము*

*పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని*
*మురహరు గోవిందు ముకుందుని*
*హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని*
*పరగ నుతించితిమి పరుల నేమొల్లము*

*అనుపమ గుణదేహు నణురేణు పరిపూర్ణు*
*ఘనుఁ జింరంతనుని కలిభంజను*
*దనుజాంతకుని సర్వధరు శ్రీవేంకటపతిఁ*
*గని కొలిచితిమి యేగతులు నేమొల్లము* (4–87)

‘హరిని శరణువేడాము. ఇతరమైనవేమీ మాకొద్దు. నారాయణుడినే కీర్తిస్తాం. పరులను ఒప్పుకోం. శ్రీవేంకటపతినే కొలుస్తాం. మరేమీ అంగీకరించం.’

*పొరులఁ గొలువము నే మొగి నీ పాదాలే నమ్మి*
*నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముఁ గాతువు* (3-128)

‘ఇతర దైవాలను కొలవం. నీ పాదాలనే నమ్మి నిత్యం నిన్నే కొలిచాం. నీవే మమ్మల్ని రక్షిస్తావు.’

*నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి*
*పరదైవములతోడిపని మాకు లేదయ్యా* (4-136)

‘శ్రీ వేంకటేశ్వరా! నిన్నే నమ్ముకున్నాం. ఇతర దైవాలతో మాకు పని లేదు.’ ఈ విధంగా ఎన్నో కీర్తనలలో అన్నమయ్య తన పతివ్రతా భక్తిని చాటుకున్నారు.

### 4.3. విజ్ఞాన భక్తి

*అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి* (2-469)- పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోవటమే విజ్ఞాన భక్తి. కులమతభేదాలను, మూఢభక్తిని నిరసించి జ్ఞానాన్ని ప్రవచించటంకూడా విజ్ఞాన భక్తిలోకే వస్తుంది. విశిష్టాద్వైత మతాచార్యులైన రామానుజులు గొప్ప సంఘసంస్కర్త. వెయ్యేళ్ళ క్రితమే దళితుచేత ఆలయప్రవేశం చేయించారు. మానవులంతా సమానమేనంటూ ఘోషించారు. అన్నమయ్యకూడా రామానుజుడు చూపిన దారిలోనే సంఘ సంస్కరణ భావాలను తన కీర్తనలద్వారా వెదజల్లారు. అనేక కీర్తనలలో విజ్ఞాన భక్తిని ప్రదర్శించారు.

*యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును*

*వొక్కట నంతర్యామై వున్నాఁడదె* (3–252)

'తీర్థయాత్రలంటూ ఇల్లు, వాకిలి, సంసారాలను వదులుకుని ఊరూరా తిరగవలసిన పని లేదు, భగవంతుడు అంతర్యామిగా ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాడు, దర్శించ'మంటారు అన్నమయ్య.

*ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన*

*నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు* (1–318)

*కందువగు హీనాధికములిందు లేవు*

*అందరికి శ్రీహరే అంతరాత్మ* (2–385)

'కులమతభేదాలను నిరసిస్తూ, ఏ కులస్థుడైనా తత్త్వం తెలుసుకున్నవాడే గొప్పవాడంటూ, ఎక్కువ తక్కువలు లేవని, అందరిలోనూ వెలుగుతున్నవాడు శ్రీహరే'నని ప్రబోధించారు.

*నిలిచిన రూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు*

*మెలఁగేటి చైతన్యము మిమ్ముగాఁ దలఁతు*

*యిలలోని ధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు*

*సకల పంచభూతా లుపకరణాలుగాఁ దలఁతు* (2–324)

'కనిపించే రూపాలన్నీ పరమాత్ముడి గుళ్ళేనని, చైతన్యం ఆ పరమాత్మేనని, వినిపించే ధ్వనులన్నీ పరమేశ్వరుడి పలుకులేనని, పంచభూతాలు పరంధాముడి సాధనాలని' చెబుతూ, ఈ కీర్తనలో అన్నిటా, అంతటా పరమాత్మను దర్శించే జ్ఞానాన్ని పంచిపెట్టారు అన్నమయ్య.

## 4.4. ఆనంద భక్తి

*అరమరచి చొక్కుటే ఆనందభక్తి* (2-469) – భక్తి పారవశ్యంలో ఆదమరచి ఉండటం ఆనందభక్తి. భక్తిని రసంగా పరిగణిస్తే రసానందాన్ని, పరానికి త్రోవగా భావిస్తే పరమానందాన్ని ఇవ్వగలుగుతుంది. భగవంతుడు చిదానందస్వరూపుడు. అతడి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించగలిగినపుడు కలిగే అలౌకికానందాన్ని అనుభవించి, విప్రనారాయణుడనబడే తొండరడిప్పొడి ఆళ్వారు ఇలా పలవరిస్తారు.

*ఇనితిరైత్తివలై మోద వెరియుంతణ్ పరవై మీదే*
*తని కిడందరశు శెయ్యుం తామరైక్కణ్ణ నెమ్మాన్*
*కనియరుందనైయ శెవ్వాయ్ కణ్ణనైక్కండ కణ్గళ్*
*పనియరుంబు దిరుమాలో ఎన్ శెయగేన్ ఉలగత్తీరే!* (రఘునాథాచార్యులు, న. చ.
1992:93 – [తిరుమాలై-18వ పాశురం])

'సొంపుగా తరంగాలు సన్నని తుంపరలను విసురుతుండగా, చల్లని కావేరీ ప్రవాహ మధ్యంలో ఏకాంతంగా శయనించి లోకరక్షణ చేస్తున్న పద్మపత్రాక్షుడు, దొండపండువంటి ఎర్రని పెదవులతో కృష్ణరూపంలో శ్రీరంగనాథుడిగా అవతరించాడు. అటువంటి స్వామిని సేవించిన నా కన్నులు ఆనందబాష్పాలను కారుస్తున్నాయి. అయ్యో! లోకులారా! ఏమి చేయను?'

అటువంటి ఆనందాన్నే అన్నమయ్యకూడా అనుభవించారు.

*అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె*
*కన్నుల మా వేడుకకు కడయేది యిఁకను* (3-35)

'సృష్టంతటికీ అతడే మూలం. అటువంటి పరమాత్మే మాకు వశమయ్యాడు. ఇంక మా ఆనందానికి హద్దేది?'

ఈ కింది కీర్తనలో అన్నమయ్య తన సకల అవయవాలద్వారా భగవంతుడి గుణగణాలను అనుభవిస్తూ ఆనందపారవశ్యం చెందారు.

*సదానందము సర్వేశ్వర నీ-*
*పదారవిందముపై భక్తి*

*నయనానందము నరులకు సురలకు*
*జయమగు హరి నీసాకారము*
*నయమగు శ్రవణానందము వినినను*
*క్రియగలిగిన నీకీర్తనము*

*చెలఁగి యందరికి జిహ్వానందము*
*పలుమరుఁ గొను నీప్రసాదము*
*నలుగడ దేహానందము బుధులకు*
*బలు నీపాదప్రణామములు*

*ధరఁ బరమానందము నీదాస్యము*
*గరిమల శ్రీవేంకటవిభుఁడా*
*నరహరి నిత్యానందము నినుఁ దగ-*
*నరవిరిఁ జేయు సమారాధనము* (2-369)

'భగవంతుడి రూపం కళ్ళకు ఆనందం కలిగిస్తుంది. భగవత్కీర్తన చెవులకు ఆనందం కలిగిస్తుంది; భగవత్ప్రసాదం నాలుకకు ఆనందం కలిగిస్తుంది; భగవంతుడికి సాష్టాంగ నమస్కారాలు చేయడం శరీరానికి ఆనందం కలిగిస్తుంది; భగవంతుడి సేవ పరమానందం కలిగిస్తుంది; భగవత్పూజ నిత్యానందం కలిగిస్తుంది; భగవంతుడి పాదాలపై భక్తి కలిగి ఉండడం ఎల్లవేళలా ఆనందం కలిగిస్తుంది' అంటూ ఉప్పొంగిపోయారు అన్నమయ్య.

## 4.5. రాక్షస భక్తి

*అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి* (2-469) - సాహసాలతో కూడిన పూజలు రాక్షస భక్తి. అన్నమయ్య రాక్షస భక్తిని నిరసించారు. అటువంటి భక్తిని ఆచరించవద్దని ప్రబోధించారు.

*మొక్కరో మీరు మోసపోక - మీకు*
*దిక్కు దైనైన ఆదిదేవునికి*

*మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు*
*బీరాన గుండెలు గోసి పెట్టవద్దు*
*గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు*
*ఊరకే మీవారమని వున్నఁ జాలు*

*సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు*
*బడి బడి పగ్గాలఁ బారవద్దు...*
*ఎగ్గు సిగ్గులేక వేంకటేశుని దాసులఁజేరి*
*అగ్గలపు పాదరేణువైనఁ జాలు* (4-593)

'శరీరంలో అవయవాలను కోసి, నిప్పులో వేయటం, నిప్పుల్లో నడవడం, బలులివ్వడం వంటి రాక్షసకృత్యాలను చేయవలసిన పని లేదు. అటువంటివి చేయించేవారి మాటలు విని మోసపోరాదు. దైవానికి నమస్కరించి, నీ వాడనని అంటే చాలని, భాగవతులను సేవిస్తే చా'లని అన్నమయ్య ప్రబోధించారు.

## 4.6. తురీయ భక్తి

*అతని దాసుల సేవే అదియే తురీయభక్తి* (2-469)- భాగవతులను సేవించటం తురీయ భక్తి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భాగవతుడికికూడా భగవంతుడికున్న స్థానమే ఉంది. కులశేఖరాళ్వారు, తొండరడిప్పొడి ఆళ్వారు మొదలైన వారు భాగవత భక్తిని ప్రవచించారు.

కులశేఖరాళ్వారు *పెరుమాళ్ తిరుమొళి* లో ఇలా పేర్కొన్నారు.

హరదేవేంద్ర విరించులంబలె సదా యజ్ఞంబులం జేయు నం
దరకున్ యజ్ఞఫలంబు లిచ్చెడు పరంధాముండు వాసించు, త
ద్గిరిపై భక్తుల పాదధూళి కనువై దీపించు మార్గంబుగా
వరియింతున్ జననంబు; (నాగేశ్వరశర్మ, ఇంద్రగంటి. 1994:27 – [పెరియ
తిరుమొళి-4వ దశకం-8వ పాశురం])

ఈ పాశురంలో కులశేఖరాళ్వారు తిరుమలలో స్వామివారి ఆలయానికి పోవడానికి భక్తులు నడిచే కాలిబాటగా ఉండాలనుకుంటారు. ఆ విధంగా నిరంతరం భాగవతుల స్పర్శ తనకు కలగాలనే అభిలాషను వ్యక్తం చేస్తారు. కాని భక్తులు వేరే మార్గంలో వెళ్ళిపోవచ్చు, అప్పుడు భాగవతుల సంసర్గం తొలగిపోతుంది కనుక తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తులందరూ విధిగా తొక్కివెళ్ళే వాకిలిమెట్టుగా ఉండాలనుకుంటారు. ఆయనకు భాగవతులపై గల భక్తి అటువంటిది.

కులశేఖరాళ్వారే *ముకుందమాల* లో ఇలా అంటారు.

*త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య*
*భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ!* (కొండమాచార్యులు, ముదివర్తి.
1993:122 – [ముకుందమాల-27వ శ్లోకం])

‘ఓ స్వామీ! నీ సేవకులకు సేవకులు, వారికి సేవకులు అంటూ సాగే సేవకుల పరంపరలో నన్ను చివరి సేవకుణ్ణిగా భావించుము’ అని అంటారు. ఇదే భావనను అన్నమయ్య కూడా వ్యక్తం చేశారు.

*కందువ శ్రీవేంకటేశ కదు నీ బంటుబంటుకు సందడిబంట నవుటే చాలదా నాకు* (3-23)

*జడియు శ్రీవేంకటేశ్వరుదాసుఁ డాయనా బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు* (2-452)

అని అన్నమయ్య భగవద్దాసులను భగవంతుడిగానే భావించే సేవాభావాన్ని కనపరిచారు. ప్రత్యేకించి అన్నమయ్య అనేక కీర్తనలలో భాగవతోత్తములైన హనుమంతుని, ప్రహ్లాదుని, అంబరీషుని, ధ్రువుని కీర్తించారు. *మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు* (3-301)

> *తవదాస్య సుఖైక సంగినాం*
> *భవనేష్వస్త్వపి కీటజన్మమే* (Rajajee, M. S. 2001:78 – [Stotra Ratna-55th shloka])

‘నిను సేవించే నీ దాసుల ఇంట్లో కీటకంగా జన్మించినా నాకు సమ్మతమే’ అంటారు యామునాచార్యులు. అన్నమయ్యకూడా,

> *ఇన్ని జన్మము లేఁటికి హరిదాసు-*
> *లున్నవూరఁ దా నుండినఁ జాలు*
>
> *హరిభక్తుల యింటియన్నము గొనువారి*
> *వరువుడై వుండవలెనన్నఁ జాలు*
> *పరమభాగవతభవనంబులఁ జెడ్డ*
> *పురువు దానయి పొడమినఁ జాలు*

*వాసుదేవునిభక్తవరులదాసులు మున్ను*

*రోసిన యెంగిలి రుచిగొన్నఁ జాలు*

*శ్రీసతీశునిఁ దలఁచినవారి దాసాన*

*దాసుడై వుండఁదలఁచినఁ జాలు*

*శ్రీవేంకటేశుఁ జూచినవారి శ్రీపాద*

*సేవకుఁడై యుండఁజేరినఁ జాలు*

*యీ విభుదాసులహితుల పాదధూళి*

*పావనమై సోఁకి బ్రదికినఁ జాలు* (1-367)

'భాగవతులింట్లో భోజనం చేసేవారికి కోసెడు దూరంలో ఉండడమే చాలు. భాగవతుల ఇళ్లలో పురుగుగా పుట్టినా చాలు. వారి ఉచ్ఛిష్టం భుజించగలిగితే చాలు. వారికి దాసానుదాసుడిగా ఉండగలిగితే చాలు. వారి పాదసేవకుడై ఉంటే ఇంకా మేలు. భాగవతులే కాదు, భాగవతుల హితుల పాదధూళి సోకినా మేలే. అసలివన్నీ ఎందుకు హరిదాసులున్న ఊళ్ళో తానుంటే చా'లంటారు. ఈ విధంగా అన్నమయ్య తన తురీయ భక్తిని చాటుకున్నారు.

## 4.7. తామస భక్తి

*క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి* (2-469) – భౌతికమైన ప్రయోజనాన్ని ఆశించి పూజించటం తామస భక్తి. భాగవతంలో ప్రజల సంకల్పాలను బట్టి భక్తి త్రివిధంగా ఉంటుందని పేర్కొంటూ, తామస, రాజస, సాత్త్విక భేదాలు వివరించబడ్డాయి. పరహింస, అసూయ, రోషం మొదలైన తామస గుణాలను కలిగి పూజించేవారిది తామస భక్తి అని భాగవతం చెబుతోంది. అయితే అన్నమయ్య తామస భక్తి నిర్వచనం వేరొక విధంగా ఉండడం గమనార్హం. సకల కర్మలను భగవదర్పితంగా చేస్తూ, ప్రతిఫలాపేక్షరహితంగా పూజించటమే నిష్కామ భక్తయితే, ఏదో ఒక ప్రయోజనం ఆశించే భక్తినే అన్నమయ్య తామస భక్తి అన్నారు.

అన్నమయ్య పరిమితమైన కీర్తనలలో తామస భక్తి ప్రదర్శన చేశారు.

*నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ*
*సరుగ నా శత్రుల సంహరించవే*

*బావ తిట్లకు శిశుపాలునిఁ జంపిన-*
*యేవ కోపకాఁడవు నేఁ డెందు వోతివి*
*నీవాఁడనని నన్ను నిందించే శత్రువును*
*చావఁగొట్టి వానినిట్టే సంహరించవే*

*దాసుని భంగించేటి తరిఁ గస్యఁపుఁ జంపిన*
*యీసు కోపకాఁడ విపు డెందువోతివి*
*మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే*
*సాసించి శత్రువును సంహరింపవే*

*కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁజంపిన*
*యెల్లగాఁగఁ గోపకాఁడ వెందువోతివి*
*యిల్లిదె శ్రీ వేంకటేశ యీ నీ మీఁదిపాటలు*
*జల్లన దూషించు శత్రువు సంహరింపవే* (4-454)

ఈ కీర్తనలో 'వైష్ణవుడినని, విష్ణు లాంఛనాలు ధరిస్తానని, స్వామిమీద పాటలను పాడతానని నన్ను నిందించే శత్రువులను సంహరించు' అని అన్నమయ్య స్వామివారిని కోరడం కనపడుతుంది.

*నగధర మీపై భక్తి సేయఁగ మనంబున వొడఁబడను*
*పగటున మీరిచ్చు వరములకొరకే పలుమారు మీకు మొక్కుకొందును* (2-293)

పై కీర్తనలో భగవంతుడిచ్చే వరములకోసమే మళ్ళీమళ్ళీ మొక్కుకునే తన అయోగ్యతను చెప్పుకున్నారు అన్నమయ్య. ఎంతటి గొప్ప భక్తులకైన ఒక్కోసారి తామస ప్రవృత్తి కమ్మివేస్తుంది. అంతమాత్రాన వారి భక్తిని తక్కువ చేయనవసరం లేదు. లేదా 'కార్పణ్యం'లో భాగంగా అన్నమయ్య తన తక్కువతనాన్ని దైవం ముందు ప్రదర్శిస్తున్నారని అర్థం చేసుకోవాలి.

## 4.8. వైరాగ్య భక్తి

*అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి* (2-469) – పరమాత్ముడే గతి అని భౌతికమైన వాటిని త్యజించటం లేదా భౌతిక జగత్తుపట్ల విముఖతను వ్యక్తపరచటం వైరాగ్య భక్తి. ఆది నుండి భారతీయ సంస్కృతి చతురాశ్రమాలను – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలను – బోధిస్తూ వచ్చింది. సాంసారిక జీవితాన్ని అవలంబించాక, ఇంక బాధ్యతలనునుండి తప్పుకుని క్రమంగా సన్యాస జీవితం వైపుకు మళ్ళే దశను వానప్రస్థం అన్నారు. సన్యాస జీవితంలో సంసార బంధాలను, ఐహిక వస్తు వాంఛను పూర్తిగా త్యజిస్తారు.

భౌతికమైన సంసార సుఖాలపట్ల అయిష్టత కలిగినప్పుడు, భగవంతుడిపట్ల కేంద్రీకృతమైన ధ్యానం కలుగుతుంది. విరక్తి/వైరాగ్యం భగవన్ముఖంగా చేసే ప్రయాణంలో అవసరమని వేదాంతులు చెబుతారు. కనుక, సంసారంపట్ల విరక్తిని ప్రదర్శిస్తూ, భగవంతుడిని చేరాలని చూసేది వైరాగ్యభక్తి.

*భవజలధి గతానాం ద్వంద్వవాతా హతానాం*
*సుతదుహితృ కళత్రత్రాణ భారార్థితానాం*
*విషమవిషయ తోయే మజ్జతా మప్లవానాం*
*భవతు శరణు మేకో విష్ణుపోతో నరాణాం* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:71 – [ముకుందమాల-12వ శ్లోకం])

'సంసారసముద్రంలో పడిపోయినవారికి, సుఖదుఃఖాలనే గాలిచే కొట్టబడినవారికి, భార్యాబిడ్డల భారంతో కుంగిపోతున్నవారికి, విషయలంపటమనే నీటిలో మునుగుతూ, తేలుతూ ఉన్నవారికి విష్ణువనే నావ మాత్రమే గతి.' ఈ శ్లోకంలో సంసారసుఖాలపట్ల విముఖతను ప్రకటిస్తూ, విష్ణువును చేరాలని వైరాగ్యభక్తిని చాటుకున్నారు కులశేఖరాళ్వారు. అన్నమయ్యకూడా చాలా కీర్తనలలో సంసారంపట్ల నిర్వేదం వ్యక్తం చేశారు; శ్రీవేంకటేశ్వరుడే గతి అని నమ్ముకున్నారు.

*ఇతర చింత లిఁక నేమిటికి*
*అతఁడే గతియై అరసేటివాఁడు*

*అతిదుఃఖకరము లాసలు*
*సతత సుఖకరము సమవిరతి*
*గతి యలమేల్మంగతో శ్రీవేంకట*
*పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు* (3-22)

కోరికలే దుఃఖకారణాలని ఉపనిషత్తులు, బౌద్ధ సాహిత్యం, భగవద్గీత మొదలైన మతగ్రంథాలన్నీ ఘోషించాయి. 'ఆశలు దుఃఖాన్ని కలిగిస్తాయని, ఎల్లప్పుడూ సుఃఖాన్ని కలిగించేది తగుపాళ్లలో ఉన్న విరక్తి మాత్రమేనని, ఇతర ఆలోచనలు మానుకుని శ్రీవేంకటేశ్వరుడే గతి అని భావిస్తే, అతడే తమ బాగోగులను చూసుకోగల'దని పై కీర్తనలో వైరాగ్యభక్తిని ప్రదర్శించారు.

విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వెనకవారెల్ల
విరతిఁబొందకున్న వీడదు భవము (4-369 )

'విరక్తే లాభదాయకం, సౌఖ్యదాయకం, విజ్ఞానదాయకం. విరక్తివలననే వెనుకటివారు గొప్పవారయ్యారు. విరక్తి కలుగకుంటే జన్మబంధాలనుండి విముక్తులు కాలేరు' అంటూ ఈ కీర్తనలోకూడా అన్నమయ్య వైరాగ్యాన్ని ప్రకటించారు.

### 4.9. రాజస భక్తి

*అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి* (2-469) – తన స్వతంత్రతను, అహంకారాన్ని ప్రకటించుకోవటం రాజస భక్తి.

యామునాచార్యులు *స్తోత్రరత్న* లో,

*యది మే న దయిష్యసే తతో దయనీయస్తవ నాథ దుర్లభః*
*తదహం త్వదృతే న నాథవాన్మదృతే త్వం దయనీయవాన్న చ* (Rajajee, M. S. 2000:72,74 – [Stotra Ratna–50,51 Slokas])

'నువ్వు నాపై దయచూపనట్లైతే, నీ దయాపాత్రుడవగలిగే వాడు మరొకడుండడు. కనుక నీవు లేక నాకు స్వామి లేదు, నేను లేక నీకు దయాపాత్రుడు లేదు' అంటారు. ఇది రాజసభక్తికి ఉదాహరణ. సరిగ్గా ఇటువంటి భావననే అన్నమయ్యకూడా వ్యక్తం చేశారు.

*నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది*
*పూని నా వల్లనే కీర్తిఁ బొందేవు నీవు*
.....
*నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు*
*శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు* (3-48)

అన్నమయ్య సాటి భాగవతులకుకూడా దాసోహమనే అచ్చమైన విశిష్టాద్వైతుడు. కనుక అన్నమయ్యలో తానే గొప్పవాడనన్న అహంకారం కనిపించదు. అయితే తన పూర్వాశ్రమంలోని

కల ఈ వైఖరిని ఒక కీర్తనలో ప్రదర్శించారు. ఇదికూడా రాజస భక్తికి ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

*పాటించి నాలో నుండి పలికింతువు నీవు*
*మాటలాడ నేరుతునంటా మరి నే నహంకరింతును*
*నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను*
*గాఁటాన దొరనంటా గర్వింతు నేను*

*నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను*
*కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును*
*సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను*
*యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు*

*మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను*
*యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును* (2-304)

'నాలో ఉండి నీవు పలికిస్తుంటే, నేనే మాట నేర్చరినంటూ గర్విస్తాను. పదునాలుగు లోకాలను ఏలే దొరవు నీవైతే, గొప్పగా దొరను నేను అని చెప్పుకుంటాను. ఈ జగత్తులోని ప్రజలంతా నీ సృష్టే కాగా, నేనే బిడ్డలను కన్నాను అని సంతోషిస్తాను. సమస్త భోగభాగ్యాలను నువ్వే ఇస్తే, నేను సంపాదించుకున్నాను అని అహంకరిస్తాను. ఇహపరాలు నీ దయాధర్మమే అయితే, నా తపోబలంవల్లే సిద్ధించాయనుకుంటాను' అంటూ తన రాజస వైఖరిని నిందించుకున్నారు.

### 4.10. నిర్మల భక్తి

*నెట్టన శరణనుటే నిర్మలభక్తి* (2-469) – ఇతర ఉపాయాలను విసర్జించి శరణని వేడుకోవటమే నిర్మల భక్తి. నిర్మల భక్తి విశిష్టాద్వైతంలో ప్రపత్తి సిద్ధాంతానికి దగ్గరగా ఉంది.

భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు స్వయంగా 'సమస్త ధర్మాలను విడిచి, నన్నే శరణు వేడుము. అన్ని పాపాలనుండి నిన్ను ఉద్ధరిస్తాను' అని వాగ్దానం చేశాడు (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:358 – [భగవద్గీత–18వ అధ్యాయం–66వ శ్లోకం]). ఇది విశిష్టాద్వైతులకు చరమశ్లోకంగా, మోక్షోపాయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. శ్రీవైష్ణవుడయిన అన్నమయ్యకూడా చాలా తావులలో నిర్మలభక్తిని ప్రదర్శించారు.

*శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి*
*యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము* (4–230)

'ఏ ధర్మాలు ఎరుగను. నిన్నే శరణంటున్నాను, ఇక నీ చిత్తం' అంటూ ఈ కీర్తనలో అన్నమయ్య చరమ శ్లోకార్థానికి అనుగుణంగా తన నిర్మలభక్తిని చాటుకున్నారనిపిస్తుంది.

*హరి నిను నెరఁగని యలమటలింతే శాయ*
*శరణంటి నిదె నీకే సర్వేశ కావవే*

*వెదకితి భూములెల్ల విశ్వకర్తెవ్వఁడో యంటా*
*చదివితిఁ బుస్తకాలు సారె సారెకు*
*తుద ననుమానమున దొమ్మి నీకలు దెల్లఁగా*
*ముదిసితి నింతేకాని ముందరేమీఁ గానను*

*చింతలెల్ల నుడిగితి శ్రీవేంకటేశ్వర నిన్ను*
*వింత లేక శరణని వెలసితిని*
*చెంతల నిన్నాళ్లదాఁకా చిక్కి కర్మముల వట్టి*
*గంతులు వేసితిఁగాని కడ గానవైతిని* (3–172)

ఈ కీర్తనలో 'జ్ఞాన, కర్మ మార్గాల అంతు చూసినా వెంద్రుకలు తెల్లబడ్డాయేకాని అనుమానం తీరలేదని, ఇక ఆలోచనలన్నీ కట్టిపెట్టి శ్రీవేంకటేశ్వరుడికే శరణంటూ ప్రపత్తి మార్గం పట్టా'నని అన్నమయ్య నిర్మలభక్తిని ప్రదర్శించారు.

## 4.11. నిజ భక్తి

*గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి* (2-469) - సంశయాలు, సంకోచాలు విడిచి వేంకటేశ్వరుడి సేవ చేయడమే నిజ భక్తి. భక్తిలో మొదటి దశగా భక్తుడు తన కష్టాలు తొలగాలని, కోరికలు తీరాలని భగవంతుడిని ప్రార్థిస్తాడు. దీనినే అన్నమయ్య తామస భక్తి అన్నారు. తన కష్టాలు, కోరికలు తీరకపోతే, గజేంద్రుడిలా *కలఁడు కలండనెడు వాఁడు గలఁడో లేఁడో!* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-5:41 – [ఆంధ్రమహాభాగవతం-8వ స్కంధం-86వ పద్యం]) అనే సంశయాత్మకత కలిగి ఉంటాడు. అలాగే, తాను పూజిస్తున్నది అసలైన పరమాత్ముడినో కాదో, తాను సరైన దారిలో వెళుతున్నానో లేదో అనే సందేహంకూడా ఉంటుంది. అన్నమయ్యకూడా ఒక దశలో ఇటువంటి సందేహాలను వ్యక్తం చేసినవారే.

*అందరికి నితఁడెపో అంతరాత్ముఁడనుచు-*
*నందు రితఁడో మఱియు నవల నొకఁడో*
*నందకధరుఁడు జగన్నాధుఁడచ్యుతుఁడు గో-*
*విందుఁ డీతఁడుగాక వేరొకఁడు గలఁడో* (1-37)

'అందరికీ ఇతడే అంతరాత్మ అని అంటారు. నిజంగా ఇతడేనో లేక ఇతను కాక ఇంకెవరైనా ఉన్నారో! నందకం అనే ఖడ్గాన్ని ధరించేవాడు, జగత్పతి, నాశనం లేనివాడు, గోవిందుడు ఇతడో లేక వేరొకరెవరో ఉన్నారో!' అనుకున్నారు. మొదట్లో ఇటువంటి అనుమానాలున్నా,

సాధనతో, భక్తునిలో సంశయాలకు, సందేహాలకు తావివ్వని భక్తి స్వరూపం ఆవిష్కారమౌతుంది.

*వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణుఁడొకఁడే కాక*

*అనుమానములన్నియు నుడిగితిని అలసితి నిఁక నేను* (3-254)

'నాకు వెనక కొండంత బలంగా ఉండి, నన్ను రక్షించేవారు విష్ణువు తప్ప ఎవరున్నారు? అనుమానాలన్నీ నశించాయి. వాటితో అలసిపోయాను' అంటారు అన్నమయ్య. ఈ కింది కీర్తనలోకూడా అన్నమయ్య నిజభక్తిని చూడవచ్చు.

*నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని*

*వున్నవాఁడ నిఁక వేరే ఉపాయ మేమిటికి*

*గతియై రక్షింతువో కాక రక్షించవోయని*

*మతిలోని సంశయము మఱి విడిచి*

*యితరులచే ముందర నిఁక నెట్టౌదునోయని*

*వెతతోడఁ దలఁచేటి వెఱపెల్లా విడిచి*

*తిరమైన నీమహిమ తెలిసేవాఁడననే-*

*గరువముతోడి వుద్యోగము విడిచి*

*వెరవున నీరూపు వెదకి కానలేననే-*

*గరిమ నలపు నాస్తికత్వమును విడిచి* (2-202)

ఈ కీర్తనలో అన్నమయ్య భగవంతునిపట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు. నిజభక్తి అలవడాలంటే వేటిని విడిచిపెట్టాలో అన్నమయ్య ఈ కీర్తనలో చెప్పారు. 1. భగవంతుడు రక్షిస్తాడో, రక్షించడో అనే అనుమానాన్ని 2. తన ఆగామి కర్మలు ఎలా ఉంటాయో అన్న

భయాలను 3. భగవంతుడి మహిమ తెలిసినవాడిననే అహంకార భావాన్ని 4. వెదికినా, పరమాత్ముడు సాకారుడవడనే నాస్తిక భావాన్ని 5. స్వప్రయత్నాన్ని – వీటన్నిటినీ విడిచి పెట్టి అన్నమయ్య పరమాత్ముడిపైనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## 4.12. మధుర భక్తి

నవవిధ భక్తి మార్గాలతోపాటుగా భాగవతం ప్రతిపాదించిన మరొక భక్తిమార్గం మధుర భక్తి. మధురభక్తిని అనేకులు నిర్వచించారు. మధురభక్తి తత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి, ఈ కింది నిర్వచనాలు తోడ్పడతాయి.

"భగవంతునే పరమప్రాప్యుడైన ప్రియునిగా వలచి ఉపాసించుటయే మధురభక్తి పరమార్థము (వరదాచార్యులు, ధనకుధరం. 1972:100)"

"పురుష రూపమున నున్న జీవుడు తన స్థితిని తెలుసుకొని అనగా ఆత్మజ్ఞాని యై తన మనోనాధుడైన దేవదేవుని విరహమును తాళజాలక (నాయికగా) ఆర్తుడై నానావిధోపచారములచే ఆయన నారాధించుచు మధుర గీతాలాపనము చేయుచు, పరవశుడై స్వామిలో ఐక్యమందుటకు తపన చెందుటయే మధురభక్తి (శ్రీరంగాచారి, అంగలూరు. 1995:68)"

"మధురభక్తి అంటే సాకార బ్రహ్మాన్ని పరబ్రహ్మంగా భావించుకొని, తనను ప్రేయసిగా భావించుకొని పరబ్రహ్మ సాక్ష్యాత్కారాన్ని పొందడం (సోమసుందరరావు, కొడాలి. 2004:169)."

"జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడానికి చేసే ప్రయత్నంలో పరబ్రహ్మను నాయకునిగా భావించి తాను నాయికగా మారడం మధురభక్తి (పరమేశ్వరయ్య, యడవల్లి. 2008:87)."

మధుర భక్తి తత్త్వం ప్రకారం, సృష్టిలో భగవంతుడొక్కడే పురుషుడు. మిగిలినవారంతా స్త్రీలు. ఇదే భావనతో భక్తుడు తనను తాను నాయికగా ఊహించుకుని, నాయకుడైన పురుషుడిని చేరుకోవడానికి పరితపిస్తాడు. మధురభక్తి తొలిసారిగా ప్రతిపాదింపబడిన భాగవతంలో, ఈ భక్తిని కృష్ణుడి పరంగా, గోపికలు ప్రదర్శించారు. గోపికలకు కృష్ణుడిపట్ల ఉన్నది ఆరాధనా పూర్వకమైన భక్తి. వారు వట్టి అమాయకులైన స్త్రీలు. శిష్టభక్తులలా శ్రవణ, కీర్తన, అర్చన, వందన, సఖ్యాది భక్తి రీతుల్ని పాటించి, తమ మధ్య వెలసిన పరమాత్మ స్వరూపాన్ని కొలుచుకోలేరు. వారికి శ్రీకృష్ణుడిపట్ల ఉన్నదల్లా వల్లమాలిన ప్రేమ మాత్రమే; నిష్కల్మషమైన, నిస్సంకోచమైన, నిర్వ్యాజమైన ప్రేమ. వారికి గల సర్వస్వాన్ని అర్పించడంద్వారా ఆ ప్రేమను మనస్ఫూర్తిగా వ్యక్తీకరించారు. అటువంటి ప్రేమనే మధుర భక్తి అన్నారు.

గోపికలు ప్రదర్శించిన మధురభక్తి ఎందరెందరికో అలౌకికానందాన్ని కలిగించింది. గోపికాకృష్ణుల శృంగారం లౌకికమైనదిగాకాక, దివ్యమైనదిగా, భవ్యమైనదిగా పఠితలకు, శ్రోతలకు దర్శనమిచ్చింది. అది జీవాత్మ పరమాత్మను చేరుకోవడానికి పడిన తపనగా దృశ్యమానమైంది. అందుకే భక్తిలో అత్యుత్తమమైనదిగా మధురభక్తి నీరాజనమందుకుంది.

భక్తి ఉద్యమ కాలంలో కవులు, ముఖ్యంగా ఆళ్వారులు, మధుర భక్తి సంప్రదాయంలో రచనలు చేసి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఎస్వీ.జోగారావుగారు వెలిబుచ్చిన ఈ అభిప్రాయం (వరదాచార్యులు, ధనకుధరం. 1972:100) సహేతుకంగా తోస్తోంది. "భక్తులైన కవుల ప్రవృత్తిగతమైన శృంగార లాలసయే భగవత్పరముగా ఆవిష్కృతమగుట, లేక శృంగారము సర్వప్రాణిహృదయ సద్యోగోచరమగునది కావున, అది యొక ఎఱగా పాఠకహృదయములను భక్తి వైపాకార్షించుట అనునవి ఆ భక్తిరచనల యుద్దేశము కావచ్చును." బహుశా ఈ కారణంవల్లనే భక్తి ఉద్యమ కాలంలో సాహిత్యంలో శృంగారం పర్యవసించి మధురభక్తిగా కొత్త రూపు దాల్చి ఉండవచ్చు.

కృష్ణుడి పరంగా భారతీయ సాహిత్యంలో వెలసిన మధురభక్తి తత్త్వాన్ని తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరుడికి అన్వయిస్తూ తెలుగులో అపూర్వమైన మధురభక్తి సంకీర్తనలను సృష్టించిన ఘనత అన్నమయ్యది. ముందుగా భాగవతంలోని మధురభక్తిని చూద్దాం.

### 4.12.1. భాగవతంలో మధురభక్తి

కృష్ణుడి మురళీగానానికి పరవశించి, సంసారబంధాలను దిగవిడిచి, గోపికలు కృష్ణుడిని చేరుకుంటారు. ఇళ్ళకు, భర్తల, పిల్లలవద్దకు మరలిపొమ్మన్న కృష్ణుడితో *పతిపుత్త్రాదికనామమూర్తి వగుచున్ భాసిల్లు నీ యందుఁ దత్పతిపుత్త్రాదికవాంఛలన్ సలిపి సంభావించు టన్యాయమే* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:389 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-988వ పద్యం]) – ‘భర్త, పుత్రుడు మొదలైన బంధాలన్నిటా భాసిస్తున్నవాడివి నువ్వే అయినప్పుడు ఆ బంధాలను నీలో అన్వయించుకోవటమే న్యాయ’మని చెప్పి కృష్ణుడితోనే ఉండిపోతారు గోపికలు.

ఈ కింది పద్యం గోపికల ముగ్ధమనోహరమైన మధురభక్తికి మంచి ఉదాహరణ.

*ఒక్క లతాంగి మాధవుని యుజ్జ్వలరూపము సూడ్కితీవలం*
*జిక్కఁగఁ బట్టి హృద్గతముఁ జేసి వెలిం జనకుండ నేత్రముల్*
*గ్రక్కున మూసి మేనఁ బులకంబులు గ్రమ్మఁగఁ గౌఁగలించుచుం*
*జొక్కములైన లోచవులఁ జొక్కుచు నుండెను యోగి కైవడిన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:418,419 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-1063వ పద్యం])

‘గోపికలలో ఒక లతాంగి, కృష్ణుడి రూపాన్ని తన చూపులనే తీగలతో పట్టుకుని, హృదయంలో బంధించింది. కళ్ళు తెరిస్తే, ఆ రూపం మళ్ళీ బయటకు పోతుందనే భయంతో కళ్ళు మూసేసుకుంది. ఆ రూపం మనసంతా నిండిపోయి ఆనందంతో పులకలు కమ్ముతుంటే, కృష్ణుడిని మనసులోనే కౌగిలించుకుంది. అంతరంగంలో ఆ మాధుర్యపు తన్మయత్వాన్ని అనుభవిస్తూ యోగిలా ఉండిపోయింది.’ ఈ విధంగా, పోతన గోపికల మధుర భక్తిలో జీవాత్మ పరమాత్మలో ఐక్యమవాలనుకునే ఆర్తిని ఆవిష్కరించారు.

గోపికాకృష్ణుల రాసలీలల్లోకూడా ఇది దివ్యమైన శృంగారమనే స్పృహ నిలిచి ఉండే విధంగా, శృంగారంలో భక్తిని కలబోసి, పోతన పఠితకు అలౌకిక అధ్యాత్మ భావనలను కలిగించారు.

*హరిసురుచిర లలితాకృతిఁ*
*దరుణులు గని ముక్త విరహతాపజ్వరలై*
*పరమోత్సవంబు సలిపిరి*
*పరమేశ్వరుఁ గనిన ముక్తబంధుల భంగిన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:421 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-1069వ పద్యం])

‘కృష్ణుని కమనీయ రూపాన్ని చూసిన గోపికలు, పరమేశ్వరుడిని చూసి భవబంధాలనుండి విముక్తి పొందిన భక్తులవలె, విరహతాపంనుండి విముక్తి పొందినవారై పరమోత్సవం జరుపుకున్నారు.’ ఈ విధంగా తెలుగు సాహిత్యంలో మధురభక్తికి పట్టం కట్టారు పోతన.

### 4.12.2. ఆళ్వారుల మధుర భక్తి

అన్నమయ్య విశిష్టాద్వైతాన్ని – అందులో భాగంగా ద్రావిడ వేదాన్ని అధ్యయనం చేసినవారు. కనుక, ఆళ్వారుల మధురభక్తి తత్త్వం అన్నమయ్యను విశేషంగా ప్రభావితం చేసింది. ఈ భావాన్ని సమర్థిస్తూ, వేటూరి ప్రభాకరశాస్త్రిగారన్న మాటలు గమనించదగ్గవి. "ఆళ్వార్లు రచింపఁగా నరవమున ద్రావిడవేదమనీ పంచమాగమమనీ పేర్కొనఁబడు దివ్యప్రబంధము నాల్గువేల సంకీర్తనముల పాట్టులు కలదికాఁగా అన్నమాచార్యుఁడొక్కఁడే రచించిన యంధ్రవేదము ముప్పదిరెండువేలపాటలు గలది. ఈ సంకీర్తనలు దివ్యప్రబంధముల ననువర్తించియే పరమాత్మునకు భక్తజీవులకు పతిపత్నీభావము నాయికానాయకభావము కల్పించి యుజ్జ్వలరసానుభూతి నొదవించుచు...విజ్ఞాననిధులై విరాజిల్లుచున్నవి" (ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008:115)

ఆళ్వారులు, ముఖ్యంగా తిరుమంగై ఆళ్వారు, నమ్మాళ్వారు, గోదాదేవి మధురభక్తి తత్త్వాన్ని పోషించారు. తిరుమంగై ఆళ్వారు *పెరియ తిరుమొళి* లో భగవంతుడి విరహానికి గురయిన (ఆళ్వారు)నాయిక స్థితిని వర్ణిస్తారు. *తిరునెడుందాండగం* లో తానే నాయికగా స్వామివారి గుణరూపాదులను చూసి, ప్రేమించి, అతడిని కలవాలని తహతహలాడతారు. నాయిక చెలికత్తెగా నాయికానాయకులను కలపడానికి సహాయం చేస్తారు; నాయిక తల్లిగా తన కూతురు పరంధాముడినే వరించినందుకు సంతోషించి, కూతురిని ఓర్పు వహించమని, ప్రపన్నుడు స్వామి అనుగ్రహం కోసం ఎదురుచూడాలే తప్ప, తానుగా చేరే ప్రయత్నం చేయకూడదని నచ్చచెబుతారు.

నమ్మాళ్వారు *తిరువాయ్‌మొళి* లో, భగవంతుని గుణాలను నిరంతరం అనుభవించి, ఆ గుణానుభవంవలన విరహంతో మూర్ఛిల్లిన తన అవస్థను వర్ణిస్తారు. స్వామి దివ్యమంగళసౌందర్యాన్ని, అసంఖ్యాక కళ్యాణ గుణగణాలను ధ్యానించి, బాహ్యంలో స్వామిని

గాఢాలింగనం చేయడానికి యత్నించి, కుదరకపోగా, దుఃఖావస్థకు గురౌతారు. ఇలా నమ్మాళ్వారు నాయికగా స్వామిని చేరడానికి పరిపరివిధాలుగా పరితాపాన్ని పొందడాన్ని *తిరువాయ్‌మొళి* లో చూడవచ్చు.

పెరియాళ్వార్ పుత్రిక అయిన గోదాదేవి రచన *నాచ్చియార్ తిరుమొళి*. ఇందులో నూటనలభై పాశురాలు ఉన్నాయి. ఇవన్నీ మధురభక్తిరసపూరితాలే. “కృష్ణుని యందు తనకుఁ గల యనురాగము మన్మథునకుఁ దెలుపుట, కోకిలలతో, మేఘాదులతో కృష్ణునకు సందేశములను పంపుట, కృష్ణుని రాకకై పరితపించి ప్రార్థించుట, స్వప్నమున మాధవుని వివాహమాడుట, కృష్ణునితో సంయోగ వియోగము లేర్పడుట మొదలగు విషయములు ఈ పాశురములలో వర్ణింపబడి యున్నవి” (వరదాచార్యులు, ధనకుధరం. 1981:94,95). ఆళ్వారుల బాటలోనే, అన్నమయ్యకూడా తన శృంగార సంకీర్తనలలో మధురభక్తిని పోషించారు.

### 4.12.3. అన్నమయ్య మధుర భక్తి

ఆళ్వారులు చూపిన మార్గంలో శ్రీవేంకటేశ్వరుడిని తన ప్రియుడిగా భావించుకుని శృంగార సంకీర్తనలు రచించారు అన్నమయ్య. అయితే అన్నమయ్య చూపిన మధురభక్తిలో మరొక అదనమైన అంశం అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరుల దివ్యప్రణయ వర్ణనం. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో అధిక శాతం శ్రీ వేంకటేశ్వరుడిని నాయకుడిగా, అలమేలుమంగను నాయికగా ఎంచి, అలమేలుమంగాశ్రీవేంకటేశుల దివ్యశృంగారాన్ని వర్ణించారు. అక్కడక్కడా భూనీళాదేవులను అమ్మవారికి సవతులుగా, శ్రీ వేంకటేశ్వరుడిని దక్షిణ నాయకుడిగా కీర్తనలను పాడారు. కొన్ని కీర్తనలలో నాయిక అయిన అలమేలుమంగకు సహకారిణి అయ్యారు అన్నమయ్య.

ఈ కింది శృంగార కీర్తనలో నాయిక అయిన అలమేలుమంగ చెలులలో తానొకర్తెగా భావించుకుని అన్నమయ్య శ్రీవారి దివ్యశృంగారాన్ని వర్ణించారు.

*ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను*
*భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా*

*కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన*
*చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు*
*నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు*
*నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా*

*ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల*
*వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు*
*గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున*
*అద్దిన సురతపుఁ జెమటల అందము గాదు గదా* (5-82)

'అమ్మవారి చెలులు ఆమె కనుకొలకులు ఎర్రగా మారిన కారణమేమా? అని ఆలోచిస్తున్నారట. అమ్మ స్వామివారిపై కొనచూపులు విసిరిందట. అవి అక్కడే నాటుకుని, మరలి రాకుండా ఉండేసరికి, వాటిని నిలువునా పెరకవలసి వచ్చిందిట. దాంతో కడకన్నులకు నెత్తురు అంటి, ఎర్రగా కనిపిస్తున్నా'యని అన్నమయ్య ఊహించారు. అలాగే, 'అమ్మవారి చెక్కులపై ముత్యాలవంటి నీటి చుక్కలు స్వామివారితో రతిక్రీడలో అలుపువలన కలిగిన చెమట'లని అన్నమయ్య ఊహ.

మరో కీర్తనలో, తన సకల అవయవాలతో స్వామివారికి నాయిక చేసిన పూజను సఖిగా మారి వివరిస్తారు.

*ఇంతి చేసినపూజ లిట్లుండెఁ దన హృదయ*
*మంతయును బూజించె నడియాసచేత*

*చనుదోయి పూజించె జాజుఁబులకలచేత*
*కనుదోయి పూజించెఁ గన్నీటిచేత*
*మనసు పూజించెఁ బ్రేమపుఁ గోరికలచేత*
*తనువు పూజించెఁ బరితాపంబుచేత*

*తలపు పూజించెఁ చింతాపరంపర చేత*
*అలపు పూజించె నొయ్యని పలుకుచేత*
*వలపు పూజించెఁ బొలయలుకచేతను నెంతే*
*సొలపు పూజించెఁ దన చూపరలచేత*

*అనఘుఁ డీ తిరువేంకటాద్రీశు కృప చేత*
*వనిత సంభోగ పరవశముఁ బూజించె*
*తనివోని గుఱుతుచే తనవిలాసములచే*
*గనుపట్టఁ బూజించె గళమర్మములను* (6-152)

'స్వామివారిపట్ల అత్యాశ కలిగి నాయికహృదయం పూజనర్పించింది. ఎర్రని పులకలచేత చనుదోయి, కన్నీటి చేత కనుదోయి, కోరికలతో మనసు, పరితాపంతో తనువు ఇలా ప్రతి శరీరావయవంతో స్వామివారికి మధురమైన పూజలు అర్పించిన చెలి చరితార్థురాలైంది.' ఇటువంటిదే ప్రతి అంగంతో స్వామివారిని కొలిచే కింది అధ్యాత్మ కీర్తనను గమనిస్తే, మధురభక్తి తత్త్వం బోధపడుతుంది.

*కొననాలుకా హరిగుణములే నుడుగవో*

*మనసా అతని దివ్యమహిమెంచవో*

*తనువా శ్రీపతితీర్థదాహమే కోరవో*

*వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో*

*ఆనిన చేతులితని కంది మొక్కరో*

*కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో*

*నలిఁ బాదాలాల హరినగరికే నడవరో*

*కలభక్తి యాతనిపై ఘటియించవో*

*చలమా శ్రీవేంకటేశు సంగతినే వుండవో* (4–14)

కొన్ని కీర్తనలలో అన్నమయ్య స్వయంగా తానే నాయికగా మారి స్వామివారిని సేవించుకుంటారు. శ్రీవేంకటేశ్వరుడి ఎడబాటువలన విరహాన్ని అనుభవిస్తారు. మెఱుపుల చూపులతో, మెత్తని మాటలతో, చిరునవ్వులతో తనను కవ్వించవద్దని నాయకుడిని బ్రతిమాలుకుంటారు. ఇతర నాయికలతో కూడి, తనను నిర్లక్ష్యం చేస్తున్న నాయకుడైన వేంకటేశ్వరుడిని తూలనాడతారు.

*కలలోనె యిరువురము నలిగి వేగ*

*కలయనుచుఁ దెలిసి నినుఁ గౌఁగిలించితిరా*

*అలుగుదురెఁ బతులనఁగా వినఁగ*

*నలవాటు లేక నే నలుగుచుండుదురా*

*అలిగితట వురక నీవంత నాతోను మరి*

*నలుగులౌనట పూవులంతలోపలనే*

*విటవరుఁడ కోనేటివిభుఁడ నీ*

*వెటు దొలంగిన దేహమెట్టు నిలుపుదురా*

*యిటువలెనె మనలోన నెలమి మరచి*

*తటుకనను గలయనుచు తలఁకి తెలిసితిరా* (5-21)

ఈ కీర్తనలో, నాయిక అయిన తనకు స్వామివారికి మధ్య జరిగిన ప్రణయకలహాన్ని గుర్తుచేసుకొంటున్నారు అన్నమయ్య. ఎప్పుడూ సతులే కాని పతులు అలుగుతారని తాను వినలేదంటారు. తన మీద ఊరికే స్వామి అలిగాడని చిన్నబోతారు. విభుదు తనపై అలగడంవలన పూవులే బాణాలుగా మారి గుచ్చుకుంటున్నాయంటారు. పతిని ఎడబాసి ప్రాణం నిలపలేనని మొరపెట్టుకుంటారు. ఇంతలోనే తనకు, స్వామివారికి మధ్య గల అనురాగాన్ని గుర్తుచేసుకుని, ఆ ఎడబాటు కలే అని తెలుసుకుని, తిరిగి స్వామివారిని కౌగిలించుకుంటారు.

శృంగార కీర్తనలలో ఎక్కువగా, శ్రీ వేంకటేశ్వరుడే నాయకుడిగా కీర్తించబడ్డా, అక్కడక్కడా అహోబిల నారసింహుని పరంగా రచించిన శృంగార కీర్తనలుకూడా కనపడతాయి. ఈ కింది కీర్తనలో, లక్ష్మీనరసింహుల నడుమ సరసమైన చేష్టలతో కూడిన సున్నితమైన శృంగారం దర్శనమిస్తుంది.

*ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు*

*చెంత రమాదేవిఁ గూడె శ్రీనరసింహుఁడు*

*సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా*

*సొరిది మోములు తొంగి చూచుకొంటాను*

*విరులచెండులఁగొని వేటులాడుకొంటాను*

*సిరితోడ విహరించీ శ్రీ నరసింహుఁడు*

*భవనాశి లోని నీరు పైఁ జల్లులాడుకొంటాను*
*నవకపుసిరులను నవ్వుకొంటాను*
*జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను*
*చివన నిందిరనంటె శ్రీ నరసింహుఁడు*

*వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా*
*ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా*
*ఆముక శ్రీవేంకటాద్రి నౌభళాన నిలిచిరి*
*శ్రీ మహాలక్ష్మి తోడ శ్రీనరసింహుఁడు* (4-511)

అన్నమయ్య శృంగార కీర్తనలలో పైకి భౌతికమైన శృంగారం కనిపించినా, శృంగారంలో అధ్యాత్మ తత్త్వం అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది.

*ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి*
*యిదిగాక వైభవంబిఁక నొకటి కలదా*

*అతివ జన్మము సఫలమై పరమయోగివలె-*
*నితర మోహాపేక్షలిన్నియును విడిచె*
*సతికోరికలు మహాశాంతమై యిదె చూడ*
*సతత విజ్ఞాన వాసనవోలె నుండె*

*తరుణి హృదయము కృతార్థతఁ బొంది విభుమీఁది*
*పరవశానంద సంపదకు నిరవాయ*
*సరసిజానన మనోజయమంది యింతలో*
*సరిలేక మనసు నిశ్చల భావమాయ*

*శ్రీవేంకటేశ్వరుని జింతించి పరతత్వ-*

*భావంబు నిజముగాఁ బట్టెఁ జెలియాత్మ*

*దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు*

*లావణ్యవతికి నుల్లంబు దిరమాయ* (5-17)

అన్నమయ్య నాయిక స్వామిలో ఐక్యం కావడమే తన జీవిత పరమావధి అనుకుంటుంది. ఐక్యం అయ్యాక, ఇతర కోరికలను, మోహాపేక్షలను విడిచి పరమయోగిలా తన జన్మ సఫలమైందని భావిస్తుంది. ఈ విధంగా *చిత్తంబులోపలను శ్రీవేంకటేశ్వరుని హత్తించి వాఁడు దానయివుండవలదా* (5-230) అంటూ స్వామివారిని తన మనస్సులో నిలిపి మధురభక్తితో తాదాత్మ్యం పొందారు అన్నమయ్య.

## 4.13. వాత్సల్య భక్తి

వత్స అంటే దూడ. ఆవుకు తన దూడపై కలిగే అవ్యాజమైన ప్రేమభావమే వాత్సల్యం. అదే మనుషులకు అన్వయిస్తే, తల్లిదండ్రులకు తమ బిడ్డలపై కలిగే ప్రేమభావంగా చెప్పుకోవచ్చు. భగవంతుడిని తమ బిడ్డగా భావించి, ప్రేమించడం వాత్సల్య భక్తి. నారదుడు తన భక్తిసూత్రాలలో వాత్సల్యాసక్తిని ఒక భక్తిభేదంగా పేర్కొన్నాడు. ఈ భక్తికి ఉత్తమ ఉదాహరణ యశోద. ఎన్నో సార్లు కృష్ణుడి అతిమానుష లీలలను కన్నులారా చూసి, అతడిని పరమాత్ముడిగా తెలుసుకునికూడా, తిరిగి మాయలో పడిపోతూ, తన కన్న కుమారుడే అని మమకారంతో ఆదరించిన యశోదది వాత్సల్య భక్తి. ఆ భక్తికి పరమాత్ముడూ కట్టుబడ్డాడు. యోగులకు, తపస్సంపన్నులకు, బ్రహ్మ, రుద్ర వర ప్రసాదితులయిన రాక్షసులకు చిక్కనివాడు తల్లి కట్టుబాటుకు-రోటికి చిక్కాడు. పోతన భాగవతంలోని ఈ ఘట్టం వాత్సల్యభక్తి పూరితం.

*చప్పుడు సేయకుండు మని జంకె యొనర్చిన నల్గి పోవఁగా*

*నప్పుడు బార సాఁచి తన యర్మిలి విందులు వచ్చి రంచు న*

*వ్వొప్పంగం జీరు తల్లి దెస కొత్తిలి కృష్ణుండు రంతు సేయుచు*

*న్నెప్పటి యట్ల చన్గుడుచు నింపొలయన్ మొలగంట మ్రోయంగన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–6:114 – [ఆంధ్రమహాభాగవతం–10వ స్కంధం–పూర్వ భాగము–302వ పద్యం])

'అల్లరి చేయవద్దని చిన్నికృష్ణుడిని బెదిరిస్తే, అలిగి దూరంగా వెళ్ళిపోతాడు. అప్పుడు యశోద చేతులు చాపి, 'నా ముద్దులయ్య వచ్చాడు, కన్న తండ్రి వచ్చాడు' అని నవ్వుతూ పిలవగానే, మొలగంటలు మోగుతూండగా, తల్లి దగ్గరకు ఎప్పటిలాగే అల్లరి చేస్తూ వచ్చి చనుపాలు తాగుతాడు.' ఈ విధంగా, పరమ మనోహరంగా సంస్కృతంలో వేదవ్యాసుడు, తెలుగులో పోతన వర్ణించిన కృష్ణలీలలు, యశోద మాతృవాత్సల్యం ఎందరో కవులకు స్ఫూర్తినిచ్చాయి. మరెందరో భావుకులు యశోదతో తాదాత్మ్యం చెంది పరమాత్మునిపట్ల వాత్సల్యభక్తిని అనుభవించారు. భారతీయ సాహిత్యంలో పెరియాళ్వారు, లీలాశుకుడు, సూరదాసు, పురందరదాసు మొదలైనవారెందరో ఇటువంటి వాత్సల్య భక్తిని ప్రదర్శించినవారున్నారు.

ప్రాంతీయ భాషా సాహిత్యాలలో మొదటిసారిగా ఇటువంటి వాత్సల్యభక్తి పూరిత సాహిత్యాన్ని రచించినవారుగా పెరియాళ్వారు కనపడుతున్నారు. ఆయన 461 పాశురాలతో *పెరియాళ్వార్ తిరుమొళి* రచించారు. ఈ గ్రంథంలో యశోదగా తన్మయత్వం చెంది, అప్పుడే పుట్టిన బాలకృష్ణుడిని చూసి సంబరాలు చేసుకుంటారు. కృష్ణుడిని నఖశిఖపర్యంతం వర్ణించి మురిసిపోతారు. కృష్ణుడికి జోల పాడి నిద్రపుచ్చుతారు. కృష్ణుడితో ఆడుకోవడానికి చందమామను ఆహ్వానిస్తారు. చిన్ని కన్నయ్యకు స్నానం చేయిస్తానని పిలుస్తారు; తలదువ్వి, పూలతో అలంకరిస్తారు; దిష్టి తీస్తారు. చిన్ని కృష్ణుడి తప్పటడుగులు చూసి ఆనందిస్తారు; దోబూచులాడతారు. అలసిపోయాడని తన చనుబాలు తాగమని బ్రతిమాలుకుంటారు.

*మాధుర్యాదపి మధురం మన్మథ తాతస్య కిమపి కైశోరమ్* (రామానుజయ్య, బుక్కపట్టణము. 1939:65 – [శ్రీకృష్ణ కర్ణామృతము-1వ ఆశ్వాసం-65వ శ్లోకం]) – మన్మథ జనకుడైన శ్రీకృష్ణుడి బాల్యం మధురానికంటే మధురమైనది అంటూ 13వ శతాబ్దికి చెందిన లీలాశుకుడు *శ్రీకృష్ణకర్ణామృతంలో* బాలకృష్ణ లీలలను వర్ణిస్తూ వాత్సల్యభక్తితో పరవశించాడు.

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటసారిగా బాలకృష్ణుడి లీలలను వాత్సల్యభావంతో వర్ణించిన ఘనత అన్నమయ్యకే దక్కుతుంది. అన్నమయ్య యశోదగా, గోపికలుగా, రేపల్లెవాసులుగా మారి కృష్ణుడిపై వాత్సల్యరసపూరితమైన భక్తిని చూపించారు.

*కానరటె పెంచరటె కటకటా బిడ్డలను*
*నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని*

*బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును*
*చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు*
*మీయింఢ్లు జతనాలు మీరు సేసికొనక*
*పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని*

*మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ*
*ఆసపడకుందురా ఆడేబిడ్డలు*
*వోసరించి మోసపోక వుండలేక మీరు*
*నేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని*

*చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును*
*చిక్కినవిడుతురా చిన్నిబిడ్డలు*

*మిక్కిలి పూజలు సేసి మెచ్చించఁ దగదా*

*యెక్కువైన తిరువేంకటేశుఁడైన బిడ్డని* (5-253)

'బయటే పెట్టి వదిలేసిన పాలు, వెన్నలలో చేయి పెట్టకుండా ఉంటారా చిన్నపిల్లలు? ముంగిట్లో ఉన్న నేతులను, పెరుగులను చూసి ఆశపడకుండా ఉంటారా? జున్నులు చేజిక్కితే వదిలేస్తారా పసివాళ్ళు? ఇంత చిన్న విషయాలకు ఎవరైనా బంగారం లాంటి బిడ్డడిని ఇన్నేసి మాటలంటారా?' అంటూ చిన్ని కృష్ణుడి అల్లరి పనులను యశోదగా మారి మాతృత్వపు మమకారంతో వెనకేసుకొస్తుండడాన్ని గమనించవచ్చు.

మరో కీర్తనలో, కృష్ణయ్యపై అంత కాఠిన్యం వహించవద్దంటూ చిన్ని కృష్ణుడి దుడుకు పనులకు దండిస్తున్న యశోదను వేడుకున్నారు.

*విడుమనవో రోలు విడుమనవో వేగ*

*విడుమనవో తల్లి వెఱచీ నీబాలుడు*

*యెన్నఁడు గొల్లెతలయిండ్లు వేమారుఁ జొచ్చి*

*వెన్నలుఁ బాలును వెఱఁజఁడు*

*వన్నెలనీకోప మింత వద్దు నీకు నీయాన*

*కన్నుల నవ్వుల ముద్దుగారీ నీబాలుడు*

*సారెకు పెరుగులచాడెలూ నేఁడు మొదలూ*

*గోరయై కోలలఁ బగుల మొత్తఁడు*

*కూరిమిలేక నీవు కోపగించఁగాఁ గన్నీరు*

*జోరుగా రాలఁగా నిన్నే చూచీ నీబాలుఁడు*

*చాలు నీకోప మిది సరిలేనిమద్దులివి*

*రోలనే యిట్లను విరుగఁద్రోయఁదు*

*మేలిమివేంకటపతి మేటినీకొమాఁరు డిదె*

*కేలెత్తి నీకు మ్రొక్కెడి నిదె బాలుఁడు* (1–57)

'ఇంకెప్పుడూ గొల్లెతల ఇళ్ళలో దూరి, పాలు వెన్నలను దొంగలించదు; నేటినుండి మరెప్పుడూ పెరుగు కుండలను పగులగొట్టదు; రోటితో మద్దిచెట్లను విరగతోయదు. అంతగా కోపించవద్దు. ఎప్పుడూ సాధారణంగా, కళ్లలో నవ్వులు కురిపించే చిన్నిపాపదు చూడు, ఎంతలా కన్నీరు మున్నీరవుతున్నాడో, ఇంక రోటికి కట్టడం, దండించడం వంటి పనులు చేయకమ్మా' అంటూ బ్రతిమాలుకున్నారు.

*బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో విహగగమన నాకు వెరగయ్యా నిందుకే* (3–416) – 'జగమంత కుటుంబం కలవాడివి, అన్నేసి బాధ్యతలను ఎలా మోస్తున్నావో' అంటూ ఇంకో కీర్తనలో భక్తునిగా కలవరపడతారు. మరో కీర్తనలో బాలకృష్ణుడి కమనీయమైన రూపాన్ని తనివితీరా వర్ణించి మురిసిపోతారు.

*చిన్ని శిశువూ చిన్ని శిశువూ*

*యెన్నఁడుం జూడమమ్మ యిటువంటి శిశువూ*

*తోయపుంగురులతోడఁ దూగేటి శిరసు, చింత*

*కాయలవంటి జడలగములతోడ*

*మ్రోయుచున్న కనకంపు మువ్వల పాదాలతోడ*

*పాయక యశోదవెంటఁ బాఱాడు శిశువూ*

*ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల*
*నిద్దపుంజేతుల పైఁడి బొద్దులతోడ*
*అద్దపుంజెక్కులతోడ నప్పలప్ప లనినంత*
*గద్దించి యశోద మేనుఁ కౌఁగిలించు శిశువూ*

*బలుపైన పొట్ట మీఁది పాల చాఱల తోడ*
*నులి వేఁడి వెన్న దిన్న నోరి తోడ*
*చెలఁగి నేఁడిదె వచ్చి శ్రీ వేంకటాద్రిపై*
*నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ* (6-1)

'బాల్య చేష్టలలో భాగంగా పిల్లలు అటూ, ఇటూ తలూపుతూ ఆడుకుంటూ ఉంటారు. అందమైన కురులతో అటూ, ఇటూ తలను ఊపుతూ ఆడుకుంటున్న బాలకృష్ణుడిని ఈ కీర్తనలో దర్శనం చేయించారు అన్నమయ్య. ఇంకా పుట్టు వెంద్రుకలు తీయించని తలలో జుత్తు సహజంగా జడలు కట్టి ఉంటుంది. అలా కృష్ణుడి జుత్తు జడలు కట్టి, ఆ జడలు చింతకాయల్లా ఉన్నాయిట. పాదాలకు ఉన్న బంగారపు మువ్వలు మనోహరమైన శబ్దాలు చేస్తున్నాయిట. ఆ మువ్వలు కట్టిన పాదాలతో, యశోద ఇంటి పనులు చేసుకుంటూ అటూ ఇటూ నడుస్తూంటే, చిన్ని కృష్ణయ్య అమ్మను వదలకుండా, వెనకే పాకుతూ పోతున్నాడట.

పిల్లల వేళ్ళు సహజంగా ముద్దుగా ఉంటాయి. అటువంటి వేళ్ళకు ఉంగరాలు, ఇంకా ఆ వేళ్ళ అందాన్ని ఇనుమడిస్తాయి. ఉంగరాల వేళ్ళతో, బంగారపు కడియాలతో ప్రకాశిస్తున్న చేతులతో, అద్దాల వంటి నునుపైన చెక్కులతో ఉన్నాడట అన్నమయ్య చూస్తున్న బాలకృష్ణుడు. పిల్లలను రకరకాలుగా పిలుస్తూ, చేరదీయడం సామాన్యమైన విషయమే. అప్పలు ఏడీ, కన్నలు ఏడీ అంటూ యశోద పిలవగానే, వచ్చి తల్లిని గట్టిగా వాటేసుకుంటాడట.

చిన్న పిల్లలు బొజ్జ నిండా తిన్నాక, వారి పొట్ట పైకి ఉబికి వస్తుంది. అది కూడా చూడడానికి ముద్దుగా ఉంటుంది. అటువంటి చిన్ని కృష్ణుడి పొట్టమీద పాల చాఱలున్నాయిట. అప్పుడే కాచిన వెన్న తిన్న నోరు ఒక మధురమైన వాసనతో నిండి ఉంటుంది. అందులోనూ పిల్లల నోరు, బుగ్గలు ఆ వాసనను ఇట్టే బయటవేస్తాయి. అటువంటి వాసన కలిగి ఉందట చిన్ని కృష్ణయ్య నోరు.' ఈ విధంగా, అన్నమయ్య చేయించిన బాలకృష్ణుని దర్శనం ఆర్ద్రతతో నిండి, పఠితలకు అటువంటి శిశువును ఎత్తుకుని ముద్దాడాలనే వాత్సల్యాన్ని కలిగిస్తూ ఉంటుంది. ఆ బాలకృష్ణుని రూపాన్ని మనస్సులో నిరంతరం సంభావించుకునే అన్నమయ్య *ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు - వాని బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలు వోయరే* (4-551) అంటూ ముచ్చటపడతారు. ఈ విధంగా భగవంతుడిపైనే వాత్సల్యభక్తిని చూపించి తరించారు అన్నమయ్య.

### 4.14. వైర భక్తి

భాగవతం ప్రతిపాదించిన మరొక భక్తి వైరభక్తి. భగవంతుడిపట్ల శత్రుత్వం వహించికూడా ఆయనను చేరవచ్చునని వైరభక్తి చెబుతుంది. నిరంతర హరి స్మరణంవల్ల మోక్షం కలుగుతుందని భాగవతంలో ఎన్నో ఉదాహరణలు చెబుతున్నాయి. అయితే ఆ స్మరణం ప్రేమతో కావచ్చు, భయంతో కావచ్చు, బంధుత్వంతో కావచ్చు, ఆఖరికి కోపంతో, ద్వేషంతో, శత్రుత్వభావంతో అయినా ఫరవాలేదు, తనను స్మరించినవాడిని హరి పరాయివాడిగా చూడడు అని భాగవతమే చెప్పింది.

*వైరానుబంధనంబునఁ*
*జేరిన చందమున విష్ణుఁ జిరతర భక్తిం*
*జేరఁగరా దని తోఁచును*

*నారాయణ భక్తియుక్తి నా చిత్తమునన్* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-4:286 – [ఆంధ్రమహాభాగవతం-7వ స్కంధం- 15వ పద్యం])

శ్రీ మహావిష్ణువును వైరభావంతో చేరినట్లుగా, భక్తిభావంతోకూడా చేరలేమని నారదుడు అంటాడు. భగవంతుడిని భక్తితో స్మరిస్తున్నప్పుడుకూడా, ఒక్కోసారి మరపు ఉండవచ్చు. కాని శత్రుత్వం వహించినవాడికి, నిరంతరం ఆ శత్రువునుగురించిన ఆలోచనలే ఉంటాయి. తనను తాను మరచిపోయి, తన శత్రువునే ఎక్కువగా తలుస్తూ ఉంటాడు. అంటే వైరంలో స్మరణం ఇంకా అధికంగా ఉంటుంది. దీనికి ఉదాహరణ ఆంధ్రమహాభాగవతంలో ప్రహ్లాద చరిత్ర ఆఖరి ఘట్టం. ఈ ఘట్టంలో, హిరణ్యకశిపుడితో సంవాదంలో ప్రహ్లాదుడు రెండు సార్లు (7వ స్కంధం-268, 275 పద్యాలలో) హరినామాన్ని ఉచ్చరిస్తే, హిరణ్యకశిపుడు తొమ్మిది సార్లు (7వ స్కంధం-259, 260, 271, 272, 279, 280, 284 పద్యాలలో) నామం చెప్పాడు. ఈ ఘట్టమే వైరభక్తిలో స్మరణం అధికంగా ఉంటుందనే విషయాన్ని ఋజువు చేస్తుంది.

*నను వైరంబుననైనను*
*మనమునఁదలఁచుటను నా సమక్షమున మదా*
*నన మీక్షించుచు నీల్గుట*
*ననఘాత్మకులై వసింతు రస్మత్పదవిన్* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం-2:271 – [ఆంధ్రమహాభాగవతం-3వ స్కంధం-586వ పద్యం])

'వైరంతో నైనా, నన్ను మనసులో తలచుకోవటం, నా ముందరే, నన్ను చూస్తూ చనిపోవటంవల్ల జయవిజయులు పాపరహితులై వైకుంఠంలో నివసిస్తారు' అని శ్రీహరి సనకసనందన మహర్షులతో అంటాడు. అంటే వైరభక్తి సాలోక్యమోక్షాన్ని ప్రసాదిస్తుందని శ్రీమహావిష్ణువే స్వయంగా చెప్పాడు.

భాగవతంలో ఎన్నో ఘట్టాలలో ఈ వైరభక్తిని ప్రదర్శింపజేశారు పోతన. *వైరానుబంధంబున నన్యానుసంధానంబు మఱచి* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:32 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-84వ వచనం]) – 'కంసుడు విష్ణువుతో శత్రుత్వం వల్ల హరినిగురించిన ధ్యానం తప్ప ఇతర విషయాలన్నిటినీ మరచిపోయి', తిరుగుతూ, తింటూ, తాగుతూ, నడుస్తూ, కూర్చుని లేస్తూ, అనుక్షణం హరిని స్మరిస్తూ, కోపంవలన, లోకమంతా హరిమయం'గా చూశాడు. అంతేనా,

*శ్రవణరంధ్రముల నే శబ్దంబు వినఁబడునది హరిరవ మని యాలకించు*
*నక్షిమార్గమున నెయ్యది సూడఁబడు నది హరిమూర్తి గానోపు నంచుఁ జూచుఁ*
*దిరుగుచో దేహంబు తృణమైన సోఁకిన; హరికరాఘాతమో యనుచుఁ నులుకు*
*గంధంబు లేమైన ఘ్రాణంబు సోఁకిన హరిమాలికాగంధ మనుచు నదరుఁ*

*బలుకు లెవ్వియైనఁ బలుకుచో హరిపేరు*
*పలుకఁబడియె ననుచు భ్రమసి పలుకుఁ*
*దలఁపు లెట్టివైనఁ దలఁచి యా తలఁపులు*
*హరితలంపు లనుచు నలుఁగఁ దలఁచు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-6:32 – [ఆంధ్రమహాభాగవతం-10వ స్కంధం-పూర్వ భాగము-87వ పద్యం])

'చెవులకు ఏ శబ్దం వినబడినా అది విష్ణువు మాటేనని వింటాడు. కళ్ళకి ఏది కనిపించినా అది విష్ణుమూర్తి రూపమే కాబోలు అని చూస్తాడు. తిరుగుతూ ఉన్నప్పుడు, శరీరానికి గడ్డిపరక తగిలినా విష్ణువు చేతిదెబ్బేమోనని ఉలికిపడతాడు. ముక్కుకు ఏ వాసన సోకినా, అది విష్ణువు మెడలోని వనమాలిక వాసనేమోనని అదిరిపడతాడు. తాను ఏ మాట ఉచ్చరించినా విష్ణువు పేరు పలికానేమోనని భ్రమపడుతుంటాడు. ఎటువంటి ఆలోచనలు వచ్చినా అవి

విష్ణువునుగురించిన ఆలోచనలేమోనని ఆగ్రహం తెచ్చుకుంటాడు. ఇలా వైరంవలన, మనసా, వాచా, కర్మణా, సర్వకాల సర్వావస్థలలో హరిస్మరణే' చేశాడు. తుమ్మెద పురుగును తీసుకువచ్చి, ఝుంకారం చేస్తూ దానిచుట్టూ తిరుగుతుంది. ఆ పురుగు భయంతో ఆ తుమ్మెదనే అలా చూస్తూ, చూస్తూ చివరకు ఆ తుమ్మెదగా మారిపోతుంది. అలాగే, భయంతోనైనా, ద్వేషంతోనైనా, కోపంతోనైనా భగవంతుని ధ్యానం ఆయనలో చేరడానికే ఉపకరిస్తుందనేది భాగవతం అందించే సందేశం. ఈ విధంగా పోతన వైరభక్తిని భాగవతంద్వారా పాదుకొల్పారు. ఇటువంటి వైరభక్తినిగురించి అన్నమయ్యకూడా తన కీర్తనలలో ప్రస్తావించారు.

*దనుజులు గనిరి తత్వమిది*
*వనజాక్షుని కృప వసించనేలా*

*హరి పరమాత్ముఁ డనాదిపురుషుఁడు*
*సురలకు నరులకు సులభుఁడు*
*హరి కోపముతో నన్యులవరములు*
*సరిగా వెంచఁగ జగములలోన*

*వేదాంతవిదుఁడు విష్ణుఁడు కృష్ణుఁడు*
*శ్రీదేవికిఁ బతిశేఖరుఁడు*
*పోదిఁ బరస్తుతి పుణ్యముకంటే*
*పాదుగ హరిఁ దిట్టే పాపము మేలు* (3-529)

'విష్ణుమూర్తి కృపకోసం పరితపించడం కంటే వైరభక్తితో విష్ణువును సాధించడమే సులువని రాక్షసులు కనుగొన్నా'రంటూ ఈ కీర్తనలో వైరభక్తినిగురించి పేర్కొన్నారు అన్నమయ్య. 'హరికోపంతో కలిగిన మేలు అన్యదేవతల వరాలవల్లకూడా కలగదని, కనుక హరితో వైరమే

మంచి'దని అన్నారు. అలాగే, 'పరదేవతలను స్తుతించడంకంటే హరిని తిట్టే పాపమే మే'లన్నారు.

ఈ కింది కీర్తనలోకూడా అటువంటి భావాన్నే వెలిబుచ్చారు అన్నమయ్య. నరకాసురుడు, శిశుపాలుడు మొదలైన రాక్షసుల అపచారాలకుకూడా మోక్షాన్ని ఇచ్చాడని వైరభక్తి ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు.

*ఇతని కితఁడేకాక యితరులు సరియా*
*మితి లోకా లితని మేనిలోనే కావా*

*కమలనాభుని భయంకరకోపముతోడ*
*రమణ వేరొకరివరంబులు సరియా*
*తమితోడఁ దల దుంచి తగినవరము లిచ్చె*
*అమరఁగ నరకాసురాదులకు నితఁడు*

*కరివరదుని పేరుగలసిన తిట్లతో*
*పరదేవతల మంత్రపఠనలు సరియా*
*నిరతి శిశుపాలుని నిందకు శిక్షించి*
*పరలోక మిచ్చినట్టి భావము వినరా* (2-405)

'హరికి సరిసమానమైనవాడు అతడే కాక, వేరొకరు ఉన్నారా? ఇతర దేవతలు ఇచ్చే వరాలు అతడి భయంకరమైన కోపానికి సరి అవుతాయా? నరకుడు మొదలైన రాక్షసుల తలతుంచడం వారిపాలిట వరం కాలేదా? హరి పేరుతో కలిసిన తిట్లు ఇతర దేవతల స్తుతులకంటే మహిమాన్వితమైనవి కావా? అంతగా తిట్టిన శిశుపాలుడికి మోక్షమిచ్చిన సంగతి వినలేదా?'

అని ప్రశ్నించారు అన్నమయ్య. వైరభక్తులైన రావణ, కంస, హిరణ్యకశిపులగురించి ఈ కింది కీర్తనలో ప్రశంసించారు అన్నమయ్య.

*వారిదే పో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి*
*భారతరామాయణాలై పరగె నీకథలు*

*భువిమీఁద రావణుఁడు పుట్టగాఁగా రాముఁడవై*
*తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి*
*వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు*
*అవతార మందితే నిన్నందరునుఁ జూతురు*

*రమణఁ గంసాది యసురలు లూటి సేయఁగాఁగా*
*తమిఁ గృష్ణావతార మిందరి కైతివి*
*గములై యంతటివారు గలిగితేఁగా నీవు నేఁడు*
*అమర జనించి మాటలాడుదు విందరితో*

*యెంత వుపకారియో హిరణ్యకశిపుఁడు*
*చెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను*
*యింతట శ్రీవేంకటేశ యిన్ని రూపులును నీవే*
*పంతాన నీశరణని బ్రదికితి మిదివో* (2-160)

'భూమ్మీద రావణుడు పుట్టగానే, రాముడవై పుట్టి మామూలుగా దుస్సాధ్యమైన నీ దర్శనాన్ని అందరికీ ఇచ్చావు. కంసుడు మొదలైన రాక్షసులు లోకకంటకులైనందువలనే కృష్ణుడవై వెలసి అందరితో ఆడి, పాడావు. హిరణ్యకశిపుడు ఎంత ఉపకారో! అంతగా నిన్ను వెతకబట్టే నరసింహుడివై నువ్వొచ్చి మాకు నిన్ను సేవించే భాగ్యం కలిగించావు. కనుక అసలు జన్మంటే

వారిదే. వారివల్లనే నీ కథలు రామాయణంగా, భారతంగా వాసికెక్కాయి. కనుక వారు ఎంత ఉపకారులో' అంటూ వైర భక్తులైన వారు చేసిన మేలునుగురించి శ్లాఘించారు అన్నమయ్య.

### 4.15. అనన్య భక్తి

అనన్య భక్తినే ఆత్యంతిక భక్తి లేదా అహేతుక భక్తి అంటారు. ప్రతిఫలాపేక్ష లేని కేవలభక్తి కైంకర్యం అనన్య భక్తి లక్షణం. ఇటువంటి అనన్య భక్తి కలిగిన భక్తులను ఏకాంతులు అంటారు. వీరికి కైవల్యంకూడా అక్కరలేదు. భగవంతుడి సేవ తప్ప తక్కిన ఏదీ కోరరు. "మోక్షానికంటే కైంకర్యానికి ప్రాధాన్యమిచ్చేవారు ఏకాంతులు" (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం-4:284).

> *భక్త్యా త్వనన్యయా శక్యః అహమేవం విధో అర్జున ।*
> *జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:258 – [భగవద్గీత-11వ అధ్యాయం-54వ శ్లోకం])

'అనన్యభక్తి ఒక్కటే నన్ను తెలుసుకొనే సాధనం' అంటూ కృష్ణ పరమాత్ముడు *భగవద్గీతలో* బోధించాడు.

> *అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।*
> *తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:188 – [భగవద్గీత-8వ అధ్యాయం-14వ శ్లోకం])

'ఎవడు అనన్యచిత్తుడై నన్ను నిరంతరం స్మరిస్తూ ఉంటాడో, ఆ యోగికి నేను సులభసాధ్యుడనవుతాను' అన్నాడు. *అనన్యాః చింతయంతోమా ఏ జనాః పర్యుపాసతే. తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం* (లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990:204 –

[భగవద్గీత–9వ అధ్యాయం–22వ శ్లోకం]) – అటువంటి ‘అనన్యభక్తుల యోగక్షేమాలను తాను వహిస్తా’నని హామీ ఇచ్చాడు.

*భాగవతంలో* అనన్యభక్తి, ఆత్యంతిక భక్తి పేరిట పేర్కొనడింది. *వ్యాసభాగవతంలో*

*సాలోక్య సార్ష్టి సామీప్య సారూప్యైకత మప్యుత*
*దీయమానం న గృహ్ణంతి వినా మత్సేవనం జనాః ।*
*స ఏవ భక్తి యోగాఖ్య ఆత్యంతిక ఉదాహృతః*
*యేనాతి వ్రజ్య త్రిగుణం మద్భావా యోపపద్యతే ॥* (కృష్ణమూర్తిశాస్త్రి, నారాయణభట్ల. 1974:261 – [వ్యాస భాగవతం–3వ స్కంధం–29వ అధ్యాయం–13,14 శ్లోకాలు])

‘నా భక్తులు, నా సేవను తప్పించి, సాలోక్యం, సార్ష్టి, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం అనే వివిధాలైన మోక్షాలనుకూడా కోరరు. అటువంటి భక్తినే ఆత్యంతిక భక్తి పేరుతో పిలుస్తారు. ఇటువంటి భక్తితో త్రిగుణాలనుకూడా జయించి నన్నే పొందగలుగుతారు.’

*ఆంధ్రమహాభాగవతం* అటువంటి అనన్యభక్తులకు సారూప్యమోక్షం లభిస్తుందని చెబుతోంది. *నిష్కాము లయిన మదీయ భక్తులకు నట్టి భక్తియోగంబు సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యంబులకు సాధనంబు, కావున, మహాత్ములగు వారు నిజమనోరథఫలదాయకంబు లయినను మదీయ సేవావిరహితంబులయిన యితర కర్మంబు లాచరింప నొల్లరు; దీని నాత్యంతిక భక్తియోగంబని చెప్పుదురు, సత్త్వరజస్తమోగుణహీనుం డయిన జనుండు మత్సమానాకారంబుఁ బొందు* (కొండమాచార్యులు, ముదివర్తి. 2017. సంపుటం–2:465 – [ఆంధ్రమహాభాగవతం–3వ స్కంధం–958వ పద్యం])

*భక్తా ఏకాంతినో ముఖ్యాః* (వేంకటేశ్వరశాస్త్రి, జంధ్యాల. 1985:144 – [నారద భక్తి సూత్రాలు–67వ సూత్రం]) అంటూ *నారద భక్తి సూత్రాలు* కూడా, ఏకాంతులు అంటే అనన్య

భక్తులు భక్తులలోకెల్లా ముఖ్యమైనవారంటూ ప్రస్తావించింది. అనన్య భక్తిని ఎందరో గొప్ప భక్తులు అలవర్చుకుని తరించారు. *ముకుందమాల* లో కులశేఖరాళ్వారు ఈ విధమైన భక్తిని ప్రదర్శించారు.

*ముకుంద మూర్ధ్నా ప్రణిపత్య యాచే*
*భవన్త మేకాంత మియంత మర్థమ్*
*అవిస్మృతి స్త్వచ్చరణారవిందే*
*భవే భవే మేఽస్తు భవత్ప్రసాదాత్* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:30 – [ముకుందమాల–3వ శ్లోకం])

'ఓ ముకుందా! నీకు శిరస్సు వంచి నమస్కరించి, ఒకే కోరిక కోరుతున్నాను. నాకు ప్రతి జన్మలోనూ నీ పాదకమలాలపై నిశ్చలభక్తిని దయతో కలిగించు.'

*నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే*
*యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపమ్,*
*ఏతత్ప్రార్థ్యమ్ మమ బహుమతం జన్మజన్మాంతరేఽపి*
*త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు* (కొండమాచార్యులు, ముదివర్తి. 1993:36 – [ముకుందమాల–5వ శ్లోకం])

'ధర్మంపై కాని, అర్థంపై కాని, కామోపభోగాలపై కాని నాకు కోరిక లేదు. పూర్వ కృత కర్మరూపంగా ఏది సిద్ధిస్తుందో అది సిద్ధించనీ! ఎన్ని జన్మలైనా ఫరవాలేదు. నీ పాదారవిందాలపై నిశ్చలమైన భక్తిని ప్రసాదించు తండ్రీ!' అని కోరుకున్నారు కులశేఖరాళ్వారులు. మోక్షంకూడా అడగకుండా, జన్మజన్మాంతరాల్లోనూ నిశ్చల భక్తి మాత్రమే చాలుననడం అనన్య భక్తికి ఉదాహరణ.

*ఇచ్చువై తవిర యాన్ పోయ్ ఇన్దిర లోకమాళుం*

*అచ్చువై పెరినుం వేండేన్ అరంగమానగరుళానే* (రఘునాథాచార్యులు, న. చ. 1992:27 – [తిరుమాలై–2వ పాశురం])

'శ్రీరంగనాథా! నీ నామసంకీర్తనాన్ని విడచి ఎక్కడికో పోయి పరమపదాన్ని స్వీకరించమన్నా నేను ఇష్టపడను' అని తొండరడిప్పొడి ఆళ్వారు అంటారు.

*తిరుప్పావై*లో గోదాదేవికూడా 'ఎల్లపుడు, ఏడేడు జన్మలకు నీతో ఉండి, నీకు మాత్రమే సేవకులుగా ఉండి, నీ సేవలు చేస్తాము. ఈ భావనకు విరుద్ధమైన కోరికలు మా దరి చేరకుండ నీవు చూసుకోవాలి' అంటూ అనన్య భక్తిని ప్రదర్శించారు. (రాఘవన్, టి. కె. వి. 2017:47 – [తిరుప్పావై–29వ పాశురం])

భాగవతంలో ఇటువంటి భక్తిని ప్రహ్లాదుడు ప్రదర్శిస్తాడు. *ఇచ్చెదఁ గోరు మెద్దియైనఁ గుఱ్ఱ! నీవు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:455 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం– 370వ పద్యం]) – 'ఏదైనా కోరుకో! ఇస్తాను' అన్న శ్రీమహావిష్ణువుతో ప్రహ్లాదుడు, *నిష్కాముండైన యేకాంతి గావునఁ గామంబు భక్తియోగంబునకు నంతరాయం బని తలంచి యిట్లనియె... దేవా! వరదుండ వయ్యెద వేనిఁ గామంబులు వృద్ధిఁబొందని వరంబుఁ గృపసేయుము, కామంబులు విడిచిన పురుషుండు నీతోడ సమాన విభవుం డగు* (లక్ష్మణయ్య, సముద్రాల. 2017. సంపుటం–4:455,456 – [ఆంధ్రమహాభాగవతం–7వ స్కంధం–371వ వచనం]) – నిష్కాముడు, ఏకాంతుడైన భక్తుడు కనుక కోరికలుండడం భక్తికి భంగకరమని, 'కోరికలు పెరగని వరాన్ని ఇవ్వు. కోరికలు లేనివాడు నీతో సమానుడౌతాడు' అంటాడు. ఈ విధంగా ప్రహ్లాదుడు గొప్ప అనన్యభక్తి భావాన్ని ప్రదర్శించాడు.

రామానుజులు *శరణాగతి గద్యమ్* లో

> *పారమార్థిక భగవచ్చరణారవింద యుగలైకాంతిక పరభక్తి పరజ్ఞాన పరమభక్తి కృత సంపూర్ణానవరత నిత్య విశదతమానన్య ప్రయోజన నవధికాతిశయ ప్రీతికారితాశేషా వస్థోచితాశేష శేషతైకరతిరూప నిత్యకైంకర్య ప్రాప్త్యపేక్షయా । పారమార్థికీ భగవచ్చరణారవింద శరణాగతిః యథావస్థితా అవిరతాస్తు* (రామానుజ భట్టర్, కె. 2016:8 – [శరణాగతి గద్యమ్–2వ ఖండిక])

'స్వామీ! నీకు నిత్యం కైంకర్యం చేస్తూ ఉండాలనేది నా కోరిక. ఇది ఏకాంతిక, పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తితో కలిగిన ప్రీతితో కూడిన కైంకర్యాపేక్ష. ఈ విధమైన కైంకర్యాపేక్ష నాకు ఎల్లవేళలా ఉండేటట్లుగా అనుగ్రహించు స్వామీ!' అని ప్రార్థిస్తారు.

అన్నమయ్యకూడా తన కీర్తనలలో ఇటువంటి అనన్యభక్తిని ప్రదర్శించారు. ఈ కీర్తన అన్నమయ్య అనన్యభక్తికి ఉదాహరణ.

> *కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు*
> *శ్రీవిభుఁడ నీవు మాకుఁ జిక్కే మర్మ మిదివో*
>
> *హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే*
> *నరయ నీదాసులలెంకౌ టెక్కుడు*
> *వెరవున నీచెవిలో విన్నపాలు సేయుకంటే*
> *ధర నీవూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు*
>
> *జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే*
> *అట్టె నీనామఫలమందు టెక్కుడు*

*ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే*
*తిట్టపు మాగురునుపదేశ మెక్కుడు* (2-483)

పై కీర్తనలో 'కైవల్యంకంటే తనకు శ్రీహరి కైంకర్యమే ఎక్కు'వంటూ తన ఏకాంత భక్తిని చాటుకున్నారు అన్నమయ్య. 'నిరంతరం ఇది కావాలి, అది కావాలి అని దేవుడికి విన్నపాలు చేయడంకంటే స్వామివారి ఊడిగం చేయడం తనకు ఎక్కువ' అన్నారు. అలాగే, 'సాయుజ్య మోక్షమందుకోవడంకంటేకూడా నిరంతరం స్వామివారి నామజపం చేయడం ఇష్టం' అని తన నిష్కామ భక్తిని ప్రదర్శించారు.

### 4.16. ఇతర భక్తి మార్గాలు

అన్నమయ్య పైన పేర్కొన్నవే కాక మరెన్నో భక్తి రీతులను తన కీర్తనలలో ప్రదర్శించారు. అవి ప్రత్యేకంగా ఏ భక్తి మార్గంలోకి చేరకపోయినా, అవి అన్నమయ్య ప్రదర్శించిన విలక్షణమైన భక్తి రీతులని భావించవచ్చు.

#### 4.16.1. దేవేరి కీర్తన

శ్రీవైష్ణవంలో 'శ్రీ' లక్ష్మీదేవిని సూచిస్తుంది. శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీమన్నారాయణుని అర్థాంగి అయిన లక్ష్మీదేవికి చాలా ప్రాముఖ్యత ఉంది. మంత్రరత్నంగా ప్రసిద్ధిగాంచిన ద్వయ మంత్రాన్ని శ్రీహరి అమ్మవారిద్వారానే లోకానికి వెల్లడించాడు. అమ్మవారు నిత్యానపాయిని. స్వామిని విడిచి ఆమె ఉండదు. అమ్మవారు లేక స్వామికి పరిపూర్ణత లేదు.

జీవాత్మ పరమాత్మలను అనుసంధానం చేసే ప్రయత్నం అమ్మవారిది. కనుక, స్వామిని చేరాలంటే అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడం భక్తులకు పరిపాటి. భక్తకవి రామదాసుకూడా

*నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ!* అంటూ అయ్యవారి చల్లని చూపు తనవైపు పడేలా చెయ్యమని, అమ్మవారికి తన గోడును మనవి చేసుకున్నారు.

*వడివాయ్ నిన్ వలమార్బినిల్ వాళ్ గిన్రమంగైయుం పల్లాణ్డు* (రాఘవన్, టి. కె. వి. 2017:5 – [తిరుప్పల్లాండు-2వ పాశురం]) – 'నీ వక్షమున కుడిపక్క నిలిచి ఉండే శ్రీమహాలక్ష్మి వేల సంవత్సరములు వర్ధిల్లుగాక!' అని అమ్మవారికి మంగళాశాసనం పలికారు పెరియాళ్వారుగా పిలవబడే విష్ణుచిత్తులు.

రామానుజులు *శరణాగతిగద్య* లో *భగవన్నారాయణాభిమతానురూప స్వరూప రూప గుణ విభవైశ్వర్య శీలాద్యనవధికాతిశయా సంఖ్యేయ కల్యాణ గుణగణా పద్మవనాలయాం భగవతీం శ్రియం దేవీం నిత్యానపాయినీం నిరవద్యాం దేవదేవదివ్యమహిషీం అఖిలజగన్మాతరం అస్మన్మాతరం అశరణ్యశరణ్యాం అనన్యశరణః శరణమహం ప్రపద్యే ॥* (రామానుజ భట్టర్, కె. 2016:7 – [శరణాగతి గద్యమ్-1వ ఖండిక]) - అంటూ అమ్మవారిని వర్ణించి, అఖిల జగత్తులకు తల్లి అయిన అమ్మవారినే మొదట శరణువేడారు.

అమ్మవారిని కీర్తించడం ఆళ్వార్లు మొదలుపెట్టిన శ్రీవైష్ణవసంప్రదాయం. ఆ సంప్రదాయంలోనే అన్నమయ్యకూడా అలమేలుమంగను కీర్తించారు.

*గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె*
*సిరులొసఁగఁ జూడరో చింతామణి యీపె*

*పాల జలధిఁ బుట్టిన పద్మాలయ యీపె*
*లాలిత శ్రీ నరసింహులక్ష్మి యీపె*
*మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె*
*యీ లీల లోకములేలే యిందిర యీపె*

*ఘన సంపద లొసఁగు కమలాకాంత యీపె*

*మనసిజుఁ గనిన రమాసతి యీపె*

*అనిశముఁ బాయని మహాహరిప్రియ యీపె*

*ధన ధాన్య రూపపు శ్రీ తరుణి యీపె*

*రచ్చల వెలసినట్టి రమావనిత యీపె*

*మచ్చిక గలయలమేల్‌ఁమంగ యీపె*

*యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు*

*నిచ్చలూఁ దావు కొనిన నిధాన మీపె* (4-522)

ఈ కీర్తనలో 'అమ్మవారిని సిరులను కురిపించే చింతామణిగా, గరుడాద్రి, వేదాద్రులకు సంపదగా' వర్ణించారు అన్నమయ్య. అమ్మవారు పాలసముద్రంలో పద్మాలయగా పుట్టి, శ్రీమహావిష్ణువు అర్ధాంగిగా, లోకమాతగా కీర్తింపబడింది. లోకానికి ధన ధాన్య సంపదలను ఇచ్చే తల్లి ఆమె. ఎల్లప్పుడూ హరిని విడిచి ఉండక నిత్యానపాయిని అయింది. ఆమె వేంకటాద్రిలో, అహోబిలంలోకూడా భక్తులకు కొంగుబంగారంగా కొలువు తీరింది.

### 4.16.2. క్షేత్ర కీర్తన

క్షేత్రాధీశ్వరునికెంత ప్రాముఖ్యముందో, క్షేత్రానికికూడా అంతే ప్రాముఖ్యమిచ్చారు ప్రాచీన భక్తకవులు. కులశేఖరాళ్వారు *పెరియతిరుమొళి* లో తిరుమల క్షేత్ర ప్రాశస్త్యానికి ముగ్ధుడై తిరుమలలోని పుష్కరిణిలో పక్షిగా పుట్టాలనుకుంటారు. కాని పక్షి అయితే ఎగిరిపోవచ్చునని, కోనేటిలో చేపగా పుట్టాలనుకుంటారు. కాని, నీరు ఎండిపోతే, క్షేత్రంతో సంబంధం తెగిపోతుంది. కనుక, భాగవతుడిగా పుట్టాలనుకుంటారు. కాని మనిషికి దుర్బుద్ధులు కలగవచ్చు. కనుక, చంపక వృక్షంగా పుట్టి తన పుష్పాలతో తిరుమల స్వామిని సేవించాలనుకుంటారు. కాని పుష్పాలను ఎవరైనా కోసుకుని పోతే, తిరుమలలో నివసించే

అదృష్టం లేకుండా పోతుంది. కనుక, ఎవరికీ పనికి రాని ముళ్ళపొదగా పుట్టాలనుకుంటారు. కాని పొదను ఎవరైనా తొలగించవచ్చు లేదా కార్చిచ్చులో కాలిపోవచ్చు. కనుక, స్థిరంగా తిరుమలలో శిఖరంగా ఉండాలనుకుంటారు. కాని శిఖరమైతే ఎవరైనా రాళ్ళు తొలిచి తీసుకుపోవచ్చు. కనుక, సెలయేటిలా ఉండాలనుకుంటారు. కాని ఏరు ఎండిపోవచ్చు. కనుక, తిరుమల క్షేత్రానికి నడిచే కాలిబాటగా పుట్టాలనుకుంటారు. కాని భక్తులు వేరే మార్గంలో వెళ్ళిపోవచ్చు. కనుక, తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తులందరూ తొక్కివెళ్ళే వాకిలిమెట్టుగా ఉండాలనుకుంటారు. ఒక్కో వస్తువులోనూ ఏదో ఒక కొరత ఉందని చివరకు స్వామివారినే నిశ్చయించి, తిరుమలలో ఏదో ఒకటిగా పుట్టించమని కోరుకుంటారు. ఇలా క్షేత్రంతో విడదీయరాని అనుబంధాన్ని కోరుకున్నారు కులశేఖరాళ్వారు.

అన్నమయ్యకూడా తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామినే కాక, స్వామి వెలసిన తిరుమల క్షేత్రాన్నికూడా తన కీర్తనల్లో కీర్తించారు.

*అదివో అల్లదివో హరివాసము*
*పదివేలు శేషుల పడగల మయము*

*అదె వేంకటాచల మఖిలవున్నతము*
*అదివో బ్రహ్మాదుల కపురూపము*
*అదివో నిత్యనివాస మఖిలమునులకు–*
*నదె చూడుఁడదె మొక్కుఁడానంద మయము*

*చెంగట నల్లదివో శేషాచలము*
*నింగినున్న దేవతల నిజవాసము*
*ముంగిట నల్లదివో మూలనున్న ధనము*
*బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము*

*కైవల్యపదము వేంకటనగ మదివో*

*శ్రీవేంకటపతికి సిరులైనది*

*భావింప సకలసంపద రూపమదివో*

*పావనములకెల్లఁ బావనమయము* (1-23)

*కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ*

*తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ* (3-471)

*అనిశముఁ దలఁచరో అహోబలం అనంతఫలదం బహోబలం* (3-520) అంటూ తిరుమల తరువాత అహోబిల క్షేత్రాన్నికూడా తన కీర్తనలలో ప్రస్తుతించారు.

### 4.16.3. ఆయుధ కీర్తన

దుష్టశిక్షణలో, శిష్టరక్షణలో హరికి నిత్యం చేదోడుగా నిలిచిన చక్రానికి చాలా ప్రాముఖ్యత ఉంది. శిశుపాల, పౌండ్రక వాసుదేవ, సాల్వాది రాక్షసులను స్వామి సంహరించింది చక్రంతోనే. గజేంద్ర, అంబరీషాది భక్తులను రక్షించిందీ చక్రంతోనే. అందుకని, తమ కష్టాలు తొలగడానికి భక్తులు విష్ణుచక్రాన్ని ఆప్యాయంగా స్మరించుకుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో, 'చక్రస్నాన ఉత్సవం' పేరిట సుదర్శన చక్రానికికూడా స్వామి పుష్కరిణిలో పుణ్యస్నానం చేయిస్తారు.

*వడివార్ శోది వలత్తురైయుం శుడరాళియుం పల్లాణ్డు* (రాఘవన్, టి. కె. వి. 2017:5 – [తిరుప్పల్లాండు-2వ పాశురం]) – 'సౌందర్యము, తేజస్సు రెండూగల నీ కుడిచేతి సుదర్శన చక్రం శత్రునాశకరము, అది వేల సంవత్సరములు వర్ధిల్లుగాక!' అని పెరియాళ్వారు సుదర్శనచక్రానికి మంగళాశాసనం చేశారు. అటువంటి మహిమగల చక్రాన్ని అన్నమయ్య కొన్ని కీర్తనల్లో స్తుతించారు.

*నమో దానవవినాశచక్రమా*

*సమరవిజయమైన సర్వేశు చక్రమా* (3–282)

*చక్రమా హరిచక్రమా*

*వక్రమైన దనుజుల వక్కలించవో* (1–183)

### 4.16.4. ఊరేగింపు కీర్తన

బ్రహ్మోత్సవాలసమయంలో స్వామివారి ఉత్సవమూర్తిని వైభవోత్సవ మంటపానికి, అటు పై తిరువీధులలోకి ఊరేగింపుగా తీసుకెళ్ళడం తిరుమలలో ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆ విధంగా ఊరేగింపుగా వచ్చిన స్వామి సౌందర్యాన్ని, వైభవాన్ని వేనోళ్ళ కీర్తించారు అన్నమయ్య.

*వీధుల వీధుల విభుఁ డేఁగీ నిదె*

*మోదము తోడుత మొక్కరొ జనులు* (4–286)

*గరుడవాహనుఁడు కనకరథముపై*

*యిరువుగ వీధుల నేఁగీని* (4–26)

### 4.16.5. తేరు కీర్తన

తిరుమల క్షేత్రంలో ఉండి శ్రీవారిని నిత్యం దర్శిస్తూ సంకీర్తనలు రచించిన అన్నమయ్య, స్వామికి చేసే కైంకర్యాలను, స్వామి వైభవాన్ని ఎన్నో కీర్తనల్లో వర్ణించారు. స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్ళే రథాన్నికూడా అన్నమయ్య పలు కీర్తనల్లో కొనియాడారు.

*అప్పుఁడైన హరి యెక్కె నదివో తేరు*

*యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు* (4–35)

*మిన్నునేలా నొక్కటైన మేటితేరు*

*కన్నులపండువయిన శ్రీకాంతునితేరు* (2-227)

ఇలా ఈ అధ్యాయంలో అన్నమయ్య తన కీర్తనలలో ఏకాదశభక్తి మార్గాలలోనే కాక, మరెన్నో భక్తిమార్గాలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని కొలుచుకోవడం గమనించవచ్చు. మానవులు అవలంబించే భక్తి మార్గాలు అనేకం ఉన్నాయని, ఏ భక్తి మార్గాన్నైనా భగవంతుడు అంగీకరిస్తాడని చెబుతూ, అన్నమయ్య ఏకాదశ భక్తి మార్గాలను ప్రతిపాదించారు. అన్నమయ్య తన కీర్తనలలో ప్రదర్శించిన ఈ ఏకాదశ భక్తిమార్గాలను ఈ అధ్యాయంలో చర్చించాను. అవే కాక, మధుర భక్తి, వాత్సల్య భక్తి, వైర భక్తి, అనన్య భక్తి మొదలగు మరిన్ని భక్తి మార్గాలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనలను విపులంగా విశ్లేషించాను.

అన్నమయ్య తాను ప్రతిపాదించిన ఏకాదశ భక్తి మార్గాలలో ఎక్కువగా తురీయభక్తిని ప్రదర్శించారు (పుటలు:349-353). భాగవతులను సేవించటం తురీయ భక్తి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భాగవతుడికికూడా భగవంతుడికున్న స్థానమే ఉంది. తదనుగుణంగా అన్నమయ్యకూడా భాగవతుల సేవకు, భాగవతుల భక్తికి ప్రాముఖ్యతను ఇచ్చారు. ఏకాదశ భక్తి మార్గాలలో అన్నమయ్య తురీయ భక్తి తరువాత స్థానాన్ని విజ్ఞాన భక్తికి ఇచ్చారు (పుటలు:342-346). అన్నమయ్య ప్రదర్శించిన ఇతర భక్తి మార్గాలలో మధురభక్తికి ప్రథమ తాంబూలమిచ్చారు. ఆళ్వారులు చూపిన త్రోవగా మధురభక్తిని అన్నమయ్య అవలంబించారు.

మూడు, నాలుగవ అధ్యాయాలలో అన్నమయ్య ప్రదర్శించిన అధ్యాత్మికత భూమికగా, నేటి సమాజంలో అధ్యాత్మికత పాత్రను గురించి, ఈ కాలంలో అన్నమయ్య ప్రాసంగికతను గురించి అయిదవ అధ్యాయంలో చర్చించాను.

*****

# అనుబంధం – 3

# ఇతర భక్తి మార్గాలకు చెందిన అన్నమయ్య కీర్తనలు

## 1. ఉన్మాద భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:214 | ఎండగాని నీడగాని యేమైనఁగాని | పిల్లిగాని నల్లిగాని..వేంకటాద్రిపైనున్న యాతఁడే |
| 2 | 1:456 | అక్కరకొదగని యట్టి యర్థము | బెండపడఁ గేశవునిఁ బేరుకొననినాలిక వుండెనేమి వుండకుండెనేమిరే |
| 3 | 2:404 | వాదులేల చదువులు వారు చెప్పినవే కావా | వాదులేల చదువులు వారు చెప్పినవే కావా..నాలుగువేదాల బ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు |
| 4 | 3:5 | దాసోహమను బుద్ధిఁ దలచరు దానవులు | సరవి విష్ణుని జపించనివారు నసురలే |
| 5 | 3:345 | తల మొలా నొక్కసరా తను వొక్కటౌఁ గాక | వొడ్డిన కైలాసమే లేవుమాపతిఁ గడుపులో వెద్దువెట్టి పెంచేవాఁడు వీరితోవాఁడా |
| 6 | 3:350 | పాపము పాపము ప్రజలాలా | హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును హరితో సరి వీరనుటెట్లూ<br>పొరిఁ గొండలందుఁ బుట్టిన శిలలివి వరుసఁ బెట్టితే సరియౌనా |
| 7 | 4:210 | పలికేటి వేదమె ప్రమాణము | హరిఁ గొలువనివా రసురలు సుండీ |

## 2. పతివ్రతా భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:386 | అన్నిటా నీవంతర్యామివి | సర్వదేవతలయిన్ని రూపులై నీ వున్నప్పుడు కై కొని నిను బహుముఖములఁగొలుచుట గాదు పతివ్రత వ్రత ధర్మంబు |
| 2 | 1:395 | కింకదీర ' న దైవం కేశవాత్పర'మని | శ్రీవేంకటేశ నంటున నీపాదాలే నమ్మితి నేమియు నమ్మ నారాయణా |
| 3 | 2:103 | జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు | శ్రీవేంకటేశ మీ దాస్యమే వుండఁగా వాసిఁ బరులఁ గొలువనే వడిఁ గోరీ జీవుఁడు |
| 4 | 2:145 | ఏల మమ్ము గాసిసేసే రింకా మీరు | పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు |
| 5 | 2:177 | చేసిన నావిన్నపము చిత్తానఁ బెట్టుకొమ్మీ | నిన్నేకాని యితరుల నేఁ గొలువనొల్ల నంటి |
| 6 | 3:128 | తప్పదు యీయర్థము ధరణిలోన | వొరులఁ గొలువము నే మొగి నీ పాదాలే నమ్మి నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముఁ గాతువు |
| 7 | 3:456 | గరిమల నెరఁగరుఁ గాక మానవులు | హరినారాయణ యనియెడి నోరను ధర నితరుల పేళ్లు దడవుటెట్టు |
| 8 | 3:526 | ఇతరుల నడుగము యితఁడే మా దాత | ఇతరుల నడుగము యితఁడే మా దాత యితని యీవి వొరు లియ్యఁగఁ గలరా |
| 9 | 4:87 | ఇందులోనఁ గల సుఖమింతే చాలు మాకు | హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని పరగ నుతించితిమి పరుల నేమొల్లము |
| 10 | 4:136 | కటకట నేమూ కర్తలము గాము | నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి పరదైవములతోడిపని మాకు లేదయ్యా |

## 3. విజ్ఞాన భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:131 | పరగుబహుసజ్జన్మపరిపక్వహృదయుఁడై | యెదిరిఁ దనవలెనె తా నెఱఁగనేర్చినఫలము అదిగదా ద్రవ్యమోహంబు గడచనుట |
| 2 | 1:181 | ఎంతవిభవము గలిగె | తిరువేంకటేశుఁడే దైవమని వినఁగలిగినది గదా వినికి |
| 3 | 1:217 | వెరపులు నొరపులు వృథా | ఘనుఁడగు తిరువేంకటగిరిహరిఁగని మననేరని జన్మములు వృథా |
| 4 | 1:219 | హరినెఱుఁగని పుణ్యమంటేరుగాన | తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా విరసాలే |
| 5 | 1:226 | కడలుడిపి నీరాడఁగాఁ దలఁచువారలకు | దాహమణఁగినవెనుక తత్వమెరిఁగెదనన్న దాహమేలణఁగు తా తత్వ మే మెరుఁగు |
| 6 | 1:232 | నీవనఁగ నొకచోట | తనయాత్మవలెనె భూతములయాతుమలెల్ల ననయంబుఁ గనుఁగొన్నయతఁడే నీవు |
| 7 | 1:236 | ఏమిఫలము దానిన్నియునుఁ దెలిసినను | మానుషముగల ఫలము మంచివాఁడౌట తనుఁ దానె తెలిసినఫలము తత్వపరుఁడౌట |
| 8 | 1:260 | కడగనుటే సౌఖ్యముగాక యీ | నిలిచినదొకటే నిజమని తెలిసిన తెలివే ఘన మింతియకాకా |
| 9 | 1:263 | మోహము విడుచుట మోక్షమది | ననిచిన తనజన్మముఁ గర్మముఁ దన పనియు నెఱుగుటే పరమ మది |
| 10 | 1:292 | ఏ కులజుఁడేమి యెవ్వఁడైన నేమి | తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే తగిలి వేంకటేశుదాసుఁడయినవాఁడు |
| 11 | 1:318 | ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన | సరవిమాలినయంత్యకులజుఁడైన నరసి విష్ణుని వెదకునాతఁడే ఘనుఁడు |
| 12 | 1:329 | కొంచెమును ఘనముఁ గనుఁగొననేల | కులహీనుఁడైనను విష్ణు పాదసేవకుఁడువో బ్రహ్మణోత్తముఁడు |
| 13 | 1:330 | తెలిసియు నత్యంతదీనుఁడై | వేంకటపతిదాసుల ప్రసాదంబు అనిశమును గొనఁగోరునదివో తెలివి |
| 14 | 1:339 | చదివెఁబో ప్రాణి సకలము యీ | సిరులు చంచలమని చేఁత లధ్రువమని.. |
| 15 | 1:340 | ఎందుఁజూచినఁ దనకు నిన్నియును | ...యిది యెరిఁగి తిరువేంకటేశ్వరునిఁ గొలిచినను బ్రదుకు గలుగును |
| 16 | 1:365 | అణురేణుపరిపూర్ణుఁడైన శ్రీవల్లభునిఁ | యేవి చూచినను హరి యిన్నిటాఁ గలఁడనుచు భావించువారువో బ్రాహ్మలు |
| 17 | 1:378 | ఆతుమ సంతసపెట్టుటది యెఱుక | శ్రీవేంకటపతిదాసుడై యిరవొంద సుఖించుటదియే యెఱుక |
| 18 | 1:396 | ఓహో డేండేం వొగి బ్రహ్మ మిదియని | క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుఁడు సిరిపురుషోత్తముఁడే శ్రీవేంకటేశుఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 19 | 1:417 | తహతహలిన్నిటికి తానే మూలము గాన | సహజాన నూరకున్న సంతతము సుఖము |
| 20 | 1:430 | ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము | కోపానలములోన కోరికలు వేల్చితేనే యేపున యజ్ఞాలు సేసి యేచినంతఫలము |
| 21 | 1:472 | ఎవ్వరివాఁడో యెఱఁగరాదు | ధర జనించక తొలుత తనుఁ గానరాదు మరణమందిన వెనక మఱి కానరాదు |
| 22 | 1:485 | ఎవ్వరు కర్తలు గారు యిందిరానాథుఁడే కర్త | కర్మము కర్తయైతే కడకు మోక్షము లేదు..నిర్మితము హరిదింతే నిజమిదెఱుఁగరో |
| 23 | 1:502 | ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే | సారపుఁగర్మములు కేశవుని కైంకర్యములే ధీరులై వివేకించి తెలిసేటివారికి |
| 24 | 2:55 | లేదు భయము మఱి కాదు భవము | తలఁపులు గడుగక వొడ లటు తాఁ గడిగిన నేమి |
| 25 | 2:56 | హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని | నిండుఁ జింతాజలధికి నీళ్లు దనచిత్తమే దండి పుణ్యపాపాలే దరులు |
| 26 | 2:104 | ఊరకే దొరుకునా వున్నతోన్నతసుఖము | కలుషంపు దుర్మదము గడచినప్పుడు గదా తలకొన్న మోక్షంబు తనకుఁ జేపడుట |
| 27 | 2:117 | అప్పుడు చూచేదివో అధికుల నధముల | పాదుకొన్న సంసారబంధము నోరూరించితే ఆదిగొని మత్తుఁడు గానెట్టివాఁడే పుణ్యుఁడు |
| 28 | 2:136 | పరమాత్ముఁ డొక్కఁడే పరమపావనుఁడు | జాతి యిందే దంత్యజాతి యిందేది జాతులన్నిటా నాత్మ సర్వేశుఁడు |
| 29 | 2:159 | వట్టి లంపటాలఁ బడి వడఁ బొరలుటకంటే | పాపము మానినయట్టి బదుకొక్కటె సుఖము<br>కోపము విడిచినట్టి గుణమొక్కటి సుఖము |
| 30 | 2:186 | ఒక్కఁడే మోక్షకర్త వొక్కటే శరణాగతి | చక్క జ్ఞానియైనవాఁడు సారార్థము వేదమందు తక్కక చేకొనుఁ గాక తలకెత్తుకొనునా |
| 31 | 2:195 | విష్ణుఁడే యింతానని భావించుటే బుద్ధి | కొండవంటి తనలోని కోపము రేఁగవచ్చితే దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి |
| 32 | 2:209 | ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్చగించు | కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము<br>చేముంచి పాపము సేయక మానుటే చెప్పఁగ లాభము |
| 33 | 2:241 | దేవుఁడొక్కఁడే గురి దెలిసినవారికి | పలు సుఖదుఃఖములఁ బాసి వుండుటే మోక్షము |
| 34 | 2:260 | ధరణి నెంద రెన్నితపములు చేసినాను | జదువులెన్ని వుండినా శ్రీవేంకటేశు సన్నుతించిన మంత్రమే సతమై ఫలించును |
| 35 | 2:324 | అన్నిటా నీవే వుందునందువు గాన | నిలిచిన రూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు మెలఁగేటి చైతన్యము మిమ్ముగాఁ దలఁతు |
| 36 | 2:362 | ఆతనిమూలమే జగమంతా నిది | చెప్పినట్లు సేసితేను చేరి దేహమే చుట్టము తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 37 | 2:385 | తందనాన ఆహి తందనాన పురె | కందువగు హీనాధికములిందు లేవు అందరికి శ్రీహరే అంతరాత్మ |
| 38 | 2:393 | ఎంత మాత్రమున ఎవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు | ఎంత మాత్రమున ఎవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు |
| 39 | 2:411 | ఇన్నిటా నొరయక యెఱు కేది | కోపము మతిలోఁ గుందినపుడువో పాపము లన్నియుఁ బాసేది |
| 40 | 2:419 | దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు | బాతచీర మాని కొత్తచీర గట్టినట్టు ముదిమేను మాని దేహి మొగిఁ గొత్తమేను మోచు |
| 41 | 2:442 | అన్నిటికి హరి యంతర్యామి మూలము | మేలిమిశాంతిమూలమే సుఖము..క్రోధమూలమే వెడదుఃఖము<br>పరము శ్రీవేంకటపతి మూలము |
| 42 | 2:457 | ఈతనిమూలమెపో యిలఁగల ధనములు | ధ్యానమే మా ధనము దయే మా ధనము పానిన శ్రీవేంకటాద్రిపతియే మా ధనము |
| 43 | 2:481 | ఎఱుఁగువా రెఱుఁగుదు రీయర్థము | చెడనిదానికి మరి చేటెన్నఁడును లేదు జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము |
| 44 | 3:8 | పుట్టినట్టె వున్నవాఁడ పోలేదు రాలేదు | వెలినున్న జగమెల్ల విష్ణుఁడ నీ మహిమే అలరి నాలోన నీవే అంతరాత్మవు<br>తెలిసి నేనున్నచోటే దివ్యవైకుంతము |
| 45 | 3:57 | వేఱొకచోట లేఁడు వీఁడివో హరి | తెలిసి వెదకఁబోతే దేహపు టంతరాత్మయై వెలుపలా లోపలాను వీఁడివో హరి |
| 46 | 3:152 | సర్వసులభుఁ డితఁడు సర్వేశ్వరుఁడు | హితవులు గోరకుంటే నెదుటఁ శ్రీపతి నిల్చు జితేంద్రియవ్రతమందే శ్రీవేంకటేశుఁడు |
| 47 | 3:158 | ఎందునైనా మీరఁబోతే నెవ్వరికి జవిగాదు | మంచితనమే వలె మాటలాడే యప్పుడెల్లా కొంచికొంచి యుండవలె కోపపువేళ |
| 48 | 3:219 | నీవారైనవారికి నీపై భక్తేకాక | శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా ఆవటించి నుతి వుపాయమై వుండఁగా<br>తావులనే శరణనే ధర్మము రక్షించఁగాను వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా |
| 49 | 3:252 | నిత్యానందులము నిర్మలులమిదే నేము | యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును వొక్కట నంతర్యామై వున్నాఁడదె |
| 50 | 3:310 | అందాఁకా వైష్ణవ మటకటకే | పాపపురాసులు పరిహరమైతే దీపించు హరిభక్తి వొడమును |
| 51 | 3:320 | నిండుమనసే నీ పూజ | సర్వము నీవని స్వతంత్రముడిగి నిర్వహించుటే నీపూజ |
| 52 | 3:414 | చంచలము మానితేను సంసారమే సుఖము | కాని పని సేయకుంటే కాయమే సుఖము....ఆని హరిఁ దలఁచితే నంతటా సుఖమే |
| 53 | 3:452 | ఏ పాటి తన కర్మ మాపాటి కాపాటె | అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన యంతరంగమున నుండు నీ దేవుఁడే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 54 | 3:524 | ఇది యెరిఁగినవారే యెంచఁగ నీ దాసులు | పట్టితే నీ స్వరూపము బయలు లోపల నిండి అట్టే సర్వశక్తితో సాకారముతో<br>యెట్టు దలఁచినాఁ జిత్తాయిత్తమై వున్నాఁడవు వొట్టి ప్రకృతిపురుషు లొగి నీ దేహములు |
| 55 | 3:528 | వేసరితేనే లేదు విచారించితేఁ గద్దు | యెవ్వరు మనసులోన నిందిరేశుఁ దలఁచిన అవ్వలఁ బాయక వుండు నదియే వైకుంతము<br>దవ్వులకు నేఁగవద్దు తపము జపము వద్దు |
| 56 | 4:64 | ఇన్నియుఁ జదువనేల యింతా వెదకనేల | వలెనంటే బంధము వలదంటే మోక్షము తెలిసే విజ్ఞానులకు తెరువిది యొకటే |
| 57 | 4:120 | అన్నిటా నిట్టే కాని యగపడదు | సొలసి సంసారములో సుఖముఁ బొందేనంటే అలమటలేకాని యగపడదు<br>..సడిఁ గోపమే యుండఁగ శాంతిఁ బొందేనంటే అడవిఁ బడుటేకాని యగపడదు |
| 58 | 4:173 | వట్టిజాలిఁ బడవలదిఁకను | శరణాగతియె సామ్రాజ్యపదవి ధర జితేంద్రియత్వమె వైభవము |
| 59 | 4:196 | ఊరకే వెదకనేల వున్నవి చదువనేల | కోపము విడిచితేనె పాపము దానే పోవు దీపింప సుజ్ఞానముతెరు విదివో |
| 60 | 4:231 | జ్ఞానంబొకటే జగమున కధికం మరి | బహుదానఫలము పడయుటకంటే యిహమున వైరాగ్య మెక్కుడు<br>ధరఁ దపములనంతంబులకంటే గరిమల శాంతము ఘనము |
| 61 | 4:318 | నిశ్చింతం పరమం సుఖ మనుమాటే నిజము | పరమాత్మునిపై సకలోద్యోగ వుపాయంబులు దా దిగవిడిచి ధరఁ దానుండిన<br>బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ |
| 62 | 4:322 | దొరకినయప్పుడే తుదగాక | తనుభోగంబులఁ దనిపినపిమ్మట వెనుకొని హరిఁ దడవేనంటే..<br>తనియుట యెన్నఁడు దగు మనసా |
| 63 | 4:346 | ఇందుకు విరహితములిన్నియు సజ్ఞానమని | ముంచినజన్మదుఃఖములు దలపోయుట కంచపుసంసారము గడుచుటే జ్ఞానము |
| 64 | 4:351 | దైవమే నేరుచుఁ గాక తగిలించ విడిపించ | అతికోప మేదనుండు నజ్ఞాన మాడనుండు మతిఁ బంత మెందుండు మత్సర మందుండు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 65 | 4:377 | ఏదైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు | దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము..<br>చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు |
| 66 | 4:389 | కర్మ మెంత మర్మ మెంత కలిగిన కాలమందు | బంగారువోడ గంటేఁ బట్టనాస పుట్టుఁగాని సంగతి విజ్ఞానపు జాడకు రాదు<br>వెంగలి యఖిని దింటే వెఱి వెఱాటాడుఁగాక అంగవించునా వివేక మప్పుడే లోకులకు |
| 67 | 4:408 | వెరగుతో మరచితే వెనక లేదు | ఆస విడిచినఁగాని యధిక సుఖము లేదు యీసు విడిచినఁగాని యిహము లేదు |
| 68 | 4:423 | ఇన్నివిధాలు యిఁకనేల | ప్రతిలేనివిజ్ఞానభావశుద్ధి గలిగితే మతకపుఁ గర్మాలు మరియేలా |
| 69 | 4:432 | వెనక ముందరికిఁ బెద్దలకెల్లను వివరపు సమ్మతి | కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొకతెరువు<br>మునుకొపముఁ బెడఁబాసిన మతి మోక్షంబునకును నొకతెరువు |
| 70 | 4:516 | అదిగాన నీతి శాంతాలన్నిటికిఁ గారణము | తఱచు మాఁటలాడితే తప్పులెన్నైనాఁ దొరలు పఱచై తిరిగితేను పాప మంటును |

## 4. ఆనంద భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:110 | చాలదా మా జన్మము | చాలదా మా జన్మము నీ పాలింటివారమై బ్రతుకఁగఁ గలిగె |
| 2 | 2:224 | ఏమని విన్నవింతు నిదివో నా భాగ్యము | ఏమని విన్నవింతు నిదివో నా భాగ్యము కామించి మీ శరణంటిఁ గమలారమణా |
| 3 | 2:339 | హరి గోవిందా హరి గోవిందా | హరి గోవిందా హరి గోవిందా – ఆనంద మానంద మాతుమకును |
| 4 | 2:369 | సదానందము సర్వేశ్వర నీ | ధరఁ బరమానందము నీదాస్యము<br>నరహరి నిత్యానందము నినుఁ దగ నరవిరిఁ జేయు సమారాధనము |
| 5 | 3:35 | అన్నియు నీతనిమూల మాతఁడే | అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె కన్నుల మా వేడుకకు కడయేది యిఁకను |
| 6 | 3:322 | భక్తి నీపైదొకటె పరమసుఖము | యిరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా పెరిగె నానందంబు బెళకు లిఁకలేవు |

## 5. రాక్షస భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 4:593 | మొక్కరో మీరు మోసపోక | మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు బీరాన గుండెలు గోసి పెట్టవద్దు |

## 6. తురీయ భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:10 | సహజ వైష్ణవాచార వర్తనుల సహవాసమె | పరమభాగవతపదసేవనమే సరవి నెన్న మాసంధ్య |
| 2 | 1:51 | నదులొల్లవు నాస్నానము కడు | పరమభాగవతపాదాంబుజముల దరుశనమే నా స్నానము |
| 3 | 1:69 | నేలమిన్ను నొక్కటైననీబంటు | బలువేంకటేశ ఈ పవననందనుఁడు కలిగి లోకములెల్లఁ గాచెఁగా నీబంటు |
| 4 | 1:254 | నీవేకా చెప్పఁజూప నీవె | ముజ్జగాలవారి నిందరిని నీ సిసువులఁగా నేలిన సేనమొదలారి |
| 5 | 1:279 | మాయపుదనుజులమదవైరి | పొంకపుకలశాపుర హనుమంతుఁడు వేంకటరమణుని వేడుకబంటు |
| 6 | 1:288 | ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా | ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా శ్రీకాంతు భజియించు సేవకులకు |
| 7 | 1:301 | ఏదియునులేని దేఁటిజన్మము | వేంకటాద్రీశుసేవకులె గతియనుచు తనబుద్ధిఁ గలిగుండవలెను |
| 8 | 1:366 | సీతాశోకవిఘాతక వో | హనుమంతరాయ అంజనీతనయ వో వనధిలంఘనగాత్ర వాయుపుత్రా |
| 9 | 1:367 | ఇన్నిజన్మము లేఁటికి హరిదాసు | శ్రీవేంకటేశుఁజూచినవారి శ్రీపాదసేవకుఁడై యండఁజేరినఁ జాలు |
| 10 | 1:390 | పరులసేవలు చేసి బ్రదికేరటా | శ్రీకాంతుపాదసేవకులగువార లేకులజులయినా నెక్కుడౌ టరుదా |
| 11 | 1:402 | మరిగి వీరెపో మాదైవంబులు | మరిగి వీరెపో మాదైవంబులు కెరలిన హరిసంకీర్తనపరులు |
| 12 | 1:414 | నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు | నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు...వైష్ణవులు |
| 13 | 1:418 | ఇదియే మర్మము హరి యిందుఁగాని లోనుఁగాడు | ధరఁ బ్రత్యక్షము హరిదాసులఁ గొలువరో |
| 14 | 1:462 | మహి నింతటివారువో మనవారు | జయమంది జననపుజరామరణముల భయములేనివారు ప్రపన్నులు |
| 15 | 1:479 | కంటే సులభమిది కానక యుంటే | అచ్చట వీరిప్రసాద మమృతపానములు |
| 16 | 1:490 | నెరవాది సాహసులు నిత్యశూరులు | శ్రీహరిభక్తితాపలు సేసి యెక్కిరి చక్కఁగా వైకుంఠము సనకాదులు |
| 17 | 1:493 | నేరిచిబ్రదికేవారు నీదాసులు | నీ మాయ గెలిచినారు నీదాసులు |
| 18 | 2:25 | అదివో నిత్యశూ(సూ?)రులు అచ్యుత నీదాసులు | అదివో నిత్యశూ(సూ?)రులు అచ్యుత నీదాసులు యెదురులేనివారు యేకాంగవీరులు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 19 | 2:109 | సకల బలంబులు నీవే సర్వేశ్వర నాకు | విను నీదాసుల సేవే వెనుబలిమిదె నాకు |
| 20 | 2:114 | నిర్మలులు వీరు నిత్యసుఖులు | నిర్మలులు వీరు నిత్యసుఖులు కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు |
| 21 | 2:161 | ఊరకైతే నిన్నుఁ గాన మొకకారణానఁ గాని | నీకంటే మాకుఁ జూడ నీదాసులే మేలు పైకొని వారున్నచోటఁ బాయకుందువు |
| 22 | 2:207 | అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు | తిరమైన మహిమతో దివ్యతేజముతోడ అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు |
| 23 | 2:216 | కలశాపురముకాడఁ గాచుకున్నాఁడు | శ్రీవేంకటేశుఁ గొల్చి శిష్టరక్షణమునకై వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు |
| 24 | 2:218 | ఇతఁడు రామునిబంటు యితని కెవ్వ రెదురు | ఇతఁడు రామునిబంటు యితని కెవ్వ రెదురు చతురత మెరసె నిచ్చట హనుమంతుఁడు |
| 25 | 2:223 | మతంగపర్వతమాడ మాల్యవంతము నీడ | చిరజీవి యీతఁడా జితేంద్రియుఁ డితఁడా సురల కుపకారపుచుట్ట మీతఁడా |
| 26 | 2:249 | అన్నిటా నీ పెంపు వింత హనుమంత నీ | అన్నిటా నీ పెంపు వింత హనుమంత నీవున్న చోటు నిశ్చింత మో హనుమంతా |
| 27 | 2:250 | మగటిమిగల హనుమంతరాయ | తమితోడ దాసులను తప్పక కాచేనని అమర నభయమిచ్చిన హనుమంతుఁడా |
| 28 | 2:347 | శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు | హనుమంతరాయ అంజనాతనయా ఘనవాయుసుత దివ్యకామరూప |
| 29 | 2:350 | ఏమని నుతించవచ్చు నితనిరూపము | భీమవిక్రముఁ డితఁడు పెద్ద హనుమంతుఁడు |
| 30 | 2:449 | కానవచ్చె నిందులోన కారుణ్యనరసింహో | సారె నీశరణాగతిజనుని కాధీనమైతి వీరీతి నీదాసునికే యిదివో మొక్కేము |
| 31 | 2:452 | అందాఁకాఁ దాఁ దానే అంత కెక్కుడు గాఁడు | శ్రీవేంకటేశ్వరుదాసుఁ డాయనా బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు |
| 32 | 3:23 | అచ్చుత మిమ్ముఁ దలఁచే యంతపని వలెనా | కందువ శ్రీవేంకటేశ కడు నీ బంటుబంటుకు సందడిబంట నవుటే చాలదా నాకు |
| 33 | 3:34 | ఇహముఁ బరముఁ జిక్కె నీతని వంక | ఇహముఁ బరముఁ జిక్కె నీతని వంక అహిశయుని దాసులంతవారు వేరీ |
| 34 | 3:42 | ఎందరైనఁ గలరు నీ కింద్రచంద్రాదిసురలు | అచ్చపు నీదాసులు అనంతము వారలకు రిచ్చల నేనొక పాద రేణువ నింతే |
| 35 | 3:49 | నీవే నేరవుగాని నిన్నుఁ బండించేము నేము | దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు |
| 36 | 3:51 | నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు | వేంకటేశ మాకొకవుపాయము గద్దు పట్టి నీదాసుల బంటుబంట నయ్యేనిఁకను |
| 37 | 3:119 | కనకము కనకమే కడు నినుమినుమే | భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు చేగదేర వారలు సేసినదే చేఁత |
| 38 | 3:138 | అన్నిటా నేరుపరి హనుమంతుఁడు | ముట్టిన ప్రతాపపు రాముని సేనలలోన అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 39 | 3:143 | అంజనాతనయుఁడైన హనుమంతుఁడు | ఉదయాస్తశైలముల కొక్కజంగగాఁ జాఁచి అదె సూర్యుతోఁ జదివె హనుమంతుఁడు |
| 40 | 3:144 | అవధారు దేవ హరికులరామ | అదె కలశాపురము హనుమంత రాయఁడు కదనములోన రక్కసులఁ గొట్టి యెదుట నిందరిలోన నేకాంగవీరుఁడై |
| 41 | 3:148 | మొక్కరయ్య అన్నిటికి మూల మీతఁడు | అదె కలశాపుర హనుమంతుఁడు వుదయార్కు ఫలమని వొగ్గుచున్నాఁడు |
| 42 | 3:180 | వెన్న చేతఁబట్టి నేయి వెదకనేలా | నీ దాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె వేదతో వేరొక చోట వెదకనేలా |
| 43 | 3:232 | కొలిచినవారికిఁ గొమ్మని వరములిచ్చీ | పసగా శ్రీవేంకటేశ బలు నీ బంట్లలోన రసికుఁడు కలశాపురము హనుమంతుఁడు |
| 44 | 3:301 | మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు | మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు |
| 45 | 3:302 | ఘనుఁడాతఁడా యితఁడు కలశాపురము కాడ | ఘనుఁడాతఁడా యితఁడు కలశాపురము కాడ హనుమంతుఁ డితఁడా అంజనాతనయుఁడు |
| 46 | 3:368 | నరహరి నీ దయమీఁదట నా చేఁతలు గొన్నా | నరకపు వాకిలి మూసిరి హరి నీదాసులు తెఱచిరి వైకుంఠపురము తెరువుల వాకిళ్ళు |
| 47 | 3:421 | శరణు కపీశ్వర శరణం బనిలజ | శరణు కపీశ్వర శరణం బనిలజ సరవి నెంచ నీ సరి యిఁక వేరీ |
| 48 | 3:473 | నీ దాఁకా వలెనా నిచ్చలు నారాయణా | నీ దాఁకా వలెనా నిచ్చలు నారాయణా ఆది నీ దాసుఁడే చాలు నందరి రక్షించను |
| 49 | 3:490 | ఇదె చాలదా మమ్ము నీదేర్చను | ఇట్టె పంచసంస్కారా లెచ్చోట నుండినాను పట్టెనవారే మాకుఁ బ్రమాణము |
| 50 | 3:500 | అదివో నీప్రతాపము హనుమంతా | అదివో నీప్రతాపము హనుమంతా యెదురులేదు నీకు నెక్కడా హనుమంతా |
| 51 | 3:503 | పంతగాఁడు మిక్కిలి బంటతనమునను | నీరధి చంగన దాఁటి నెట్టన లంకచొచ్చి శ్రీరాము నుంగరము సీతకిచ్చి |
| 52 | 3:519 | వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన | ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటైనవాఁడు తక్కక లోకములెల్లా దయఁ గాచేవాఁడు |
| 53 | 3:521 | కలశాపురముకాడ గంధపుమాకుల | దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి మిక్కిలి ప్రతాపాన మెరసితివి |
| 54 | 3:522 | అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా | అట లంక సాధించిన హనుమంతుఁడ చటుల సత్త్వసమేత జయ హనుమంతుఁడ |
| 55 | 4:66 | ముందే తొలగఁవలె మోసపోక సంగమెల్ల | ధారుణి శ్రీవేంకటేశుదాసులసంగతి నుంటే పోరచి నే జీవులైనఁ బుణ్యులుగాకుందురా |
| 56 | 4:85 | ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు | ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు వొక్కఁడే నిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు |
| 57 | 4:86 | పరమవైష్ణవుల భాగ్యంబిదివో | పరమవైష్ణవుల భాగ్యంబిదివో నిరతి వారలకె నే మొక్కెదను |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 58 | 4:98 | నీవే నీదాసులని నిను గంటిఁ గంటిని | నీకింకరుల సేవే నీవు మెచ్చునిజసేవ.. నిందలేని నీదాసులే నీవని సేవింతును |
| 59 | 4:122 | ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము | కడు నీ పాదతీర్థము కడగన్నవారెవ్వరు బడిబడి నీ భక్తపాదజలమువలె |
| 60 | 4:141 | ఆతడాఁ యీతఁడు పెద్దహనుమంతుఁడు | సీతాదేవి యానవాలు శ్రీరామునికి నిచ్చి నీతి విభీషణుని మన్నించఁజేసి |
| 61 | 4:145 | హరికి లంకిణీహంత కంతర మిట్టున్నది | శ్రీవేంకటేశుఁడు చిన్మయమూర్తి తాను కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్పహనుమంతుఁడు |
| 62 | 4:155 | అందరికి నెక్కుడైన హనుమంతుఁడు | అందరికి నెక్కుడైన హనుమంతుఁడు అందుకొనె సూర్యు ఫలమని హనుమంతుఁడు |
| 63 | 4:158 | ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నవాఁడు | పన్నుగడై రాఘవునిబంట్లలోపలనెల్లా పెన్నిధియై యున్నవాఁడు పెద్దహనుమంతుఁడు |
| 64 | 4:167 | పదియారు వన్నెల బంగారుకాంతులతోడ | యెడమచేతఁ బట్టె నిదివో పండ్లగొాల కుడిచేత రాకాసిగుంపుల గొట్టె |
| 65 | 4:185 | వైష్ణవులసొమ్ము నేను వారు నీ సొమ్ములింతే | నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన తఱి నీదాసులకే నే దాసుఁడగాక |
| 66 | 4:192 | హరియవతారమె ఆతఁ డితఁడు | తిరమై యాళువారల తేజము దానైయుండు గరుడానంతముఖ్య ఘనులంగడిని |
| 67 | 4:199 | పరమోపకారులు ప్రత్యక్షదైవములు | పరమోపకారులు ప్రత్యక్షదైవములు హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము |
| 68 | 4:219 | హరిదాసులే మాకు నడ్డమై కాతురు గాక | హరిదాసులే మాకు నడ్డమై కాతురు గాక శరణంటి వారికి నే సకలోపాయములు |
| 69 | 4:225 | బంటుకు బంటవుదురా పాపముగాక | నీ బంటుకు బంట్లమై బదికేము నేము |
| 70 | 4:243 | హరి నీవు లేవా అన్నిచోట్లను తొల్లి | నుతించి మాటాడితిమి నోరారా నీదాసులను మతిఁజొక్కితిమి దాస్యమహిమచేత |
| 71 | 4:272 | అంజినీదేవికొడుకు హనుమంతుఁడు | వుద్దవిడి లంకచొచ్చి వుంగరము సీతకిచ్చి అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు |
| 72 | 4:273 | పంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు | పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి యేలికముందరఁ బెట్టె యీ పవనుజుఁడు |
| 73 | 4:278 | అటిముటి హనుమంతుఁ డట్టిబంటు | యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు తాలిమిగలిగిన యాతఁడే బంటు |
| 74 | 4:327 | ఓ పవనాత్మజ వో ఘనుఁడ | వో దశముఖహర వో వేంకటపతి పాదసరోరుహపాలకుఁడా |
| 75 | 4:413 | చెల్లె నీ చేఁతలు నీకే చేరి మేడెగుడి దిన్న | చెల్లె నీ చేఁతలు నీకే చేరి మేడెగుడి దిన్న నల్లదె కంటిమి నిన్ను హనుమంతురాయ |
| 76 | 4:419 | కలిగె మాకిదె కైవల్యసారము | శ్రీ వేంకటేశ్వర చేరి నీ దాసుల సేవ నా పాలిఁటి జీవనము |
| 77 | 4:443 | ఇతఁడే యతఁడు గాఁబో లేలిక బంటును | కంజాప్తకులరామఘనుఁడు దానును దయాపుంజమాయ మంగాబుధి హనుమంతుడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 78 | 4:444 | మంగాంబుధి హనుమంతుని | జలధిదాఁట నీ సత్వము కపులకు నలరి దెలిపతివి హనుమంతా |
| 79 | 4:458 | ఆంజనేయ యనిలజ హనుమంత | రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ బ్రేమముతో మగుడను బెండ్లాడెను |
| 80 | 4:459 | ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే | ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష |
| 81 | 4:462 | ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవమౌనా | బలిమి శ్రీ వేంకటేశు బంటై మంగాంబుధి నిల యీ హనుమంతుని కెదురా లోకము |
| 82 | 4:467 | కలశాపురముకాడ కందువ సేసుకొని | నిండు నిధానపు లంక నిమిషాన నీరుసేసె మండిత మూరితి హనుమంత రాయఁడు |
| 83 | 4:470 | అరుదీ కపీంద్రుని యధికప్రతాపము | నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము పిక్కటిల్లఁ బెరిగెను పెద్ద హనుమంతుఁడు |
| 84 | 4:483 | తలఁచరో జనులు యీతని పుణ్యనామములు | హనుమంతుడు వాయుజుఁ డంజనా తనయుఁడు వనధి లంఘన శీల వైభవుఁడు |
| 85 | 4:486 | బిరుదు బంటితఁడు పెద్దహనుమంతుడు | మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు వాఁడె హనుమంత దేవరఁ జూడరో |
| 86 | 4:490 | అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె | రామ నీ సేవకుఁ డిదె రణరంగ ధీరుఁడు ఆముకొన్న సత్వగల హనుమంతుఁడు |
| 87 | 4:493 | ఈతని దెంతప్రతాప మీతని దెంతవుదుటు | ఈతని దెంతప్రతాప మీతని దెంతవుదుటు యీతఁడు రామునిబంటు యీతని సేవించరో |
| 88 | 4:499 | సరిలే రితనికి సాహస విక్రముఁ డీ | వుదధి లఘించినాఁడు వుబ్బున మైనాకముచే పొదలి నట్ట నడుమఁ బూజ గొన్నాఁడు |
| 89 | 4:501 | ఎంతని పొగడవచ్చు నితని ప్రతాపము | చేతులనే పెరికి సంజీవి కొండ దెచ్చినాఁడు ఆతఁడువో తొల్లి పెద్ద హనుమంతుఁడు |
| 90 | 4:506 | ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో | ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో పొంత నిదే కలశాపుర హనుమంతుఁడు |
| 91 | 4:509 | అదె చూడరయ్యా పెద్దహనుమంతుని | అదె చూడరయ్యా పెద్దహనుమంతుని గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా |
| 92 | 4:525 | వీఁడివో కలశాపుర వీరహనుమంతుడు | యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు చెప్పఁగొత్తైనమహిమ జెన్నొందువాఁడు |
| 93 | 4:528 | పెరిగినాఁడు చూడరో పెద్దహనుమంతుఁడు | పెరిగినాఁడు చూడరో పెద్దహనుమంతుఁడు పరగి నానావిద్యల బలవంతుఁడు |
| 94 | 4:540 | చండప్రచండాది జయ విజయులన్ | చండప్రచండాది జయ విజయులన్ అండఁ బూజించి హరి కటుగదా పూజ |
| 95 | 4:598 | నెరబిరుదిన్నిటాను నీ బంటు | ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు నెమ్మన మలరిన నీ బంటు |

## 7. తామస భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:172 | ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను | యెంతటి పదవులైన నిట్టె యిచ్చు |
| 2 | 2:213 | తనలోనుండిన హరి దాఁ గొలువఁడీ దేహి | యిట్టె యక్షిణిఁ బంపు సేయించుకొనే యాసలను వొట్టి జీవహింసలకు నొడఁబడును |
| 3 | 2:293 | ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన | పగటున మీరిచ్చు వరములకొరకే పలుమారు మీకు మొక్కుకొందును |
| 4 | 3:418 | దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు | కామధేనువులు పెక్కుగాచే కృష్ణుఁడవట కామించి నీ బంటనట కమ్మి నిన్నుఁ దలఁచితి నేమి మాకుఁ గడమయ్య యిందిరారమణా |
| 5 | 4:388 | నారాయణ నీ నామమె గతి యిఁక | నారాయణ నీ నామమె గతి యిఁక కోరికలు నాకుఁ గొనసాగుటకు |
| 6 | 4:454 | నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ | నీవాఁడనని నన్ను నిందించే శత్రువును చావఁగొట్టి వానినిట్టే సంహరించవే |

## 8. వైరాగ్య భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:225 | ఏది కడ దీని కేది మొదలు | కదిసి వేంకటపతిఁ గనుట యెన్నఁడు తుదలేనిభవములఁ దొలఁగు టెన్నఁడు |
| 2 | 1:243 | నిగమనిగమాంతవర్ణిత మనోహరరూప | దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యం బియ్య నోపకకదా నన్ను నొడఁబరుపుచు |
| 3 | 1:352 | కాయము జీవుఁడు గలనాఁడే తెలియవలె | శ్రీవేంకటేశునిఁ జేరి తక్కినసుఖమేవగించు కాలమెన్నఁడు |
| 4 | 1:406 | శ్రీహరిసేసిన చిహ్నాలివి | కలిగినదేది కదులేందేది చలనపు మాయలజన్మమిది |
| 5 | 1:416 | తెలియరాదు మాయదేహమా మమ్ము | తెలివినిద్రలుగల దేహమా నీ పొలము పంచభూతాలపొత్తు దేహమా |
| 6 | 2:74 | నమ్మిన దొకటే నాకు నీశరణము | యేఁటికర్మము నా కేఁటిధర్మము..నాఁటకపు తొంటివారు నడిచిన మార్గమని<br>యీఁటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు |
| 7 | 2:370 | ఆరసి వేరొకచో ముక్తుదుగఁగవలదు | నాముల దేహభిమానపు ముక్తే ముక్తి పామెడి కోరికలసంపద ముక్తే ముక్తి |
| 8 | 2:397 | ఇందుకా కోరి పుట్టె యిట్టి బదుకు | బడబాగ్ని ఆఁకటిబారిఁబడ్డ బ్రదుకు పడఁతులకూటములఁ బడ్డ బదుకు |
| 9 | 3:22 | ఇతర చింత లిఁక నేమిటికి | అతిదుఃఖకరము లాసలు సతత సుఖకరము సమవిరతి<br>గతి యలమేల్మంగతో శ్రీవేంకట పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు |
| 10 | 3:218 | తప్పించుకోరా దిఁక దైవమే గతి | తప్పించుకోరా దిఁక దైవమే గతి యెప్పుడు నుద్ధరించేవా రెవ్వరును లేరు |
| 11 | 3:221 | కరుణానిధి నీవే కనుఁగొంచునున్నాఁడవు | శ్రీవేంకటేశ్వర యెందునూ నీవే కాక యేది గతి యిఁకను |
| 12 | 3:328 | కలిమిలేములెల్లా కాలము స్వభావము | మక్కువ సంసారము మాయలస్వభావము చిక్కి కన్నవారికెల్లా మొక్కుకోనేలా తక్కక రక్షించేది దైవము<br>స్వభావము నిక్కపు వైరాగ్యము నిలుచుట వొకటే |
| 13 | 3:362 | దైవమా యేమి సేతు తలఁప నీవే దిక్కు | దైవమా యేమి సేతు తలఁప నీవే దిక్కు వినవా యీ దేహము విరసపు హేయమౌట విననా జిగురుఁ<br>గండె విడిపించరాదు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 14 | 3:389 | చంకగుదియ యిదే శరణార్తి నే నిదే | తగు సంసారము తనువునఁ బెనఁగీ వెగటై మోక్షము వెదకేను |
| 15 | 3:444 | తనిసితి మిన్నిటి తగులేలో | మనసూ రోసితి మరులూఁ బాసితి..శరణఁ జొచ్చితి జయముల హెచ్చితి |
| 16 | 3:576 | నానాఁటి బదుకు నాఁటకము | పుట్టుటయు నిజము పోవుటయు నిజము నట్టనడిమి పని నాఁటకము |
| 17 | 4:3 | అచ్చుతు శరణమే అన్నిటికిని గురి | యోనిజనకమగు యొడ లిది.. యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁడే<br>వెరవని కంటే వెలితిఁక నేది |
| 18 | 4:108 | అతని భజియించరో ఆతుమలాల | సాహస సంసారమే నిస్సారము సుండి ..<br>శ్రీవేంకటేశు నోపి శరణని మనేదక్కటే సుండి |
| 19 | 4:343 | ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు | పాసినఁ బాయపు బంధములు ఆస దేహమున్నన్నాళ్ళు<br>సకలము నీవే శరణంటే యిఁక వికటములణఁగెను వేడుకనాళ్ళు |
| 20 | 4:369 | ఇదియే వేదాంత మిందుకంటె లేదు | విరతియే లాభము విరతియే సౌఖ్యము విరతియే పో విజ్ఞానము |
| 21 | 4:481 | వట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము | వట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము నెట్టుకొని వివేకింప నేరవలెఁ గాని |

## 9. రాజస భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 2:304 | ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును | నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను గాఁటాన దొరనంటా గర్వింతు నేను |

## 10. నిర్మల భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:155 | శ్రీమన్నారాయణ | నీ శ్రీపాదమే శరణు |
| 2 | 1:370 | ఎట్టు వేగించే దిందుకేగురే సిత్తరకాండ్లు | యిల్లిదె నీ శరణంటి మిందరిని గావవే |
| 3 | 1:443 | కంటినిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి | శ్రీవేంకటేశుఁ దగిలి శరణుచొచ్చి నిర్మలాన నుండుకంటే నిశ్చయము లేదు |
| 4 | 1:466 | మొదలుండఁగొనలకు మోచి నీళ్ళుపోయనేల | శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి |
| 5 | 1:499 | ఎట్టయినాఁ జేయుము యింక నీచిత్తము | ఇదె సందడి హరి నీ శరణాగతుఁడ |
| 6 | 2:15 | పెట్టిన నీ వెఱుఁగుదు పెనుదిక్కు | జట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి |
| 7 | 2:240 | మాయ కిదె సహజము మాయను గెలువరాదు | చలపట్టి యీతనినే శరణని కొలిచితే యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడై రక్షించును |
| 8 | 2:263 | నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను | పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ జట్టిగొనుకొరకు నీశరణను టింతే |
| 9 | 2:265 | నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి | పాయపు టలమేల్మంగపతివి శ్రీవేంకటేశ యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ |
| 10 | 2:367 | పరమపురుష నిరుపమాన శరణు శరణు రే | పరమపురుష నిరుపమాన శరణు శరణు |
| 11 | 2:395 | హరి నీవే బుద్ధి చెప్పి యాదరించు నా మనసు | శ్రీవేంకటేశ కావవే నామనసు సరి నీయానతి నీకే శరణనీఁ గాక |
| 12 | 2:423 | నారాయణాచ్యుతానంత గోవింద హరి | నారాయణాచ్యుతానంత గోవింద హరి సారముగ నీకు నే శరణంటినే |
| 13 | 2:434 | ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను | ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను యిట్టే నీకు శరణంటి నిదియే తెరఁగు |
| 14 | 2:458 | నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు | వేడుక నీశరణంటి విడిపించు మీమాయ |
| 15 | 3:6 | వెట్టివాఁడ వెట్టివాఁడ వినియుఁ గనియుఁ మరి | శ్రీవేంకటేశుఁడ నేను చేరి నీకు శరణంటి దేవుఁడవై కావఁగా నే దిద్దుకొనేఁ గాక |
| 16 | 3:26 | అద్దిరా వోయయ్య నేనంతవాఁడనా | గట్టిగా శ్రీవేంకటేశ కదిసి నీ శరణంటి |
| 17 | 3:159 | సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే | సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే |
| 18 | 3:172 | హరి నిను నెరఁగని యలమటలింతే శాయ | శరణంటి నిదె నీకే సర్వేశ కావవే |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 19 | 3:176 | అమ్మే దొకటియును అసిమలోని దొకటి | ననిచి శ్రీవేంకటేశ నాఁడే నీకు శరణంటి వెనక ముందెంచక నీవే కావవయ్యా |
| 20 | 3:177 | వెఱ్ఱి దెలిసి మరియు వేఁదురు దవ్వేము నేము | ముఱ్ఱుఁబాల మంకువాఁడ మూలమా శరణు |
| 21 | 3:231 | విశ్వరూప నీ మూర్తి వివేకించలేను నేను | శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము శరణు చొచ్చితిమిఁక చనవిచ్చి కావుమీ |
| 22 | 3:263 | వానివాని సహజము వద్దననేల | సావధానాన నీతని శరణనుకొంటేఁ జాలు యే విధులు భవములునేమి సేయఁగలవు |
| 23 | 3:275 | జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు | సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను |
| 24 | 3:311 | సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను | సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ నిన్ను మరిగి శరణంటిని మన్నించవయ్యా |
| 25 | 3:330 | ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరివీకులై | నవ్వుచు నీ శరణంటి నన్నుఁ గావవయ్యా |
| 26 | 3:410 | నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య | నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య పైకొని శ్రీహరి నీవే పరిహరించవే |
| 27 | 3:458 | అంతర్యామీ వో అంతర్యామీ | చేచేత శ్రీవేంకటేశ చేరి నీకు శరణంటి |
| 28 | 3:497 | పంచేంద్రియములాల పంచభూతములాల | కొంచక శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి |
| 29 | 3:498 | అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు | అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు |
| 30 | 3:547 | ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి | ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి తొట్టిన నా బ్రదుకుకుఁ దుదయు లేదు |
| 31 | 3:575 | నీవెటు దలఁచిన నిఖిలము నట్టొ | శ్రీవేంకటేశ్వర ఆదె నిను శరణంటిమి గొంత |
| 32 | 4:61 | ఊలు దింటా మలిగండ్లాఅడి రాసిగా నేరేము | నిక్కి శ్రీవేంకటపతి నీకు నేనే శరణంటి గక్కన నీజీవమును గరుణింతుగాక |
| 33 | 4:79 | జీవములు దవ్వువోయ చీమలునుఁ బుట్టచొచ్చె | శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను భావపుబంధములాల పారరో |
| 34 | 4:112 | హరి నీవే సకలలోకారాధ్యుఁడవు | ధర నీకు శరణంటీ తలఁపిదే చాలును |
| 35 | 4:128 | గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ | యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే |
| 36 | 4:143 | వాసుదేవ నీవు నెలవరివి మగుడనేల | శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో పొంచి నీకు శరణంటి బోధించవయ్యా |
| 37 | 4:150 | ఇందుకేది వుపాయమో యీశ్వర నీకే తెలుసు | అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి జట్టిగొని నీపాదాలే శరణంటిని |
| 38 | 4:189 | పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు | కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి మానిసి నింతే యెట్టు మన్నించీనో |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 39 | 4:230 | ఊరకే నోరుమూసుక వొంటి నీకు మొక్కేమయ్య | శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము |
| 40 | 4:254 | హరినే యడుగరో ఆమాఁట | యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి చాయల నితనికి శరణంటిమి |
| 41 | 4:265 | ఎందరి వెంటల నేఁగేము | ఎందరి వెంటల నేఁగేము చందపు హరి నీ శరణనియెదము |
| 42 | 4:268 | అల బ్రహ్మాదుల కణఁగ దిది | శ్రీవేంకటేశుఁడ జిగి నీ శరణని దీవెనఁ బొందితి దేహపుగుణము |
| 43 | 4:292 | చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా | సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా |
| 44 | 4:456 | పుట్టఁగా బుట్టిన నా భోగపుటాస | కందువ శ్రీ వేంకటేశుఁ గని శరణంటి నేను పందతనమొల్ల నింక బదుకవో యాసా |

## 11. నిజ భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:83 | ఎందుఁబొడమితిమో యెఱఁగము | గాఁటకపుకమలజుఁ గాఁచినయీ నాఁటకుడే మా నమ్మినవిభుఁడు |
| 2 | 1:353 | అతఁడే సకలవ్యాపకుఁడతఁడే యాతుర | అతఁడే సకలవ్యాపకుఁడతఁడే యాతురబంధువు |
| 3 | 1:371 | తప్పదు తప్పదు దైవము కృప యిది | శ్రీవేంకటపతిసేవే కలిగిన వేవేలువగలు వేడుకలే చేవదీరె సందియము లేదిదే |
| 4 | 1:442 | కలిగినది యొక్కటే కమలాపతిసేవ | హరియే పరతత్వ మతఁడొక్కఁడే గతి ధరలోన దేవతలెందరైనాఁ గలుగనీ |
| 5 | 1:470 | అన్నిటికిఁగారణము హరియే ప్రపన్నులకు | దేవుఁడు వేరే కాఁడు దిక్కు శ్రీవేంకటేశుఁడే |
| 6 | 1:497 | ముంచిన వేడుక తోడ మొక్కుటగాక | ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీ పాదములు |
| 7 | 1:498 | అంచితపుణ్యులకైతే హరి దైవమవుఁగాక | యిరవై మాకు శ్రీవేంకటేశుఁడే దైవము |
| 8 | 2:131 | ఇహమే కాని యిఁకఁ బరమేకాని | ఇహమేకాని యిఁకఁ బరమేకాని బహుళమై హరి నీపై భక్తే చాలు |
| 9 | 2:132 | సర్వోపాయముల జగతి నాకితఁడే | సర్వోపాయముల జగతి నాకితఁడే పుర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే |
| 10 | 2:202 | నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని | గతియై రక్షింతువో కాక రక్షించవోయని మతిలోని సంశయము మఱి విడిచి |
| 11 | 2:212 | మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు | శరణంటే శ్రీవేంకటేశ్వరుఁడు రక్షించును పరగ సంశయించితే పాషండుఁడౌను |
| 12 | 2:406 | గొరబై మొదలుండఁగఁ గొనలకు నీరేల | దొరదైవ మితఁడే తుదఁగల ఫలము |
| 13 | 3:254 | వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణు | వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణు డొఁకడేకాక<br>అనుమానములన్నియు నుడిగితిని అలసితి నిఁక నేను |
| 14 | 3:259 | ఇంతకంటె ఘన మిఁక లేదు | ఇంతకంటె ఘన మిఁక లేదు సంతతసౌఖ్యము జనార్దనుఁడే |
| 15 | 4:152 | మఱి తనుభోగములు మాయావిలాసములు | అనిశము నీకొలువు అది యొకటే నిజము నినుఁదలఁచుటొకటే నిజము |
| 16 | 4:239 | తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని | తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని యెల్ల సందేహాలు<br>బాసె నిఁకనేల చింత |

## 12. మధుర భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:369 | అతనికెట్ల సతమైతినో | మేలిమిపతితో మెలఁగుటేదో నేనేలో |
| 2 | 2:290 | ఎంత వలచితివయ్యా యింతికి | చెలి నీపైఁ జిగురాకు చిదిమివేసితేను వలరాజడిదమని వంచించితివి |
| 3 | 2:291 | ఎంతలేదు నీబత్తి యెరఁగరా యిందరును | పొరుగాపెపై వలపు పూనేవు నామీఁద వరుసల వద్ది కాపె వచ్చుదాఁకాను |
| 4 | 2:292 | ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు | వెలఁదుల కాఁగిళ్లు విడిదిండ్లవంటివి చలముల నీ రతులు సలిపేవేళ |

ఇవి 1–4 సంపుటాలలో ఉన్న మధుర భక్తి పూరిత కీర్తనలు మాత్రమే. 5,6 సంపుటాలలో ఉన్నవి దాదాపుగా మధుర భక్తి సంకీర్తనలే. కనుక ఇక్కడ పట్టికలో ఇవ్వడం లేదు.

## 13. వాత్సల్య భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 1:57 | విడువమనవో రోలు | వన్నెలనీకోప మింత వద్దు నీకు నీయాన కన్నుల నవ్వుల ముద్దుగారీ నీబాలుడు |
| 2 | 2:65 | ఈడనుండె నిందాఁకా నింటి ముంగిట | మనకృష్ణుఁడట యింతేకాక యెవ్వరున్నా రిటువంటి పాపఁడు |
| 3 | 3:416 | బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో | బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో విహగగమన నాకు వెరగయ్యీ నిందుకే |
| 4 | 4:551 | ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు | ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు – వాని బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలు వోయరే |
| 5 | 5:97 | ఉగ్గు వెట్టరే వోయమ్మా | కడుపులోని లోకమ్ములు గదలీ నొడలూఁచకురే వోయమ్మా |
| 6 | 5:148 | ఇట్టిముద్దులాఁడిబాలుఁ డేడవాఁడు | గామిడై పారితెంచి.. చీమ గుట్టెనని తనచెక్కిటఁ<br>గన్నీరు జార వేమరు వాపోయె వాని వెద్దువెట్టరే |
| 7 | 5:246 | ఉయ్యాలా బాలు నూఁచెదరు | బాలయవ్వనలు పసిఁడివుయ్యాల బాలునివద్దఁ బాడేరు<br>లాలి లాలి లాలి లాలెమ్మ |
| 8 | 5:247 | సారెకు నంటకురే జడనందురు | బాయిటఁ బెట్టకురే పక్షులు పారెడిపొద్దు<br>వోయమ్మ బాలులకు నొప్పదందురు |
| 9 | 5:253 | కానరటె పెంచరటె కటకటా బిడ్డలను | బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు<br>మీయిండ్లు జతనాలు మీరుసేసికొనక పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని |
| 10 | 5:345 | అప్పమైన నీయరే యమ్మలాలా | వేఁకువజాముననుండి వెయిమారులారగించు నాఁకటికోరువలేఁడమ్మలాల |
| 11 | 6:1 | చిన్ని శిశువూ చిన్ని శిశువూ | ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల..<br>గద్దించి యశోద మేనుఁ కౌఁగిలించు శిశువూ |
| 12 | 6:114 | అందుకే వెఱచేనో యమ్మలాలా తన | కమ్మని నేతులును గడ్డల జున్నులును..అమ్మరో వ్రేళ్లు పొక్కి అగ్గిదాఁకి బిడ్డఁడు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 13 | 6:144 | మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడె | మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడె ముత్తెమువలె నున్నాఁడు ముద్దులాఁడు |

## 14. వైర భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 2:160 | వారిదే పో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి | రమణుఁ గంసాది యసురలు లూటి సేయఁగాఁగా తమిఁ గృష్ణావతార మిందరి కైతివి |
| 2 | 2:405 | ఇతని కితఁడేకాక యితరులు సరియా | కమలనాభుని భయంకరకోపముతోడ రమణ వేరొకరివరంబులు సరియా |
| 3 | 3:529 | దనుజులు గనిరి తత్వమిది | పోదిఁ బరస్తుతి పుణ్యముకంటే పాదుగ హరిఁ దిట్టే పాపము మేలు |

## 15. అనన్య భక్తి

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|
| 1 | 2:483 | కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు | కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు |

## 16. ఇతర భక్తి మార్గాలు

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గం | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 1 | 4:522 | గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె | దేవేరి కీర్తన | పాల జలధిఁ బుట్టిన పద్మాలయ యీపె |
| 2 | 1:23 | అదివో అల్లదివో | క్షేత్ర కీర్తన | అదె వేంకటాచల మఖిలవున్నతము |
| 3 | 1:227 | అదె చూడు తిరువేంకటాద్రి | క్షేత్ర కీర్తన | అదె చూడు తిరువేంకటాద్రి |
| 4 | 3:409 | విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో | క్షేత్ర కీర్తన | కొండవంటి హరిరూపు గురుతైన తిరుమల |
| 5 | 3:471 | కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ | క్షేత్ర కీర్తన | వేదములే శిలలై వెలసినది కొండ |
| 6 | 3:520 | అనిశముఁ దలఁచరో అహోబలం | క్షేత్ర కీర్తన | అనంతఫలదం బహోబలం |
| 7 | 4:29 | అనాది జగమున కౌభళము | క్షేత్ర కీర్తన | అనేకాద్భుతం బౌభళము |
| 8 | 1:183 | చక్రమా హరిచక్రమా | ఆయుధ కీర్తన | హిరణ్యాక్షుని చట్టలు చీరిన వో చక్రమా |
| 9 | 2:515 | వెడలె వెడలె నదె వీధులవీధుల | ఆయుధ కీర్తన | ప్రళయకాలముల బడబాగ్నులొలుకు చలమరి ప్రతాపచక్రము |
| 10 | 2:516 | మొక్కెద మిదివో మూఁడుమూర్తులును | ఆయుధ కీర్తన | మెండుగఁ గంసుని మెదడు గంధముగ నిండ నలఁదుకొని నిలిచెఁ జక్రము |
| 11 | 3:282 | నమో నమో దానవవినాశ చక్రమా | ఆయుధ కీర్తన | నమో నమో దానవవినాశ చక్రమా సమరవిజయమైన సర్వేశు చక్రమా |
| 12 | 2:93 | దేవశిఖామణి దివిజులు వొగడఁగ | ఊరేగింపు కీర్తన | వీదుల వీదుల వెసఁ దురగముపై భేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు<br>మోదముతోడుత మోహనమూరితి యే దెసచూచిన నేఁగీ వాఁడే |
| 13 | 2:487 | వీదుల వీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని | ఊరేగింపు కీర్తన | తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముఁడు వాఁడె |
| 14 | 3:274 | వీది వీది వాఁడే వాఁడే వీఁడే వీఁడే చెలఁగీని | ఊరేగింపు కీర్తన | వీది వీది వాఁడే వాఁడే వీఁడే వీఁడే చెలఁగీని ఆదిదేవుఁడు శ్రీవేంకటాద్రిమీఁదటను |
| 15 | 4:26 | అమరాంగన లదె యాడేరు | ఊరేగింపు కీర్తన | గరుడవాహనుఁడు కనకరథముపై యిరువుగ వీధుల నేఁగీని |
| 16 | 4:178 | కన్నులపండుగలాయఁ గన్నవారి కిందరికి | ఊరేగింపు కీర్తన | వెన్నుఁ డేఁగీ నిల్లిదివో వీధుల వీధులను |
| 17 | 4:286 | వీధుల వీధుల విభుఁ డేఁగీ నిదె | ఊరేగింపు కీర్తన | వీధుల వీధుల విభుఁ డేఁగీ నిదె మోదము తోడుత మొక్కరొ జనులు |

| సంఖ్య | కీర్తన సంఖ్య | కీర్తన పల్లవి | భక్తి మార్గం | కీర్తనలో భక్తి ప్రదర్శనం |
|---|---|---|---|---|
| 18 | 4:375 | ఆదరమ్మ పాదరమ్మ అంగనలు చూదరమ్మ | ఊరేగింపు కీర్తన | మందల పాలకొండమలకు నట్టనడుమ విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు |
| 19 | 4:561 | వాగె బలువు దైవపురాయా | ఊరేగింపు కీర్తన | వేంకటేశ తిరువీధులను సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి |
| 20 | 5:228 | చల్లనై కాయఁగదొ చందమామా | ఊరేగింపు కీర్తన | దిరుఁవేంగళేశ్వరుఁడు గడు వేడుకలతోడఁ దిరుఁ వీథులను విహరించఁగాను |
| 21 | 1:400 | దేవదేవుఁడెక్కెనదె దివ్యరథము | తేరు కీర్తన | దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకుఁ బక్కన మరలిచెఁ బుష్పకరథము |
| 22 | 2:110 | ఇదివో వీదివీదుల నీతని తేరు | తేరు కీర్తన | ఘోరమై కుంగఁగఁ దోలె కులగిరులపైఁ దేరు |
| 23 | 2:227 | మిన్నునేలా నొక్కటైన మేటితేరు | తేరు కీర్తన | కన్నులపండువయిన శ్రీకాంతునితేరు |
| 24 | 3:510 | దేవదుందుభులతోడ దివ్యులతోడ | తేరు కీర్తన | కుచ్చుల ముత్యాలతో గుంపుఁ బైఁడికుండలతో యిచ్చల భూధవు తేరు యేఁగీ వీధులను |
| 25 | 3:512 | చూడరో చూడరో నేఁడు సురలార నరులార | తేరు కీర్తన | వాయు వేగమున వచ్చె వనజాక్షు నరదము |
| 26 | 4:31 | ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు | తేరు కీర్తన | గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు |
| 27 | 4:35 | అప్పుఁడైన హరి యెక్కె నదివో తేరు | తేరు కీర్తన | సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు |
| 28 | 4:55 | నానావర్ణముల నడగొండవలెను | తేరు కీర్తన | కదలె కదలె నదె గరుడధ్వజునితేరు |
| 29 | 4:299 | నిండెను లోకములెల్ల నెరి నితని కరుణ | తేరు కీర్తన | అనిలవేగమున నదెవెడలె రథము |
| 30 | 4:320 | దేవదేవోత్తముని తిరుతేరు | తేరు కీర్తన | తిరువీధులేగీని తిరుతేరు |

# అధ్యాయం—5

# నేటి సమాజంలో

# అధ్యాత్మికత

# అధ్యాయం-5

# నేటి సమాజంలో అధ్యాత్మికత

## 5.0. పరిచయం

ఏ పరిశోధన అయినా సమాజానికి దూరంగా ఉండకూడదు. సమాజం ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి లేదా ఆ పరిశోధనవల్ల సమాజానికి ఎంతో కొంత ఉపయోగముండాలి అన్న అభిప్రాయంతో నా పరిశోధన గ్రంథానికి చివరి అధ్యాయంగా 'నేటి సమాజంలో అధ్యాత్మికత పాత్ర' నుగురించి చర్చించబోతున్నాను.

అధి + ఆత్మ = అధ్యాత్మ అంటే ఆత్మకు సంబంధించింది అధ్యాత్మికతగా నిఘంటువులు అర్థాన్ని ఇస్తున్నాయి. 'అధ్యాత్మ', 'ఆధ్యాత్మ' పదాలు సమానార్థకాలుగా వాడబడుతున్నాయి. 'నేను' అన్న భావనే ఆత్మ. ఆ 'నేను'ను గురించి తెలుసుకోవడమే ఆధ్యాత్మికత. అధ్యాత్మికత అంటే లోచూపు అని కూడా చెప్పుకోవచ్చు అంటే మనలోకి మనం తరచి చూసుకోవడం, ఏకాంతంగా లోనున్న ప్రాణస్థానాన్ని దర్శించే ప్రయత్నం చేయడం.

అసలు మనం ఎవరం? ఎందుకోసం ఈ లోకంలోకి వచ్చాం? ఏ ఉద్దేశంతో ఈ లోకంలో ఉన్నాం? ఈ లోకంలో మనం చేయదగ్గ కర్తవ్యమేమిటి? ఇతరులతో ఎలా నడుచుకోవాలి? ఈ సృష్టేమిటి? ఇది ఏ నియమాలతో నడుస్తోంది? ఈ సృష్టితో మనం ఏ విధంగా ప్రయాణించాలి? ఈ సృష్టికి కర్త ఒకడున్నాడా? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడంకూడా ఆధ్యాత్మికత అనే చెప్పుకోవచ్చు. ఇలాంటి తత్త్వచింతనే ఉపనిషత్తుల నిండా కనిపిస్తుంది.

*హరిః ఓం బ్రహ్మవాదినో వదంతి ।*

*కిం కారణం బ్రహ్మ కుతఃస్మ జాతా*

*జీవామ కేన క్వ చ సంప్రతిష్ఠా ।*

*అధిష్ఠితాః కేన సుఖేతరేషు*

*వర్తామహే బ్రహ్మవిదో వ్యవస్థామ్ ॥* (స్వామి త్యాగీశానంద. 2018:7 – [శ్వేతాశ్వతరోపనిషత్తు–ప్రథమాధ్యాయం–1వ శ్లోకం)

‘ఈ విశ్వానికి మూలకారణమేది? అది బ్రహ్మమా? మనం ఎక్కడినుండి జన్మించాం? ఎందుకు జీవిస్తున్నాం? మన లక్ష్యమేమిటి? ఎవరి నియమానుసారం మనం ఈ సుఖదుఃఖాలతో కూడిన వ్యవస్థకు లోబడి ఉన్నాం?’ అనే ప్రశ్నలతో *శ్వేతాశ్వతరోపనిషత్తు* మొదలవుతుంది.

దైవ భక్తికూడా అధ్యాత్మికతలో భాగమే అయినా కేవలం దైవభక్తే ఆధ్యాత్మికత కాదు. *కేనోపనిషత్తు* దీన్నే స్పష్టం చేస్తుంది. *నేదం యదిదముపాసతే* (స్వామి జ్ఞానదానంద. 2016[1]:10,11 – [కేనోపనిషత్తు–ప్రథమఖండం–5-9 శ్లోకాలు) – ఇక్కడ ఆరాధింపబడేది లేక ఉపాసించబడేది బ్రహ్మం కాదని తెలుసుకో అని మాటి మాటికీ చెబుతుంది *కేనోపనిషత్తు*.

“ఆకాశంలో ఒక ఫలానా నక్షత్రాన్ని చూడడానికి క్రమక్రమమైన పద్ధతిని అనుసరిస్తాం. మొదట్లో ఒక చెట్టు, చెట్టు కొమ్మ, కొమ్మ గుండా కనిపించే ప్రకాశవంతమైన నక్షత్రం, దాని సమీపంలో మనం చూడాలనుకున్న నక్షత్రం అంటూ క్రమక్రమంగా చూస్తున్నప్పుడు త్వరలో ఆ ఫలానా నక్షత్రాన్ని గుర్తించి చూడగలుగుతాం. అదే విధంగా సర్వత్రా నెలకొని ఉన్న భగవంతుని ఒక్కసారిగా ఆంతరికంగా దర్శించగోరడం అంత సులభం కాదు. అందువల్ల మొదట బాహ్యంగా ఒక విగ్రహంలోను, ఒక చిత్రంలోను ఆయనను దర్శించడానికి ప్రయత్నిస్తాం. ఆత్మ స్వరూపంగా మనలో నెలకొని ఉన్న భగవంతుని గ్రహించడానికయిన ఒక

మెట్టే మనం బాహ్యంగా చేస్తున్న ఆరాధన. బాహ్యంగా అన్వేషించి కనుగొనలేని భగవంతుణ్ణి చివరకు అంతరంగంలో వెదకి అక్కడ కనుగొన్నట్లు చెబుతారు మహాత్ములు" (స్వామి జ్ఞానదానంద. 2016[1]:12) అన్న వ్యాఖ్యానం గమనించదగ్గది. ఆత్మ సాక్షాత్కారం కోసమే బాహ్యమైన భగవదారాధన అని ఈ ఉపనిషత్తు చెబుతోంది. విగ్రహం నిగ్రహం కోసం ఏర్పరిచినది. అందుచేత, భగవంతుని విగ్రహాన్ని భక్తితో పూజించిపూజించి చివరకు ఆ భగవత్స్వరూపాన్ని స్వస్వరూపంలో దర్శించడమే భక్తికి లక్ష్యంగా చెబుతారు. కనుక భక్తి ఆధ్యాత్మికతలో ఒక భాగం మాత్రమే.

జన్మసాఫల్యం లేదా ముక్తి వైపు పయనంలో భక్తి మొదటి మజిలీ అయితే, ఆధ్యాత్మికత చరమస్థానం. భక్తి ఆధ్యాత్మికత వైపుకు తీసుకువెళ్ళాలి. ఆధ్యాత్మికతకు ఎంతో కొంత వైరాగ్యం అవసరం. ప్రతీ మనిషిలోనూ వైరాగ్య భావనలు ప్రతీ దశలోనూ కలగడం అసంభవం కనుక, భక్తిని ఆధ్యాత్మికతవైపుకు తీసుకెళ్ళే వాహనంగా చెబుతారు. కనుకనే అన్నమయ్య కీర్తనలను భక్తి కీర్తనలని చెప్పలేదు. అధ్యాత్మిక కీర్తనలు అని అన్నారు. భక్తి, వేదాంత, వైరాగ్య, జీవితానుభవ కీర్తనలన్నీ అధ్యాత్మ కీర్తనల్లోకే వస్తాయి. అలాగే, భక్తి, వేదాంతం, వైరాగ్యం, ధ్యానం, యోగం, ఆత్మచింతన ఇవన్నీ ఆధ్యాత్మికత అనే గొడుగు కిందకే వస్తాయి. అయితే, దైవ ప్రార్థనకూడా ఆధ్యాత్మికతలో భాగమే అయినా దైవంతో సంబంధం లేకుండాకూడా మనిషి ఆధ్యాత్మికంగా ఉండొచ్చు.

తనలో, ఇతరులలో ఉండేది ఒకటేనని గ్రహించి, సృష్టితో, సృష్టిలో ఉండే జీవాలతో తాదాత్మ్యం చెందుతూ, సృష్టి సౌందర్యంతో మమేకం చెందుతూ, తనకు తోచిన విధంగా నలుగురికీ సహాయపడుతూ సామరస్యంగా జీవించడం కూడా ఆధ్యాత్మికతే. ఈ మాటే *శ్వేతాశ్వతరోపనిషత్తు* కూడా చెబుతోంది.

*యదా చర్మవదాకాశం వేష్టయిష్యన్తి మానవాః ।*

*తదా దేవమవిజ్ఞాయ దుఃఖస్యాన్తో భవిష్యతి ॥* (స్వామి త్యాగీశానంద. 2018:109 – [శ్వేతాశ్వతరోపనిషత్తు–షష్ఠాధ్యాయం–20వ శ్లోకం)

'మనిషి ఆకాశాన్నే తన చర్మంగా భావించగలిగితే, అంటే సృష్టిలో ఉండే సమస్త ప్రాణులూ తానేనని భావించి, వాటికి హితకరంగా ఉండగలిగితే, దేవుడితో సంబంధం లేకుండానే సమస్త దుఃఖాలకూ అతీతమైపోతాడు.'

నిజానికి, ఆధ్యాత్మికతకూడా ఒక కళే. అది కూడా తక్కిన కళల్లాగే ఆనందాన్ని ఇస్తుంది. అయితే ఇతర కళలు తాత్కాలికానందాన్ని కలిగిస్తే, ఇది శాశ్వతానందాన్ని ఇవ్వగలిగే కళ. జీవించడం ఎలాగో నేర్పే కళ. ఈ కళ నేర్చుకున్న వారినే కాక, వారి పరిసరాల్లో ఉండే అందరినీ ప్రశాంతంగా, నిత్యానందంగా ఉండేలా చేసే ప్రత్యేకమైన కళ. నేను ఎవరు అన్న ప్రశ్నతో మొదలుపెట్టి, ప్రశ్నలన్నీ ఛేదించుకుంటూ తరువాత ప్రశ్నలు, అనుమానాలు, చివరకు ఆలోచనలే లేని స్థితికి చేరుకుంటే అనుక్షణం బ్రహ్మానందమే అంటారు ఆధ్యాత్మవిధులు. అందువల్లే ఆధ్యాత్మికతవల్ల మనోవికాసం, తద్వారా సామాజిక ప్రయోజనంకూడా కలుగుతాయి.

ఆధ్యాత్మికత మానవాభ్యుదయాన్ని కాంక్షిస్తుంది. క్రమశిక్షణను, జీవితానికో క్రమ పద్ధతిని నేర్పిస్తుంది. ప్రత్యేకించి భారతీయ సంప్రదాయంలో అధ్యాత్మికత ఒక జీవన విధానంగా పెనవేసుకుని పోయింది.

## 5.1. అధ్యాత్మికత అవసరం

ఆధ్యాత్మికత అనే అంశాన్నిగురించి చర్చించాల్సిన అవసరం ఎప్పటికంటే ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఇకపై మరింత అవసరం కలుగబోతోంది. ఇదే అవసరాన్ని గోపీచంద్

*పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా* నవలలో ఇలా చర్చిస్తారు (గోపీచంద్, త్రిపురనేని. 2009:19,20).

"పూర్వం సంఘంవేరుగా వుండేది. ఎక్కడికి అక్కడికి మానవుని వేదనను పంచుకునేవారు వుండేవారు. బంధువులు, మిత్రులు కలిసే దగ్గర దగ్గరలో బ్రతుకుతుండేవారు. వొకరినొకరు ఆదుకుంటూ వుండేవారు. కుటుంబజీవితం ఏకోన్ముఖంగా వుండేది. ఎవ్వరికి కష్టం వొచ్చినా అందరికీ వొచ్చినట్లే, ఎవ్వరికి సుఖమొచ్చినా అంతే. ఇప్పుడా పరిస్థితి లేదు.

మానవుడు కడుపు చేత్తో పట్టుకొని, స్వగ్రామం వదలి భిక్షాటనానికి బయలుదేరాడు. అవుసరంలేని వాళ్ళు కూడా భోగలాలసులై ధనార్జనకు దేశ ద్రిమ్మరులౌతున్నారు. దీని పర్యవసానం ఏమిటి? తల్లిదండ్రులు వొకచోట. పిల్లలు వొకచోట. భర్త వొకచోట. భార్య వొకచోట. తినేది వొకచోట, పండుకునేది వొకచోట ఇలా అయిపోయింది మానవుని బ్రతుకు...

అందువల్ల నేటి మానవుడు ఏకాంతజీవి అయిపోయాడు. అతనికి 'నా' అనేవాడు లేడు. బయట ఉరకలెత్తుకుంటూ ప్రవహిస్తున్న జీవితంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. ఇంటికివస్తే ఆప్యాయతకు అంగలార్చే ఏకాంతవాసం! పెల్లుబికుతూ వచ్చే ఆత్మవేదన! అతని బ్రతుకే వొక అరణ్యరోదనం అయింది." ఈ భావాలు నేటికీ వర్తిస్తాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలా చెబుతూ దానికి పరిష్కారం కూడా సూచిస్తారు (గోపీచంద్, త్రిపురనేని. 2009:21) గోపీచంద్. "అధ్యాత్మిక శక్తిని సాధించిన మానవునికి వొంటరితనం దానివల్ల పుట్టిన ఆవేదనా వుండదు."

ముండకోపనిషత్తు ఆధ్యాత్మికత వలన ఉపయోగాలు ఇలా స్పష్టం చేస్తుంది.

*భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః ।*

*క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥* (స్వామి జ్ఞానదానంద. 2016[3]:51 – [ముండకోపనిషత్తు–2వ ముండకం–2వ ఖండం–8వ శ్లోకం)

'ఉన్నతమైనది, నిమ్నమైనది అంటూ సమస్తంగా విరాజిల్లుతున్న ఆత్మను దర్శిస్తే మానసిక గందరగోళాలు తొలగిపోతాయి; అన్ని సందేహాలు సమసిపోతాయి. ప్రారబ్ధ కర్మలు నశించిపోతాయి.'

భగవంతుడు ఆనందస్వరూపుడు. ఆత్మ భగవత్స్వరూపమే కనుక అది కూడా ఆనందమయమే. ఆత్మను తెలుసుకోవడం ద్వారా మనిషి ఎప్పుడూ ఆనందంగా ఉంటాడని తైత్తిరీయోపనిషత్తు చెబుతుంది (స్వామి జ్ఞానదానంద. 2016[2]:87). ఆత్మను తెలుసుకోవడమే ఆధ్యాత్మికత అని ఇంతకుముందు చెప్పుకున్నాం. కనుక, ఆధ్యాత్మికత ఆనందాన్నిస్తుంది అని చెప్పుకోవచ్చు.

*భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి. భువ ఇతి వాయౌ. సువరిత్యాదిత్యే. మహ ఇతి బ్రహ్మణి ఆప్నోతి స్వారాజ్యమ్. ఆప్నోతి మనసస్పతిమ్. వాక్పతిశ్చక్షుష్పతిః. శ్రోత్రపతిర్విజ్ఞానపతిః. ఏతత్తతో భవతి. ఆకాశ శరీరం బ్రహ్మ. సత్యాత్మ ప్రాణారామం మన ఆనన్దమ్. శాన్తి సమృద్ధమమృతమ్. ఇతి ప్రాచీన యోగ్యోపాస్వ ॥* (స్వామి జ్ఞానదానంద. 2016[2]:38 – [తైత్తిరీయోపనిషత్తు–శిక్షావల్లి–6వ అనువాకం–3వ మంత్రం)

'ప్రకృతితో, భగవంతునితో తాదాత్మ్యం చెందడం, మనిషి తనకు తాను అధిపతి కావడం అంటే అరిషడ్వర్గాలను జయించడం, ఆనందాన్ని, శాంతిని పొందడం ధ్యానంవలన అంటే అధ్యాత్మికతవలన కలిగే ఉపయోగాలు'గా చెబుతుంది *తైత్తిరీయోపనిషత్తు*.

నేటి సగటు మనిషికి తన అవసరాలకు కావలసినవెన్నో ఉన్నాయి. కాని మానసిక ప్రశాంతతతో, సంతృప్తికరమైన జీవితం గడుపుతున్న దాఖలాలు లేవు. మనిషిలో ఏదో తెలియని ఆరాటం. ఎన్ని మెట్లు ఎక్కుతున్నా, అక్కడి వరకు చేరిన ఆనందం కాసేపే, తరువాత అక్కడి నుండి ఎక్కడ జారిపడిపోతామోనన్న భయమో, మరో మెట్టు ఎప్పుడు ఎక్కాలన్న ఆదుర్దానో నిరంతరం కనిపిస్తూ ఉంటుంది. మరి మానసిక ప్రశాంతత చేకూరేదెప్పుడు?

*రహస్యభారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ* (A search in secret India) సహా ఎన్నో అమూల్యమైన పుస్తకాల ద్వారా పాశ్చాత్యదేశాలలో భారతీయ అధ్యాత్మికతను విస్తరింపజేసిన సత్యాన్వేషి, తత్త్వవేత్త పాల్ బ్రంటన్ ఇలా అంటారు.

"Such is the insecurity of the present-day world that the few who have found security are only the few who have found their own soul, and inner peace."

(Excerpted from Paul Brunton *Notebooks* 1.2.1) (http://paulbrunton.org/notebooks/1/2)

'ఇవాళ్టి అభద్రతాపూరిత వాతావరణం ఎలా ఉందంటే, భద్రతతో ఉన్నవారంటే కేవలం ఆత్మసాక్షాత్కారం, తద్వారా మనశ్శాంతిని పొందినవారే!' ఆయనే మరో గ్రంథంలో ఆధునిక కాలపు అత్యున్నతమైన విషాదం అధ్యాత్మిక దారిద్ర్యమేనంటారు.

"The real tragedy of our time lies not so much in the unprecedented external events themselves as in the unprecedented ethical destitution and spiritual infirmity which they glaringly reveal." (Paul Brunton. 1952:8)

'మన కాలపు అసలైన విషాదం మునుపెన్నడూ లేనంత నైతిక దారిద్ర్యం, అధ్యాత్మిక దౌర్బల్యాల ఫలితమేకాని మునుపెన్నడూ చూడని అరుదైన బాహ్య పరిస్థితులు/సంఘటనల వల్ల కాదు.'

అధ్యాత్మికత మనిషికి నైతిక వర్తననుకూడా నేర్పుతుంది. నైతికతలేమికి కారణం అధ్యాత్మిక చింతన లోపించడమే అన్నది నిర్వివాదాంశం. ఒకానొక సందర్భంలో

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాథలిక్ క్రైస్తవులకు గురువు/నాయకుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ అన్న మాటలు గమనార్హం.

"Fundamentalist terrorism is the fruit of a profound spiritual poverty, and often is linked to significant social poverty," the Pope said. (http://www.bbc.com/news/world-europe-38560416 - 9th January 2017)

'అధ్యాత్మిక దారిద్ర్యపు ఫలమే తీవ్రవాదం'

నేటి మనిషి, సమాజంలో ఇతరులకు సేవ చేయడాన్ని పక్కన పెడితే, తనను తాను సంభాళించుకునే పరిస్థితిలోకూడా లేదు. ముఖ్యంగా యువత విపరీతమైన ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. పూర్వీకులు తమ ఆయుష్షును పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తే, నేటి మానవుడు తనకు లభించిన ఆయుష్షును మధ్యలోనే తుంచేసుకుంటున్నాడు. కారణాలు ఏమైనా ఈ రోజుల్లో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. తన *గీతాంజలి* అనువాదంలో చలం భక్తుడికి, అవిశ్వాసికి తేడా చెబుతారు.

"నా తల్లి ప్రేమమయి, జగజ్జనని. నేను అనుగు బిడ్డని, నాకు కావలసింది ఏమిటి? నేను లేందే ఆమె నిలవలేదు. నన్ను ప్రేమించకుండా వుండలేదు. ఆమె పెట్టే అన్నం ఆమె ప్రేమామృతం. నాకు కావలసినవన్నీ ఆమె ఇస్తుంది. ఆమె వొళ్ళో ఆడుకుంటాను. గాయం చేసుకున్నానా, కన్నీళ్ళతో నన్ను వోదార్చి మాన్పుతుంది. ఆమె వొడిలో పడుకున్న నన్ను ఆమె వూపుతో పాడుతో నిద్ర బుచ్చుతుంది" అంటాడు భక్తుడు.

"ఈ గుడ్డి సృష్టి నా సవతి తల్లి. నన్ను కొడుతుంది. తిడుతుంది. నాకు దిక్కు లేదు. కర్కశ భూయిష్టమైన ఈ ప్రపంచంలో దిక్కులేని ఏకాకిని. నా సోదరుల్ని వంచించి, దోచుకుని, వారితో పోటీపడి, పీక్కుని, నేను దాచుకోవాలి. ఎవరినీ నమ్మను. ఎవరినీ ప్రేమించను. ఈ మనుషులు నా స్వార్థానికి ఉపకరణాలు. ద్వేషంలో, మోసంలో, వారిని మించి కపటిని కావాలి, లేదా నన్ను పంపిస్తారు." అంటాడు అవిశ్వాసి. (చలం. 1992:16)

అదే సృష్టి. ఒకరి దృష్టిలో ఒకలా. మరొకరి దృష్టిలో మరోలా. ఎవరు ఎక్కువ ఆనందాన్ని, తృప్తిని, శాంతిని అనుభవించగలరో చెప్పకనే చెప్పారు చలం. ఈ సానుకూల దృక్పథమే నేటి యువతలో లోపిస్తున్నది. అధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది. బతుకుపట్ల విశ్వాసాన్ని, ప్రేమను కలిగిస్తుంది.

అధ్యాత్మిక చింతన పరిస్థితులను ఎదుర్కొనే స్థైర్యాన్ని, శక్తిని ఇస్తుంది. పరిస్థితులు ఎదురు తిరిగినప్పుడు, మనం తిరిగి ఏమీ చెయ్యలేని బలహీన స్థితిలో ఉన్నప్పుడు, పరిస్థితులను యథాతథంగా స్వీకరించే ధైర్యాన్ని ఇస్తుంది అధ్యాత్మికత. ఈ సత్యాన్ని ప్రఖ్యాత రష్యన్ రచయిత లియో టాల్ స్టాయ్ రచించిన *గాడ్ సీస్ ద ట్రూత్ బట్ వెయిట్స్* అన్న కథ ఆవిష్కరిస్తుంది. ఈ కథలో ఇవాన్ అనే యువకుడు చేయని హత్యా నేరానికి యావజ్జీవ జైలు శిక్షకు గురవుతాడు. అతని భార్యకూడా అతడు నేరం చేశాడనే అనుమానిస్తుంది. ఇక దేవుడు తప్ప నిజం తెలిసినవారెవరూ లేరని, ఆరాటం మానుకుని, దైవ ప్రార్థనలోనే స్వాంతన పొందుతూ ఉండిపోతాడు ఇవాన్.

యువకుడిగా జైలుకి వెళ్ళిన అతడికి జైలులోనే ఇరవయ్యారు ఏళ్ళు గడిపేసరికి అకాలపు వార్ధక్యం వచ్చేస్తుంది. జైలు జీవితం అతడిని మితభాషిగా, సౌమ్యుడిగా మారుస్తుంది. నిరంతరం ప్రార్థనలు చేసుకుంటూ ఆ ప్రార్థనలలోనే శాంతిని పొందుతాడు. అలా ఉండగా జైలులోకి మకార్ అనే కొత్త నేరస్తుడొకడు వస్తాడు. మాటల సందర్భంలో మకారే ఆనాడు తనను హత్యానేరంలో ఇరికించినవాడని తెలుసుకుంటాడు ఇవాన్. తెలిసిన క్షణంనుండి, అశాంతితో, ప్రతీకారేచ్ఛతో రగిలిపోతాడు ఇవాన్. అలా పక్షం రోజులు గడిచిన తరువాత జైలునుండి తప్పించుకునే ప్రయత్నంలో మకార్ సొరంగం తవ్వడం ఇవాన్ కళ్ళపడుతుంది. మరుసటిరోజున జైలు అధికారులు సొరంగాన్ని గమనించి, దాన్ని తవ్వినవారెవరో చెప్పమని మంచివాడిగా పేరుపొందిన ఇవాన్ ని అడుగుతారు. ఇవాన్ లో ఘర్షణ రేగుతుంది. చివరకు

మకార్ ని పట్టించినంతమాత్రాన తనకు ఒరిగేదేమీ లేదని, అది దైవేచ్ఛ కాదని మకార్ ని పట్టివ్వకుండా ఉండిపోతాడు. ఆ రోజు రాత్రి మకార్ ఇవాన్‌వద్దకు వచ్చి, ఆనాడు అసలు హంతకుడిని తానేనని, తనను క్షమించమని ఏడుస్తూ పశ్చాత్తాపం వ్యక్తం చేస్తాడు. తానే అసలు నేరస్తుడినని జైలు అధికారులవద్ద ఒప్పుకుంటానని, అప్పుడు ఇవాన్ ని వదిలేస్తారని మకార్ అంటాడు. అతడి పశ్చాత్తాపాన్ని చూసిన ఇవాన్, అతడిని క్షమిస్తాడు. ఇవాన్ హృదయం తేలికబడుతుంది. అతనికి స్వాంతన చేకూరుతుంది. ఇంటికెళ్ళానే కోరిక కూడా అణిగిపోతుంది. తనకు తుది ఘడియలు సమీపించాలని కోరుకుంటాడు. ఇవాన్ మాటలు వినిపించుకోకుండా, అధికారులవద్ద మకార్ తన నేరాన్ని ఒప్పుకుంటాడు. కాని, విడుదలకు ఉత్తర్వులు వచ్చేనాటికి, ఇవాన్ తుది శ్వాసను విడిచిపెడతాడు.

ఈ కథ ద్వారా ఆలస్యం జరిగినా దేవుడెప్పుడో ఒకప్పుడు న్యాయం చేస్తాడనే నమ్మకం కలిగి ఉండాలన్నది టాల్ స్టాయ్ చెప్పదలచుకున్న నీతి. కాని న్యాయం జరిగినా, జరగకపోయినా, జరిగినదాన్ని అంగీకరించడంలో, శాంతిని పొందడంలో అధ్యాత్మికత సహకరిస్తుందన్నది మాత్రం స్పష్టమవుతోంది.

## 5.2. అధ్యాత్మికత అవసరం - నిదర్శనాధ్యయనం

సాహిత్య రంగంలో ఆధునిక రచయితలుగా, నాస్తికులుగా, హేతువాదులుగా పేరెన్నిక గని జీవితపు చరమాంకంలో అధ్యాత్మికతలోనే శాంతి, సత్యాలున్నాయని కనుగొన్న చలం, గోపీచంద్ లను తీసుకుని వారివారి రచనా జీవితాలను గ్రహించి నిదర్శనాధ్యయనం చేయడం ఈ ఉపవిభాగంలో జరుగుతుంది. వారి రచనలద్వారా వారిలో క్రమపరిణామం సూచించబడుతుంది.

### 5.2.1. చలం

*మైదానం, అమీనా, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం* వంటి నవలలు, *ఓ పువ్వు పూసింది, దోషగుణం, కర్మమిట్లా కాలింది* వంటి కథలు, *పురూరవ, శశాంక, చిత్రాంగి* వంటి నాటకాలు, *స్త్రీ, బిడ్డలశిక్షణ, మ్యూజింగ్స్, ప్రేమలేఖలు* వంటి వ్యాసాలు రచించి తెలుగు ఆధునిక వచనశైలిని ప్రభావితం చేశారు చలం. సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను చలం తన రచనలలో చిత్రించేవారు. తన రచనలలో స్త్రీ స్వేచ్ఛను, ముఖ్యంగా స్త్రీ లైంగిక స్వేచ్ఛను ప్రతిపాదించారు. జీవితంలో ఒక దశలో నాస్తికుడిగా ఉన్న చలం, జీవితపు మలిదశలో రమణాశ్రమంలో చేరి ఆధ్యాత్మికత శాంతమయజీవితానికి మార్గం అని తెలుసుకున్నారు. ఈ ఉపవిభాగంలో చలం జీవితాన్ని, అయన భావ పరిణామంలోని దశలను, ఆయన రచనల ఆధారంగా గ్రహించి చర్చించడం జరుగుతుంది.

స్త్రీజనోద్ధరణకోసం కందుకూరి వీరేశలింగం పంతులు సమాజాన్ని ఎదిరించి పోరాడుతున్న కాలంలో 1894లో, మద్రాసులో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు చలం. చలం తండ్రి ఇల్లరికపుటల్లుడు. చలానికి తండ్రికి సంబంధించిన జ్ఞాపకాలంటే తండ్రి చేతిలో తిన్నదెబ్బలే. అందువల్ల చలానికి తండ్రిపట్ల ఏహ్యాభావం ఉండేది. వరసపెట్టి పిల్లల్ని కంటూ అనారోగ్యం పాలైన తల్లి పరిస్థితికూడా తండ్రిపట్ల వ్యతిరేక భావాన్ని, తల్లిపట్ల సానుభూతిని కలిగించింది. తన చెల్లెలు అమ్మణ్ణికి ఇష్టం లేకుండా జరిగిన వివాహం, తరవాత ఆమె అత్తవారింట్లో పడ్డ కష్టాలు చలాన్ని కదిలించి వేశాయి. ఈ సంఘటనలు చిన్నతనంలోనే స్త్రీజాతి పడే కష్టాల వైపుగా దృష్టి సారించేటట్టుగా చేసి, చలాన్ని స్త్రీ సానుభూతిపరుడిగా మార్చాయి.

చిన్ననాడే చలానికి ఉపనయనం అయింది. తరువాత ఎంతో శ్రద్ధగా మూడుపూటలా సంధ్యావందనం చేసేవారు చలం. దేవత ప్రత్యక్షమవ్వాలనే కోరికతో గాయత్రీమంత్రాన్ని నిష్ఠతో

ధ్యానం చేసేవారు. చలం భక్తిశ్రద్ధలు చూసి, తనను ఉద్ధరిస్తాడు, అపరకర్మలు చేస్తాడనే ఉద్దేశంతో చలం తాత అతడిని దత్తత తీసుకున్నారు. అమ్మమ్మ ఇంట్లో జరిగే పురాణ ప్రవచనాలు చలాన్ని ఆకర్షించేవి. సీత ఏడ్చి ఏడ్చి భూమాతలో ప్రవేశించిందంటే ఆ అన్యాయానికి విలవిలలాడిపోయేవారు. కౌరవులు చనిపోయిన తరువాత స్వర్గానికి, పాండవులు నరకానికి వెళ్ళారంటే సహించలేక ప్రశ్నించేవారు. ఆ ప్రశ్నించే తత్త్వం చలాన్ని చివరిదాక విడిచిపెట్టలేదు. చిన్నతనంలోనే చలానికి ఇష్టం లేకున్నా రంగనాయకమ్మగారితో వివాహం జరిగింది. స్త్రీ స్థితిలో మార్పు రావాలన్నా, ఆమెలో చైతన్యం రావాలన్నా స్త్రీవిద్యతోనే సాధ్యమని భావించి తన భార్యను చదివించాలని పట్టు పట్టారు. ఫలితంగా పెంచుకుంటున్న తాతగారికి, పిల్లనిచ్చిన అత్తమామలకు, వారి ఆస్తులకూకూడా దూరమయ్యారు.

పాఠశాలలో ఉన్నంతవరకు శ్రోత్రీయంగా ఉన్న చలం కాకినాడ కళాశాలలో చేరాక, ఆ కళాశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి వెంకటరత్నంనాయుడిగారి ప్రభావంవలన, కందుకూరి వీరేశలింగంగారి ప్రభావంవలన, బ్రహ్మసమాజంపట్ల ఆకర్షితులయ్యారు. బ్రహ్మసమాజం చూపే మానవ సౌభ్రాతృత్వం, స్త్రీస్వాతంత్ర్యం మొదలైన అంశాలు చలాన్ని ఆకట్టుకున్నాయి. అనంతర కాలంలో, విగ్రహారాధనను మానుకున్నా ఈశ్వరుడిపట్ల అమితమైన ప్రేమను కలిగి ఉండేవారు. ఈశ్వరుడిగురించి తీవ్రంగా సాధన చేస్తూ ఈశ్వర సాక్షాత్కారంకోసం పరితపించేవారు.

అయితే చలానికి గల స్త్రీ బలహీనత అతడిని క్రమంగా బ్రహ్మసమాజానికి, ఆ పై ఈశ్వరుడికికూడా దూరం చేసింది. పరస్త్రీ సాంగత్యాన్ని బ్రహ్మసమాజం నిషేధించేది. అయితే తనకంత ఆనందాన్నిచ్చేది పాపమెలా అవుతుందనే ప్రశ్న చలాన్ని తొలిచేది. బ్రహ్మసమాజం నియమాలపట్ల, క్రమంగా ఈశ్వరుడి అస్తిత్వంపట్ల చలానికి నమ్మకం సడలడం మొదలయింది.

"ఈ నీతి సాంఘికమని, దీనికి అంతరాత్మకి సంబంధం లేదని, ఇది ఈశ్వర నిర్మితం కాదని తెలిసిన కొద్దీ, ఈశ్వరుడి మీదనే విశ్వాసం వూగి సందేహాలు రావడం ప్రారంభించాయి" అంటారు (సుబ్బారావు, వావిలాల. 2011[1]:111) తన ఆత్మకథలో. బ్రహ్మ సమాజాన్ని వదిలిపెట్టిన చలం క్రమంగా ఈశ్వరుడినికూడా తన జీవితంలోనుండి తప్పించేశారు. "ఆయనెవరో నా ప్రార్ధనలు వింటాడనుకోవడం, విని నాకేదో సహాయం చేస్తాడనుకోవడం, అవన్నీ వుత్త భ్రమ అని తేలిపోయింది" అని అనుకున్నారు (సుబ్బారావు, వావిలాల. 2011[1]:113).

ఈశ్వరుడిమీద ప్రేమ కాస్తా స్త్రీవైపుకు మళ్ళించారు. స్త్రీ ప్రేమే జీవితంలో అన్నిటికంటే అభిలషణీయమైనదిగా చలం తీర్మానించుకున్నారు. కాని ఎన్నో సాంగత్యాల తరువాత స్త్రీ కూడా తాను ఆశించే శాశ్వతానందాన్ని ఇవ్వలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. "స్త్రీనించి వచ్చే ప్రేమా శృంగారాలకన్నా, గొప్పగా, నిశ్చయంగా, ఎక్కడికో నన్ను లాగుతో భగవాన్ నించి ఒక అనుభవం ఒస్తోంది. అందుకని భగవాన్ దగ్గిరికి ఒచ్చాను" అని చెప్పుకున్నారు (సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983:412) చలం తరువాత కాలంలో.

కొద్దో గొప్పో ఈశ్వరుడిమీద మిగిలిన ప్రేమ, తనకు ఎంతో సన్నిహితుడైన కుమారుడు రవి చావుతో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. జీవితంలో ఆ దశలో చలం ఎంతో అశాంతితో వేగిపోయారు. ఈశ్వరుడుంటే ఈ సృష్టి ఇలా ఉండేదా? ఈ కల్మషాలు, ఈ కపటాలు, ఈ చావులు, ఈ ప్రకృతి వైపరీత్యాలతో లోకం ఇలా ఉండేదా అని ఎన్నో ప్రశ్నలు చలాన్ని వేధించేవి. ఆయనలో అర్థం కాని వేదన గూడు కట్టుకుని ఉండేది. ఆ ఆవేదన చలం మాటల్లో ఇలా వ్యక్తమయింది (సుబ్బారావు, వావిలాల. 2011[1]:65), "నా జీవితానికి ముఖ్య సూత్రం అర్థం లేని అశాంతి. మండే అసంతృప్తి. ఏదో అందుకోవాలనే తీవ్ర తపన".

చలం అశాంతికి వేరొక కారణం కూడా ఉండేది. చలం రాతలన్నిటిలోనూ సమాజంలో స్త్రీలను అణిచివేసే పురుషులను, పురుషస్వామ్యసమాజాన్ని ఎత్తిచూపుతున్నట్లుగా ఉండేవి. చలం బోధించిన స్త్రీ స్వేచ్ఛ విశృంఖలజీవనాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా కనపడేది. దాంతో సమాజం చలాన్ని వెలివేసింది. దానికి కారణంకూడా చలమే తన ఆత్మకథలో పేర్కొన్నారు. ఒక రచయిత ఎంతగా తన రచనలలో సమాజాన్ని ఎదిరించినా అతడిని ఆ సమాజమే మెచ్చుకుంటుంది. అదే తన రచనలలో చెప్పినదాన్ని తాను నిజజీవితంలో ఆచరించి చూపితే మాత్రం సంఘవ్యతిరేకి అవుతాడు. చలం తన జీవితంలో ఎందరో దిక్కులేని స్త్రీలకు ఆశ్రయమిచ్చారు. స్వయంగా కులవిభేదాలను పాటించలేదు. అలా చలం తన రచనలద్వారా, తన ప్రవర్తనద్వారా సంఘ బహిష్కృతులయ్యారు. ఎక్కడ చూసినా చలానికి అవమానాలు, తిరస్కారాలే తప్ప స్నేహపూరితమైన ఓదార్పు లభించేది కాదు. చలం అరుణాచలానికి వచ్చాక, మిత్రులు యన్.వీరేశలింగంగారికి రాసిన ఉత్తరం చలం పడ్డ గుండెకోతకు నిదర్శనం. “అయినా ఆ పాడు ఆంధ్రుల నించి ఎందుకు తప్పుకోకూడదూ? అందుకు కాదులెండి నేను ఇక్కడకు వొచ్చింది. కాని నాకు ఎవరు ఏం చేశారని నాకా పట్టు మీ దేశం మీద? కుక్కల్లాగు నన్నన్నివిధాలా క్షోభిల్ల చేస్తోవుంటే, ఎవరు నా సహాయానికి వొచ్చారు ఈ 30 ఏళ్ళూ!” (చలం. 1996:6)

అతనికి ఎంతో సన్నిహితుడైన కుమారుడు రవి చనిపోవటం, కొద్దికాలంలోనే తనెంతగానో ప్రేమించిన తను వొయ్యి (చలం వదినగారు) మరణించడం చలాన్ని బాగా కుంగదీశాయి. ఇలా గుండె నిండా అశాంతితో, ఎన్నో ప్రశ్నలతో రమణాశ్రమానికి చేరారు చలం. భగవాన్ రమణమహర్షి సమక్షంలో చలం జీవితంలో ఎన్నడూ ఎరగని శాంతిని అనుభవించారు.

“భగవాన్ ఏం చేశారంటే రేపు ఏమౌతామో యిక్కడ అనే ఆలోచన మాలోకి రాకుండా చేశారు” (సుబ్బారావు, వావిలాల. 2011[1]:168) అని తర్వాత చెప్పుకున్నారు.

చలం అరుణాచలానికి చేరిన కొన్నాళ్ళకే భగవాన్ భౌతిక దేహాన్ని చాలించారు. అయినా భగవాన్ రమణ మహర్షితో చలానికి ఏర్పడిన ‘గట్టి బంధం ఆయన దేహంతో కాదు’ కనుక చలం అరుణాచలాన్ని వదలటానికి ఇష్టపడలేదు.

“మా వొయ్యి చచ్చిపోతే, మా రవి చచ్చిపోతే దుఃఖం కలగకండా నన్ను కాపాడారు. వసంత్ ఇంట్లోనించి వెళ్ళిపోతే ఆయన కాపాడారు. ఇట్లాంటప్పుడు ఆయన వెళ్ళిపోతే నాకు దుఃఖం కలగజేస్తారా?” (సుబ్బారావు, వావిలాల. 2011[1]:169) అని తనను తాను సముదాయించుకున్నారు.

రమణ మహర్షి పరమపదించిన కొంతకాలానికి గొప్ప సాధనలో ఉన్న కూతురు షౌ(సౌరిస్)కు ఈశ్వర దర్శనం కలిగింది. ఈశ్వర వాక్కు షౌద్వారా పలుకుతూ ఉండగా చలం దానికి కట్టుబడి, ఆహారంలో, అలవాట్లలో మార్పులు చేసుకున్నారు. మామూలుగా తనకు సాధ్యం కాని ఎన్నో ఆసనాలను ఈశ్వర నిర్దేశంద్వారా వేస్తూ సాధన సాగించారు. కొన్నాళ్ళకు చలాన్ని చిన్నతనంనుండి బాధిస్తూ వచ్చిన తలనొప్పులు (మైగ్రేన్) శాశ్వతంగా దూరమయ్యాయి. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి.

“నాలో మార్పు ఏమిటో, ఏం జరిగిందో నాకు తెలియదు. నాకు మాత్రం విశ్వాసం. ఈశ్వరుడు ఉన్నారు. భగవాన్ ఉన్నారు. ఇంక నేనేమైతేనేం?” (సుబ్బారావు, వావిలాల. 2011[1]:186) అంటూ భగవంతుడిపై విశ్వాసాన్ని ప్రకటించారు. తను మార్చలేని అంశాలగురించి ఆలోచించి, బాధపడడం మాని, జీవితంలోకి శాంతిని ఆహ్వానించుకున్నారు. భగవాన్‌కి తనను తాను అర్పించుకున్నారు. అరుణాచలంలో అన్నేళ్ళబట్టీ ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు ఇలా అంటారు చలం.

"ఈ 25 ఏళ్ళూ నేను యిక్కడ ఏం చేస్తున్నానా? ఏమీ కాకండా వుండడం నేర్చుకుంటున్నాను...మా మనసు పొంగు చల్లారినకొద్దీ లోకవాంఛలు వాసనలు, దూరమైన కొద్దీ మాకు తెలియకండానే నిర్మల శాశ్వత శాంతి క్రమంగా పాకుతోంది మాపై" (సుబ్బారావు, వావిలాల. 2011[1]:198)

జీవితమంతా అశాంతితో బాధపడ్డానన్న చలం, అరుణాచలానికి వెళ్ళాక మిత్రులు, కథకులు అయిన శివంగారికి రాసిన ఉత్తరాలలో 'శరీర మానసికారోగ్యాలు పూర్తిగా లభిస్తున్నాయని రాశారు.' (సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983:463)

"మేమంతా ఈశ్వర కరుణతో చాలా హాయిగా శాంతంగా వున్నాము" (సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983:473)

జీవితమంతా అశాంతితో, తీరని ప్రశ్నలతో విసిగి వేసారిన చలానికి అధ్యాత్మికత ఎంతో ఊరటనిచ్చింది. చాలా మంది అనుకున్నట్టుగా చలం భయపడి, సమాజంనుండి పారిపోయి అరుణాచలంలో దాక్కోలేదు. ఆయన ఏం చేసినా పూర్తి స్పష్టతతో చేశారు. జీవితానికి పరమావధి ఆనందం అని చెప్పే చలం తనకు ఆనందాన్ని కలిగించేది, శాంతినిచ్చేది ఏదో తెలుసుకున్నారు. తెలుసుకుని, అప్పటిదాక తాను చెప్పినదానికి, చేసిన దానికీ అది పూర్తిగా విరుద్ధమైనా దాన్ని అనుష్ఠించడంలో వెనకాడలేదు. లోకం ఎత్తిపొడుపులకు వెరవలేదు. ఆ విధంగా చూస్తే చలం సిసలైన ధైర్యవంతులు.

"Rationalism may be nearer to truth. But if rational life lands you in a dreary, colourless, emotionless, dry desert - except the pride that you are rational, perhaps it pays one better to be superstitious if one could be. If one prays at all, is it not better pray to a picturesque Siva or Vishnu than to pray before a white wall in a mosque?" (సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983:420)

'తర్కం సత్యానికి దగ్గరగా ఉండొచ్చు. కాని తర్కబద్ధమైన జీవితం నిన్ను ఉదాసీనమైన, కళావిహీనమైన, రసహీనమైన ఎడారిలోకి దించినట్లైతే, హేతుబద్ధంగా ఉన్నామన్న ఆత్మ ప్రత్యయం ఉన్నప్పటికీ, మనిషి ఆ తర్కానికి తిలోదకాలివ్వటమే మేలు. అసలంటూ ప్రార్థించడం మొదలుపెడితే, మసీదులో ఒక తెల్లని గోడ ముందు కూర్చుని ప్రార్థించడంకంటే అందమైన శివుని విగ్రహంముందో, విష్ణువు విగ్రహంముందో కూర్చుని ప్రార్థించడం నయం కాదూ?' అన్న మాటలు చలంలో భావపరిణామానికి నిదర్శనాలు.

గోపీచంద్ *అసమర్థుని జీవయాత్ర* లో రామయ్య తాత పాత్రద్వారా చెప్పించినట్లుగా (గోపీచంద్. 1983:123), "ఎంత తెలివిగలవాడైనా పరిస్థితులకు మించిన తెలివి చూపించగూడదు. తన తెలివిని పరిస్థితులకు సమన్వయం చేయగలగటమే గొప్పవాని లక్షణం" ఆ సమన్వయం చలానికి జీవితపు చివరి దశలో లభించింది.

### 5.2.2. గోపీచంద్

నిదర్శనాధ్యయనంలో భాగంగా ఎంచుకొన్న మరొక వ్యక్తి గోపీచంద్. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన పండిత *పరమేశ్వర శాస్త్రి వీలునామా*, తొలి మనో వైజ్ఞానిక నవలగా పేరుపొందిన *అసమర్థుని జీవితయాత్ర* వంటి నవలలు, *ధర్మవడ్డీ*, *మమకారం* వంటి ఎన్నో కథలు, *తత్త్వవేత్తలు* పేరిట తెలుగు సాహిత్యంలో అపూర్వమైన తాత్త్విక వ్యాసాలు, *పోస్టుచెయ్యని ఉత్తరాలు* పేరుతో సత్యాన్వేషణలో ఆయన కనుగొన్న విషయాలు గోపీచంద్‌కు తెలుగు సాహిత్యంలో అజరామరమైన కీర్తిని సంపాదించి పెట్టాయి. నాస్తికుడిగా, హేతువాదిగా జీవితపయనాన్ని మొదలుపెట్టిన గోపీచంద్, అధ్యాత్మికతతోనే సంపూర్ణ సత్యావిష్కారం జరుగుతుందని జీవితపు చరమాంకంలో ఉద్ఘాటించారు. గోపీచంద్ తత్త్వ ప్రస్థానం ఈ విభాగంలో విశ్లేషించబడుతుంది.

గోపిచంద్ ప్రసిద్ధ హేతువాది, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి అబ్బాయి. పదేళ్ళనాడే తల్లి మరణించినా, సవతి తల్లి ఎంతో ప్రేమగా పెంచింది. తండ్రి ప్రభావం తొలినాళ్ళలో గోపీచంద్ పై ఎక్కువగా ఉండేది. ఆయన తొలి రచన *శంభుక వధ* అనే వ్యాసం. ఇది తండ్రి *శంభుక వధ* నాటకంనుండి ప్రేరణ పొందిన రచన. గోపీచంద్ జీవితం, సాహిత్యం – ఇవి రెండూ పరస్పరం ఒకదానితో ఒకటి ముడివేసుకుని ఉన్నాయి. గోపీచంద్ భావాలు, భావపరిణామాలు ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తాయి.

1943 లో వెలువడిన గోపీచంద్ వ్యాస సంపుటి *దేవుని జీవితం* ఆయనలో ఉన్న నాస్తికుడిని, హేతువాదిని పట్టి చూపుతాయి. వ్యాస సంపుటిలో *దేవుని జీవితం* అనే వ్యాసంలో దేవుని ఉనికిని ఎగతాళిగా ప్రశ్నిస్తారు (గోపీచంద్. 1943:4) గోపీచంద్. "మృగదశలో వుండి, మాంసాహారులై, చెట్టు గుట్టల చుట్టూ దిమ్మతిరిగిన మన పూర్వులకు దేవుడున్నాడు. సైన్సు వృద్ధి పొందిందీ, దాని ధాటి కాగలేక దేవుడు శెలవు తీసుకుంటున్నాడూ, నిష్క్రమిస్తున్నాడూ, అని విర్రవీగే మనకు దేవుడున్నాడు. కాని భేద మెక్కడంటే మన దేవుడు మన పూర్వుల దేవుడు కాదు; మన పూర్వుల దేవుడు మన దేవుడు కాదు. కాలంతో పాటు ఉద్దేశాలు మారుతూ వచ్చాయి. ఉద్దేశాలతోపాటు దేవుడూ మారుతూ వొచ్చాడు. కనక, ఇక్కడ నేను దేవుడేవిధంగా జననమొందాడో, బాల్య కౌమార దశలు ఏ విధంగా గడిపాడో, యిప్పుడే విధంగా వుండి, ఎల్లకాలం 'కృష్ణా, రామా' అనుకుంటూ గడుపుతున్నాడో వర్ణిస్తాను." ఈ విధంగా గోపీచంద్ ఈ వ్యాసమంతటిలోనూ దేవుని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తూ, అపహాస్యం చేస్తూ పోతారు.

మానవుడి అప్పటి జ్ఞానాన్నిబట్టి దైవస్వరూపం, గుణగణాలు మారుతూ వచ్చాయంటారు ఈ వ్యాసంలో గోపీచంద్. రక్తపిపాసిగా, హేతువాదిగా, గుణవంతుడిగా, గుణాభిమానిగా, ప్రేమస్వరూపుడిగా, నిరాకారుడిగా, సర్వాంతర్యామిగా, శక్తిస్వరూపుడిగా ఇలా

మనిషి తెలివిడినిబట్టి దేవుడిలో వివిధ దశలను చూపిస్తారు గోపీచంద్. చివరకు, "దేవునికోసం వెదకటం నిష్ప్రయోజనం. గొప్పవారి మెదడులోనూ, గ్రంథకర్తల పుస్తకాల్లోనూ మాత్రమే వారి దర్శనమవుతుంది. ఈ ప్రదేశాల్లోనే వారు ప్రత్యక్షమవుతుంటారు" అని తేలుస్తారు (గోపీచంద్. 1943:17).

అలాగే, *జీవిత పరమావధి* అనే మరో వ్యాసంలోనూ, ప్రజల అజ్ఞానంచేత గ్రహాలు, చెట్లు, పుట్టలు, జంతువులూ దేవుళ్ళయి కూర్చుంటే, ప్రజల భయంవల్ల శుష్కవేదాంతం, కర్మ సిద్ధాంతం, స్వర్గనరకాలు పుట్టుకొచ్చాయంటారు.

నాస్తికవాద ప్రభావం తనపై ఉన్న తన చిన్ననాటి మనఃస్థితి గురించి తరువాతి కాలంలో ఇలా వ్యాఖ్యానించారు (గోపీచంద్. 2009:7) గోపీచంద్. "మనం భగవంతుని పేరు మీదుగా దారుణమైన దోపిడీ జరిగే రోజులలో, భగవంతుడు లేడనే వాదం ప్రబలంగా ప్రచారం అవుతున్న రోజులలో పుట్టాం. భగవంతుడు వున్నాడనుకోవడంవల్ల అన్యాయానికి ఆహుతి అయ్యే వర్గములో పుట్టటంవల్లో, లేకపోతే మన పెరుగుదలను బట్టో, లేకపోతే మన సహవాస ప్రవృత్తిని బట్టో, మనం భగవంతుడు లేడనేవారి కోపు వేసుకున్నాం."

తండ్రి ప్రభావం గోపీచంద్ పై తొలినాళ్ళలో విపరీతంగా ఉన్నా, తరువాతి కాలంలో దాన్ని అధిగమించి తనదైన సొంత వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నారు. కాలేజీ రోజుల్లో కమ్యూనిజం వైపుకు ఆకర్షితులయ్యారు. కమ్యూనిజంపట్ల అభిమానాన్ని *పితృార్జితం, పీడిత హృదయం* మొదలైన కథానికలలో చూపించుకున్నారు. అయితే, కమ్యూనిజంలో లేని వ్యక్తి స్వేచ్ఛ, ఉన్న నియంతృత్వ ధోరణులు స్వేచ్ఛాపిపాసి అయిన గోపీచంద్‌కు పూర్తి సంతృప్తిని ఇవ్వలేకపోయాయి. సహజంగా, మానవౌన్నత్యాన్ని బోధించిన ఎం.ఎన్.రాయ్ నవ్యమానవతావాదం గోపీచంద్‌ను ఆ రోజుల్లో ఆకర్షించింది. కాని త్వరలోనే కమ్యూనిజంకాని,

నవ్యమానవతావాదంకాని ఇవేవీ సమగ్రమైన సత్యాన్ని అంటే జీవితానికి అర్థాన్ని ఆవిష్కరించలేవని తెలుసుకున్నారు గోపీచంద్.

ఈ పరిస్థితుల్లో ఆర్థిక పరిస్థితులకు మానవునిమీద వుండే శక్తినిగురించి గోపీచంద్‌కు క్రమక్రమేణా అనేక అనుమానాలు కలగటం ప్రారంభించినై. ఆర్థిక పరిస్థితే కాక మరొక శక్తికూడా మానవునిమీద తన ప్రభావం చూపుతూ వుంది అని గోపీచంద్‌కు అనిపిస్తూ ఉండేది. 'ఆర్థిక పరిస్థితి పలుకుబడి కొంతవరకే ఉంటుంది. అందుకని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సంఘాన్ని కొలవటానికి ప్రయత్నిస్తే సత్యం బోధపడదు. ముఖ్యంగా మేధావులమీద భావానికి వున్న పలుకుబడి ఆర్థిక పరిస్థితికి ఉండదు.' అందుకని భావానికి ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది. దీనినిగురించి ఆధ్యాత్మికవాదులు ఎక్కువ కృషి చేశారనే విషయం తెలుసుకున్న గోపీచంద్ ఆధ్యాత్మికవాదంగురించి క్షుణ్ణంగా తెలుసుకోటానికి పూనుకున్నారు. ఆధ్యాత్మిక వాదుల గ్రంథాల్లో ఆయనను అరవిందఘోష్ పుస్తకాలు బాగా ఆకర్షించాయి. ఇలా అభ్యుదయ, నవ్యమానవతావాదాలను వదలి ఆధ్యాత్మికవాదంవైపు దృష్టి సారించాల్సిన అవసరం ఎలా కలిగిందో వివరించారు (గోపీచంద్. 2009:8,9).

గోపీచంద్ జీవితాంతం సత్యాన్వేషణకై కట్టుబడి, మొదట నాస్తికుడిగా తరువాత అభ్యుదయవాదిగా, అనంతరం నవ్యమానవతావాదిగా ఎన్నో దారుల్లో సత్యాన్వేషణ చేశారు. చివరకు భౌతిక అధ్యాత్మిక వాదాల సమన్వయంలోనే సత్యం ఉందని తెలుసుకున్నట్లుగా ఆయన రచనలలో కనపడుతుంది (గోపీచంద్. 2009:20).

ఆధ్యాత్మికాంశాలపట్ల మొదట్లో చులకనభావాన్ని కలిగిన గోపీచంద్ అధ్యాత్మిక వాదాన్ని, శ్రీ అరవిందుల రచనలను అధ్యయనం చేశాక తన అభిప్రాయాలను మార్చుకున్నారు. 'ఆధ్యాత్మిక వాదం అనగానే పూర్వం కలిగే ఈసడింపు ఇప్పుడు తనకు కలగటంలేదు' అంటూ (గోపీచంద్. 2009:41) మానసిక శక్తులగురించి, సహజ జ్ఞానాన్నిగురించి, సమాధి

స్థితినిగురించి, ధ్యానాన్నిగురించి సానుకూలంగా పరిశీలించి విశ్లేషణలు చేశారు. గోపీచంద్ అధ్యాత్మికతను సమర్థించడం అయన *మెరుపుల మరకలు*, *పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా* నవలలలో కనపడుతుంది. *పోష్టు చెయ్యని ఉత్తరాలు* పేరిట అయన రాసిన వ్యాస సంకలనంలో ఈ విషయం మరింత స్పష్టంగా కనపడుతుంది.

"మనకు పూర్వపురోజుల్లో ధ్యానం అంటే సద్భావం వుండేది కాదు. ఆధ్యాత్మికవాదం మీద వున్న చులకనభావమే దానికి సంబంధించిన అన్ని విషయాలమీదా వ్యాప్తమై వుండేది. కాని తరచి చూస్తే దీని విలువ అమోఘమైందిగా కనపడుతూ వుంది. మానవుడు రాబోవు దశకు వెళ్ళటానికి దీని దోహదం అనివార్యం అని చెప్పే ఆధ్యాత్మికవాదుల మాటలు సత్యదూరం కాదు అనిపిస్తూ వుంది" (గోపీచంద్. 2009:84).

"మిగిలిన శక్తుల మాట ఎటున్నా మనస్సుని విభిన్న ఘర్షణలనుంచి రక్షించి, శుభ్రపరచి, వివిధశక్తుల్ని సంఘటితపరచి ఏకోన్ముఖం చేసే శక్తి ధ్యానానికి వున్నదనే నేను అనుకుంటున్నాను. ముక్కల ముక్కలక్రింద బ్రతుకుతున్న ఈనాటి సాంఘికజీవికి దీని అవుసరం నేడు ఎక్కువగా వున్నదని నేను భావిస్తున్నాను" (గోపీచంద్. 2009:85)

ఇలా గోపీచంద్ క్రమంగా ఆధ్యాత్మికతవైపుకు సానుకూలంగా మారారు. గోపీచంద్ పై పరిశోధన చేసిన డా॥ ఉమ్మెత్తల లక్ష్మీనారాయణగారు గోపీచంద్ నిజజీవితంలో భగవద్విశ్వాసాన్ని ప్రకటించినట్లుగా తమ పరిశోధన గ్రంథంలో స్పష్టం చేశారు (లక్ష్మీనారాయణ, ఉమ్మెత్తల. 1989:407).

హేతువాదమొక్కటే సత్యావిష్కారాన్ని చేయలేదని గోపీచంద్ తెలుసుకున్నారు. పోష్టుచెయ్యని ఉత్తరాలలో హేతువాదానికి ఉన్న హద్దులను అంగీకరించారు. తాత్కాలికావసరాలకు కావలసిన విషయాలను తెలుసుకోటానికి మాత్రమే హేతువాదం పనికి

వస్తుందని, సంపూర్ణసత్యాన్ని తెలుసుకోటానికి ఇది ఉత్తమ సాధనం కాదన్న ఆధ్యాత్మికవాదుల వాదనను ఉటంకించారు (గోపీచంద్. 2009:69).

ఇదే విషయాన్ని చలం కూడా ప్రస్తావించారు. "ఇన్నేళ్ళు నేను ఈశ్వరుడు నాకిచ్చిన శక్తులన్నిటితోటి నాకున్న కాస్త విజ్ఞానంతోటి వెతికాను. చదివాను, అడిగాను, తర్కించాను, కాని నాకెక్కడా ఏదీ అంతుబట్టలేదు. నన్ను తృప్తిపరచగల సమాధానం దొరకలేదు. కనక ఈ intellectual quest వుందే ఇది ఎక్కడికీ తీసుకుపోదు మనుషుల్ని. గొప్ప మేధావుల పుస్తకాలు చదివాను. వాళ్ళూ ఒప్పుకున్నారు. ఏమీ దొరకలేదని." (సుబ్బారావు, వావిలాల. 2011[1]:196,197)

ఇలా ఎందరో ప్రపంచ కవులను, రచయితలను, తత్త్వవేత్తలను అధ్యయనం చేసిన ఆలోచనాశీలి గోపీచంద్ భౌతిక, ఆధ్యాత్మిక వాదాల సమన్వయంలోనే సత్యం ఉందని విశ్వసించారు. హేతువాదాన్ని పూర్తిగా తోసివెయ్యలేదు, అలా అని ఆధ్యాత్మికవాదాన్ని వదలలేదు.

ఈ నిదర్శనాధ్యయనానికి చలం, గోపిచంద్ లనే ఎంచుకోవడానికి గల కారణాలు, వారిద్దరిలో ఉన్న సారూప్యాలను ఇక్కడ గమనిద్దాం. చలం, గోపీచంద్ ఇద్దరూ విభిన్నమైన నేపథ్యాల నుండి వచ్చినవారు. ఒకరు బ్రాహ్మణులు మరొకరు అబ్రాహ్మణులు. ఒకరికి తండ్రంటే విపరీతమైన ద్వేషం, మరొకరికి తండ్రంటే అంతులేని అనురాగం. ఒకరు తల్లిదండ్రుల ప్రేమ ఎలా ఉంటుందో తెలియకుండానే పెరిగినవారు. మరొకరు తల్లిదండ్రుల ప్రేమలో ఓలలాడినవారు. ఒకరు తండ్రి మీద ద్వేషాన్ని లోకం మీదకు మరల్చుకున్నవారు. మరొకరు తల్లిదండ్రుల మీద ప్రేమతో తను రాసిన పుస్తకాలను వారికి అంకితం చేసినవారు. ఒకరు గొప్ప భక్తిపూరితమైన వాతావరణంలో పెరిగితే, మరొకరు పూర్తి నాస్తిక వాతావరణంలో

పెరిగారు. గోపీచంద్ మానవతావాది. చలం స్త్రీవాది. వారి నేపథ్యాలలో వైరుధ్యాలు అనేకం. కాని, ఇద్దరి జీవిత ప్రయాణాలలో ఎంతో సామ్యం ఉంది.

ఇద్దరూ తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠితులు. గొప్ప ఆలోచనాపరులు. వచన వాఙ్మయంలో శాశ్వతమైన పేరును సాధించినవారు. విరివిగా ఆంగ్లాంధ్ర సాహిత్యాలను అధ్యయనం చేసినవారు. ఇద్దరూ సత్యాన్వేషకులే. ఇద్దరూ జీవితంలో ఎంతో సంఘర్షణను అనుభవించినవారు. ఇద్దరూ జీవితమంతా సత్యాన్వేషణ చేసి, జీవిత చరమాంకంలో అధ్యాతికత ఒడిలో సేదదేరినవారు. ఇద్దరూ మార్పును ఆహ్వానించే మనస్తత్వం కలిగినవారే. ఇద్దరూ ప్రతి దశలోనూ తాము నమ్మింది నిజాయితీగా ఆచరించారు. నమ్మింది నిజం కాదని తేలినప్పుడు, మరో కోణం వైపు ఆలోచించడానికి వెనకాడలేదు.

"ఏ దృష్టిలేకుండా మనిషి ఈ ప్రపంచంలో ఒక్క క్షణం కూడా వుండలేడు. ఏ నమ్మకం లేకుండా ఒక్క పని చెయ్యలేడు, కాబట్టి ఎప్పటికప్పుడు ఒక సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తూ ఆ సిద్ధాంతం సంపూర్ణం అనుకోకుండా, ఎప్పటికప్పుడు నూతన జ్ఞానాన్ని అన్వేషిస్తూ ఈ విధంగా పొందిన జ్ఞానాన్ని తన సిద్ధాంతంతో కలుపుకుని మారుతూ, మానవుడు జీవించాలని నా ఉద్దేశం" (గోపీచంద్. 2009:10) అన్న గోపీచంద్ మాటలు ఆయన సత్యాన్వేషణ తత్త్వానికి ఉదాహరణ.

హేతువాదం, అధ్యాత్మికత రెండూ సమపాళ్ళలోఉండాలనే సమన్వయం చలంలోకూడా కనిపిస్తుంది. "అన్నిటిలోకి విచిత్రమేమిటంటే ఆనాటికీ ఈనాటికి గొప్ప గొప్ప మేధావులు, బహిరంగ నిరీశ్వరవాదులు, ఈశ్వరుణ్ణి వొదిలేసి మానవ క్షేమాన్ని కోరే మహావీరులు, వాళ్ళు నమ్మినదే నమ్మశక్యంగాని, తక్కిన విజ్ఞానంతో తమ నమ్మకాన్ని సమన్వయించబోతే, తాము ఏ పీఠంమీద ప్రపంచంలో గొప్పగా నిలబడగలిగారో, ఆ పీఠం కాళ్ళు ఎక్కడ వూడిపోతాయో, తమ ఘనత ప్రపంచంలో ఎక్కడ కూలిపోతుందో అనే భయంతో, తక్కిన విషయాల్ని

పరిశీలించరు. ఏ పరిశీలన చెయ్యకండానే అదంతా మూఢనమ్మకమని కొట్టేస్తారు. తాము గీసుకున్న గిరినుంచి దాటరు. తమకు తెలియదని ఒప్పుకోరు. ఇంక ఈశ్వరభక్తులు సరేసరి. వారికి భక్తిరాగానే మెదళ్ళు మూసుకుపోతాయి. ఏ మాత్రం ఆలోచించమన్నా మండిపడతారు. బూతులు తిడతారు" (సుబ్బారావు, వావిలాల. 2011[1]:72)

గొప్ప రచయితలు, ఆలోచనాపరులు, నాస్తికులైన ఇద్దరు మహారచయితలు, అధ్యాత్మిక వైపుకు మొగ్గి, అందులో శాంతి, సత్యాలను అనుభవించారంటే అందులోంచి మనం తెలుసుకోవలసిన పాఠం ఉంది. వారి సత్యాన్వేషణ వారిని ఏ తీరాలకు చేర్చిందో గమనించడం ఒక గొప్ప పరిశోధనానుభవం.

చలం, గోపీచంద్ ల పై జరిపిన ఈ నిదర్శనాధ్యయనం ఈ కింది విషయాలను స్పష్టం చేస్తోంది:

1) అధ్యాత్మికత శాంతినిస్తుంది.
2) అధ్యాత్మికత లేకుండా సంపూర్ణమైన సత్యాన్ని కనుక్కోలేం.
3) అధ్యాత్మికత అవసరమే కాని హేతుబద్ధతను సంపూర్ణంగా విడిచిపెట్టడానికి వీల్లేదు.

అలాగే, మరో ప్రసిద్ధ పాశ్చాత్య రచయిత, సత్యాన్వేషి, *వార్ అండ్ పీస్*, *అన్నా కెరినీనా* వంటి ఆధునిక మహాకావ్యాలను రచించిన టాల్‌స్టాయ్ కూడా నడిజీవితంలో గొప్ప సంక్షోభ స్థితికి చేరుకుని జీవితానికి అర్థమేమిటన్న ప్రశ్నను పరిశోధించారు. *కన్ఫెషన్* పేరుతో తన అధ్యాత్మిక ప్రయాణాన్నంతటినీ అక్షరబద్ధం చేశారు. అందులో అధ్యాత్మికతలోనే జీవితానికి అర్థముందని చెబుతారు. అయితే, దేవునిపై నమ్మకం అనేది అవసరమైనదే అయినా అది, వివేకంతో ముడిపడి ఉండాలని అభిప్రాయపడ్డారు.

"I have no doubt that there is truth in the doctrine; but there can also be no doubt that it harbors a lie; and I must find the truth and the lie so I can tell them apart" (Patterson, David. 1983:91).

'మతబోధలలో/సిద్ధాంతాలలో సత్యం ఉందన్న విషయంలో నాకెటువంటి సందేహమూ లేదు. అలాగే వాటిలో కొంత అసత్యం ఉందన్న విషయంలోకూడా నాకెలాంటి అనుమానమూ లేదు. వాటిలో సత్యాసత్యాలను కనుగొనాలి.' అధ్యాత్మికత హేతుబద్ధమైనదిగా ఉండాలన్న అభిప్రాయంతో టాల్‌స్టాయ్ తన సత్యాన్వేషణ వ్యాసాలను ముగించారు.

## 5.3. హేతుబద్ధమైన ఆధ్యాత్మికత

సమాజానికి అధ్యాత్మికత అవసరం స్పష్టమే అయినా, ఎటువంటి అధ్యాత్మికత కావాలనేది ప్రశ్న. నేటి సమాజానికి కావలసింది హేతుబద్ధమైన అధ్యాత్మికత అనేది ఇందుకు తర్కసహమైన సమాధానం. అంటే, అంధవిశ్వాసాలకు, మూఢనమ్మకాలకు తావివ్వని, తర్కసహితమైన అధ్యాత్మికత. దీనినే గొప్ప అధ్యాత్మిక గురువులంతా బోధించారు.

దైవం విషయంలో సంపూర్ణమైన, షరతుల్లేని విశ్వాసమే ఫలితమిస్తుందన్న మాట నిజం. అయితే, మానవ సంబంధమైన ఆచారాలు, అధ్యాత్మిక వ్యవహారాల విషయాల్లో మాత్రం హేతుబద్ధత అవసరం. ఎందుకంటే, అవి మనుషులు ఏర్పరిచినవి కనుక, వాటికి కాలదోషం పట్టే అవకాశం ఉంది కనుక. శంకరాచార్యులనుండి, రామానుజాచార్యులు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణ మహర్షి, ఈ కాలంలోని అధ్యాత్మిక గురువులవరకు అందరూ బోధించింది హేతుబద్ధమైన అధ్యాత్మికతే.

రామకృష్ణ పరమహంస జీవితచరిత్ర ప్రకారం, రామకృష్ణులు హిందూ ధర్మంలోని పలు దర్శనాల ద్వారానూ, అలాగే, క్రైస్తవం, ఇస్లాం తదితర ఎన్నో మతవిశ్వాసాల అనువర్తనలద్వారానూ దైవానుభూతిని పొంది, సర్వమతాలు దేవుని చేరే దారులేనని

అనుభవపూర్వకంగా తెలుసుకున్న జ్ఞాని. మూఢవిశ్వాసాలను తీవ్రంగా వ్యతిరేకించేవారాయన. పూర్తిగా పరీక్షించకుండా తనను సైతం నమ్మవద్దని తన శిష్యులతో అనేవారు రామకృష్ణులు.

భారతీయ ఆధ్యాత్మికతను ప్రపంచవ్యాప్తంగా చాటిన అతని శిష్యుడైన స్వామి వివేకానంద తార్కికాభిరుచి కలిగిన గొప్ప దైవభక్తుడు. 'మన రక్తంలోనే ఆధ్యాత్మికత ఉం'దన్నారు వివేకానందులు. 'అది నిర్మలంగా, బలంగా, పవిత్రంగా ప్రవహించినంతకాలం, రాజకీయ, సాంఘిక, భౌతిక రంగాలలోని లోపాలన్నీ, దేశం యొక్క పేదరికంతో సైతం, సర్దుకుంటా'యని నొక్కి వక్కాణించారు (Swami Vivekananda. 2005:21).

ధ్యానాన్ని ఆధ్యాత్మికతకు గొప్ప సాధనంగా ఎంచి ప్రవచించారు స్వామి వివేకానంద. ధ్యానంతో మనిషి తనలో ఉన్న దైవత్వాన్ని మేల్కొలుపవచ్చని విశ్వసించారు. అధ్యాత్మికతపై అచంచలమైన విశ్వాసం ఉన్నప్పటికీ వివేకానందులు, ఎక్కడా తమ తార్కిక బుద్ధిని మాత్రం వదులుకోలేదు. శ్రీరామకృష్ణులకు దైవాంశ సంభూతుడనే కీర్తి ప్రఖ్యాతులు ఉన్నప్పటికీ, ఆయనను గురువుగా అంగీకరించడానికి ఐదేళ్ళు తీసుకున్నారు. దేనినీ స్వయంగా పరీక్షించకుండా స్వీకరించని స్వభావం కలిగిన ఆయన, రామకృష్ణుల దివ్యానుభవాలను మొదట మనోభ్రాంతులుగా భావించారు. ఏ క్షణంలోనూ తన మనసును గుడ్డి నమ్మకానికి గురి చెయ్యకుండా ఐదేళ్ళ పాటు రామకృష్ణుని మాటలను, చర్యలను తన తర్కబుద్ధితో జాగ్రత్తగా పరిశీలించి, దగ్గరగా గమనించి, నిగ్గు తేల్చుకున్న తరువాతే ఆయనను గురువుగా స్వీకరించారు. ఆయన జీవిత చరిత్రలో ఆయననుగురించిన ఈ మాటలు (చిరంతనానందస్వామి. 2005:50) వివేకానందుని స్వభావాన్ని విశదీకరిస్తాయి. "ఏ విషయాన్నిగాని ఎవరో ఒక మహాపురుషుడు వచించినంత మాత్రాన, ఏదో ఒక గ్రంథంలో లిఖించబడినంత మాత్రాన, విశ్వసించటం ఆతడి స్వభావ విరుద్ధం"

వివేకానందులు మూఢనమ్మకం మనిషికి ప్రబలమైన శత్రువన్నారు. మూఢనమ్మకాలను బలహీనతకు, మరణానికి చిహ్నాలుగా అభివర్ణించారు. ఏదైతే మనిషిని శారీరకంగా కాని, బౌద్ధికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని బలహీనుడిని చేస్తుందో, దాన్ని విషతుల్యంగా భావించి తోసివేయమన్నారు. నేటికీ యువతకు మార్గదర్శకుడిగా పిలవబడే వివేకానందులు హేతుబద్ధమైన ఆధ్యాత్మికతకు మారుపేరుగా నిలిచారు.

ఆధునిక కాలపు మరో గొప్ప ఆధ్యాత్మిక గురువైన భగవాన్ రమణ మహర్షి సైతం హేతుబద్ధమైన ఆధ్యాత్మికతనే బోధించారు. 'ఆత్మకు సంబంధించినదే ఆధ్యాత్మికత' అని ఈ అధ్యాయం మొదట్లో చెప్పుకున్నాం. రమణ మహర్షి బోధలన్నీ ఆత్మకు సంబంధించినవే. 'నేను అన్నది ఎవరో తెలుసుకో' అన్నదే ఆయన బోధలలో సారాంశం. ఆత్మవిచారం ఆయన చూపించిన మార్గం. ఆత్మోద్ధరణ చేసుకుంటే సంఘోద్ధరణ చేసినట్లేనన్నది ఆయన సిద్ధాంతం. ఆయన ఆధ్యాత్మికతకూడా హేతుబద్ధంగా ఉండేది. మూఢనమ్మకాలను, ఆచారాలను, కులమత భేదాలను అస్సలు ఒప్పుకునేవారు కారు.

భగవాన్ తత్త్వనిరూపణ చేసే గ్రంథాల్లో చాలా ముఖ్యమైనదిగా పేరుపడ్డ *చలం భగవాన్ స్మృతులు* గ్రంథం ప్రస్తావనలో చలం (సుబ్బారావు, వావిలాల. 2011[2]:15) ఇలా అంటారు. "భగవాన్ ఏ ఆచారాలూ పాటించేవారు కారు. తన దగ్గర చేరిన ఆచారవంతుల్ని, ఆచారబంధనాల నుంచి తప్పించాలని చాలా ప్రయత్నించారు. అంతటి గురువును యెదురుగా పెట్టుకుని; ఆయన్ని సాక్షాత్ ఈశ్వరావతారమని స్తుతిస్తో గర్వపడుతూనే, వారి దేవతార్చనలు, వ్రతాలు, మొక్కుబళ్ళు, తీర్థయాత్రలు – సమస్తమూ చేస్తోనే వుండేవారు భక్తులు. భగవాన్ని అడిగితే, ఏదీవొద్దు. నిశ్చలంగా కూచో. అది ఉత్తమమైన యాత్ర..కాశీకి పోతావా? ఇది కాశీకాదా!" అనేవారని రాశారు చలం.

*అరుణాచలంలో చలం* పుస్తకంలో పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు (సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983:346), "స్త్రీల విషయంలో, జాతి కుల మత వివక్షత పాటించడంలో స్వామి భావాలు చాలా ఆధునికం. సమదృష్టి కలవారు. పశుపక్ష్యాదుల యెడ, మనుష్యుల యెడ అన్నిటియందూ సమదృష్టే. స్త్రీలకు జ్ఞాన విచారం చేసే అధికారంలేదని వాదించే సనాతనుల ధోరణికి స్వామి వ్యతిరేకి. ముట్టయిన స్త్రీలను వెలిగా చూడటాన్ని వారు నిరసించారు...పంచములు, అస్పృశ్యులు, శూద్రులనే భేదభావం వారికి లేదు" అని రమణమహర్షిగురించి చెప్పారు.

ఈ విధంగా రామకృష్ణ పరమహంస, వివేకానంద, రమణ మహర్షి వంటి ఆధునికులైన ఆధ్యాత్మ గురువులందరూ బోధించింది హేతుబద్ధతతో కూడిన ఆధ్యాత్మికత అని మనం గ్రహించవచ్చు. ఈ నేపథ్యంలో అన్నమయ్య ప్రదర్శించిన హేతుబద్ధమైన ఆధ్యాత్మికతను పరిశీలిద్దాం.

## 5.4. అన్నమయ్యలో హేతుబద్ధమైన ఆధ్యాత్మికత

అన్నమయ్య 15వ శతాబ్దపు కవి. 15వ శతాబ్దం దేశవ్యాప్తంగా భక్తిఉద్యమం నడిచిన కాలం. భక్తి ఉద్యమకారులు కులవ్యవస్థను వ్యతిరేకించారు. కర్మకాండలను నిరసించారు. నిండుమనస్సుతో భగవంతుని ఆరాధించడం, తోటి మనుషులను సేవించడంద్వారా మోక్షాన్ని పొందవచ్చునని బోధించారు. సంస్కృత భాషను త్యజించి, ప్రజల భాషలోనే తమ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. హిందూ మతాన్ని సంస్కరించి, ఆ మతంపట్ల ప్రజలకు నూతన విశ్వాసాన్ని కలిగించారు. అన్నమయ్య భక్తి ఉద్యమపు కవిగా పై బాధ్యతలన్నీ తన కీర్తనలద్వారా నిర్వహించారు.

అన్నమయ్యలో హేతుబద్ధమైన ఆలోచన, ఆధ్యాత్మికత పెనవేసుకుని కనపడతాయి. ఈ ఉపవిభాగంలో ఆ ధోరణులను పరిశీలించే ప్రయత్నం చేయడం జరుగుతోంది.

రామానుజాచార్యులు అస్తిత్వ హేతువాది. దైవంపట్ల అచంచలమైన విశ్వాసం ప్రకటించారు. అదే సమయంలో, మూఢనమ్మకాలకు చోటివ్వని వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. సమాజ వికాసానికి అడ్డుపడేది ఎంతటి ప్రాచీనమైన ఆచారమే అయినా, అది మార్చుకోవడానికి వెనకాడాల్సిన పని లేదు అని చాటి చెప్పారు. రామానుజమతం పాటించిన అన్నమయ్యకూడా రామానుజుని బాటలోనే హేతుబద్ధమైన ఆధ్యాత్మికతను అనుసరించారు.

*ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు*
*అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు*

*కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని*
*పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు*
*తలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁడనుఁచు*
*అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు*

*సరి నెన్నుదురు శాక్తేయులు శక్తి రూపు నీవనుచు*
*దరిశనములు మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు*
*సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పం బవుదువు*
*గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు*

*నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు*
*ఆవల భాగీరథి దరిబావుల ఆ జలమే వూరినయట్లు*
*శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని*
*యీవల నే నీ శరణనియెదను యిదియే పరతత్వము నాకు* (2-393)

కావడానికి శ్రీవైష్ణవుడే అయినా, ఈ కీర్తనలో అన్నమయ్య గొప్ప అద్వైత తత్త్వాన్ని ప్రదర్శించారు. 'పిండి కొలది రొట్టె అన్నట్టుగా, ఎవరు ఎలా తలచుకుంటే, ఏ పరిమాణంలో భావిస్తే, ఆ విధంగా పరమాత్ముడు ఉంటాడని స్పష్టం చేశారు అన్నమయ్య. వైష్ణవులు విష్ణువన్నా, వేదాంతులు పరబ్రహ్మమన్నా, శైవులు శివుడన్నా, కాపాలికులు ఆదిభైరవుడన్నా, శాక్తేయులు శక్తిస్వరూపమన్నా అంతా ఒక్కటే అని సమభావాన్ని వ్యక్తం చేశారు. కోరికలు తీర్చేవాడని అల్పబుద్ధితో ప్రార్థించినా, లేక సర్వసాక్షీభూతుడని, అనంతకళ్యాణగుణధాముడని తలచినా ఎలా తలిస్తే అలాగే భగవంతుడు కనిపిస్తా'డని ఉగ్గడించారు అన్నమయ్య. 'కొలనులో నీరున్న చోటునుబట్టి తామర విస్తరిస్తుంది. అలాగే, మనిషి భావనా తీవ్రతనుబట్టి, దైవమనే భావనకు గరిమ చేకూరుతుం'దంటారు అన్నమయ్య. 'మనసును సంకుచితపరిస్తే, దైవమనే భావనకూడా సంకుచితంగా ఉంటుంది. మనసును విశాలం చేసుకుంటే దైవభావనకూడా విశాలమవుతుంది. గంగ ఒడ్డున ఉన్న బావుల్లో కూడా ఆ గంగ నీరే ఉబికినట్టు, చెంతనున్న శ్రీవేంకటేశ్వరుడినే ఆవలనున్న పరమాత్ముడిగా ప్రార్థిస్తా'నంటారు అన్నమయ్య. ఈ కీర్తనలో అన్నమయ్య చూపిన ఉపమానాలు గాని, ఆ భావనల వెనక ఉన్న జ్ఞానం కాని నిరుపమానం.

పురుషుడు పురుషోత్తముని అనుసరిస్తాడు కనుక, సర్వకల్యాణగుణసంపన్నుడు, త్రిభువన సుందరుడు అయిన మూర్తిని పూజించడంద్వారా మనిషి వ్యక్తిత్వ వికాసానికి కూడా ఉపయోగపడుతుందని హేతుబద్ధంగా సగుణోపాసనను సమర్థించారు అన్నమయ్య. అద్వైతంలో భగవంతుడికి రూపుకు ప్రాధాన్యం లేదని భావిస్తారు. అయితే, విశిష్టాద్వైతంలో భగవంతుడు త్రిభువన సుందరుడు, సకల కళ్యాణ గుణ స్వరూపుడు. ఆ స్వరూపానికి ఎన్నో ఉపచారాలతో భక్తులు పూజించుకుంటారు. అన్నమయ్యకూడా భగవంతుని కళ్యాణ గుణ స్వరూపునిగా అర్చించారు. అయితే అన్నమయ్య సంపూర్ణ జ్ఞానంతోనే ఈ విధంగా సగుణోపాసన చేసినట్లుగా కనపడుతుంది.

'భ్రమరకీటన్యాయం'గా ఆ పరమాత్ముని గుణగణాలను తీవ్రంగా ఉపాసించి, ఆ గుణాలను స్వయంగా పొంది పరమాత్మ స్వరూపంగా అవతరించేందుకే ఈ సగుణోపాసన అని అంటారు అన్నమయ్య. ఇదే భావాన్ని అన్నమయ్య, *ఇదివో సుజ్ఞానము సూత్రే మణిగణా యివ* (2-121) అన్న కీర్తనలో ఇలా చెప్పారు.

*వెదకు మా శ్రీవేంకటపతి నిను సేవించఁగ నిను సేవించఁగను*

*అదన నిన్నంటినవారల నీయంతలు సేతువుగాన*

దీన్నే హేతుబద్ధమైన ఆస్తికత లేదా అధ్యాత్మికతగా పేర్కొనవచ్చు.

*ధరలో నెద్భావం తద్భవ తనెఁ గాన*

*హరిమయమే జగమంతాను*

*సారె శ్రీవేంకటపతి సగుణము దలఁచిన*

*సారపు జీవుఁడు దాను సగుణమే*

*నేరుపుల నాతని నిర్గుణము దలఁచిన*

*తారతమ్యములులేని తానూ నిర్గుణమే (2-435)*

అంటూ భగవంతుడు సగుణమైనా, నిర్గుణమైనా భక్తుని భావననుబట్టే అన్న ఎఱుకను ప్రదర్శించారు.

మూఢనమ్మకాలను ఖండించడంలో కూడా అన్నమయ్య హేతుబద్ధతను గమనించవచ్చు. భగవంతుడిపై అనన్యమైన భక్తి విశ్వాసాలు కలవారే అయినా, అంధవిశ్వాసాలకు, మూఢనమ్మకాలకు చోటివ్వని భక్తి ఆయనది.

*యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును*

*వొక్కట నంతర్యామై వున్నాఁడదె* (3-252)

‘తీర్థయాత్రలంటూ ఇల్లు, వాకిలి, సంసారాలను వదులుకుని ఊరూరా తిరగవలసిన పని లేదు, భగవంతుడు అంతర్యామిగా ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాడు, దర్శించ’మంటారు అన్నమయ్య.

*కన్నులయెదుటనుఁ గాంచినజగ మిది*
*పన్నిన ప్రకృతియు బ్రహ్మమునే*
*యిన్నిట నుండఁగ నిదిగాదని హరిఁ*
*గన్న చోట వెదకఁగఁబోనేలా*(4-324)

‘మనిషే కాదు చుట్టూ కనిపిస్తున్న ప్రకృతికూడా బ్రహ్మమే. ఇన్ని చోట్ల భగవత్స్వరూపం కనిపిస్తూ ఉండగా, ఇది కాదు, ఇంకెక్కడో ఉన్నాడంటూ వెతకబోవడం హాస్యాస్పదం’ అంటారు.

*మొక్కరో మీరు మోసపోక – మీకు*
*దిక్కు దైనైన ఆదిదేవునికి*

*మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు*
*బీరాన గుండెలు గోసి పెట్టవద్దు*
*గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు*
*ఊరకే మీవారమని వున్నఁ జాలు*

*సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు*
*బడి బడి పగ్గాలఁ బారవద్దు* (4-593)

అనాదిగా, శైవం, వైష్ణవం, శాక్తేయం భారతదేశంలో ప్రధానమతాలుగా చెలామణీ అవుతూ వచ్చాయి. శాక్తేయంలో, శైవంలోని కొన్ని వీరశైవశాఖలలో కాళ్ళు చేతులు తెగగోసి హోమాలు చేయడం, నిప్పుల్లోకి దూకడం, జంతు బలులివ్వడం వంటి తామసకృత్యాలతో కూడిన

ఆచారాలు ఉన్నాయి. ఈ కీర్తనలో అటువంటి ఆచారాలను అధిక్షేపించారు అన్నమయ్య. అటువంటి ఆచారాలవల్ల ధనలాభమో, అతీంద్రియ శక్తులో సిద్ధిస్తాయని చెప్పేవారి వలలో పడవద్దని హెచ్చరించారు. దేవునికి మనస్ఫూర్తిగా మొక్కి 'నీ వాడిని' అంటే చాలని అంతకంటే దేవుడు వేరే ఏదీ కోరడని ప్రబోధించారు.

మోక్షం జీవుడు సాధించవలసిన పరమ పురుషార్థం. అయితే, స్వార్థరాహిత్యమే మోక్ష భావం అని, స్వార్థరాహిత్యం లోకసేవకు, లోకకల్యాణానికి దారి తీస్తుందని, సంఘసేవే మతానికి అసలైన పరమార్థమని రామానుజాచార్యులు ప్రబోధించారు. తన ఉన్నతి కోసం కాక, లోకోన్నతి, లోక కల్యాణంగురించి కృషి చేయడం మోక్షసన్యాస యోగమని బోధించారు రామానుజాచార్యులు. అన్నమయ్య ఇదే భావనను తన కీర్తనలలో వెలిబుచ్చారు.

*యెదిరి కెప్పుడుఁ జేయు హితమెల్లఁ దనదనుచు*

*చదివి చెప్పని యట్టి చదువేలా*(1-302)

బహుశాస్త్రకోవిదుడు అయిన అన్నమయ్య వేదోపనిషత్తుల సారాన్ని కీర్తనలుగా మలిచిన ఘనుడు. ఎన్నో శాస్త్రాలు తవ్వి తీసిన అర్థాన్ని ఇలా చెప్పారు.

*కంటి నిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి*

*పరపీడ సేయుకంటే పాపము మరెందు లేదు*

*పరోపకారముకంటే బహుపుణ్యము లేదు* (1-443)

పరులను పీడించడంకంటే వేరే పాపం లేదు, ఇతరులకు ఉపకారం చేయడంకంటే పుణ్యం లేదు అని చుట్టూ ఉన్న మనుషులను సేవించడం మానేసి ఎక్కడెక్కడికో పుణ్యం కోసం తిరగాల్సిన పని లేదని సూచించారు. ఈ విధంగా గుడ్డి నమ్మకాలకు, మూఢ విశ్వాసాలకు తావివ్వని స్వచ్ఛమైన భక్తిని, మానవత్వాన్ని బోధించి మతాన్ని సంస్కరించారు అన్నమయ్య.

అన్నమయ్య సాధించిన మరో సంస్కరణ సంఘ సంస్కరణ. అన్నమయ్య కాలం నాటి సమాజం కుల, మత, జాతి వైషమ్యాలతో కూడినది. ఆ సమాజానికి అన్నమయ్య తన కీర్తనలద్వారా సందేశమిచ్చి సంస్కరించే ప్రయత్నం చేశారు.

*బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర*
*బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే*

*కందువగు హీనాధికములిందు లేవు*
*అందరికి శ్రీహరే అంతరాత్మ*
*ఇందులో జంతుకుల మింతా నొకటే*
*అందరికి శ్రీహరే అంతరాత్మ*

*నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే*
*అండనే బంటునిద్రదియు నొకటే*
*మెండైన బ్రాహ్మణుఁడు మెట్టు భూమి యొకటే*
*ఛండాలుఁడుండేటి సరిభూమి యొకటె*

*అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే*
*ఘనకీటపశువులకు కామసుఖ మొకటె*
*దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే*
*వొనర నిరుఁబేదకును వొక్కటే అవియు*

*కొరలి శిష్టాన్నములు గొను నాఁకలొకటే*
*తిరుగు దుష్టాన్నములు దిను నాఁకలొకటే*

*పరగ దుర్గంధములపై వాయువు నొకటే*
*వరుసఁ బరిమళముపై వాయువు నొకటే*

*కడఁగి యేనుఁగుమీఁదఁ గాయు యెండొకటే*
*పుడమి శునకముమీఁదఁ బొలయు నెండొకటే*
*కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ*
*జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే* (2-385)

'ఆహారం, నిద్ర, మైథునం మొదలైనవాటికి, భూమి, గాలి, ఎండ, పగలు, రాత్రి మొదలైన ప్రకృతి సంబంధమైనవాటికి జాతికులభేదాలు లేవు. వీటినన్నిటినీ నియంత్రించే ఆ పరమేశ్వరుడికి జాతిభేదాలే కాదు, పాపులు, పుణ్యులు అనే భేదంకూడా లేదు. అటువంటప్పుడు మనుషులకు మాత్రం కులభేదాలెందు'కని ఈ కీర్తనలో ప్రశ్నించారు అన్నమయ్య.

ఆతుమ సకలవ్యాపకమని తలపోసినపిమ్మట
జాతియుఁ గులాభిమానముఁ జర్చింపనెరాదు

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచినఁ మొక్కకపోరాదు

పరిపూర్ణుఁడు తిరువేంకటపతియనఁగా వినినప్పుడు
యెరవుల హీనాధికములు యొగ్గులు మరి లేవు (1-47)

పై కీర్తనలో విజ్ఞానార్జనవల్ల ఫలితమెలా ఉండాలన్నది చర్చిస్తారు. 'అన్ని జీవులలో ఉండేది ఆత్మ ఒక్కటే అని తెలుసుకుంటే, జాతి, కులం అనేవాటిపై అభిమానం పెంచుకోం. అన్ని ప్రాణులలో ఉండేది ఆ పరబ్రహ్మమే అని తెలుసుకుంటే ఎవరిని చూసినా నమస్కరించకుండా ఉండలేం.

పరిపూర్ణుడు ఆ పరమేశ్వరుడొక్కడే అని తెలుసుకున్నప్పుడు ఒకరెక్కువ మరొకరు తక్కువ అంటూ నిందించం.'

అన్నమయ్య సంఘసంస్కరణ వర్ణభేదాలను ఖండించడంతో ఆగిపోలేదు. వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించి అసలైన సంస్కరణ దృష్టిని ప్రదర్శించారు. *జంతగాని తరుణి యేజాతైన నదె చాలు* (1-114) అంటూ 'గయ్యాళిది కాకపోతే చాలు ఏ జాతి స్త్రీ అయినా ఒకటే' అంటూ ఇప్పటికీ లేని ఆధునికతను ప్రాచీనకాలంలోనే కనబరిచారు. అంతే కాదు, ఈ కాలంలోకూడా పాటించే మూఢాచారాలను ఆ కాలంలోనే ఖండించారు.

*పిండములను జేసి పితరుల దలపోసి*
*కాకులకును బెట్టు గాడ్దెలార*
*పియ్యి దినెడు కాకి పితరు డెట్లాయెరా*
*విశ్వదాభిరామ వినురవేమ!* (కామేశ్వర రావు, పి. 2004:19)

అని ప్రశ్నించిన వేమనకు కొన్ని శతాబ్దాల పూర్వమే అన్నమయ్య ఇలా అన్నారు.

*నరులకు నరులే పరలోకక్రియలు*
*సిరిమోహాచారాలఁ జేతురు గాక*
*తరుపాషాణపశుతతుల కెవ్వరు సేసే-*
*రరయఁగ భ్రమ గాక అవి పస్తులున్నవా* (2-126)

ఉత్తరగతుల కోసం పెద్దలకు, పూర్వీకులకు పిండ ప్రదానం చేయడం వంటివి చేయడం ఈనాటికీ చూస్తూంటాం. అన్నమయ్య ఐదువందల ఏళ్ళ క్రితమే ఇది మూఢాచారమంటూ ఖండించారు. 'పితృదేవతలు సంతోషిస్తే మనకు కలిసొస్తుందనో, లేక ఆచారమనో పరలోకక్రియలు చేస్తూంటారు మనుషులు. మరి చెట్లు, పశువులు మొదలైనవాటికి

ఆకళ్ళుండవా? వాటికి ఎవరూ చేయటం లేదు కనుక పస్తులుంటున్నాయా?' అంటూ ప్రశ్నించి ఈ ఆచారంలోని డొల్లతనాన్ని బయటపెట్టారు అన్నమయ్య.

*జాతి యిందే దంత్యజాతి యిందేది*
*జాతులన్నిటా నాత్మ సర్వేశుఁడు*
*ఆతలను అంటుముట్టనెడి భావనలెల్ల*
*బాఁతిపడి యెఱఁగనోపని వెలితే తనది*

*తెలివిగలదాఁకాఁ దెగని మఱఁగు లివి*
*తెలిసినంతటిమీఁదఁ దీరు సంశయము*
*యిలలోన శ్రీవేంకటేశ్వరుని కరుణచే*
*వెలసి యీజ్ఞానంబు విడువకు మనసా* (2-136)

'జాతులన్నిటా ఉన్నది పరమేశ్వరుడే అయినప్పుడు, అగ్ర జాతి, అంత్య జాతి అనే భావనలే వద్దన్నారు. అంటు, ముట్టు అంటూ మనుషుల్ని దూరం చేసుకోవ'ద్దన్నారు. 'ఇవన్నీ అజ్ఞానంలో ఉన్నప్పుడు మనిషిని కప్పేసి ఉండే మాయ'లన్నారు. 'తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఈ మాయలు తొలగిపోతాయి' అంటూ ఉపదేశమిచ్చారు.

*ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము*
*దీమపువిజ్ఞానమే దివ్వెత్తు ఫలము*

*పాపచింత మదిలోనఁ బారకుండా నిలిపితే*
*చేపట్టి దానములెల్లాఁ జేసినంత ఫలము*
*కోపానలములోన కోరికలు వేల్చితేనే*
*యేపున యజ్ఞాలు సేసి యేచినంత ఫలము*

*కనకముపై యాస కాదని పోదొబ్బితేనే*

*తనకు వేవేలు ఘోరతపముల ఫలము*

*వనితలమోహములవలఁ బడకుండితేనే*

*దినము గోటితీర్థాలు దిరిగినఫలము* (1-430)

'మోక్షం పేరుతో ముక్కుమూసుకుని అందరికీ దూరంగా అడవుల్లో ఉండి తపస్సులు చేయనక్కర్లేదు. యజ్ఞయాగాదులు, దానధర్మాదులను చేయనక్కరలేదంటూ మోక్షానికి సులువైనదారి ఈ కీర్తనలో చెప్పారు. ఒకరికి హాని చేయాలనే పాపచింత మనసులోకి రాకుండా ఉంటే అదే అనంతమైన దానాలు చేసిన ఫలం. కోపం అనే అగ్నిలో కోరికలన్నిటిని కాల్చివేస్తే అదే యజ్ఞాలు చేసినంత ఫలం. బంగారంపై ఆశను వదులుకుంటే, తపస్సులెన్నో చేసినంత ఫలం. స్త్రీలపై కోరిక అనే వలలో పడకుండా ఉంటే, రోజూ కోటితీర్థాలు తిరిగిన ఫలం' అని చెప్పారు అన్నమయ్య. అంటే పరోక్షంగా, తీర్థయాత్రలు, దానధర్మాలు, యజ్ఞయాగాదులు, ఘోరతపస్సులు వంటివాటి జోలికి పోనవసరం లేదని, సంసారంలో ఉంటూనే చేయదగిన పనులను బోధించారు అన్నమయ్య. ఇటువంటి పనులతోనే మోక్షం సాధించవచ్చని, 'విజ్ఞానదీపం మదిలో వెలిగించుకుంటే, అదే అనంతమైన ఫలాన్నిస్తుం'దని అన్నారు. ఇప్పటికీ ఎన్నో పాపాలు చేసి, గుళ్ళుగోపురాలు తిరిగి, దానాలు చేసి పాపప్రక్షాళన అయ్యిందని భావించేవారిని చూస్తుంటాం. పై అన్నమయ్య కీర్తనలు 500 ఏళ్ళ క్రితం రచించినవి అయినా ఈ కాలానికికూడా వర్తించేటట్టుగా ఉండడం గమనార్హం. ఈ విధంగా అన్నమయ్య మూఢనమ్మకాలతో, దురాచారాలతో నిండిన తన కాలపు సమాజాన్ని తన కీర్తనలద్వారా సంస్కరించే ప్రయత్నం చేసి, హేతుబద్ధమైన ఆధ్యాత్మికతను ప్రబోధించారు.

*****

# ఉపసంహారం

# ఉపసంహారం

ఈ విభాగంలో *అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తిమార్గాల అనుశీలన* అన్న ఈ పరిశోధన గ్రంథంలో చర్చించిన అంశాల క్రోడీకరణ, ఫలితాంశాల ప్రకటన ఉన్నాయి.

**పరిశోధనాంశాల క్రోడీకరణ – అధ్యాయాల వారీగా**

**మొదటి అధ్యాయం: అన్నమయ్య భక్తి తత్త్వం – విశిష్టాద్వైతం**

ఏ రచననైనా అర్థం చేసుకోవడానికి ఆ రచన వెనుక ఉన్న తాత్త్విక నేపథ్యాన్ని – ఆ రచన ఏ ఉద్దేశంతో రచించబడిందో అన్న విషయాన్ని – అర్థం చేసుకోవడం చాలా అవసరం. అలా అన్నమయ్య కీర్తనలను అర్థం చేసుకోవాలంటే, అన్నమయ్య కీర్తనల నిండా పరుచుకుని ఉన్న విశిష్టాద్వైత తత్త్వాన్ని అర్థం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.

అన్నమయ్య పలు కీర్తనలలో మాయావాదులు, ఏకాత్మవాదులు, అభేదవాదులు అనబడే అద్వైతులను ఖండించారు. భక్త కవి అయిన అన్నమయ్యకు ఇలా ఇతర వైదిక శాఖలను ఖండించవలసిన అవసరం ఎందుకు కలిగింది? అన్నమయ్య కొన్ని కీర్తనలలో కులభేదాలను తెగనాడి, సర్వమానవ సమానత్వాన్ని బోధించారు. సమకాలీన సమాజంలో లేని ఇంతటి సామాజిక చైతన్యం అన్నమయ్యలో సహజంగానే కలిగిందా? దీని వెనుక కారణాలేమైనా ఉన్నాయా? అన్నమయ్య తన కీర్తనలలో ప్రస్తావించిన ఆళ్వార్లు, ఆచార్యులు ఎవరు? వారి రచనలేమిటి? అన్నమయ్యపై వారి ప్రభావమేమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైతాన్ని కూలంకషంగా పరిశీలిస్తే కాని బోధపడవు. కనుక, అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైత మత చారిత్రక, సైద్ధాంతిక నేపథ్యాలు, అన్నమయ్యను ప్రభావితం చేసిన ఆళ్వారాచార్యులు, విశిష్టాద్వైత సిద్ధాంతాలనుగురించి ఈ అధ్యాయంలో చర్చించాను.

విశిష్టాద్వైత మత ఆవిర్భావానికి దారితీసిన చారిత్రక అవసరాలను అధ్యయనం చేసే ప్రయత్నంలో భాగంగా భారతభూమిలో వెలసిన ప్రాచీనమతాలను, i) వైదిక మతం ii) బౌద్ధం iii) జైనం iv) శైవం v) వైష్ణవం vi) అద్వైతం vii) విశిష్టాద్వైతం, వాటితో ముడిపడి ఉన్న సామాజిక పరిస్థితులను స్థూలంగా చర్చించాను.

భరతఖండంలో మొదట పుట్టిన వైదిక మతం యజ్ఞయాగాదుల రూపంలో కర్మ మార్గాన్ని, వేదాంతాలైన ఉపనిషత్తుల రూపంలో జ్ఞానమార్గాన్ని ప్రబోధించింది. వైదిక సంస్కృతి వేదాల చుట్టూ అభివృద్ధి చెందింది. వైదిక మతంలోని ఆచారాలను ఖండిస్తూ బౌద్ధ, జైన మతాలు వెలుగు చూశాయి. వివిధ వైదిక, అవైదిక మతాల మధ్య విభేదాలను ఖండిస్తూ, అవైదిక మతాలను నిరసిస్తూ, వేద ప్రామాణ్యాన్ని తిరిగి నెలకొల్పుతూ అద్వైతం ప్రభవించింది. నిరాకార, నిర్గుణ బ్రహ్మాన్ని, జీవబ్రహ్మైకత్వాన్ని ప్రతిపాదించిన అద్వైతాన్ని ఖండిస్తూ అప్పటి సమాజపు చారిత్రకావసరంగా విశిష్టాద్వైతం ఆవిర్భవించింది. ఇలా విశిష్టాద్వైత ఆవిర్భావానికి నెలకొని ఉన్న చారిత్రక పరిస్థితులను ఈ శీర్షిక కింద చర్చించాను.

శ్రీవైష్ణవంగా వ్యవహరింపబడే విశిష్టాద్వైతానికి సైద్ధాంతిక నేపథ్యాన్ని సమకూర్చింది క్రీ.శ. 7-9 శతాబ్దాలలో జరిగిన భక్తి ఉద్యమం. బౌద్ధ, జైన మతాల సర్వ మానవ సమానత్వం, వర్ణ తిరస్కారం, సామాన్య జీవన విధానం హిందూ సంస్కర్తలను ఆకర్షించాయి. ఫలితంగా, సరళీకృత రూపాలతో వైదిక మత శాఖలు తమను తాము పునరావిష్కరించుకొన్నాయి. బౌద్ధ జైనాలకు ప్రత్యామ్నాయంగా కులభేదరహితమైన భక్తి మార్గాన్ని చూపించాయి. బౌద్ధజైనాలు జనబాహుళ్యాన్ని ఆకర్షించడానికి మరో కారణం సామన్యుడికి అర్థమయ్యే భాషలో ఆయా మతాల ప్రచారం జరగడం, అందుకు అనువైన సాహిత్యాన్ని వారు సృష్టించుకోవడం. ఈ పంథాలోనే, వైదిక దేవతలను సామాన్యులకు దగ్గర చేసే ప్రయత్నాలలో భాగంగా దేశీయ భాషలలో గేయరచన చేశారు భక్త కవులు. శైవ భక్తులైన నాయనార్లు భక్తి ప్రధానమైన

గేయాలతో శైవానికి ఊపిరులూదారు. అలాగే ఆళ్వార్లు తమ పాశురాలతో వైష్ణవ మతోత్థానానికి దోహదం చేశారు.

ఆళ్వార్ల నాలుగువేల పాశురాల సంకలనమే ద్రావిడ వేదంగా ప్రసిద్ధి పొందిన నాలాయిర దివ్య ప్రబంధం. మధురభక్తిని మొదటిసారిగా అనుభవించి, తమ కీర్తనలలో వెలయించింది నమ్మాళ్వారు, ఆండాళ్ మొదలుగా గల ఆళ్వారులే. వీరి పాశురాలు అన్నమయ్యపై చూపిన ప్రభావాన్ని స్థూలంగా చర్చించాను. ఆళ్వార్లు ప్రబోధించిన విష్ణు భక్తికి శాస్త్రీయతను జోడించి, శ్రీవైష్ణవానికి మతంగా ప్రాచుర్యం కల్పించారు నాథముని, యామునులు, రామానుజులు మొదలైన ఆచార్యులు. వీరు విశిష్టాద్వైతమత ప్రచారానికి చేసిన కృషిని ఈ శీర్షికలో వివరించాను.

విశిష్టాద్వైతంలో ముఖ్యంగా తత్త్వత్రయ జ్ఞానం, జీవాత్మ–పరమాత్మ సంబంధం, భగవంతుని కళ్యాణ గుణ స్వరూప కీర్తన, ముక్తిమార్గంగా శరణాగతి ప్రాముఖ్యం, రహస్య మంత్రత్రయం, గురు భక్తి, భాగవత భక్తి అనేవి ప్రధానమైన అంశాలు. వీటిని గురించి ఈ అధ్యాయంలో చర్చించాను.

ఈ విధంగా అన్నమయ్య కీర్తనలనిండా వ్యాపించి ఉన్న విశిష్టాద్వైత తత్త్వాన్ని, విశిష్ట పురుషులను, విశిష్టాద్వైత సిద్ధాంతాలను వివరించే ప్రయత్నం ఈ అధ్యాయంలో చేశాను.

**రెండవ అధ్యాయం: నవవిధ భక్తి మార్గాలు : పూర్వ కవుల దర్శనం**

నా పరిశోధన విషయం *అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తి మార్గాల అనుశీలన.* కనుక, ఈ అధ్యాయంలో నవవిధభక్తిమార్గాలైన 1) శ్రవణం 2) కీర్తనం 2) స్మరణం 4) పాదసేవనం 5) అర్చనం 6) వందనం 7) దాస్యం 8) సఖ్యం 9) ఆత్మ నివేదనం లను తొమ్మిది ఉపవిభాగాలుగా విభజించి చర్చించాను. నవవిధ భక్తి మార్గాలు అంటే ఏమిటి? అవి మొదటిసారిగా ప్రతిపాదించబడ్డ *భాగవతంలో*, విష్ణుపారమ్య కావ్యమైన *రామాయణంలో* –

*భాస్కర రామాయణం, మొల్ల రామాయణాల్లో* – ఎలా అనుశీలించబడ్డాయి? వంటి విషయాలను పరిశీలించాను. ఈ పరిశీలన అన్నమయ్య సంకీర్తనల్లోని నవవిధ భక్తిమార్గాలను అనుశీలించడంలో ఉపయోగపడింది.

**మూడవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తి మార్గాలు**

మూడవ అధ్యాయంలో నా పరిశోధనాంశ మూల విషయమైన అన్నమయ్య సంకీర్తనల్లోని నవవిధ భక్తి మార్గాలను విపులీకరించాను. ఒక్కో భక్తి మార్గాన్ని ఒక ఉపవిభాగంగా చేసుకుని అన్నమయ్య కీర్తనలను ఉదహరించి, ఆ కీర్తనలపై ఆళ్వార్ల ప్రభావాన్ని పరిశీలిస్తూ ఈ అధ్యాయాన్ని సాగించాను.

అన్నమయ్య కీర్తనలు భాగవత, రామాయణాల్లా కథా సంబంధమైనవి కాదు కనుక, ఆయా భక్తి మార్గాలను పాటించడం వల్ల కలిగే ఫలితాలను ఉగ్గడించినా/ప్రాశస్త్యాన్ని వివరించినా (ఫలితం), లేక ఆ భక్తి మార్గాలను పాటించమని ఉపదేశించినా (ప్రవచనం), ఆయా భక్తి మార్గాలను అన్నమయ్య స్వయంగా కీర్తనలో ప్రదర్శించినా (ప్రదర్శనం) కూడా ఆ కీర్తన ఆ భక్తి మార్గానికి సంబంధించినదిగా పరిగణించాను.

అన్నమయ్య శ్రవణ మహాత్మ్యాన్ని ఉగ్గడించిన, శ్రవణ భక్తిని ప్రవచించిన, తాను స్వయంగా శ్రవణ భక్తిని ప్రదర్శించిన కీర్తనలన్నీ శ్రవణభక్తి విభాగంలో పేర్కొన్నాను. ఈ విధంగానే, స్మరణ, పాదసేవన, వందన, దాస్య భక్తులను విశ్లేషించాను. అన్నమయ్య కీర్తన భక్తిని 1. నామ కీర్తన 2. లీలా కీర్తన 3. గుణ కీర్తన 4. రూప కీర్తన 5. మహత్వ కీర్తన 6. ప్రతాప కీర్తన 7. అవతార కీర్తన 8. దశావతార కీర్తన 9. వ్యాజ స్తుతి గా విభజించాను.. అర్చన భక్తిని షోడశోపచారాలు, మేల్కొలుపులు, మంగళాశాసనం, లాలి – ఇతర సేవలుగా వింగడించి చర్చించాను. భగవంతుడిపట్ల స్నేహభావ ప్రదర్శనే సఖ్య భక్తి. భగవంతుడిపట్ల దాసభావాన్ని ప్రదర్శించడమే విశిష్టాద్వైత మత లక్షణం. కనుక, ఆ మతానుయాయి అయిన

అన్నమయ్య సఖ్య భక్తిని ప్రదర్శించే కీర్తనలు పెద్దగా కనపడవు. అయితే అన్నమయ్య భగవంతుడి సఖ్యభక్తి స్వభావాన్నిగురించి, అర్జునుడి సఖ్య భక్తినిగురించి కొన్ని కీర్తనలలో ప్రస్తావించారు. వాటిని సఖ్యభక్తిలో చర్చించాను. అన్నిటికంటే ముఖ్యమైన భక్తి రీతి ఆత్మనివేదన. దీనినే శరణాగతి, ప్రపత్తి లేక భరన్యాసం అని కూడా అంటారు. ఇది కర్మ, జ్ఞాన, భక్తి మార్గాల్లా భగవంతుని చేరే ప్రత్యేకమైన మార్గంగా గుర్తింపు పొందింది. విశిష్టాద్వైతంలో శరణాగతి అనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, రక్షిష్యతీతి విశ్వాసం, గోప్తృత్వవరణం, కార్పణ్యం, ఆత్మనిక్షేపం అనే ఆరు రకాలుగా, షడాంగ శరణాగతిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆరు రకాలైన శరణాగతి మార్గాలు అన్నమయ్య కీర్తనలలో ప్రతిఫలించిన విధానాన్ని వివరించాను.

ఇలా ఒక్కో భక్తి మార్గానికి సంబంధించిన కొన్ని కీర్తనలను చర్చించి, మొదటి ఆరు సంపుటాలలో ఉన్న ఆయా భక్తి మార్గాలకు చెందిన కీర్తనలను అనుబంధంలో పట్టికలుగా ఇచ్చాను. ఒకటి కంటే ఎక్కువ భక్తి మార్గాలను ప్రదర్శించిన కీర్తనలను కూడా ప్రత్యేకంగా మరొక పట్టికలో పొందుపరిచాను.

**నాలుగవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనలలో ఇతర భక్తి మార్గాలు**

నాలుగవ అధ్యాయంలో అన్నమయ్య తానే స్వయంగా ప్రతిపాదించిన ఏకాదశభక్తి మార్గాలను, ఇతర భక్తి మార్గాలైన మధుర భక్తి, వాత్సల్య భక్తి, వైర భక్తి, అనన్య భక్తి తదితరాలను అన్నమయ్య కీర్తనల్లో పరిశీలించాను.

మానవులు అవలంబించే భక్తి మార్గాలు అనేకం ఉన్నాయని, ఏ భక్తి మార్గాన్నైనా భగవంతుడు అంగీకరిస్తాడని చెబుతూ, అన్నమయ్య ఏకాదశ భక్తి మార్గాలను ప్రతిపాదించారు. అవి 1. ఉన్మాద భక్తి 2. పతివ్రతా భక్తి 3. విజ్ఞాన భక్తి 4. ఆనంద భక్తి 5. రాక్షస భక్తి 6. తురీయ భక్తి 7.తామస భక్తి 8. వైరాగ్య భక్తి 9. రాజస భక్తి 10. నిర్మల భక్తి

11. నిజ భక్తి. వాటికి లక్షణాలను నిర్వచించారు. వాటికి లక్ష్యాలుగా కీర్తనలను రచించారు. అన్నమయ్య కీర్తనలను ఉదహరిస్తూ ఈ భక్తి మార్గాలను వివరించాను. ఇవే కాక, మధుర భక్తి, వాత్సల్య భక్తి, వైర భక్తి, అనన్య భక్తి మొదలైన మరిన్ని భక్తి మార్గాలను తన కీర్తనలద్వారా అన్నమయ్య ప్రదర్శించారు. ఒక్కొక్క భక్తి మార్గానికి సంబంధించిన కొన్ని కీర్తనలను విపులంగా చర్చించి, మొదటి ఆరు సంపుటాలలో ఉన్న ఆయా భక్తి మార్గాలకు చెందిన కీర్తనలను అధ్యాయం చివరన పట్టికలుగా ఇచ్చాను.

**ఐదవ అధ్యాయం: నేటి సమాజంలో అధ్యాత్మికత**

ఐదవ అధ్యాయంలో అధ్యాత్మికత అంటే ఏమిటో వివరించి, మనిషి జీవితంలో, మరీ ముఖ్యంగా ఆధునిక కాలంలోని మనిషి జీవితంలో ఆధ్యాత్మికత పాత్రను చర్చించాను. ఆధునిక వచన సాహిత్య నిర్మాతలలో ప్రముఖులైన చలం, గోపీచంద్ ల రచనా జీవితాలను పరిశీలించి మనిషి నాస్తికతలో లేక సంశయాత్మకతలో కంటే ఆస్తికత లేక ఆధ్యాత్మికతలో శాంతి, సత్యాలను పొందుతాడని నిదర్శనాధ్యయనంద్వారా నిరూపించాను. ఆధునిక సమాజానికి కావలసినది హేతుబద్ధతతో కూడిన అధ్యాత్మికతగా ప్రతిపాదించి, ఆధునిక ఆధ్యాత్మ గురువులైన రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణ మహర్షి ప్రవచించిన హేతుబద్ధమైన ఆధ్యాత్మికతను పట్టి చూపి, అన్నమయ్య ప్రదర్శించిన హేతుబద్ధమైన అధ్యాత్మికతను వివరించాను. చివరగా అనుబంధంలో, ఆధునిక అధ్యాత్మిక ప్రవచనకర్త డా॥ గరికిపాటి నరసింహారావుగారితో జరిపిన ముఖాముఖి పాఠాన్ని జోడించి, ఆయన వివరించిన ఆధ్యాత్మికతను జతచేశాను.

## ఫలితాంశాల ప్రకటన

ఈ పరిశోధన వ్యాసం ద్వారా నేను సాధించిన ఫలితాలు:

### మొదటి అధ్యాయం – అన్నమయ్య భక్తి తత్త్వం – విశిష్టాద్వైతం

1. అన్నమయ్య కీర్తనల వెనక గల భక్తి తత్త్వం విశిష్టాద్వైతం.
2. నిరాకార, నిర్గుణ బ్రహ్మాన్ని, జీవబ్రహ్మైకత్వాన్ని ప్రతిపాదించిన అద్వైతాన్ని ఖండిస్తూ అప్పటి సమాజపు చారిత్రకావసరంగా విశిష్టాద్వైతం ఆవిర్భవించింది.
3. శ్రీవైష్ణవంగా వ్యవహరింపబడే విశిష్టాద్వైతానికి సైద్ధాంతిక నేపథ్యాన్ని సమకూర్చింది క్రీ.శ. 7–9 శతాబ్దులలో జరిగిన భక్తి ఉద్యమం.
4. బౌద్ధ, జైన మతాల నుంచి సర్వమానవసమానత్వం, సామాన్య జీవనవిధానం, కులభేదరాహిత్యం, ప్రజాభాషలో మతసాహిత్య రచనను గ్రహించిన భక్త్యుద్యమం, అద్వైతం ప్రచారం చేసిన నిరాకారోపాసనకు భిన్నంగా సగుణారాధనను ప్రతిపాదించింది.
5. వైదికసమాజంలో వ్యవస్థాగతమైన భక్తి, భక్త్యుద్యమంతో వ్యక్తినిష్ఠమైంది. భగవంతుడు భక్తునికి మరింత చేరువయ్యాడు.
6. భక్త్యుద్యమ లక్షణాలన్నీ విశిష్టాద్వైతంలో ప్రతిఫలించాయి.
7. ఆళ్వారుల భక్తి గీతాలు, ఆచార్యుల సిద్ధాంత గ్రంథాలు విశిష్టాద్వైతానికి జీవనాడులు.
8. ఆళ్వారాచార్యుల రచనల ప్రభావం అన్నమయ్య కీర్తనలలో విశేషంగా కనపడుతుంది.

### రెండవ అధ్యాయం – నవవిధ భక్తి మార్గాలు : పూర్వ కవుల దర్శనం

9. భాగవతంలో శ్రవణంవల్ల తరించింది శౌనకాది మహర్షులు, పరీక్షిత్తు, నారదుడు, విదురుడు. వీరి శ్రవణ భక్తిని భాగవతంలోని పద్యాలను ఉదహరించి నిరూపించడం

జరిగింది. మొల్ల రామాయణంలో మొల్ల శ్రవణ భక్తి మహత్వాన్ని ప్రతిపాదిస్తే, భాస్కర రామాయణంలో స్వయంగా రాముడే శ్రవణానికి ప్రాధాన్యతనిచ్చి లోకానికి ఆదర్శప్రాయంగా నిలిచాడు.

10. భాగవతంలో నామకీర్తనద్వారా కుంతి; రూప కీర్తనద్వారా భీష్ముడు, శుకుడు, బ్రహ్మ; గుణ కీర్తనద్వారా ప్రచేతసులు; అవతార కీర్తనద్వారా శుకుడు, బ్రహ్మ తరించారు. మొల్ల రామాయణంలో సీత, హనుమలు; భాస్కర రామాయణంలో హనుమ రామకీర్తన చేశారు.

11. భాగవతంలో ఖట్వాంగుడు, అజామిళుడు, ప్రహ్లాదుడు, రామాయణంలో సీత స్మరణ భక్తికి తార్కాణంగా నిలిచినవారు.

12. నిత్యానపాయిని అయిన లక్ష్మీదేవి పాదసేవన భక్తికి ప్రసిద్ధి చెందింది. అలాగే, పృథు చక్రవర్తి, భరతుడుకూడా స్వామి పాదసేవనలో మగ్నులయినవారే. మొల్ల రామాయణంలో భరతుడు, గుహుడు, భాస్కర రామాయణంలో లక్ష్మణుడు పాదసేవనభక్తిని ప్రదర్శించారు.

13. ఋషభుడి కుమారుడైన భరతుడు శ్రీహరి అర్చామూర్తిని, బ్రహ్మాది దేవతలు త్రివిక్రముడైన వామనుడిని, సుదాముడు, శ్రుతదేవుడు కృష్ణావతార సమయంలో కృష్ణస్వామిని అర్చించారు. అలాగే, మొల్ల రామాయణంలో భరద్వాజుడు, భాస్కర రామాయణంలో శరభంగ మహర్షి అర్చన భక్తితో రామచంద్రమూర్తిని సేవించారు.

14. భాగవతాంతర్గతంగా బ్రహ్మ, ధ్రువుడు, వసుదేవుడు, అక్రూరుడు, మొల్ల రామాయణంలో సీత, హనుమ, భాస్కర రామాయణంలో సుగ్రీవుడు వందనభక్తితో స్వామిని మెప్పించారు.

15. భాగవతంలో ఉద్ధవుడు, అంబరీషుడు, రామాయణంలో లక్ష్మణుడు దాస్యభక్తితో తరించారు.

16. భాగవతంలో అర్జునుడు, కుచేలుడు, మొల్ల రామాయణంలో విభీషణుడు, భాస్కర రామాయణంలో గుహుడు భగవంతుడిపట్ల సఖ్యభావాన్ని ప్రదర్శించారు.
17. భాగవతంలో ఉత్తర, భీష్ముడు, గజేంద్రుడు, బలి చక్రవర్తి, గోపకులు, మొల్ల రామాయణంలో విభీషణుడు, భాస్కర రామాయణంలో మారీచుడు ఆత్మనివేదన భక్తికి ఉదాహరణగా నిలిచారు.

## మూడవ అధ్యాయం – అన్నమయ్య సంకీర్తనలలో నవవిధ భక్తి మార్గాలు

18. భగవంతుడిని సేవించి, తరించడానికి సంకీర్తనమార్గాన్ని ఎంచుకున్న అన్నమయ్య సహజంగానే కీర్తనభక్తిని ఎక్కువగా ప్రదర్శించారు. అంటే భగవత్కీర్తనకు సంబంధించిన కీర్తనలే అన్నమయ్య ఎక్కువగా రాశారు.
19. అన్నమయ్యచేత కీర్తనభక్తి తరువాత ఎక్కువగా ప్రదర్శింపబడిన భక్తి మార్గం శ్రీవైష్ణవంలో మౌలికమైన అంశమైన ఆత్మనివేదన భక్తి లేక శరణాగతి.
20. నవవిధ భక్తి మార్గాలలో అన్నమయ్య అతితక్కువగా అనుష్ఠించిన భక్తి మార్గం సఖ్యభక్తి. భగవంతుడిపట్ల స్నేహభావ ప్రదర్శనే సఖ్య భక్తి. భగవంతుడిపట్ల దాసభావాన్ని ప్రదర్శించడమే విశిష్టాద్వైతమత లక్షణం. కనుక, ఆ మతానుయాయి అయిన అన్నమయ్య సఖ్య భక్తిని ప్రదర్శించే కీర్తనలు పెద్దగా కనపడవు.
21. అన్నమయ్య తన కీర్తనలద్వారా ఆత్మనిక్షేపం అంగిగా, అనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, రక్షిష్యతీతి విశ్వాసం, గోప్తృత్వవరణం, కార్పణ్యం అంగాలుగా గల షడాంగ శరణాగతిని ప్రదర్శించారు.

## నాలుగవ అధ్యాయం – అన్నమయ్య సంకీర్తనలలో ఇతర భక్తి మార్గాలు

22. అన్నమయ్య తానే స్వయంగా నిర్వచించిన ఏకాదశ భక్తి మార్గాలలో ఎక్కువగా తురీయభక్తిని ప్రదర్శించారు. భాగవతులను సేవించటం తురీయ భక్తి. శ్రీవైష్ణవ

సంప్రదాయంలో భాగవతుడికికూడా భగవంతుడికున్న స్థానమే ఉంది. తదనుగుణంగా అన్నమయ్యకూడా భాగవతుల సేవకు, భాగవతుల భక్తికి ప్రాముఖ్యతను ఇచ్చారు.

23. ఏకాదశ భక్తి మార్గాలలో అన్నమయ్య తురీయ భక్తి తరువాత స్థానాన్ని విజ్ఞాన భక్తికి ఇచ్చారు. భక్తి ఉద్యమపు కవి కనుక, అన్నమయ్య పదకవితా మార్గాన్ని ఎంచుకున్నదే జానపదులను చైతన్యవంతం చేసి, భక్తిమార్గంలోకి మళ్ళించటానికి కనుక అది సబబుగానే ఉంది.
24. అన్నమయ్య ప్రదర్శించిన ఇతర భక్తి మార్గాలలో మధురభక్తికి ప్రథమ తాంబూలమిచ్చారు. అన్నమయ్య సంకీర్తన సాహిత్యం 'మధురభక్తి మహార్ణవం'గా కీర్తించబడింది. ఆళ్వారులు చూపిన త్రోవగా మధురభక్తిని అన్నమయ్య అనుశీలించారు.
25. మధురభక్తి కాక, అన్నమయ్య ప్రదర్శించిన ఇతర భక్తి మార్గాలు వాత్సల్య భక్తి, అనన్య భక్తి, వైర భక్తి, క్షేత్ర కీర్తన, ఆయుధ కీర్తన మొదలైనవి.

**అయిదవ అధ్యాయం – నేటి సమాజంలో అధ్యాత్మికత**

26. ఆత్మకు సంబంధించిన జ్ఞానం అధ్యాత్మికత. దైవ భక్తికూడా అధ్యాత్మికతలో భాగమే అయినా కేవలం దైవభక్తి మాత్రమే ఆధ్యాత్మికత కాదు. భక్తి ఆధ్యాత్మికత వైపుకు తీసుకెళ్ళే సాధనం.
27. భక్తి, వేదాంతం, వైరాగ్యం, ధ్యానం, యోగం, ఆత్మచింతన, సంఘసేవ ఇవన్నీ ఆధ్యాత్మికత అనే గొడుగు కిందకే వస్తాయి.
28. మునుపటి కంటే నేటి సమాజానికి అధ్యాత్మికత అవసరం ఎక్కువగా ఉంది. నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. మనిషి మానసికంగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు. అధ్యాత్మికత ఈ సమస్యకు పరిష్కారమిస్తుంది.

29. అధ్యాత్మికత మనిషికి నైతిక వర్తనను నేర్పుతుంది. ఆనందాన్ని ఇస్తుంది.
30. జీవితపు తొలిదశలలో నాస్తికులుగా ఉన్నప్పటికీ శాంతికోసం చలం, సత్యంకోసం గోపీచంద్ అధ్యాత్మికతను ఎంచుకున్నారు. కనుక అధ్యాత్మికతలో శాంతి, సత్యం ఉన్నాయనేది వాస్తవం.
31. చలం, గోపీచంద్ అధ్యాత్మిక మార్గం వైపు మళ్ళినా, హేతుబద్ధతను పూర్తిగా వదిలిపెట్టలేదు. హేతుబద్ధతతో కూడిన అధ్యాత్మికత మాత్రమే సత్యావిష్కారానికి తోడ్పడుతుందని గోపీచంద్ ప్రగాఢంగా విశ్వసించారు.
32. ఆధునిక కాలపు అధ్యాత్మ గురువులైన రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణ మహర్షి తదితరులు హేతుబద్ధతతో కూడిన అధ్యాత్మికతనే ప్రవచించారు.
33. భక్తి ఉద్యమపు కవిగా అన్నమయ్య హేతుబద్ధమైన అధ్యాత్మికతను ప్రదర్శించారు.
34. నేటి సమాజానికి కావలసింది హేతుబద్ధమైన అధ్యాత్మికత అని గుర్తించడమైంది.

*****

# అనుబంధం — 4

# ముఖాముఖి

## ముఖాముఖి

నేటి సమాజానికి తగినట్లుగా అధ్యాత్మికతను బోధించే ప్రముఖ ప్రవచనకర్త డా॥ గరికిపాటి నరసింహారావుగారితో ముఖాముఖి పాఠం ఇక్కడ పొందుపరచబడింది. హేతుబద్ధమైన అధ్యాత్మికతను ప్రవచిస్తారన్న పేరున్న డా॥ గరికిపాటి నరసింహారావుగారితో మాట్లాడడం, అధ్యాత్మికతనుగురించి వారి అభిప్రాయాలు తెలుసుకోవడం ఈ పరిశోధనకు ఉపకరిస్తుందని భావించి వారితో 29-01-2019న ముఖాముఖి జరిపాను. ఈ ముఖాముఖి సమయం దాదాపుగా రెండుగంటల ఇరవై నిముషాలు. ముఖాముఖిలో భాగంగా పాఠకులను చైతన్యపరుస్తుందనుకున్న సమాచారాన్ని ఇక్కడ ఇచ్చాను. పిట్టకథలుగా చెప్పిన ఉదాహరణలను సంక్షిప్తీకరించాను. ముఖాముఖిలో భాగంగా మొదట నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అటు తరువాత అడిగిన ప్రశ్నల నుండి ఇక్కడ చదవగలరు.

**ప్రశ్న 1: ఆధ్యాత్మికతకు మీరిచ్చే నిర్వచనమేమిటి? లేదా మీ దృష్టిలో ఆధ్యాత్మికత అంటే ఏమిటి?**

జవాబు: ఆత్మజ్ఞానమే ఆధ్యాత్మికత. మనిషి నేనెవరు అనేది అంతిమంగా తెలుసుకోవాలి. శరీరం కాదు, మనస్సు కాదు, ఇంద్రియాలు కాదు. ఈ కనిపించే పంచభూతాత్మక సృష్టి ఏదీ మనది కాదు. ఈ శరీరం నేను కాదు. నేను సాక్షాత్తు పరమాత్మ స్వరూపుడిని అని గ్రహించటమే ఆధ్యాత్మికత. అధి + ఆత్మ నుంచి అధ్యాత్మ వచ్చింది, అధ్యాత్మ శబ్దం నుంచి ఆధ్యాత్మికత వచ్చింది. అంచేత భగవంతునికి సంబంధించిన జ్ఞానాన్ని ఆధ్యాత్మికత అనాలి మనం. భక్తి వేరు. కర్మకాండ, పూజలు, పునస్కారాలు, నోములు, వ్రతాలు, ఆర్తితో చేసే ఆవేదన, ప్రార్థనలు ఇవన్నీ భక్తి కిందకు వస్తాయి.

**ప్రశ్న 2: కర్మకాండలు కూడానా?**

జవాబు: కర్మకాండ అంతా భక్తి కిందే లెక్క. కర్మమార్గంలో భక్తి లేకుండా కర్మెలా చేస్తాడు? భక్తికి పూర్వ నిర్వచనాలు ఎలా ఉన్నప్పటికీ ప్రస్తుతం నడుస్తున్న విధానాన్నిబట్టి చెప్పాలంటే కర్మకాండని మనస్సు లగ్నం చేసి చేయడం భక్తి. అసలీ మనస్సేమిటి? మనస్సుకు మూలమైన నేనేమిటి? ఆ దేవుడని చెబుతున్నారు అదేమిటి? జీవుడికి, దేవుడికి భేదమేమిటి? ఉందా లేదా అసలు భేదం? ఈ మొత్తం తర్కంలోకి వెళ్ళడం ఆధ్యాత్మికత. స్థూలంగా చెప్పాలంటే పూజలు, పునస్కారాలు చేస్తూ మనస్సును భగవంతునిపై లగ్నం చేయడం భక్తి. మనస్సు మూలంలోకి వెళ్ళి అదేమిటో తెలుసుకోవటం, ఆత్మేమిటో తెలుసుకోవటం ఆధ్యాత్మికత. అందుకే దీన్ని spirituality అన్నారు. స్పిరిట్ ఉండాలి. spiritual అనే మాట చూడు, spirit తీసేస్తే ritual. మనం ritual నుంచి spirit మార్గంలోకి వెళ్ళాలి. అంటే ఆత్మ అనేది ఈ ritual కి మూలమైన spirit. ritual వెనక ఉన్న జ్ఞానాన్ని గ్రహిస్తే అది ఆధ్యాత్మికత. Ritual గానే మిగిలిపోతే కర్మిష్ఠిగా ఉంటాడు. ఆ ritual ని కొద్దిగా శ్రద్ధాభక్తులతో భగవంతునియందు మనస్సు లగ్నం చేసి చేస్తే అది భక్తి. ఇదే భక్తి, కర్మ, జ్ఞానం. ఒక్కమాటలో చెప్పాలంటే జ్ఞానమే ఆధ్యాత్మికత.

**ప్రశ్న 3: దేవుడు మనందరికీ తండ్రి వంటివాడు అంటారు కదా? అయితే తండ్రి మనకు జన్మనిచ్చాడని, విద్యాబుద్ధులిచ్చాడని, జ్ఞానమిచ్చాడని మనం నిరంతరం ఆయనను పొగుడుతూ ఉండం. ఆయనకు నచ్చినట్లుగా మనం ప్రవర్తిస్తే ఆయన సంతోషిస్తాడు కనుక, ఆ విధంగా ఉండటానికి ప్రయత్నిస్తాం. మరి దేవుడి విషయంలో మాత్రం ఆయనను నిరంతరం స్తుతిస్తూ ఎందుకుండాలి? ఆయనకు నచ్చినట్లుగా ప్రవర్తించమెందుకు?**

జవాబు: ప్రశ్న మంచిదే కాని దేవుడు మనకు తండ్రి అని ఎక్కడా చెప్పలేదు. దేవుడు తల్లి అని కూడా చెప్పలేదు. దేవుడు దేవుడే. ఆ దేవుడు 'నువ్వు' అని చాలా స్పష్టంగా చెప్పింది మన

ధర్మం. దేవుడే నువ్వు. తండ్రని క్రైస్తవ మతస్థులు అంటారు. మన ధర్మంలో దేవుడు తల్లని, తండ్రని ఇలా బంధుత్వాలు కలపలేదు. చాలా స్పష్టంగా 'you are God' అంది.

**ప్రశ్న 4: కాని మీరు చెప్పేది ఒక స్కూల్ ఆఫ్ థాట్. అద్వైతంలో అలా అంటారు కాని విశిష్టాద్వైతంలో..**

జవాబు: అబ్బెబ్బే. ఇన్ని స్కూల్స్ లేవసలు. వేదాంతమంటే అద్వైతమే. *ఏకమేవ అద్వితీయమ్ బ్రహ్మ.* వేదాన్ని అనుసరించినవాడు అద్వైతాన్నే చెబుతాడు. మిగిలినవాళ్ళెవ్వరూ వేదాన్ని అనుసరించట్లేదని అర్థం. Different schools of thought సమస్య లేదు. ఈ స్కూల్ పెట్టేటంత థాట్ ఏమీ లేదక్కడ. అసలు థాటే దీనికి అడ్డం. థాట్ కి అతీతమైనది అద్వైతం. థాట్ అంటే ఆలోచన. నీకు ఆలోచన ఎప్పుడైతే మొదలయిందో ద్వైతం మొదలయింది. ఆలోచనారహితమైన స్థితే అద్వైతం. ఆ స్థితికెళ్ళాక నువ్వు, దేవుడు ఒకటే. నువ్వు, నేను ఒకటే. ఆలోచనారహితమైన స్థితిలోకెళ్ళాలి. ఈ థాట్, స్కూల్స్ ఎప్పుడైతే మొదలయ్యాయో ద్వైతం అప్పుడొచ్చేస్తుంది. ఒక ఆలోచన వచ్చిన వెంటనే ఇంకొక ఆలోచన వస్తుంది. రెండు స్కూల్స్ వస్తాయి. ఆలోచనే లేకపోతే... ఆలోచన లేని స్థితిలోకి వెళితే ఉన్నదంతా ఒకటే అని అర్థమౌతుంది. అదే అద్వైతం.

**ప్రశ్న 5: కాని ఆలోచన లేకపోతే ప్రగతి లేదు కదా?**

జవాబు: ప్రగతి అంటే ముందుకెళ్ళడం కదా! ఎక్కడికెళుతున్నారు ముందుకి? వెళ్ళి వెళ్ళి ఏమౌతున్నాడు మనిషి?

**ప్రశ్న 6: టెక్నాలజీ పరంగా కాని..**

జవాబు: నిజమే! టెక్నాలజీవల్ల ఎంత నష్టం జరుగుతోంది?

## ప్రశ్న 7: టెక్నాలజీవల్ల లాభమూ ఉంది, నష్టమూ ఉంది..

జవాబు: లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంది, నిజం చెప్పాలంటే! ఎందుకంటే నష్టం లేకుండా లాభమే ఉండాలంటే ముందు మనిషి మనస్సును సంస్కరించాలి. దేన్నైనా సద్వినియోగం చేయాలంటే ముందు మనిషి మనసును సంస్కరించుకోవాలి. మనస్సును సంస్కరించడం అంటే రాగద్వేషాలు లేకపోవటమే కదా! ఆ రాగద్వేషాలు దేనివల్ల వస్తున్నాయి. ఆలోచనవల్లే వస్తున్నాయి. ఆలోచన లేని స్థితికెళితేనే రాగద్వేషాలకు అతీతంగా ఉంటారు. అంచేత థాట్, స్కూల్, ఆలోచన, తర్కం ఎప్పుడు మొదలయిందో, అప్పుడే విభిన్నమైనవన్నీ వస్తాయి. ద్వైతం వచ్చిందీ అంటే దుఃఖమే. *ద్వైత మూల మహో దుఃఖం* – అష్టావక్ర గీతలో చెబుతాడు. *న అన్యాత్ తత్ర అస్తి భేషజం* — ఇంకో మందే లేదు దీనికి ఒక్కటే అని తెలుసుకోవడం తప్ప. అంచేత ఇన్ని స్కూల్స్, ఇన్ని థాట్ లు ఏమీ ఉండవు. నువ్వే దేవుడివి స్పష్టంగా. ఆ నేనెవరో తెలుసుకో. నువ్వంటే ఒక అమ్మాయనో, ఒక అబ్బాయనో, లేదా ఒక పేరో కాదు. కళ్ళు మూసుకుని ఆలోచిస్తే నేను అని లోపల స్ఫురణకొస్తుంది మనకి. ఏమీ లేకుండా, అలా ఊరికే కూర్చుని, మన లోపలకు మనం వెళ్ళగలిగితే నేను అనేది ఎక్కడో అక్కడ స్ఫురిస్తుంది హృదయ ప్రాంతంలో. ఆ నేనే దేవుడు.

## ప్రశ్న 8: కనుక దేవుడిని ప్రత్యేకంగా స్తుతించాల్సిన అవసరం లేదంటారు?

జవాబు: అసలీ పొగడ్తల వ్యవహారమంతా మనిషి పెట్టుకున్నాడు. వేదం చెప్పలేదు దేవుడిని స్తుతించమని. స్తుతిస్తే లొంగేవాడు దేవుడు కాడు నా దృష్టిలో. స్తుతిస్తే లొంగేవాళ్ళు చాలా మంది ఉన్నారు లోకంలో. వీళ్లతోటి దేవుడిని పోలుస్తారేమిటి? మన స్తోత్రాల్లో గొప్పతనమేమిటంటే *స్తోత్రప్రియా, స్తుతిమతీ, శృతిసంస్తుతవైభవా* — ఇవన్నీ మనకు లలితాసహస్రంలో ఉంటాయి. *స్తోత్రప్రియా* అనడంలో ఉద్దేశం ఏమిటంటే అలా అంటే వీళ్ళు స్తోత్రం చదువుతారని. చదివితే అందులో ఉండే జ్ఞానం పొందుతారని స్తోత్రాలు రాశారు

ఋషులు. లలితాసహస్రం చదవండి. స్తోత్రం అమ్మవారికిష్టం అని ఎందుకు చెప్పారంటే, చదివితే *చిచ్ఛక్తి శ్చేతనారూపా జడశక్తి ర్జడాత్మికా* – అనగానే ఆలోచించొద్దా నువ్వు? చిచ్ఛక్తి ఏమిటి? చేతనా రూపమేమిటి? జడశక్తేమిటి? అసలు శక్తిలో రెండు రకాలేమిటి? చిచ్ఛక్తి ఏమిటి? జడశక్తేమిటి? జడత్వం అంటే కదలకపోవడం కదా! చిత్ అంటే కదలడం కదా! కదలడం శక్తంటే ఎవ్వరైనా అంగీకరిస్తారు. కదలకపోవడం శక్తేమిటి? అది సైన్సు. ఇలా ఆలోచిస్తావు కదా అని నిన్ను స్తోత్రం చదవమంటే, ఈ స్తోత్రం అమ్మవారికిష్టం. నేను రోజూ పదకొండు సార్లు చదువుతా. బెల్లం ముక్క నైవేద్యం పెడతా. నీ బెల్లం ముక్కా, పదకొండు సార్లు స్తోత్రం ఏ దేవతకు కావాలమ్మా? ఇది వీళ్ళు కల్పించుకున్నారు.

మనిషికి ఉన్నదేమిటంటే తన మనసును తాను పరిశీలించుకోవడం ఇష్టం ఉండదు. ఎందుకంటే పరిశీలించుకుంటే చాలా వదిలేసుకోవాలి. ఆ వదిలేసుకోవడం ఇష్టం ఉండదు. అందుకని, మనిషేం చేస్తాడు? అబ్బెబ్బే అక్కర్లేదు. ఇదంతా నిజం. ఈ సృష్టంతా నిజం. ఈ సంసారమంతా నిజం. ఈ శరీరమంతా నిజం. లేకపోతే ప్రగతి ఎలా? ముందుకెలా వెళ్ళడం? ముందుకెళ్ళి, ముందుకెళ్ళి ఏమవుతున్నాడు మనిషి? చనిపోతున్నాడా లేదా? ఏం ఏమయ్యింది? చనిపోయేదానికి దేనికి ఇవన్నీ? ఉండొద్దని కాదు. ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండాలి. ఇంకా ముందుకు, ముందుకు, ముందుకు ఏమైంది? రేడియో టీవీ అయింది. టీవీ యూట్యూబ్ అయింది. యూట్యూబ్ వాట్సాప్ అయింది, ఫేస్ బుక్ అయింది. ఇప్పుడు సర్వనాశనం అయింది. ఇప్పుడు వాట్సాప్, ఫేస్ బుక్, ట్విటర్లు వచ్చి ప్రగతే కదా! ప్రతీవాడి చేతుల్లో ఓ టీవీ వచ్చింది. అదే యూ ట్యూబ్. ప్రతీవాడి చేతుల్లో ఓ పేపర్ వచ్చింది. అదే ఫేస్ బుక్. ఇప్పుడేమొస్తున్నాయి. అడ్డమైనవన్నీ పెడుతున్నారు. ఎవ్వరి జీవితానికీ ఏ భద్రత లేకుండా పోయింది. ఎవ్వరి జీవితానికీ ఏ ప్రైవసీ లేకుండా పోయింది. మొత్తం అరాచక సమాజం వచ్చేసింది ఇప్పటికే. ఎవరితోనో తగాదా వస్తే అందులో పెట్టేస్తున్నారు. కొంపలంటుకుపోతున్నాయి అక్కడ. రకరకాలుగా తయారైంది. ఇదంతా ప్రగతా? దీన్ని

ఉపయోగించుకుంటారా? ఏమిటి ఉపయోగించుకుంటారు? పెద్ద కబుర్లు చెబుతున్నారు, ఉపయోగం ఉపయోగమంటూ. ఏమిటి చెప్పండి? ఈ సమాచారం మొత్తంవల్ల ఉపయోగమేమిటి చెప్పండసలు? నీకెందుకంత సమాచారమసలు? నువ్వో పిహెచ్.డి. విద్యార్థినివి. నేనో ప్రవచనకర్తని. నాకవసరమైన సమాచారం నాకు కావాలి కాని, లోకంలో జరిగే ప్రతీ సమాచారం నాకవసరమా?

సమాచారంకంటే సదాచారం ముఖ్యం. సమాచారం పేరు మీద వస్తున్నదంతా సదాచారం కాదు. చాలా వరకు దురాచారం. సమాచారమన్నది ఎలా ఉంటుందంటే ఒక వార్త నానుంచి నువ్వు విన్నప్పుడు, నువ్వు ఇంకొకళ్ళకి చెప్పేటప్పుడు అది మారిపోతుంది చూసుకో! నేను చెప్పినట్టు నువ్వు చెప్పవు. ఎందుకంటే అది చాలా ఆసక్తికరంగా చెప్పాలని, నువ్వు చెబుతున్నావు అనిపించుకోవాలని నీకు ఉంటుంది. అదే సంచలనం చేయడం. వెంటనే మార్చేస్తాం. నీ దగ్గరనుండి ఇంకొకళ్ళు మార్చేస్తారు. ఇంకొకళ్ళు మార్చేస్తారు. మొత్తం మీద నా దగ్గరనుంచి అవతలికెళ్ళగానే, నలుగుర్ని దాటగానే, నేనో చిన్న సెలయేరుగా మాట్లాడిన మాట సముద్రం అయింది. ఇదంతా సమాచార విప్లవమా? అవసరమా అది? సమాచారం! సమాచారం! అంత అవసరమా? ఇరాక్ లో ఏం జరుగుతోందో మనకు అవసరమా? ఇరాన్ లో ఏం జరిగిందో మనకు అవసరమా? అది మన నిత్యజీవితంలో ఉపయోగిస్తామా? ఉపయోగిస్తే చెప్పుకోవచ్చు. ఏం చేస్తున్నాం? ఏం చేయట్లేదు. ఊరికే వింటున్నామంతే. పైగా ప్రగతి అంటారు.

ప్రగతి అంటే ముందుకు వెళ్ళడం కదా! కాలం చక్రం లాంటిది. నిచ్చెన కాదు. ప్రపంచం ముందుకెళ్ళదు. వెళ్ళినచోటికి వచ్చి మళ్ళీ కూలిపోతుంది. కాలం చక్రం. తిరిగి, తిరిగి, తిరిగి మళ్ళీ కిందకొస్తుంది. భూమి సహా అన్ని గ్రహాలు గుండ్రంగా ఉంటాయి. పరమాత్మ పదార్థాన్ని కూడా మనం పూర్ణమనే అంటాం. ఇదిలా తిరిగి, తిరిగి, తిరిగి ప్రగతి

అంటే కిందకు రావడమే. మనిషి దాన్ని గ్రహించలేకపోతున్నాడు. ఏదో అవుతుంది అనుకుంటున్నాడు. అనుకుని, ఇన్ని ఆయుధాలు కనిపెట్టాడు. ఈవేళ ఈ ఆయుధాలనుండి రక్షణకోసం ప్రతీ దేశం రక్షణబడ్జెట్ కొన్ని వేల కోట్లు పెట్టేస్తోంది. ప్రజలకు అన్నం లేదు, వీళ్ళు ఆయుధాలు కొంటున్నారు. ఇంత దారుణంగా వెళుతోంది. దీన్ని ప్రగతి అనరు. నాశనగతి, అధోగతి అంటారు. వాళ్ళు ఊహిస్తున్నారు ఇది ప్రగతి అని. ఏమీ ప్రగతి లేదు. మనిషి తానెవరో కనుక్కొని ఇంద్రియాలకు అతీతంగా, ఇంద్రియ నిగ్రహంతో, వివేకంతో ఉండగలిగితే అది ప్రగతి. ఆత్మప్రగతి తప్పితే భౌతిక ప్రగతి పనికిరాదు. భౌతిక ప్రగతి ప్రగతి కాదు. ఆత్మ ప్రగతే ప్రగతి.

**ప్రశ్న 9: మీ పిల్లల పేర్లు శ్రీశ్రీ, గురజాడ అని పెట్టడానికి కారణం మీరు పూర్వాశ్రమంలో అభ్యుదయవాదిగా ఉండటమే అని ఒకాకొక సందర్భంలో ఒక ఇంటర్వ్యూలో అన్నారు. అలా అభ్యుదయవాదిగా ఉన్న మీరు ఆధ్యాత్మికత వైపు మళ్ళడానికి కారణమేమిటి?**

జవాబు: నాకు అప్పట్లో అభ్యుదయం అంటే దేవుడితో సంబంధం లేకుండా ఏదో భౌతికాభ్యుదయం అనిపించేది ఆ వయసులో. తర్వాత అభ్యుదయమంతా ఆత్మజ్ఞానంలోనే ఉందని అర్థమైంది. భౌతికాభ్యుదయం అభ్యుదయం కాదని, నైతికాభ్యుదయమే అభ్యుదయమని అర్థమైంది. అంచేత అభ్యుదయానికి సరైన నిర్వచనం గ్రహించడంలోనే మనం పొరపాటుపడ్డాం కాని అభ్యుదయవాదం నేను ఇప్పటికీ మానలేదు. నాది అభ్యుదయవాదమే. నన్నయ సహా అందరు కవులు *అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్చం బూనిన భారతమునకు కథాక్రమం బెట్టిదనిన* అని రాశారు. వాళ్ళు ఆశించింది అభ్యుదయం కాదా! వీళ్ళెవరో ఆశించేదే అభ్యుదయమా? వాళ్ళూ సర్వవర్గాల సంక్షేమం కోరే అభ్యుదయం అని రాశారు.

అభ్యుదయం, ప్రగతి, సామాజిక స్పృహ అనేవి కొన్ని వర్గాల వాళ్ళు సొంతం చేసుకుని వాళ్ళ నిర్వచనాలు వాళ్ళు కల్పించేశారు. ప్రజ కూడాను. ప్రజలంటే అందరూ వస్తారు. పేదప్రజలే ఎందుకవుతారమ్మా? డబ్బున్నవాళ్ళు కూడా ప్రజలే. మధ్యతరగతి వాళ్ళు కూడా ప్రజలే. అసలెక్కువ నలిగిపోతున్నది మధ్యతరగతి వాళ్ళే. అంచేత ఈ వర్గాలు, సిద్ధాంతాలు వచ్చాక ఏమైందంటే కొంత పదజాలాన్ని వాళ్ళు సొంతం చేసుకున్నారు. సామాజిక స్పృహ అంటే పేదవాడి ఆకలిగురించి మాట్లాడటం. ఏం ప్రసవించే ఆవిడ నొప్పులగురించి మాట్లాడకూడదా? ఒక కవి కావ్యం రాయడంలో పడే యాతనగురించి మాట్లాడకూడదా? ఒక తల్లీ, బిడ్డా ప్రేమగురించి మాట్లాడకూడదా? ఒక జీవుడు దేవుడిగురించి పడే తపనగురించి మాట్లాడకూడదా? అది సామాజిక స్పృహ కాదా? అందులో సమాజం లేదా? ఎవడి తపన వాడికుంటుంది. నీ తపనే తపన అంటే ఎలా? అంచేత అభ్యుదయం అంటే ఉండే నిర్వచనమే మారిపోయిందసలు. ఆత్మాభ్యుదయమే నిజమైన అభ్యుదయం. భౌతికాభ్యుదయం కానే కాదు. అభ్యుదయం పేరు మీద భౌతికాభ్యుదయం ప్రచారం చేశారు.

నాకప్పట్లో ఇరవై అయిదేళ్ళ వయసు. ఏమనుకుంటాం? మామూలుగా ఒక సామాన్యమైన సర్వే ఏమిటంటే దాని మీద నేనే ఒక పద్యం అల్లానెప్పుడో.

*బాల్యమందు నెవడు భక్తుండు కాకుండు*
*యుక్తవయసునందు ఉగ్రవాది*
*జవ్వనంబు లుడుగ జాతీయవాదిరా*
*వయసు బట్టి మనసు వరుస మారు.*

ఇది మనకు తొంభై తొమ్మిది శాతం మంది ప్రజలలో నిజమయింది. చలం, గోపీచంద్ – వీళ్ళుకూడా మారడానికి వయసు కొంత కారణం కావొచ్చు, అర్ధరాత్రేం విస్ఫోటనం జరగలేదు. మనిషికి జవసత్వాలు క్షీణించిపోతూ ఉంటే మృత్యుభయం పట్టుకుంటుంది. అప్పుడు కనీసంగా

ఏదో ఉంది, ఏదో ఉంది అని ఆలోచిస్తాడు. అంతవరకు ఆలోచించిందంతా తప్పని అర్థమైపోతుంది. అప్పుడు మారతాడు. కాని ఆ మారేదేదో ఇంకా ముందు మారితే వాడు తెలుసుకుంటాడు విషయం. తొంభై ఏళ్ళకు మారితే ఏంటి? మారకపోతే ఏంటి?

చిన్నప్పుడు అందరూ భక్తులే. బెల్లం ముక్కకోసం, శెనగపప్పుకోసం. తల్లికూడా వెడతారు. వెళ్ళకపోతే కొడతారని. వెళితే ఏదో పెడతారు. యుక్తవయస్సు వచ్చేసరికి కమ్యూనిజం ప్రభావం, సంస్కరణ, చైతన్యం, ఉద్యమం, ఊరేగింపు అంటాడు. ఎందుకంటే నరాలు బాగా ఉడుకెత్తి ఉన్నాయి. ఎక్కడో తిరిగితే కాని వీడికి తోచదు. ఇంట్లో కూర్చోలేడు. అందుకని సమసమాజం, నవసమాజం అంటూ అరుస్తాడు. ఈ అరుపులన్నీ అయిపోయాక ఆయాసాలు మిగులుతాయి. ఓ నలభై అయిదేళ్ళు దాటేసరికి ఓ ఇద్దరు పిల్లలు పుట్టి, ఆ ఇద్దరూ వీడిని ఎదిరిస్తూ ఉంటే జీవితం వీడికి అర్థమవుతుంది. అప్పుడు వీడి తండ్రిని వీడు ఎదిరించిన ఉడుకురక్తం క్షణాలున్నాయే అవన్నీ వీడికి గుర్తొస్తాయి. గుర్తొచ్చి, మా నాన్నగారిని అన్యాయంగా ఎదిరించాను, అందుకే ఇప్పుడు కర్మననుభవిస్తున్నాను అంటాడు. ఎందుకంటే వాళ్ళ నాన్న తరానికి, వీడి తరానికి పది పైసలు తేడా ఉంటే, వీడికి, వీడి తరువాతి తరానికి అర్ధరూపాయి తేడా ఉంది. భరించలేకపోతున్నాడు. అందుకే అప్పుడు వెంటనే పూర్వాచారాలు, సంప్రదాయాలు – మనవాళ్ళు ఊరికే చెబుతారా? అంటాడు. *జవ్వనంబులుడుగ జాతీయవాదిరా. వయసు బట్టి మనసు వరుస మారు.*

వయస్సు మారినాకూడా మనస్సు మారలేదని చెప్పేవారిదొక తత్త్వం ఉంటుంది. వాళ్ళకు లోపల్లోపల సత్యమేమిటో తెలుసు, అన్నీ మారుతున్నాయని తెలుసు. వాళ్ళుకూడా మారాలని తెలుసు. కాని ఏమనుకుంటారు? ఇంతకాలం ఒక జెండా కింద పడేడిచాం. ఏదో ఆ జెండా కింద ప్రాణం పోతే ఓ గొడవ వదిలిపోతుంది అనే ధోరణిలో ఉంటారు. కాని ఖచ్చితంగా మనిషి ఆలోచనల్లో అరవై దాటగానే మార్పు వచ్చేస్తుంది. ఎంత నాస్తికుడైనా సరే, వాడు

ఖచ్చితంగా తత్త్వం, దేవుడువైపు వెళ్ళిపోతాడు. పైకి చెప్పడంతే. అంచేత ఈ అభ్యుదయానికి నిర్వచనాలు వేరు. నాకర్థమైందదే.

**ప్రశ్న 10: మరి మీరు యవ్వనంలో ఉన్నప్పుడే అకస్మాత్తుగా మారడానికి కారణమేమిటి? మానసిక ప్రశాంతత ఆధ్యాత్మికత వల్లే వస్తుందనుకున్నారా? లేక నిజంగా దేవుడిపట్ల గట్టి నమ్మకమేమైనా ఏర్పడిందా?**

జవాబు: నిజానికి నేను ఇరవై ఏళ్ళ వరకు భక్తుడిగానే ఉన్నాను. నాకు కొత్తగా వచ్చిందేమీ లేదు. మాది బ్రాహ్మణ సంప్రదాయ కుటుంబం. మా ఊరు బోడపాడు అని తాడేపల్లిగూడెం దగ్గర. పదూళ్ళు ఉండేవి అక్కడికి దగ్గర్లో. అక్కడ గుడి అరుగు మీద కూర్చుని, ఊళ్ళోకెళ్ళొచ్చావా? అని మా నాన్నగారడిగేవారు. గుళ్ళోకి వెళ్ళకుండా ఇంట్లోకి రావడమేమిటి? అనేవారు. ఉపనయనం కాకమునుపే నేను శివుడికి అభిషేకం చేసేవాడిని. అయ్యాక సరే సరి. ఆ పూజలవన్నీ అలవాటు. నేను నాస్తికత్వం వైపు ఎప్పుడూ వెళ్ళలేదు. కమ్యూనిస్టునెప్పుడూ కాలేదు. కాని ఆ పుస్తకాలన్నీ చదివాను. కమ్యూనిజానికి అనుకూలంగా ఒక్క మాటెక్కడా మాట్లాడలేదు. ప్రచారం చేయలేదు. వేదికలెక్కి దేవుడినెక్కడా దూషించలేదు. పొరపాటునకూడా చేయలేదా పని. కాని ఓ ఏడెనిమిది ఏళ్ళు, 79 నుంచి, 86 వరకు, నేను డైలమా అంటారు చూడు, ఆ సందిగ్ధ స్థితిలో ఉన్నాను. అదే కొన్ని సందర్భాల్లో చెబితే, వీళ్ళకు సంచలనం చేసెయ్యడం అలవాటు. ఆస్తికుడిగా మారిన నాస్తికుడు అంటూ హెడ్డింగులు పెట్టేశారు వీళ్ళు. నేను ఓ పెద్దగా మారిపోయింది లేదు. నా సంప్రదాయం నాతోనే ఉంది. కాని ఆ రోజుల్లో దయానంద సరస్వతి రాసిన *సత్యార్థప్రకాశం* అనే పుస్తకం చదివాను. ఆయన చాలా రీజనింగ్‌తో చెబుతాడు ఏం చెప్పినా కూడా. ఆ హేతువాద పద్ధతి నాకు నచ్చింది. ఆయన వేదాలను అంగీకరిస్తాడు. యజ్ఞాలను అంగీకరిస్తాడు. పురాణాలను ఒప్పుకోడు. తద్దినాలను ఒప్పుకోడు. ఆయనేం ఒప్పుకుంటాడో ఒప్పుకోడో అన్నది సమస్య కాదు. ఆ

తర్కించడం నాకు బాగా నచ్చింది. అంతకుముందు మన సంప్రదాయంలో తర్కిస్తే దెబ్బలాడేవారు. నీ వెధవ తర్కమూ, నువ్వూనూ అని. అప్పటి పద్ధతి అది. ఇప్పుడు మళ్ళీ మారిపోయింది. అప్పుడు తర్కించటం దోషం. ఆ స్థితిలో వేదానికి సంబంధించినాయన ఋషి, ఆయన తర్కిస్తున్నాడు, అందరూ అంగీకరించారు. అది ఆశ్చర్యం కలిగించింది.

అయినా అసలు, 21వ శతాబ్దం కానీ, 31వ శతాబ్దం కాని మనిషి నిష్కల్మషంగా ఆత్మజ్ఞానంతో నేనీ శరీరాన్ని అనే విషయం మర్చిపోయి ఆలోచిస్తే ఏది అనుసరించాలో, ఏది అనుసరించకూడదో తెలిసిపోతుంది. కల్పన, నిజంతో నిమిత్తం లేదు. పక్షపాతం లేకుండా ఆలోచిస్తే ప్రతీదీ తెలిసిపోతుంది. ఆ పక్షపాతం లేకుండా ఆలోచించాలంటే మనిషికి ఆత్మజ్ఞానమే కలగాలి తప్ప భౌతికమైన విషయాలు, సిద్ధాంతాలేవీ కమ్యూనిజం సహా మనిషిని పక్షపాతం లేకుండా ఉంచలేవు. మనిషి అసలలా ఆలోచించాలంటే తాను ఈ శరీరం కాదు, మనస్సు కాదు, ఇంద్రియాలు కాదు అని తెలుసుకోవాలి. అది అద్వైతంద్వారానే సాధ్యం, వేదంద్వారానే సాధ్యం, శంకరాచార్యుడిద్వారానే సాధ్యం.

అద్వైత తత్త్వం ప్రకారం, అందరిలోనూ ఉన్నది భగవంతుడే కాబట్టి, నేను యజమానినైతే ఉద్యోగి కష్టసుఖాలు ఆలోచించాలి. ఉద్యోగినైతే యజమాని కష్టసుఖాలు ఆలోచించాలి. వివేకానందుడు చెబుతాడు, నువ్వు నిజంగా సుఖపడాలని కోరుకుంటే, ఎదుటివాడు సుఖపడేలా చెయ్యి. అప్పుడే సుఖపడతావు. అంతవరకు నీకు సుఖం కుదరదు. దుఃఖమూ తీరదు. ఎంత దుఃఖంలో అయినా మనిషి ఉండనీ, ఆ దుఃఖాన్ని పక్కన పెట్టి, ఏ అభాగ్యుడికో సేవ చేశాడనుకో, ఆ సమయంలో అతనెలా ఉంటాడో చూడు. వెధవ దుఃఖం! ఇది చిన్నది. నావల్ల ఎంత మేలు జరుగుతోంది! ఎంతమంది ఆనందిస్తున్నారు! ఇది రా జీవితం! నాకొచ్చిన దుఃఖం చిన్నది, వదిలేసెయ్. నేనింత ఉపయోగపడుతున్నాను అని వెంటనే అనిపించట్లేదా? అవతలివాళ్ళకి సేవ చేయడం మనకంత ఉపయోగంగా కనిపిస్తోందంటే,

అవతలివాళ్ళు, మనం ఒకటి కాబట్టే అనిపిస్తోంది. ఆ ఒకటే ఆత్మ. దాన్నే అమ్మవారు అంటారు. అది ఒకటే అన్నప్పుడు నేను ఎవరితో మాట్లాడినా నాతో మాట్లాడినట్టే నాకుంటుంది కాని మరోలా ఉండదు. ఈ స్థితికి మనిషి వెళ్ళాలంటే ఆత్మజ్ఞానంద్వారానే సాధ్యం కాని ఇతర సిద్ధాంతాల ద్వారా కాదు.

ఇలా ఘర్షణ నేను సుమారుగా ఏడెనిమిదేళ్ళు పడ్డాను. అప్పుడు చిన్నప్పుడెప్పుడో చదివిన *భగవద్గీత* ను ప్రణవానందస్వామి వ్యాఖ్యానంతో మళ్ళీ చదివాను. అప్పుడు నాకు ప్రపంచం అర్థమైంది. తత్త్వం అర్థమైంది. ఆ రకంగా భగవద్గీత నన్ను ఆ సందిగ్ధ స్థితినుండి బయటపడేసింది. నీ కర్తవ్యమేదో నువ్వు చెయ్యి. అంతే కాని మూలాన్ని మరచిపోవద్దు. ఈ రాగద్వేషాలు ఉంటూనే ఉంటాయి ఏ సిద్ధాంతమైనా సరే. మనిషి ముందుగా పోరాడవలసింది తనలో ఉండే శత్రువులతో కాని బయట శత్రువులతో కాదు. అన్ని సిద్ధాంతాలనూ వ్యక్తిగతమైన కక్షలే నడిపిస్తున్నాయి. వెనక సైద్ధాంతిక విలువలేమీ లేవు. ఈ గందరగోళంలో పడకుండా ఉండాలంటే, ఈ ప్రపంచంలో మనిషి ఆలోచించుకోవలసింది నేనెవరు, నేనెవరు అనేది ఒక్కటే. ఆ పుస్తకాలు చదువుకుంటే ఒక రకం. ఈ పుస్తకాలు చదువుకుంటే ఒక రకం. ఏదీ అవసరంలేదు. నిన్ను నువ్వు చదువుకుంటే చాలు. ..సొంతంగా ఆలోచిస్తేనే వ్యక్తి జీవితమైనా, వ్యవస్థైనా బాగుపడుతుంది. భగవద్గీతమీద కాదు, వేదాలమీద కాదు, భగవంతుడిమీద కాదు, దేనిమీదా ఆధారపడొద్దు. Depend on yourself. నువ్వు ఆలోచించుకో. నీకనిపించింది నువ్వు చెయ్యి. అప్పుడు నీకు తప్పించుకునేందుకు వీలుండదు. Take a decision and bind by it.

అందుకని, మళ్ళీ ఆలోచించుకుంటూ వస్తే, ఉపనిషత్ తత్త్వం మనది. అది మానేసి పురాణాల్లోకి వెళ్ళిపోయాం. పురాణాలు ప్రధానంగా ప్రతీకాత్మకమైనవి. పురాణాలను చరిత్రకింద భావించకూడదు. గజేంద్రుడు స్నానం చేసిన చెరువేదండీ? ఈ హిస్టారికల్

ఇన్ఫర్మేషన్ మనకనవసరం. ఆ చెరువుందో లేదో. అది ఒక తత్త్వాన్ని తెలియబరిచే కథ. చారిత్రక మూలం కొద్దిగా ఉండొచ్చు. కాని తాత్త్విక విశ్లేషణ ముఖ్యమక్కడ. అది గ్రహించుకోవాలి. చారిత్రక వాస్తవాల్లోకి వెళ్ళొద్దు. ఎందుకంటే కొన్నివేల ఏళ్ళ క్రితం జరిగినవవి. గజేంద్రుడు మునిగిన చెరువునుగురించి ఎవరు నిరూపిస్తారు? గజేంద్ర మోక్షం సారాంశమేమిటి? అది కాసారం కాదమ్మా సంసారం. వాడు ఏనుగు కాదు మధ్యతరగతి మానవుడు. దాహమేసింది ఏనుగుకు. గట్టున ఉండి నీళ్ళు తాగితే చాలు కదా! ఏనుగు నీళ్ళు తాగడానికి అందులో దిగడమెందుకు? బిందెలో నీళ్ళు తాగడానికి అందులో చెయ్యి పెడతావా? నీమీద పోసుకుంటావా? గ్లాసు పెట్టి తాగుతావు కదా! ఏనుగుకూడా చెరువుదు నీళ్ళు తాగదు కదా! తొండం ఉంది కదా! గట్టు మీద నిల్చుని తొండం పెడితే నీరు రాదా? అది చేసిన వెధవ పనేమిటంటే, అహంకారంతో అందులోకి దిగింది. కలకలం చేసింది. మొక్కలన్నీ పీకేసింది. గట్లన్నీ కూల్చేసింది. ఎందుకు చేసిందో తెలుసా? వెనకాల ఆడ ఏనుగులు ఉన్నాయి. అదీ విషయం! ఫోజు కొట్టడానికి చేసింది. మనిషి వెనకాల తమోగుణం ఉన్నప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో చెబుతుందీ కథ. గుక్కెడు నీళ్ళు తాగడానికి ఇంత గొడవెందుకమ్మా?

మన జీవితాలు కూడా మనమిలాగే ఏదో బతికి, పాతికేళ్ళు చదువుకుని, ఇంకో పాతికేళ్ళు సంసారం, ఉద్యోగం చేసి, యాభై దాటగానే నెమ్మదిగా మౌనంలోకి వెళ్ళిపోయి, నెమ్మదిగా మనకు కావలసిన పుస్తకం చదువుకుంటూ, కాస్త ధ్యానం చేసుకుంటూ, చేయవలసినదేమైనా ఉంటే చేయడం. ఓ డెబ్బై దాటగానే, పరమేశ్వరా! నువ్వెప్పుడు తీసుకెళ్ళిపోతే అప్పుడు నేను సిద్ధంగా ఉన్నాను. ఇదే సన్యాసం. అసలు సుఖమిది. ఇవే కదా ఆశ్రమ ధర్మాలు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం. ఇంతకంటే సేఫ్టీగా ఏ మతంలో చెప్పారో చూపించండి. అంతిమంగా, *యోగేనాంతే తనుత్యజాం* అని కాళిదాసు చెప్పినట్టుగా మనిషి లోపలికి చూస్తాడు. *అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా* –

బహిర్ముఖంగా భగవంతుడు దొరకడు. అంతర్ముఖమైతేనే దొరుకుతాడు. నువ్వు, నేను శరీరాలు అనుకున్నంతకాలం అది సాధ్యం కాదు. అంత గొప్ప తత్త్వాన్ని చెప్పిందీ మతం ఉపనిషత్తులలో.

అందుకని, గజేంద్రమోక్షం కథనెలా చూడాలి మనం? సంసారజీవితం అంటే ఫేమిలీ లైఫ్ అనే కాదు, ఉద్యోగంకూడా సంసారమే. సంసారమంటే మొత్తం జీవితం. ఉద్యోగంలో నువ్వు ఓవరేక్షన్ చేసేశావనుకో విపరీతంగా, నీకు ప్రమోషన్ ఇస్తే జీతం పెంచాలి కాబట్టి నిన్ను తప్పిస్తారు. అలాగని, సరిగ్గా పనిచెయ్యట్లేదనుకో, చెయ్యట్లేదని తప్పిస్తారు. అంచేత నువ్వెలా పని చెయ్యాలి ఉద్యోగంలో? నీ పనేదో నువ్వు చేసుకుంటూ, ఇచ్చిందేదో పుచ్చుకుంటూ, యజమానితో గొడవ లేకుండా చూసుకుంటూ, *నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!* అది మోసం కాదు లౌక్యం. లౌక్యం అవసరం, మోసం తప్పు. ఇది గ్రహించమని చెప్పింది. ఓవరేక్షన్ చెయ్యకురా అబ్బాయ్! గట్టునుండి నీళ్ళు తాగి, నీ భార్యలకుకూడా తాగిస్తే సరిపోయేది కదా! ఎందుకు దిగావు? ఎందుకు కెలికావు? అప్పుడు తాపత్రయమనే మొసలి పట్టుకుంది. ఆధ్యాత్మిక తాపం, ఆధిభౌతిక తాపం, ఆధిదైవిక తాపం. మూడు తాపాలుంటాయి మనిషికి. ఆ మొసలి వెయ్యేళ్ళు యుద్ధం చేసినా వదల్లేదంటే వేయి జన్మలెత్తినా ఈ తాపత్రయం పోదురా అబ్బాయ్. ఇంకా కోరికలు కోరుతూనే ఉంటావు. తొంభై ఏళ్ళొచ్చి చచ్చిపోతూ కూడా, కాశీలో పోవాలనుకున్నాం, కుదరటం లేదు. కాశీలో పోలేదు. కాకినాడ బస్టాండులో పోయావు. నష్టమేమిటి? పోయేవాడికి ఈ కోరికేమిటమ్మా? సొంతింట్లో పోదామనుకున్నాను. పోకపోతే నష్టమేమిటి? ఇదే తాపత్రయం. అసలు పోయేదెవరు? ఉండేదెవరు? ఏం జరుగుతోంది అని ఆలోచించడం మానేసి, అక్కడ పోవాలి, ఇక్కడ పోవాలి, పోయేటప్పుడు నా దగ్గర నలుగురు ఉండాలి. కుడిచెవి పైకి ఉండాలి. ఎడంచెవి కిందకు ఉండాలి. ఇవన్నీ పెట్టుకుని పోతాడా ఎవడైనా? పోకముందు పొందవలసినదేదో పొందొచ్చు కదా! ఇదీ గజేంద్ర మోక్షం. పురాణ కథలన్నీ ఇంతే! అంతమాత్రం చేత అవన్నీ చారిత్రకంగా అసత్యాలని కాదు. ఎక్కడో ఓ సందర్భంలో ఏ కల్పాల్లోనో ఒకటి జరిగింది. అది

కథగా ప్రచారంలోకి వచ్చింది. ఎప్పుడో దాన్ని గ్రంథస్థం చేశారు. ఇంక దాని లోతుల్లోకి వెళ్ళిపోయి చారిత్రక వాస్తవాల్లోకి వెళ్ళిపోయి డేట్లేసెయ్యొద్దు.

ఇలా తీసుకోగలిగితే పురాణాలను వ్యతిరేకించవలసిన పనిలేదు. దయానంద సరస్వతి కూడా వ్యతిరేకించనక్కర్లేదు. ఆయనెందుకసలు వ్యతిరేకించాడట? వినాయకుడిదగ్గర కూర్చున్నాడట దయానంద సరస్వతి. వినాయకుడి మీద ఎలక పాకుతోందిట. వెంటనే ఆయన కళ్ళు తెరిచి, ఎలక పాకుతుంటే తెలుసుకోలేకపోతున్నాడు. ఈయన దేవుడా? అని వదిలిపెట్టేశాడు. ఆయన దేవుడని ఎవరన్నారు? బొమ్మది. బొమ్మ మీద ఎలకలు పాకవా? నిన్ను దాన్ని దేవుడిగా భావించమని చెప్పారు. అది దేవుడని భావించమని చెప్పిందెందుకంటే నీలో ఉన్న దేవుడిని గ్రహించడానికి. గుడికెందుకెళ్ళాలి? గర్భగుడిలో ఉన్న శివుడిని ఎందుకు చూడాలంటే? మనలో, గుండెల్లో ఉన్న శివుడిని చూడాలంటే గుడిలో ఉన్న శివుడిని చూడాలి. అది హిందూ సిద్ధాంతం. *దేహో దేవాలయప్రోక్తః జీవోదేవస్సనాతనః త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్* అని శంకరాచార్యులు చెప్పారు. దేహమే దేవాలయం. దేహమర్థమైతే దేవాలయం అర్థమవుతుంది.

దేవాలయం లోపలికి వెళ్ళామంటే దేహంలోపలికి వెళ్ళాం. అంతర్ముఖం. అక్కడికెళ్ళి మూడు ప్రదక్షిణలు చేశాం. అంటే మూడు గుణాలు వదిలేయాలి. తమోగుణం, రజోగుణం, సత్త్వగుణం. ధ్వజస్తంభాన్ని చూసి దణ్ణం పెట్టుకోవాలి. ధ్వజస్తంభం అంటే మన వెన్నుపూస. అందుకే గర్భగుడికంటే ధ్వజస్తంభమే ఎత్తుగా ఉంటుంది. దేవుడికంటే కూడాను. ఎందుకంటే దేవుడు గుండెల్లో ఉంటాడు మన సిద్ధాంతం ప్రకారం. *అంగుష్ఠమాత్రః పురుషః.* వెన్నుపూస గుండెలవరకే ఉండదు. పైవరకు ఉంటుంది. అందుకే ధ్వజస్తంభం. వెన్నుపూస ఏకాండి. ఎక్కడా చీలికలు ఉండవు. ధ్వజస్తంభం కూడా ఒకటే కొయ్య. ఎంత గొప్ప వ్యవస్థ ఇది. ఈ వ్యవస్థను మొత్తం కూల్చేస్తారా విగ్రహారాధన వద్దని? వాడేదో పాపం పల్లెటూరు వాడు. వాడికి

తెలియక, దేవుడా అని వెళ్ళి ఆ విగ్రహాన్ని పట్టుకుని ప్రార్థన చేసి, వాడి దుఃఖం పోయిందని వాడు అనుకుంటున్నాడు. వాడేదో కోరిక చెప్పుకుంటున్నాడు. తీరుతోంది. తద్వారా వాడికి భక్తి కలుగుతోంది. ఈ వ్యవస్థను మొత్తం కూల్చేస్తారా సమాజాలు పెట్టి? ఇంతమందిని మార్చేస్తారా జ్ఞానంతో? అంతకంటే వాడు గుడిలో మూడు ప్రదక్షిణలు చేసి, కొబ్బరికాయ ఇచ్చి, ఆ మొక్కదీ తీర్చుకుని జ్వరం తగ్గిందనుకుంటున్నాడు. తగ్గనీ, మాననీ! ఏం నష్టం? అది మూఢత్వంలోకి పోకుండా మనం చూడాలి గాని వ్యవస్థను మొత్తం కూల్చేయకూడదు. అదే భగవద్గీతలో నాకు నచ్చిన మాట. *న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్* అంటాడు భగవద్గీతలో – మామూలు స్థాయిలో అందరూ నీ అంత జ్ఞానులు ఉండకపోవచ్చయ్యా! అజ్ఞానులు కొంతమందుంటారు. వారికి ఆత్మతత్త్వం తెలియదు. వాళ్ళు పూజో, మొక్కుబడో ఏదో చేసుకుంటూ ఉంటారు. చేసుకోనీ. నువ్వు ఉపన్యాసాలిచ్చి వాడిని చెడగొట్టకు. ఎందుకంటే వాడు అదీ మానేసి, ఇదీ మానేస్తాడు.

కృష్ణుడు చాలా స్పష్టంగా చెప్పాడు. ఏ మతంలో ఉన్నవారిని ఆ మతంలో ఉండనీయ్. నువ్వు మార్చకు. *యే యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్* – ఎవరు ఏ మార్గంలో నన్ను పూజిస్తే, వారిని ఆ మార్గంలోనే నేను కరుణిస్తాను. అంచేత ఇతరమతాలపట్లకూడా మనకేం ద్వేషం ఉండదు. వాళ్ళూ అవతారపురుషులే. ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త, బుద్ధుడు అందరూ అవతారపురుషులే. ఎవర్నీ మనం తక్కువ చెయ్యక్కర్లేదు. *ఏకం సత్ విప్రా బహుధా వదంతి* – అదీ హిందూ సిద్ధాంతం. ఒకే సత్యం ఉంది. దాన్ని పదిమంది పది రకాలుగా చెప్పారు. ఇన్ని రకాలుగా, రాముడన్నాం, కృష్ణుడన్నాం, అయ్యప్ప అన్నాం, వేంకటేశ్వరస్వామి అన్నాం. ఇంకో రెండు పేర్లు చేరిస్తే నష్టమొచ్చిందా?

**ప్రశ్న 11: ఇందాక అన్నారే ఆలోచనా రహిత స్థితి అని, ఆలోచనలు లేకుండా ఉండటం కంటే పాజిటివ్ థింకింగ్ అంటే అనుకూలమైన ఆలోచనలు కలిగి ఉండడం మంచిది కాదా?**

జవాబు: మైండ్ ఎప్పుడూ నెగటివ్. ఆ నెగటివ్ మైండ్ ని ఆలోచించకుండా చెయ్యాలి తప్ప దాంట్లో పాజిటివ్ తీసుకుందాం అనుకుంటూ కూర్చోకూడదు. ఎన్నుంటాయి పాజిటివ్? మనసెప్పుడూ నెగటివ్ గానే ఆలోచిస్తుంది. దాన్ని ఆలోచించనివ్వకుండా అక్కడికక్కడే కట్ చెయ్యాలి. ఎందుకు మనసు నెగటివ్ గా ఆలోచిస్తుందంటే ఆత్మ సత్యం. మనస్సు దానికి వ్యతిరేకం. దాన్నే విశ్వం రూపంలో చెప్పుకోవాలంటే దేవుడికి వ్యతిరేకంగా మాయ ఉంటుంది. ఆ మాయే ఈ జగత్తు. అందుకే శంకరాచార్యులవారు *బ్రహ్మ సత్యం జగన్మిథ్యా* అన్నారు. సత్యానికి వ్యతిరేకంగా ఉంటుంది మాయ. ఎంతవరకు ఉంటుంది? సూర్యుడొచ్చేవరకే చీకటి ఉంటుంది. అందువల్ల జ్ఞానం కలిగేవరకే ఈ అజ్ఞానం ఉంటుంది. మనం అజ్ఞానంలో ఉన్నప్పుడే జీవితమనే మాయ బాగా ప్రకాశిస్తుంది. మనం జ్ఞానంలోకెళితే ఇదుండదు. దీంతో ఆడుకుంటాం. సుఖం రానీ! దుఃఖం రానీ! వియ్ డోంట్ కేర్!

ఎక్కడ మనిషి దెబ్బతింటున్నాడంటే, ఈ కోరికలు, పూజలు వీటిలోకి ఎందుకు వెళ్ళిపోతున్నాడంటే, శుభమే జరగాలని కోరుకుంటాడు. అశుభాన్ని తట్టుకోలేడు. కాని అశుభమే ఆలోచిస్తూ ఉంటాడు. తట్టుకునే స్థితిని సంపాదించాలి అంటే రెండూ మాయేనని గ్రహించాలి. భగవంతుడు భక్తియోగమని చెప్పాడు భగవద్గీతలో, 20 శ్లోకాలుంటాయి. అందులో ఎక్కడా మనమనుకునే పూజలు, ఆరాధనలు, స్నానాలు, దీపాలు, అగరువత్తులు...ఒక్క ముక్క కూడా చెప్పలేదు కృష్ణుడు.

*తుల్యానిన్దస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేన చిత్ ।*
*అనికేతః స్థిరమతిహి భక్తిమాన్మే ప్రియా నరః ॥*

నిందాస్తుతులు సమానంగా భావించు. వీలైనంతసేపు మౌనంగా ఉండు. ఎంతొస్తే దాంతో సర్దుకో. ఇది భక్తి. ఒక్కడు చెప్పడీ మాట. కాశీ వెళ్ళు, రామేశ్వరం వెళ్ళు. ఈ నీళ్ళు అక్కడ పొయ్యి. ఆ నీళ్ళు ఇక్కడ పొయ్యి. అది దేవుడి కిష్టం. దేవుడికిష్టమైతే భక్తియోగంలో దేవుడు చెప్పడా ఆ విషయం?

*యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి।*
*శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః॥*

నువ్వు దేనికీ ఎక్కువ ఆనందించొద్దు. నవ్వొద్దు, ముచ్చుమొహం పెట్టుకుని కూర్చోమని కాదు దానర్థం. వెర్రికేకలు వేయకు. ఒక చిన్న వీడియో గేమ్ లో వీడు పైకెళ్ళగానే 'యా' అంటాడు. కాసేపట్లో కిందకి దిగిపోతాడు. *న ద్వేష్టి* – ఏదో జరుగుతుంది. ద్వేషించకు. *న శోచతి* – ఏడవకు. *న కాంక్షతి* – కోరకు. కోరిక లేకపోతే ఏడుపు లేదు. కోరిక లేకపోతే దుఃఖం లేదు. బుద్ధుడు కనిపెట్టిన 'కోరికలే దుఃఖానికి మూలం' అన్న విషయం ఎప్పుడో మన ఉపనిషత్తులలో కూడా ఉందమ్మా. అది మరుగున పడడం వల్ల మళ్ళీ చెప్పాల్సొచ్చింది ఆ విషయం. *శ్రోత్రీయస్య చ కామ హతశ్చ* అని స్పష్టంగా కృష్ణయజుర్వేదంలో ఉంది. శ్రోత్రీయుడివై అకామహతుడివై ఉండు. కోరికలే నిన్ను నాశనం చేస్తున్నాయి. కోరికలు తగ్గించుకో. ఎప్పుడో చెప్పింది వేదం.

పరమజ్ఞానమనేది ఒక ప్రవాహం లాంటిది. ప్రవాహంలో వర్షాకాలంలో నీరు వేరుగా ఉంటుంది. బురద ఉంటుంది. చిన్న చిన్న మొక్కలు ఉంటాయి. శరత్కాలం వచ్చేసరికి తేరుకుంటుంది. వేసవికాలం వచ్చేసరికి ఎండిపోతుంది. జ్ఞానం కూడా అంతే. ఎప్పుడూ ఒకేలా ఉండదు. అందులో ఏవేవో కలిసిపోతూ ఉంటాయి. దాన్ని మళ్ళీ మహానుభావులు సంస్కరిస్తూ ఉంటారు. అలా సంస్కరించినవారే కృష్ణుడు, బుద్ధుడు, శంకరాచార్యుడు. వాళ్ళు దైవాంశతోనే పుడతారు. ఎందుకంటే ఈ సృష్టంతా దేవుడే. దాన్నెలా రిఫార్మ్ చేసుకోవాలో ఆయనకు తెలుసు. మనం ఓం తాపత్రయ పడిపోనక్కర్లేదు. మనం చేసుకోవల్సిన రిఫార్మ్ మననే. ఎవరినీ

చేయక్కర్లేదు. ఆత్మోద్ధరణ చెయ్యి. సంఘోద్ధరణ తరువాత చూద్దాం అన్నారు రమణ మహర్షి. అంత స్వాతంత్రోద్యమం జరుగుతుంటే ఆ మనిషి వెళ్ళి కనీసం వందేమాతరం అనలేదెక్కడా. ఎందుకని అనలేదు? అదే తేడా. అష్టావక్రగీతలో అష్టావక్రుడు చెబుతాడు. దృష్టి వేరు. దృక్కోణం వేరు. *దృగ్బ్రహ్మ దృశ్యం మాయా.* ఆ కాలంలో స్వాతంత్రోద్యమం ఒక దృశ్యం. ఆత్మజ్ఞానం ఎప్పుడూ దృశ్యమే. హిందూ ధర్మంలో ఉండే అసలైన నిజాలను బయటకు తీసుకెళ్ళడం ఒక దృశ్యం. దాన్ని వివేకానందుడు పట్టుకున్నాడు. యోగమార్గం ఒక దృశ్యం. దాన్ని అరవిందుడు పట్టుకున్నాడు. 'నేనెవరు?' అని నేరుగా ఉండే ప్రత్యక్ష మార్గం ఒక దృశ్యం. దాన్ని రమణ మహర్షి పట్టుకున్నారు. వీళ్ళెవ్వరూ దేశద్రోహులు కారు. అలాగని మనం గాంధీగారినో, పటేల్ నో, సుభాష్ చంద్ర బోసునో తక్కువ చేయక్కర్లేదు. వాళ్ళు ప్రాణాలను లెక్క చెయ్యకుండా పోరాటం చేశారు. వాళ్ళ దృష్టిలో రాజకీయ స్వాతంత్రం చాలా ముఖ్యం. వీళ్ళ దృష్టిలో అధ్యాత్మిక ప్రగతి ముఖ్యం.

**ప్రశ్న 12: మీరిందాక ఒక ఆటలో గెలిచాడంటే, మరునిముషంలోనే ఆ ఆనందం ఆవిరైపోతుంది కనుక పెద్దగా ఆనందించక్కర్లేదు అన్నారు కదా! కాని జీవితమంటే ఈ చిన్న చిన్న ఆనందాలు, చిన్న చిన్న దుఃఖాలు కలబోసిందే కదా! అవన్నీ అనుభవిస్తేనే జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించినట్టు అంటారు కదా?**

జవాబు: చిన్ని చిన్ని ఆనందాలను అనుభవించడం వేరు. అందులో పూర్తిగా మునిగిపోవడం వేరు. అనుభవించొద్దని మన వేదాంతం చెప్పలేదు. పైగా ఏం చెప్పిందంటే *లోకవత్తు లీలా కైవల్యం* అని బ్రహ్మసూత్రాల్లో ఉన్నమాట. ఆనందించమని చెప్పింది. లీలగా భావించమని చెప్పింది. నిజమని ఎందుకనుకుంటున్నారు? ఆనందాన్ని ఎక్కడా కాదనలేదు. అష్టావక్రగీతలో చెబుతాడు, *బాలవత్ ధీమాన్* – పసిపిల్లల లాగ మంచి చెడ్డల తలపే లేకుండా పని చెయ్యమంటాడు.

*ప్రవృత్తౌ జాయతే రాగో నిర్వృత్తౌ ద్వేష ఏవ హి ।*

*నిర్ద్వన్ద్వో బాలవద్ధీమా నేవ మేవ వ్యవస్థితః ॥*

*ప్రవృత్తౌ జాయతే రాగో* – ఏదైనా పని చేసేటప్పుడు ఖచ్చితంగా దానియందు ఇష్టం పుడుతుంది. ఇష్టం పుట్టనీకు. పని చెయ్యి. అంతే. ఇది నాకిష్టం అనుకుంటే ఇంకొకటి ఇష్టం కాకుండా పోయింది. రేపా పని చెయ్యాల్సి రావొచ్చు. సరిగ్గా మనిషెక్కడ ఓడిపోతున్నాడంటే పెళ్ళి ఇష్టం, మరణం అయిష్టం. కాని రెండూ అనివార్యం. నువ్వు పెళ్ళైనా ఆపగలవేమో కాని మరణం ఆపలేవు. మా ఇంట్లో ఎప్పుడూ శుభకార్యాలే జరుగుతూ ఉండాలండీ! ఇది స్వార్థం! ప్రతివాడూ ఇలాగే అనుకుంటాడు. శంకరాచార్యుడు దాన్ని గమనించాడు. ఆ మహానుభావుడి పేరు మాటిమాటికీ ఎందుకొస్తుందంటే, మానవుల బలాలు కాదమ్మా, బలహీనతలుకూడా గమనించాడాయన. నాకు తెలుసు నీ కోరికేదో. ఇలా అయితే తీరుతుందన్నాడు. మానవజాతి మొత్తానికుండే కోరికలేమిటో నాకు తెలుసు.

*సుఖమునస్సర్వదా భూయాత్ మా భూత్ దుఃఖమ్ కదాచన ఇతీచ్ఛే సర్వ సామాన్యే తే జ్ఞానాదేవ సిద్ధ్యతః* అని శంకరాచార్యులు అంటారు. సుఖమునస్సర్వదా భూయాత్ – మీరందరూ ఏం కోరుకుంటారో నాకు తెలుసు. ఎప్పుడూ సుఖమే ఉండాలంటారు. అంతే కదా? బాగుండాలనుకోవడంలో తప్పులేదు. కాని పోటీపడకుండా ఎవ్వరూ బాగుండరు. పోటీపడడంలో రాగద్వేషాలు ఉంటాయి. పోటీపడమనే చెబుతున్నారు పిల్లలకు. లక్ష్యం అక్కడుంది. నువ్వు చేరుకోవాలి అంటాడు ప్రతీవాడు. లక్ష్యాన్ని చేరుకోవటం పర్సనాలిటీ డెవలప్మెంట్ కాదు. చేరుకునే మార్గమే లక్ష్యం. అది గ్రహించు. నడకే లక్ష్యం. అది ఏదో చేరుకునే మార్గమే లక్ష్యం. అక్కడేదో ఉంది. అది చేరుకోవాలి. అంతవరకూ కష్టపడాలి. వీడు చెమటంతా కార్చేది అక్కడికెళ్ళి ఆ పాయింట్ ముట్టుకోవడానికా? ముట్టుకున్న తర్వాత ఏం చేయాలి? కలెక్టర్ అవ్వాలని ఓ కుర్రాడు నానా యాతనలూ పడి, శ్రమపడి కలెక్టర్ అయ్యాడు.

కలెక్టర్ అయిన తరువాత వాడి పరిస్థితేమిటి? ఆనందంగా ఉన్నాడా? అంతకుముందే వాడు వేదాంతం నేర్చుకోగలిగితే, కలెక్టర్ అయినా, కాకపోయినా, ఉద్యోగం వచ్చినా, రాకపోయినా, పెళ్ళయినా, కాకపోయినా ఆనందంగా ఉంటాడు. అదీ వేదాంత మార్గం. అది కలెక్టర్కంటే గొప్పది. ఎందుకంటే కలెక్టరు అయ్యాక, ఓ ఎమ్మెల్యే వస్తే అతనిముందు చేతులు కట్టుకుని నిలబడాలి. అప్పుడు వాడు నా పనికంటే ఈ ఎమ్మెల్యే పనే బాగుంది అనుకుంటాడు. ఆ ఎమ్మెల్యేని అడగండి. ఆయన ప్రజల కాళ్ళు పట్టుకుంటాడు.

*సుఖమునస్సర్వదా భూయాత్* – అందరూ సుఖమే కోరుకుంటారు. *మా భూత్ దుఃఖమ్ కదాచన* – నాకెప్పుడూ దుఃఖం రాకూడదనుకుంటారు. *ఇతీచ్ఛే సర్వ సామాన్యే* – ఇదందరికీ ఉండే కోరికే అని ఆయన మార్గం చెప్పాడు. *తే జ్ఞానాదేవ సిద్ధ్యతః* – నీకెప్పుడూ సుఖమే ఉండాలి. దుఃఖం రాకూడదు అని కోరుకుంటే, జ్ఞానమనేది పొందు. అప్పుడు సాధ్యమవుతుంది. జ్ఞానమంటే సుఖం, దుఃఖం రెండూ మిథ్య అని తెలుసుకోవడం. అంతేకాని సుఖం పొందడంద్వారా సుఖం సాధ్యం కాదు. అంతా ఒక్కటే అని తెలుసుకుంటేనే సుఖదుఃఖాలు సమానమనేది మనిషికి అర్థమౌతుంది. అప్పుడు సుఖాన్ని స్వీకరించినట్టే దుఃఖాన్నీ స్వీకరిస్తాడు. స్వీకరించడమంటే అనుమతించడం. దేనికీ పొంగిపోవడం కాదు, కుంగిపోవడం కాదు. ఇదొచ్చినట్టే అదీ వస్తుంది. ఈవేళ పెళ్ళి చేశాం. రేపు అవసరమైతే కర్మ చేస్తాం. ఎందుకంత కుంగిపోవాలి? ఇదొక పరిణామం. అదొక పరిణామం. పైగా పెళ్ళి నివార్యం. కర్మ అనివార్యం. తప్పనిసరైనదాన్ని ద్వేషిస్తున్నారు. తప్పుకునే అవకాశమున్నదాన్ని ప్రేమిస్తున్నారు. ఎలా సుఖపడతారు? అలా అని అశుభాన్ని కోరుకోవడంకూడా తప్పే! అదే చెబుతాడు అష్టావక్రుడు.

*ప్రవృత్తౌ జాయతే రాగః* – ఒక పని చేస్తున్నప్పుడు, అదే చేస్తున్న కొద్దీ దాని మీద ఇష్టం పెరిగిపోతుంది. *నివృత్తౌ ద్వేష ఏవ* – ఏదైనా వద్దనుకున్నప్పుడు. అనుభవించాం కదా! అయిపోయింది కదా! ఇంక వద్దు అనుకోవాలి. నాకదంటే గిట్టదండీ, ఆ మొహం చూస్తే

అసహ్యమండీ! ఎలర్జీ అండీ! ఇంతంత మాటలొద్దు. ఎలర్జీ ఏం లేదు, అన్నీ ఎనర్జీనే. ఇది ఎలర్జీ, అది ఎనర్జీ అన్నామంటే రాగద్వేషాలు వచ్చేసినట్టే. ఆ పని ఒకప్పుడు చేయక తప్పదు. అహంకారం ఎంత దోషమో మమకారం అంతే దోషం.

సామాజిక పరివర్తన అనే ఇంజిన్ కి వేదాంతాన్ని మించిన ఇంధనం లేదంటాడు వివేకానందుడు. సామాజిక పరివర్తన ఉద్యమాలవల్ల, ఊరేగింపులవల్ల రాదు. ప్రతీ మనిషి తనగురించి తాను ఆలోచించుకోవాలి. నేనేం చేస్తున్నాను? నేనెలా ఆలోచిస్తున్నాను? అని తెలుసుకోవాలి.

**ప్రశ్న 13: సంసార బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, నలుగురికీ సాయం చేస్తూ జీవనం సాగించేవాడికి దేవుడి అవసరం ఉందంటారా?**

జవాబు: లేకపోయినా పరవాలేదు కాని నలుగురికీ సాయం చేస్తూ అంటున్నావు కదా! ఎందుకు చేయాలనిపిస్తోంది? చేయకుండాకూడా ఉండొచ్చు కదా! ఎదుటి వ్యక్తిలోనూ, నీలోనూ ఉన్నది ఒకటే కనుక నీకలా అనిపిస్తోంది. నువ్వు, ఆయనా వేరైతే ఎప్పటికీ ఎదుటి వ్యక్తిలో నిన్ను నువ్వు చూడలేవు. ఉన్నదంతా ఒకటే పదార్థం అని తెలుసుకుంటే మాత్రమే ఎదుటివ్యక్తిలో మనని చూడడం సాధ్యం. మనం వ్యక్తి అనుకుంటున్న దేహాన్ని, వారు వ్యక్తి అనుకుంటున్న దేహాన్ని మరచిపోగలిగేతేనే సాధ్యం.

**ప్రశ్న 14: కాని ఈ జ్ఞానం లేకుండా ఎదుటివ్యక్తికి సాయం చేయడంలో ఒక తృప్తి లభిస్తుంది అనుకుని సాయం చేస్తే?**

జవాబు: ఆ తృప్తీ, ఆ జ్ఞానమే దైవం. నువ్వే ఆరాధనా చేయక్కర్లేదు. దేవుడి మీద నమ్మకంతోకూడా పని లేదు. మన ఉపనిషత్తులలో ఒక గొప్ప మాట ఉంది. శ్వేతాశ్వతరోపనిషత్తులో,

*యదా చర్మవదాకాశం వేష్టయిష్యన్తి మానవాః ।*

*తదా దేవమవిజ్ఞాయ దుఃఖస్యాన్తో భవిష్యతి ॥*

మనిషి తన శరీరానికి చర్మాన్ని తొడుగు అనుకోకుండా, ఆకాశమే తొడుగు అనుకోగలిగితే, దేవుడితో సంబంధం లేకుండానే సమస్త దుఃఖాలకీ అతీతమైపోతాడు. అది భారతీయ వేదాంతమంటే. దేవుడు, విగ్రహం, ఆరాధన ఇవేవీ ముఖ్యం కాదు. నిన్ను నువ్వు తెలుసుకోవడమే ముఖ్యం. ఆ తెలుసుకున్నదానికి ఏం పేరు పెట్టుకున్నా అభ్యంతరం లేదు. మొత్తమంతా ఒకటే అని గ్రహిస్తే చాలు. ఆకాశం తొడుగంటే అర్థమేమిటి? విశ్వమానవుడు అని అర్థం. ఇంక ఎదుటివాడెక్కడున్నాడు నువ్వు చెయ్యడానికి? చేస్తున్నది నీకే. అప్పుడెంత విశాలంగా ఆలోచిస్తాం మనం? ఒక్కసారి ఈ సంసారం కాదు, జీవితం కాదు, సమస్త దుఃఖాలూ వెళ్ళిపోతాయి. సముద్రంలా అయిపోతాం. అప్పుడు ఎదుటివాడి జీవితం ఒక తరంగం, మన జీవితం ఒక తరంగం, అన్నీ అందరూ తరంగాలు. నువ్వు సముద్రం అయిపోతావు. అదే తరంగమైతే నేను లేచా, వాడు పడ్డాడు. ఈ దరిద్రమంతా వస్తుంది. నువ్వే సముద్రమైతే లేచే తరంగం నువ్వే, పడే తరంగం నువ్వే. ఎందుకంత బాధపడతావు? ఎందుకంత సంతోషిస్తావు? ఇది అద్వైతం!

### ప్రశ్న 15: అద్వైతం విగ్రహారాధనకు వ్యతిరేకమా?

జవాబు: ఏం లేదు. ఎక్కడా విగ్రహారాధనకు వ్యతిరేకమని శంకరాచార్యులు చెప్పలేదు. పైగా అందరు దేవతలపైన స్తోత్రాలు రాసిన ఏకైక కవి, పండితుడు శంకరాచార్యులు.

### ప్రశ్న 16: నేటి సమాజానికి కావలసింది హేతువాదంతో కూడిన ఆస్తికత అంటే ఏమంటారు?

జవాబు: ఆఁ అది! ఇవాళ కావలసింది హేతుబద్ధమైన ఆధ్యాత్మికత. హేతువాదంతో కూడిన అంటే మళ్ళీ టెర్మినాలజీ మారిపోతుంది.

**ప్రశ్న 17: ఆస్తిక హేతువాదం అనే పదం వాడుకలో ఉంది. రామానుజాచార్యులు, అన్నమయ్య వీరంతా ఆస్తిక హేతువాదులు – rational theists.**

జవాబు: మంచిదే! వివేకానందుడు ఇంకో మాట అన్నాడు. స్పిరిచ్యువల్ కమ్యూనిజం – ఆధ్యాత్మిక సామ్యవాదం అన్నాడు. మనుషులను సమానం చేయడమనేది ఆత్మ పరంగానే సాధ్యం కాని భౌతికంగా సాధ్యం కాదు. 'నేను' అనగానే నీలో ఏది స్ఫురిస్తుందో, 'నేను' అనగానే నాలోనూ అదే స్ఫురిస్తుంది. నీలో స్ఫురిస్తున్న 'నేను'ను నువ్వంటున్నాను ఎదురుగా ఉన్నావు కాబట్టి. నాదగ్గరకు వచ్చేసరికి 'నేను' అంటున్నాను. కాని నువ్వు దానిని 'నేను' అనే అనుకుంటావు. నేను దేనిని నువ్వంటున్నానో దానిని నువ్వు 'నేన'నే అనుకుంటావు. నువ్వు దేనిని నువ్వంటున్నావో దానిని నేను 'నేన'నే అంటాను. అంటే ఉన్నది నేనొక్కటే. నువ్వు లేదు. అదే అద్వైతం. అది ఆత్మసమానత్వం అంటారు. మనసులో అంత సమాన భావన ఉన్నప్పుడు ఏ ప్రాణికీ మనం కావాలని అపకారం చెయ్యం.

*****

# ప్రచురించిన పరిశోధన

# పత్రాలు

================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 18:3 March 2018
India's Higher Education Authority UGC Approved List of Journals Serial Number 49042
================================================================

# The Philosophy behind *Annamayya's Visishtaadvaita:* Historical and Theoretical Backgrounds

**Dr. Pammi Pavan Kumar, Associate Professor**
**Ms. Harita Bhatlapenumurthy, Ph.D. Research Scholar**
================================================================

**Abstract**

In this paper, we discuss the historical and the theoretical backgrounds of *Visishtaadvaita*, the Vedanta school, which is the underlying philosophy behind ***Annamayya's Sankeertanas*****.**

In the first section, we discuss the ***Visishtaadvaita*** from historical perspective. In the process, we touch upon several schools of thoughts, religions that existed before *Visishtaadvaita*, namely, the *Vedic* religion, *Buddhism, Jainism, Shaivism, Vaishnavism,* and *Advaita*. We also discuss how each of these had to pave way for its successor, and finally the need for *Visishtaadvaita*.

In the second section, we discuss the movement, ***Bhakti*** the rise of ***Azhvars***, who were the great propagators of *Visishtaadvaita,* and the *aachaaryas*, who were the proponents of *Visishtaadvaita*.

Issues discussed in this paper are helpful to understand ***Annamayya*'s *Sankeertanas*** in a better way as they embrace exude the philosophy of *Visishtaadvaita* throughout.

**Dr. Pammi Pavan Kumar, Associate Professor**
pavankpammi@gmail.com

**Ms. Harita Bhatlapenumurthy, Ph.D. Research Scholar**
harita256@gmail.com

**Department of Telugu**
**University of Hyderabad**
**Hyderabad – 500046**
**Telangana State, India**

Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 18:03 March, 2018
UGC Approved List of Journals Serial Number 49042

# అన్నమయ్య విశిష్టాద్వైతం: చారిత్రక, సైద్ధాంతిక నేపథ్యాలు

annamayya viśiṣṭādvaitaṁ: cāritraka, said'dhāntika nēpathyālu

Dr. Pammi Pavan Kumar, Associate Professor,
pavankpammi@gmail.com
Ms. Harita Bhatlapenumurthy, Ph. D. Research Scholar
harita256@gmail.com
Department of Telugu, University of Hyderabad, Hyderabad – 500046, TS. India

## సంక్షిప్తి:

అన్నమయ్య భక్తికి మూలకందమైన విశిష్టాద్వైతం అవతరించడానికిగల చారిత్రక, సైద్ధాంతిక భూమికలు ఈ పత్రంలో చర్చించబడ్డాయి.

చారిత్రక నేపథ్యంలో భాగంగా– మొదటగా, వైదిక మతంలోవచ్చిన క్రమపరిణామాన్ని విపులీకరించడం జరిగింది. వేదంలోని 'సంహిత' యజ్ఞయాగాది కర్మవిధులలో పఠించవలసిన మంత్రాలను గురించి వివరిస్తుంది. 'బ్రాహ్మణం' ఆ మంత్రభాగాల ప్రశస్తిని వివరిస్తుంది. 'ఆరణ్యకం' కర్మవిధికి బదులుగా చేయవలసిన ధ్యానం గురించి వివరిస్తే, వేదాంతాలైన ఉపనిషత్తులు బ్రహ్మవిద్యను గురించి బోధిస్తాయి. ఇలా వైదిక మతంలోనే 'కర్మ మార్గం' నుంచి 'జ్ఞాన మార్గం' వైపుకు మళ్ళే క్రమం వేల సంవత్సరాలక్రితమే ఏర్పడిఉండడం మనం గమనించవచ్చు. ఆ తరువాత వచ్చిన బౌద్ధం, అద్వైతం వంటి మతాలలో జ్ఞాన మార్గ వికాస సంబంధ విశేషాలను గ్రహించవచ్చు.

కర్మ మార్గం కంటే జ్ఞాన మార్గం, జ్ఞాన మార్గం కంటే భక్తి మార్గం ఆయా కాలలోని ప్రజలను ఎక్కువగా ఆకర్షించాయి. అటు యజ్ఞయాగాది కర్మవిధులలో భాగం కాలేక, ఇటు అద్వైతాది మతాలలోని సంక్లిష్టతను కానీ, బౌద్ధ, జైనాది మతాలలోని సన్యాస జీవితాన్ని ఆహ్వానించలేని సామాన్యుడికి 'భక్తి మార్గం' సేదదీరే మార్గాన్ని చూపించింది. సర్వమానవ సమానత్వం, స్వార్థరాహిత్యం, సంఘ సంస్కరణ... మొదలైన విలువలకు భక్తి మార్గం చోటు కల్పించింది. అటువంటి భక్తి మార్గంలో పయనించి విశిష్టాద్వైతానికి పునాదులు వేసిన ఆళ్వారులను, ఆచార్యులను గురించికూడా ఈ పత్రంలో చర్చించడం జరిగింది.

ఈ విశిష్టాద్వైత మత తత్త్వాన్ని అనుసరించి అన్నమయ్య సామాన్యులకు సైతం అర్థమయ్యే గేయ ప్రక్రియలో "బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటె.. కందువగు హీనాధికములిందు లేవు అందరికి శ్రీహరే అంతరాత్మ" (2–385) అంటూ సర్వ మానవ సమాన భావాలను తన గేయాలలో ప్రకటించాడు. "ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన

నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు" (1-318) అని అన్నమయ్య చాటగలగడానికి అతనికి ఊతమిచ్చినది 'విశిష్టాద్వైత తత్త్వమే'.

## ౦. పరిచయం

సమాజ, సాహిత్యాలు అవిభాజ్యాలు. ఒక విధమైన సాహిత్యం ఒకానొక కాలంలోనే ఆవిర్భవించటానికి ఒక చారిత్రక నేపథ్యం ఉండి తీరుతుంది. ముఖ్యంగా, తెలుగు సాహిత్యం-మతం అన్నవిరెండూ విడదీయలేని సంబంధంకలిగి వికసించడం కనిపిస్తుంది. "ఆంధ్ర వాఙ్మయ వీధులలో బాహాటముగా జరిగిన సాహిత్య వ్యాపార మంతయు మతమను కాసుతోనే చెలామణి అగుచు వచ్చినది" అన్న వేటూరి ఆనందమూర్తిగారి మాటలు (వైష్ణవాంధ్ర వాఙ్మయము:1986:5, 6) అక్షర సత్యాలు.

తెలుగు సాహిత్యం- వైదిక మత పునరుద్ధరణ ధ్యేయంగా మహాభారత అంధ్రీకరణతో మొదలయింది. అనంతర శతాబ్దాలలో వచ్చిన సాహిత్యంలో సింహభాగం మతసంబంధమైనదే! అన్నమయ్య వెలువరించిన అనంతమైన సాహిత్య సంపదకుకూడా వెన్నుదన్ను- మతమే! అయితే, అది విశిష్టాద్వైత మతంగా పరిణమించడం ఒక గుణాత్మకమైన మలుపు. విశిష్టాద్వైత తత్త్వానికి అనుగుణంగానే అన్నమయ్య ప్రజల భాషలో, ప్రజాహితమైన గేయ ప్రక్రియలో సాహిత్యాన్ని సృజించాడు. అన్నమయ్య కీర్తనలను అర్థం చేసుకోవడానికి 'శ్రీవైష్ణవం' అనబడే 'విశిష్టాద్వైత మతాన్ని' దాని తత్త్వాన్ని అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. కనుక, అన్నమయ్య భక్తి తత్త్వమైన విశిష్టాద్వైతాన్ని అర్థం చేసుకునే క్రమంలో- విశిష్టాద్వైతంయొక్క చారిత్రక, సైద్ధాంతిక నేపథ్యాలను ఈ పత్రంలో విపులీకరించే ప్రయత్నం చేయబడింది.

"తెలుగు సాహిత్యాన్నే కాదు, ఏ భారతీయ భాషా సాహిత్యాన్నైనా చారిత్రక దృష్టితో అధ్యయనం చేయాలంటే భారత ఉపఖండం మొత్తం చరిత్రను భూమికగా తీసుకోవలసి ఉంటుంది" అన్న కె. కె. రంగనాథాచార్యులుగారి మాటలు ఇక్కడ గమనింపదగినవి. (తెలుగు సాహిత్యంలో మరో చూపు:1981: ix) కనుక, విశిష్టాద్వైత మతావిర్భావానికి దారి తీసిన పరిస్థితులను గురించి తెలుసుకోవాలంటే భారతదేశంలోని ప్రాచీన మతాలు, వాటితో ముడిపడి ఉన్న సామాజిక పరిస్థితుల గురించిన స్థూల అవగాహన ఏర్పరచుకోవలసి ఉంటుంది.

## 1. చారిత్రక నేపథ్యం

భారతదేశంలో విశిష్టాద్వైతానికి ముందు ఉన్న మతాలు ప్రధానంగా:

### 1.1. వైదిక మతం

భారతదేశంలో తొలి మతం- వైదిక మతంగా పేర్కొనే సనాతనధర్మం. భారతీయ మతభావనలకు మూలాలన్నీ వేద కాలంనుంచీ వికసిస్తూ వచ్చాయి. ఋక్, యజుర్, సామ, అధర్వణ అన నాలుగు వేదాలలోని ఒక్కొక్క

వేదం, నాలుగు విభాగాలుగా చేయబడింది. అవి– (1) సంహిత (2) బ్రాహ్మణం (3) ఆరణ్యకం (4) ఉపనిషత్తులు. వీటిలో– మొదటి రెండూ కర్మ కాండకు చెందినవి. తరువాతి రెండూ జ్ఞాన సంబంధమైనవి.

'సంహిత' మంత్రాలను, స్తోత్రాలను కలిగి ఉంటుంది. దాని తరువాయి ఉండే 'బ్రాహ్మణం' ఆ మంత్ర భాగాన్ని, యజ్ఞయాగాదుల ప్రశస్తిని, వాటిని ఆచరించే విధానాన్ని వివరిస్తుంది. కర్మ విధులయిన యజ్ఞయాగాదులకి, జ్ఞాన విధులయిన ఉపనిషత్తులకు మధ్య వారధి లాంటిది ఆరణ్యకం. అది యజ్ఞయాగాదుల, వైదిక కర్మల వెనుక ఆంతర్యాన్ని వివరిస్తుంది. అలాగే, కర్మకు బదులుగా చేయగలిగిన ధ్యాన విధిని విపులీకరిస్తుంది. ఉపనిషత్తులలో అందించే జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికి కావలసిన సన్నద్ధతను అందించేది– ఆరణ్యకం.

ఉపనిషత్తులు పూర్తిగా జ్ఞాన సంబంధులు. ఆరణ్యకాల తరువాతా, వేదాల చివరనా ఉంటాయి కనుక, వీటిని వేదాంతాలనికూడా అంటారు. మోక్ష చింతన, ఆత్మానాత్మ వివేకం ఇందులో ప్రధానాంశాలు. కర్మకాండలద్వారా సముపార్జించిన పుణ్యమైనా, స్వర్గప్రాప్తి అయినా అనుభవించిన తరువాత, మనిషి మళ్ళీ పూర్వస్థితికి చేరుకుంటాడు. కనుక, జననమరణ చక్రాన్ని ఛేదించి, పునరావృత్తి రహిత శాశ్వతమైన స్థితిని, మోక్ష మార్గాన్ని చేరుకునే దిశగా ఉపనిషత్తులు జ్ఞానబోధ చేస్తాయి.

కర్మ కాండలలో కనిపించే 'బలులు', వైదిక మతంలోని 'కులభేదాలు'... మొదలైనవి జిజ్ఞాసువులను ఆలోచింపజేసాయి. ఫలితాలుగా బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించాయి.

## 1.2 బౌద్ధం

క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దం– భారతదేశంలో మతపరంగా, తత్త్వ చింతన పరంగా పెనుమార్పులు చోటు చేసుకొన్న కాలం. మొదట– ప్రజలు– సంచార జవనం సాగిస్తున్నదశలో– వైదిక సంస్కృతి ఉత్తర భారతదేశమంతా విస్తరించింది. కాని, సంచార జీవనం నుండి ప్రజలు వ్యవసాయ ఆదారిత సమాజాలుగా మారి, గ్రామాలు, పెద్ద ఊర్లు, ఆ పై నగరాలను వృద్ధి చేసుకొన్నాక, కొన్ని వర్గాల ప్రజలకి వైదిక సంస్కృతి సంతృప్తిని ఇవ్వలేకపోయింది. ఈ అసంతృప్తి క్రమంగా బౌద్ధ, జైన... మొదలైన మతాలు, వాటిలోని ఉపశాఖల వ్యాప్తికి దారి తీసింది.

శాక్యవంశ యువరాజు సిద్ధార్థుడు. అతడు రాజ్యభోగాన్ని విడిచిపెట్టి సత్యాన్వేషణ కోసం మొదట సాంఖ్య, యోగ మార్గాలను అవలంబించాడు. ధ్యానంద్వారా జ్ఞానం పొంది బుద్ధుడయ్యాడు. తాను ఆర్జించిన జ్ఞానాన్ని ప్రజలకు పంచడం ప్రారంభించాడు. బుద్ధుడు చూపిన జ్ఞాన మార్గమే బౌద్ధమైంది. బుద్ధుడు నాలుగు సత్యాలను బోధించాడు. (1) జీవితం దుఃఖమయం, (2) దుఃఖానికి కారణం కోరిక, (3) కోరికను చంపుకుంటే దుఃఖం నశిస్తుంది, (4) అష్టాంగమార్గం అవలంబిస్తే కోరిక నశిస్తుంది.

బౌద్ధం ధర్మ సూత్రాలను సరళంగా ప్రవచించింది. కులభేద రహితంగా ప్రతీ మనిషి నిర్వాణ స్థితిని సాధించగలగడాన్ని ప్రోత్సహించింది. ఇది సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించింది. మనిషి నైతిక వర్తన గురించి, అహింసా సిద్ధాంతం గురించి బుద్ధుడు చర్చించాడు. ధర్మం, సంఘాల గురించి విశేషంగా బోధించాడే తప్ప, దైవం

గురించి మాట్లాడలేదు. సంపూర్ణం అనుకొన్న దానిలో అప్పటి ప్రజలకు ఇదొక వెలితిగా కనిపించింది. రాను రాను, బుద్ధుని అనునాయులు ఆయన్నే దైవంగా పూజించసాగారు. బోధలకు ప్రాముఖ్యత తగ్గి, వ్యక్త్యారాధనకు ప్రాముఖ్యత హెచ్చింది. సంపద కలిగిన ప్రజల వితరణతో, ఆదరించిన రాజుల దానాలతో బౌద్ధ విహారాలు సంపదలతో నిండి ఉండేవి. బుద్ధుడు ప్రవచించిన నిరాడంబర జీవితానికి నీళ్ళొదిలి, బౌద్ధులు విలాస జీవితాలకు అలవాటు పడ్డారు. హిందూ మతంలో ఏ గుణాలనైతే బుద్ధుడు నిరసించాడో అవన్నీ బౌద్ధ మతంలోకి ప్రవేశించాయి. ఈ కాలంలో వివిధ హిందూ మత శాఖలు విస్తృతమయ్యాయ. బౌద్ధం క్షీణించడం, దేశందాటి భారత ఉపఖండంలో తన ఉనికిని కాపాడుకోడం మొదలైంది.

## 1.3 జైనం

భారతదేశంలోన అతి ప్రాచీనమైన మతాలలో జైనం ఒకటి. బుద్ధుడి కాలంలోనే జీవించిన వర్ధమాన మహావీరుడిద్వారా ఈ మతానికి దేశంలో ఆదరణ పెరిగింది. జైనం నాస్తిక మతం. మనిషి కర్మే మనిషిని నియంత్రిస్తుందని నమ్ముతారు జైనులు. కామ, క్రోధ, లోభ మోహాదులు కర్మకు కారణాలని, కర్మల ఫలితాలను అనుభవించడం కోసమే ఆత్మ అనేక జన్మలను ఎత్తుతుందని జినుల విశ్వాసం. కఠోరమైన నియమాలను పాటించి, పూర్వకర్మల పాపాలను నాశనం చేసుకున్నప్పుడు జీవుడు బంధ విముక్తుడవుతాడని, జనన మరణాల నుండి విముక్తి పొందదమే జీవిత లక్ష్యంగా భావించాలని మహావీరుడు బోధించాడు.

ప్రజలు జైన మతం వైపు ఆకర్షితులు కావడానికి కారణాలు బౌద్ధమత ఆవిర్భావానికి చెప్పుకొన్నవే. ఆ కాలంలో సముద్రతీరం వెంట వర్తక వ్యాపారాలు బాగాఅభివృద్ధి చెంది, వైశ్య సమూహాలు సంపదలతో వర్ధిల్లాయి. అయినా, సంఘంలో తగిన హోదా లభించకపోవడం వారిని అసంతృప్తికి గురి చేసింది. బౌద్ధం, జైనం ఇటువంటివారిని ఆకర్షించాయి. ఇటవంటివారికి సంఘంలో హోదాను కల్పించాయి. అలాగే సంఘంలోని ఇతర వర్ణాలవారుకూడా బౌద్ధ, జైనాలకు ఆకర్షితులయ్యారు.

ఇలా క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దిలో దక్షిణ భారతదేశంలో అడుగుపెట్టిన జైనం, కొన్ని శతాబ్దాల పాటు ప్రజాదరణ పొందింది. దక్షిణ భారతదేశంలో భక్తి ఉద్యమంలో భాగంగా వృద్ధి పొందిన శైవ, వైష్ణవ శాఖల కారణంగా క్రీస్తు శకం ఏడో శతాబ్ది నుండి జైనం క్రమంగా క్షీణించింది. (Studies in South Indian Jainism:1922:66)

## 1.4 శైవం

ప్రకృతిలోని విలయ రూపానికి అధినాథుడు రుద్రుడని ఆర్యుల భావన. స్తుతుల ద్వారా, ప్రార్థనల ద్వారా రుద్రుడిని శాంతింపజేసి, తమను కాపాడమని చేసే ప్రార్థనలలో ఈ భావన స్పష్టంగా కనిపిస్తుంది. ప్రకృతిలోని ఉగ్ర

స్వరూపాన్ని రుద్రునిగానూ, అదే రుద్రుడు ఆపదలు రాకుండా కాపాడిన వేళ– అతడి శాంత స్వరూపాన్ని– శివుడని కొలిచారు (శివం=మంగళం). శివుడిని పరదేవతగా కొలిచే మతం శైవంగా గుర్తింపబడింది. శైవ శాఖలలో పాశుపతం అత్యంత ప్రాచీనమైనది. ఇది కాక శైవంలో కాలాముఖ, కాపాలిక, తాంత్రిక... మొదలైన ఇతర శాఖలు ఉన్నాయి.

శైవంలో కర్మ ప్రధానమైన, భక్తి ప్రధానమైన రెండు మార్గాలూ కనిపిస్తాయి. కర్మ ప్రధానమైన శైవంలో వైదికాచారాలు, ఆచరణలు కనిపిస్తాయి. ఈ విభాగంలో శాఖలైన పాశుపత, కాలాముఖ శైవ శాఖలు తెలుగునాట వర్ధిల్లాయి. భక్తి ప్రధానమైన శైవం ముఖ్యంగా తమిళ దేశంలో భక్త్యుద్యమంలో భాగంగా వచ్చింది. ఈ మార్గంలోని భక్తులు కులభేదాలు పాటించరు. క్రీస్తు శకం ఆరో శతాబ్ది నుండి ఎనిమిదో శతాబ్ది వరకు తమిళ దేశంలో ప్రవర్తిల్లిన శివభక్తులను నయనార్లు లేక నయన్మార్లు అని పిలుస్తుంటారు. వీరు అరవై ముగ్గురు. వీరిని గురించి తమిళ ప్రబంధమైన పెరియపురాణంలో విస్తారమైన వర్ణనలున్నాయి. వీరిలో ముఖ్యులు అప్పర్ స్వామిగళ్, తిరుజ్ఞాన సంబంధర్, సుందరమూర్తి నాయనర్. వీరు ముగ్గురూ రచించిన శైవ వాఙ్మయానికి 'తేవారం' అని పేరు. ఈ ముగ్గురూ జైన బౌద్ధాలను నిరసించి, శివ భక్తిని ప్రచారం చేసి, శైవమత వ్యాప్తికి పాటుపడ్డారు.

## 1.5 వైష్ణవం

వేదకాలంలో సూర్యాంశగా కొలవబడ్డ విష్ణువు, వేదాంత (ఉపనిషత్తుల) కాలం నాటికి సమగ్ర స్వరూపాన్ని సంతరించుకుని త్రిమూర్తులలో ఒకడిగా, స్థితికారుడిగా, నారాయణుడిగా, వాసుదేవ కృష్ణుడిగా వివిధ రూపాలలో పూజలందుకున్నాడు. 'సర్వ వ్యాపకుడైన భగవానుని', 'విష్ణు' నామంతో పూజించారు.

విష్ణువును కొలిచేవారు వైష్ణవులుగా గుర్తించబడ్డారు, వారి మతం వైష్ణవం. వైష్ణవం సాత్త్విక మతంగా పేరు తెచ్చుకుంది. విష్ణు భక్తులను 'భాగవతులు' గా పిలవడం సంప్రదాయం.

## 1.6 అద్వైతం

శంకరాచార్యుల కాలం నాటికి అవైదిక మతాలైన బౌద్ధ, జైనాలతోపాటు, వైదిక మతాలైన వైష్ణవం, శైవం, శాక్తేయం, గాణాపత్యం, సౌరం, కౌమారం... ఇలా ఎన్నో మతాలు ఉనికిలో ఉండేవి. ప్రజలు తెగలుగా విడిపోయి దేవుని పేరుతో ఘర్షణలు పడుతుండేవారు. వైదిక ధర్మానికి ప్రాభవం తగ్గిన సమయం ఇది. ఈ సమయంలో ఆదిశంకరులు అద్వైత దర్శనాన్ని చూపిస్తూ, వేదాధ్యయనాన్ని, వేద ధర్మాన్ని పునః ప్రతిష్ఠాపించారు. అన్య దైవ దూషణను నిరసించారు. 'అన్ని దైవాలు ఒక్కటే', 'పరబ్రహ్మకు వేరు వేరు రూపాలు'– అని బోధిస్తూ నిర్గుణోపాసనను ప్రతిపాదించారు. వైదిక–అవైదిక మతాల అలజడులు తగ్గించడంలో శంకరాచార్యుల వారి కృషి ప్రత్యేకంగా పేర్కొనదగింది.

"తత్వమసి" ('ఆ బ్రహ్మనివి నీవే') అన్న చాందోగ్యోపనిషత్‌లోని సూక్తి, అద్వైత సిద్ధాంతానికి మూలం. "బ్రహ్మ సత్యం జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ నాऽ పరః" — 'బ్రహ్మమొక్కటే సత్యం. కనిపిస్తున్న జగత్తంతా మాయతో కూడుకున్నది.

మాయ పొరలు కప్పివేయడం వల్ల ఒక్కటే అయిన బ్రహ్మం వివిధ రూపాల్లో కనిపిస్తోంది. ఎప్పుడైతే అజ్ఞానం తొలగుతుందో, అప్పుడు తనలోనూ, జగత్తులోనూ నిండి ఉన్నదంతా ఒక్కటే బ్రహ్మమని తెలుస్తుంది' అని శంకరాచార్యులు ప్రబోధించారు.

అనంతర కాలంలో ఆదిశంకరుల ప్రబోధాలకు వక్రభాష్యాలు తీయబడ్డాయి. పండితులంతా 'అహం బ్రహ్మాస్మి' అన్న మాటలోని వాచ్యార్థాన్ని మాత్రమే గ్రహించి, తమకు తోచినదల్లా ధర్మమన్నట్టుగా ప్రవర్తించసాగారు. దీనికితోడు, అద్వైతంలో సహజంగా ఉన్న తర్కం, క్లిష్టత సామాన్య ప్రజానీకాన్ని ఆ మతానికి చేరువ చేయలేకపోయాయి. శంకరుల రచనలన్నీ సంస్కృతంలోనే ఉండి పండితవర్గపు చర్చలకు పరిమితమయ్యాయి. సామాన్యుడికి అద్వైత తత్వం పట్టుబడలేదు. ఇదే విషయాన్ని శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు– "అద్వైత తత్త్వం అనేది అందరికీ అందుబాటులో ఉండేది కాదు. ఇది అత్యుత్తమమైన ఆధ్యాత్మిక స్థితిని చేరగల్గిన కొందరి కొరకు మాత్రమే ఉద్దిష్టమైనది." (ఉపనిషత్ సుధాలహరి: 2011:56) అని వివరించే ప్రయత్నం చేసారు.

"క్లేశోఽధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్।

అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥' (భగవద్గీత: 12–5) 'సగుణోపాసనకన్న నిర్గుణోపాసన అత్యంత క్లిష్టమైంది; దేహాభిమానం కలవాళ్ళకు అవ్యక్తమైన ఆ నిర్గుణ బ్రహ్మ లభించడం కష్టసాధ్యం' – అని గీతాచార్యుడు పేర్కొన్నట్లు సామాన్య ప్రజలకు 'నిర్గుణాకారుడైన భగవదారాధన'పై గురి కుదరలేదు. అద్వైత వాదం, శంకరుని కాలం నాటి ఆశయమైన వైదిక సంస్కృతిని పునరుద్ధరించగలిగింది, సామాజిక ప్రశాంతత నెలకొల్పింది కాని, అధ్యాత్మికతకు ప్రధాన ఆశయమైన మానసిక ప్రశాంతత, జీవన సాఫల్య భావనలను సామాన్య ప్రజలకు ఇవ్వలేకపోయింది.

## 1.7 విశిష్టాద్వైతం

'విశిష్టమైన అద్వైత తత్త్వమే' విశిష్టాద్వైతమనబడుతోంది. ఎల్లప్పుడూ ప్రకృతి, జీవులతోకూడి ఉన్న పరమాత్మ ఒక్కడే అని దీని అర్థం. 'ఏకమేవ అద్వితీయమ్' అనే ఛాందోగ్యోపనిషత్తోని వాక్యం విశిష్టాద్వైతానికి మూలం. సాటి లేనిది ఈశ్వరుని శక్తి. ఆ ఈశ్వర శక్తికి– అంటే, 'పరమాత్మ'ను 'జీవాత్మ' శరణాగతి కోరి దానిలో ఐక్యం కావాలి అనేది విశిష్టాద్వైతంలోని ముఖ్యమైన సిద్ధాంతం. జీవాత్మకు పరమాత్మకు మధ్య గల సంబంధం 'శరీర–శరీరి' సంబంధం వంటిదని విశిష్టాద్వైతం బోధిస్తుంది.

ఇలా, భారతదేశంలో తొలి మతమైన వైదిక మతంలోని ఆచారాలను ఖండిస్తూ వెలుగు చూసిన బౌద్ధ, జైన... తదితర మతాల మధ్య విభేదాలను ఖండిస్తూ, అవైదిక మతాలను నిరసిస్తూ, వేద ప్రామాణ్యాన్ని తిరిగి నెలకొల్పుతూ అద్వైతం, అద్వైతాన్ని ఖండిస్తూ విశిష్టాద్వైతం ఆవిర్భవించాయి.

## 2. సైద్ధాంతిక నేపథ్యం

కర్మ (యజ్ఞ, యాగాలు), జ్ఞాన (ఉపనిషత్తులు) మార్గాల నుండి భక్తి మార్గం వైపు భారత సమాజం మళ్ళిన కాలంలో మొదటి దశ భక్తి ఉద్యమానిది.

14, 15 శతాబ్దులలో ఉత్తర భారతదేశంలో తలెత్తిన భక్తి ఉద్యమం, తమిళ దేశంలో 7-9 శతాబ్దాలలోనే మొదలయ్యింది. తమిళ దేశంలో సంగ యుగం నాటికే రామాయణ, భారతాది ఇతిహాసాలు, పురాణాలు, వేద సంస్కృతి నిలదొక్కుకున్నాయి. గ్రామ దేవతారాధనతో పాటుగా, వైదిక దేవతలైన శివ, విష్ణు, ఇంద్ర, సూర్య, వరుణుల ఆరాధనకూడా సాగుతుండేది (A History of South India:1961: 422, 423). ఇలా ఘర్షణ రహితంగా, గ్రామదేవత సంస్కృతి, వైదిక సంస్కృతి సమాంతరంగా ఆదరింపబడుతున్న సమయంలో, మొదట జైనం, ఆ పై బౌద్ధం దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించాయి.

బౌద్ధ జైన మతాలు ప్రవచించిన అహింస, నియమబద్ధ జీవనం, కులభేదరాహిత్యం సామాన్యులను ఆకర్షించింది. క్రమంగా బౌద్ధం, జైనం రెండవ శతాబ్దికల్లా దక్షిణ భారతదేశంలో బాగా నిలదొక్కుకున్నాయి. ఈ కాలంలో బౌద్ధ, జైనాలు బాగా వర్ధిల్లినట్టుగా *మణిమేకలై, సిలప్పదికారం, జీవక చింతామణి* మొదలయిన గ్రంథాలు సాక్ష్యం చెబుతాయి. రాజాశ్రయంవల్ల ఆయా మతాలు మరింతగా వృద్ధి చెందాయి. కాలక్రమేణా, ఈ అవైదిక మతాలు పరమత సహనాన్ని విడిచిపెట్టి, రాజుల ప్రాపకంలో దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం మొదలుపెట్టాయి. మొదట సాత్త్విక మతాలుగా ప్రారంభమైన ఈ మతాలు తరువాత ఎన్నో మార్పులకు లోనయ్యాయి. బౌద్ధ శ్రమణులు నైతిక విలువలు కోల్పోవడం, తాంత్రిక ఆచారాలు… మొదలైన కారణాల వల్ల బౌద్ధం క్షీణించసాగింది. కఠిన ఆచారాలు సామాన్యులను జైన మతానికి దూరం చేయసాగాయి.

తొలుత బౌద్ధ జైనాల తాకిడికి వెనకబడిన వైదిక మతం, ఆయా మతాల ప్రాబల్యం తగ్గుముఖం పట్టడంతో తిరిగి పుంజుకునే ప్రయత్నం చేసింది. బౌద్ధ, జైన మతాల సర్వ మానవ సమానత్వం, వర్ణ తిరస్కారం, సామాన్య జీవన విధానం… హిందూ సంస్కర్తలను ఆకర్షించాయి. ఫలితంగా, సరళీకృత రూపాలతో వైదిక మత శాఖలు తమను తాము పునరావిష్కరించుకున్నాయి. బౌద్ధ జైనాలకు ప్రత్యామ్నాయంగా కులభేద రహితమైన భక్తి మార్గాన్ని చూపించాయి. బౌద్ధజైనాలు జనబాహుళ్యాన్ని ఆకర్షించడానికి మరో కారణం సామాన్యుడికి అర్థమయ్యే భాష. అందుకు అనువైన సాహిత్యాన్ని వారు సృష్టించుకోవడం. ఈ పంథాలోనే, వైదిక దేవతలపై దేశీయ భాషలలో గేయరచనలు చేశారు భక్త కవులు. శైవ భక్తులైన నాయనార్లు భక్తి ప్రధానమైన గేయాలతో శైవానికి ఊపిరులూదారు. అలాగే ఆళ్వార్లు తమ పాశురాలతో వైష్ణవ మతోత్థానానికి దోహదం చేశారు.

ఈ భక్త కవులు వైదిక మతాన్ని పూర్తిగా అనుసరించలేదు. అలాని పూర్తిగా తిరస్కరించనూలేదు. మధ్యే మార్గాన్ని ఆవిష్కరించుకున్నారు. వైదిక సాహిత్యంలోని శివ, విష్ణు లీలలను తెలిపే గాథలను మాత్రమే తీసుకుంటూ, వాటికి ప్రచారం కల్పిస్తూ, వర్ణాతీతంగా ప్రజలనందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేశారు. అదే సమయంలో బౌద్ధ, జైనాలను తీవ్రంగా నిరసించారు.

బౌద్ధజైనాలు ప్రచారం చేసిన నాస్తిక, నిరాశావాద భావాలు అలుముకున్న వాతావరణంలో, మహిమాన్విత గాథలతో, దివ్యమంగళ స్వరూప వర్ణనలతో కూడిన సరసభరితమైన గీతాలతో సామాన్యులకు చేరవయ్యారు భక్తకవులు. సామాన్యులు మళ్ళీ ఆస్తిక మతాల వైపుకు మళ్ళడానికి శివ భక్తులైన నాయనార్లు, విష్ణు భక్తులైన ఆళ్వార్లు ప్రధాన కారణమయ్యారు. ఈ భక్త్యుద్యమం ఫలితంగా ఎన్నో దేవాలయాలు వెలిసాయి. ఆయా దేవాలయాల వైభవాలు, మూలవిరాట్టుల మహిమలను స్తుతిస్తూ ఎంతో సాహిత్యం వెలుగు చూసింది. ఇది సామాన్యులను విశేషంగా ఆకట్టుకొంది. శంకరాచార్యులు ప్రచారం చేసిన నిరాకారోపాసనకు భిన్నంగా, సగుణోపాసన, సగుణారాధన ప్రాచుర్యాన్ని సంపాదించుకొన్నాయి.

అంతవరకు వ్యవస్థాగతమైన భక్తి, భక్త్యుద్యమంతో వ్యక్తినిష్ఠమైంది. భగవంతుడు భక్తునికి మరింత చేరువయ్యాడు. ఏకేశ్వరోపాశన భక్త్యుద్యమంలో ప్రధానమైన లక్షణంగా నిలిచింది. వైదిక ఛాయలు కలిగి ఉంటూనే దేశీయ స్పర్శ కలిగి ఉండడం దీనిలోని ప్రత్యేకత.

భక్తి మార్గం భక్తులకు గొప్ప స్వేచ్ఛను ఇచ్చింది. ఎవరికి నచ్చిన రీతిలో వారు తమ దైవాన్ని కొలుచుకున్నారు. ఒకరు పుష్పాలతో పూజిస్తే, మరొకరు భక్తిగీతాలతో అర్చించారు. ఒకరు ఆలయం కట్టిస్తే, మరొకరు భగవంతునితో తాదాత్మ్యం చెంది పరవశించారు. ఒకరు భగవంతుని ఆత్మోద్ధారకుడిగా భావించి సేవిస్తే, మరొకరు ప్రాణనాథుడిగా తలచుకుని పులకరించారు. అందుకే భక్తి మార్గం సామాన్య ప్రజలను అంతగా ఆకట్టుకుంది. ఇందుకు ప్రత్యేకమైన విధి విధానాలు అవసరం లేదు, జ్ఞాన వైరాగ్యాలతో, కర్మాది విధులతో పని లేదు. భక్తికి శుద్ధాంతఃకరణం ఉంటే చాలు. భక్తి మార్గం సన్యసించమని ప్రబోధించదు. గృహస్థ జీవితం గడుపుతూనే భగవంతుని చేరే మార్గాన్ని సూచిస్తుంది. ఈ ప్రపంచంలో ఉంటూనే దానికి దూరంగా ఉండటం, కర్మలు చేస్తూనే కర్మ ఫల త్యాగం చేయడం దీని ప్రధాన లక్షణాలు.

భక్తి ఉద్యమ కాలంలో విష్ణు భక్తితో ఎన్నో పాశురాలు రచించారు ఆళ్వారులు. వీరు మూడో శతాబ్ది నుండి తొమ్మిదో శతాబ్ది దాకా కనిపిస్తున్నా, ఎక్కువమంది భక్తి ఉద్యమ కాలమైన 7-9 శతాబ్దులకు చెందినవారు. విశిష్టాద్వైత మతానికి ఆళ్వారులు, ఆచార్యులు మూలస్తంభాలు. ఆళ్వారుల భక్తి గీతాలు, ఆచార్యుల సిద్ధాంత గ్రంథాలు విశిష్టాద్వైతానికి జీవనాడులు. ఆళ్వారులు విష్ణు భక్తులు. విష్ణువును మాత్రమే కీర్తించినవారు. భగవంతుని కల్యాణగుణానుభవాన్నే నిరంతరం గానం చేసినవారు.

"యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీ మదూర్జితమేవవా।

త త్తదే వావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్॥" (భగవద్గీత:10:41) 'ఐశ్వర్య యుక్తమైన, కాంతి యుక్తమైన మరియు శక్తి యుక్తమైన వస్తువులు తన తేజస్సు యొక్క అంశలే' అని గీతాచార్యుడు చెప్పినట్లుగా విష్ణుమూర్తి అంశలైన ఆయన వస్తు వాహన సంచయమే వైష్ణవ వ్యాప్తి కోసం ఆళ్వార్లుగా జన్మించాయని వైష్ణవుల నమ్మకం. ఈ ఆళ్వార్లు పన్నెండుగురు. వారు–

1. పొయ్ గై ఆళ్వారు 2. భూతత్తాళ్వారు 3. పేయాళ్వారు 4. తిరుమళిశై ఆళ్వారు 5. తిరుప్పాణాళ్వారు 6. తొండరడిప్పొడి ఆళ్వారు 7. తిరుమంగై ఆళ్వారు 8. కులశేఖరాళ్వారు 9. పెరియాళ్వారు 10. ఆండాళ్ 11. నమ్మాళ్వారు 12. మధురకవి

ఆళ్వార్ల రచనలలో సమకాలీన అంశాల ప్రస్తావనను బట్టి వారు సుమారుగా 3–9 శతాబ్దుల మధ్యవారని పరిశోధకులు తేల్చారు (Early History of Vaishnavism:1920:89). వీరిలో అన్ని వర్ణాల వారూ ఉన్నారు. వీరి నాలుగువేల పాశురాల సంకలనాన్ని *నాలాయిర దివ్య ప్రబంధ*మని అంటారు. ఈ నాలాయిర దివ్య ప్రబంధాన్ని ద్రావిడ వేదంగా ప్రస్తుతిస్తారు. ఈ నాలాయిర దివ్య ప్రబంధ గేయాలు అనంతర కాలంలో వైష్ణవుల నిత్య పారాయణలో భాగమయ్యాయి. శ్రీవైష్ణవానికి సైద్ధాంతిక భూమికను ఇచ్చాయి. వీటి ఆదారంగానే యామునాచార్యుడు, రామానుజుడు మొదలగు ఆచార్యులు శ్రీవైష్ణవ సిద్ధాంతాలను ఏర్పరిచారు.

ఆళ్వార్లు ప్రబోధించిన విష్ణు భక్తికి శాస్త్రీయతను జోడించి, శ్రీవైష్ణవానికి మతంగా ప్రాచుర్యం కల్పించారు ఆచార్యులు. నాథమునులు, ఆళ్వార్ల నాలాయిర దివ్య ప్రబంధ గేయాలను సంకలన పరిచి, శ్రీవైష్ణవులకు నిత్య పారాయణ గ్రంథాలను అందించారు. శ్రీవైష్ణవ సిద్ధాంతాలకు తొలి రూపం కల్పించినది యామునాచార్యుడు. శ్రీరంగంలో విశిష్టాద్వైతమతాన్ని స్థాపించిన యామునాచార్యుడు ఎంతోమంది ఉద్ధండులైన శిష్యులను తయారుచేశాడు. రామానుజాచార్యుడిని తన తరువాతి ఆచార్యుడిగా నియమించాడు. విశిష్టాద్వైత మత ప్రచారంలో రామానుజాచార్యులు కృషి నిరుపమానం. ప్రస్థానత్రయమైన బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులకు విశిష్టాద్వైత తత్త్వానుసారంగా శ్రీభాష్యం రచించడమే కాక, కులమత రహితంగా శ్రీవైష్ణవాన్ని అభివృద్ధి చెందించిన ఘనత రామానుజునిదే.

ఈ విధంగా తొలుత ఆళ్వారులు, పిదప ఆచార్యులు కలిసి విశిష్టాద్వైతానికి బలమైన సైద్ధాంతిక, భూమికను అందించారు. ఈ పునాదులపై వేదాంతదేశికులు, పిళ్ళై లోకాచార్యులు మొదలైన ఎందరో గురువులు శ్రీవైష్ణవాన్ని ముందుకు తీసుకువెళ్ళారు. వేదాంతదేశికుని ప్రశిష్యులైన శ్రీనివాసాచార్యులు, శఠగోపయతి అన్న పేరుతో అన్నమయ్యకు విశిష్టాద్వైతంలో గురువై, విశిష్టాద్వైత వేదాంతాలను బోధించారు. ఆ విశిష్టాద్వైత సిద్ధాంతాల ప్రభావంతోనే అన్నమయ్య కొన్ని వేల కీర్తనలను రచించాడు. విశిష్టాద్వైత తత్త్వ నిరూపణకు అన్నమయ్య రచించిన ప్రతి సంకీర్తనా ఒక గీటు రాయిగా నిలుస్తుంది.

## ఉపయుక్తగ్రంథసూచి

### తెలుగు:


1. ఆనందమూర్తి, వేటూరి. 1986. *వైష్ణవాంధ్ర వాఙ్మయం.* హైదరాబాదు: ప్రభాకర ప్రచురణము.
2. తిరువేంగళనాథుడు, తాళ్ళపాక. 2001. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

3. రాఘవయ్య, తిరువాయిపాటి. 2016. *శ్రీ రామానుజ దివ్య వైభవం*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
4. రాధాకృష్ణశర్మ, చల్లా. 1976. *తమిళ సాహిత్య చరిత్ర*. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
5. రంగనాథాచార్యులు, కె.కె. 1981. *తెలుగు సాహిత్యం – మరో చూపు*. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
6. లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990. *శ్రీభగవద్గీత* (తాత్పర్యముతో). రాజమండ్రి: గొల్లపూడి వీరాస్వామి సన్.
7. శ్రీరామచంద్రుడు, పుల్లెల, ఇతరులు. 2011. *ఉపనిషత్ సుధాలహరి*. హైదరాబాదు: యువభారతి.


## English:


1. Bhandarkar, R.G. 1913. *Vaisnavism, Saivism and minor religious systems*. Strassburg :Karl J. Trübner.
2. Eliot, Charles. 1957. *Hinduism and Buddhism*. London: Routledge & Kegan Paul Ltd.
3. Goyal.S.R. 1984. *A Religious History of Ancient India (upto c.1200 A.D.)*. Meerut: Kusumanjali Prakashan.
4. Jagadeesan, N. 1989. *Collected papers on Tamil Vaishnavism*. Madhurai: Ennes Publications.
5. Krishnaswami, Aiyangar. 1920. *Early History of Vaishnavism in South India*. Madras: The Oxford University Press.
6. Monier Williams. 1883. *Religious Thought and Life in India – Vedism, Brahmanism and Hinduism*. London: Oxford.
7. Nilakanta Sastri, K.A.. 1961. *A History of South India : from prehistoric times to the Fall of Vijayanagar*. Madras: Oxford University Press.
8. Ramaswami Ayyangar, M.S. and B Seshagiri Rao. 1922. *Studies in South Indian Jainism*. Madras: Premier Press.
9. Rapson, E.J. 1916. *Ancient India: From the earliest times to the first century A.D*. London: Cambridge University Press.
10. Sadarangani, Neeti M. 2004. *Bhakti Poetry in Medieval India: Its Inception, Cultural Encounter and Impact*. New Delhi: Sarup & Sons.


## Thesis


1. Lakshmi, A, 1994. *Bhakti movement and temple development in tamil country from 6th century A D to 10th century A D.* University of Madras.


## WWW:


1. http://www.andhrabharati.com/
2. http://ebooks.tirumala.org/

3. https://archive.org/details/digitallibraryindia
4. http://www.patheos.com/
5. http://www.ancient.eu/
6. https://te.wikipedia.org/wiki/
7. http://shodhganga.inflibnet.ac.in/

*****

================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 19:4 April 2019
India's Higher Education Authority UGC Approved List of Journals Serial Number 49042
================================================================

# The Eleven Forms of Devotion Proposed by Annamayya

**Dr. Pammi Pavan Kumar**
**Associate Professor**
**pavankpammi@gmail.com**

**Ms. Harita Bhatlapenumurthy**
**Ph. D. Research Scholar**
**harita256@gmail.com**

**Department of Telugu**
**University of Hyderabad**
**Hyderabad-500046**
**Telangana, India**

================================================================

**Abstract**

Annamayya is a 15th century devotional poet. He embraced Visishtadvaita at a very young age and sang thousands of songs in praise of Lord Vishnu and his various incarnations. He used, not the scholarly tongue but the language of villagers, in his songs. He chose the form/genre of literature, ***keertanas***/songs, that was existent only among the masses until then, and gave it a cult status. Annamayya has to be counted among those poets of Bhakti Movement, who despised caste discriminations and superstitions. He professed true love and devotion for God. In this paper, the eleven forms of devotion proposed by Annamayya are outlined; examples for these forms of devotion were picked from Annamayya's ***keertanas*** and are discussed.

**Keywords:** Annamayya, ***keertana,*** Vishnu worship, Bhakti movement, forms of devotion, resistance to superstition, resistance to caste discrimination.

==================================================================

# అన్నమయ్య కీర్తనలలో ఏకాదశ భక్తి మార్గాలు

## annamayya kīrtanalalō ēkādaśa bhakti mārgālu

Dr. Pammi Pavan Kumar, Associate Professor,
pavankpammi@gmail.com
Ms. Harita Bhatlapenumurthy, Ph. D. Research Scholar
harita256@gmail.com
Department of Telugu, University of Hyderabad, Hyderabd – 500046, TS, India

==================================================================

**సంక్షిప్తి:**

అన్నమయ్య 15వ శతాబ్దపు భక్తకవి, సిసలైన ప్రజాకవి. ప్రజల కోసం, ప్రజల భాషలో, ప్రజాహితమైన గేయ ఛందస్సులో సాహిత్య సృజన చేసి, విశిష్టాద్వైత తత్త్వాన్ని జోడించి సంఘ సంస్కరణ భావాలను వెలిబుచ్చాడు. ప్రజలను భక్తిమార్గంలోకి మళ్ళించే ప్రయత్నం చేశాడు. తన ఇష్టదైవమైన శ్రీవేంకటేశ్వరుని తలుస్తూ, వేల సంకీర్తనలను రచించాడు. అందులో భక్తి, వేదాంత, శృంగార రస సంబంధ కీర్తనలు ఉన్నాయి. అన్నమయ్య భక్తిని, అతడు ప్రతిపాదించిన భక్తి మార్గాలను ఈ పత్రం రేఖామాత్రంగా చర్చిస్తుంది.

ఈ పత్రంలో మొదటగా నారద మహర్షి, శంకరాచార్యులు మొదలైన వారిచ్చిన భక్తి నిర్వచనాలను ఉటంకించి, వేదవ్యాసుడు, నారదుడు, రూపగోస్వామి, వివేకానందుడు... మొదలైనవారు చేసిన భక్తి విభాగాలను చర్చించడం జరిగింది. ఆ తరువాత, అన్నమయ్య ప్రతిపాదించిన ఏకాదశ భక్తి మార్గాలను చర్చించి, వాటికి అన్నమయ్య కీర్తనల నుంచి లక్ష్యాలను చూపించే ప్రయత్నం చేయబడింది.

### పరిచయం

అనాదిగా 'భక్తి' మానవ జీవితంలో భాగమై ఉంది. భక్తి నిర్వచనం, భక్తి ప్రదర్శనం ఒక్కో కాలంలో ఒక్కోలా ఉంటూ వచ్చినా, 'భక్తి' మౌలిక స్వరూపం మాత్రం ఒకటిగానే ఉంది. "*సా తస్మిన్ పరమప్రేమ రూపా*" అంటే– 'భగవంతుడి పట్ల ఉత్కృష్టమైన ప్రేమ రూపమే భక్తి' అన్నారు నారదమహర్షి. (*నారద భక్తి దర్శనం* [1985:9]). ఆదిశంకరులు "*స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభి ధీయతే*" అంటూ మానవుడు తన స్వరూపాన్ని తెలుసుకొని, దానితో మమేకం చెందడమే భక్తి అన్నారు (*వివేకచూడామణి* [2017:21]). "ఇతరాభిలాషలు లేనట్టిదియు, జ్ఞానకర్మాదులచే ఆవరింపబడనిదియు, అనుకూలముగ కృష్ణానుశీలనము చేయునట్టిదియు నగు భక్తి ఉత్తమమైన" దని *శ్రీ శ్రీ భక్తి రసామృత సింధువు* చెబుతోంది (*శ్రీ శ్రీ భక్తి రసామృత*

*సింధువు* [1985:3]). "భగవంతుడి గురించి నిజమైన నిష్కంళంకమైన అన్వేషణయే భక్తియోగ"మని వివేకానందులు చెప్పారు (*భక్తియోగం* [2015:1]). ఇలా భక్తి అనేకరూపాల్లో, అనేక విధాలుగా ప్రవర్తిల్లుతూ వచ్చింది. ఎవరికి తోచిన రీతిలో వారు, భగవంతుడి పట్ల భక్తి భావాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు.

*శ్రీమద్భాగవతం*– 1) శ్రవణం 2) కీర్తనం 3) స్మరణం 4) పాదసేవనం 5) అర్చనం 6) వందనం 7) దాస్యం 8) సఖ్యం 9) ఆత్మనివేదనం అంటూ నవవిధ భక్తిమార్గాలను ప్రతిపాదించింది. భక్తి ఒక్కటే అయినప్పటికీ, అది పదకొండు విధాలుగా ఉంటుందని నారదుడు ప్రతిపాదించారు. అవి 1) గుణమాహాత్మ్యాసక్తి 2) రూపాసక్తి 3) పూజాసక్తి 4) స్మరణాసక్తి 5) దాస్యాసక్తి 6) సఖ్యాసక్తి 7) వాత్సల్యాసక్తి 8) శాంతాసక్తి 9) ఆత్మనివేదనాసక్తి 10) తన్మయాసక్తి 11) పరమవిరహాసక్తి అంటూ నారదుడు భక్తిమార్గాలను విభజించారు.

భక్తిని రసంగా ప్రతిపాదించిన రూపగోస్వామి, సాధన, భావ, ప్రేమ భక్తులని భక్తిని త్రివిధాలుగా విభజించారు. ఆధునికుడైన వివేకానందుడు తన భక్తియోగంలో పంచవిధ భక్తి మార్గాలను చూపించాడు. అవి 1) శాంతభక్తి 2) దాస్యభక్తి 3) సఖ్యభక్తి 4) వాత్సల్యభక్తి 5) మాధుర్యభక్తి. ఒక్కొక్కరి దర్శనం, భక్తి నిర్వచనం ఒక్కోలా ఉంటుంది. అన్నమయ్య కూడా తన కీర్తనలలో తనవైన భక్తిమార్గాలను ప్రతిపాదించాడు. వాటికి లక్షణాలను నిర్వచించాడు. వాటికి లక్ష్యాలుగా తన కీర్తనలనే ఉదహరించాడు. అన్నమయ్య ప్రతిపాదించిన భక్తి మార్గాలను చూపించి, అందుకు ఉదాహరణలుగా అతడి కీర్తనలనే గుర్తించి, చర్చించడం ఈ పత్ర ప్రధానోద్దేశం.

నానాభక్తులివి నరుల మార్గములు
యే నెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి
హరిఁకిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి
అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతని దాసుల సేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి

అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి (2-469)

మానవులు అవలంబించే భక్తి మార్గాలు అనేకం ఉన్నాయని, ఏ భక్తి మార్గమైనా భగవంతుడు అంగీకరిస్తాడని చెబుతూ, అన్నమయ్య ఏకాదశ భక్తి మార్గాలను ప్రతిపాదించాడు. అవి 1. ఉన్మాద భక్తి 2. పతివ్రతా భక్తి 3. విజ్ఞాన భక్తి 4. ఆనంద భక్తి 5. రాక్షస భక్తి 6. తురీయ భక్తి 7.తామస భక్తి 8. వైరాగ్య భక్తి 9. రాజస భక్తి 10. నిర్మల భక్తి 11. నిజ భక్తి. వీటిని కింది ఉపవిభాగాల్లో వివరించడం జరిగింది.

1. **ఉన్మాద భక్తి** : '*హరిఁకీఁగా వాదించు టది ఉన్మాదభక్తి*' – హరి మాత్రమే దేవుడు అని వాదించటమే ఉన్మాద భక్తి. 'మతవిషయమైన తీంద్రను – దూకుడును ఉన్మాదభక్తి అనవచ్చ'ని వేటూరి ఆనందమూర్తిగారు పేర్కొన్నారు (*తాళ్లపాక కవుల పదకవితలు భాషాప్రయోగ విశేషాలు* [1976:175]). మత విషయమైన తీంద్ర పలురూపాల్లో ఉంటుంది. అందులో అన్యదైవ తృణీకరణం – తన ఇష్టదైవం అందరికంటే గొప్పవాడని, పరదైవాలు తమ దైవం ముందు తక్కువ వారని నిరసించడం ఒకటి. ఈ విధమైన ఉన్మాద భక్తి ఎక్కువగా తెలుగు సాహిత్యంలో శివకవులలో దర్శనమిచ్చింది. విశిష్టాద్వైత మతానికి పట్టుకొమ్మలైన ఆళ్వారులలో కూడా (తిరుమంగై ఆళ్వారు మొ॥) హరికీర్తనంతో పాటుగా, అన్యదైవనిరసన ఉండేది.

విశిష్టాద్వైత సిద్ధాంతాలకు ఊపిరి పోసి, రామానుజుడికి మార్గనిర్దేశం చేసిన యామునాచార్యులు కూడా *స్తోత్రరత్నలో* ఈ విధంగా అన్నారు.

బ్రహ్మ శివశ్శతమఖః పరమస్వరాడి –
త్యేతేఽపి యస్య మహిమార్ణవవిప్రుషస్తే (*స్తోత్ర రత్న*–11)
కస్య పాదోదకేన స శివస్స్వశిరోధృతేన (*స్తోత్ర రత్న*–13)

'బ్రహ్మ, రుద్ర, ఇంద్రాదులు కూడా నీ మహిమార్ణవంలో నీటి బిందువులు మాత్రమే. నీ పాదోదకమైన గంగా జలాలను శివుని శిరస్సుపై నిలపడం ద్వారా శివుడిని శివుడిగా(– శుభకరుడిగా) చేశావు.' ఇటువంటి మతావేశం విశిష్టాద్వైత ప్రవర్తకుడైన రామానుజాచార్యుల వంటి వారిలో కనపడకపోయినా, కాలానుగుణంగా

ఆ మతానుయాయులలో అక్కడక్కడా దర్శనమిస్తూ వచ్చింది. అన్నమయ్య చాలా వరకు సాత్త్వికుడిగానే కనిపించినా, అక్కడక్కడ ఉన్మాద భక్తి తత్త్వం అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తుంది.

నరహరి యజాండనాయకుడు
సురలితనినే సంస్తుతించిరి
పురుషోత్తముఁ డిదె భూమికి – యీ
హరిఁ గొలువనివా రసురలు సుండీ (4-210)

పై కీర్తనలో నరహరి బ్రహ్మాండనాయకుడు, దేవతలంతా అతనినే స్తుతించారు అన్నంత వరకు ఇబ్బందిలేదు, ఆ పై, పురుషోత్తముడైన హరిని కొలవనివారు రాక్షసులే సుమా అనడం ఉన్మాద భక్తే అనిపించుకుంటుంది.

కరివరదుని పేరుగలసిన తిట్లతో
పరదేవతల మంత్రపఠనలు సరియా (2-405) అలాగే, ఈ కీర్తనలో హరిని తిట్టిన తిట్లు కూడా పరదేవతల మంత్రాల కంటే గొప్పవే అనడం కూడా ఇటువంటిదే.

2. **పతివ్రతా భక్తి**: '*పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి*' –పరులను కొలవకుండా శ్రీమహావిష్ణు అవతార రూపాలను మాత్రమే కొలవటమే పతివ్రతా భక్తి. అద్వైతులు ఏ దైవమైనా ఒకటేనంటూ భావిస్తారు, పూజిస్తారు. విశిష్టాద్వైతులు విష్ణు రూపాన్ని, విష్ణు అవతారాలను మాత్రమే కీర్తిస్తారు. ఏ విధంగా పతివ్రత పతిని మాత్రమే దైవంగా భావించి పూజిస్తుందో, పతివ్రతా భక్తులు తమ ఇష్టదైవాన్ని మాత్రమే పూజిస్తారు, ఇతర దేవతలను పూజించరు. విశిష్టాద్వైతులంతా సహజంగా విష్ణువారాధన మాత్రమే చేస్తారు. తొండరడిప్పొడి ఆళ్వారు అయితే శ్రీరంగనాథుడినే తప్ప ఇతర విష్ణువవతారాలను కూడా కీర్తించలేదు. "నిన్నేకాని యితరుల నేఁ గొలువనొల్ల నంటి(2-177)" అనే భావనే పతివ్రతా భక్తి. అన్నమయ్య కూడా ఇటువంటి పతివ్రతా భక్తి భావనను ఎన్నో కీర్తనల్లో ప్రదర్శించాడు.
యిరవైన శ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము
పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు(2-145)

పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము(4-87)

3. **<u>విజ్ఞాన భక్తి</u>** : *'అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి'* – పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోవటమే విజ్ఞాన భక్తి. కులమతభేదాలను, మూఢభక్తిని నిరసించి జ్ఞానాన్ని ప్రవచించటం విజ్ఞాన భక్తి మార్గంగా చెప్పుకోవాలి. విశిష్టాద్వైత మతాచార్యుడైన రామానుజుడు గొప్ప సంఘ సంస్కర్త. వెయ్యేళ్ళ క్రితమే దళితులకు ఆలయప్రవేశం చేయించాడు. మానవులంతా సమానమే నంటూ ఘోషించాడు. అన్నమయ్య కూడా రామానుజుని దారిలోనే సంఘ సంస్కరణ భావాలను తన కీర్తనల ద్వారా వెదజల్లాడు. అసలు అన్నమయ్య కీర్తన మార్గాన్ని ఎంచుకోవడం వెనుక ఉన్న ఉద్దేశం ప్రజలను భక్తి మార్గంలోకి మళ్ళించటం, వారిలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించటం. తదనుగుణంగా, అన్నమయ్య అనేక కీర్తనలలో విజ్ఞాన భక్తిని ప్రదర్శించాడు.

యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును
వొక్కట నంతర్యామై వున్నాఁడదె (3-252) తీర్థయాత్రలంటూ ఇల్లు, వాకిలి, సంసారాలను వదులుకుని ఊరూరా తిరగవలసిన పని లేదు, భగవంతుడు అంతర్యామిగా ప్రతీ ఒక్కరిలోనూ ఉన్నాడు, అతడిని దర్శించమంటున్నాడు అన్నమయ్య.
ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన
నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు(1-318)

కందువగు హీనాధికములిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ (2-385)

కులమతభేదాలను నిరసిస్తూ, ఏ కులస్థుడైనా తత్త్వం తెలుసుకున్న వాడే గొప్పవాడంటూ, ఎక్కువ తక్కువలు లేవని, అందరిలోనూ వెలుగుతున్న వాడు శ్రీహరేనని ప్రబోధించాడు. కింది కీర్తనలో అన్నిటా పరమాత్మను దర్శించే జ్ఞానాన్ని పంచిపెట్టాడు అన్నమయ్య.

నిలిచిన రూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు
మెలఁగేటి చైతన్యము మిమ్ముగాఁ దలఁతు
యిలలోని ధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు
సకల పంచభూతా లుపకరణాలుగాఁ దలఁతు(2-324)

4. **ఆనంద భక్తి:** '*అరమరచి చొక్కుటే ఆనందభక్తి*' - భక్తి పారవశ్యంలో ఆదమరచి ఉండటం ఆనందభక్తి. రసంగా భక్తిని పరిగణిస్తే రసానందాన్ని, పరానికి త్రోవగా భావిస్తే, పరమానందాన్ని ఇవ్వగలిగేది భక్తి మాత్రమే.

ఈ కింది కీర్తనలో భక్తి ద్వారా అన్నమయ్య అటువంటి ఆనంద పారవశ్యాన్ని పొందడాన్ని గమనించవచ్చు. తన సకల అవయవాల ద్వారా భగవంతుడి గుణగణాలను అనుభవిస్తూ తన్మయత్వం చెందాడు అన్నమయ్య.

సదానందము సర్వేశ్వర నీ-
పదారవిందముపై భక్తి

నయనానందము నరులకు సురులకు
జయమగు హరి నీసాకారము
నయమగు శ్రవణానందము వినినను
క్రియగలిగిన నీకీర్తనము

చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁ గొను నీప్రసాదము
నలుగడ దేహానందము బుధులకు
బలు నీపాదప్రణామమములు

ధరఁ బరమానందము నీదాస్యము

గరిమల శ్రీవేంకటవిభుఁడా

నరహరి నిత్యానందము నిను( దగ–

నరవిరిఁ జేయు సమారాధనము (2–369)

5. **రాక్షస భక్తి:** '*అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి*' – సాహసాలతో కూడిన పూజలు రాక్షస భక్తి. అన్నమయ్య రాక్షస భక్తిని నిరసించాడు. అటువంటి భక్తిని ఆచరించవద్దని ప్రబోధించాడు.

మొక్కరో మీరు మోసపోక – మీకు

దిక్కు దెసైన ఆదిదేవునికి

మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు

బీరాన గుండెలు గోసి పెట్టవద్దు

గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు

ఊరకే మీవారమని వున్నఁ జాలు

సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు (4–593) శరీరంలో అవయవాలను కోసి, నిప్పులో వేయటం, నిప్పుల్లో నడవడం, బలులివ్వడం వంటి రాక్షసకృత్యాలను చేయవలసిన పని లేదు. అటువంటి మాటలు చెప్పేవారిని విని మోసపోరాదు. దైవానికి నమస్కరించి, 'నీ వాడ'నని అంటే చాలని అన్నమయ్య ప్రబోధించాడు.

6. **తురీయ భక్తి**: '*అతని దాసుల సేవే అదియే తురీయభక్తి*' – భాగవతులను సేవించటం తురీయ భక్తి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భాగవతుడికి కూడా భగవంతుడికున్న స్థానమే ఉంది. కులశేఖరాళ్వారు, తొండరడిప్పొడి ఆళ్వారు మొదలైన వారు భాగవత భక్తిని ప్రవచించారు. కులశేఖరాళ్వారు *ముకుందమాల* లో– త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య, భృత్య ఇతి మాం స్మర లోకనాథ! (*ముకుందమాల స్తోత్రం* 23) "ఓ స్వామీ! నీ సేవకులకు సేవకులు, వారికి సేవకులు అంటూ సాగే సేవకుల పరంపరలో నన్ను చివరి సేవకుణ్ణిగా భావించుము" ఇదే భావన అన్నమయ్య కూడా వ్యక్తం చేశాడు.

కందువ శ్రీవేంకటేశ కడు నీ బంటుబంటుకు సందడిబంట నవుటే చాలదా నాకు (3–23)

“జడియు శ్రీవేంకటేశ్వరుదాసుఁ డాయనా బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు(2-452)” అని అన్నమయ్య భగవద్దాసులను భగవంతుడిగానే భావించే సేవాభావాన్ని కనపరిచాడు. ప్రత్యేకించి అన్నమయ్య అనేక కీర్తనలలో భాగవతోత్తములైన హనుమంతుని, ప్రహ్లాదుని, అంబరీషుని, ధ్రువుని కీర్తించాడు. “మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు (3-301)”

కిట్టి నారదాదులు నీకింకరులై వుండఁగాను
యిట్టె నీదాసుఁడ ననుటెంత కెంత
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు
పట్టి నీదాసుల బంటుబంట నయ్యేనిఁకను(3-51) “పరమాత్మకు నేరుగా సేవ చేసే భాగ్యాన్ని నారదాదుల వంటి భక్తులు సంపాదించారు, ఆ భాగ్యం మాకు లేకపోయింది. అయినా మాకూ ఓ ఉపాయం ఉంది. నీ దాసుల బంటులకు బంటై సేవిస్తాను” అంటూ అన్నమయ్య తన తురీయ భక్తిని చాటుకున్నాడు.

7. **తామస భక్తి**: *‘క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి’* – భౌతికమైన ప్రయోజనాన్ని ఆశించి పూజించటం తామస భక్తి. భాగవతంలో ప్రజల సంకల్పాలను బట్టి భక్తి త్రివిధంగా ఉంటుందని పేర్కొంటూ, తామస, రాజస, సాత్త్విక భేదాలు వివరించబడ్డాయి. పరహింస, అసూయ, రోషం మొదలైన తామస గుణాలను కలిగి పూజించే వాడిది తామస భక్తి అని భాగవతం చెబుతోంది. అయితే అన్నమయ్య తామస భక్తి నిర్వచనం వేరొక విధంగా ఉంది. సకల కర్మలను భగవదర్పితంగా చేస్తూ, ప్రతిఫలాపేక్షరహితంగా పూజించటమే అసలైన భక్తయితే, ఏదో ప్రయోజనం ఆశించే భక్తినే అన్నమయ్య తామస భక్తి అంటున్నాడు.

నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నా శత్రుల సంహరించవే(4-454) ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిని తన శత్రువులను సంహరించమని కోరడం కనపడుతుంది.

నగధర మీపై భక్తి సేయఁగ మనంబున వొడఁబడను
పగటున మీరిచ్చు వరములకొరకే పలుమారు మీకు మొక్కుకొందును(2-293) ఈ కీర్తనలో అన్నమయ్య భగవంతుడిచ్చే వరముల కోసమే మళ్ళీ మళ్ళీ మొక్కుకునే తన అయోగ్యతను చెప్పుకుంటున్నాడు. ఎంతటి గొప్ప భక్తులకైన ఒక్కోసారి తామస ప్రవృత్తి కమ్మివేస్తుంది. అంతమాత్రాన వారి భక్తిని తక్కువ చేయనవసరం లేదు.

8. **వైరాగ్య భక్తి**: '*అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి*' – పరమాత్ముడే గతి అని భౌతికమైన వాటిని త్యజించటం లేదా భౌతిక జగత్తు పట్ల విముఖతను వ్యక్తపరచటం వైరాగ్య భక్తి. ఇది భారతీయ సంస్కృతిలో ఉన్న చతురాశ్రమాలలో వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలను స్ఫురణకు తెస్తుంది. భౌతికమైన సంసార సుఖాలను పట్ల అయిష్టత కలిగినప్పుడు, భగవంతుడి పట్ల కేంద్రీకృతమైన ధ్యానం కలుగుతుంది. కనుక విరక్తి/వైరాగ్యం భగవన్ముఖంగా చేసే ప్రయాణంలో అవసరమని వేదాంతులు చెబుతారు.

ఇతర చింత లిఁక నేమిటికి
అతఁడే గతియై అరసేటివాఁడు
అతిదుఃఖకరము లాసలు
సతత సుఖకరము సమవిరతి
గతి యలమేల్మంగతో శ్రీవేంకట
పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు (3-22)

కోరికలే దుఃఖ కారణాలని బౌద్ధ సాహిత్యం దగ్గర నుండి, భగవద్గీత వరకు బోధించాయి. అన్నమయ్య కూడా ఆశలు దుఃఖాన్ని కలిగిస్తాయని, ఎల్లప్పుడూ సుఃఖాన్ని కలిగించేది తగుపాళ్లలో ఉన్న విరక్తి మాత్రమేనని, ఇతర ఆలోచనలు మానుకుని శ్రీవేంకటేశ్వరుడే గతి అని భావిస్తే, అతడే బాగోగులు చూసుకోగలడని వైరాగ్య భక్తిని ఈ కీర్తనలో ప్రదర్శించాడు. మరో కీర్తనలో అన్నమయ్య, "విరక్తే లాభదాయకం, సౌఖ్యదాయకం, విజ్ఞానదాయకం. విరక్తి వలననే వెనుకటివారు

గొప్పవారయ్యారు. విరక్తి కలుగకుంటే జన్మబంధాలనుండీ విముక్తులు కాలేరు" అంటూ వైరాగ్యభక్తిని ప్రవచించాడు.

విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వెనకవారెల్ల
విరతిఁబొందకున్న వీడదు భవము(4-369 )

9. **రాజస భక్తి**: '*అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి*' – తన స్వతంత్రతని, అహంకారాన్నీ ప్రకటించుకోవటం రాజస భక్తి. అన్నమయ్య సాటి భాగవతులకు కూడా దాసోహమనే అచ్చమైన విశిష్టాద్వైతుడు. కనుక అన్నమయ్యలో తానే గొప్పవాడనన్న అహంకారం కనిపించదు. అయితే తన పూర్వాశ్రమంలోని ఈ వైఖరిని ఒక కీర్తనలో ప్రదర్శించాడు. ఇది రాజస భక్తికి ఉదాహరణ.

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడ నేరుతునంటా మరి నే నహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను
గాఁటాన దొరనంటా గర్వింతు నేను
నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు
మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును (2-304) "పదునాలుగు లోకాలను ఏలే దొరవు నీవైతే, గొప్పగా దొరను నేను అని చెప్పుకుంటాను. ఈ జగత్తులో ప్రజలంతా నీ సృష్టే కాగా, బిడ్డలను నేను కన్నాను అని సంతోషిస్తాను. సమస్త భోగభాగ్యాలను నువ్వే ఇస్తే, నేను

సంపాదించుకున్నాను అని గర్విస్తాను. ఇహపరాలు నీ దయాధర్మమే అయితే, నా తపోబలమనుకుంటాను" తన రాజస వైఖరిని నిందించుకున్నాడు.

నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది
పూని నా వల్లనే కీర్తిఁ బొందేవు నీవు
.....
నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు
శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు(3-48) అలాగే, పై కీర్తన కూడా అన్నమయ్య రాజసభక్తికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

10. **నిర్మల భక్తి**: *'నెట్టన శరణనుటే నిర్మలభక్తి'* – ఇతర ఉపాయములను విసర్జించి శరణని వేడుకొనటమే నిర్మల భక్తి. నిర్మల భక్తి విశిష్టాద్వైతంలో ప్రపత్తి సిద్ధాంతానికి దగ్గరగా ఉంది.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః (*భగవద్గీత* 18–66) *భగవద్గీతలో* శ్రీకృష్ణభగవానుడు స్వయంగా "అన్ని ధర్మాలను విడిచి, నన్నే శరణు వేడుము. సర్వపాపాలనుండి నిన్ను ఉద్ధరిస్తాను" అని వాగ్దానం చేశాడు. ఇది విశిష్టాద్వైతులకు చరమశ్లోకంగా, మోక్షోపాయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి
యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము(4-230) "ఏ ధర్మాలు ఎరుగను. నిన్నే శరణంటున్నాను, ఇక నీ చిత్తం" అంటున్న అన్నమయ్య చరమ శ్లోకార్థానికి అనుగుణంగా తన నిర్మలభక్తిని ప్రతిపాదించాడనిపిస్తుంది.

హరి నిను నెరఁగని యలమటలింతే శాయ
శరణంటి నిదె నీకే సర్వేశ కావవే
వెదకితి భూములెల్ల విశ్వకర్తెవ్వడో యంటా

చదివితిఁ బుస్తకాలు సారెసారెకు

తుద ననుమానమున దొమ్మి నీకలు దెల్లఁగా

ముదిసితి నింతేకాని ముందరేమీఁ గానను

చింతలెల్ల నుడిగితి శ్రీవేంకటేశ్వర నిన్ను

వింత లేక శరణని వెలసితిని

చెంతల నిన్నాళ్లదాఁకా చిక్కి కర్మముల వట్టి

గంతులు వేసితిఁగాని కడ గాననైతిని (3-172)    ఈ కీర్తనలో జ్ఞాన, కర్మ మార్గాల అంతు చూసినా వెంట్రుకలు తెల్లబడ్డాయే కాని అనుమానం తీరలేదని, ఇక ఆలోచనలన్నీ కట్టిపెట్టి శ్రీవేంకటేశ్వరుడే శరణంటూ ప్రపత్తి మార్గం పట్టానని అన్నమయ్య నిర్మలభక్తిని ప్రదర్శించాడు.

11. **నిజ భక్తి**: *'గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి'* – సంశయాలు, సంకోచాలు విడిచి వేంకటేశ్వరుని సేవ చేయటమే నిజ భక్తి.   భక్తిలో మొదటి దశగా భక్తుడు తన కష్టాలు తొలగాలని, కోరికలు తీరాలని భగవంతుడిని ప్రార్థిస్తాడు. దీనినే అన్నమయ్య తామస భక్తి అన్నాడు. తన కష్టాలు, కోరికలు తీరకపోతే, గజేంద్రుడిలా "కలదు కలండనెడువాడు కలడో లేడో" అనే సంశయాత్మకత ఉంటుంది. అలాగే, తాను ప్రార్థిస్తున్నది అసలైన పరమాత్ముడో కాదో, తాను సరైన దారిలో వెళుతున్నానో లేదో అనే సందేహం కూడా ఉంటుంది.   అన్నమయ్య కూడా ఒక దశలో ఇటువంటి సందేహాలకు లోనయ్యాడు.

అందరికి నితఁడెపో అంతరాత్ముఁడనుచు-

నందు రితఁడో మఱియు నవల నొకఁడో

నందకధరుఁడు జగన్నాథుఁడచ్చుఁతుడు గో-

విందుఁ డితఁడుగాక వేరొకఁడు గలఁడో(1-37)    ఆ పై, సాధనతో, భక్తునిలో సంశయాలకు, సందేహాలకు తావివ్వని భక్తి స్వరూపం ఆవిష్కారమౌతుంది. అటువంటి నిజభక్తి ఈ కింది కీర్తనలో చూడవచ్చు.

నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని

వున్నవాఁడ నిఁక వేరే ఉపాయ మేమిటికి

గతియై రక్షింతువో కాక రక్షించవోయని

మతిలోని సంశయము మఱి విడిచి

యితరులచే ముందర నిఁక నెట్టౌదునోయని

వెతతోడఁ దలఁచేటి వెఱపెల్లా విడిచి

తిరమైన నీమహిమ తెలిసేవాఁడననే–

గరువముతోడి వుద్యోగము విడిచి

వెరవున నీరూపు వెదకి కానలేననే–

గరిమ నలపు నాస్తికత్వమును విడిచి (2–202) ఈ కీర్తనలో అన్నమయ్య భగవంతునిపట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు.

నిజభక్తి అలవడాలంటే ఏ ఏ వాటిని విడిచిపెట్టాలో అన్నమయ్య ఈ కీర్తనలో చెబుతున్నాడు. 1. భగవంతుడు రక్షిస్తాడో, రక్షించడో అనే అనుమానాన్ని 2. తన ఆగామి కర్మలు ఎలా ఉంటాయో నన్న భయాలను 3. భగవంతుడి మహిమ తెలిసినవాడిననే అహంకార భావాన్ని 4. వెదికినా, పరమాత్ముడు సాకారుడవడనే నాస్తిక భావాన్ని 5. ఆఖరుగా స్వప్రయత్నాన్ని విడిచి పెట్టి పరమాత్ముడిపైనే విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు. ఈ విధంగా అన్నమయ్య ఏకాదశ భక్తిమార్గాల ద్వారా భగవంతుడిని సేవించాడు. అప్పటికే ఉన్న భక్తిమార్గాలకు మరికొన్నిటిని జోడించాడు. "లోకోభిన్నరుచిః" అన్నట్టుగా ఎవరి భక్తి స్థాయికి తగిన మార్గాన్ని వారెన్నుకొని సాధన కొనసాగించడానికి కావలసిన మార్గాన్ని వందల ఏళ్ళ పూర్వమే మనకు అందించాడు అన్నమయ్య.

## ఉపయుక్తగ్రంథసూచి


1. అన్నమయ్య, తాళ్ళపాక. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం* 1. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
2. అన్నమయ్య, తాళ్ళపాక. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం* 2. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
3. అన్నమయ్య, తాళ్ళపాక. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం 3.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
4. అన్నమయ్య, తాళ్ళపాక. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం 4.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
5. ఆనందమూర్తి, వేటూరి. 1976. *తాళ్లపాక కవుల పదకవితలు భాషా ప్రయోగ విశేషాలు.* హైదరాబాద్: శ్రీనివాస్.


6. కులశేఖరుడు. 1993. *ముకుందమాల*. వ్యాఖ్యాత: టి.లక్ష్మణాచార్యులు. తిరుపతి :తిరుమల తిరుపతి దేవస్థానములు.
7. కృష్ణపరమాత్మ. 1990. *భగవద్గీత*. వ్యాఖ్యానం: మల్లాది లక్ష్మీనరసింహ శాస్త్రి. రాజమండ్రి: గొల్లపూడి వీరాస్వామి సన్.
8. యామునాచార్య. 2001. *స్తోత్రరత్న*. వ్యాఖ్యానం: ఎమ్.ఎస్.రాజాజీ. తిరుపతి :తిరుమల తిరుపతి దేవస్థానములు.
9. రూపగోస్వామి. 1985. *శ్రీ శ్రీ భక్తి రసామృత సింధువు*. అనువాదం: జన్నాభట్ల వాసుదేవశాస్త్రి. కొవ్వూరు: శ్రీ రామానంద గౌడీయ మఠము.
10. వేంకటేశ్వర శాస్త్రి, జంధ్యాల. 1985. *నారద భక్తి దర్శనం*. తాడేపల్లిగూడెం.
11. శంకరాచార్య. 2017. *వివేకచూడామణి*. అనువాదం: బులుసు ఉదయభాస్కరమ్. గోరఖ్ పూర్: గీతాప్రెస్.
12. స్వామి వివేకానంద. 2015. *భక్తి యోగం*. అనువాదం: స్వామి చిరంతనానంద. హైదరాబాద్: రామకృష్ణ మఠం.

## Web links

1. http://www.andhrabharati.com/kIrtanalu/annamayya/index.php
2. http://www.andhrabharati.com/dictionary/index.php
3. http://www.telugubhagavatam.org

*****

# సదస్సులలో సమర్పించిన పరిశోధన పత్రాల వివరాలు



# SIR C R REDDY COLLEGE

**(AIDED & AUTONOMOUS), ELURU, W.G. DIST. A.P. INDIA**

AFFILIATED TO ADIKAVI NANNAYA UNIVERSITY, RAJAMAHENDRAVARAM, THRICE ACCREDITED AT 'A' LEVEL BY NAAC

ज्ञान - विज्ञानं विमुक्तये

## INTERNATIONAL CONFERENCE అంతర్జాతీయ సదస్సు

*Sponsored by UGC (with Autonomy Grants)*

**Organised by Telugu & Oriental Languages (Sanskrit & Hindi)**

**In Association with Department of Language & Culture, Govt. of A.P.**

## సాహిత్యం-సంస్కరణ దృక్పథం

## साहित्यस्य संस्करणदृक्पथः साहित्य-सुधारवादी दृष्टिकोण

# Certificate

This is to certify that ~~Dr. / Prof. / Mr.~~ / Ms. హారిత భట్లపెనుమర్తి

~~Professor / Assoc. Prof. / Asst. Prof.~~ / Research Scholar / ~~Student~~ of

University / ~~College~~ of Hyderabad has participated

/ Presented a paper entitled అన్నమయ్య సంస్కరణ దృక్పథం

అన్నమయ్య సంస్కరణ దృక్పథం

He / ~~She also chaired a session~~ / delivered invited talk on 14th & 15th December 2018.

| | | |
|---|---|---|
| Dr. Konda Ravi | Dr. K.V.S.P.B. Acharya | Dr. K.A. Rama Raju |
| CONVENER | ORGANISING SECRETARY | CHAIRMAN & PRINCIPAL |

# TeLF

# Certificate

This is to certify that ~~Prof.~~/~~Dr.~~/~~Mr.~~/Ms. HARITHA B,

Department/Institute/Organization ______ has

Participated / presented / Chaired a session / paper on Annamaya kiirthanallo dhvani Viseshalu

At the 10th National Conference of Telugu Linguists Forum (TeLF) on 28-29 January 2019, organised by the Centre of Advanced Studies in Linguistics (CAS), UCA & SS, Osmania University in Collabration with CESC Telugu, CIIL Mysuru and TeLF, Hyderabad.

| | | | |
|---|---|---|---|
| Coordinator | Secretary | For Director | Convener |
| Mr. K. Susheel Kumar | TeLF, Hyderabad | CIIL, Mysuru | Prof. Mohammad Ansari |

# ఉపయుక్తగ్రంథసూచి

# ఉపయుక్తగ్రంథసూచి

## 1. ప్రధాన ఆధార గ్రంథాలు


1. అణ్ణఙ్గరాచార్యులు. 1948. *పాదుకా సహస్రము.* మూలం: వేదాంత దేశికులు. మద్రాసు:సద్గ్రంథ ప్రకాశన సభ.
2. ఆనందమూర్తి, వేటూరి. 1976. *తాళ్లపాక కవుల పదకవితలు భాషా ప్రయోగ విశేషాలు.* హైదరాబాద్: ప్రభాకర ప్రచురణము.
3. --------. 1986. *వైష్ణవాంధ్ర వాఙ్మయం.* హైదరాబాదు: ప్రభాకర ప్రచురణము.
4. ఉదయభాస్కరమ్, బులుసు. 2017. *వివేకచూడామణి.* మూలం: శంకరాచార్యులు. గోరఖ్ పూర్: గీతాప్రెస్.
5. కామేశ్వరరావు, పి. 2004. *వేమన శతకం.* Timeless poems of Vemana. మూలం: వేమన. హైదరాబాదు: పీకాక్ క్లాసిక్స్.
6. కులశేఖరరావు, ఎం. 2000. *దాశరథి శతకము.* మూలం: కంచెర్ల గోపన్న. హైదరాబాదు: శ్రీ పావన సేవా సమితి.
7. కృష్ణమూర్తిశాస్త్రి, నారాయణభట్ల. 1974. *శ్రీమద్భాగవతమ్.* మూలం: వేదవ్యాసుడు. హైదరాబాదు: భాగవత విజ్ఞాన సమితి.
8. కొండమాచార్యులు, ముదివర్తి. 1993. *ముకుందమాల.* మూలం: కులశేఖరాళ్వారు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
9. కొండమాచార్యులు, ముదివర్తి. 2017. *శ్రీమహాభాగవతము సంపుటాలు 1-2.* మూలం: పోతన. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
10. గోపీచంద్. 1943. *దేవుని జీవితం.* తెనాలి:స్వీయ ప్రచురణ.
11. --------. 1983. *అసమర్థుని జీవయాత్ర.* విజయవాడ: డీలక్స్ పబ్లికేషన్స్.

12. ---------. 2009. *పోష్టుచెయ్యని ఉత్తరాలు*. విజయవాడ: అలకనంద ప్రచురణలు.

13.గోపీచంద్, త్రిపురనేని. 2009. *పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా*. విజయవాడ: అలకనంద ప్రచురణలు.

14.గోయందకా, హరికృష్ణదాస్ జీ. 2017. *ఈశావాస్యోపనిషత్తు*. గోరఖ్ పూర్: గీతాప్రెస్.

15.చలం. 1992. *టాగోర్ గీతాంజలి*. మూలం: రవీంద్రనాథ్ టాగోర్. విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్.

16.---------. 1996. *చలంగారి ఉత్తరాలు వీరేశలింగంగారికి*. భీమ్లీ: చలం ప్రచురణలు.

17.చిరంతనానందస్వామి. 2005. *శ్రీ వివేకానంద జీవిత చరిత్ర*. మద్రాసు: శ్రీరామకృష్ణ మఠం.

18.జయప్రకాష్, ఎస్., వీరరాఘవన్, ఎల్. 2004. *శ్రీ దయా శతకం*. మూలం: వేదాంత దేశికులు. మధురై: శ్రీ దివ్య పబ్లికేషన్స్.

19.తిక్కన. 1989. *ఆంధ్రమహాభారతము తృతీయ సంపుటము*. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.

20.నరసయ్య, సంగనభట్ల. 2014. *చతుశ్శృతి*. హైదరాబాద్: నవోదయా బుక్ హౌజ్.

21.నరసింహాచార్య, ఎమ్. 1997. *యామునాచార్యులు*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

22.నరసింహాచార్యులు, కె. టి. యల్. 2009. *దివ్యప్రబంధత్రయి*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

23.నాగేశ్వరశర్మ, ఇంద్రగంటి. 1994. *పెరుమాళ్ తిరుమొళి*. మూలం: కులశేఖరాళ్వారు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

24. నారాయణాచార్యులు, పుట్టపర్తి. 1957. *బుద్ధ భగవానుడు*. మూలం: డి.డి. కోశాంబి. కడప: విద్యోదయా పబ్లికేషన్స్.
25. నిత్యానందరావు, వెలుదండ. 2013. *విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన*. హైదరాబాదు: శ్రీమతి వి.గీతారాణి పబ్లికేషన్స్.
26. పరమేశ్వరయ్య, యడవల్లి. 2008. *పోతన – అన్నమయ్య సాహిత్య దృక్పథాలు*. తిరుపతి.
27. ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008. *అన్నమాచార్య చరిత్ర పీఠిక*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
28. భాస్కరుడు, హుళక్కి మరియు ఇతరులు. 2015. *భాస్కర రామాయణము*. విశాఖపట్నం: జ్యోతి బుక్ డిపో.
29. మునిరత్నం, జె. 1992. *అన్నమయ్య ఆళ్వారులు – తులనాత్మక పరిశీలన ప్రథమ భాగము*. తిరుపతి: కల్పన పబ్లికేషన్స్.
30. –––. 1996. *అన్నమయ్య ఆళ్వారులు – తులనాత్మక పరిశీలన ద్వితీయ భాగము*. తిరుపతి: కల్పన పబ్లికేషన్స్.
31. రఘునాథాచార్య, ఎస్. బి. 2012. *సకలదేవతా పూజావిధానం*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
32. రఘునాథాచార్యులు, న. చ. 1992. *శ్రీ మాలికా స్తుతి*. మూలం: తొండరడిప్పొడి ఆళ్వారు. వరంగల్: సత్సంప్రదాయ పరిరక్షణ సభ.
33. రాఘవన్, టి. కె. వి. 2017. *తిరుప్పావై మేలుకొలుపులు*. మూలం: గోదాదేవి తదితరులు. గోరఖ్ పూర్: గీతాప్రెస్.
34. రాఘవయ్య, తిరువాయిపాటి. 2016. *శ్రీ రామానుజ దివ్య వైభవం*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

35.రామచంద్రశర్మ, జోస్యుల. 2017. *నవవిధ భక్తి రీతులు*. మూలం: గోయంద్కా, జయదయాల్. గోరఖ్ పూర్: గీతాప్రెస్.

36.రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు సంపుటాలు 1-4*. మూలం: అన్నమయ్య. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

37.రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 1998. *శృంగార సంకీర్తనలు సంపుటాలు 5-6*. మూలం: అన్నమయ్య. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

38.రామసుబ్బశర్మ, గౌరిపెద్ది. 2001. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము*. మూలం: తిరువేంగళనాథుడు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

39.రామానుజ భట్టర్, కె. 2016. *గద్యత్రయప్రబంధము (ఆంధ్రీకరణము)*. మూలం: రామానుజాచార్యులు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

40.రామానుజాచార్యులు, మాడభూషి. 1950. *తిరువాయి మొళి*. మూలం: నమ్మాళ్వారు. తిరుపతి: సి.అన్నారావు.

41.రెడ్డి శ్యామల, యద్దనపూడి. 1998. *అన్నమాచార్యుల పదకవితలు: మధుర భక్తి*. హైదరాబాదు: భార్గవ పబ్లికేషన్స్.

42.రంగనాథాచార్యులు, కె. కె. 1981. *తెలుగు సాహిత్యం – మరో చూపు*. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

43.లక్ష్మణయ్య, సముద్రాల. 2016. *శ్రీ భగవద్రామానుజులు*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

44.లక్ష్మణయ్య, సముద్రాల. 2017. *శ్రీమహాభాగవతము సంపుటాలు 3-7*. మూలం: పోతన. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

45.లక్ష్మణాచార్యులు, టి. 1993. *ముకుందమాల*. మూలం: కులశేఖరాళ్వారు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

46.లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. 2008. *మొల్ల రామాయణము*. మూలం: మొల్ల. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

47.లక్ష్మీనారాయణ, ఉమ్మెత్తల. 1989. *గోపీచంద్ కథానికలు, వ్యాసాలు*. వనపర్తి: సాహిత్యవేదిక.

48.లక్ష్మీ నరసింహశాస్త్రి, మల్లాది. 1990. *శ్రీభగవద్గీత*. మూలం: వేదవ్యాసుడు. రాజమండ్రి: గొల్లపూడి వీరాస్వామి సన్.

49.వరదాచార్యులు, ధనకుధరం. 1972. *శ్రీ రామానుజ కీర్తి కౌముది మొదటి భాగము*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

50.---------. 1981. *శ్రీ రామానుజ కీర్తి కౌముది రెండవ భాగము*. గుంటూరు: శ్రీ రామనుజ కీర్తి కౌముదీ గ్రంథమాల.

51.---------. 1982. *శ్రీ రామానుజ కీర్తి కౌముది మూడవ భాగము*. గుంటూరు: శ్రీ రామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల.

52.---------. 1984. *శ్రీ రామానుజ కీర్తి కౌముది ఐదవ భాగము*. గుంటూరు: శ్రీ రామానుజ కీర్తి కౌముదీ గ్రంథమాల.

53.వాణి, కేసర్ల. 1997. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర*. మూలం: తిరువేంగళనాథుడు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

54.వాసుదేవశాస్త్రి, జన్నాభట్ల. 1985. *శ్రీ శ్రీ భక్తి రసామృత సింధువు*. మూలం: రూపగోస్వామి, వ్యాఖ్య: త్రిదండిస్వామి. కొవ్వూరు: శ్రీ రామానంద గౌడీయ మఠము.

55.వీరరాఘవ. 1976. *శ్రీమద్భాగవతమ్ సప్తమ-అష్టమ-నవమ స్కంధత్రయమ్*. మూలం: వేదవ్యాసుడు. చిత్తూర్: శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి.

56.వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పెండ్యాల. 1928. *పరమయోగివిలాసము*. మూలం: తిరువేంగళనాథుడు. కాకినాడ: రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు.

57.వేంకటేశ్వర శాస్త్రి, జంధ్యాల. 1985. *నారద భక్తి దర్శనం*. మూలం: నారదమహర్షి. తాడేపల్లిగూడెం: స్వీయ ప్రచురణ.

58.వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2010. *పారమార్థిక పదకోశం*. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

59.వేదవ్యాస. 2001. *రామానుజ వైభవం*. గుంటూరు: ఆధ్యాత్మిక ప్రచురణలు.

60.శ్రీనివాసులు, కామిశెట్టి. 2000. *శ్రీ వేంకటేశ్వర శతకం*. మూలం: అన్నమయ్య. హైదరాబాదు: అన్నమాచార్య మిషన్.

61.శ్రీరామచంద్రుడు, పుల్లెల మరియు ఇతరులు. 2011. *ఉపనిషత్ సుధాలహరి*. హైదరాబాదు: యువభారతి.

62.శ్రీరంగాచారి, అంగలూరు. 1995. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు – మధుర భక్తి*. హైద్రాబాద్.

63.సుబ్బారావు, త్రిపురనేని. 1979. *గోపీచంద్ సాహిత్యం*. సికిందరాబాద్:యువభారతి.

64.సుబ్బారావు, వావిలాల. 2011[1]. *చలం ఆత్మకథ*. మూలం: చలం. హైదరాబాద్: ప్రియదర్శిని ప్రచురణలు.

65. సుబ్బారావు, వావిలాల. 2011[2]. *భగవాన్ స్మృతులు*. మూలం: చలం. హైదరాబాద్: ప్రియదర్శిని ప్రచురణలు.

66.సుబ్రహ్మణ్యం, జి.వి. 2012. *సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు*. హైదరాబాదు: తెలుగు అకాడమి.

67.సుబ్రహ్మణ్యశర్మ, పురాణం. 1983. *అరుణాచలంలో చలం*. విజయవాడ: న్యూస్టూడెంట్ బుక్ సెంటర్.

68.సోమసుందరరావు, కొడాలి. 2004. *తెలుగు సాహిత్యంలో భక్తి తత్త్వం*. గుడివాడ.

69.స్వామి జ్ఞానదానంద. 2016[1]. *కేనోపనిషత్తు*. హైదరాబాదు: రామకృష్ణ మఠం.

70.స్వామి జ్ఞానదానంద. 2016[2]. *తైత్తిరీయోపనిషత్తు*. హైదరాబాదు: రామకృష్ణ మఠం.

71.స్వామి జ్ఞానదానంద. 2016[3]. *ముండకోపనిషత్తు*. హైదరాబాదు: రామకృష్ణ మఠం.

72.స్వామి త్యాగీశానంద. 2018. *శ్వేతాశ్వతరోపనిషత్తు*. హైదరాబాదు: రామకృష్ణ మఠం.

73.స్వామి చిరంతనానంద. 2015. *భక్తి యోగం*. మూలం: స్వామి వివేకానంద. హైదరాబాద్: రామకృష్ణ మఠం.

74.స్వామి హర్షానంద. 2014. *నారద భక్తి దర్శనం*. మూలం: నారదమహర్షి. హైదరాబాదు: రామకృష్ణ మఠం.

**2. పరిశోధన గ్రంథాలు**

75.విజయవల్లి, వి.1989. *అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలలో ఆత్మనివేదన*. డా. పి.లీలావతమ్మ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాదు: తెలుగువిశ్వవిద్యాలయం.

76.శ్రీవిద్య, పి. 2008. *ఆంధ్ర మహాభాగవతం – నవవిధ భక్తి మార్గానుయాయులు*. డా.జి.ఎస్.భాస్కరరావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాదు: తెలుగువిశ్వవిద్యాలయం.

**3. ఇతర ముద్రిత గ్రంథాలు**

77.ఆనందమూర్తి, వేటూరి. 1974. *తాళ్ళపాక కవుల కృతులు వివిధ సాహితీ ప్రక్రియలు*. హైదరాబాదు: ప్రభాకర ప్రచురణము.

78.రామానుజయ్య, బుక్కపట్టణము. 1939. *శ్రీకృష్ణ కర్ణామృతము*. మూలం: లీలాశుకుడు. ఏలూరు: రామా అండ్ కో.

79.అరుణకుమారి, జి. 2007. *వ్యాస మధూలిక*. హైదరాబాదు: నవోదయా బుక్ హౌస్.

80.ఆరుద్ర. 2007. *సమగ్ర ఆంధ్ర సాహిత్యం(మొదటి సంపుటి).* హైదరాబాదు: తెలుగు అకాడమి.

81.కరుణశ్రీ. 1983. *భాగవత వైజయంతిక*. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

82.కళావతి, వి. 1988. *తెలుగులో వైష్ణవక్షేత్ర మహాత్మ్య కావ్యముల అనుశీలనము*. తిరుపతి: శ్యామలా పబ్లిషర్స్.

83.బాలగోపాల్, కె. 2012. *ప్రాచీన భారతదేశ చరిత్ర డి.డి.కోశాంబి పరిచయం*. మూలం: డి.డి. కోశాంబి. హైదరాబాదు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

84.గంగప్ప, ఎస్. 1995. *అన్నమాచార్య సంకీర్తన సుధ*. గుంటూరు: శశీ ప్రచురణలు.

85.జయప్రకాశ్, శ్రీపాద. 2012. *ఆళ్వారుల పాశురాల్లో శ్రీవేంకటేశ్వర వైభవం*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

86.నరసింహాచార్య, ఎమ్. 1997. *యామునాచార్యులు*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

87.నరసింహాచార్య, కిడాంబి. 2012. *తిరునామములు*. హైదరాబాదు: తెలుగు అకాడమి.

88.నరసింహాచార్యులు, కె.టి.యల్. 2014. *నాచియార్ తిరుమొళి*. మూలం: గోదాదేవి. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

89.నలచక్రవర్తి, కానాల. 2001. *అన్నమాచార్యులు – శ్రీరామావతార సంకీర్తనలు*. తిరుపతి: శ్రీ వేంకటాంబ పబ్లికేషన్స్.

90.రాధాకృష్ణశర్మ, చల్లా. 1976. *తమిళ సాహిత్య చరిత్ర*. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

91. రాములు, పిల్లలమర్రి. 2012. *తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ.* హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.

92. వసుమతీదేవి, శేషభట్టర్. 2002. *అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావము.* హనుమకొండ: వసుమతీ పబ్లికేషన్స్.

93. శేషాచార్యులు, వి.టి. 1997. *దేవాలయములు–తత్త్వవేత్తలు.* తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి.

94. శ్రీహరి, మల్లేల. 1985. *తాళ్లపాక అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనలు – ఒక పరిశీలన.* మదనపల్లె: సౌమ్యశ్రీ ప్రచురణలు.


## 4. నిఘంటువులు

95. ఆంధ్రభారతి తెలుగు నిఘంటువు – అంతర్జాల నిఘంటువు.

96. శ్రీహరి, రవ్వా. 2015. *అన్నమయ్య పదకోశం.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

97. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2014. *శబ్దరత్నాకరము.* విజయవాడ: నవరత్న బుక్ హౌస్.


## 5. అంతర్జాల వనరులు

98. http://www.andhrabharati.com/kIrtanalu/annamayya/index.php
99. http://www.andhrabharati.com/dictionary/index.php
100. http://www.telugubhagavatam.org
101. http://ebooks.tirumala.org/
102. https://archive.org/details/digitallibraryindia
103. http://content.inflibnet.ac.in/
104. https://paulbrunton.org/notebooks/1/2
105. http://www.bbc.com/
106. https://belurmath.org/swami-vivekananda-speeches-at-the-parliament-of-religions-chicago-1893/
107. http://www.ramakrishnavivekananda.info
108. http://4000divyaprabandam.blogspot.com/

109. https://prabhupadabooks.com/sb
110. https://alwarulu.wordpress.com
111. https://sanskritdocuments.org/
112. http://www.ibiblio.org/sripedia/
113. https://te.wikipedia.org/wiki
114. https://en.wikipedia.org/wiki/
115. http://www.patheos.com/library/jainism
116. http://www.patheos.com/library/buddhism
117. http://www.hinduwebsite.com/jainism/antecedents.asp
118. http://www.ancient.eu/buddhism/
119. http://ignca.nic.in/vedic_portal_rigveda.htm
120. http://ramanuja.wikifoundry.com/
121. http://www.sacred-texts.com/hin/sv.htm
122. https://www.freegurukul.org

**6. ఆంగ్ల గ్రంథాలు**

123. Bhandarkar, R.G. 1913. *Vaisnavism, Saivism and minor religious systems.* Strassburg : Karl J. Trübner.
124. Eliot, Charles. 1957. *Hinduism and Buddhism*. London: Routledge & Kegan Paul Ltd.
125. Goyal.S.R. 1984. *A Religious History of Ancient India (upto c.1200 A.D.)*. Meerut: Kusumanjali Prakashan.
126. Jagadeesan, N. 1989. *Collected papers on Tamil Vaishnavism.* Madhurai: Ennes Publications.
127. Krishnaswami, Aiyangar. 1920. *Early History of Vaishnavism in South India.* The Oxford University Press: Madras.
128. Monier Williams. 1883. *Religious Thought and Life in India – Vedism, Brahmanism and Hinduism.* London: Oxford.
129. Nilakanta Sastri, K.A.. 1961. *A History of South India: from prehistoric times to the Fall of Vijayanagar*. Madras: Oxford University Press.
130. Paul Brunton. 1952. *The spiritual crisis of man*. London: Rider and Company.
131. Premananda Kumar. 1994. *Tirumazhisai Alwar*. Tirupati: Tirumala Tirupati Devasthanams.

132. Rajajee, M. S. 2001. *Sri Yamunacharya's Stotra Ratna*. Source: Yamunacharya. Tirupati: Tirumala Tirupati Devasthanams Press.
133. Ramanujachari, R. 2012. *Hymns of the Alvars in praise of Lord Srinivasa*. Tirupati : Tirumala Tirupati Devasthanams.
134. Ramaswami Ayyangar, M.S. and B Seshagiri Rao. 1922. *Studies in South Indian Jainism.* Madras: Premier Press.
135. Ramaswami Ayyangar, D. 1974. *Saranagati Deepika of Vedanta Desika*. Source: Vedanta Desika. Madras: Own Publication.
136. Ranga, Komanduri. 2000. *The splendor of Sri Nava Narasimha of Ahobila Kshetram*. Tirupati: Tirumala Tirupati Devasthanams.
137. Rapson, E.J. 1916. *Ancient India: From the earliest times to the first century A.D.* London: Cambridge University Press.
138. Sadarangani, Neeti M. 2004. *Bhakti Poetry in Medieval India: Its Inception, Cultural Encounter and Impact.* New Delhi: Sarup & Sons.
139. Swami Nityaswarupananda. 1940. *Ashtavakra Samhita*. Almora:Advaita Ashrama.
140. Patterson, David. 1983. *Confession*. Origin: Leo Tolstoy. New York: W W Norton & Company.
141. Tridandi Sri Bhakti Prajnan Yati. 1982. *Twelve Essential Upanishads*. Madras: Sri Gaudiya Math.
142. Umakantham, C. 2001. *Greatness of Saranagati in Sri Vaishnavism*. Tirupati: Omkumar Publications.
143. Vasantha, R. 2001. *Ahobilam Sri Narasimha Swamy Temple*. Tirupati: Tirumala Tirupati Devasthanams.
144. Vedanta Desika. 1973. *Stotras of Sri Vedanta Desika*. Bombay: Sri Vedanta Desika Sampradaya Sabha.
145. Swami Vivekananda. 2005. *I am a voice without a form*. Hyderabad: Ramakrishna Math.

Research Thesis

146. Lakshmi, A, 1994. *Bhakti movement and temple development in tamil country from 6th century A D to 10th century A D*, Dr.Shalini Koppikar. University of Madras.